# పరదేశీ కథలు – I

కథలు

– లలిత చిట్టే



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 220

కౌముది మాసపత్రికలో

జనవరి 2015 సంచిక నుంచి జనవరి 2017 సంచిక వరకూ

వచ్చిన కథలు

# (ప్రారంభం)

**కువైటు దేశం.**

ఎడారి దేశమైనా, ఎండలు మండే దేశమైనా అది ప్రపంచంలోని అత్యధిక సంపన్న దేశాల్లో ఒకటి. జనాభాలో, వైశాల్యంలో ఈ కువైటు దేశం అతి చిన్న దేశం అయినాకూడా తన కరెన్సీ అయిన "కువైటు దినారుకు" ప్రపంచంలోని అన్ని దేశాల కరెన్సీ మార్కెట్‌లో అత్యధిక విలువను కలిగివున్న దేశం. ఈ దినారు విలువను చూసి కువైటు వాళ్ళు చాలా అతిశయపడతారు.

బ్రిటిష్ పౌండు, అమెరికా డాలరు, యూరోలాంటి కరెన్సీలు కూడా ఈ కువైటు దినారు తరువాతే.

ఒక్క కువైటు దినారును కొనాలంటే 220 రూపాయలు బదులుగా ఇవ్వాలి అని తెలుసుకున్నపుడు మొదట ఆశ్చర్యం కలుగుతుంది. ఆ.. తరువాత అర్థం అవుతుంది ఈ కువైటు దినారు యొక్క "ఒక్కనోటు" ఎంత విలువైనదో. అది ఎంత గొప్పదో.

అరేబియా మహా సముద్రపు తీరాన వెలసిన ఏడు గల్ఫ్ దేశాల్లో కువైట్ కూడా ఒకటి. 19వ శతాబ్దంలో కువైటును ఆక్రమించుకుని పాలిస్తున్న బ్రిటిష్ వాళ్ళు ఈ ఎడారి భూముల్లో అంతులేని పెట్రోలు నిల్వలను కనుగొనడంలో ఒక్కసారిగా వీళ్ళ దశ తిరిగిపోయింది.

పెట్రోలు వలన లభించిన సంపదతో, ప్రక్కన ఉన్న గల్ఫ్ దేశాల్లోనే కాక ప్రపంచంలోని ధనిక దేశాలన్నింటి సరసన నిలబడే స్థితికి వీళ్ళు చేరుకున్నారు. ఇక్కడ పెట్రోలు చాలా చవకగా లభిస్తుంది. ఎంత చవక అంటే, ఒక లీటరు నీళ్ళ బాటిల్ మన ఇండియా కరెన్సీలో ముప్పై రూపాయలైతే, ఒక లీటరు పెట్రోలు 15 రూపాయలు మాత్రమే. ఈ విధంగా ఈ అరబ్బులు పెట్రోలుతో అదృష్టవంతులు అయ్యారు. పెట్రోలును ఇతర దేశాలకు ఎగుమతి చేసి వచ్చే ఆదాయంతో ప్రజలకు సర్వ సౌకర్యాలను ఈ కువైటు రాజు కల్పిస్తున్నాడు.

అందుకే, కువైటు దేశంలోని ఐశ్వర్యం చూసి డబ్బు సంపాదన కోసం, కుటుంబాల్ని పోషించుకోవడం కోసం మన భారత దేశం నుండే కాక ప్రపంచంలోని పేద దేశాల ప్రజలు ఈ కువైటుకు పనులు కోసం వస్తారు. చాలామంది డబ్బు సంపాదించి సంతృప్తి చెంది తిరిగి తమ స్వదేశాలకు వెళ్ళేవాళ్ళుగా ఉన్నారు. కానీ కొద్ది మంది మాత్రం ఈ ఎడారిలో ఘోరమైన కష్టాల పాలై నరకాన్ని అనుభవించి బ్రతుకు జీవుడా అని ప్రాణాలు చేతబట్టుకుని తమ దేశానికి మరలిపోతారు.

దూరపు కొండలు నునుపు. విదేశాలకు వెళ్ళి డబ్బు బాగా సంపాదించాలనే వ్యామోహం మనిషిని సుదూర తీరాలకు నడిపిస్తుంది. కొందరు వెళ్ళడమే గానీ తిరిగి రావడం అరుదుగా కానీ జరగదు. జీవితమంతా స్వదేశానికి, పుట్టిన నేలకు, అయినవారికి దూరంగా గడిచిపోతుంది. ఒంటరిగా పరాయి దేశంలో పడరాని పాట్లు పడి బాధలు చెప్పుకోవడానికి కూడా దిక్కులేక దిగులుతో క్రుంగిపోయే అభాగ్యులు ఎందరో?

ఎందరి కన్నీళ్ళు ఈ ఎడారి ఇసుకలో ఇంకిపోయాయో? ఎందరి ప్రాణాలు ఆకశానికి ఎగిసి ఈ గాలిలో కలిసిపోయాయో? మరి ఎందరి జీవితాలు త్రిశంకు స్వర్గంలో నిలిచి నరకాన్ని చవిచూసాయో? ఎవరికి తెలుసు? ఎందరికి తెలుసు?

ఇస్లాం మత ఛాందస భావాలనుండి బయటపడి, ప్రపంచం వైపు తేరిచూసి ఇపుడిపుడే నవనాగరికత వైపు అడుగులు వేస్తున్న ఈ కువైటు దేశం.. వంశ పారంపర్యంగా సమర్థులైన వారసులు రాజులుగా నియమింపబడి వారిచే పరిపాలింపబడే రాజరిక దేశం.

అరబ్బులుగా పిలవబడే వీరు 20వ శతాబ్దం వరకు అరేబియా మహా సముద్రపు ఒడ్డున గుడారాలు వేసుకుని గుంపులుగా, తెగలుగా జీవించేవారు. అప్పటిలో సముద్రంలో చేపలు పట్టడం, ముత్యాలు సేకరించడం వీరి వృత్తులుగా ఉండేవి. ఒంటెలపై ఎడారిలో పయనించి ఇండియా, ఇరాక్, ఇరాన్, ఒమాన్ వంటి దేశాలకు వెళ్ళి వీరు ముత్యాలను అమ్మి డబ్బు సంపాదించుకొనేవాళ్ళు.

నాగరికతను, వ్యాపార లావాదేవీలను, విద్యను, వైద్యాన్ని ముఖ్యంగా భారతదేశం నుండీ వీరు గ్రహించి పాటించినట్లు తెలుస్తోంది. తరువాత పడవలు తయారు చేయడం, ఇతర దేశాలకు అమ్మడం ద్వారా వీరు జీవనం కొనసాగించేవాళ్ళు.

19వ శతాబ్దంలో అరేబియా గుర్రాలకు ఉన్న ప్రాముఖ్యతను తెలుసుకుని, గుర్రాల ఎగుమతిని కూడా ప్రారంభించారు. సంవత్సరానికి దాదాపు 8,000 మేలు జాతి గుర్రాలను కువైటు దేశం మన భారతదేశానికి ఎగుమతి చేసేదట.

20వ శతాబ్ధంలో వీరి పంటపండి, చమురుతో సంపన్న దేశంగా ఉద్భవించాక ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ వ్యాపార సంబంధాలను విస్తరింపజేసుకుంది. ఇందులో మన భారతదేశం వహించెడి పాత్ర అపుడూ ఇపుడూ కూడా ఎంతో ప్రాముఖ్యమైనది.

మొదట్లో వీరి కరెన్సీని "రూపాయలు"గానే పిలిచేవారు. తరువాత దినార్లు అని పేరుపెట్టి వీరి విలువైన కరెన్సీని చలామణి చేయసాగారు. పురాతన కాలంలో పేదరాసి పెద్దమ్మ కథల్లో దినార్‌లు వాడేవారని మనం చెప్పుకున్నట్లు బహుశా వీరు కూడా దినార్లు అనే మన పాతకాలం నాటి పేరునే వీరి డబ్బుకు పేరు పెట్టుకుని వాడుకలోకి తెచ్చి ఉండవచ్చు.

ఒకే సమాఖ్యగా ఏర్పడిన ఏడు గల్ఫ్ దేశాల్లో కువైటు, బహరైన్‌లలో కరెన్సీని "దినార్లు"గా దుబాయ్‌లో "దర్హమ్స్"గా కతార్, ఒమాన్, సౌదీ అరేబియా యెమన్‌లలో "రియాల్స్"గా వీరి కరెన్సీని పిలుస్తారు.

1937లో చమురు నిల్వలతోటి వాణిజ్యముతో ఒక్కసారిగా వచ్చిపడిన డబ్బును ఏమి చేసుకోవాలో వీరికి అర్థం కాలేదు. సముద్రం ఒడ్డున గుడారాలు వేసుకుని నివశిస్తూ చేపలు పట్టుకుని జీవనం కొనసాగించే వీరు, అపుడు ప్రపంచం పైకి దృష్టి సారించారు. మంచి ఇళ్ళు కట్టించుకున్నారు. రోడ్లు, భవనాలు నిర్మించుకుని పట్టణానికి రూపు రేఖలు ఏర్పరిచారు.

ప్రతిమనిషికి ఒక కారును కొన్నారు. కానీ డ్రైవింగ్ వీరికి తెలియదు, రాదు కనుక నేర్చుకోవాలని ఆసక్తిగల కొందరు కువైటీస్, బొంబాయికి వచ్చి కారు డ్రైవింగ్ నేర్చుకుని తిరిగి వెళ్ళేవారట. నేర్చుకోలేనివారు పేద దేశాలనుండి డ్రైవర్లని నెల జీతంపై పిలిపించుకుని కారు నడపటానికి నియమించుకున్నారట.

అలాగే పెద్ద చదువులకు కాలేజీలు, యూనివర్శిటీలు అప్పట్లో లేనందువల్ల ఇండియా, ఈజిప్టులాంటి పెద్ద దేశాలకు వెళ్ళి ఉన్నత విద్యను ఆర్జించేవారట. పూనా, బొంబాయి లాంటి మనదేశంలోని పెద్ద నగరాలకు చదువులకోసం వచ్చి కొన్ని సంవత్సరాలు అక్కడే ఉండి డిగ్రీలు చదివి, పట్టాలు పుచ్చుకుని తిరిగి వెళ్ళేవారట. ఆ సమయంలో చదువుకునే కాలేజీలో అమ్మాయిలతో ప్రేమలో పడి మనదేశపు అమ్మాయిలను కూడా సాంప్రదాయం ప్రకారం వివాహం చేసుకునేవారట.

ఇప్పుడయితే వీరు చదువులకోసం అమెరికా, బ్రిటన్, రష్యాలాంటి దేశాలకు వెళ్ళి విదేశీ నాగరికతను ఒంటపట్టించుకుంటున్నారు.

1961లో బ్రిటిష్‌వారి వద్దనుండి వీరు స్వాతంత్ర్యం పొందాక తమ స్వంత రాజును ఏర్పరచుకుని ఒక రాజ్యాంగాన్ని, పరిపాలనా విధానాన్ని తయారు చేసుకున్నారు.

కువైటు దేశంలో విద్య, వైద్యం, ఎలక్ట్రిసిటీ, పిల్లల పోషణకు అయే ఖర్చుల్లాంటివన్నీ ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుంది. దేశంలో నివశించే ప్రజలకు, వలసవచ్చిన పరదేశులకూ ఎలాంటి పన్నులభారమూ లేదు. ఇది పన్నులు లేని సంపన్నదేశం.

ఇలా కష్టపడకుండానే అన్ని సౌకర్యాలు, సంపదా సమకూరడంతో వీరు విలాస జీవితానికి అలవాటుపడ్డారు. వంట చేయటానికి, ఇల్లు శుభ్రం చేయటానికి, పిల్లల్ని పెంచటానికి, కార్లు డ్రైవ్ చేయటానికి పనిమనుష్యులను, డ్రైవర్లను వీళ్ళు ఇతరదేశాలనుండి రప్పించుకుని మంచి జీతాలు ఇచ్చి పోషించడం ప్రారంభించారు.

మూడుపూటలూ కడుపు నింపుకోవడానికి, కుటుంబాల్ని పోషించుకోవడానికి పేదదేశాల ప్రజలు ఎందరో కువైటు వచ్చి, పనిమనుషులుగా ఇళ్ళలో పనులకు చేరి, ఎంతో భయంతో, భక్తితో, విశ్వాసంతో పనులు చేసి డబ్బు సంపాదించుకుంటున్నారు.

కుల, మత, రంగు, భాషా బేధాలు లేక ప్రపంచంలోని అన్ని దేశాల నుండి ఇక్కడికి వలస వచ్చి ఏళ్ళ తరబడి పనులు చేసుకుంటూ కుటుంబాలతో స్థిరపడిన వారు కూడా చాలామంది ఉన్నారు.

ఈ అన్యదేశంలో స్నేహభావాల్ని పెంచుకుని, ప్రేమను పంచుకుని బంధాలు ఏర్పరచుకుని కలిసిమెలిసి జీవించే పరదేశుల్ని ఇక్కడ చూస్తే చాలా ఆనందం కలుగుతుంది.

ముఖ్యంగా ఇండియా, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్థాన్, నేపాల్, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, ఈజిప్టు, ఇథియోపియా దేశాల నుండి ప్రజలు వచ్చి కువైటు వారి ఇళ్ళలోనూ బయట కంపెనీల్లోనూ పనులు చేసి జీవనం కొనసాగిస్తున్నారు.

ప్రతి ఒక్కరి ఆశయం, ఆశా ఒక్కటే. డబ్బు సంపాదించాలి. కుటుంబాన్ని ఆదుకోవాలి. బిడ్డల్ని ఉన్నతమైన చదువులు చదివించి, వారికి ఉజ్వలమైన భవిష్యత్తును అందించాలి. అందరూ ఇదే ఉద్దేశాన్ని తలనెత్తుకుని తనవారిని, విడిచి, స్వదేశానికి వీడ్కోలు చెప్పి ఈ ఎడారి దేశంలో అడుగుపెడతారు. ఇక్కడికి రావడానికి, వీసా కొనడానికి డబ్బు వెచ్చించి ప్రయాసలు పడతారు. అయితే ఈ పరదేశంలో ఎదురయ్యే ఆటుపోట్లు, కష్టనష్టాలు, శక్తికి మించిన పోరాటాలు ఒంటరిగా ఎదుర్కోవడం అంత సులభం కాదు.

ముఖ్యంగా ఇళ్ళలో పనిచేసేందుకు వచ్చే వర్కర్స్‌కు ఎదురయ్యే ఇబ్బందులు చాలా ఉన్నాయి. స్వంత దేశంలో వీసా తెప్పించి ఇచ్చే ఏజెంట్ల దగ్గర నుండి, కువైటులో పని చూపించే ఏజెంట్ల వరకు ఎన్నో మోసాలకు, కష్టాలకు, బాధలకు వీరిని గురిచేస్తున్నారు. ఇక్కడికి వచ్చిన తరువాత వీరి అదృష్టం బాగుండి మంచి ఇల్లు దొరికి, మంచి మనసున్న యజమానులైతే ఫరవాలేదు. తిండి పెట్టి, బట్టలు ఇచ్చి, నెలజీతం ఖచ్చితంగా ఇచ్చి దయగా చూస్తారు. అలా కాకపోతే ఎన్నో బాధలకు లోను చేసి, కడుపుకు తిండి కూడా పెట్టకుండా, అన్ని పనులూ చేయించుకుని, కొట్టి, తిట్టి జీతం ఇవ్వకుండా వేధించే యజమానులు కూడా ఉన్నారు. ఇలాంటి పనివారి దుస్థితి మాటల్లో చెప్పనలవికాదు. అరబ్బీ భాషలో యజమానిని బాబా (తండ్రి) అని, యజమానురాలిని మామా (అమ్మా) అని పనివారు ఇక్కడ పిలుస్తూ వినయంతో, విశ్వాసంతో, నమ్రతతో ఎంతో జాగ్రత్తగా వారి పనులు చేసేవారిగా ఉన్నారు.

వీసా గడువు ముగిసిన వారు, సరైన పనిలేనివారు, పాస్‌పోర్టులు బాధించే యజమానుల దగ్గర విడిచి, వారి ఇంటినుండి పారిపోయి బయటికి వచ్చి ఎక్కడో ఒకచోట తలదాచుకునేవారు. శ్రమల్లో చిక్కుకుపోయి, పరిగెత్తి ఇండియా ఎంబసీకి చేరి సహాయం అర్థించేవారు, అసహాయస్థితిలో చిక్కుకుని, బయటకు రాలేక ప్రాణాలు కోల్పోయేవారు చాలామంది.

ముఖ్యంగా చదువులేని, బయట ప్రపంచం తెలియని పల్లెటూరి ఆడవారు ఇళ్ళలో పనులకు వచ్చి, భాషరాక పనిచేతకాక, తెలియక, చెప్పుకోవడానికి దిక్కులేక, బయటకు వెళ్ళే మార్గం కనరాక దిగులుతో కృశించిపోయేవారు ఎందరో? ఏళ్ళ తరబడి కువైటువారి ఇళ్ళల్లో బానిసలుగా బందీలై, స్వేచ్ఛలేక, వారికి భయపడి తన వారితో బయటివారితో కమ్యూనికేషను కూడా లేక ఏమి చెయ్యాలో తెలియక సహాయం చేసేవారు లేక, కనిపించక బిక్కుబిక్కుమంటూ, బ్రతికేవారు ఎందరో? ఒక్కసారి ఇక్కడికి వచ్చాక ఈ

ఊబిలో దిగబడ్డాక పైకిరాలేక, ఉండలేక తిరిగి స్వదేశానికి వెళ్ళలేక అలమటించే అభాగ్యులు వేలమంది ఇక్కడ ఉన్నారు. ఈ మధ్య భారత ప్రభుత్వం జోక్యం కలిగించుకుని వీరి సమస్యలపై దృష్టి పెట్టడంతో డొమెస్టిక్ వర్కర్స్ బాధలు కాస్తతగ్గాయని చెప్పొచ్చు..

ఎందరి కన్నీళ్ళు నేలరాలి ఈ ఎడారి ఇసుకలో ఇంకిపోయాయో?

ఎన్నెన్ని బాధలు ఎందరి హృదయాల్ని భారం చేసి, వేదనను మిగిలిచాయో?

ఎందరి నిట్టూర్పులు నాలుగ్గోడల మధ్య నలిగిపోయాయో?

ఎందరి వ్యధలు తనవారిని చేరి వారిని కలవరపెట్టాయో?

ఎన్ని రాత్రిళ్ళు నిద్రలేక ఉలికిపాటుతో జాగారం చేసాయో?

ఎందరి వంటిపై దెబ్బలు, బొబ్బలుగా మారి రక్షించేవారికోసం ఎదురుచూసాయో?

ఎందరి జీవితాలు వంచనకు గురయి, శిధిలమయి ఎడారిలో కూలిపోయాయో?

ఎన్ని వ్యధాభరిత హృదయాలు గోడుగోడున విలపించాయో? మరి ఎందరి ప్రాణాలు గాలిలో కలిసి, నింగికెగసి పోయి స్వదేశం వైపు ఆరాటంగా పయనించాయో? ఎవరికి తెలుసు?

అంతంలేని ఈ ఎడారిలో ఎండమావులు తప్ప, సేదతీర్చే ఒయాసిస్సులు ఉంటాయా? ఉన్నా కనిపిస్తాయా? వీరిదాహాన్ని తీరుస్తాయా?

ఏమో? జవాబు గడిచిపోయే కాలానికే తెలుసు. గమ్యం కనరాని ఈ ఎడారిలో కొవ్వొత్తిగా కరిగి వెలుగును పంచి ఆరిపోయిన కొన్ని జీవితాలకే తెలుసు. ఎంతోమంది జీవితాల్ని, వారి విలువైన కాలాన్ని తనలో కలిపేసుకుని, జ్ఞాపకాల్ని మాత్రం వారి హృదయాల్లో నింపిన ఈ ఎడారి దేశానికే తెలుసు.

ఈ ఎడారి కాసుల వెనుక ఎన్నో కథలు, మరెన్నో వ్యధలు. అవి అనుభవించిన వారికే తెలుసు అందులోని బాధలు.

ప్రతి మనిషి జీవితంలోనూ హృదయాన్ని కదిలించే ఒక కన్నీటి కథ దాగి ఉంది.

ఈ ఎడారి దేశంలోని కథలు, వ్యధలు, బాధలు, పోరాటాలు, కష్టాలు, కన్నీళ్ళు, సుఖాలు, సంతోషాలతో రూపుదిదుకున్న సమాహారమే ఈ 'పరదేశి కథలు'

## కువైటు రాజు - బాబా జాబర్



1977వ సంవత్సరం నుండి, 2006వ సంవత్సరం వరకు దాదాపు 28 సంవత్సరాలు కువైటు దేశాన్ని పరిపాలించిన రాజు "బాబా జాబర్"

కువైటును పరిపాలించిన రాజులలో ఈయన పదమూడవ వాడు. ఈయన పూర్తిపేరు "షేక్ జాబర్ అల్ అహ్మద్ అల్ సబ". ఆయన తండ్రి పేరు షేక్ అహ్మద్ అల్ సబ, తల్లిపేరు బిన్ సలిమ

కువైట్‌లో మరియు గల్ఫ్‌దేశాల్లో రాజును అమీర్ అని అరబ్బీ భాషలో అంటారు. బాబా అనగా తండ్రి అని, షేకులు అంటే సంపన్నులు, నాయకులు అని అర్థం. కువైటులో అల్ సబ వంశస్థులందరూ షేకులే.

వీరందరూ రాజ వంశానికి చెందినవారు. వీరి సంతతే రాజులై వంశపారంపర్యంగా.. అప్పటి నుండి అనగా బ్రిటిష్ వారి కాలం నుండి, ఇప్పటి వరకు కువైటు దేశాన్ని పాలిస్తున్నారు.

కువైటు ప్రజలు ఈ బాబా జాబర్‌ను కన్న తండ్రిలా ప్రేమించారు. ఆయన కూడా పరిపాలించిన 28 సంవత్సరాల కాలంలో తన ప్రజలను, పరదేశుల్ని బిడ్డల్లా ప్రేమించి వారికి కావలిసిన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాడు. ఈయన పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో సంతృప్తిగా జీవించారు.

అందుకే కువైటును పరిపాలించిన ఏ రాజుకూ దక్కని ప్రేమ, గౌరవం, బాబా జాబర్‌కు లభించాయి. కువైటు దేశ చరిత్రలో రాజైన బాబా జాబర్‌కు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈయన దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించి ప్రపంచ దేశాల సరసన కువైటును మేటిగా నిలబెట్టాడు.

మృదుస్వభావిగాను, స్నేహశీలిగాను, ప్రేమైక హృదయం కలవానిగాను పేరుపొందాడు. అన్నింటి కంటే మిన్నగా మంచి రాజ్యదక్షత కలిగిన పాలకునిగా ఖ్యాతిని ఆర్జించాడు.

బాబా జాబర్ తన పరిపాలనలో విద్య, వైద్యం, గృహాలు, ఎలక్ట్రిసిటీ పిల్లల చదువులు వంటివన్నీ ప్రజలకు ఉచితంగా అందించి వారిని ఆదరించారు.

కువైటు ప్రభుత్వం పుట్టే ప్రతిబిడ్డకి, వారి ఖర్చులకు కొంత మొత్తం కేటాయిస్తుంది. పిల్లలకు ప్రతినెలా జీతంలాగా, కొంత మొత్తం వారి చేతికే అందించబడుతుంది. తమ తల్లిదండ్రులను ఖర్చులకు అడగకుండా ఆ డబ్బుతో పిల్లలు తమ అవసరాలు తీర్చుకుంటారు.

అలాగే, ఎక్కువ సంతానం కలిగిన తల్లిదండ్రుల వేతనాలు ఎక్కువగా పెంచబడి పిల్లల పోషణకు తగిన విధంగా ప్రభుత్వం సహాయం చేస్తుంది. తల్లి గర్భంలో శిశువు రూపుదిద్దుకోగానే ఆ తల్లి గర్భవతిగా నమోదు చేసుకున్న వెంటనే ఇంకా పుట్టని ఆ శిశువుపై కూడా కొంత మొత్తం కేటాయింపబడుతుంది.

ఇవన్నీ బాబా జాబర్‌కు ఉన్న కనికరం వలన, పిల్లలంటే ఉన్న ప్రేమవలన ఈ ప్రభుత్వం ప్రజలకు ఈ సదుపాయాలు అందిస్తున్నది.

ప్రతి పక్షాలు, పోటీ తత్వాలు, రాజకీయాలు, బంద్‌లు ఈ దేశంలో కనిపించవు. అల్ సబ వంశానికి చెందిన యోగ్యుడైన నాయకుని ఒకని ఏకగ్రీవంగా అందరూ ఎన్నుకుని రాజుగా చేస్తారు. రాజును అనుసరించి గౌరవించి ప్రజలు నడుచుకుంటారు.

ఇక్కడ దొంగతనాలు, అలజడులు, అరాచకాలు కూడా ఉండవు. ఎందుకంటే నేరాలకు వేసే శిక్షలు చాలా కఠినంగా, ఖచ్చితంగా అమలు చేస్తారు. కాబట్టి నేరం చేయాలంటే ఈ దేశంలో నివసించే వారికి భయం. నేరం చేసిన వారు తప్పించుకునే ఆస్కారం అసలు ఉండదు.

ముందైతే కంటికి కన్ను, పంటికి పన్ను అనే శిక్షలతో కఠినంగా నేరస్థుల్ని శిక్షించేవారు, దొంగతనం చేసినవారి చేతులు నరికేవారు. చిన్నపిల్లల్ని హింసించడం, వారిని బాధించడం, మాదక ద్రవ్యాలు విక్రయించడం, మనుషుల్ని చంపడం వంటివాటికి.. ఏ మాత్రం ఆలోచించక, ఏకంగా ఉరిశిక్షలు అమలు చేసి బహిరంగంగా వారిని ఉరితీస్తారు. బాబా జాబరు రాజైన తరువాత ఇస్లాం మత విధానాలతో ఉన్న శిక్షల్ని మార్చి, ప్రపంచ దేశాల ప్రజాస్వామ్య విధానాన్ని పాటించేలా మార్పులు చేసి కాస్త వెసులు బాటును కలుగచేసారు.

కువైటు దేశంలోని ప్రజలు, పరదేశులు అందరూ కూడా, దేశానికి సంబంధించిన న్యాయవిధులు, నియమాలు పద్ధతులు, మత సాంప్రదాయాలను గౌరవించి, ఖచ్చితంగా వాటిని పాటిస్తారు.

దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించి మంచి రాజుగా ప్రజల హృదయాల్లో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నాడు బాబా జాబర్.

రాజైనప్పటికీ ఆయన సాధారణ జీవితాన్ని ఇష్టపడి సామాన్యంగా జీవితాన్ని గడిపేవాడు. అందరితో పాటు నేలపై వేసిన తివాచీపైన కూర్చుని ఆహారాన్ని భుజించేవాడు. సామాన్య పౌరులతో కూడా.. స్నేహపూర్వకంగా, మర్యాదగా పలకరించి మాట్లాడేవారు.

దేశాన్ని పాలించే రాజును అనే గర్వం, దర్పం ఆయనలో మచ్చుకైనా కనిపించేవి కావు.

ప్రపంచంలోని నూట మూడు పేద దేశాలకు ఆయన సహాయ నిధులు అందజేసి పేదలను ఆదుకునే పెన్నిధిగా, దయగల వానిగా కీర్తించబడ్డాడు. ప్రపంచ దేశాలవారు ఆయన సహాయాన్ని, దయార్ద్ర హృదయాన్ని కొనియాడారు.

కువైటు దేశపు మంచి భవిష్యత్తుకు ఆయన ప్రణాళికలు, చేసిన కార్యాలు ఎంతగానో తోడ్పడ్డాయి.

ఆయన అరబిక్ భాషను, ఇంగ్లీషును, సైన్సును తనదేశంలోని కళాశాలలోనే చదివారు. ధనం వెచ్చించి విదేశాలకు వెళ్ళి డిగ్రీలు పొందాలనే అభిలాష లేకుండా సాధారణ పౌరుని వలె తన విద్యను ప్రాంతీయ కళాశాలల్లో కొనసాగించారు.

2005లో ఆయన పాలనలోనే తన దేశంలో "స్త్రీలకు" మొట్ట మొదట ఓటు హక్కును కల్పించి వారికి మంత్రి పదవులు కూడా అందించి, స్త్రీలకు గౌరవస్థానాలు కల్పించారు. ప్రపంచ దేశాల్లో తమదేశపు స్త్రీల ఉనికి చాటారు.

బాబా జాబర్‌ను ప్రజలు తండ్రిలా ఆరాధిస్తారు అనడం అతిశయోక్తికాదు.

అల్ షాహీన్ అనే కలం పేరుతో ఆయన కవితలను కూడా రాసేవారిని తెలుస్తోంది.

పెద్ద తలపాగా తలకి మీదుగా ముఖం పైకి చుట్టుకుని, తానే స్వంతంగా కారు నడుపుకుంటూ షాపింగ్ మాల్స్‌కు వెళ్ళేవారని. తనకిష్టమయిన ప్రదేశంలో సముద్రపు తీరాన ఒంటరిగా కూర్చుని ప్రకృతిని, అరేబియా సముద్రం అందాలను వీక్షించి సంతోషించేవారని చెబుతుంటారు.

***

బాబా జాబర్ పాలనలో కువైటు దేశం రెండు యుద్ధాల్ని ఎదుర్కొంది.

కువైటు లోని ఆయిల్ నిల్వలపై, పెట్రోలు బావులపై, అపారమైన సంపదపై కన్నుపడిన సద్దాం హుస్సేన్ ప్రక్కనే ఉన్న చిన్నదేశమైన కువైటుపై చెప్పాపెట్టకుండా 1990 ఆగస్టు 2న తన సైనికుల్ని యుద్ధ విమానాల్ని నడిపించాడు. కువైటుకు యాభై కిలోమీటర్ల దూరంలో సరిహద్దుకు ఆనుకుని ఉన్న పొరుగు దేశమైన ఇరాక్‌కు కువైటుని లోబరచుకోవడం కొన్ని నిముషాల్లోనే సాధ్యపడింది. ఏ ఒత్తిడీ లేదు తిరుగుబాటు లేదు. సునాయసంగా చేతులెత్తేసి కువైటు ప్రజలు చెల్లాచెదురై ప్రాణాలు దక్కించుకోవడం చాలని పరుగులు పెట్టారు.

సద్దాం హింసకు తట్టుకోలేక ప్రపంచానికి వినబడేలా కువైటు ఆర్తనాదాలు చేసింది. యుద్ధం చేసిన విలయ తాండవంతో కువైటు దేశం, దాని సంపదా తల్లక్రిందులై పోయాయి. సద్దాం హుస్సేను యొక్క దౌర్జన్యానికి నిరంకుశత్వానికి కువైటు దేశం బలి అయిపోయింది, చాలా నష్టపోయింది. ఒక నియంతగా, హిట్లరుకు వారసుడిగా పేరుపొందిన సద్దాం హుస్సేను కువైటు ప్రజల్ని భయంకంపితులను చేశాడు.. వారిని వివిధ రకాలుగా హింసించాడు. బాధించాడు. తన కోపాన్ని కక్షను కువైటు ప్రజలపై నిరంకుశంగా తీర్చుకుని.. ఆరునెలలు కువైటును ఆక్రమించి సమూలంగా నాశనం చేసాడు. పెట్రోలు బావులను అగ్నికి ఆహుతి చేశాడు.. బాంబులతో భవనాలను కూలద్రోసి భీభత్సం సృష్టించాడు.

ఈ యుద్ధం గల్ఫ్ యుద్ధంగా చరిత్రలో నిలిచిపోయింది.

కువైటులో నివసిస్తూ పనులు చేసుకుంటున్న పరదేశులందరినీ దేశం విడిచి వెళ్ళిపొమ్మని ఇరాక్ సైనికులు హెచ్చరించారు.

ఆ సమయంలో కువైటు ప్రజలు, ఇళ్ళు, కార్లు ఆస్తులు, బంగారం, నగలు అన్నీ వదిలేసి.. ఉన్నవారు ఉన్నట్లుగా కట్టుబట్టలతో వీలయిన చోటికి పరుగెత్తి ప్రాణాలు దక్కించుకున్నారు.


ఇరాక్ సైనికులు ఇళ్ళను, భవనాలను కొల్లగొట్టి, కాల్చి, పేల్చి వేసారు. పెట్రోలు బావులను తగల బెట్టారు. ఆడవారిని, పిల్లల్ని కూడా హింసించారు. పనిమనుషులను, పరదేశులను ఇరాక్ రాజధాని అయిన బాగ్దాద్కు, బాస్రాకు పంపించి విమానాల్లో వారి వారి దేశాలకు పంపించి వేసారు. కొందరు పనిమనుషులు పనిచేసే ఇళ్ళలో దొరికినంత దోచుకుని, తీసుకుని, దాచుకుని వారి వారి దేశాలకు వచ్చి పడ్డారు. ఆ దోచుకుని తెచ్చిన డబ్బులతో మేడలు కట్టుకుని స్థిరపడ్డారు. అందుబాటులో ఏమీలేని దొరకని అసహాయులు.. కట్టుబట్టలతో విమానం ఎక్కి, కువైటుకు రావడానికి తను దేశంలో చేసి వచ్చిన అప్పులను తలచుకుని కుమిలిపోయారు. వేదనతో కృంగిపోయారు. వారం రోజులు తిండి, నీళ్ళు లేకుండా నడిచి కువైటు సరిహద్దులు దాటి తమ ప్రభుత్వం దయతలచి తమకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన విమానాల్లో చోటు సంపాదించుకుని ప్రాణాలు కళ్ళల్లో పెట్టుకుని తమ దేశాలు చేరుకున్నారు ఆ పరదేశులు.

వీరిలో మన భారతీయులే ఎక్కువ సంఖ్యలో ఉండటం గమనించదగ్గ విషయం.

ఎంతో ఆశతో పనికోసం, సంపాదన కోసం కువైటులో క్రొత్తగా అడుగుపెట్టినవారు ఎన్నో ఏళ్ళనుండి అక్కడ వుండి స్థిరనివాసం ఏర్పరచు కున్నవారు కూడా. తమ సర్వస్వమూ విడిచిపెట్టి తమ దేశాలకు తిరిగి వెళ్ళిపోవాల్సి వచ్చింది.

అప్పులు చేసి, స్వదేశాలు విడిచి క్రొత్తగా కువైటు వచ్చిన వారి పరిస్థితి, దుస్థితి వర్ణనాతీతం. ఆశించిన విధంగా ఏమీ సంపాదించుకోలేక తిరిగి స్వదేశానికి వస్తే చేసిన అప్పులు వారిని భయపెట్టి చాలా కుటుంబాల్ని క్రుంగదీసాయి. దిక్కుతోచని స్థితిలో, దిగులుతో చాలామంది అల్లాడిపోయారు. వారి ఆశలు అణగారి పోయాయి.

ఈ సమయంలో బాబా జాబరు, గత్యంతరంలేక, తన కుటుంబంతో కలిసి, పొరుగు దేశమైన సౌదీ అరేబియాకు పారిపోయి తయఫ్ అనే పట్టణంలో ఆరునెలలు తలదాచుకున్నాడు.




దురాక్రమణకు, అన్యాయానికి లోనైన రాజుగా ఆయన చేసిన ప్రార్ధనలు, విజ్ఞాపనలు ప్రపంచదేశాల్ని, నేతలను కదిలించాయి. స్వయంగా అమెరికా ఈ విషయంలో తల దూర్చి కువైటుకు మద్దత్తునిచ్చి సద్దాం నుండి కువైటుని విడిపించి తిరిగి బాబా జాబర్కు అప్పగించింది.

తిరిగి రాజ్యాధికారాన్ని చేపట్టాక, బాబా జాబర్ కువైటు యుద్ధంలో చెల్లాచెదురై పారిపోయిన పరదేశులకు కువైటు ప్రభుత్వం తరపున తలకొక లక్షరూపాయల చొప్పున నష్ట పరిహారం చెల్లించాడు. ఈ యుద్ధం ద్వారా నష్టపోయిన వాడిని ఆ విధంగా సంతోషింప చేసారు బాబా జాబరు. ప్రపంచ దేశాలవారు బాబా జాబరు యొక్క దయాగుణాన్ని స్తుతించారు.

యుద్ధం మానవాళికి ఎంత నష్టం కలగజేస్తుందో, కువైటు ప్రజలు కళ్ళారా చూసారు. ఆర్తనాదాలు చేస్తూ ఆవేదనను అనుభవించారు. ఇప్పటికీ వీరు ఆ యుద్ధాన్ని, వారు పడిన కష్టాల్ని తలచుకుని, కథలుగా చెప్పుకుని కన్నీళ్ళు విడుస్తారు. చనిపోయిన తనవారిని, బందీలుగా చిక్కి చిరునామా తెలియక మాయమయిన సైనికుల్ని తలచుకుని దుఃఖిస్తారు. యుద్ధం తరువాత ఒక్కొక్కరుగా తిరిగి స్వదేశానికి చేరుకున్న కువైటు ప్రజలు కువైటు దేశాన్ని తిరిగి పునర్నించుకున్నారు.

బాబా జాబరు కృషి ఈ విషయంలో మరువలేనిది. అమెరికా సైనిక దళాల సహాయంతో కువైటుని రక్షించుకుని అనతికాలంలోనే మరలా కువైటును ప్రపంచదేశాల సరసన సగర్వంగా నిలబెట్టాడు.

బాబా జాబరు ఈ గల్ఫ్ యుద్ధానికి గుర్తుగా ఎత్తైన టవర్‌ను నిర్మించి దీనికి లిబరేషను టవరు అని పేరు పెట్టారు. 1991లో ఇది ప్రపంచంలో అయిదవ ఎత్తైన టవర్‌గా పేరు పొందింది.

ఈ టవర్‌ను ఇపుడు టెలి కమ్యూనికేషను టవర్‌గా ఉపయోగిస్తున్నారు.

తరువాత కూడా అమెరికా సైన్యం సద్దాం హుస్సేన్‌ను పట్టుకుని ఉరితీసి చంపేంత వరకు, కువైటు ప్రజలు సద్దాం పేరు చెపితేనే ఉలికిపడుతూ జీవించారు.

ఈ గల్ఫ్ యుద్ధం మిగిల్చిన గాయాలు ఇంకా కువైటు ప్రజల హృదయాల్లో పచ్చిగా ఉండి రక్తాన్ని కారుస్తున్నాయి. ఈ యుద్ధాన్ని తలచుకున్నప్పుడల్లా వీరి కళ్ళు తడిగా మారి ఆ భయంకరమైన జ్ఞాపకాల పుటల్ని జ్ఞప్తికి తెచ్చుకుంటాయి.

నరరూప రాక్షసుడిగా పేరుగాంచిన సద్దాం హుస్సేన్ ఈ యుద్ధంలో కువైటు ప్రజలను దొరికిన వారిని దొరికినట్లుగా బందీలుగా పట్టుబడిన వేలాదిమంది సైనికులను, ప్రజలను ఎక్కడ దాచాడో ఇప్పటికీ ఎవరికీ తెలియదు. జైల్లో ఉన్నారని, చంపబడ్డారని రకరకాలుగా ఊహిస్తారు, కానీ నిజం దేవునికే తెలియాలి.

పాపం కువైటు ప్రజలు, బందీలుగా చిక్కిన తనవారి కోసం ఇప్పటికీ ఎప్పటికైనా తిరిగి వస్తారని, ఆశగా ఎదురు చూస్తూనే ఉన్నారు. వీరిని P.O.W.S అని పిలుస్తారు. అనగా ప్రిజనర్స్ ఆఫ్ వార్ సోల్జర్స్ అని అర్థం.

వీరి ఫోటోలు చూసుకుంటూ గుండెలు పగిలేలా ఏడ్చే తల్లులు, ఏదో ఒకరోజు వస్తారని ప్రతిరోజూ వీరి రాకకై, విసుగుచెందకుండా ఎదురు చూసే భార్యలు, తండ్రిలేక అనాథలైన వీరి పిల్లలు, బంధువులు ఇప్పటికీ కంట తడి ఆగకుండా కన్నీళ్ళు ఒలికిస్తూనే ఉన్నారు.

***

బాబా జాబర్ కుటుంబ జీవితం ఎంతో ఆసక్తికరమైనది.

ఈయన స్త్రీలోలుడు. శృంగార పురుషుడు.

ఆయన పెళ్ళాడిన భార్యల్ని ఇంతవరకూ ఎవరూ లెక్కించలేకపోయారంటే అతిశయోక్తి కాదు. ఎంత మందిని వివాహం చేసుకున్నారో? ఎంతమందికి విడాకులు ఇచ్చారో ఖచ్చితంగా ఎవరూ వివరాలు చెప్పలేక పోతున్నారు. దాదాపు డెబ్బైకి పైగా అమ్మాయిలను వివాహమాడి ఉండవచ్చని ఒక అంచనా. వీరిలో దేశానికి చెందిన వారేకాక విదేశీయులు కూడా ఎంతోమంది ఉన్నారు. ఆయన జీవితం నిత్యకళ్యాణం, పచ్చతోరణంగా కడవరకూ కొనసాగింది.

స్త్రీలంటే ఆయనకు ఉన్న మక్కువతో ఇస్లాం మత సిద్ధాంతాల ప్రకారం, దేశపు రాజుగా ఉన్న హక్కు అధికారంతో ఇష్టపడిన ప్రతిస్త్రీని వివాహం చేసుకున్నారు. ఆయన భార్యలైన వారికి సౌకర్యాలు, సర్వసంపదలు, రాణిగా హక్కులు లభించేవి. ఆయనకు భార్యగా ఉండటం అదృష్టంగా, ధన్యతగా, ఒక హోదాగా భావించిన అరబిక్ అందగత్తెలు ఆయనను వివాహం చేసుకుని రాజ భోగాలు అనుభవించడానికి అవకాశం వస్తుందని ఆశగా ఎదురు చూసేవారు.

బాబా జాబర్ శృంగార పురుషుడే కాదు. మంచి అందగాడు కూడా. ప్రశాంత వదనంతో.. ముఖాన చెరగని చిరునవ్వుతో చురుకైన చూపులతో పచ్చటి మేని ఛాయ కలిగి ఆయన అందరినీ ఆకర్షించేవారు. దేవుడు శ్రద్ధగా చెక్కిన శిల్పంలా ఉండి, అందరినీ ఆకట్టుకునే రూపం బాబా జాబర్‌ది. మంచి రాజుగా, పేరుపొంది ప్రజలచే కొనియాడబడిన ఈయనను, దైవాంశ సంభూతుడని ప్రజలు

నమ్మి భయభక్తులతో గౌరవించి, ఆరాధించేవారు. తాను వలచిన అమ్మాయిని ఈయన వివాహం చేసుకుని ఇష్టం వచ్చినన్ని రోజులు ఆమెతో గడిపేవాడు.

రోడ్డుమీద కానీ, యూనివర్శిటీలో, ఫంక్షన్స్‌లో, షాపింగ్ మాల్స్‌లో కానీ చూసిన ఏ అమ్మాయి అయినా ఆయనకు నచ్చితేచాలు, వెంటనే ఆ అమ్మాయికి, ఆమె తల్లిదండ్రులకి కబురు పంపించేవాడు. రాజును వివాహమాడటం తన అదృష్టంగా, దైవ కార్యంగా, దేవుని చిత్తంగా భావించి సంతోషంగా సిద్ధమయే వారు ఆ అమ్మాయిలు. దేశాన్ని పాలించే రాజు తమ అల్లుడు కావడం తమ ప్రార్థనల ఫలితమని, అది అల్లా యొక్క వరమని భావించి ఉప్పొంగిపోతూ - తమ సమ్మతిని తెలిపే వారు ఆ అమ్మాయిల తల్లిదండ్రులు.

అరబ్బులు అతి సుందరమైన వారు. అద్భుత సౌందర్యం వీరి సొత్తు. వీరిని చూసినపుడు ఆ దేవుడు ఎంతో ప్రేమతో, ప్రత్యేకంగా పాలు, మీగడ గులాబీ రేకులను కలగలిపి, రంగరించి వీరి మేని ఛాయలో నింపి తయారు చేసాడా? అనే సందేహం వస్తుంది. వంటి రంగే కాదు, ఆ నునుపు, మెరుపు కంటిని ఎంతో ఆకర్షిస్తాయి. కళ్ళు ప్రక్కకు త్రిప్పుకోనివ్వని అందం వీరిది. మన్మథుని విల్లులా, వంపు తిరిగిన నల్లటి కనుబొమలు, చెంపకు చేరడేసి మిలమిలలాడే కనులు, చక్కటి నాసిక, ఎర్రటి అధరాలు, వత్తైన జుట్టు కలిగి కాలివ్రేళ్ళ నుండి తల వెంట్రుకల వరకు అద్భుతంగా అమరిన అందగత్తెలు వీరు.

ఇంతటి సౌందర్యరాశులైన వీరిలో నచ్చిన వారిని ఎంచుకుని ఇస్లాం మత సాంప్రదాయం ప్రకారం వివాహమాడి వారికి స్వర్గసౌఖ్యాలు అందించేవాడు బాబా జాబర్.

మన భారత దేశంలో వరకట్నం, వరునికి చెల్లించే రీతిలో కాకుండా అరబ్ దేశాల్లో అమ్మాయిలకు, వరుడు కన్యాశుల్కం చెల్లించి, కావలిసిన ఆభరణాలు కానుకగా ఇచ్చి వివాహం చేసుకుంటారు. కుటుంబాన్ని సంపదలతో సత్కరించి సంతృప్తి పరచి వివాహం చేసుకునేవారు. వారికి బంగళాలు, కార్లు నగలు, డబ్బును కానుకలుగా ఇచ్చేవాడు.

అయితే వివాహమాడిన భార్యల్లో కొందరిని, వారికి ఇష్టం లేకపోయినా ఆయనకు ఇష్టం లేకపోయినా మూడురాత్రులు గడిపాక వారిని విడిగా ఉంచి విడాకులు ఇచ్చేవాడు. వారు ఆయనను విడచి మరొక తగిన వివాహం చేసుకుని వారికి నచ్చిన జీవితం గడిపేవారు.

ఎందుకంటే ఆయన వివాహం చేసుకున్న స్త్రీలలో చాలామందితో మూడురాత్రులు లేదా ఒక వారం రోజులు మాత్రమే గడిపేవాడు. మరలా జీవితంలో వారితో గడిపే సమయం ఉంటుందా అనేది అనుమానం. ఆయనకు మోజు తీరి, మొహం మొత్తినా - క్రొత్త సుందరీమణులపై మోజు పెరిగినా ఆ భార్యలు ఒంటరిగా జీవించాల్సిందే ఆయనను విడిచి వెళ్ళిపోయి మరలా వివాహం చేసుకుంటామనేవారికి, జీవితానికి సరిపడా సంపదా, ప్రతినెలా జీవనానికి కావలిసిన ధనం ఆయన సమకూర్చేవారు. బయటికి వారిని పంపించేవారు.

కొందరు ఆయనకు భార్యలుగా, మహరాణులుగా ఉండటమే మహద్భాగ్యం అని భావించి వారికై నిర్మించిన పాలెస్‌లలో రాణీవాసపు జీవితం అనుభవిస్తూ జీవిత కాలం గడిపేసేవారు.

ఆయనకు జ్ఞాపకం ఉండి ఎపుడో ఒకసారి వారిని పలకరిస్తే అదే పదివేలు వారికి. వినడానికి వింతగా ఉన్నా ఆయన జీవితాంతం నిత్య పెళ్ళికొడుకుగా మారి సుందరీమణులనందరినీ వివాహమాడి వైవిధ్యంగా కాలం గడిపి శృంగార భరిత విలాస జీవితాన్ని జీవించారు.

ఆయా భార్యల వలన పుట్టిన బిడ్డలు అందరు కూడా రాజకుమారులుగా గుర్తించబడి, రాజవంశానికి చెందిన వారుగా సర్వహక్కులు కలిగి ఉన్నారు.

భార్యల్ని విడిచినా వారికి పుట్టిన బిడ్డల్ని మాత్రం రాజు విడువక, తానే దగ్గరికి తీసుకుని రాజభవనంలో ఉంచి వారికై సంరక్షకులను ఏర్పాటు చేసి పెంచి పెద్ద చేసారు. వారిని రాజ్యాధికారానికి అర్హులుగా, తన వారసులుగా భావించి, ప్రత్యేక శ్రద్ధతో వారికి విద్యను నేర్పించి ఒక హోదాను కల్పించారు.'

స్వదేశానికి చెందిన వారినీ, విదేశాలకు చెందిన ఎందరో అందగత్తెలను ఆయన వివాహమాడి చరిత్ర సృష్టించారు.

ఈ విధంగా బాబా జాబర్ అందరి భార్యల వలన నలభై మందికి పైగా బిడ్డల్ని కని రికార్డు సృష్టించారు. పరిశోధకులు ఆయన భార్యల్ని లెక్క తేల్చలేక పోయినప్పటికీ ఆయన బిడ్డల్ని మాత్రం లెక్కకట్టి, క్రమంలో ఒక పట్టిక తయారు చేసారు.

ఏడాది క్రిందట ఒక కువైట్ కుటుంబం నన్ను డిన్నర్‌కి ఆహ్వానించారు. అక్కడికి వచ్చిన అతిథుల్లో ఒక అద్భుతమైన సౌందర్యరాశిని అందరూ ప్రత్యేకంగా గౌరవించడం గమనించి వివరాలు అడిగాను. అప్పుడు తెలిసింది, ఆమె ఒకప్పుడు బాబా జబర్ వివాహం చేసుకున్న వనిత. ఆరు నెలలు కాపురం చేసింది, కానీ తర్వాత రాజుగారు బిజీ ఐపోవడంతో విడాకులు ఇచ్చేశాడు. ఐతే రాజు భార్యగా ఆమెకి రావల్సిన సౌకర్యాలన్నీ అందాయట. అలానే ఎప్పుడు కావాలన్నా రాజుగారిని కలుసుకునే వెసులుబాటు ఉందట కానీ ఆ అవకాశమే మళ్ళీ రాలేదట!! ఆర్నెల్ల వివాహమే ఐనా ఆమెకి జీవితకాలం సకలభోగాలూ సమకూరాయని అక్కడికి వచ్చిన అతిథుల్లో ఒకరు వివరించారు.

***

అందమైన రూపంతో, ఆకట్టుకునే నడవడికతో చెరగని చిరునవ్వుతో అందరినీ ప్రేమించి, మంచివాడుగా పేరుపొందిన బాబా జాబర్ రాజు తన 79 వ ఏట, 2006 జనవరిలో మరణించారు. ఈయన మరణంతో కువైటు దేశం శోక సముద్రంలో మునిగిపోయింది. కువైటు ప్రజలు కన్నతండ్రినే కోల్పోయినట్లు దుఃఖించారు. నలభై రోజులు సంతాప దినాలుగా ప్రకటించి ఆయన ఉన్నతిని ప్రశంశించారు.

బాబా జాబరు కువైటు ప్రజల హృదయాల్లోనే కాక, కువైటులో నివశించిన పరదేశుల హృదయాల్లో కూడా ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్నారు.

చరిత్రలో బాబా జాబరు విలక్షణమైన రాజుగా, సువర్ణాక్షరాలతో లిఖించబడ్డాడు.

## *మా పిన్ని కథ*

**నా చిన్నప్పుడు** అనగా 1980 ప్రాంతంలో మా ఊర్లో చాలామంది కువైటు దేశానికి పనులకోసం, డబ్బు సంపాదన కోసం వెళ్ళనారంభించారు. గల్ఫ్ దేశాలన్నీ కూడా ముస్లిం దేశాలు కాట్టి మొదట్లో మా ఊరి ముస్లింలు ఈ గల్ఫ్‌కు వెళ్ళడానికి బాగా ఆసక్తి చూపించారు. తరువాత కాలంలో ఊర్లోని అన్ని కుటుంబాలవారు వెళ్ళనారంభించారు.

వారి కోసం కొందరు ఏజంట్లుగా మారి కమీషను తీసుకుంటూ కువైటు వెళ్ళేవారికోసం వీసాలు తెప్పించడం, మెడికల్ చెకప్ చేయించడం, ఫ్లయిట్ ఎక్కించడం లాంటి పనులన్నీ చేసేవారు.

అప్పట్లో మా నాన్నగారు వ్యాపారం చేస్తుండేవారు. మా ఊర్లోని రైతులకు కావలసిన డబ్బులు ఇచ్చి, వాళ్ళ పంటలు దానికి బదులుగా తీసుకుని మద్రాసు, తిరుపతి, నెల్లూరు, సూళ్ళూరు పేట, కావలి లాంటి ఊర్లకు లారీల్లో తీసుకెళ్ళి విక్రయించేవారు.

ఈ వ్యాపారం పనులు చూడటానికి దాదాపు పదిహేనుమంది మనుషులను మా నాన్న నియమించుకున్నారు. రైతులే కాక కువైటు వెళ్ళేవారు కూడా మా నాన్న దగ్గరకి వచ్చి 'అయ్యా నాకు కువైటు వెళ్ళడానికి వీసా వచ్చింది. ఒక ఇరవై వేలు అప్పుగా ఇవ్వు రెండేళ్ళలో తిరిగి వచ్చి వడ్డీతో సహా తీర్చేస్తాను' అని అడిగేవారు.

మా నాన్నగారు లేదనకుండా వాళ్ళకి అప్పుగా డబ్బును ఇచ్చేవాళ్ళు.

అలా అప్పు తీసుకుని కువైటు వెళ్ళిన వారు రెండు, మూడేళ్ళకు ఇండియాకు తిరిగివచ్చి మా అప్పు తీర్చేవాళ్ళు. అప్పుతీసుకున్న డబ్బుతో పాటు వడ్డీకూడా ఇవ్వబోతే మా నాన్న తీసుకునేవారు కాదు. 'మంచి వాచీ ఒకటి కువైటు నుండి పంపించు చాలు' అనేవారు.

వాళ్ళు మా నాన్నకు సిటిజన్ కంపెనీ గోల్డ్‌కలర్ వాచీతోపాటు, మా అమ్మకు జపాన్ చీరలు, మాకు మంచి గౌనులు కూడా తెచ్చి ఇచ్చేవారు.

మా ఊర్లో పొలం పనులు చేస్తూ ఎండలో మాడిపోయేవాళ్ళు కూడా కువైటు వెళ్ళి తెల్లగా మెరిసే ఒంటిరంగుతో వ్రేళ్ళనిండా బంగారు ఉంగరాలతో, చేతికి గోల్డ్ కలర్ వాచీ పెట్టుకుని డాబుగా దర్పంగా నాజూకుగా మారి ఇండియాకు తిరిగి వచ్చేవారు. 'అబ్బో వాడికేం? కువైటు వెళ్ళి దండిగా దుడ్డు సంపాదించుకుని తిరిగి వచ్చాడు' అని ఊర్లోని జనం ఎంతో గొప్పగా చెప్పుకునేవారు.

ఊర్లో ఉన్న రెండు నెలల సెలవు రోజులు వారికి వైభోగమే. ప్రతిరోజూ విందు భోజనమే.

బంధువులు, స్నేహితులు, తెలిసినవారు అందరూ ఒక్కోపూట వారింటికి పిలిచి పిండి వంటలతో భోజనాలు పెట్టేవారు.

కువైటు నుండి వాళ్ళు తెచ్చిన టేప్‌రికార్డర్లు, చలికి కప్పుకునే రంగుల రగ్గులు, సబ్బులు, షాంపూలు లాంటివన్నీ ఊర్లోని వారు ఆశ్చర్యంగా చూసేవారు! ఊర్లోని జనం వాళ్ళింటికి వెళ్ళి వాళ్ళని పలకరించి ఎన్ని సూట్ కేసులు విమానంలో తీసుకుని వచ్చారో, ఏమేం తెచ్చారో అని పరిశీలించి చూసి కువైటు జీవితం గురించి వాళ్ళు తెచ్చే వస్తువుల గురించి వింతగా చెప్పుకునేవారు. అప్పట్లో విమానప్రయాణం కూడా ఒక వింతే.

ఆ రోజుల్లో మా బంధువు వరసకు పిన్ని అయ్యే ఒకావిడకూడా కువైటు వెళ్ళి అక్కడ మూడేళ్ళు ఉండి అరబ్బుల సౌందర్యం అంతా ఆమెలో నింపుకుని శలవులకి ఇంటికి తిరిగి వచ్చింది.

అంతకు ముందు మా ఊర్లో ఉన్నప్పుడు చింపిరి జుట్టుతో ఎండకు కమిలిపోయిన ఒంటితో మాసిన పాత చీరలు కట్టుకుని దీనంగా ఉండే ఆమె, ఇప్పుడు జపాన్ సిల్క్ చీర కట్టుకుని పిరుదులపై నాట్యమాడే బారెడు జడలో పచ్చని పసిమి ఛాయతో మమ్మల్ని పలకరించడానికి మా ఇంటికి వస్తే నేనేకాదు చుట్టుపక్కల ఉన్న అమ్మలక్కలు కూడా కళ్ళప్పగించి ఆశ్చర్యంగా ఆమెను చూసారు.

'ఏ షాంపూతో తలకు పోసుకున్నావక్కా నీ వెంట్రుకలు అంత బాగా పెరిగాయి?' అని ఒకావిడ అడిగితే... ?ఏ సబ్బు రుద్దుకుంటావు వదినా అంత తెల్లగా వచ్చావు?' అని ఇంకొకామె ఆవిడను కళ్ళప్పగించి చూస్తూ ప్రశ్నించింది. దేవలోకం నుండి దిగివచ్చిన అప్సరసలా ఉన్న ఆమెను అబ్బురంగా చూస్తూ అమ్మలక్కలు అందరూ అక్కడ గుమికూడారు.

వాళ్ళ ప్రశ్నలకు సందేహాలకు నాకు నవ్వు వచ్చింది. నాకు కూడా భలే ఆశ్చర్యం కలిగింది.

చింపిరిగా ఉన్న ఆమె జుట్టు అంత పొడవుగా పెరిగి పట్టుదారాల్లా ఎలా మారిందో, నల్లటి ఒళ్ళు అంత తెల్లగా ఎలా మారిందో అర్థంకాక నా సందేహాలను ప్రశ్నలుగా మార్చి ఆమెనే అడిగాను.

అపుడు తను అందంగా ఒక చిరునవ్వు నవ్వి కువైటు దేశంలోని సుఖజీవనం గురించి అక్కడి సౌకర్యాల గురించీ ఆనందంగా చెప్పుకొచ్చింది.

'అక్కడ సబ్బులు, షాంపూలు, క్రీములు మంచి మేలు రకం ఉంటాయి. రోజంతా ఏ.సి రూముల్లోనే ఉండి, నీడపట్టున ఇంట్లోపని చేయడం, బయటికి వెళ్ళాలంటే ఏ.సి కార్లో వెళ్ళి తిరిగి ఇంటికి రావడంతో ఎండలో నడిచే అవసరం కూడా లేదు.

ఇక్కడ మన ఊర్లో మనం తిన్నట్లు రాగిపిండి సంకటి, చింతపండు ఊరిమిండి, చద్దికూడు తినరు. అక్కడ ప్రతిరోజూ మాంసం, చేపలు, సలాడ్లు, పండ్లు, జ్యూస్‌లు, రకరకాల పానీయాలు తినగలిగినన్ని తిని ఇష్టమైనవి తాగచ్చు. తిండి విషయంలో ఎవరూ తినొద్దు అని అభ్యంతరం చెప్పరు. వంట ఇల్లు, ఫ్రిడ్జ్‌లు అవసరమైన సరుకులతో పళ్ళు కూరగాయలతో నిండుగా నింపి ఉంచుతారు. ఎపుడూ దేనికీ అక్కడ కొరత ఉండదు.

పనిమనుషులకు నెలజీతం ఇచ్చేటపుడే అవసరమయిన సబ్బులు, క్రీములు షాంపూలు తెచ్చిస్తారు. సంవత్సరానికి నాలుగుసార్లు రెండు జతల బట్టలు, చెప్పులు కొని తెస్తారు.

పని బాగా చేసి నమ్మకం సంపాదించుకుంటే పనిమనుషులని కూడా ఇంట్లో వారిలాగే ప్రేమగా చూసి అన్ని సదుపాయాలు వాళ్ళు కల్పిస్తారు. కొందరు పనిమనుషులు ఇరవై ఏళ్ళగా స్థిరంగా ఒకే ఇంట్లో ఉండి మంచి జీతాలు తీసుకుంటూ బాగా సంపాదించుకుంటున్నారు.'

"అక్కడ నువ్వు ఏం పని చేస్తావు పిన్నీ?" అని అడిగాను.

ఆ ప్రశ్నతో ఆమె ఉత్సాహంగా "మా బాబా, మామా ఉదయాన్నే లేచి చెరొక సాండ్‌విచ్ తిని డ్యూటీకి వెళ్ళిపోతారు. కొందరు మామూలు ఉద్యోగాలు చెయ్యరు. ఆడవాళ్ళు ఉద్యోగాలు చెయ్యడం వాళ్ళ సంప్రదాయం కాదు. కానీ ఇపుడిపుడే చదువుకున్న ఆడవాళ్ళు బడిలో టీచర్ ఉద్యోగాలు చేస్తున్నారు. మా మామా కూడా టీచరే. వాళ్ళు వెళ్ళే సమయానికే ఇద్దరు పెద్ద పిల్లలని కూడా తయారు చేసి బడికి పంపిస్తాను. అహ్మదు అనే ఇండియా అతను డ్రైవరుగా పనిచేస్తున్నాడు. అతను ఇద్దర్నీ బడికి తీసుకువెళ్తాడు.

వాళ్ళందరూ వెళ్ళిన తరువాత పాలుతాగే పిల్లడిని చూసుకుంటూ వారి పడక గదులన్నీ సర్ది, బాత్‌రూములు కడిగి, హాలంతా శుభ్రం చేస్తాను. వంటపని చేయడానికి శ్రీలంక ఆమె పదిసంవత్సరాలుగా ఉంది. వాళ్ళ వంట కారం మసాలాలు లేకుండా చప్పగా ఉంటాయి, వారికి చేసే వంటతోపాటు మా కోసం కూడా ఆమె మన వంటలు చేసి పెడుతుంది. కొందరు కువైటు వాళ్ళు మన వంట, వాసనలు బాగుండవని చెయ్యద్దని వారివే తినాలని చెప్తారు. కానీ మా బాబా, మామా మంచివాళ్ళు కాబట్టి మాకు ఇష్టం వచ్చినవి వండుకుని తినమని చెప్తారు.

డ్రైవరు అహ్మదు బయట రూములో ఉంటాడు. శ్రీలంక ఆమె, నేను వెనక ప్రక్క ఉన్న గదిలో ఉంటాం. ఒక్కోసారి సాయంత్రం పూట పిల్లల్ని తీసుకుని ఆట స్థలాలకు, పార్కులకు వెళ్ళి వారిని ఆడించాలి. అపుడు డ్రైవరు అహ్మదు కారులో మమ్మల్ని బయటికి తీసుకుని వెళ్తాడు" అని ఆమె అక్కడి పని గురించి వివరించింది.

ఆమె చెప్పినవన్నీ విన్న తరువాత నాక్కూడా కువైటు చూడాలి అనే కోరిక కలిగింది. "పిన్నీ మీ కువైటు చాలా బాగున్నట్లుంది. మరి నేను కూడా కువైటు రావాలంటే ఏం చేయాలి? ఎలా రావాలి? " అని అడిగితే

ఆమె నా భుజంపై ఆప్యాయంగా చెయ్యి వేసి "నువ్వు బాగా చదువుకుంటే అక్కడికి వచ్చి కంపెనీలో పెద్ద ఉద్యోగం చెయ్యొచ్చు. నేను చదువుకోలేదు కాబట్టి ఇంట్లో పని చేస్తున్నాను" అని సలహా ఇచ్చింది.

ఆ రోజు ఆ చిన్న వయసులో ఆమె అన్నమాట నిజమవుతుందని నా కోరిక తీరి ఇపుడు ఇలా కువైటులో ఒక పెద్ద కంపెనీలో ఉద్యోగం చేస్తానని అపుడు ఊహించలేదు. మా మాటలు విన్న తథాస్తు దేవతలు 'తథాస్తు' అన్నారేమో.

మా పిన్ని గాజు మాదిరిగా వంపు తిరిగి ఉన్న ఒక గోల్డ్ కలర్ వాచీని, కీ ఇస్తే అందమైన నల్లటి కళ్ళు ఆర్పుతూ ముందుకు నడిచి పాటపాడే బార్బీ గర్ల్‌లాంటి ఒక బొమ్మను నాకు ఇచ్చింది.

ఆ బొమ్మ నాకు చాలా నచ్చింది. నా స్నేహితురాళ్ళందరికీ ఆ బొమ్మను గొప్పగా చూపించి ఆ బొమ్మతో ఆటలాడేదాన్ని. అప్పట్లో అలాంటి బొమ్మలు అరుదు. దాని ఆటపాటలు చూసేందుకు పిల్లలందరూ నాతో స్నేహంగా ఉండేవారు.

పిన్ని ఇచ్చిన గోల్డ్ కలర్ వాచీని రోజూ స్కూల్‌కు పెట్టుకుని వెళ్ళేదాన్ని. మా పిన్ని కువైటునుండి నాకోసం తెచ్చిందని బడిలో పిల్లలకి సంతోషంగా చెప్పి దానిలో టైం చూసుకుని మురిసిపోయేదాన్ని.

మా పిన్ని మా అమ్మకు కూడా రెండు జపాను చీరలు ఇచ్చింది. అప్పట్లో కువైటు దేశానికి జపాను నుండి దిగుమతి అయి వచ్చే చీరలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. అవి ముట్టుకుంటే మాసిపోయేలా పట్టుకుంటే జారిపోయేలా మెత్తగా మృదువుగా ఉండేవి. ఒకటి పాలమీగడ రంగులో అందంగా ఉంటే మరొకటి బంగారు వర్ణంలో మెరిసిపోతూ ఉండేది. ఆ వయసులో చిన్న పిల్లలం ఆ చీరల మీద మోజుతో వాటిని ఇంట్లో వంటికి చుట్టుకుని అద్దంలో చూసి ఆనందించడం ఇప్పటికీ గుర్తుంది.

ఓరోజు రాత్రి భోజనాలు చేసాక అందరం తీరిగ్గా మా హాల్లో కూర్చుని ఉన్న సమయంలో మా నాన్నగారు ఆమెతో

"మూడేళ్ళు కువైటులో ఉండి ఏం సంపాదించావే సుబ్బీ? పిల్లోళ్ళ కోసం ఏమన్నా కాస్త డబ్బు కూడబెట్టావా? లేక సంపాదించిన డబ్బంతా – స్నేహితులకు పెట్టి పాడు చేసుకున్నావా? " అని అడిగారు.

మా నాన్న ప్రశ్నతో ఆమె కాస్త కలవరపడింది.

బదులుగా ఆమె "లేదు మామా! పదివేలు పెట్టి బంగారు హారం ఒకటి నా మెడలోకి కొనుక్కున్నాను. ఇరవై వేలతో వడ్లు పండే పొలం ఒకటి కొన్నాను. ఇంకా పిల్లోళ్ళ చదువులకోసం ఇంటి ఖర్చులకోసం కావలసినంత డబ్బు అక్కడ్నించీ పంపుతూనే ఉన్నాను.

ఎంత సంపాదించినా ఏం లాభం మామా? ముదనష్టపు మొగుడు తాగుబోతై, పంపించింది అంతా తాగి తగలబెడుతున్నాడు. మొగాడు చక్కగా ఉండి పనిచేసి సంపాదించి పెళ్ళాం బిడ్డల్ని మర్యాదగా గౌరవంగా సాకితే ఆడది పిల్లలను వదిలి పెట్టి, డబ్బు సంపాదన కోసం దేశం కాని దేశం వెళ్ళి అక్కడ అగచాట్లు పడదు కదా? " అని వాపోయింది.

" సరే పోతే పోయినావులే అక్కడ మంచి తిండి తిని నీడపట్టున పనిచేసి సినిమా హీరోయిన్‌లా తయారు అయినావు. నాలుగు రూకలు కూడా సంపాదించుకున్నావు. అదే ఇక్కడ ఉంటే చేనులో పని, ఎండకు రోజంతా కష్టం చేయాలి కదా?

అందర్నీ నమ్మి సంపాదించిన డబ్బంతా వారికి ఇచ్చి మోసపోవద్దు. ఇక్కడ ఉన్న పిల్లోళ్ళను గుర్తుపెట్టుకుని భయంగా పని చేసుకుని గౌరవంగా బ్రతుకు" అని ఆమెకు మా నాన్న సలహా ఇచ్చారు.

ఆమె వరసకు మరదలు అవుతుంది కాబట్టి మా నాన్న ఆమెతో కాస్త తమాషాగా మాట్లాడుతూ బాధ్యతగా జాగ్రత్తలు చెప్పేవారు.

మరుసటిరోజు నేను బడికి వెళ్ళి ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి, ఆమె బాధపడుతూ తాను కువైటులో మొదట పడిన కష్టాలు మా అమ్మకు వివరించి చెపుతోంది.

"అక్కా ఈ త్రాగుబోతు మొగుడితో బాధలు పడలేక పిల్లలు చదువు కోసం పసిపిల్లల్ని వదిలి మనసు కఠినం చేసుకుని మన దేశం - మన ఊరు, మన వాళ్ళందరినీ వదిలి అంత దూరం ఎండలు మండే ఎడారి దేశం వెళ్ళాను. ఏదో అక్కడ కష్టం చేసి నాలుగు రూకలు సంపాదించుకుంటే పిల్లలకి మూడుపూటలా తిండి, కట్టుకోటానికి బట్టా కొదవలేకుండా జరపగలను. నాలుగు అక్షరాలు చదివిస్తే కష్టం చేయకుండా ఏదో ఒక ఉద్యోగం చేసుకుని వాళ్ళ బ్రతుకు వాళ్ళు బ్రతుకుతారు అనే ఆశతో అక్కడికి వెళ్ళి పని చేయడానికి తొందరపడ్డాను.

కానీ అక్కడ మీరు అందరూ అనుకున్నట్లు జీవితం అంత సుఖంగా ఉండదు అక్కా.

ప్రొద్దున్న ఐదు గంటలకు నిద్రలేస్తే రాత్రి పన్నెండు గంటలవరకు చేసినంత పని ఉంటుంది. తిండి తినడానికి కూడా టైం ఉండదు. నేను వెళ్ళిన మొదట్లో చాలా కష్టాలు పడ్డాను. అప్పుడు వేరే ఇంట్లో పనికి కుదిరాను ఆ ఇంట్లో యజమానురాలు (మామా) మంచిది కాదు. మహాకోపిష్టిది. సరిగా తిండికూడా పెట్టేదికాదు. భాషరాదు. పనిలో పొరపాట్లు చేస్తే కొట్టడానికి మీదకి వచ్చేది. భయపడి జ్వరంకూడా తెచ్చుకున్నాను. నాలుగు మాత్రలు మొహాన విసిరి, 'మింగి పనిచెయ్యి' అనేది. అన్నం తినడం చూస్తే మండిపడేది. ఆమె చూడకుండా చాటుగా కాస్త తిండి తినాల్సి వచ్చేది. ఆమె ఇంట్లో ఒక్క పనిమనిషి కూడా ఒక్క సంవత్సరం నిలబడి ఉండి పనిచేసిన పాపాన పోలేదు. చాలామంది ఆ కష్టాలు పడలేక, తిండి లేక పారిపోయారు. అక్కడ ఇల్లు శుభ్రం చేసి పిల్లల్ని చూసుకోవడం నా పని. అయితే ఒకసారి చిన్న పిల్ల పరిగెడుతూ కాలుజారిపడిపోయింది. అంతే ఆవిడ తన కాలి చెప్పుతో నెత్తిమీద కొట్టింది. అంతేకాకుండా మొహంపై నాలుగు దెబ్బలు కొట్టింది. బలంగా కొట్టడంతో అలాగే వెనక్కిపడ్డాను. పెదవులు చిట్లి రక్తం వచ్చింది. ఈ ఇంట్లో ఈ మామా దగ్గర పనిచేస్తే చచ్చిపోతానేమో, మరలా ఇండియా వెళ్ళి పిల్లల్ని కళ్ళతో చూడలేనేమో అని కృంగిపోయాను. దిగులుతో బాధపడిపోయి ఏడుస్తూ, శక్తి లేకున్నా కూడా పనిచేస్తూ ఉన్నాను.

ఇంటికి జాబు రాయాలన్నా నాకు చదువురాదు. ఎవరి దగ్గరైనా రాయించినా బయటికి వెళ్ళి పోస్ట్ చేయడానికి నన్ను పంపించరు. ఇంట్లోనే జైల్లో ఉన్నట్లు ఉండాలి. ప్రక్కన పొరుగువారితో ఏ సంబంధమూ ఉండదు. ఎవరితోనూ నోరు తెరిచి మాట్లాడకూడదు. మగవాళ్ళతో అస్సలు మాట్లాడకూడదు.

ఒకరోజు మా ఇంట్లోనే పనిచేసే బంగ్లాదేశ్ డ్రైవరుకు జాబు ఇచ్చి, డబ్బు ఇచ్చి బయటకు వెళ్ళినప్పుడు పోస్ట్ చేసి పిల్లలకు డబ్బు పంపించమని చెప్పాను. వాడితో మాట్లాడటం మా మామా చూసింది. అంతే గయ్యాళిగంపలా నా మీదకి వచ్చి 'వాడితో ఏం మాటలు నీకు? మగవాడితో ఆ గుసగుసలు ఏమిటి?' అని కొట్టింది.

నా బాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాలేదు. ఎవ్వరూ లేని ఎడారిదేశం అప్పటికి వాళ్ళ భాష కూడా రాదు. జైలు లాంటి ఇల్లు. వంచిన తల ఎత్తకుండా వాళ్ళ ముందర పనిచేస్తూనే ఉండాలి. ఏ అర్థరాత్రికో మా రూములోకి వెళ్ళి నాలుగుగంటలు పడుకోవటం.

మనదేశం, మన ఊరు, మన ఇల్లు విడిచి కొట్టినా, తిట్టినా ఒక టైములో దగ్గరికి వచ్చి కాళ్ళు పట్టుకునే మొగుడ్నీ, లోకం తెలియని చిన్న పిల్లల్ని వదిలి పలకరించే దిక్కులేని ఈ కువైటు దేశం ఎందుకు వచ్చానా? ఇపుడు నన్ను ఎవరు రక్షిస్తారు అని ఏడుస్తూ అన్ని దేవుళ్ళకూ మొక్కుకున్నాను. ఈ ఇంట్లోనుంచి బయటపడితే ఈ జుట్టు నీకు ఇచ్చి గుండు చేయించుకుంటాను స్వామీ వెంకటేశ్వరా అని తిరుమల స్వామికి మొక్కుకుని శనివారం ఉపవాసం ఉన్నాను.

అలా ఆరునెలలు ఆ ఇంట్లోనే కష్టంగా గడిచాయి. రెండు నెలల జీతం కూడా ఆ కువైటు మామా నాకు ఇవ్వలేదు. ఒకరోజు మా మామా స్నేహితురాలు వాళ్ళింట్లో పార్టీకి పిలిచింది. మా మామా పిల్లల్ని, మా అందరినీ తీసుకుని వాళ్ళింటికి వెళ్ళింది. ఆవిడ అక్కడివాళ్ళతో కబుర్లు చెపుతూ దూరంగా ఒక హాలులో ఉండిపోయింది. నేను బయట ఉన్న గార్డెన్‌లో పిల్లలను ఆడిస్తూ దిగులుగా

ఆలోచిస్తూ ఉన్నాను. ఈ సమయంలో ఇండియాలో నా పిల్లలు ఏం చేస్తున్నారో? బడికి వెళ్ళారో లేదో? అన్నం తిని నిద్రపోయి ఉంటారా? వాళ్ళ నాన్న ఈరోజు కూడా తాగి ఇంటికి వచ్చి ఉంటాడా? అని ఆలోచిస్తూ కళ్ళనిండా నీళ్ళు నింపుకుని సిమెంటు బెంచీపై కూర్చున్నాను.

పెద్దోడు అసలే అమాయకుడు. ఈ అమ్మను చూడనిదే ఒక్క నిమిషం స్థిమితంగా ఉండలేడు. అమ్మ కొంగు పట్టుకుని వెనకే తిరిగేవాడు. చెప్పిన పనులన్నీ బుద్ధిగా చేసి నన్ను సంతోషపెట్టేవాడు. పోయిన నెలలో పెద్దోడు రాసిన ఉత్తరంలో చిన్నోడి గురించి రాసాడు. ఆకాశంలో వెళ్ళే విమానం శబ్దం విన్నపుడల్లా వాడు ఇంట్లోంచి బయటకి వచ్చి పైకి చేతులు చాపి నిక్కి చూస్తూ 'అమ్మా విమానంలో కూర్చుని తొందరగా రా నాకు ఆకలేస్తోంది. చారు బువ్వ కలిపి పెట్టు' అని అరుస్తూ విమానం వెళ్ళిన దారిలో వెనుకే అరుస్తూ పరిగెడుతున్నాడట. పెద్దోడికి వాడిని పట్టుకుని ఇంట్లోకి తీసుకు రావడం కష్టం అవుతోందట. నా పిల్లల కోసమే కదా ఇంత దూరం అందర్నీ విడిచి సముద్రాలు దాటి ఈ ఎడారి దేశంలో వచ్చి పడ్డాను? డబ్బు సంపాదించాలని ఆశపడి పసిపిల్లోళ్ళని వదిలి కఠినమైన మనసుతో వచ్చేసాను. పిల్లలు ఎన్ని బాధలు పడుతున్నారో?

అందుకేనేమో దేవుడు నాకు ఇన్ని కష్టాలు పెడుతున్నాడు. మా సేతాని (మామా) కొట్టిన దెబ్బలు పచ్చిగా ఉండి నొప్పి పెడుతున్నాయి. కుడివైపు భుజం సలుపు పెడుతోంది. ఆకలి కడుపుని మెలిపెడుతోంది.

ఇంకొద్దిసేపు అలాగే ఉంటే స్పృహ తప్పి పోతానేమో అని భయంవేస్తోంది. ఇన్ని కష్టాలు ఎందుకు? ఎలాగో ఇక్కడి నుండి తప్పించుకుని మన దేశం వెళ్ళి పోతే అడుక్కుని తిని అయినా బ్రతకవచ్చు. రోజుకి రవంత గంజి నీళ్ళు త్రాగినా సంతోషంగా పిల్లలను చూసుకుంటూ ఉండొచ్చు. మన దేశంలో మన నేలలో మనవారి మధ్యలో ప్రాణం పోయినా ఆనందమే కదా? ఈ పరాయి దేశంలో ఇక్కడ దిక్కులేని చావు చస్తే పిల్లలకైనా ఆ విషయం తెలుస్తుందా?

ఇక్కడే చచ్చిపోతానేమో అనే ఆలోచనకే నాకు చాలా ఏడుపు వచ్చింది. అంతకు ముందు ఎన్నోసార్లు ఏడుపు వచ్చినా మా మా చూస్తే ఇంకా కొడుతుంది అనే భయంతో నా దుఃఖాన్ని ఆపుకునేదాన్ని. కానీ ఇపుడు బిగబట్టుకోవడం నావల్ల కాలేదు. అక్కడే ఆ సిమెంటు బెంచీపై చేరగిలబడి ముఖం చేతుల్లో దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగాను. ఆ చందమామ, నక్షత్రాలు నా వైపు జాలిగా చూస్తున్నాయి.

అంతలో వాళ్ళింట్లో పనిచేసే పనిమనుషులు కూడా అక్కడికి వచ్చారు. వాళ్ళలో ఒక తెలుగు డ్రైవరు అహ్మద్ అని కడప నుండి వచ్చినతను ఉన్నాడు. అతను నన్ను 'నువ్వు తెలుగుదానివా? ' అని పలకరించాడు. అవును అని సంతోషంగా చెప్పాను.

అప్పటికి ఎన్ని నెలలు అయిందో? నేను మన భాష మాట్లాడి, మన వాళ్ళని చూసి? అప్పుడు అతను నాకు భోజనం తెచ్చిపెట్టాడు. నేను పనిచేస్తున్న ఇంటిగురించి, మామా గురించి, నా కష్టం గురించి అడిగి తెలుసుకున్నాడు. చాలా బాధపడ్డాడు. భయపడద్దు అని ధైర్యం చెప్పాడు. కువైటు వాళ్ళతో మాట్లాడి నన్ను ఎలాగైనా ఇండియా పంపించేటట్లు చేయమని ప్రాధేయపడ్డాను. ఆ సహాయం చేస్తే ఎంతో రుణపడి ఉంటానన్నాను.

అప్పుడు అతడు కువైటులో అందరూ చెడ్డవాళ్ళు ఉండరని, పనిచేయడానికి మంచి ఇళ్ళు దొరుకుతాయని, అయితే ఆ ఇంట్లోనించి బయట పడటానికి మార్గం ఆలోచించాలని వారిని పాస్‌పోర్టు అడిగి తీసుకుని, వేరే ఇల్లు మారి పనిచేసుకునే విధానం చూడాలని చెప్పాడు. 'ఇంటికి తిరిగి వెళితే చేసి వచ్చిన అప్పులు ఎలా తీరుస్తావు? ఊర్లో అందరికీ మొహం ఎలా చూపిస్తావు? కష్టమైనా నిలబడి పనిచేసి, డబ్బు సంపాదించుకుని ఊర్లోకి పోతే నీకు గౌరవం కదా' అని ఎంతో ధైర్యం చెప్పాడు. ఆ సమయంలో అతడు నాకు దేవుడిలా కనిపించాడు.

అతడు ముస్లిం. కడపనుండి వచ్చి నాలుగేళ్ళుగా ఆ ఇంట్లో డ్రైవరుగా చేస్తున్నాడంట. మంచి ఇల్లట. మామా, బాబా చాలా మంచి వాళ్ళంట. జీతాలు బాగా ఇచ్చి పనివారిని గౌరవంగా చూస్తారంట.

'నీకు పుణ్యం ఉంటుంది. ఏదో ఒకటి చేసి నన్ను ఆ ఇంటినుండి విడిపిస్తే నీకు జన్మతా రుణపడి ఉంటాను' అహ్మద్ అని దీనంగా చెప్పాను.

అతడు మరుసటి రోజు మా ఇంటికి వచ్చి 'సుబ్బిది మా ఊరే. మాకు దగ్గర బంధువులు. ఆమెకు మీరు పెట్టిన వీసా, టిక్కెట్ల ఖర్చు నేను చెల్లిస్తాను. ఆమెను విడిచిపెడితే మా ఇంట్లో పనికి మా మామా పెట్టుకుంటుంది' అని బ్రతిమలాడాడు. చివరికి వారికి 200 దినార్లు చెల్లించి పాస్‌పోర్టు తీసుకుని, నన్ను వాడు పనిచేసే ఇంట్లోనే పిల్లల్ని చూసుకోవడానికి కుదిర్చాడు. ఎవరో ఏమో నాకయితే తెలియదు. కానీ నాకోసం అంత డబ్బు వాళ్ళకు ఇచ్చి అంత కష్ట పడి నన్ను మంచి ఇంట్లో పనికి పెట్టాడంటే వాడిని ఎలా నేను మరిచిపోతానక్కా. అహ్మద్ కూడా ఒంటరివాడే వాడికి పెళ్ళికాలేదు. పెళ్ళాం పిల్లలు లేరు.

ఇపుడు ఇంటికి జాబు రాయాలన్నా పిల్లలతో ఫోనులో మాట్లాడాలన్నా అహ్మదే అన్నిటికీ సహాయపడతాడు. నాకు ఏ కష్టం వచ్చినా నన్ను ఆదుకుంటాడు. పరాయి దేశంలో ఒంటరి బ్రతుకుల్లో పలకరించే దిక్కులేని చోట అలాంటివాళ్ళు ఉండబట్టే, మాలాంటి వాళ్ళు, నిలబడి అంతో ఇంతో సంపాదించుకోగలుగుతున్నారు. వాడు నాకు చేసిన సహాయం మరిచిపోగనా? ఎవరు నాకు చేస్తారు? దేవుడే వాడి రూపంలో వచ్చి నన్ను ఆదుకున్నాడు కదా? అందుకే అలా వాడితో స్నేహం కుదిరింది అక్కా. నా కష్టం నాబాధ వాడిదిగా బావించినపుడు వాడు నాకు బంధువే కదా? పరాయివాడు ఎలా అవుతాడు? ఇది తప్పా? " అని అమాయకంగా ప్రశ్నించింది మా పిన్ని.

అప్పుడు మా అమ్మ "పిల్లోళ్ళను వదిలి పెట్టి అక్కడ ఆ పరాయిదేశంలో ఉండకపోతే ఏం? మన ఊర్లో ఉండి పూటకి కొంచెం గంజి తాగి బ్రతికినా గౌరవమేకదా? నిజమే ఆ అహ్మదు నీకు చాలా మంచే చేసాడు. కానీ పరువు పోయాక ప్రాణం ఉండి ఏం లాభం? మొగుడికి, పిల్లలకి తెలిస్తే నీ బ్రతుకు ఎందుకు? వృధాకదా! తరువాత బాధపడి ప్రయోజనం ఏం ఉంది. ఇపుడే ఆలోచించు" అని చెప్పింది.

"ఇంకో మూడేళ్ళు అక్కడ ఉండి పనిచేసుకుని సంపాదిస్తే పిల్లల చదువులకు జీవితానికి సరిపోతుందక్కా! నేను వెళతాను. మూడేళ్ళు ఎంతలో తిరిగి వస్తాయి" అంటూ అందరికీ వీడ్కోలు చెప్పి పిల్లలకు మాయమాటలు చెప్పి వారిని మురిపించి భర్తతో పాటు వాళ్ళని పొలానికి పంపించి కువైటు వెళ్ళడానికి మరలా మా ఊరి బస్సు ఎక్కింది మా పిన్ని. పిన్ని త్రాగుబోతు భర్త మాత్రం పెళ్ళాం కువైటు వెళుతోందే అనే దిగులు లేకుండా సంతోషంగానే ఉన్నాడు. ఎందుకంటే సారాత్రాగడానికి దుడ్డు కువైటు నుండి పిన్ని పంపిస్తుంది కదా? మరి ఆమె తిరిగి వెళ్ళకపోతే ఎలా?

దాదాపు రెండు సంవత్సరాలు గడిచిన తరువాత బాగా సారా త్రాగిన పిన్ని భర్త లివర్ చెడిపోయి చనిపోయాడు. ఆ వార్త ఫోను ద్వారా తెలుసుకున్న పిన్ని వెంటనే గోడు గోడున ఏడుస్తూ విమానం టిక్కెట్ బుక్ చేసుకుని మరుసటి రోజే పరిగెత్తుకుని ఊర్లోకి వచ్చింది. ఆమె వచ్చేటంతవరకు కడసారి చూపు కోసం ఆయన శరీరాన్ని అలాగే ఉంచారు. పాపం ఎన్ని బాధలు పెట్టినా కొట్టినా తిట్టినా ఎంతైనా కట్టుకున్న భర్తకదా? పిన్ని దుఃఖం అందరి కంట్లో నీళ్ళు తెప్పించింది.

పిన్ని తన దగ్గర ఉన్న డబ్బు ఖర్చుపెట్టి ఆయనకు దహన సంస్కారాలు దశదిన కర్మలూ ఘనంగా జరిపించింది. భర్త త్రాగుబోతు అయినా ఏ ఒక్కరోజు పిన్నిని పోషించి, సుఖపెట్టకపోయినా కూడా పిన్ని అంత గొప్పగా ఆయన సంస్కారాలు జరిపించడాన్ని పిన్ని మంచి మనస్సును ఊరి జనం అందరూ కొనియాడారు.

నెలరోజుల తరువాత పిన్ని తిరిగి వెళ్ళడానికి టిక్కెట్టు తయారు చేసుకుంది. పిల్లోళ్ళను వాళ్ళ అన్న వదినకు అప్పగించింది. ప్రతినెలా వారి తిండికి చదువుకు సరిపోయే డబ్బు పంపిస్తానని మాట ఇచ్చి వారి కి ఏ తక్కువా లేకుండా అన్ని సదుపాయలు కల్పించి, మంచి తిండి పెట్టమని వారిని అర్థించింది. ఇంక రెండేళ్ళు మాత్రమే ఉండి తిరిగి వస్తానని చెపుతూ అందరికీ వీడ్కోలు పలుకుతూ - పిల్లల్ని కన్నీళ్ళతో కౌగిలించుకుని మద్రాసు వెళ్ళడానికి మా ఊరి బస్సుకోసం బస్టాండులో నిలబడింది. అప్పటికి పిన్ని పిల్లలు ఇద్దరూ కాస్త ఊహ తెలిసిన వాళ్ళు అయ్యారు. ఇద్దరూ ఏడుస్తూ వాళ్ళమ్మ చుట్టూ తిరుగుతున్నారు. వారి చిన్ని హృదయాలు ఎంతగా కలవరపడుతున్నాయో పాపం. పిన్ని కూడా దుఃఖం ఆపుకోలేకపోతోంది. మళ్ళీ ఎపుడు చూస్తానో అన్నట్లు పిల్లల మొహాల్ని మరీ మరీ కళ్ళారా చూస్తోంది.

ఇంక కొద్దిసేపటిలో బస్సు వస్తోంది అనగా పెద్దోడు ఏడుస్తూ అమ్మ కాళ్ళు గట్టిగా పట్టుకున్నాడు. " అమ్మా.. నువ్వు మమ్మల్ని విడిచి కువైటు దేశం వెళ్ళవద్దు. ఇపుడు నాయన కూడా లేడు మమ్మల్ని చూడటానికి.

ఊర్లో అందరూ 'మీ అమ్మ మిమ్మల్ని వదిలిపెట్టి ఆ కడప అప్పాదు కోసం తిరిగి కువైటు వెళుతోంది. ఇంక మీకోసం తిరిగిరాదు' అని అంటున్నారే? నువు లేకపోతే మేము ఎలా బ్రతకాలి? నువు వెళ్ళద్దే? ఇపుడు నేను బడి మానేసి పనిలోకి వెళ్ళి డబ్బు సంపాదించి నీకు తిండి పెడతాను. తమ్ముణ్ణి బడికి పంపించి చదివిస్తాను. నువు డబ్బుకోసం బాధపడవద్దు." అని పెద్దవాడు వాళ్ళమ్మ కాళ్ళని గట్టిగా చుట్టుకున్నాడు.

ఏ విషయం అయితే బిడ్డలు వినకూడదని, వారికి తెలియకూడదని పిన్ని తాపత్రయపడిందో ఆ వినకూడని మాట పెద్దోడి నోట్లోంచి వినగానే పిన్ని రాయిలా నిలబడిపోయింది. అడుగు ముందుకు పడలేదు. ఒక్క క్షణం ఎంతైనా కన్నతల్లి హృదయం. బిడ్డలకన్నా ఈ ప్రపంచంలో తల్లికి ఏవీ ఎక్కువ కాదు.

బస్సు ఆ దారిలో హారను మోగించుకుంటూ కదలి ముందుకు వస్తోంది పెద్దోడి ఏడుపు ఎక్కువైంది. పిన్ని తన భుజానికి ఉన్న బ్యాగు తెరిచి విమానం టిక్కట్టు బయటికి తీసింది.

ఊరి జనాలు కొందరం పెద్దోడిని సముదాయించాలని ప్రయత్నిస్తున్నారు. బ్యాగులోంచి తీసిన టిక్కటును పిన్ని ముక్కలుగా చించి అక్కడే రోడ్డులో పడవేసింది. పెద్దోడిని ఒక చేత్తో చిన్నోడిని మరో చేతితో దగ్గరకి పొదుపుకుని వెనుదిరిగి ఇంటివైపు అడుగులు వేసింది.

పెద్దోడి కళ్ళు సంతోషంతో మిలమిలా మెరిసాయి.

చిన్నోడు చిరునవ్వులు చిందిస్తూ వాళ్ళ అమ్మను హత్తుకుపోయాడు.

****

*తరువాత కొన్ని యేళ్ళకి నేనూ కువైట్ వచ్చాక మరికొన్ని విశేషాలు గమనించాను.*

*కువైటు వాళ్ళు విదేశాలనుంచి వచ్చిన పనిమనుషులకి రెండేళ్ళకు ఒకసారి రానుపోను స్వదేశానికి విమానం టిక్కెట్లు, రెండు నెలల సెలవులు, ఆ సెలవలకి కూడా జీతాలు ఇచ్చి ఎన్నో బహుమతులు వాళ్ళకి, ఇంటివద్ద ఉన్న వాళ్ళ పిల్లలకి ఇచ్చి పంపిస్తారు. పిల్లలంటే వాళ్ళకి చాలా ఇష్టం. కువైటు దేశంలో ఆడవాళ్ళు పిల్లల్ని ఎక్కువగా కనడానికి ఆసక్తి చూపిస్తారు. ఎంత ఎక్కువ మంది సంతానం కలిగి ఉంటే అంత గొప్ప, గౌరవంగా వాళ్ళు భావిస్తారు. ఇక్కడి ప్రభుత్వం ఆ కుటుంబానికి, పిల్లలకి తగిన అవసరాలు చూస్తుంది.*

వాళ్ళు ధనవంతులు కాబట్టి ఒకసారి వేసుకున్న బట్టలు, చెప్పులు వాడిన బ్యాగులు, వాచీలు మరలా వాడరు. అలాంటి విలువైన బట్టలు, వస్తువులు ఒకటి లేదా రెండుసార్లు వాడుకుని తరువాత వాటిని అన్నింటినీ పనిమనుషులకే ఇచ్చేస్తారు. వాళ్ళు ఇచ్చిన వాటిని పనిమనుషులు అపురూపంగా దాచుకుని ఇంటికి వచ్చేటప్పుడు తీసుకొస్తారు.

కువైట్ దేశంలో త్రాగుడు ఉండదు. త్రాగుబోతులు అసలు కనిపించరు. ప్రభుత్వం దేశంలో మద్యం లేకుండా చట్టం అమలు చేసింది. అందుకే మగవారు ఏ దురలవాట్లు లేకుండా చాలా బాధ్యతగా కుటుంబాన్ని పోషించుకుని, భార్యల్ని సుఖపెడతారు.

మన భారతదేశంలో కట్నం ఇచ్చి భర్తల్ని కొనుక్కోవడంలాంటి సమస్య అక్కడ ఉండదు. ఎదురు కట్నం తీసుకుని ధీమాగా, గర్వంగా స్త్రీ వివాహం చేసుకుంటుంది. స్త్రీకి ఎంతో విలువ, గౌరవం, ఎన్నో హక్కులు ప్రత్యేకంగా అక్కడ ఉన్నాయి. మత సాంప్రదాయాలకు విలువనిచ్చే ఆడవారు బురఖా ధరిస్తారు. ఇష్టంలేని వారు మామూలు వస్త్రధారణతోనే ఉంటారు. బురఖా ఖచ్చితంగా ఆడవారు ధరించాలి అనే కట్టుబాటు అక్కడలేదు. అక్కడ యజమానురాలిని - మామా (అమ్మ) అని, యజమానిని బాబా (తండ్రీ) అని పనిమనుషులు ఆప్యాయంగా, గౌరవంగా పిలుస్తారు.

మన ఇండియానుండే కాక ముఖ్యంగా శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇండోనేషియా, నేపాల్ లాంటి ఇతర దేశాలనుండి కూడా పనిమనుషులు, పనుల కోసం కువైటుకి వచ్చారు. కువైటు వారి భాష అరబ్బీ అది రాకపోతే కువైటు వాళ్ళతోనూ ఇతరదేశాలనుండి వచ్చిన తోటపనివారితోనూ మాట్లాడటం చాలా కష్టం. అరబిక్ భాష కాస్త మాట్లాడేవరకూ నేర్చుకోవాలంటే కనీసం ఆరునెలలు పడుతుంది. ఈ ఆరు నెలలూ పనినేర్చుకోవడం, వారి భాష నేర్చుకోవడంతో సరిపోతుంది. మరోవైపు ఇంటిమీదా పిల్లలమీదా దిగులు ఉంటాయి. భాష నేరుకునేంతవరకూ వాళ్ళు ఏం తిట్టినా అర్థంకాదు. నవ్వుతూ ఉండాల్సిందే

కువైటులో వారిని "సలాం లేకుం" అని పలకరించాలి. అది వారికి ఎంతో గౌరవప్రదమైన పలకరింపు. బదులుగా వారు 'ఆలేకుం సలాం' అని అంటారు. "మీకు శాంతి కలుగుగాక" అనే మంచి అర్థం ఈమాటలో ఇమిడి ఉందట. క్రొత్తగా అక్కడికి వెళ్ళిన వాళ్ళు ఈ రెండు మాటల్ని తప్పకుండా నేర్చుకోవాలి.

## రంగి కథ

**ఎద్దు కొమ్మల్లాల ఉయ్యాలో..**
**ఇద్దరమె పుడితిమి ఉయ్యాలో**
**మనం పుట్టిన మూడేండ్లకు ఉయ్యాలో..**
**మన తలిదండ్రి చనిపాయ ఉయ్యాలో..**
**చాకలోళ్ళ అక్కలె ఉయ్యాలో**
**చలవ గుడ్డిచ్చి పెంచిరి ఉయ్యాలో..**
**పేదరాశి పెద్దమ్మ ఉయ్యాలో..**
**పెంచి పెద్దలు చేసె ఉయ్యాలో**
**పెంచి పెద్దలు చేసి ఉయ్యాలో**

## పెండ్లిళ్ళు చేసినె ఉయ్యాలో!!

చుక్కల కోకను ఎగగట్టి మడమలోతు బురదలోకి దిగి, పచ్చటి వరిపైరును వరసల్లో నాటుతూ.. మా రంగి ఉయ్యాల పాటలు పాడుతుంటే.. నా సామిరంగా.. తోటి మనుషులే కాదు. ఆకాశంలో ఎగిరే పక్షులు కూడా కాసేపు అక్కడే ఆగి ఆమె పాటను ఆలకించాల్సిందే. పాట విన్నవాళ్ళ ఒళ్ళు పులకించాల్సిందే.

రాగయుక్తంగా తాళం తప్పకుండా ఖంగున మ్రోగే కంచు కంఠంతో జోరుగా పాటను అందుకుందంటే తోటి కూలీలు కూడా రంగితో పాటు గొంతు విప్పి హుషారుగా వంత పాడాల్సిందే.

చుట్టుప్రక్కల పొలంలోని వారు కూడా గాలి మోసుకొచ్చే రంగిపాటను వినపడినంత మేరా ఆనందంగా వింటూ తమ పనులు చేసుకునేవారు.

పాటలే కాదు వరుసపెట్టి కథలు చెప్పడంలో కూడా మా రంగిని మించిన వాళ్ళు మా ఊర్లోనే లేరు. రంగి పిలవడం ఆలశ్యం పనివాళ్ళు పరిగెత్తుకుని పనులు చేయడానికి వచ్చేవారు.

పగలంతా ఎండనక, గాలనక పొలంలో రెక్కలు ముక్కలు చేసుకునే కష్టజీవులకు, పనిచేస్తూ పాడుకునే పాటలు, చెప్పుకునే కథలే వారికి అలసటను తీర్చి ఆనందాన్నిచ్చేవి. శరీర బడలికను తీర్చి కష్టాన్ని మరిపించేవి.

బడికి సెలవలొస్తే చాలు మేము కూడా మా అమ్మతో కలిసి ఉత్సాహంగా మా పొలానికి పరుగులు తీసేవాళ్ళం. చేనుగట్టుమీద, చెట్టునీడలో కూర్చుని రంగిచేత కోరిన పాటలు పాడించుకుని, కమ్మని కథలు విని వాటిని దారిపొడవునా పాడుకుంటూ గుర్తుచేసుకుంటూ సాయంత్రానికి ఇంటికి తిరిగి వచ్చేవాళ్ళం.

మా పాలేరు వెంగటయ్య భార్యే ఈ రంగి.

ఆలుమగలు ఇద్దరూ సంవత్సరం పొడవునా మా సేద్యం చేసి మా పంటలు పండించేవారు. పండిన పంటలో వారి కష్టానికి తగినట్లు కొంత భాగం వారికి మేము ఇచ్చేవాళ్ళం. అవసరానికి, కూలి డబ్బులు కూడా నెలజీతంలాగా అందించేవాళ్ళం. మడినాట్లకు, వరికోతలకు పంట నూర్పిళ్ళకు కూలీలను పిలిపించి అన్ని పనులూ బాధ్యతగా వాళ్ళే ముందువుండి చేయించేవాళ్ళు.

మా పొలంలో ముఖ్యంగా అరటి, వేరుశెనగ, పసుపు, నువ్వులు వరివంటి పంటలు ఆయా సీజన్లలలో ప్రతి ఏటా పండించే వాళ్ళం.

ఎంతో నమ్మకంగా వారి తాతల కాలం నుండి మా తాతల కుటుంబాలతో మొదలుపెట్టి మా వరకు మాతో కలసిపోయి మా పొలం పనులు, ఇంటి పనులు చేస్తూ మేము పెట్టింది తిని, ఇచ్చిన బట్టలు కట్టుకుని వాళ్ళ జీవితాన్ని సాగించేవాళ్ళు.

ఒక్కోసారి అరవై, డెబ్బైమంది కూలివాళ్ళు పొలంలో పనిచేస్తుంటే మా అమ్మ, పెద్దమ్మ వారికి సరిపడా రాగిసంకటి, పప్పు, పచ్చడి చేసి గంపలకి సర్దిపెట్టేవాళ్ళు. మధ్యాహ్నం సంకటి వేళకి రంగి, చేసే పని వదిలి ఇంటికి వచ్చేది. అలవోకగా నూట ఇరవై సంకటి ముద్దలు ఉన్న ఆ గంపను నెత్తిన పెట్టుకుని పొలానికి తీసుకు వెళ్ళేది. మా అమ్మ, పెద్దమ్మ కూరలు మోస్తూ రంగిని అనుసరించేవాళ్ళు.

వరుసలో కూర్చున్న కూలివాళ్ళకు చేతుల్లో సంగటి ముద్దలు పెట్టి, కూర పచ్చడి వడ్డిస్తే ఆకలితో ఉన్నవాళ్ళు, ఆవురావురుమని కడుపునింపుకునేవాళ్ళం. ఎడమ చేతిలో సంగటి ముద్ద కుదురుగా పెట్టుకుని, కుడిచేత్తో కూరను అద్దుకుంటూ ఎలా తినాలో మా రంగే నాకు నేర్పించింది.

పొలంలో వీచే పైరగాలికి కడుపులో ఆకలి కరకరలాడుతుంటే కూలివాళ్ళతోపాటు కూర్చుని సంకటి తింటుంటే ఆ రుచి అద్భుతంగా అనిపించేది. ఈ రోజుల్లో ఫైవ్‌స్టార్ హోటల్లో తినేతిండి ఏమ్రాత్రం దానికి సాటిరాదు.

పాటలు పాడుతూనే రోజంతా కథలు చెపుతూనే పనిలో మాత్రం అందరికంటే బారెడు దూరంలో ముందుగానే ఉండేది రంగి. రంగి పనిలోకి ఒంగిందంటే ఆమెతో పాటు మగవాళ్ళు కూడా పోటీపడలేకపోయేవారు.

చెట్లకు ఉన్న జామకాయలు, దొండకాయలు కోసి పిల్లలకి తినడానికి ఇచ్చేది. పెద్దోళ్ళకు వారి పనుల్లో సహాయపడి అవసరాల్లో ఆదుకునేది. తనతోటి వారితో స్నేహంగా మెలిగి తగినట్లు మాట్లాడి వారిని మెప్పించేది.

ఎర్రటి వంటి రంగుతో తీరైన ముక్కుమొహంతో, నుదుట పావలా కాసంత కుంకుమ బొట్టుపెట్టుకుని కళకళలాడుతూ ఉండేది రంగి. రంగిని చూసిన వాళ్ళందరూ ఆమె రైతుల ఇళ్ళల్లో పుట్టాల్సింది పొరపాటున ఊరి బయట ఇళ్ళల్లో పుట్టింది అనేవారు. ఎప్పుడూ నోటినిండా వక్కాకు (తమలపాకులు, వక్క, సున్నం) నములుతూ ఎర్రబడిన పెదవులతో దొరసానిలా కనిపించేది రంగి. అందరికీ తగిన సమాధానాలు ఇస్తూ తోటి కూలివాళ్ళను హెచ్చరిస్తూ అందరినీ నవ్విస్తూ ఎప్పుడూ నవ్వుతూ కబుర్లు చెప్పే ఆమె ఊరివారందరికీ తలలో నాలుకలా ఉండి ఒక లీడరులా అనిపించేది.

ఊర్లో ఉన్న రైతుల కళ్ళన్నీ రంగి మీదే ఉండేవి.

వయసులో ఉండి, వరసైన కొందరు పోకిరి కుర్రాళ్ళు రంగి వెంటబడి మాటలతో వేధించేవారు. మరికొందరు రంగి చెప్పిన పనిచేస్తూ ఆమె వెనుకే తిరిగేవారు.

ఆమె పాట, మాట నడక అన్నీకూడా అద్భుతంగా ఉండి అందర్నీ ఆకర్షించేవి. అల్లరి చేసే పోకిరి అబ్బాయిల్ని లెక్కచేసేదికాదు. అందర్నీ పురుగుల్లా విదిలించి పారేసేది ఆమె నోటి దురుసుతనానికి భయపడిన అల్లరివాళ్ళు ఆమె జోలికి వెళ్ళడానికి భయపడేవారు.

రంగి, ఆమె భర్త వెంగటయ్య చాలా అన్యోన్యంగా ఉండేవారు. ఒక్క నిముషం కూడా రంగిని వదిలి వెంగటయ్య ఉండేవాడు కాదు. ఎప్పుడూ రంగి వెనకాలే తిరుగుతూ ఉండేవాడు పనిలోకి కూడా ఇద్దరూ కలిసేవెళ్ళేవారు. వెర్రిబాగులోడు, అమాయకుడు నా మొగుడు నేను లేకపోతే ఎలా బ్రతుకుతాడో ఏమో? నన్ను చూడకుండా ఒక్కరోజు కూడా ఉండలేడు అని ముసిముసిగా నవ్వుతూ అందరితో చెప్పేది రంగి. మొగుడికి తనపై ఉన్న ప్రేమను గురించి, కథలుగా చెప్పి అందరినీ నవ్వించేది రంగి.

రంగి మాటలకు మురిసిపోతూనే ఉడుక్కునేవాడు వెంగకటయ్య. రంగికి ఇద్దరు పిల్లలు. పెద్దది లక్ష్మి. దానికి వాళ్ళమ్మ పోలికలే వచ్చాయి. బాగా తెలివైంది. రెండోపిల్ల పేరు సరస్వతి. అది వాళ్ళ నాన్నపోలిక. చామనఛాయ రంగులో అమాయకంగా ఉండేది. ఇద్దరి పిల్లలకు లక్ష్మి, సరస్వతుల పేర్లు పెట్టుకుని ముద్దుగా పెంచుతూ వాళ్ళని చూసి మురిసిపోయేవారు. కష్టమైన పనులు చేయనివ్వకుండా ఇద్దరు పిల్లలని బడికి పంపించేవారు. ఎంత కష్టం చేసి అయినా సరే సంపాదించి ఇద్దర్నీ బాగా చదివించాలని, వాళ్ళు మంచి ఉద్యోగాలు చేస్తే చూడాలని ఆశపడేవాళ్ళు.

రంగి తక్కువకులంలో పుట్టినా ఆమె అలవాట్లు, పద్ధతులు, మాటతీరు చాలా గొప్పగా ఉండేవి. పేదరికంలో పుట్టినా మనిషి నీటుగా ఉతికిన బట్టలు కట్టుకుని శుభ్రంగా కనిపించేది. కానీ ఆమె మనసులో ఎపుడూ పెద్ద పెద్ద ఆశలు, కోరికలు రెక్కలు కట్టుకుని ఎగురుతూ ఉండేవి.

పెద్ద ఇల్లు కట్టుకోవాలని, మంచి చీరలు కొనుక్కుని ప్రతిరోజూ మార్చి మార్చి రకరకాలుగా కట్టుకోవాలని బంగారం నగలు చేయించుకుని మెడనిండా వేసుకోవాలని ఆశపడేది. అదృష్టం కలిసి వస్తే అన్నీ కాళ్ళదగ్గరకి పరిగెత్తుకుని వస్తాయని ఆమె నమ్మేది.

వారానికి ఒకసారి మొగుడ్ని తీసుకుని టౌనుకు వెళ్ళి అక్కడ ఆడే మూడు సినిమాలు చూసి ఇంటికి వచ్చేది. ఆ సినిమా కథలన్నీ అందరికీ వివరంగా పూసగుచ్చినట్లు చెప్పేది. సినిమాలోని కమెడియన్స్ చేసే పనులు చెప్పే మాటలు యాక్షన్‌తో సహా చేసి చూపించి అందర్నీ నవ్వులతో నింపేది. 'అబ్బ రంగీ ఈ మాటలన్నీ ఎక్కడ నేర్చినావే? నవ్వలేక చచ్చిపోతున్నాము' అంటూ ఊళ్ళో వాళ్ళు హాయిగా నవ్వుకునేవాళ్ళు. రంగి ఎక్కడ ఉంటే అక్కడ జాతర జరుగుతున్నట్లు సందడే సందడి.

అప్పట్లో రాజమ్మ అనే ఆవిడ రంగికి మంచి స్నేహితురాలు. ఆవిడకి చిన్న వయసులోనే అర్ధాంతరంగా భర్త చనిపోవడంతో తన ముగ్గురు పిల్లల్ని పోషించుకోవడానికి కువైటు దేశం వెళ్ళింది. డబ్బు సంపాదన కొరకే కాదుగానీ పల్లెటూర్లలో భర్త వదిలేసిన స్త్రీలు, భర్త చనిపోయిన స్త్రీలు వయసులో ఉండి ఒంటరిగా ఉంటే ఎంతమంది మగవాళ్ళు వెంటబడతారో? ఏవిధంగా వేధిస్తారో ఏ పరువు తక్కువ మాటలు వినాల్సి వస్తుందో అని పెద్దవాళ్ళు భయపడి ఇలాంటి ఒంటరి స్త్రీలను కువైటుకు పంపించడమే తగిన మార్గంగా భావించేవాళ్ళు.

చేనుదగ్గరికి, మడిదగ్గరికి పంపించి పొలం పనులు చేయించడం కంటే కువైటు పంపిస్తే సుఖపడుతుందని బాగా డబ్బు సంపాదించుకుని తిరిగి వస్తుందనే ఆశతో - వీరికి వెంటనే వీసాలు తెప్పించి అప్పో సొప్పో చేసి టిక్కట్లు కొని కువైటుకు పంపించేవారు.

బాగా డబ్బున్న వాళ్ళు, భర్తలు సంపాదించి పెట్టే కుటుంబాల్లోని స్త్రీలు పెళ్ళికాని అమ్మాయిలు కువైటుకు వెళ్ళేవారు కారు.

భర్తలు తాగుబోతులై, కొడుతూ, తిడుతూ డబ్బు సంపాదించకుండా ఇంట్లోకి తిండికి కూడాలేని పరిస్థితుల్లో భర్త పెట్టే బాధలు భరించలేని స్త్రీలు, ఏదో విధంగా కువైటు వెళ్ళి డబ్బు సంపాదించుకుంటూ ఈ భర్త పెట్టే బాధలు మరిచిపోయి దూరంగా హాయిగా ఊపిరి పీల్చుకుందాం అని తాపత్రయపడేవాళ్ళు.

మరికొందరు ఆడవాళ్ళు దేశంకాని దేశం వెళ్ళడం డబ్బు సంపాదించడం పరువు తక్కువగా, అవమానంగా భావించేవారు. అందంగా ఉన్న ఆడవాళ్ళని బొంబాయిలోనే అమ్మేస్తారని కువైటులో సేఠ్‌లు ఇండియాకు తిరిగిరానివ్వకుండా అక్కడే ఉంచుకుంటారని ఆడవాళ్ళు అక్కడి సుఖాలకు అలవాటు పడి, క్రొత్తస్నేహాలు చేసి ఇంటిని, ఊరుని మరిచిపోతారని అపోహలు పెంచుకుని కొందరు కువైటు అంటేనే మండిపడేవారు.

"అక్కడ పని సరిగ్గా చెయ్యకపోతే బూట్లకాళ్ళతో తంతారంట. కుశాలాగా పరిగెత్తుకుని పోతుండావలే? నడుములు ఇరిగేటట్లు తంతారు సేఠ్‌లు. జాగ్రత్త" అని కుళ్ళుకుంటూ కొంతమంది వెళ్ళేవారికి హెచ్చరికలు చెప్పేవారు.

ఇలాంటి పరిస్థితుల్లో ఈ రాజమ్మ మూడేళ్ళు కువైటులో ఉండి మంచి ఇంటిలో పనిచేసి బాగా డబ్బు సంపాదించుకుని, నాలుగు సూట్‌కేసులు నిండా బట్టలు, సామాన్లు తీసుకుని ఊళ్ళో దిగింది. రాజమ్మ వచ్చిందనే వార్త తెలియగానే - స్నేహితురాలైన రంగి పరిగెత్తుకుంటూ వెళ్ళి పలకరించింది.

మెళ్ళో హారం, వ్రేళ్ళ నిండా ఉంగరాలు, చేతికి గడియారం పెట్టుకుని జపాను సిల్కు చీరలో మెరిసిపోతూ కనిపించింది రాజమ్మ. బ్యాగులు తెరిచి తన స్నేహితురాలైన రంగికి, తను తెచ్చిన చీరలు, నగలు, వస్తువులు అన్నీ చూపించి తన వైభోగాన్ని చాటింది.

రంగికి కూడా ఒక సిల్కు చీర, రెండు సబ్బులు, ఒక సెంటు బాటిలు గిఫ్టుగా ఇచ్చింది. కాలుమీద కాలు వేసుకుని మంచం మీద దర్జాగా కూర్చుని కువైటులో అనుభవించే సుఖాల గురించి కథలుగా చెప్పుకొచ్చింది. అందరికీ కథలు చెప్పే రంగికి రాజమ్మ చెప్పే

కువైటు కథలు బాగా నచ్చాయి. రాజమ్మ ఊళ్ళో ఉన్న రెండు నెలలూ రంగి ఆమె దగ్గరికి వెళ్ళి కువైటు గురించి విషయాలు ఆసక్తిగా వినేది.

ఆఖరికి .. 'థూ. ఏం బతుకు, ఈ బతుకు. ఎల్లకాలం కూలిపని చేసి కష్టపడి తినే బతుకు ఎందుకు? ఎలా అయినా సరే కువైటు పోవాల బాగా దుడ్డు సంపాదించుకుని రావాల. జల్సాగా బతకాల' అని రంగి గట్టిగా నిర్ణయించుకుంది.

పనీ, పాటా చేతగాని ఆ రాజమ్మే అంత సంపాదించుకుని వస్తే ఎర్రగా బుర్రగా ఉండి, పనీ పాటా తెలిసిన తాను ఇంకెంత సంపాదిస్తానో అని కలలు కనసాగింది రంగి.

ఎలాగైనా సరే కువైటు పోయి నాలుగేళ్ళు ఉండి దుడ్డు బాగా సంపాదించుకుని తిరిగి వస్తే తరువాత కూలిపని చేయకుండా ఎల్లకాలం రైతుల మోచేతి నీళ్ళు తాగకుండా, స్వతంత్రంగా బతకొచ్చు కదా అని ఆలోచించిన రంగి, ఆ విషయం మొగుడు వెంగటయ్య చెవిలో వేసింది

రంగికి ముందే తెలుసు, వెంగటయ్య చచ్చినా కువైటుకి పంపించడని. కానీ ఏది ఏమైనా ఏ విధంగా అయినా సరే మొగుడు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఎలాగైనా కువైటు వెళ్ళి తీరాల్సిందే అని రంగి గట్టిగా నిశ్చయించుకుని చిన్నగా వెంగటయ్యకు చెప్పింది.

రంగి చెప్పిన మాట వింటూనే వెంకటయ్య నిర్ఘాంతపోయాడు. కాసేపు నోట్లోంచి మాట కూడా రాలేదు. తరువాత ఆమె చెప్పిన విషయం అర్ధమయి అరికాల్లో నుండి కోపం ముచ్చిన ముంతలోకి చేరింది.

"ఎమ్మే రంగీ.. నేను చచ్చినాను అనుకున్నావా? బ్రతికే ఉన్నాను అనుకున్నావా? కువైటు పోతానని చెప్తాండావు? ఇది నీకు పుట్టిన బుద్దేనా? నన్ను వదిలి, పిల్లోళ్ళను వదిలి ఎట్టాబోతామే నువ్వు.

నేను ప్రాణంతో ఉండగా నువు ఎక్కడికీ బొయ్యేందుకు లేనేలేదు. నేను చచ్చినాంక నా పీనుగును దాటుకుని నువు పోవాల్సిందే అతి చేష్టలు చేసినావంటే పురుగులు మందు తాగి చస్తా. ఏమనుకున్నావో? ఆ తరువాత నీ ఇష్టం వచ్చిన చోటికి పోదువుగాని – నోరుమూసుకుని ఇంట్లో పడివుండు" అని ధైర్యం చేసి కోపంగా, రంగిపైన అరిచాడు వెంగటయ్య.

పెళ్ళి అయిన ఎనిమిది సంవత్సరాలలో ఇదే మొదటిసారి వెంగటయ్య అంత కోపంగా, ఆవేశంగా మాట్లాడటం. అయినా కూడా వెంగటయ్య కోపాన్ని రంగి లెక్కచెయ్యలేదు. అనుకున్నది ఏదైనా సరే సాధించుకునేంతవరకు రంగి నిద్రపోదు. అంత గట్టిపట్టుదల గలిగింది రంగి. వెంగటయ్యను ఎలా ఒప్పించాలో రంగికి బాగా తెలుసు.

"సరే మామా! నువ్వెందుకు సచ్చేది? నేనే చస్తాలే. నాలుగేళ్ళు కువైటులో ఉండి దుడ్డు బాగా సంపాదించుకుని వస్తే పిల్లలను బాగా చదివించుకోవచ్చు. పొలం కొనుక్కుని మంచి ఇల్లు కట్టుకోవచ్చు. ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారు. వాళ్ళ పెళ్ళిళ్ళు చెయ్యాలంటే చెవులకి కమ్మలు, ముక్కుకి ముక్కుపుడకైనా కావాలి కదా అనుకున్నాను. తప్పా?"

" ఎంతకాలం చిట్టే వాళ్ళ సేద్యం చేసి వాళ్ళు పోసిన కూట్నీళ్ళు తాగుతాం? ఎల్లకాలం కూలిపనులు చేస్తూ బ్రతికి పిల్లోళ్ళను కూడా కూలిపనికి పంపిద్దామా? నువ్వే చెప్పు" అని అన్నం తినకుండా అలిగి పడుకుంది రంగి. ఒకరోజంతా కోపంగా అలాగే గడిచింది. రంగి లేవలేదు.

ఎప్పుడు నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ అటూ ఇటూ తిరుగుతూ ఉండే రంగి ఏడుస్తూ అలిగి ఒక మూలన ముసుగేసుకుని పడుకునేసరికి వెంగటయ్యకి కాళ్ళూ చేతులు ఆడలేదు.

ఎనిమిదేళ్ళ కాపురంలో ఎపుడూ ఇలాంటి పరిస్థితి వెంగటయ్యకు ఎదురుకాలేదు. ఇపుడు రంగి మీద కోపం రాలేదు కానీ కువైటుకు రమ్మని పిలిచి ఆలుమగల్ని విడదీసే ఆ రాజమ్మ మీద వళ్ళు మండింది వెంగటయ్యకి. వెంటనే కోపంగా భుజాన గుడ్డ వేసుకుని రాజమ్మ ఇంటికి వెళ్ళాడు.

"ఎమ్మే.. రాజమ్మా నీకంటే మొగుడు సచ్చినాడు కాబట్టి కువైటు బొయినావు. నా పెళ్ళానికి ఎందుకు కువైటు గురించి చెప్పి నేర్పించి పాడుచేసినావు? నీకు బుద్ధి ఉందా" అని ఎగిరినాడు.

" నాతో ఏం మాటలు నీకు? మొగోడివైతే నీ పెళ్ళానికి నచ్చచెప్పుకో. కువైటుకి పంపించకుండా సంపాయించి, పెళ్ళాన్ని పిల్లోళ్ళను బాగా సాకు" అని ఈసడించి మొహాన తలుపు వేసుకుంది.

ఇక మాట్లాడేందుకు ఏమీ లేక నోరుమూసుకుని చక్కా ఇంటికి తిరిగి వచ్చాడు వెంగటయ్య. మెల్లగా వచ్చి రంగి పడుకున్న మంచం మీద ప్రక్కన కూర్చున్నాడు. రంగి మీద చెయ్యివేసి "రంగీ లేచి అన్నం తిను. నువు తినకపోతే, నేను తినని నీకు తెలుసుగదమ్మే.. లెయ్ మే! " అన్నాడు రంగి ఇంకా ముసుగు గట్టిగా బిగించుకుని మంచానికి అటువైపు తిరిగి వెక్కిళ్ళు పెట్టి ఏడవసాగింది.

రంగి కళ్ళల్లో నీళ్ళు చూస్తే వెంగటయ్య తట్టుకోలేడు. వెంగటయ్య మనసు కరిగింది.

"అదికాదే రంగీ నువు లేకుండా నేను ఒక్కరోజు కూడా ఉండలేనే రంగీ. నిన్ను చూడకుండా ఉంటే నాకు తిండి సయించదు. కంటికి నిద్రరాదు. నీకు తెలుసుకదే నన్ను వదిలి ఎట్టా కువైటుకు పోతావే" అన్నాడు వెంగటయ్య దీనంగా.

"నాలుగేళ్ళు ఎంతలో తిరుక్కొని వస్తాయి మామా! మన ఇద్దరం ఒకరి మొఖాలు ఒకరం చూసుకుంటూ బతికితే చాలా? మనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు కదా? వాళ్ళ బతుకు బాగుపడాలంటే దుడ్డు సంపాయించి వాళ్ళను బాగా సదివించాల గదా? మరి నన్ను కువైటుకి పంపించను, నిన్ను చూడకుండా ఉండలేను అంటే ఎట్టా? పిల్లలను నువ్వు భద్రంగా చూసుకుంటే నేను కువైటు పోయి తొందరగా తిరిగి వస్తాకదా" అంది రంగి.

"రంగీ.. మరే.. మరీ.., ఎర్రగా, బుర్రగా నీ మాదిరి వయసులో ఉండే ఆడోళ్ళు కువైటు పోతే అక్కడి సేఠ్‌లు తిరిగి మన దేశం పంపించరంటమ్మే. నువు రాకపోతే నేను ఎట్టా బతికేది? " అని తను భయపడే విషయం బయటకి చెప్పి కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు వెంగటయ్య.

మొగుడు ఏ విషయంలో భయపడుతున్నాడో రంగికి అర్ధమయింది. "అదేంది మామా ఆడదానిలా అట్ట ఏడుస్తావు? నా గురించి భయపడతావా? నా సంగతి నీకు తెలియదా? సేఠ్‌ను కాదు వాడి నాయన్ను గాదు ఎవడినైనా సరే నేను లెక్క చేస్తానా? ఎనిమిదేళ్ళు నీతో సంసారం చేసి ఇద్దరు బిడ్డల్ని కని నిన్ను మరిచిపోయి అక్కడే ఎట్టావుంటాను? కడుపుకు కూడు తింటానా? గడ్డి తింటానా? కడుపుకు కూడు తిని ఒంటికి గుడ్డ కట్టే ఏ ఆడది అయినా సిగ్గు విడిచి ప్రాణం పోయినా అట్టాంటి పనులు చేస్తాదా? కట్టుకున్న మొగుడ్ని మరిచిపోతాదా? నామీద నీకు నమ్మకం లేదా? " అని గట్టిగా మాట్లాడింది రంగి.

జపాను చీర కట్టుకుని వంటినిండా బంగారు నగలు పెట్టుకుని రెండేళ్ళ తరువాత దేవతలా మెరిసిపోతూ విమానం ఎక్కి ఊర్లోకి తిరిగి వచ్చే రంగిని ఊహించి చూసుకుంటూ అతికష్టం మీద సరే అని ఒప్పుకున్నాడు వెంగటయ్య.

వెంగటయ్య ఒప్పుకోవడం ఆలస్యం వెంటనే పాస్‌పోర్టు కోసం పరుగులు పెట్టింది రంగి. నెలరోజులు తిరక్కముందే పాస్‌పోర్టు తెప్పించుకుని కాపీలు తీసి ఏజంటు చేతికి ఇచ్చి అర్జంటుగా కువైటు వీసా తెప్పించమంది రంగి.

ఆ ఏజంటు ఇలాంటి వాళ్ళకోసమే ఎదురుచూస్తూ ఉంటాడు కాబట్టి "అలాగే రంగీ నీలాంటి హుషారయిన ఆడవాళ్ళు కువైటు పోతే డబ్బు వాగా సంపాదించవచ్చు. నీ పని చూసి మెచ్చుకుని కువైటు సేఠ్‌లు నీకు మంచి జీతం ఇస్తారు. తొందరగా నీకు వీసా తెప్పించే బాధ్యత నాది నువ్వు సంతోషంగా ఉండు" అని రంగికి నమ్మకం కలిగించాడు.

వాడు చెప్పినట్లే. వీసా తొందరగా వచ్చేసింది. "మెడికల్ చేయించడానికి విమానం టిక్కెట్టుకు డబ్బు తీసుకురా" అన్నాడు ఏజంటు.

ఉన్న ఒక్క మడికయ్య అమ్మితే ఎట్ట బతకాల అంటూ బాధపడే వెంగటయ్యకి నచ్చచెప్పి ఉన్న కాస్త పొలం అమ్మి వచ్చిన డబ్బు అంతా ఆ ఏజంటు చేతుల్లో పోసింది రంగి.

రంగి కువైటు వెళుతోంది అనే విషయం ఊర్లో అందరికీ తెలిసిపోయింది. "ఎమ్మే రంగీ! నువు కువైటు పోతే చిట్టే వాళ్ళ సేద్యం ఎవరు చేస్తారు? పొలం పనుల కాడ అలుపు లేకుండా ఇంక పాటలు ఎవరు పాడతారు? " అని వాళ్ళు అడగడం మొదలుపెట్టారు.

"నేను కువైటు వెళ్ళడానికి మామామ ఒప్పుకున్నాడు. మా రైతు కూడా సరే పోయి సంపాదించుకుని పిల్లలను బాగా చదివించు అని చెప్పాడు. అయినా, మా రైతుల సేద్యం చేయడానికి మామామ ఉన్నాడు కదా? నేను వెళ్ళి నాలుగేళ్ళలో తిరిగి రానా? " అని అడిగిన వారందరికీ సమాధానం చెప్పింది రంగి.

రంగి సంతోషంగా మెడికల్ చేయించుకుంది. విమానం టిక్కట్టు కూడా కొనుక్కుంది. వెళ్ళేరోజు దగ్గర కాగానే రాములవారి గుడికి వెళ్ళి టెంకాయ కొట్టుకుని దణ్ణం పెట్టుకుంది. కువైటు వెళ్ళు తిరిగి వచ్చేంత వరకు ఇద్దరు పిల్లలని, మొగుడ్ని చల్లగా చూడమని వేడుకొంది. తరువాత చీరకొంగు నోటికి అడ్డం పెట్టుకుని కాసేపు ఏడ్చింది. పిల్లలిద్దరిని దగ్గరకి తీసుకుని అన్ని జాగ్రత్తలు చెప్పింది.

కానీ వెంగటయ్య మాత్రం బాధను దిగమింగుకోలేక ఒకచోట కూర్చోలేక, నిలబడలేక దిగులుగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఏదో ఒకటి అడ్డం వచ్చి రంగి ప్రయాణం నిలిచిపోతే బాగుండును అని మనసులో తనకు తెలిసిన దేవుళ్ళను అందరినీ కోరుకుంటున్నాడు. కళ్ళల్లో తిరిగే కన్నీటిని మాటిమాటికీ ఎవరూ చూడకుండా పై గుడ్డతో వత్తుకుంటున్నాడు.

ఏ నిముషంలో అయినా మనసు మార్చుకుని మిమ్మల్ని వదిలి ఆ కువైటు పోను అని అంటుందేమో అని ఆశగా రంగి మొఖంలోకి చూస్తున్నాడు వెంగటయ్య.

వెంగటయ్య పరిస్థితి చూసి అత్త వరసైన కొందరు ఆడవాళ్ళు ఎగతాళి చేయడం మొదలు పెట్టారు.

"రంగి పోతే పోనీలే వెంగటా..! నేనున్నానుకదా నిన్ను చూసుకుంటాలే. నువు దిగులు పడమాకు" అని కిసుక్కున నవ్వింది ఒకావిడ.

"నువు బాధపడమాకు అల్లుడా. నా కూతుర్నిచ్చి పెళ్ళి చేస్తాలే నీకు" అంది నవ్వుతూ ఇంకొక ఆవిడ.

వాళ్ళ మాటలు, నవ్వులు వెంగటయ్య చెవిన పడటంలేదు. వెంగటయ్య మనసు మనసులో లేదు. జబ్బు వచ్చిన మనిషిలా తయారయ్యాడు వెంగటయ్య.

"మొగోడివి నువ్వే ఇంత దిగులుపడితే పిల్లలు ఇంకెట్టా? దిగులు పడతారు మామా. ధైర్యం తెచ్చుకుని పిల్లలని బాగా చూసుకో ఇట్లాబోయి అట్లా వచ్చెయ్యనా? " అంది రంగి. ఇంట్లో పనులన్నీ చక్కబెడుతూ.

పిల్లలను చూస్తూవుండమని ఇరుగుపొరుగు వారికి మరీ మరీ చెప్పింది. తరువాత మా ఇంటికి వచ్చి మా అమ్మ చేతులు గట్టిగా పట్టుకుని "నా బిడ్డలు కాదు శాంతమ్మా.. నీ బిడ్డలే అనుకుని వాళ్ళకి ఏం తక్కువ లేకుండా కడుపుకి తిండి పెట్టు. అవసరం అయితే

అయ్యకు చెప్పి దుడ్డు ఇప్పించు. నేను కువైటు నుంచి వస్తానే మీరు ఇచ్చిన దుడ్డు వడ్డీతో పాటు ఇచ్చేస్తా. మీ ఋణం నేను ఉంచుకోను. మీ కూట్నీళ్ళు తాగి బ్రతికిన వాళ్ళం. ఇవి చేతులు కాదు. కాళ్ళనుకో'' అని ఏడ్చింది.

''వద్దు అంటే కువైటు పోతా అని ఇన్ని రోజులు ఎగిరి, ఇపుడు నువు ఏడ్చేది ఎందుకు? సరేలే భద్రంగా వెళ్ళి తొందరగా తిరిగిరా. ఇద్దరు ఆడపిల్లలు తల్లి లేకుండా ఎలా ఉంటారు? '' అంటూ మా అమ్మ జాగ్రత్తలు చెప్పింది. ప్రక్కనే నిలబడి చూస్తున్న నన్ను చూసి ''నీకోసం కూడా కువైటు నుండి మంచి బొమ్మలు తెస్తా లలితమ్మా! నువు బాగా చదువుకో. మా లక్ష్మిని, సరస్వతిని కూడా బాగా చదువుకోమని చెప్పు'' అంటూ వీడ్కోలు పలికింది రంగి.

రంగి వెళ్ళే సమయంలో బస్సు ఎక్కేటప్పుడు కూడా ఆ చుట్టుప్రక్కల ఎక్కడా వెంగటయ్య కనపడలేదు. ''నువు వెళ్ళేది నేను ఈ కంటితో చూడలేను రంగీ నువు భద్రంగా పో'' అని చెప్పి కళ్ళు తుడుచుకుంటూ చేనుకాడికి వెళ్ళిపోయాడు వెంగటయ్య. ఆ రోజు చేను దగ్గర ఆ కాలువ నీటిలో ఎన్ని కన్నీళ్ళు కలిసి చేనులోకి పారాయో వెంగటయ్యకే తెలుసు.

మా ఇంటి బయట అందరూ కూర్చుని బస్సుకోసం ఎదురు చూస్తూ కువైటు గురించి తెలిసిన విషయాలు చెప్పుకుంటున్నారు. ఇంతలో రంగి చిన్న కూతురు సరస్వతి వాళ్ళమ్మ దగ్గరకి వచ్చి వడిలో కూర్చుని చేతితో వాళ్ళమ్మ గడ్డం పట్టుకుని ''అమ్మా ఒకసారి నువ్వు ఉయ్యాల పాటపాడమ్మా నాకు వినాలని ఉంది. మళ్ళీ నువు ఎప్పుడు వస్తావో...ఎప్పుడు పాటపాడతావో కదా'' అంది దిగులుగా.

ఆ సమయంలో ఆ పిల్ల మాటలకి రంగి హృదయంలో ఎన్ని సముద్రాలు పొంగి పొర్లాయో నాకు తెలియదు. ఆ వయసులో నాకు అంతగా అర్థం కాలేదుకానీ ఆ ఉయ్యాల పాటను పాడుతూ దుఃఖంతో గొంతు మూసుకుపోగా మధ్య మధ్యలో పాటను ఆపి పైట కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ ఏడుస్తూ జీరపోయిన గొంతుతో ఆ రోజు రంగి పాడిన ఆ ఆఖరు పాటను మాత్రం ఎప్పటికీ నేను మర్చిపోలేను. రంగి దుఃఖాన్ని చూసి పాట వింటున్న అందరి హృదయాలు కూడా బరువెక్కి వారి కళ్ళు తడిగా మారాయి.

ఆ రోజుల్లో కువైటు వెళ్ళే పనిమనుషుల్ని బొంబాయిద్వారా మాత్రమే పంపించేవారు. మద్రాసు, హైదరాబాదుల్లో వారికి ఇమిగ్రేషను దొరకదని. ఆఫీసర్లు ఇక్కడ వారికి కువైటు వెళ్ళడానికి అనుమతి ఇవ్వరని అనుకునేవారు.

అందువలన మా ఊరి ఏజంటు రంగిని బొంబాయికి తీసుకుని వెళ్ళాడు. అక్కడ బొంబాయిలోని ఏజంటుకు రంగిని అప్పగించి ఎయిర్‌పోర్టులో మంచి ఆఫీసర్లు, తెలిసిన వాళ్ళు డ్యూటీలో ఉన్న సమయంలో ఇమిగ్రేషను చేయించి రంగిని కువైటుకు పంపించమని చెప్పాడు.

అక్కడ బొంబాయిలో ఆ ఏజంటుకు ఒక ఆఫీసు దానికి ఆనుకుని ప్రక్కనే రెండుగదులు ఉన్నాయి. వీసాల గడువు అయిపోయిన వారు, టిక్కెట్టు తేదీలు కుదరని వారు, ఇమిగ్రేషను కుదరక ఎయిర్‌పోర్టు నుండి తిరిగివచ్చి వీలయిన ఇంకో రోజు ఇమిగ్రేషను కోసం ఎదురు చూసే వాళ్ళు, పాస్‌పోర్టు సమస్యలతో వెళ్ళలేక ఆగిపోయిన ఇమిగ్రేషను వారు ఆ గదుల్లో ఎన్నో రోజులనుండి ఉంటూ తెచ్చుకున్న డబ్బుతో తిండి కొనుక్కుని తింటూ కాలం గడుపుతున్నారు.

వారందర్నీ చూసి వారి సమస్యలన్నీ విన్న రంగి తనకు ఎపుడు ఇమిగ్రేషను అవుతుందో? టిక్కట్టు ఓ.కె అయి కువైటు వెళతానో అని కాస్త దిగులు పడింది. ఆలోచిస్తూ అక్కడే ఆఫీసులో కూర్చుంది రంగి.

అక్కడే కుర్చీలో కూర్చుని ఉన్న బొంబాయి ఏజంటు కింద కూర్చుని వున్న రంగిని పరిశీలనగా చూసాడు.

చక్కటి కనుముక్కు తీరుతో ఎర్రటి వంటి రంగుతో, అందంగా ఉన్న రంగిని చూసి ఆ ఏజంటు కళ్ళు మెరిసాయి. అతడి ముఖంలో చిరునవ్వు తొంగి చూసింది.

"ఏయ్ రంగీ ఇక్కడికిరా" అని పిలిచాడు. రంగి కలవరపడుతూ లేచి నిలబడింది.

"నువు వీళ్ళతో పాటు ఈ గదుల్లో ఉండలేవు కానీ.. నాతోపాటురా! నీకు కూడా నేనుండే చోట ఒక రూము ఇస్తాను అందులో ఉందువుగాని" అన్నాడు.

రంగికి ఏమి జవాబు చెప్పాలో తెలియలేదు. కాదంటే కోపం వస్తుందేమో, ముందే ఒంటరిగా ఉంది. తొందరగా ఇమిగ్రేషను చేయించి పంపిస్తే చాలు. అందుకే కాస్త మంచిగా మాట్లాడితే పనులు తొందరగా చేయించి కువైటు వెళ్ళే విమానం ఎక్కిస్తాడు అనుకుంది అమాయకంగా రంగి.

"సరే సారూ!" అంటూ తన బట్టలున్న సంచి చేతిలో పట్టుకుని ఆ ఏజంటుతో పాటు బయలుదేరింది రంగి.

అక్కడే ఆ రూముల్లో కొంతకాలం నుండి ఉంటున్న వాళ్ళు కొందరు రంగివైపు జాలిగా చూసారు. పాపం ఆ చూపులకు అర్థం తెలిసి ఉంటే ఆ ఏజంటు వెంట అలా వెళ్ళి ఉండేదే కాదు.

మరికొందరు ఏజంటువైపు చూసి ముసిముసిగా నవ్వారు. ఆ నవ్వులలోని అర్థం కూడా రంగికి అపుడు తెలియలేదు. తెలిసేవుంటే కాస్త ఆగి కొంచెం ఆలోచించి ఉండేది.

ఆ రాత్రి ఆ ఏజంటు రంగికి, చికెన్ బిరియానీ తెచ్చిపెట్టాడు. అది తిని ప్రయాణంతో అలసిపోయివున్న రంగి ఆ రాత్రి బాగా నిద్రపోయింది.

మరుసటి రోజు ఉదయాన్నే "రంగి! మంచిచీర కట్టుకుని తయారవు ఈ రోజు నీకు బొంబాయి చూపిస్తాను" అన్నాడు.

బొంబాయి చూడాలని ఎప్పటినుంచో రంగికి కోరిక. అయినా గదిలో కూర్చుని చేసేదేమీ లేదు. ఇమ్మిగ్రేషను అయి, టికెట్టు ఓకె కావడానికి ఇంకా రెండురోజులు పడుతుంది అని ఏజంటు చెప్పాడు. కాబట్టి బయటికి వెళ్ళి బొంబాయి చూడటమే మేలు. సరే అని తొందరగా తయారయింది రంగి. రాజమ్మ ఇచ్చిన జపాను సిల్క్ చీర కట్టుకుని పొడవైన జుట్టు క్రిందివరకు అల్లి రబ్బరు బాండు వేసి ముఖానికి పౌడరు అద్దుకుని బయలుదేరిన రంగిని, ఆమె వంపుసొంపుల్ని అందాన్ని కళ్ళార్పకుండా చూసాడు ఆ ఏజంటు.

అక్కడే పార్కు చేసి ఉన్న స్కూటరు బయటికి తీసి ఎక్కి తన వెనక కూర్చోమన్నాడు. అతని వెనుక కూర్చోవడానికి సంశయించింది రంగి. "టైమయిపోతోంది తొందరగా కూర్చో" అంటూ ఆమెను తన భుజం పట్టుకుని జాగ్రత్తగా కూర్చోమన్నాడు.

రంగికి అంతా కొత్తగా వింతగా ఉంది. కాదు కూడదు అంటే ఏమి అంటాడో అని ఒకవైపు భయం. అలా మొట్టమొదటిసారి పరాయి మగవాడి వెనుక భుజాన్ని గట్టిగా పట్టుకుని స్కూటర్పై కూచుంది రంగి.

ఊళ్ళో మామ ఎద్దులబండి తోలుతూ ఉంటే వెనక కూర్చోవడమే తప్ప ఇలా ఎపుడూ స్కూటర్పై కూర్చోలేదు రంగి. స్కూటరు వేగంగా బొంబాయి రోడ్డుపై వెళుతుంటే గాలిలో తేలిపోతున్నట్లే ఉంది రంగికి.

ఎక్కడ పడిపోతానో అని ఆ ఏజంటు భుజాల్ని ఇంకా గట్టిగా పట్టుకుంది రంగి. బొంబాయి అంతా త్రిప్పి చూడవలసిన ప్రదేశాలన్నీ బాగా చూపించాడు ఆ ఏజంటు. మధ్యాహ్నం లంచ్, రాత్రి డిన్నరు కూడా బయటే హోటల్లో తిని ఆలశ్యంగా రూముకు వచ్చారు.

మరుసటి రోజు మటన్ తెచ్చి రంగి చేతికి ఇచ్చి ఇంట్లోనే వంట చేయమన్నాడు. మధ్యాహ్నం ఇంటికి వస్తూ తనకి విస్కీ బాటిలు రంగికి బీరు బాటిలు తీసుకువచ్చాడు. రంగి ఎంత వద్దన్నా వినలేదు. "చాలా బాగుంటుంది. నువు తాగాల్సిందే" అంటూ ఫుల్గా తాగించాడు. తర్వాత జరిగిందేదో గుర్తులేదు. పొద్దున్నే గుర్తొచ్చినా చెయ్యగలిగిందేమీ లేకపోయింది.! అలా ఆరునెలలు గడిచిపోయాయి.

ఈ మధ్యలో అపుడపుడూ ఆ ఏజంటు తన స్నేహితులను కూడా రూముకు పిలిచి పార్టీలు ఇచ్చి వారితో పాటు కలిసి త్రాగేవాడు. రంగికి కూడా బాగా తాగించేవారు. మత్తు ప్రపంచానికి అలవాటుపడిందో, బానిసై పోయిందో తెలీని పరిస్థితి. !!

రంగికి తన ప్రపంచమే మారిపోయినట్లు ఉంది. ఒకవైపు పిల్లలు, భర్త ఊరు గుర్తొస్తున్నాయి. మరోవైపు కువైటు వెళ్ళాలి అనే కోరిక కదలాడుతోంది. ఇటు ఏజంటు టిక్కెట్టు ఓకే చేయించేమాట అసలు ఎత్తడం లేదు. రోజులు అలా గడుస్తున్నాయి. ప్రతిరోజూ రంగి ఆ ఏజంటును టిక్కెట్టు విషయం, కువైటు ప్రయాణం విషయం అడుగుతూనే ఉంది.

ప్రతిరోజూ రంగి ఆ ఏజంటును బ్రతిమాలుతోంది. తనను తన ఊరికైనా పంపించమని ప్రాధేయపడుతోంది. కానీ ఆ ఏజంటు రంగి మాట అస్సలు వినడం లేదు. ప్రతిరోజూ మూడుపూట్లా బిరియానీ భోజనం రెండుపూట్లా విస్కీ పానం అలవాటు చేసాడు. రంగికి మత్తులోనే దాదాపు కాలం గడుస్తోంది. తన మాట మారిపోయింది. ప్రాణానికి ప్రాణమైన తన పాటను కూడా మరిచిపోయింది. అపుడపుడూ తన పిల్లలు, భర్త వెంగటయ్య గుర్తు వచ్చేవారు. అపుడు కాసేపు కూర్చుని ఏడ్చేది.

మళ్ళీ సాయంత్రం అయితే యధావిధి ఏజంటు కార్యక్రమాలన్నీ మామూలే. ఈ మధ్య ఆ ఏజంటు రంగి ఎక్కడ పారిపోతుందో అని తన ఇంటికి బయట తాళం వేసుకుని ఆఫీసుకు వెళ్ళిపోతున్నాడు.

ఒక సంవత్సరకాలం మత్తుగా అలాగే గడిచిపోయింది.

ఇక్కడ వెంగటయ్య, భార్య రంగి కువైటు నుండి ఉత్తరం రాస్తుందని ఫోను చేస్తుందని కంటికి కాయలు కాచేలా ఎదురు చూస్తూనే ఉన్నాడు. కువైటు నుండి వచ్చేవాళ్ళందరినీ కలిసి "మా రంగి ఎలా ఉంది? " అని అడుగుతూ ఉన్నాడు. అయితే వాళ్ళందరూ "రంగి కువైటులో లేదు" అనే సమాధానం చెపుతున్నారు.

వెంగటయ్యకు ఏమి చెయ్యాలో అర్ధంకాలేదు. అసలు రంగి బ్రతికే ఉందా? ఉంటే ఎక్కడ ఉంది? ఎలా ఉంది? ఏమయింది? ఎందుకు జాబు కూడా రాయలేదు అనే ప్రశ్నలతో వెంగటయ్య దిగులు చెందాడు.

ఒకరోజు ఊళ్ళో నుండి శేఖర్ అనే అతను ఏదో పనిమీద బొంబాయి వెళ్ళి తిరిగి వచ్చాడు. ఊళ్ళోకి వస్తూనే హడావిడిగా వెంగటయ్య దగ్గరకి పరిగెత్తుకుని వచ్చాడు.

"వెంగటయ్యా .. ఓ వెంగటయ్యా నీ భార్య రంగి కువైటు పోలేదు. బొంబాయిలో ఒకడితో తిరుగుతోంది. నాకళ్ళతో నేను చూసాను. నన్ను చూసి చాటుకు తప్పుకుని దూరంగా పోయింది. నువ్వేమో ఇక్కడ తిండి తినకుండా దానికోసం ఎదురు చూస్తున్నావు" అని ఆ చేదు వార్తను వెంగటయ్య చెవిలో వేసాడు.

ఆ వార్త వినగానే వెంగటయ్య కాళ్ళ క్రింద భూమి కదిలింది. నిలబడలేక క్రిందకూలబడ్డాడు. నమ్మలేని నిజం వెంగటయ్యను క్రుంగదీసింది.

మెల్లగా లేచి శక్తి కూడదీసుకుని బొంబాయి వెళ్ళి ఎలాగైనా రంగిని వెతికి పట్టుకుని ఊళ్ళోకి తీసుకురావాలని నిశ్చయించుకున్నాడు.

మా నాన్న దగ్గరికి వచ్చి కాళ్ళు పట్టుకుని ఏడుస్తూ "అయ్యా చూసావా అది ఎంత పనిచేసిందో? కువైటు పోవద్దు అంటే పోతా అని పోయింది. ఇపుడు అది కువైటులో కాదు బొంబాయిలోనే ఉందట. ఇన్నిరోజులూ దాని జాబుకోసం చూసి చూసి, పిల్లలు నేను నిద్రాహారాలు మాని దిగులు పడినాము. అది ఈ మాదిరిగా తెలివి తక్కువపని చేసింది అంటే నేను నమ్మలేకుండా ఉన్నాను. దానికి

ఏమయిందో ఏమో? నేను మన ఊరి ఏజంటును తీసుకుని బొంబాయి వెళ్ళిదాన్ని తీసుకుని వస్తాను. నాకోసం కాకపోయినా పిల్లలకు తల్లి కావాలి కదా? " అన్నాడు.

వాడి ఏడుపు చూసి మా నాన్నకు జాలికలిగింది. "సర్లే పోయి దాన్ని తోడుకునిరా. ఈ సంగతి ఊర్లో ఎవరికీ చెప్పకు" అని రెండు వేలు డబ్బు జేబులోనుండి తీసి బొంబాయి వెళ్ళడానికి ఖర్చులకోసం వెంగటయ్యా చేతిలో పెట్టాడు మా నాన్న.

❦❦❦

మా ఊరి ఏజంటుతో కలిసి రైలు ఎక్కి బొంబాయి వెళ్ళాడు వెంగటయ్యా. వెళ్ళాక బొంబాయి ఏజంటు కాళ్ళు పట్టుకుని "ఒక్కసారైనా దానిముఖం చూడాలి" అని ప్రాధేయపడ్డాడు పడ్డాడు వెంగటయ్యా. అతన్ని విడవకుండా వెంబడిస్తూ మూడురోజులు అలాగే కూర్చున్నాడు. వెంగటయ్యా పోరుపడలేక రంగిని ఆఫీసు దగ్గరకి పిలిపించాడట. వెంగటయ్యాని చూడగానే మత్తంతా దిగింది. పిల్లలు, భర్త, మర్యాద గుర్తుకొచ్చాయి

వాడు రంగిని ఆఫీసు దగ్గరికి పిలిపించాడట. వెంగటయ్యాను చూడగానే భోరున ఏడుస్తూ కాళ్ళమీద పడిందట రంగి. ఆ సమయంలో ఆ భార్యాభర్తల హృదయాల్లోని వేదన మాటల్లో చెప్పనలవికాదు.

"సరే ఇక మన ఇంటికి పోదాం పద" అన్నాడట వెంకటయ్యా.

"ఏ మొహం పెట్టుకుని ఊళ్ళోకి వచ్చేది మామా? వచ్చి మళ్ళా నీతో ఎలా కాపురం చేసేది? " అని బాధపడిందంట రంగి.

"ఊళ్ళోవాళ్ళకు ఏమీ తెలియదులే. తెలిసినా చేసేది ఏముంది? మనం పిల్లలు నీకోసం దిగులుపడినారు. నువు బయల్దేరు, వెళ్ళిపోదాం ఇక్కడ నుండి" అన్నాడు వెంగటయ్యా.

పిల్లల మాట వినగానే రంగి హృదయం కదలాడింది. వెంటనే బయలుదేరింది.

❦❦❦

తలమీద చీరకొంగు, ముసుగు వేసుకుని బస్సు దిగింది రంగి. ఊళ్ళో ఎవరికీ మొహం చూపించలేకపోయింది. సిగ్గుపడుతూ కొన్ని రోజులు ఇంట్లోంచి బయటికి కూడా రాలేకపోయింది. ఊళ్ళోవాళ్ళకు తన గురించి తెలుసేమో, తనగురించి వాళ్ళు మాట్లాడుకుంటున్నారేమో అనే తలంపుతో ఎపుడూ దిగాలుగా ఉండేది రంగి. ముందులాగా హుషారుగా పాటలు పాడుతూ కథలు చెపుతూ ఊళ్ళో అందరికీ కబుర్లు చెప్పే రంగి నోరు మూగపోయింది.

ఊళ్ళో జనంకూడా ఏమే రంగి ఒక సంవత్సరంలోనే కువైటుకు వెళ్ళి తిరిగివచ్చేసావా? ఏం తీసుకొచ్చావు? ఇంతకీ కువైటు వెళ్ళావా?అని నవ్వుతూ అడగడం ఎక్కిరించటం ప్రారంభించేసరికి ఇంట్లోంచి బయటికి వచ్చేది కాదు. ఎవరితోనూ మాట్లాడలేకపోయేది. నువు నన్ను క్షమించి మళ్ళీ ఇంట్లో చేర్చుకున్నావు. కానీ నాకు ఊళ్ళో తలెత్తుకుని తిరగాలన్నా, అందరితో మాట్లాడాలి అన్నా. అవమానంగా ఉంది. మనం ఈ ఊరు వదిలి మా అమ్మగారి ఊరుపోదాం. అక్కడ కూలిపనిచేసి బ్రతుకుదాం అని మొగుడ్ని బ్రతిమాలుకుంది. వెంగటయ్యా కూడా ఒప్పుకుని సరే అన్నాడు.

మా సేద్యాన్ని వెంగటయ్యా చిన్నాయన కొడుక్కి అప్పగించి పిల్లలు ఇద్దర్ని తీసుకుని ఒకనాడు వాళ్ళు మా ఊరు ఒదిలి వెళ్ళిపోయారు. రంగి వెళ్ళిపోయింది. కానీ మా పొలం వైపు వెళ్ళినప్పుడల్లా రంగి పాటలే గుర్తొస్తాయి. ఆమె గొంతే ఆ పరిసరాల్లో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది.

❦❦❦

చదువురాని పల్లెటూరి ఆడవాళ్ళు బయట ప్రపంచం తెలియని వాళ్ళు కువైటు మీద మోజుతో, డబ్బు సంపాదించాలనే ఆశతో, ఒంటరిగా రంగుల ప్రపంచంలో అడుగు పెడితే వారి జీవితం ఎలా కష్టాల పాలవుతుందో ఈ రంగి కథే నిదర్శనం. రంగి ఒక్కటే కాదు. రంగిలాంటి ఆడవాళ్ళు ఎంతమంది ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారో? చెప్పుకోడానికి వీల్లేని పరిస్థితుల్లో చిక్కుకుని ఎంత మానసిక వేదన అనుభవించారో? ఎంత మంది చేత మోసగింపబడి అసహాయంగా, నిలబడి ఒంటరిగా రోదించారో? అంతంలేని కథలు ఈ ఎడారి కథలు. కాసుల కోసం ఆశతో కువైటు వెళ్ళాలని తాపత్రయపడి, ఆ ఎడారిలో ఎండమావులు మాత్రమే చూసిన అభాగినుల కన్నీటిగాథలు ఎన్నో.

# ఒక మేఘన కథ

**ఫట్‌మని బూటు** కాలితో ఒక్క తన్ను తన్నాడు సేఠ్.

దవడ ఎముక కదిలినట్లుంది. పెదవి చిట్లి రక్తం కారుతోంది. అలాగే నేలమీద కుప్పకూలిపోయింది మేఘన.

ఏం జరిగిందో అర్థమే కాలేదు. దెబ్బ బలంగా తగిలేసరికి తల తిరిగింది. కిందపడి ఉన్న మేఘనను జుట్టుపట్టి పైకి లేవదీసాడు సేఠ్. ఎదురుగా ఆరడుగుల ఎత్తులో ఉన్న సేఠ్‌ను, ఆయన కోపాన్ని చూసి గజగజా వణికిపోయింది మేఘన.

వెంటనే ఫటాఫట్‌మంటూ ఆ చెంపా ఈ చెంపా వాయించాడు.

బలమైన ఆ దెబ్బలకి విలవిల్లాడిపోయింది మేఘన.

మాట్లాడే శక్తికూడా లేనట్లు బేర్‌మని ఏడుస్తూ నేలమీదకి జారిపోయింది.

చెంపమీద తగిలిన దెబ్బలకి ఇపుడు ముక్కుల్లోంచి కూడా రక్తం ధారలుగా కారసాగింది.

అంతటితో ఆగలేదు సేఠ్.

మళ్ళీ జుట్టు పట్టుకుని పైకి లేవనెత్తాడు. సింహం నోటికి చిక్కిన ఎలుక పిల్లలా గిజగిజలాడింది మేఘన. చేతిలో పట్టుకున్న జుట్టును మెలితిప్పుతూ "చెప్పవే చెప్పు? నా పర్సులోని డబ్బు దొంగతనం చేసి ఎక్కడ దాచావో చెప్పు. ఎంత ధైర్యమే నీకు నా డబ్బు తీయడానికి? ఈరోజు నా చేతిలో నీ ప్రాణం పోయినట్లే మర్యాదగా చెప్పు. నువు చెప్పినా నీ ప్రాణం తీస్తా, చెప్పకపోయినా నీ ప్రాణం తీసేది ఖాయమే. తొందరగా చెప్పు" అంటూ హుంకరించాడు సేఠ్.

ప్రక్కనే ఉన్న రాజేశ్వరి గుడ్లప్పగించి రాయిలా నిలబడి చూస్తుండిపోయింది. కదలడానికి కూడా శక్తిలేకుండా పోయింది. ఏం మాట్లాడినా సేఠ్ తనను కూడా ప్రాణంతో ఉండనివ్వడు. ఇద్దర్నీ కలిపి తన్ని ప్రాణాలు తీసి ఎడారిలో పారేస్తాడు. మేఘన దుస్థితి తలచుకుని తల్లడిల్లింది రాజేశ్వరి. ఆమె కళ్ళల్లోంచి కన్నీళ్ళు ధారలుగా వర్షించాయి.

" ఏయ్ అలా బొమ్మలా కదలకుండా నిలబడ్డావే? కదులు తొందరగా. దీని బ్యాగులన్నీ వెతుకు నా డబ్బు ఎక్కడ దాచి పెట్టిందో చూడు. అన్నీ బయటికి తియ్" అన్నాడు సేఠ్ మేఘన జుట్టు వదలకుండా పట్టుకుని.

కీ ఇచ్చిన యంత్రంలా ముందుకు కదిలింది రాజేశ్వరి. కదలకపోతే వాడు అన్నంత పని చేస్తాడు. ముందు రాజేశ్వరి ప్రాణం తీసి తరువాత మేఘన అంతు చూస్తాడు.

పనిమనుషులంటే వీళ్ళకి పశువులతో సమానం. పశువునో, ఏదో కుక్కపిల్లనో కొట్టినట్లు ఉందిగానీ సాటిమనిషిని క్రూరంగా అమానుషంగా హింసించిన భావం వాడిలో ఏ మాత్రమూ కనిపించడంలేదు.

ఆరడుగుల ఎత్తులో బలంగా మొరటుగా ఉంటాడు సేఠ్. పోలీసు ఉద్యోగం చేస్తాడు కాబట్టి మనుషులతో కఠినంగా వ్యవహరిస్తాడు. వాడు గట్టిగా అరిస్తే చాలు పనిమనుషులు అక్కడ నిలబడే బట్టలు తడుపుకుంటారు.

వాడు ఇంట్లో ఉన్నాడంటే అందరికీ గుండెలు దడదడలాడుతుంటాయి. ఎప్పుడు ఎవరిమీద అరుస్తాడో, ఎవర్ని కొడతాడో అని భయంగా నోరు మెదపకుండా వాళ్ళ పనులు వాళ్ళు చకచకా చేస్తూ ఉంటారు.

ఈ రోజు వాడి చేతిలో మేఘన పడింది అంటే ఆ పిల్ల ఆయుష్షు ఈనాటితో మూడినట్లే. ఇంతకుముందు పనిచేయడానికి వచ్చిన పనిమనుషులందరూ వీడు పెట్టే హింసలకి భయపడి పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నవారే. ఒక్కరన్నా నిలబడి ఒక సంవత్సరం పాటు వీడి ఇంట్లో పనిచేసి జీతం సరిగ్గా తీసుకుని సంతోషంగా ఉన్న సందర్భాలు లేనేలేవు.

బయట ఎడారి ఎండ మండిపోతోంది. ఆ ఎండలాగే మేఘన దుస్థితి తలచుకుని రాజేశ్వరి గుండెకూడా మండిపోతోంది.

కానీ ఏమీ చెయ్యలేని నిస్సహాయత. దేశం కాని దేశం. అర్ధం కాని భాష.తప్పు యజమానులదే అయినా మాట్లడే హక్కులేదు. యజమానులు హింసించిన ఎదిరించే ధైర్యం లేదు. వాళ్ళ కాలికింద చెప్పులా అణిగి పడి ఉండాల్సిందే ఇక్కడ వీళ్ళు పనిమనుషులు బానిసల్లాంటి మనుషులు. డబ్బుకోసం, కడుపు నింపే తిండికోసం, బిడ్డల చదువుల కోసం. తనవారి ఆకలి తీర్చడం కోసం, అప్పుల బాధనుండి విముక్తి చెందడం కోసం కుటుంబంలోని అవసరాల కోసం అన్నీ విడిచి అందర్నీ మరిచి బంధాల్ని వీడి దేశాన్ని విడిచి ఎడారి దేశానికి జీవితాల్ని అంకితం చేసారు డబ్బుకోసం .

వీళ్ళ కాలికింద చెప్పుల్లా.. వినయంగా వంగి వంగి సలాములు చేస్తూ వీళ్ళు చెప్పిన పనులు చేస్తూ, తిడితే నవ్వుతూ, కొడితే ఏడుస్తూ రోషం కోపం అభిమానం చంపుకుని చచ్చిన శవాల్లా దినార్ల కోసం పరాయి దేశంలో పడరాని పాట్లు పడుతూ మనసు అక్కడ తనవారి మధ్య తన నేలమీద తన ఊరిలో తన ఆప్తుల మధ్య తిరుగుతూ ఉండగా ఇక్కడ శరీరాన్ని వీళ్ళ సేవలకు అప్పగించి కరిగే కాలాన్ని లెక్కబెడుతూ విముక్తి ఎపుడో తెలియక జీవితాన్ని ఎడారికే అర్పించిన వాళ్ళు వీళ్ళు. ఎందుకు ఇలా జరుగుతోంది? ఎవరిదీ తప్పు? ఆకర్షించే డబ్బుదా? కడుపులు నింపలేని పేదరికానిదా? మనదేశం కూడా ఇలాగే డబ్బులో మునిగి తేలుతుంటే మనకు కూడా వీళ్ళలాగే బంగళాలు, కార్లు, పనిమనుషులు ఉంటారా? ఇలా ధనిక దేశాలకు వచ్చి వీళ్ళకి సేవలు చేసి డబ్బు సంపాదించే అవసరం ఉండదు కదా? దేవుడా నువ్వంటూ ఉంటే మా భారత దేశాన్ని కూడా పేదరికం నుండి రక్షించి సంపదతో తులతూగేటట్లు చెయ్యి. అన్నింటికన్నా ముఖ్యంగా డబ్బుకోసం పనికోసం పరాయిదేశం వెళ్ళే దీనస్థితినుండి మమ్మల్ని కాపాడు. రాజేశ్వరి మౌనంగా తనలో తాను మాట్లాడుకుంటోంది.

వాడు చాలా దుర్మార్గుడని రాజేశ్వరికి బాగా తెలుసు. వాడిని చూస్తే చాలు కాళ్ళూ చేతులు ఆడవు. గుండెల్లోంచి వణుకు, వళ్ళంతా పాకి గజగజా వణికిపోతుంది. గబగబా అలమారా దగ్గరకి నడిచింది రాజేశ్వరి.

నేలంతా మేఘన రక్తం ధారలుగా కారిపోయి ఉంది. అడుగులు ఆ రక్తం పై పడగానే ఒళ్ళంతా జలదరించింది రాజేశ్వరికి.

రక్తం చూసి అయినా వీడి హృదయం కరగదా? దేవుడు వీడిని ఇంత దుర్మార్గుడిగా ఎందుకు పుట్టించాడో? మా ప్రాణాలు వీడి చేతిలో పోవడానికేనేమో?

" ఏయ్ ఏంటి ఆలోచిస్తున్నావు? తొందరగా దాని బ్యాగులన్నీ వెతుకు. డబ్బు కనిపించలేదంటే ఉంది దీని సంగతి. ఈరోజు ఉదయాన్నే ఇదే వచ్చి నా రూము శుభ్రం చేసింది. అక్కడున్న టేబుల్పై ఉంది నా పరుసు. అందులో ఉన్న డబ్బు రెండువందల దినార్లు

ఇంతలోపల మాయం అయిపోయింది. అందులోని డబ్బు ఇదికాకపోతే ఎవరు తీస్తారు? దొంగముండ.. దీని కత చెప్తా. ఈరోజు దీనికి నా చేతిలో పండగ ఉంది" అంటూ పళ్ళు కొరికాడు ఆవేశంగా సేట్.

అలమరా తెరిచి మేఘన సామాన్లు అన్నీ బయట వేసింది రాజేశ్వరి. ఒక్కొక్కటిగా తెరిచి అన్నింటిలోనూ వెదికింది. ఎక్కడా ఏమీ కనబడలేదు.

" బాబా ఇందులో ఏమీ లేదు" వణికే పెదవుల్ని బలవంతంగా పెగుల్చుకుని భయంగా అంది రాజేశ్వరి.

ఇంతలో బ్యూటీ పార్లర్‌కు వెళ్ళి వచ్చిన సేట్ భార్య కారు దిగి ఇంట్లోకి వచ్చింది.

" ఏం జరిగింది ఖాలిద్? ఎందుకు దాన్ని కొడుతున్నావు? " అని అడిగింది నవ్వుతూ.

" ఇది ఇంట్లో పనిలో చేరి ఇంకా నెలరోజులు కాలేదు. దీనికి ఎంత ధైర్యమో చూడు? నా పర్సులో డబ్బు దొంగతనం చేసింది ఇది. ప్రొద్దున్నే మన రూము శుభ్రం చేయడానికి వచ్చినపుడే దీని వాలకం చూసి ఇలాంటి పని ఏదో చేస్తుంది అని నాకు అనుమానం వచ్చింది. పోలీసు ఉద్యోగం చేసేవాడి పర్సులో నుండే దొంగతనం చేసిన దీన్ని బ్రతకనిస్తానా? చంపి కార్లో వేసుకుని తీసుకువెళ్ళి ఎడారిలో కాకులకు, గద్దలకు దీని శరీరాన్ని పారేసి వస్తాను. పనిచెయ్యడానికి పరాయి దేశం వచ్చినా కూడా ఈ దొంగబుద్దులు, డబ్బుమీద ఆశ వీళ్ళకి పోలేదు. వీళ్ళ బ్రతుకులు ఇంతే. తగిన బుద్ది చెపితేగానీ మరొకసారి ఇలాంటి పనులు మరలా చెయ్యరు" అంటూ జుట్టుపట్టుకుని లాక్కుంటూ బయట వరండాలోకి తీసుకు వెళ్ళాడు మేఘనని.

అక్కడ ఉన్న ఖర్జూరపు చెట్టు మొదట్లో మేఘనని నిలబెట్టి తాడుతో గట్టిగా కట్టేసాడు.

ఇంట్లోకి వెళ్ళి పోలీసులు దొంగల్ని కొట్టే కొరడాలాంటిది చేతపట్టుకుని నవ్వుతూ బయటకు వచ్చాడు.

అప్పటికే మేఘనలోని శక్తి హరించుకుపోయింది.

సేట్ భార్య విలాసంగా నవ్వుతూ అక్కడే ఉన్న సోఫాలో కూర్చుంది. తన మేకప్ ఎలా ఉందో అని అద్దంలో పరిశీలనగా చూసుకుంటోంది. ఆ అమానుషం అలవాటు అయినట్లు ఎప్పుడూ జరిగే తంతు అన్నట్లు నింపాదిగా పెదవులకు లిప్‌స్టిక్ అద్దుకుంటోంది.

బ్యూటీపార్లర్‌లో ఖర్చు పెట్టగా మిగిలిన డబ్బు ఇంకా ఆమె పర్సులో నిండుగానే ఉంది. ఆమె నిజం చెప్పదు. మూర్ఖుడైన ఆ సేట్ తన శాడిజాన్ని మేఘనపై చూపించక మానడు.

సేట్ చేతిలోని కొరడా మేఘన వంటిపై వాలింది. ఛెళ్ళుమనే కొరడా తగిలినంత మేరకు శరీరం చిట్లిపోయి తట్టు తేలింది.

ఇంకాసేపు ఆ ఎండలో అలాగే ఉంటే ఆ పిల్లప్రాణాలు గాలిలో కలిసిపోవడం ఖాయం.

రాజేశ్వరికి ఏం చేయాలో తోచలేదు. ఏమీ చెయ్యలేని నిస్సహాయతతో తనపై తనకే కోపం వస్తోంది.

ఏదో చెయ్యాలి. ఎలాగైనా సరే మేఘనని రక్షించాలి. అమాయకురాలైన ఆ పిల్ల ప్రాణాలు అమానుషంగా వీడి చేతిలో పోకూడదు.

వెంటనే వెళ్ళి సేతాని కాళ్ళు గట్టిగా పట్టుకుంది రాజేశ్వరి. " మామా.. దయచేసి బాబాను కొట్టొద్దు అని చెప్పు కావాలంటే నా జీతం నాలుగు నెలలు మీరు ఉంచుకోండి. పోయిన ఆ డబ్బులోకి జమ చేసుకోండి. అల్లా మిమ్మల్ని దయచూస్తాడు. ఆయన చల్లగా మిమ్మల్ని కాపాడతాడు. ఆ పిల్ల ప్రాణం తీయొద్దని బాబాకు మీరైనా చెప్పండి" అని దీనంగా ప్రాధేయపడింది రాజేశ్వరి.

ఏ మూడ్‌లో ఉందో ఆ సేతాని, లేకపోతే బ్యాగులో ఉన్న డబ్బు గుర్తొచ్చిందో కానీ వెంటనే " ఖాలిద్ ఇంక చాల్లే ఆపు ఇంకా కొడితే అది చస్తుంది. నువ్వు ఇంట్లోకి రా. నాకు ఆకలేస్తోంది. మనం లంచ్ చేద్దాం" అని సేట్‌ని పిలిచింది.

పెళ్ళాం మాటలు చెవిన బడగానే నాగస్వరం విన్న నాగుపాములా కొరడా పక్కన పడేసి వెంటనే ఇంట్లోకి వచ్చాడు సేఠ్.

హమ్మయ్య అని మనసులో నిట్టూర్చి తెలిసిన దేవుడికి దణ్ణం పెట్టుకుంది రాజేశ్వరి.

అంతటితో ఆ మారణకాండ ఆగదని తెలుసు. కానీ కనీసం అప్పటికి ఆపినందుకు రాజేశ్వరి సంతోషించి కాస్త ఊపిరి పీల్చుకుంది. రాజేశ్వరి ఒక సంవత్సరం రోజులుగా ఆ ఇంట్లో పనిచేస్తోంది. ఆ ఇంట్లో ఒక సంవత్సరంపాటు పనిచేసిన పనివాళ్ళు ఇంతవరకూ ఎవరూ లేరంట. అందరూ రెండు నెలలు చూసి ఈ సేట్ కొట్టే దెబ్బలకు తట్టుకోలేక బ్రతికుంటే బలుసాకు తినచ్చు అని భావించి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోయిన వాళ్ళే. పనిలో చేరినప్పటినుండీ వాళ్ళ పాస్‌పోర్టులన్నీ సేఠ్ దగ్గరే ఉంటాయి. పనివాళ్ళు చెప్పకుండా ఏ కారణం చేతనయినా విమానం ఎక్కి వాళ్ళ దేశం పారిపోతారేమో అని పనిమనుషుల పాస్‌పోర్టులను యజమానులు వారికి అందకుండా ఉంచుతారు. ఇలా పారిపోయిన వాళ్ళు (ఇండియా) వాళ్ళ ఎంబసీ వద్దకు వెళ్ళి వీళ్ళ దుస్థితిని వాళ్ళకి వివరించి ఆశ్రయాన్ని కోరతారు. ఎంబసీ జోక్యం కల్పించుకుని వీరి సమస్యలను వీలయినంతవరకు పరిష్కరించి వీళ్ళకి విమానం టిక్కట్లు కొని స్వదేశం చేర్చేవరకు ఆశ్రయం ఇచ్చి తన దేశ పౌరుల్ని రక్షించే బాధ్యత వహిస్తుంది.

యజమానులు పెట్టే బాధలకు తాళలేక పారిపోయి వచ్చినవాళ్ళు, పాస్‌పోర్టులు పోగొట్టుకున్నవాళ్ళు, రెసిడెన్సీ అయిపోయి మరలా వేయించుకునే శక్తిలేని వారందరు కూడా ఎంబసీ సహాయ సహకారాలతో మరలా స్వదేశం చేరుకుని తమవారిని చూడగలుగుతున్నారు. మరికొందరు పనివాళ్ళు నేరాలు, దొంగతనాలు చేసి కువైటు జైలులో బంధింపబడి కొన్ని ఏళ్ళుగా శిక్షలను అనుభవించేవారు కూడా ఉన్నారు.

మరి ఇపుడు కఠినాత్ముడైన ఈ సేఠ్ మేఘనని ఏం చేస్తాడో? కొట్టి చంపేస్తాడో? లేక దొంగతనం చేసిందని కేసుపెట్టి జైల్లో పెట్టిస్తాడో?

ఎలాగైనా మేఘనని కాపాడాలి. వీడి నిరంకుశత్వానికి ఏ తప్పూ చేయని ఈ అమ్మాయి బలికాకూడదు. ఎలా? ఇక్కడ నిజం బయటికి రాదు, బయటికి తెలియదు. కానీ ఇంతకుముందు కూడా ఇద్దరు పనిమనుషుల్ని ఇలాగే కొడితే వాళ్ళు చనిపోయారని వాళ్ళని కార్లో తీసుకుని ఎడారిలోకి వెళ్ళి పూడ్చి పెట్టేసి వచ్చాడని పనిమనుషులు గుసగుసలుగా చెప్పుకుంటారు.

ఇంతకీ ఈ మేఘన మన ఇండియా అమ్మాయే అనుకుంటున్నారా? ఇండియా అమ్మాయి కాదు. ఇండోనేషియా నుండి వచ్చింది. ఇరవై రెండేళ్ళ వయసులో తండ్రి చనిపోయి ఆదరణ లేని తన కుటుంబాన్ని పోషించుకోవడానికి కువైటు వచ్చింది. ముసలి తల్లికి ధైర్యం చెప్పి కువైటు వెళ్ళి బాగా డబ్బు సంపాదించుకుని వస్తానని చెప్పి చిన్నవయసులో ఈ పరదేశం వచ్చింది. రెండు నెలల క్రితమే ఏజంటు ద్వారా ఈ ఇంట్లో పనికి కుదిరింది. మేఘన అనే పేరు వినగానే పేరు చాలా బాగుంది ఇండియా అమ్మాయే అని అనుకుంది రాజేశ్వరి. కానీ ఇండోనేషియాలో చాలామంది పేర్లు, మన భారతదేశంలోని పేర్లనే పోలి ఉంటాయని అక్కడ హిందువులు చాలామంది నివశిస్తున్నారని వాళ్ళు మనకంటే ఎక్కువగా హిందూమత సాంప్రదాయాల్ని అనుసరిస్తూ పండగల్ని కూడా పద్ధతిగా ఆచరిస్తారని తెలుసుకుని ఆశ్చర్యపోయింది.

ఇండోనేషియాలో డబ్బుని "రూపాయ" అంటారని, వాళ్ళ విమాన సంస్థపేరు "గరుడ ఎయిర్‌లైన్స్" అని, వారి ప్రెసిడెంట్ పేరు మేఘావతి సుకర్ణపుత్రి అని తెలుసుకుని రాజేశ్వరి చాలా సంతోషించింది.

మేఘన కూడా హిందూ సంతతికి చెందిన పేద కుటుంబంలోని అమ్మాయి. వాళ్ళ కుటుంబానికి ఆధారమైన తండ్రి చనిపోవడంతో చదువు మధ్యలో ఆపేసి కువైటుకు వచ్చింది. చదువుకు తగిన మంచి ఉద్యోగం చూపిస్తానని ఆశ పెట్టిన ఏజంటు మేఘన దగ్గర డబ్బు బాగా తీసుకుని ఇక్కడికి తీసుకొచ్చి ఈ ఇంటిలో పనిమనిషిగా చేర్పించి సేఠ్ దగ్గరకూడా తనకు రావాల్సిన

కమీషను రాబట్టుకుని అడ్రస్ లేకుండా చక్కా పోయాడు. తిరిగి ఏజంటు దగ్గరికి వెళ్ళేదారి కనపడక మేఘన ఇలా ఈ ఇంట్లో చిక్కుబడిపోయింది.

పనిమనుషులు ఇలా రెండు మూడేళ్ళు ఓపికగా ఏ పొరపాటు జరగకుండా వారివద్ద పనిచేసిన తరువాత, అపుడు తమ దేశానికి వెళ్ళి, తన వారిని చూసి మరలా తిరిగివస్తామని, పాస్‌పోర్టు ఇచ్చి, సెలవిస్తే వెళ్ళొస్తామని ప్రాధేయపడితే ఈ సేఠ్‌కు కనికరం కలిగితే సరే అంటాడు. లేదంటే పనివారి గతి అధోగతే. కొందరు పాస్‌పోర్టులు సేఠ్ దగ్గరే విడిచి పెట్టి వీలు చూసుకుని పారిపోతారు. కొందరు ఎంబసీకి వెళ్ళకుండా బయట తెలిసిన వారి దగ్గర కొన్నాళ్ళు తలదాచుకుంటారు. ఎవరిదగ్గరైనా పనిచేసి కాస్త సంపాదించుకుంటారు.

కానీ ఇలా పారిపోయిన వాళ్ళపైన సేఠ్ ఏదో ఒక కేసు ఫైల్ చేస్తాడు. తన ఇంట్లో ఏదో విలువైన వస్తువో లేదా డబ్బో, బంగారమో దొంగతనం చేసి పారిపోయారని కేసు ఫైల్ చేస్తే వీళ్ళు కువైటులో భయపడుతూ చాటుమాటుగా పోలీసుల కంటపడకుండా ఎక్కడో మారుమూల బిక్కుబిక్కుమంటూ బ్రతకాల్సిందే ఏదో ఒకరోజు బయట పోలీసులకు కనిపిస్తే వాళ్ళు ఐడెంటిఫికేషన్ కార్డు చూపించమని అడిగినప్పుడు వీళ్ళదగ్గర ఐడి కానీ, ఏ పేపర్లు కానీ లేకపోతే అరెస్టు చేసి తీసుకెళతారు. ఎవరు? ఏమిటి? ఎక్కడి నుండి పారిపోయి వచ్చారు? ఏం చేసారు అని పరిశోధించి వారిపై ఉన్న కేసును స్టడీ చేసి కేసు తీవ్రతను బట్టి శిక్షను విధిస్తారు. శిక్షాకాలం పూర్తయ్యాక ఇంక మరలా గల్ఫ్ దేశాల్లో అడుగుపెట్టకుండా పాస్‌పోర్టులో "ఎర్రముద్ర" వేసి, చేతులకు సంకెళ్ళు వేసి ఎయిర్‌పోర్ట్ వరకు పోలీసులు తీసుకెళ్ళి విమానంలో కూర్చోపెట్టి వారి దేశాలకు పంపిస్తారు.

మరి ఇప్పుడు వీడి చేతిలో మేఘన చిక్కింది. తన పరిస్థితి ఎంత ఘోరంగా తయారవుతుందో తలచుకుంటేనే భయం వేస్తోంది.

సేఠ్, సేఠాని డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ భోజనం చేస్తున్నారు. వారికేం బాధ? బాగా డబ్బు ఉంది. ఒక పనిమనిషి పోతే - నలుగుర్ని తెచ్చుకుంటారు. సేఠాని బ్యూటీపార్లర్‌లో చేయించుకున్న పెడిక్యూర్‌ను, గోళ్ళరంగునూ మురిపెంగా నవ్వుతూ సేఠ్‌కు చూపిస్తోంది. తెల్లగా అందంగా ఉన్న సేఠాని చెయ్యి గోళ్ళరంగు వేసుకోవడంతో మరింతగా మెరిసిపోతోంది. సేఠ్ అరబిక్ భాషలో "ఆన హెబ్బక్ హబీబ్తి" (నువ్వంటే నాకు చాలా ఇష్టం మైడియర్) అంటూన్నాడు ఆమెకేసి తమకంగా చూస్తూ.

సేఠ్, సేఠానితో బిజీగా ఉండగా సమయం చూసుకుని వెనుకదారిగుండా, ముందర ఉన్న ఖర్జూర చెట్లకేసి పరుగుతీసింది రాజేశ్వరి. ఒక్కంగలో మేఘనను చేరుకుని వణికే చేతులతో తొందరగా కట్లు విప్పేసి తనతో పాటు తెచ్చిన నీళ్ళ బాటిల్‌లోని నీళ్ళతో మేఘన మొహం తుడిచి నీళ్ళు తాగమంది. బాటిల్‌లోని నీళ్ళన్నీ గటగటా తాగేసింది మేఘన. తన చేతిలో ఉన్న పది దినార్ల డబ్బును తనకు బంధువులైన వారి ఫోన్ నంబర్లు ఉన్న పేపర్ని చేతిలో పెట్టి వీధి తలుపు తెరిచి మేఘనను బయటికి తోసింది రాజేశ్వరి.

కన్నీళ్ళతో ఆఖరుసారిగా మేఘనను ఒక్కసారి హత్తుకుని వీపుపై తట్టి " నీకేం భయంలేదు. వీధిలో కనిపించిన టాక్సీని ఎక్కి మీ ఎంబసీకి వెళ్ళు. వాళ్ళు నిన్ను కాపాడతారు. నువు తొందరగా ఇక్కడ్నించి దూరంగా పారిపో" అంటూ తలుపు మూసేసింది. తరువాత పరిగెత్తుకుంటూ వెనుక దారిగుండా ఇంట్లోకి ప్రవేశించి తనకు ఏమీ తెలియనట్లు సేఠ్‌కు, సేఠానికి భోజనం వడ్డించే పనిలో పడింది. ఇదంతా జస్ట్ రెండు నిముషాల్లో జరిగిపోయింది.

ఆందోళన, ఆవేదన, వణుకు రాజేశ్వరిలో నిండుకుని వళ్ళంతా చెమటలు పడుతున్నాయి. మామూలుగా ఉండలేకపోతోంది.

" ఏమయింది నీకు? వళ్ళంతా ఆ చెమటలేమిటి? వెళ్ళి మొహం కడుక్కునిరా" అని అరిచాడు సేఠ్.

బాత్‌రూములోకి వెళ్ళి తలుపు మూసి అదిరే గుండెని అదుపులోకి తెచ్చుకుంది. చన్నీళ్ళతో మొహం కడుక్కుని కాస్త తెప్పరిల్లింది.

దాదాపు గంట తరువాత భోజనం చేసిన సేఠ్ లేచి నిలబడి " దాన్ని ఆ.. దొంగను పోలీస్ స్టేషనుకు అప్పగించి వస్తాను" అని ఖర్జూరపు చెట్టు దగ్గరికి వెళ్ళాడు.

ఎక్కడుంది మేఘన? అప్పటికే ఇండోనేషియా ఎంబసీ చేరుకుని తన గాయాలకు అక్కడ ఎంబసీ డాక్టర్ల దగ్గర చికిత్స చేయించుకుంటోంది.

" ఏదీ ఆ దొంగది? తప్పించుకుని పారిపోయిందా? నా చేతుల్లోంచి తప్పించుకుని ఎక్కడికి పోతుంది అది? దాని అంతు చూస్తా! కువైటు అంతా పోలీసుల చేత వెతికిస్తా" అంటూ చిందులు వేసాడు కోపంగా సేఠ్.

వెనకే వచ్చిన సేతాని "హబీబి.. ఖాలిద్ (డియర్ ఖాలిద్) మనం సాయంత్రం పార్టీకి వెళ్ళాలి కదా? ఇపుడు కాసేపు రెస్ట్ తీసుకుందాం పద. " అంటూ హొయలు వలికిస్తూ సేఠ్ చెయ్యి పట్టుకుని పడకగదిలోకి లాక్కెళ్ళింది.

ఒక్కసారి గట్టిగా ఊపిరి పీల్చుకుంది రాజేశ్వరి ఆ పూట అన్నం తినడానికి మనస్కరించలేదు. ఎండిపోయిన తన గొంతును ఒక గ్లాసు నీళ్ళు తాగి తడుపుకుంది. సేఠ్‌కు రాజేశ్వరి మీద అనుమానం రాలేదు. తనకు తానుగా మేఘన కట్లు తెంచుకుని పారిపోయింది అనే అనుకుంటున్నాడు. నాలుగురోజులు గడిచాక వీలుచూసుకుని తన చిన్నాన్న కొడుక్కి ఫోన్ చేసింది. వెంటనే వెళ్ళి ఇండోనేషియా ఎంబసీలో మేఘన ఉందేమో కనుక్కొని తనకు చెప్పమంది.

మేఘన క్షేమంగా వాళ్ళ ఎంబసీ చేరుకుందని వాళ్ళ పరిరక్షణలో కోలుకుంటోందని తెలిసి చాలా సంతోషించింది.

తరువాత మూడు నెలలకి ఇండోనేషియా ఎంబసీ ప్రత్యేకంగా ఇలాంటి శరణార్థులను వాళ్ళ దేశం పంపడానికి ఏర్పాటు చేసిన విమానంలో మేఘన ఇండోనేషియా చేరుకుంది. ఈ విషయం ఆమె అక్కడికి చేరుకున్నాక రాజేశ్వరి చిన్నాన కొడుక్కి ఫోను చేసి చెప్పగా అతడు రాజేశ్వరికి విషయం తెలిపాడు.

ఒక అమాయకురాలిని రక్షించిన సంతృప్తితో రాజేశ్వరి హృదయం చాలా ఆనందపడింది. ఆ రోజు ఆమె కంటినిండా నిద్రపోయింది. తనతోపాటు రెండు నెలలు కలిసి ఉండి, సమస్యల్లో చిక్కి తనదేశం చేరుకున్న మేఘన మళ్ళీ జీవితంలో ఎన్నడూ కనిపించకపోవచ్చు కానీ ఆ అమ్మాయి ఎక్కడవున్నా సంతోషంగా ఉంటే అదే చాలనుకుంది.

మేఘన గురించి ఆలోచిస్తుంటే రాజేశ్వరికి తను కువైటు వచ్చిన సంగతులు మదిలో మెదిలాయి.

కడప జిల్లాలోని ఒక గ్రామం నుండి తాగుబోతు అయిన భర్త పెట్టే బాధలు భరించలేక అతడితో తెగతెంపులు చేసుకుని అమ్మగారింట్లో ఒంటరిగా ఉండలేక కువైటుకు వచ్చింది. ఆమె దురదృష్టం ఏమిటోగానీ ఇక్కడికి వచ్చినా కూడా దుర్మార్గుడైన యజమాని ఇంట్లోనే పనికి కుదిరింది.

ఎంతో ఓపికగా, మెలుకువగా, వినయంగా వాళ్ళు చెప్పిన పనులు చేస్తూ ఒక సంవత్సరం కష్టంగా, భారంగా కాలం గడిపేసింది. మామూలుగా కువైటులో పనిమనుషుల కాంట్రాక్టు రెండేళ్ళు ఉంటుంది. అందువల్ల ఇంకో సంవత్సరం జాగ్రత్తగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పనిచేసి కాంట్రాక్టు కాలం రెండేళ్ళు పూర్తిచేసుకుని ఇండియా వెళ్ళాలని నిశ్చయించుకుంది.

కువైటులో చాలామంది యజమానులు పనివారికి స్వేచ్ఛను ఇవ్వరు. ఇరవైనాలుగ్గంటలూ వాళ్ళు పిలిచినపుడు ఏ వేళలో అయినా సరే వీళ్ళు పనిచెయ్యడానికి రెడీగా ఉండాలి.

ఆ ఇంట్లో నాలుగ్గోడల మధ్యే పనిచేస్తూ ఏళ్ళకు ఏళ్ళు కాలం గడపాలిసిందే

నవ్వడానికి, ఏడ్వటానికి, నచ్చిన తిండి తినడానికి, ఇష్టమైన బట్టలు కట్టుకోవడానికి లేదు. బయటికి వెళ్ళడానికి వీలులేదు. కొందరు పనిమనుషులకు నెలరోజులకు ఒకసారి శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలనుండి రాత్రి తొమ్మిది గంటలవరకు సెలవు ఇస్తారు.

ఆ రోజు వాళ్ళు సిటీకి వెళ్ళి స్నేహితులను, తమ బంధువులను కలిసి కష్టసుఖాలు మాట్లాడుకుని వస్తారు. నెల జీతం ఇంటికి పంపేవాళ్ళు, ఉత్తరాలు రాసి పోస్ట్ ఆఫీస్‌లోని డబ్బాలో వేసేవాళ్ళూ, ఇంటికి ఫోన్లు చేసేవాళ్ళు, షాపింగు చేసేవాళ్ళతో శుక్రవారం మధ్యాహ్నం కువైటు సిటీ జనాలతో నిండిపోయి చాలా రద్దీగా ఉంటుంది.

శుక్రవారం అంటే ఆట విడుపు.

శుక్రవారం అంటే సెలవు దినం.

శుక్రవారం అంటే స్వేచ్ఛకు నెలవైన దినం.

ఆ శుక్రవారం సెలవు కొద్ది మందికే లభిస్తుంది. అలా లభించిన వాళ్ళు అదృష్టవంతులు. వాళ్ళు మంచి ఇంట్లో పనిచేస్తున్నట్లు లెక్కలోకి వస్తారు.

రాజేశ్వరికి కూడా సెలవులేదు. ఒక సంవత్సరం నుండీ ఆ ఇంట్లో స్వేచ్ఛలేకుండా బానిసలా జీవిస్తోంది.

భయంతో కూడిన ఈ బానిస బ్రతుకును విడిచి తన ఊరిలో తన వారితో ఆ నీళ్ళు తాగుతూ ఆ గాలి పీలుస్తూ ప్రేమగా అమ్మ వండిపెట్టే అన్నం పచ్చడితో అయినా సరే, ఒక్కపూట తిన్నా కూడా ఎంత సంతృప్తి?

మన దేశంలో మన నేలపై జీవించి మన ప్రాణం ఆ గాలిలో, శరీరం ఆ మట్టిలో కలిసిపోతే ఎంత తృప్తి?

తన ఊరు గుర్తొచ్చి రాజేశ్వరి హృదయం తొణికింది. దుఃఖం అకాలంలో కురిసే వర్షపు నీటిలా గుండెను తడిపింది. కన్నీరు వరదలా చెంపలపై ప్రవహించింది.

పరాయి దేశంలో బానిస బ్రతుకులో తన ఒంటరితనాన్ని ఏమీ చేయలేని నిస్సహాయతని తలచుకుని మోకాళ్ళలో తలదాచుకుని రోదించింది. కానీ అది కొద్దిసేపే.

కాసేపటిలో తనకు తానే ధైర్యం చెప్పుకుని ఓదార్చుకుంది. రేపటి గురించి ఆలోచిస్తూ ఆశావహదృక్పథం మదిలో నింపుకుని కాస్త స్థిమ్మితపడింది.

అదే ఆమెలోని గొప్పదనం.

వెనక్కి తిరిగి చూసి చింతించడం, ఉన్నచోటే నిలిచి రోదించడం ఆమెకు నచ్చవు. రేపు అనే రోజు మంచిదై సంతోషాన్ని తనకు అందిస్తుందని స్వేచ్ఛా జీవితాన్ని తెస్తుందని ఆమెకు తెలుసు.

ఇవన్నీ కువైటు కథలు కావు. కువైటు గృహాల్లో పనిచేసే మనుషుల జీవితంలో జరిగిన యదార్థ సంఘటనలు.

ఇంకా ఘోరమైన కథలు మరుగున పడిపోతున్నాయి. చెప్పలేని కథలు ఎన్నో. వాటిని అనుభవించిన మనుషుల గుండెల్లో గూడుకట్టుకుని నిలిచి ఉన్నాయి.

భయంతో ఇక్కడ చీకటిలో దాగిన కథలు చాలా ఉన్నాయి. వీటికి అంతంలేదు. వీరికి విముక్తి లేదు.

# ఎడారి ఎండలు

**ఎడారి నేలను వణికించిన** రెండు నెలల చలికాలం. తన వెనుకగా వచ్చే వసంత కాలానికి స్వాగతం పలికి తరలిపోయింది.

అందమైన వసంతం అలా అలవోకగా నడిచి వచ్చి అందర్నీ ప్రేమగా పలకరించింది. చల్లగాలులతో సహవాసం చాలని చెప్పి పిల్లగాలుల్ని వెంటపెట్టుకుని వచ్చి ఈ ఎడారి నేలను మురిపించింది. - మండే ఎండలతోనూ వణికించే చలికాలంతోనూ బాధపడిన మీరు, కొద్దిరోజులైనా ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరండి. నేను వచ్చాను కదా అంటూ ఎడారి వాసులను వసంత కాలం ఊరడించింది.

చెట్లను, తీవెల్ని, పూవుల్ని ఎలా ఉన్నారని పరామర్శించింది. నేను మీ కోసం వచ్చాను. నేను ఉన్నంతకాలం మీరు చిగురించండి.. పుష్పించండి పచ్చగా పరిసరాల్ని నింపండి అంటూ వాటికి వసంతం అభయమిచ్చింది.

చెట్లు.. లేచిగురు ఆకులతో కళకళలాడాయి. పచ్చిక సొంపుగా తనలో పచ్చదనాన్ని నింపుకుని పరవశించింది. తీవెలన్నీ సంతసించి అల్లిబిల్లిగా అల్లుకుని పైకి పాకాయి. రంగు రంగుల పువ్వులు కొమ్మలకు, తీవెలకు విరగబూసి చూపరుల కళ్ళను ఆకర్షించి వారిని అలరించి ఆనందింపజేసి తాము పులకించాయి.

అంతవరకూ చలితో ముడుచుకుపోయి సోమరితనాన్ని శరీరంలో నింపుకున్న ఎడారివాసులు మంచి వాతావరణాన్ని చూసి హుషారుగా పైకి లేచారు. పిల్లలు, పెద్దలు అందరూ కలిసి పార్కులకు, బీచ్‌లకు వెళ్ళి ఆనందంగా కాలం గడపసాగారు. సాయంత్రం పూటేకాదు పగటి పూట కూడా గల్ఫ్ రోడ్ (బీచ్‌రోడ్) మనుషులతో నిండి సందడి సంతరించుకుంది.

మార్చి, ఏప్రిల్ ఈ రెండు మాసాలు మాత్రం వీళ్ళు, ఏ.సి హీటర్లతో పని లేకుండా స్వచ్ఛమైన గాలిని మనసారా పీల్చుకుని సంబరపడతారు. కువైటును చూడటానికి వచ్చే సందర్శకులకు, యూరప్ దేశాలనుండి బిజినెస్ పనుల మీద వచ్చేవారికి ఈ కాలము అనువైనది. అందుకే ఈ కాలంలో రోడ్లు, బీచ్‌లు, పార్కులు మనుషులతో సందడిగా ఉంటాయి.

ఈ సందడి, ఎడారి వాసుల సంతోషం చూసి కన్ను కుట్టిన సూర్యుడు అదిగో తన తట్టా బుట్టా సర్దుకుని చంకన బెట్టుకుని ఆకాశం మధ్యలోకి తరలి వచ్చాడు.

వచ్చీ రాగానే తీక్షణంగా తన దృక్కులను సారించి ఓసారి వసంతాన్ని చూసాడు. 'ఇంతవరకు నువు చేసింది చాలు. ఇక నువు నీ పెట్టె, బ్యాగు చేతబట్టుకుని వచ్చిన దారినే తొందరగా వెళ్ళిపో. ఇక ఇక్కడ నేనే రాజును. ఇక్కడ నేను చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. ఎపుడెపుడు వద్దామా ఈ ఎడారి నేలలో నాలోని వేడిని దింపుకుందామా అని. ఎదురు చూస్తూ ఉన్నాను నేను.

ఇక నీవు ఇక్కడ నుండి తప్పుకుని తొందరగా వెళ్ళిపోతే నా పని వెంటనే ఆరంభిస్తాను. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయడం నా వల్లకాదు అన్నాడు సూర్యుడు. అంతవరకూ పచ్చదనాన్ని తనలో నింపుకుని రంగు రంగుల పువ్వులను తన వాలు జడలో తురుముకుంటూ ప్రకృతిని తన సొగసులతో నింపుతున్న వసంత కన్య సూర్యభగవానుని మాటలకు, కోపానికి బెదిరిపోయింది. ఇంకా కొన్ని రోజులు ఈ ఎడారిలో నివశించి హాయిగా ఆనందంగా కాలం గడుపుదామని ఆశించిన ఆమెకు పాపం నిరాశ కలిగింది.

ఆయన మాటలకి ఎదురు చెప్పి అక్కడ నిలిచే ధైర్యం వసంతానికి లేదుకదా? వెంటనే తన సరంజామాను సర్దుకుని మరోసారి మళ్ళీ వస్తా అంటూ ఎడారి వాసులకు భారంగా వీడ్కోలు చెపుతూ మరలిపోయింది.

వసంతం వెళ్ళిపోయింది. ఈయన వచ్చేసాడు. ఇకనుండి మనకు మండే ఎండలు, చెమటలు, బాధలే అనుకుంటూ ఎడారి వాసులు సూర్యుని వైపు దిగులుగా చూసారు.

ఇక ఇదే తగిన సమయం అని ఎంచిన సూర్యుడు వెంటనే హుషారుగా లేచి ఈల వేస్తూ పరుగెత్తి వచ్చి ఎడారికి ఎదురుగా ఆకాశంలో ఆశీనుడయ్యాడు.

ఎడారి నేలకూ తనకూ ఎంతో అవినాభావ సంబంధం ఉన్నట్లు తనకు ఇదే అనువైన ప్రదేశం అన్నటుగా చెలరేగి పోయి, తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు.

నిప్పుల కుంపటిలా తాను మండిపోతూ తనలోని వేడి సెగల్ని ఉత్సాహంగా ఎడారి నేలలో నింపుతున్నాడు సూర్యుడు.



అంతవరకూ అక్కడ చల్లగా మెల్లగా వీచిన పిల్లగాలులు ఇక కుదరదని తమ పని సాగదని తెలుసుకున్నాయి. ఎడారికి, సూర్యునికి దూరంగా తమకు అనువైన ప్రదేశాన్ని వెతుక్కుంటూ అవి హడావిడిగా వెళ్ళిపోయాయి. అప్పటివరకూ పచ్చగా ఉన్న చెట్లు, పూలమొక్కలు, ప్రక్కలకు పాకిన తీవెలు, భానుడి ప్రతాపానికి తాళలేక నీరసంతో బిక్కమొహం వేసుకుని దిక్కులు చూస్తున్నాయి. రోడ్డుప్రక్కన, పేవ్‌మెంట్‌పైన కుండీల్లోని పూవులు తమ సౌకుమార్యం కందిపోతుంటే రేకులు వాడిపోతుంటే బాధతో విలపిస్తున్నాయి. ఈ దుస్థితి నుండి రక్షించే నాథుడు ఎవరైనా ఉన్నారా అని దారినపోయేవారిని రక్షించమని అర్థిస్తున్నాయి.

పార్కుల్లోని పచ్చిక ఎండకు ఎండి మాడిపోతోంది. తమ పచ్చదనాన్ని కోల్పోయి నిర్జీవమైన గడ్డిగా రూపు దాల్చుతోంది.

రెండు పూటలా నీళ్ళు పట్టి పైపులతో తడిపినా గాని ఆ వేడికి తాళలేని పచ్చిక, మొక్కలు తమ సహజ సిద్ధమైన పచ్చదనాన్ని కోల్పోయి దాహం తీరక అల్లాడుతున్నాయి.

ప్రశాంతమైన వాతావరణంలో రెండు నెలలపాటు ఊపిరి పీల్చుకున్న ఎడారి వాసులు ఇప్పుడు పగటి పూట బయటికి వెళ్ళాలంటేనే భయపడిపోతున్నారు. ఉన్నట్లుండి ఒక్కసారిగా పెరిగిపోయిన యాభై డిగ్రీల తాపాన్ని తట్టుకోలేక అబ్బ వేడి అయ్యో ఎండలు అంటూ చెమటలు తుడుచుకుంటున్నారు. పొగలు కక్కే ఎడారి నేలను చూసి ఉసూరుమని నిట్టూర్పులు విడుస్తున్నారు.

విధిలేక ఏదైనా పనిమీద బయటికి వెళ్ళిన బలహీనులు భగభగ మండే ఎండకు తట్టుకోలేక వడదెబ్బ పాలవుతున్నారు. ఏ.సిలు నిరంతరం ఇంట్లో కార్లో ఆఫీసుల్లో పనిచేస్తూనే ఉన్నాయి. కానీ ఆ వేడికి ఏ.సిలు కూడా అలసిపోతున్నాయి. ఏ.సి రిపేర్ చేసే టెక్నీషియన్స్‌కి డిమాండు పెరిగిపోయింది. ఎండాకాలం వారికి డబ్బు సంపాదించే మంచి సీజను మరి.

పెట్రోలు బావులు పుష్కలంగా ఈ ఎడారి నేలలో ఉన్నాయి కాబట్టి. ఇక్కడ కాసులు గలగలలాడుతున్నాయి కాబట్టి జనాలు ఇక్కడ నివశిస్తున్నారు లేకపోతే ఈ వేడికి తట్టుకుని ఏసిలు లేకుండా ఒక్క క్షణం మనుషులు ప్రాణంతో నిలబడి ఇక్కడ జీవించగలరా?

"ఈ రోజు ఇంకో రెండు డిగ్రీలు వేడి పెరిగింది. బయట ఎడారి నేల కణకణలాడే నిప్పులు పోసినట్లు వేడెక్కి ఉంది. పెరిగిన తాపాన్ని చూసి "ఈ కాలే నేల మీద రొట్టెలు కాలిస్తే నిముషంలో కాలిపోతాయి" లేదు ఆమ్లెట్ వేస్తే ఇంకా తొందరగా వేగిపోతుంది అంటూ జనాలు కామెంట్లు చేస్తూ ఏడవలేక నవ్వుతున్నారు.

ఇంట్లోను, ఆఫీసులోను ఏ.సిలో పనిచేసేవారికి అంతగా ఎండ బాధ లేదు కానీ బయట పనిచేసేవారి బాధ మాటల్లో చెప్పనలవికాదు. వారి దుస్థితి వర్ణనాతీతం. రోడ్డుపనిచేసేవాళ్ళు, రోడ్లపై చెత్తను ఊడ్చేవారు, భవనాలు నిర్మించే కూలీలు, ఆఫీసుల

బయట, పార్కింగు ప్రదేశాల్లో కాపలా కాసే సెక్యూరిటీ గార్డులు లాంటి వారి పరిస్థితి ఇక్కడ వేసవి కాలంలో చాలా ఘోరంగా ఉంటుంది. వీరు అన్ని కాలాల్లో, అన్ని పరిస్థితులను తట్టుకుని పని చేయాల్సి ఉంటుంది.



సూర్యుడు విజృంభించి తన శక్తిని చూపడంతో ఉన్న పళంగా కూల్‌డ్రింక్స్‌కు ఐస్‌క్రీములకు బాగా డిమాండు పెరిగిపోయింది. పార్కుల వద్ద షాపింగ్ మాల్స్ ఎదుట సైకిలు బండిలో ఐస్‌క్రీములు అమ్మేవారు జోరుగా తమ అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఈ ఎండాకాలంలో కాస్త డబ్బు సంపాదించుకోవాలని ఆశపడుతున్నారు. వేడికి తాళలేని పిల్లలు ఎగబడి ఐస్‌క్రీంలు కొంటున్నారు. కొందరు షాపింగ్‌తో బిజీగా ఉన్న తల్లితండ్రులను ఐస్‌క్రీం కొనివ్వమని పేచీ పెడుతున్నారు.

చల్లగా తీయగా ఉన్న ఐస్ క్రీమును చప్పరిస్తూ పిల్లలు వేసవిలోని వేడిని కాస్త మరిచిపోతున్నారు. పిల్లలు ఐస్‌క్రీములు తినడం చూసిన పెద్దవాళ్ళు కూడా డైటింగ్ సంగతి పక్కన పెట్టి చల్ల చల్లని ఐస్‌క్రీమును తింటూ అందులోని రుచిని ఆస్వాదిస్తున్నారు.

పగటిపూట కువైటు వీధుల్లో జనసంచారం బాగా పలచన అయింది. రోడ్లన్నీ తిరిగే మనుషులు కరువై నిర్మానుష్యంగా మారిపోయాయి. మనుషులే కాదు పిట్టలుకూడా ఎండ వేడికి భయపడి ఎక్కడికో పారిపోయినట్టున్నాయి.

కువైటు ట్రెడిషనల్ మార్కెట్‌లో పగటిపూట జనాలు రాక ఆ వీధిలో మనుషులు లేక అంగళ్ళన్నీ వెలవెలబోతున్నాయి.

సాయంత్రం పూట మాత్రం కాస్త చల్లబడిన వాతావరణంలో అక్కడ ఆ మార్కెట్ వీధులు అమ్మేవారితోను కొనేవారితోను సందడిని సంతరించుకుంటున్నాయి.

కువైటులో వేసవిలోని జూలై, ఆగస్టు మాసాలు స్కూళ్ళకు, ఆఫీసులకు గవర్నమెంటు సెలవలు కాబట్టి ఈ వేడిని ఉక్కపోతను భరించలేని కువైటు వారు చల్లగా ఉన్న యూరప్ దేశాలకు వెళ్ళి వారి సెలవలు చల్లగా, సంతోషంగా గడపడానికి ప్లాన్ చేస్తున్నారు.

వీళ్ళు సెలవలకు ఇతర దేశాలకు వెళ్ళినపుడు ఇంట్లో పనిచేసే పనిమనుషులకు కాస్త ఆటవిడుపుగా ఉంటుంది కొందరు కువైటీస్ తమతోపాటు పనివారిని కూడా లండన్, జర్మనీ అమెరికా లెబనాన్, టర్కీలాంటి దేశాలకు వెంటబెట్టుకుని తీసుకెళతారు. అలాంటి పనివారు విదేశాలు ఎన్నో చూసి సంతోషంతో ఆ అనుభవాలను తోటివారితో పంచుకుని గొప్పగా ఫీలవుతారు.

కువైటును చూడాలి అనుకునే పర్యాటకులకు, సందర్శకులకు వేసవి మాత్రం అనువైనది కాదు. అందుకే పర్యాటకులు, బిజినెస్ పనుల మీద వచ్చే యూరప్ దేశాల వారు ఎండలు తగ్గిన సెప్టెంబర్ తరువాతే తమ ప్రయాణాలు ప్లాన్ చేసుకుంటారు.

కువైటువారు తమ దేశంలో ఉన్నపుడు, తమ సాంప్రదాయాన్ని ప్రతిబింబించే దుస్తులనే ధరించడానికి ఇష్టపడతారు. వారి మత సాంప్రదాయాల్ని ఖచ్చితంగా పాటించే ఆడవారు బురఖాను ధరించి బయటికి వెళతారు.



బాలిక యవ్వనంలోనికి అడుగుపెట్టగానే బురఖా పద్ధతి పాటించాలనుకునేవారు, దానిని మొదలుపెట్టి జీవితాంతం కొనసాగిస్తారు.

నల్లటి బురఖా ధరించి వేసవిలో ఎండకు బయటికి వెళ్ళాలంటే వీరికి కష్టమే మరి. అందుకే సాయంత్రం పూట వీరు ఎక్కువగా షాపింగ్ మాల్స్‌లో కనిపిస్తారు.



మగవాళ్ళు వేసవిలో తెల్లటి నిలువుటంగీ ధరించి తలకు తెల్లటి గుడ్డను చుట్టుకుంటారు. ఈ అంగీని "దిశ్దాశా" అని, తలకు చుట్టుకునే గుడ్డను "గుత్రా" అని అరబిక్‌లో అంటారు.

ఆడవాళ్ళకు కువైటులో వస్త్రధారణ గురించిన ఆంక్షలేవీలేవు కనుక ఎవరికి ఇష్టమైనవి వారు ధరించవచ్చు. యూరప్‌దేశాలకు సెలవులకు వెళ్ళినప్పుడు తప్ప తమ దేశాల్లో వీరు తమ వస్త్రధారణనే ఇష్టపడతారు.

మధ్యాహ్నపు వేళలో స్కూళ్ళనుండి, కాలేజీల నుండి ఇంటికి వచ్చిన అమ్మాయిలు అబ్బాయిలు బయట వేసవి తాపాన్ని భరించలేక ఇంటికి రాగానే ఏ.సి గదుల్లోకి పారిపోతున్నారు.

మరికొందరు మూలన పడివున్న స్విమ్ సూట్‌లను బయటకు తీయమని పనిమనుషులకు పురమాయించి వాటిని బ్యాగ్‌లో పెట్టుకుని స్విమ్మింగ్ పూళ్ళను వెతుక్కుంటూ బయటికి వెళ్ళిపోతున్నారు. వేసవిలో ఈతకొట్టడం వీరికి ఎంతో సరదా. ఇక్కడ వీళ్ళు బిడ్డ నెలల వయసులోనే ఈతలోని అన్ని మెళుకువలు పిల్లలకి తెలియజేస్తారు. వేసవిలో ఇక్కడ వాటర్ పార్కులు, స్విమ్మింగ్ పూల్స్, పిల్లల నీటి ఆటలతో సందడిగా ఉంటాయి. అలమారలో ఉన్న కూలింగ్ గ్లాసుల దుమ్ము దులిపే సమయం కూడా ఇదే

ఇంట్లో ఏసి, ఆఫీసులో ఏసి, కార్లో ఏసి, షాపింగ్ మాల్స్‌లో ఏ.సి ఎక్కడ చూసినా ఏసిలు నడిచే వేసవి కాలంలో ఏసిలు లేకపోతే మనుషులు ఎంత బాధపడతారో? అసలు ఈ ఎడారిలో ఉండటానికి ఇష్టపడతారా? పనులకోసం, డబ్బుకోసం ధైర్యంగా ఈ కువైటు దేశానికి వస్తారా?

మరి ఒకప్పట్లో 1940కి ముందు ఇక్కడ పెట్రోలు, డబ్బులేని రోజుల్లో ప్రజలు గుడారాల్లో ఏసిలు లేకుండా వేసవిలో ఎలా జీవించేవారో తలచుకుంటే నాకు ఆశ్చర్యం కలుగుతుంది. వేసవిలో వీరు తమ భోజనంలో సలాడ్లు, మజ్జిగ అదనంగా, విరివిగా వాడతారు. వీరు మనలాగా కారం, మసాలాలు, ఊరగాయలు, పచ్చళ్ళు తినరు. వీరి ఆహారం చాలా ఆరోగ్యంగా, సాత్వికంగా ఉంటుంది. మాంసాహారం ప్రతిరోజూ తప్పని సరిగా తింటారు. అందులో చేపల్ని బాగా ఇష్టపడతారు.

వీరు అన్నం మధ్యాహ్నం ఒకపూట మాత్రమే తింటారు. ఉదయం బ్రెడ్, ఆమ్లెట్, సలాడ్స్, ఆలివ్స్‌లాంటివి అల్పాహారంగా తీసుకుంటారు. మధ్యాహ్నం సాంప్రదాయక అరబిక్ పద్ధతిలో వండిన "మచిబూసి" మన బిరియానీలాగా వండిన అన్నం తింటారు. మసాలాలు కారం లేకుండా రకరకాల కూరలు వీరు చేస్తారు. కూరను అరబిక్‌లో "మరాగ్" అని వీరు అంటారు.

రాత్రి రొట్టెలు, ఛీజ్, హమ్మూస్, సలాడ్లు లాంటి వాటితో మితాహారం తీసుకుంటారు. అయితే ఇప్పటి కాలంలో వాళ్ళు ఫాస్ట్‌ఫుడ్స్ బాగానే తింటున్నారు.

వేసవిలో ఎండలేకాదు. అపుడపుడూ ఎడారి నుండి వచ్చిపడే ఇసుక తుఫానులు (sand starms) కూడా బాగా బాధిస్తాయి. ఎడారిలో లేచిన దుమ్ము పెద్ద ఎత్తున మేఘంలా తెరలా పరుగెత్తి వచ్చి సిటీమీద, పడిందంటే మనుషులు ఊపిరి పీల్చడానికి ఇబ్బంది పడతారు

ఈ సమయంలో తలుపులు కిటికీలు బిగించి దుమ్ములోనికి రాకుండా ఇంట్లో అంతలా పేరుకోకుండా జాగ్రత్త పడతారు. ఒకవేళ కిటికీలు మూయడం మరిచిపోయి బయటకి వెళ్ళారంటే అంతే సంగతులు. ఇల్లంతా పేరుకుపోయిన దుమ్మును దులిపి శుభ్రం చేయాలంటే ఎంతో కష్టపడాలి. కానీ వీరికి చేయడానికి పనిమనుషులు ఉన్నారు కాబట్టి అంత శ్రమ ఉండదు.

ఈ దుమ్ము తుఫాను కువైటు పట్టణాన్ని నిండుకున్న సమయంలో మనుషులు బయటకు వెళ్ళటానికి భయపడతారు. ఒకవేళ పనిమీద అత్యవసరంగా వెళ్ళినా ముఖానికి, మాస్క్‌లు ధరించి తలమీద గుడ్డ కప్పుకుని బయట తిరుగుతారు. దుమ్ము కమ్ముకున్నప్పుడు పది అడుగుల దూరంలో ఏముందో కూడా కంటికి కనిపించదు. ఎల్లప్పుడూ 120 కిమీ స్పీడులో వెళ్ళే వాహనాలు ఆ సమయంలో ముందు రోడ్డుపై ఏముందో కనిపించక పగలే లైట్లు వేసుకుని మెల్లగా వాహనాలను నడిపిస్తారు.

ఈ సమయంలో ట్రాఫిక్ రోడ్లపై నిలిచిపోతుంది.

ఎడారిలో వర్షాలు ఎక్కువగా పడవు. ఎపుడో ఒకసారి ఏదో ఒక దారి తప్పిన మేఘం ఒకటి అలా షికారుకు వచ్చినట్లు ఆకాశంలోకి వస్తుంది. ఎండిన ఎడారి నేలను చూసి జాలిపడి, తన స్వతఃసిద్ధమైన స్వభావంతో నాలుగు చినుకుల్ని టపటపా రాలుస్తుంది. వెంటనే ఏదో పని ఉన్నట్లు తన దారిన తాను హడావిడిగా సాగిపోతుంది. ఆ చినుకులు రాలే సమయంలో కువైటు వారి సంబరం చెప్పనలవికాదు. అరుదుగా వచ్చే వర్షం వారికి ఎంతో సంతోషాన్ని తెస్తుంది.

ఈసారి ఈ వేసవిలో అరబ్ దేశాల్లో నేను కూడా వేసవికి తోడు ఉన్నాను అంటూ రంజాన్ కూడా తరలి వచ్చింది. పన్నెండు అరబిక్ నెలలో రంజాన్ మాసం వీరికి ఎంతో పవిత్రమైనది. ప్రపంచంలోని ముస్లిములు అందరూ భక్తితో నిష్ఠతో ముప్పై రోజులు ఉపవాసం ఆచరించే మాసం ఇది.

రంజాన్ నెలలో ఉపవాసాలతోనూ ప్రార్థనలతోనూ గడపడం. ముక్తికి మార్గంగా వీరు విశ్వసిస్తారు.

ఉపవాసాలే కాదు ఈ నెలలో అరబ్స్ పేదల పట్ల కనికరము కలిగి దానధర్మాలు విరివిగా చేస్తారు. ఈ కాలంలో చెడు అలవాట్లకు, శారీరక క్రియలకు వీరు దూరంగా ఉంటారు. వీరు సహనం, సాత్వికం, దయ, కనికరం కలిగి కాలం గడుపుతారు. పండుగ సందర్భంగా కొందరు తమ పనివారికి జీతాలు బోనస్‌గా ఇచ్చి వారిని ఆదుకుంటారు. వారికి క్రొత్త బట్టలు, కానుకను ఇచ్చి సంతోషపెడతారు.

రంజాన్ సమయంలో కువైటులోని ప్రతి ఇల్లూ రకరకాల అరబిక్ వంటలతో ఘుమఘుమలాడుతుంది.

సూర్యోదయం మొదలుకుని - సూర్యాస్తమయం వరకు పచ్చి మంచినీళ్ళు కూడా తాగకుండా ఉపవాసం ఉండే వీరు సాయంత్రం నుండి తెల్లవారేంత వరకు మంచి ఆహారాన్ని తీసుకుంటారు.

ఉపవాసాన్ని ముగించడానికి ముందుగా మొదట ఖర్జూరాన్ని వీరు తీసుకుంటారు. గల్ఫ్‌లోని ఎడారిలో విరివిగా కాసే ఈ ఖర్జూరం చాలా ప్రశస్తమైనది.

జూలై ఆఖర్లో కాపుకు వచ్చే ఈ ఖర్జూరపు చెట్లు గుత్తులుగా కాయలు చెట్టుకు విరగకాస్తాయి. గల్ఫ్‌లోని ఖర్జూరము ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యాన్ని పొందింది.

ఖర్జూరాన్ని అరబ్బులు దైవఫలంగా భావిస్తారు. ఎడారిలో మండే వేసవిలో ఈ ఖర్జూరపు చెట్లు ఫలాల్ని అందిస్తాయి. వేసవికాలం వీటి కాపుకు అనువైన సమయం.

ఉపవాసం చేసిన వారికి తక్షణ శక్తిని అందించే అద్భుత ఫలం ఇది. అందుకే అరబ్బులు రంజాన్‌లో దీన్ని తప్పని సరిగా తీసుకుటారు. ఇంకా ఎన్నో పోషక విలువలు ఖర్జూరములో ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.

ఖర్జూరంతో కేకులు, స్వీట్లు లాంటి రకరకాల వంటలు కూడా చేసుకుంటారు.

వేసవిలో పగటి గంటలు ఎక్కువ కాబట్టి, వేసవిలో వీరి ఉపవాసపు సమయం కూడా పెరుగుతుంది.

కువైటు ప్రభుత్వం రంజాన్ సందర్భంగా స్థానికులకు రెండు నెలల జీతం బోనస్‌గా ఇస్తుంది. రంజాన్ మాసంలో పనివారికి, దేశవిదేశీయులకు అందరికీ పనిగంటలను తగ్గిస్తుంది. ఇక్కడి ప్రభుత్వం ఉపవాసం ఉండే ముస్లిమ్‌లకు రెండు గంటలు, ఉపవాసం ఉండని ఇతర మతస్తులకు ఒక గంట పని గంటలను తగ్గించమని ఆయా కంపెనీలకు (LSOP) లోకల్ స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్స్ ఆర్డర్స్ జారీ చేస్తుంది.

రంజాన్ మాసంలో పగటిపూట అన్ని రెస్టారెంట్లు, ఆహారాన్ని విక్రయించే అన్ని హోటళ్ళు మూసి వేయబడతాయి. సాయంత్రం పూట మాత్రమే అవి తెరువబడతాయి. ఈ మాసంలో ఎవరైనా సరే వీధుల్లో, పబ్లిక్ ప్రాంతాల్లో తిండి తినడం, నీళ్ళు తాగడం, సిగరెట్ త్రాగడం లాంటి పనులు బహిష్కరించబడుతుంది. ఖచ్చితంగా ఈ ఆజ్ఞ ప్రతి ఒక్కరూ పాటించాల్సిందే పాటించకుండా బయట ఎవరైనా ఏదైనా తింటూ కనిపిస్తే - పోలీసులు వెంటనే అరెస్టు చేసి జైల్లో పెడతారు. వారికి వారం రోజులు జైలుశిక్ష వంద దినార్లు జరిమానా విధిస్తారు. చిన్నపిల్లలకు, రోగులకు ముసలివారికి గర్భవతులకు ఈ ఆజ్ఞ పరిస్థితిని బట్టి కాస్త సడలింపబడినది.

రంజాన్ రోజుల్లో ప్రజలందరూ ఉపవాసపు బడలికతో ప్రార్థనలతో ప్రశాంతంగా ఉంటారు. అరుపులు, ఆటలు, అల్లరి, పాటలు ఎక్కడా వినిపించవు. స్త్రీలు వస్త్రధారణ, మేకప్ లాంటివి ఆకర్షణీయంగా కాకుండా సామాన్యంగా సాధారణంగా ఉండేలా రంజాన్ మాసంలో జాగ్రత్తలు తీసుకుంటారు.

రంజాన్ మాసంలో అంతటా ప్రశాంతంగా, నిశ్శబ్దంగా, పరిసరాలు వైవిధ్యంగా ఉంటాయి.

ఇదిగో వేసవి ఉత్సాహంగా పరిగెత్తుకుంటూ ఇక్కడికి వచ్చేసింది. అదిగో రంజాన్ కూడా సంతోషంగా తరలి వచ్చింది. ఈ ఎడారిలో కువైటు దేశంలో వేసవితోనూ రంజాన్ మాసంలోనూ అందరితోపాటూ నేను కూడా పాటించాల్సిన జాగ్రత్తలను నిబంధనలను గుర్తుచేసుకుంటూ నా రోజుల్ని ప్లాన్ చేసుకుంటాను.

ఇక ఉంటాను మరి. మరోసారి మళ్ళీ కలుద్దాం.

## పనిమనుషుల కథ

**కువైట్ సిటీ**

హవల్లి ఏరియా

సాయంత్రం ఆరుగంటల సమయంలో ఆ వీధంతా సందడిగా ఉంటుంది. వచ్చిపోయే కష్టమర్లతో అక్కడ ఉన్న షాపులన్నీ కళకళలాడుతూ ఉంటాయి. ఆ వీధి అంతా ఎలక్ట్రానిక్ షాపులతోనూ "పనిమనుషులను" కువైటు వారికి అమ్మే ఆఫీసులతోనూ. నిండి ఉంటుంది.

అవును. మీరు సరిగ్గానే విన్నారు.

అక్కడ మనుషుల్ని, బానిసల్లాగా మంచి రేట్లకు అమ్ముతారు. ఇప్పుడు ముఖ్యంగా వాళ్ళగురించే నేను ఇక్కడ చెప్పబోతున్నాను. ఆకలితో కాలేకడుపుల్ని నింపుకోవడానికి పేదరికాన్ని పారద్రోలడానికి, తనవారిని విడిచి, ఒంటరిగా పరదేశానికి (గల్ఫ్ దేశాలకు) వచ్చిన పనిమనుషులు. అరబ్బుల ఇళ్ళలో బానిసల్లాగా కాసిన్ని జీతపు డబ్బుల కోసం రాత్రింబగళ్ళు కష్టపడే శ్రమజీవులు. అందుకే వీళ్ళ గురించి ఈ గల్ఫ్‌లోని పనిమనుషుల గురించి ముఖ్యంగా గుర్తుచేసుకోవాలి.. మనం వాళ్ళ గురించి తప్పకుండా తెలుసుకోవాలి.

ఇంకా ఆ వీధి మధ్యలోకి వెళితే అక్కడక్కడా ఉన్న బంగారం షాపులు కళ్ళను ఆకట్టుకుంటాయి. షోకేసుల నిండా వ్రేలాడదీసిన అందమైన ఆభరణాలు, రంగుబల్బుల వెలుగుల్లో మెరిసిపోతూ ఆ దారిన వెళ్ళేవారిని ఆకర్షించి రా రమ్మని పిలుస్తుంటాయి.

స్త్రీలు అయితే మరీను. బంగారం ధరలు పెరిగి ఆకాశాన్ని అంటుతున్నా సరే అక్కడ ఆగి, షాపుల్లోకి వెళ్ళి నగలన్నింటినీ బాగా పరిశీలించి చూసి ఇష్టమైన వాటిని వదలక కొంటూనే ఉన్నారు. గల్ఫ్ బంగారం గురించి కాస్త చెప్పుకోవాలి. గల్ఫ్‌లోని బంగారం స్వచ్ఛమైనది. కల్తీలేనిది. ఇక్కడ బంగారం ధరకూడా ప్రపంచ దేశాలలోని ధరకంటే కాస్త తక్కువగా ఉంటుంది. కాబట్టి ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరూ గల్ఫ్‌లోని, బంగారం కొనడానికి ఆసక్తిని చూపిస్తారు. ముఖ్యంగా భారతీయులు 22 లేదా 24 కారెట్ల బంగారం కొనడానికే ఇష్టపడతారు. కానీ అరబ్బులు మాత్రం 18 కారెట్ల బంగారానికే ప్రాముఖ్యతను ఇస్తారు. 22 కారెట్ల బంగారం ధగధగా మెరుస్తూ పచ్చగా ఉండి, కనులకు ఎబ్బెట్టుగా కనిపిస్తుందనీ, 18 కారెట్ల బంగారం అయితే తగినంత రంగులో ఉండి, ఆభరణం అందంగా హుందాగా ఉంటుందని వీరి అభిప్రాయం.

హవల్లి ఏరియాలోని ఆ వీధిలోకి వెళ్ళినప్పుడల్లా మొదట గోల్డ్ షాపుల్లోకే దారి తీస్తాను. క్రొత్తగా వచ్చిన నగలు, డిజైన్లు అన్నీ చూసి, నచ్చింది ఏదో ఒకటి చిన్నవస్తువైనా సరే కొనుక్కుంటేగానీ మనసుకు తృప్తిగా ఉండదు. స్త్రీలకు బంగారానికీ ఉన్న అవినాభావ సంబంధం విడదీయలేనిది కదా!

ఈ హవల్లి ఏరియాలో అరబ్బుల కంటే ఎక్కువగా మన భారతీయులే నివసిస్తున్నారు. అరబ్బులు, ఇతరదేశాల వారు కొద్ది శాతంలో మాత్రమే ఈ ఏరియాలో ఉన్నారు. మన భారతీయులు ఎక్కువగా నివసించే ఇలాంటి కొన్ని ఏరియాలకు నేను వెళ్ళినపుడు మన ఇండియాలోని వీధుల్లో తిరుగుతున్న అనుభూతి నాకు కలుగుతుంది. ఇక్కడి వీధుల్లో అరబిక్ భాషను మించి మన హిందీ భాషే ఎక్కువగా మాటల్లో వినిపిస్తుంది.

చాలామంది భారతీయులు వివిధరకాలైన పనులు ఈ కువైటు దేశంలో చేసుకుంటూ సంవత్సరాల తరబడి ఇక్కడ నివసిస్తున్నారు.

కష్టమైన పనులతో, స్వేచ్ఛ లేకుండా బానిసల్లా, కువైటు ఇళ్ళలో పని చేసే కొందరి పనిమనుషుల జీవితాలు తప్ప, బయట ఉద్యోగాలు (పనులు) చేసుకునే పరదేశీయులకి, తమ దేశంలో కంటే కూడా జీవితం ఇక్కడ సులభంగా, సుఖంగా గడిచిపోతుండటంతో వీరందరూ ఈ కువైటు దేశాన్ని విడువక తమ కుటుంబాలతో సహా ఏళ్ళ తరబడి ఇక్కడే నివసిస్తున్నారు.

ముఖ్యంగా ఈ హవల్లి ఏరియాలో "పనిమనుషులను" కువైటు వారి పనుల కోసం సప్లై చేసే ఏజంట్లు ఎక్కువగా నివసిస్తున్నారు. గల్ఫ్‌లో ఇంట్లో పనిచేసే పనిమనుషులకు బానిసలకు పెద్ద తేడా ఏమీ ఉండదు.

బానిసలు జీవితాంతం తన యజమానికి అమ్ముడుపోతారు. కానీ ఇక్కడ గల్ఫ్‌లోని పనిమనుషులు రెండు సంవత్సరాలకాలం కువైటు వారి ఇంట్లో పని చేయడానికి ఒక కాంట్రాక్ట్ పద్ధతిలో అమ్ముడు పోతారు. రెండు సంవత్సరాల కాలం ముగిసాక అందరికీ ఇష్టం అయితే మరలా కావాలి, ఉండాలి అనుకుంటే వాళ్ళు మరొక రెండు సంవత్సరాలకు కాంట్రాక్టును పొడిగిస్తారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రెండు నెలల సెలవులతో పాటు విమానం టిక్కట్లు ఇచ్చి వారి దేశానికి పంపిస్తారు. వద్దు అనుకుంటే రెండేళ్ళు పనిచేసి టిక్కెట్లు తీసుకుని బై చెప్పి వెళ్ళిపోవచ్చు. లేదా ఒక ఆరేడు నెలలు పనిచేసాక మధ్యలో నచ్చక ఏదైనా ప్రాబ్లం కలిగినా వద్దు అనుకుంటే ఆ మనిషిని తీసుకుని వచ్చి ఆ ఏజంటుకే అప్పగిస్తారు. ఆ ఏజంటు ఆ మనిషిని మరలా మరొక కువైటి సేఠుకు అమ్ముతుంది. మరలా అక్కడ ఆ పనివారికి రెండేళ్ళు కాంట్రాక్టు మొదలు అవుతుంది.

లక్ష్మి అని నాకు తెలిసిన ఆవిడ, ఈ హవల్లి ఏరియాలో "పనిమనుషులను" సప్లై చేసే ఆఫీసులో ఏజంటుగా ఉంది. ఒకరోజు నేను పనిమీద హవల్లి ఏరియా మీదుగా వెళుతూ ఆమెకు ఫోను చేసి ఆ ఆఫీసులు చూడాలనిపించి అక్కడికి వెళ్ళాను.

అక్క పనిమనుషులను అమ్మే ఆ ఆఫీసులన్నీ ఆ వీధిలో ఉన్న భవనాల బేస్‌మెంటులో ఉండి తమ వ్యాపారాలను నడిపిస్తున్నాయి.

మూడు పువ్వులు ఆరుకాయలుగా వారి వ్యాపారం సాగుతూ దినార్ల పంటను ఆ ఏజంట్లకు అవి పండిస్తున్నాయి.

ఒక్కసారి ఆ వీధిలోకి వెళ్ళి ఆ భవనాల ప్రక్కన ఉన్న మెట్లు దిగి బేస్‌మెటులోకి తొంగి చూస్తే అక్కడ వింతైన వాతావరణం మన కళ్ళకి కనిపిస్తుంది. ఆ బేస్ మెంటులోని విశాలమైన హాలులో చుట్టూ గోడలకి పేర్చినట్లున్న ఆఫీసు గదులు వరుసగా కనిపిస్తాయి,

"ఇక్కడ సరసమైన ధరలకు ఇండియా, శ్రీలంక, ఫిలిపీన్స్, నేపాల్ కద్దామాలు (పనిమనుషులు) దొరుకును అనే బోర్డు ఆ ఆఫీసు గదుల ముందు వ్రేలాడుతూ ఉంటుంది.

అరబిక్ భాషలో "కద్దామా" అంటే "పనిమనిషి" అని అర్థం. బానిసల్ని అమ్మినట్లు పనిమనుషుల్ని కువైటు వారికి మంచి ధరలకు, అమ్మి ఈ ఏజంట్లు బాగా సొమ్ము చేసుకుంటారు. వయసులో ఉండి అందంగా చలాకీగా ఉన్న మనిషికైతే ఇక్కడ మంచి రేటు పలుకుతుంది. కాస్త చదువు వచ్చి, నాలుగు ఇంగ్లీషు ముక్కలు నేర్చుకున్న వారైతే ఇంకా మేలు. కువైటు వారు ఇంగ్లీషు వచ్చిన పనిమనిషిని ధర ఎక్కువైనా సరే సంతోషంగా కొనుక్కుంటారు!

కాస్త చదువుకుని అందంగా ఉన్న వారికోసమే ఏజంట్లు ఎదురుచూస్తూ ఉంటారు. ఇలాంటి వారిని సులభంగా అమ్ముకుని బాగా డబ్బు సంపాదించడమే వీరి ధ్యేయం. పనిమనుషుల్ని అమ్మి కోట్లరూపాయలు సంపాదించి, మేడలు కట్టి ఆస్తులు ప్రోగు చేసుకున్నవారు చాలామంది ఇక్కడ, ఈ హవల్లి ఏరియాలో ఉన్నారు.

నాకు తెలిసిన ఆ లక్ష్మి అనే ఆవిడ కూడా రెండేళ్ళు తిరిగేలోపల నాలుగు పోర్షన్లు ఉన్న రెండతస్తుల ఇల్లు ఇండియాలోని వాళ్ళ ఊళ్ళో కట్టించానని, అరకేజీ బంగారం నగలు కొన్నానని గర్వంగా, సంతోషంగా చెపుతుంటే నేను విని అవునా? నిజమా? అని ఆశ్చర్యపోయాను.

" అవును. నిజమే. నువు ఆ ఫైవ్ స్టార్ హోటల్లో పది సంవత్సరాలు పనిచేసినా సంపాదించలేనంత డబ్బు, ఇక్కడ రెండేళ్ళు పనిమనుషుల్ని సప్లై చేసే ఏజెంటుగా చేస్తే సంపాదించగలవు. నా మాట విని నాతో చేయి కలుపు. మీ ఊరు నుండి మనుషుల్ని పిలిపించు. ఇక్కడ వీసాలాంటి అన్ని వ్యవహారాలు నేను చూసుకుంటాను. అందులో నీకు సగం లాభం ఇస్తాను" అంది ఆవిడ.

పేదవారిని అమ్మి సొమ్ముచేసుకునే వ్యాపారాలు, వారి కన్నీళ్ళు త్రాగి సంపాదించే దినార్లు అవసరమా?! ఒకసారి చుట్టూ పరికించి చూసాను నేను.

చుట్టూ ఆఫీసు గదులు. ఒక్కో గదిలో ఐదు టేబుళ్ళు వేసి ఉన్నాయి. ఎదురుగా ఉన్న పెద్ద టేబులు కువైటీ యజమానికి కేటాయించబడి ఉంటుంది. ఆ ఆఫీసు, లైసెన్సు, అనుమతి అంతా ఆయన పేరుమీదే ఉంటాయి.

ఇక్కడ కువైటు ప్రభుత్వం, వ్యాపారానికి, షాపులకు కువైటీ వారికి మాత్రమే పర్మిషను ఇస్తుంది. పరదేశులకి ఆ అవకాశం లేదు. వారు కువైటీస్ క్రింద, వారి అనుమతితో, వ్యాపారానికి భాగస్వాములుగా మాత్రమే ఉంటూ దాన్ని నిర్వహించగలరు.

ఆ కువైటీ యజమాని నెలకు ఒకటి, రెండుసార్లు అలా వచ్చి ఏజంట్ల వద్ద ఆఫీసుకు అద్దె, టేబులు వేసుకుని లైసెన్స్ ఉపయోగించుకుని వ్యాపారం నిర్వహించినందుకు కమీషను (డబ్బు) రాబట్టుకుని వెళ్ళిపోతాడు. ఇక మొత్తం వ్యాపారమంతా ఏజంట్ల చేతుల్లోనే జరుగుతుంది. గోవా, కేరళ, తెలుగు, శ్రీలంక, ఫిలిప్పీన్స్ నేపాల్, ఇండోనేషియాల నుండి వచ్చిన ఏజంట్ల చేతుల్లోనే జరుగుతుంది. గోవా, కేరళ, తెలుగు, శ్రీలంక, ఫిలిప్పీన్స్, నేపాల్, ఇండోనేషియాల నుండి వచ్చిన ఏజంట్లు అక్కడ ఉన్న టేబుళ్ళ ముందు కూర్చుని ఉన్నారు. వారి వద్ద టేబులు మీద ఉన్న ఫైళ్ళలో వారి పనిమనుషుల పాస్‌పోర్టు కాపీలు, వారి వివరాలు, ఫోటోలు ఫోల్డర్‌లో అమర్చి ఉన్నాయి. పనిమనుషులను కొనడానికి అక్కడికి వచ్చే కువైటు వారికి, ఆ ఏజంట్లు ఆ ఫైళ్ళలోని వివరాలను చూపిస్తూ పనిమనుషుల అర్హతలను అనుభవాన్ని అందమైన మాటలతో, తెచ్చిపెట్టుకున్న నవ్వుతో వివరించి చెపుతున్నారు. కొందరు ఏజంట్లు ఉత్సాహంగా పరిగెత్తికెళ్ళి అక్కడే ఆ ప్రక్కనే ఉన్న పనిమనుషుల్ని పిలిపించి వారికి చూపిస్తున్నారు. ఆ వాతావరణం, వారి ప్రవర్తన, మాటలు, నవ్వులు చాలా కృత్రిమంగా అసహజంగా నాకు అనిపించాయి.

అక్కడ ఉన్న ఆ ఆడ ఏజంట్లు వారి వయసును దాచాలనే తాపత్రయంతో ముఖానికి వేసుకున్న అతి మేకప్పు, ఎర్రటి వర్ణంలో పెదాలకు వేసుకున్న లిప్‌స్టిక్ మనిషుల వంట్లోని రక్తం పీల్చుకున్నట్లు ఎబ్బెట్టుగా కనిపించాయి.

వారికి నప్పని వస్త్రధారణతో నడక సరిగా రానివారు వేసుకున్న ఎత్తుమడమల చెప్పులతో, సర్కస్‌లో ఫీట్లు చేసే బఫూన్లలా కనిపించారు. వారు పూసుకున్న ఘాటైన అరబిక్ అత్తరు సెంటు వాసన. ఆ పరిసరాల్లో అంతటా వ్యాపించి వెగటుగా అనిపించింది. అక్కడి మనుషులు, వారి మాటలు, ప్రవర్తన, చాలా వింతగా కనిపించాయి. ఆఫీసులోని టేబుల్స్ ముందు కూర్చున్న కొందరు ఏజంట్లు హుషారుగా తమ వ్యాపారం గురించిన కబుర్లు చెప్పుకుంటున్నారు. ఏ పనిమనిషిని ఎలా అమ్మాలో, ఎవరికి అమ్మాలో? ఎలాంటివారికి ఎంతకు అమ్మాలో ఎంత లాభం ఎవరికి వస్తుందో? అనే విషయాలను చర్చించుకుంటూ ఉన్నారు? ఇంకా ఎక్కువగా మనుషుల్ని రప్పించాలనే ప్రణాళికలు వారి మాటల్లో వినబడుతున్నాయి.

క్రొత్తగా కువైటుకు వచ్చిన పనిమనుషులు, భాషరాక, పనిచేతకాక, కువైటు ఇండ్లల్లో చేసే అవకతవకపనులు, మాట్లాడేమాటలను గురించి కథలుగా, జోకులుగా చెప్పుకుని మరి కొందరు ఏజంట్లు విరగబడి నవ్వుకుంటున్నారు.

వారి మాటల్లో అతిశయం, నవ్వుల్లో నటన స్పష్టంగా కనిపిస్తోంది.

అంగట్లో అమ్మకానికి ఉన్న బొమ్మల్లాంటి ఆ పనిమనుషులు ఎక్కడ ఉన్నారా అని ఆ ప్రక్క పరిశీలనగా చూసాను. పాపం, వారందరూ తమకు ఉన్న కొద్దిపాటి సామాను, బట్టలు, చిన్న చేతి సంచిలో సర్దుకుని మూలగా ఉన్న మెట్ల మీదా స్టోరు రూముల్లోనూ ప్రక్కన ఉన్న చిన్న బెంచీలపైనా ఒదిగి కూర్చుని ఉన్నారు. వారి మొహాల్లో భయం, ఆందోళన, విచారం, రేపటిగురించి దిగులు గూడు కట్టుకుని స్పష్టంగా బయటికి కనిపిస్తున్నాయి.

క్రొత్తగా కువైటు వచ్చిన వారికి, ఇంటిమీదా, వదిలి వచ్చిన పిల్లలమీదా ఇంకా దిగులు పోనట్లుంది. ఎలాంటి యజమాని దొరుకుతాడో? పని సరిగ్గా చేయకపోతే కొడతారేమో? భాష రాకపోతే తిడతారేమో అనే దిగులుతో వారు దీనంగా చూస్తున్నారు. వారి భవిష్యత్తు ఎలా ఉంటుందో? ఏమవుతుందో వారికి తెలియదు పాపం.

అక్కడ కూర్చుని చిన్నపాటి స్వరాలతో భయం భయంగా మెల్లగా వారు మాట్లాడుకుంటున్నారు. వారి మాటలు ఏజంటు మేడం వింటే, తిడుతుందని వారికి భయం. పాతవాళ్ళు కొందరు క్రొత్తవారికి తమకు కలిగిన అనుభవాలు పడిన బాధలు, కష్టాలు కథలుగా చెపుతున్నారు. తమకు తెలిసిన సలహాలు వారికి ఇస్తున్నారు. అక్కడ, ఆ సమయంలో కూడుకున్న వారికి వారే బంధువులు. ఆప్తులు. స్నేహితులు కూడా. వారి జీవితంలోని కష్టసుఖాలు వారు కలబోసుకుంటున్నారు. పాతవారు కొందరు అంతా అలవాటే అన్నట్లు ధీమాగా ఉన్నారు భాష రాని క్రొత్తవారు ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో అర్థంకాక బిక్కమొహం వేసుకుని మాట్లాడుకునే వారి మొహాలు చూస్తున్నారు. ఏదో చెప్పాలని వారిని అడగాలని ప్రయత్నం చేస్తున్నారు. అక్కడ వారిని చూస్తే పేదరికం ఎంత శాపమో మనకు అర్థమవుతుంది.

కువైటు వాళ్ళు పనిమనిషి కావాలని, కొనడానికి అక్కడికి వచ్చినపుడల్లా ఏజంటు మేడం పిలవడంతో వారందరూ సంతలో పశువుల్లా వచ్చి వరుసగా ఆఫీసు ఎదుట నిలబడుతున్నారు. అపుడు వారి మొహాల్లో తెచ్చిపెట్టుకున్న నవ్వు, ఉత్సాహం కనబడుతున్నాయి.

తొందరగా అమ్ముడు పోవాలంటే ఆ మాత్రం నటించక తప్పదు వారికి. తొందరగా డబ్బు సంపాదించి తమవారికి పంపాలి. చేసి వచ్చిన అప్పులు తొందరగా తీర్చాలి అనే ఆశ, తాపత్రయం వారిలో ఉంది. ఇంతదూరం వచ్చాక ఇక వేరే మార్గం వారికి లేదు. ఏజంట్లు చెప్పినట్లు వినాలి. వాళ్ళు చూపించిన కువైటు వారితో పనిచెయ్యడానికి వెళ్ళాలి. కీ ఇస్తే ఆడే బొమ్మల్లా, మరయంత్రాల్లా తమ ఇష్టాల్ని మరచి వారు డబ్బుకోసం, కష్టాలతో సహవాసం చేయాల్సిందే

వీరిని కదిలిస్తే ఎన్నో కథలు, కన్నీళ్ళు బయటికి వస్తాయి. వీళ్ళు తమవారిని విడిచి, తమదేశాన్ని విడిచి, ఒంటరిగా ఈ ఎడారి దేశానికి రావడానికి వెనుక ఎన్నో బాధలు, కారణాలు ఉంటాయి. తమ హృదయం, తమ దేశంలో తమ వారి మధ్య తిరుగుతూ ఉంటుంది. శరీరం మాత్రం ఇక్కడ కువైటు వారికి సేవలు చేస్తూ సంవత్సరాలు గడిపేస్తూ ఉంటారు. డబ్బుకోసం, కుటుంబం కోసం వీళ్ళు చేసే త్యాగం చాలా విలువైనది. ముఖ్యంగా ఈ కువైటు వారికి (అరబ్బులకు ) ఇంట్లో పని చేయడానికి ఆడ పనివారు ఎక్కువగా అవసరం. వంటపనికి, ఇల్లు శుభ్రం చేయడానికి, పిల్లల్ని చూసుకోవడానికి స్త్రీలు ఉపయోగపడతారు. కారు డ్రైవింగ్‌కు, తోటపని చూడటానికి, దువానియా పనులకు (సేఠ్ లు కలిసి మాట్లాడుకుఉనే మీటింగు హాలు) మగవారిని పనిలో పెట్టుకుంటారు.

''ఏయ్ రత్నా! ఇలారా!..హీల్స్ వేసుకుని నడిచేసరికి నా పాదాలు నొప్పిగా ఉన్నాయి. ఇక్కడ కూర్చుని నా పాదాలు మసాజ్ చెయ్యి'' అంటూ టేబుల్ ముందుకు కాళ్ళు జరిపింది అక్కడ ఉన్న శ్రీలంక ఏజంటు. నల్లగా తుమ్మ మొద్దులా ఉంది ఆవిడ. శారీరక శ్రమ లేకపోవడంతో ఆవిడ శరీరం రుబ్బురోలులా తయారయింది. ఆవిడ కాళ్ళు ఏనుగు కాళ్ళంత లావు ఉన్నాయి. డబ్బు ఎక్కువైతే

ఇలాంటి బాధలు తప్పవేమో. ఆవిడ శ్రీలంకలోని తమిళియన్ అట. వారి పూర్వీకులు వంద సంవత్సరాల క్రితం మద్రాసు పరిసర ప్రాంతాల్లో నుండి శ్రీలంకకు వలస వెళ్ళారట. అప్పటి నుండీ శ్రీలంకలోనే స్థిరంగా నిలిచిపోయారట. ఒక్క క్షణం కూడా నోరు మూత పడకుండా మాట్లాడుతూ కద్దామాలను (పనిమనుషులను) అరుస్తూ ఉంది ఆవిడ.

ఐదు నిమిషాల్లో ఆమె గురించి, ఆమె సంపాదన గురించి కువైటుకు ఎన్ని ప్రయాసలు పడి ఎలా వచ్చిందో, ఈరోజు ఈ స్టేజ్‌కు ఎలా చేరుకుని బాగా డబ్బు సంపాదించిందో తన మాటల్లో ఆపకుండా చెపుతూనే ఉంది. మధ్యలో నాగురించి కూడా తెలుసుకోవాలనే తాపత్రయంతో చాలా ప్రశ్నలు గుప్పిస్తూనే ఉంది. ఒక్క క్షణం కూడా ఆగని ఆవిడ వాగుడు విసుగు తెప్పించింది నాకు.

రత్న అనే ఆ శ్రీలంక అమ్మాయి గాలివీస్తే పడిపోయేంత బలహీనంగా ఉంది. తన చేతిలో ఉన్న బట్టల బ్యాగ్‌ను ఎవరూ తీసుకోరు కదా అన్నట్లు చుట్టూ ఓసారి పరికించి చూసి జాగ్రత్తగా ప్రక్కనే ఉన్న బెంచిపై పెట్టి మెల్లగా నడుచుకుంటూ ఆ శ్రీలంక ఏజంటు కాళ్ళదగ్గరికి వచ్చి క్రింద చతికిలబడి కూర్చుంది. "మధ్యాహ్నం గిన్నెనిండా అన్నం తిన్నావు కదా? అంత నీరసం ఎందుకే నీకు? తొందరగా నడిచి రాలేవా? పిలిచిన అర్ధగంటకు మెల్లగా పెళ్ళికూతురులాగా వస్తున్నావు? " అని గద్దించింది ఆ శ్రీలంక ఏజంటు. ఆవిడ మాటలకు ఆ అమ్మాయి బిక్కమొహం వేసుకుని, కన్నీళ్ళు నింపుకుంది.

"పని చేయడం రాదుగానీ ప్రతిదానికీ ఏడుపే. ఇలా మెల్లగా పనిచేస్తే కువైటు ఇంటిలో ఉంచుకుంటారా? జీతం డబ్బు ఇస్తారా? నిన్ను తీసుకెళ్ళిన రెండోరోజే పని సరిగ్గా చెయ్యడం లేదని చెప్పి, తిరిగి తీసుకుని వచ్చి నా దగ్గర దిగబెడతారు. నీకు ప్రతిరోజూ మూడు పూటలా అన్నం పెట్టలేక నేను చావాలి. కాస్త హుషారుగా పని చెయ్యటం నేర్చుకో. లేకపోతే నిన్ను అమ్మడం సాగనంపడం నాకు కష్టమవుతుంది. నీలాంటి వాళ్ళు కువైటులో పనికోసం వస్తే అంతే సంగతులు. మేమంతా ఈ ఆఫీసులు మానేసి నెత్తిన గుడ్డ వేసుకుని ఇంటికి తిరిగి పోవాల్సిందే" అంటూ ఆ శ్రీలంక ఏజంటు ఆ పిల్లను తిడుతూనే ఉంది.

ఆమె అరుపులకి, ప్రవర్తనకి నాకు చాలా బాధ కలిగింది. ఇక్కడ అస్సలు బాగోలేదు ఇక వెళ్ళిపోదాం అనుకుంటూ పైకి లేచాను. "అపుడే ఎలా వెళతావు? సమోసాలు, టీ తెమ్మని 'కద్దామా'ను పంపించాను ఉండు" అంటూ నాకు తెలిసిన లక్ష్మి నన్ను కూర్చోబెట్టింది. ఇంతలో ఒక కువైటీ అతను నడివయసులో ఉన్న ఒక 'కద్దామా'ను (ఒకామెను) తీసుకుని వచ్చి లక్ష్మికి అప్పగించాడు. ఆయన ముఖం కోపంగా ఉంది. "ఇదిగో ఈవిడకు యాభై ఏళ్ళు వయసు ఉంటుంది. మాయమాటలు చెప్పి పనిలేని ముసలిదాన్ని నాకు అంటగట్టావు. మా ఇల్లు చాలాపెద్దది. నాకు నలుగురు పిల్లలున్నారు. ఇది ఇల్లంతా శుభ్రం చేసి పిల్లల్ని చూడాలి. వంటకు వేరే మనిషి నాకు ముందే ఉంది. మరి ఈవిడ కూర్చుంటే లేవలేదు. సరిగ్గా పనిచెయ్యలేదు. వచ్చినప్పటి నుండీ దగ్గుతూనే ఉంది. మెట్లు ఎక్కితే ఆయాసం అంటోంది. ఇలాంటి ముసలిదాన్ని, జబ్బుగలదాన్ని నాకు ఎందుకు అంటగట్టావు? దీనికి జీతం కాదు. తిండి పెట్టడమే దండగ. ఈ ముసలిదాన్ని నువ్వే ఉంచుకో. నా డబ్బులు నాకు తిరిగి ఇవ్వు లేదా పది దినార్లు ఎక్కువైనా సరే మంచి వయసులో ఉండి పరిగెత్తి పనిచేసే అమ్మాయిని ఇవ్వు" అని ఆ సేఠు కోపంగా లక్ష్మితో చెప్పాడు.

"అలాగే సేఠూ! కోపం వద్దు. నా దగ్గర చాలామంది కద్దామాలు ఉన్నారు. అందరినీ చూపిస్తాను. నీకు కావలిసిన దాన్ని తీసుకెళ్ళు" అంటూ. ఆ ప్రక్క మెట్లమీద కూర్చున్న వాళ్ళని గట్టిగా కేక వేసి పిలిచింది. ఆమె కేకతో వాళ్ళు ఉలిక్కిపడి లేచి చెదిరిన జుట్టు సర్దుకుని నవ్వు మొహాలపై పులుముకుని ఆఫీసులోనికి వచ్చారు. "డబ్బు ఎక్కువ ఇస్తా అన్నావు కదా? అందుకే అందర్నీ చూపించాను. బాగా చూసి నీకు నచ్చినదాన్ని తీసుకుపో. మళ్ళీ మాట నా మీదకి రాకూడదు" అంది నవ్వుతూ లక్ష్మి.

ఆఖర్లో ఉన్న ఒక అమ్మాయిని చూపిస్తూ "ఈ పిల్ల పని బాగా చేస్తుందా? " అని అడిగాడు సేఠ్.

"అది పని బాగా చేస్తుంది సేఠూ. ఇంగ్లీషు కూడా మాట్లాడుతుంది కాబట్టి భాష రాదు అనే ఇబ్బంది లేదు" అంటూ ఉత్సాహంగా చెప్పింది ఆవిడ. ఎదురుగా నిలబడ్డ రోజాను ఒకసారి పైకి, కిందకీ పరిశీలనగా చూసాడు సేఠు. "నిజంగా ఇంగ్లీషు మాట్లాడుతుందా? " అపనమ్మకంగా అడిగాడు సేఠు.

"బాగా మాట్లాడుతుంది సేఠూ. కావాలంటే నువ్వూ రెండు ప్రశ్నలు అడిగి చూడు" అంది ఆవిడ.

'హౌ ఆర్యూ' అని అడిగాడు సేఠ్ రోజా అనే ఆ పిల్లకేసి చూస్తూ.

'మై నేమ్ ఈజ్ రోజా' అంది ఆ అమ్మాయి తడబడుతూ.

"నీ పేరు కాదు. ఎలా ఉన్నావు అని అడుగుతున్నాడు. జవాబు సరిగ్గా చెప్పి చావు. " వెనుకనుండి పళ్ళుకొరింది లక్ష్మి.

"ఫైన్ బాబా" అంది రోజా. ఇక్కడ పనిమనుషులు సేఠును బాబా అనే అంటారు. అరబ్బీలో బాబా అంటే తండ్రి అని అర్థం.

సేఠ్ సంతృప్తిగా తల ఆడించి పర్సులోంచి దినార్లు తీసి ఏజంటుకు అందించి సంతోషంగా ఆ అమ్మాయిని తీసుకుని పోయాడు.

జరిగేదంతా చూస్తుంటే నాకు స్టేజి మీద ప్రదర్శించే ఒక నాటకం చూస్తున్నట్లు అనిపించింది. సేఠు ఇచ్చిన డబ్బులు ఆనందంగా లెక్కపెట్టుకుంటూ "ఈ పిల్లకు పదివేలు ఎక్కువే ఇచ్చాడు" అంటోంది నవ్వుతూ లక్ష్మి.

నా చేతిలోని టీ చేదుగా అనిపించింది నాకు. రోజా వెళ్ళిపోవడంతో అంతవరకూ ఆ అమ్మాయితో కలిసి ఉండి కబుర్లు చెప్పుతున్న తోటి అమ్మాయిలు అందరూ దిగులు మొహాలు వేసుకున్నారు. వారం రోజులుగా వారందరూ కలిసి ఉంటున్నారు. కష్ట సుఖాలు చెప్పుకుని ఓదార్చుకుంటున్నారు.

మళ్ళీ రోజాను తిరిగి ఎప్పుడు చూస్తామో? జీవితంలో మరలా కనిపిస్తుందా? అనే ప్రశ్నలతో వారు మౌనంగా బాధగా అక్కడ కూర్చున్నారు. తమ వంతు ఎప్పుడు వస్తుందో? ఎవరు వచ్చి తమను తీసికెళతారో? ఎటువంటి యజమాని దొరుకుతారో అనే ఆలోచనలతో కాసేపు వాళ్ళు నిశ్శబ్దంగా ఉండిపోయారు.

ఈ ఏజంటు దగ్గర బాధలు పడి తిట్లు తినేదానికంటే ఆ కువైటు ఇంట్లో కష్టాలు పడటం ఎంతో మేలు అనుకుంటున్నారు. ఆ సమయంలో అక్కడ జరిగేవన్నీ చూస్తుంటే నాకు, "అలెక్స్ హేలీ రాసిన 'రూట్స్' అనే పుస్తకంలోని ఆఫ్రికా బానిసల్ని అమ్మే కథ (చరిత్ర) గుర్తుకు వచ్చింది.

"ఇదిగో సంధ్యా! నువు ఇంటికి వెళ్ళి నా బట్టలు ఉతికి ఆరెయ్యి. ఫ్రీజర్‌లో ఉండే చేపలు, బయట పెట్టాను. వాటిని శుభ్రం చేసి చిన్నముక్కలుగా కోసి ఎర్రగా ఫ్రై చెయ్యి. మీ సారుకు చేపల వేపుడు చాలా ఇష్టం. ఈరోజు వాటిని ఫ్రై చెయ్యమని మరీ మరీ చెప్పారు.

అలాగే మీకోసం పప్పుచారు చేసుకొండి. అలమారులో మూలగా ఉన్న స్టోరు బియ్యం మీకోసం వాడుకోండి. నాలుగు గ్లాసులు బియ్యం వండితే మీ అయిదుగురికి సరిపోతాయి. సరుకులన్నీ కాస్త పొదుపుగా వాడండి. నీతో పాటు నీలమ్మను కూడా తీసుకెళ్ళు. మా పడకగది శుభ్రం చేసి బెడ్‌షీట్లు మార్చమని చెప్పు. మీ సారుకు ప్రతిరోజూ పడక మీది దుప్పట్లు మార్చకపోతే అస్సలు నిద్రరాదు" అంటూ పనివారికి పనులు పురమాయిస్తూ మొగుడ్ని గుర్తుచేసుకుని హొయలు వలికిస్తూ లేనిపోని వయ్యారం వంట్లోకి అరువు తెచ్చుకుని ముసి ముసిగా నవ్వింది ఏజంటు లక్ష్మి. ఈ లక్ష్మి మొదట ఇండియాలో పెళ్ళి చేసుకున్న మొగుడ్ని ఏవో గొడవల వల్ల వదిలేసి తనకు ఉన్న ఇద్దరు పిల్లల్ని వాళ్ళ అమ్మ దగ్గర ఉంచి కువైట్‌కు వచ్చింది. ఈవిడ కూడా మొదట కువైట్ ఇంటిలో రెండు సంవత్సరాల పాటు "కద్దామా" (పనిమనిషి)గా చేసింది. తరువాత కువైట్ సేఠ్ మంచివాడు కావడంతో ఆయన్ని అడిగి రిలీజ్ తీసుకుని బయటకు

వచ్చి ఏజంటుగా చేరింది. మనిషి మంచి మాటకారి కావడంతో కష్టమర్‌లకు మాటలు బాగా చెప్పి వ్యాపారం బాగా నడిపిస్తోంది. ఇక్కడ కువైటులో ఈ మధ్యే మరొకతన్ని పెళ్ళి చేసుకుంది. డబ్బు ఎక్కు వయినప్పుడు అన్ని సౌకర్యాలు మనిషికి కావాలి అనిపిస్తాయేమో.

"సరే మేడం - అలాగే చేస్తాం" అంటూ వినయంగా, భయంగా సమాధానం చెప్పి వాళ్ళు వెళ్ళిపోయారు. అక్కడ ఉన్న అద్దం తీసుకుని మరలా ఒకసారి పౌడరు మొహానికి దట్టంగా అద్దుకుని తృప్తిగా తన అందాన్ని చూసుకుని మురిసిపోయింది యాభయ్యేళ్ళ ఏజంటు లక్ష్మి.

"మా ఆయన నన్ను సిల్క్ స్మితలా ఉంటావు అంటాడు. అంత అందంగా ఉన్నానంటావా? " అని గోవా ఏజంటును అడుగుతోంది లక్ష్మి.

"సిల్క్ స్మిత ఏం ఖర్మ? దాని అక్కలా ఉన్నావు లక్ష్మీ" అంది గోవా ఏజంటు మనసులో తిట్టుకుంటూ.

ఇంకా కాసేపు అక్కడే ఉంటే ఖచ్చితంగా పిచ్చి పట్టడం ఖాయం అని భయపడిపోయిన నేను "అర్జంటు పని ఉంది అక్కా మళ్ళీ మరోసారి వస్తాను" అని సెలవు తీసుకున్నాను.

"అయ్యో సమోసాలు తిననేలేదు. టీ కూడా పూర్తిగా తాగనే లేదు నువ్వు. సరే ఇంకోసారి వస్తే ఇంటికి రావాల్సిందే భోజనం చేసి వెళ్ళాల్సిందే. అలాగే మర్చిపోకుండా పనిమనుషుల్ని ఇండియానుండి రప్పించడానికి ప్రయత్నించు. డబ్బు సంపాదించాలంటే ఈ వ్యాపారం చేయక తప్పదు. ఆలోచించు" అని గట్టిగా మరోసారి చెప్పింది. ఇంటికి వెళితే ఇంకెన్ని కథలు వినాలో? అనుకుంటూ "అలాగే తప్పకుండా మరోసారి వస్తాను" అన్నాను. అక్కడే నిలబడి ఉన్న పనిమనుషుల (కద్దామా) వైపు జాలిగా చూస్తూ అక్కడి నుండి బయటపడ్డాను నేను.

## *అయేషా కథ*

**కాలింగ్ బెల్ మ్రోగడంతో** "ఎవరా" అనుకుంటూ వచ్చి తలుపు తీసింది హీనా. నడివయసులో ఉన్న ఒక స్త్రీ తలనిండా ముసుగు వేసుకుని వాకిట్లో నిలబడి ఉంది.

"ఎవరండీ మీరు? ఎవరుకావాలి?" అని అడిగింది హీనా.

"నువ్వే కావాలమ్మా. నీకోసమే వచ్చాను" ముఖం మీది ముసుగును కాస్త పక్కకి తొలగించి చెప్పింది ఆమె.

ఆమె ముఖం చూసి ఉలిక్కిపడింది హీనా. "నువ్వా? మళ్ళీ నువు కువైటుకు వచ్చావా? అయినా ఇక్కడికి ఎందుకు వచ్చావు? ఇక్కడ నీకోసం ఎవరున్నారని వచ్చావు? నువు చేసిన ఘనకార్యాన్ని మర్చిపోయి మా కోసం వచ్చావా? మేము చచ్చామో బ్రతికే ఉన్నామో చూసి పోదామని వచ్చావా? జరిగినదంతా మర్చిపోయి, బాధను దిగమ్రింగుకుని మా పని మేము చేసుకుంటూ ఈ పరాయిదేశంలో గౌరవంగా బ్రతుకుతున్నాం. మమ్మల్ని ఇంకా ఏడిపించాలని వచ్చావా? మా నాన్నకు తెలిస్తే నిన్ను చంపేస్తాడు. దయచేసి నువు తొందరగా ఇక్కడనుండి వెళ్ళిపో. ఆయన నిన్ను మర్చిపోయి, తన దుఃఖాన్ని దిగమ్రింగి మా కోసమే బ్రతుకుతున్నాడు. మళ్ళీ నిన్ను చూసాడంటే కోపంతో నిన్ను ఏం చేస్తాడో! ఆయన ఆరోగ్యం అంతంత మాత్రమే. మా నాన్నకు ఏమయినా అయితే మేం బ్రతకలేం. ఎవరూ లేకపోయినా పన్నెండేళ్ళుగా మాకోసం ఆయనా, నాన్నకోసం మేం పరాయి దేశంలో బ్రతుకును వెళ్ళదీస్తున్నాం. నాన్న నిన్ను చూడకముందే ఇక్కడనుండి వెళ్ళిపో. మళ్ళీ మాయింటివైపు రాకు" అని చెప్పింది కోపంగా హీనా.

ఆఖరిసారిగా ప్రయత్నిస్తున్నట్లు "అది కాదురా చిట్టి తల్లీ, అసలు ఏం జరిగిందంటే!?" అంటూ ఏదో చెప్పబోయింది ఆమె. చెబుతూ ఒక అడుగు ముందుకు వేసి తన పెద్ద కుమార్తె అయిన హీనా గడ్డం పట్టుకుంది ప్రేమగా.

ఆమె స్పర్శ తనకు అసహ్యం కలిగిస్తున్నట్లు ఆమె చేతిని విసురుగా తోసేసింది హీనా.

"వద్దమ్మా. నువ్వు నాకు కథలు చెప్పకు. పన్నెండేళ్ళ క్రితమే నువ్వు మన బంధాలన్నీ త్రెంచేసి నీ దేశం వెళ్ళిపోయి నీ సుఖం నువు చూసుకున్నావు. పసిబిడ్డలమని కూడా చూడకుండా, మమ్మల్ని గాలికి వదిలేసి నీ దారిన నువ్వు వెళ్ళిపోయావు. నువు కన్నతల్లివేనా? నీలాంటి తల్లి ఉన్నా ఒకటే, చనిపోయినా ఒకటే. నీలాగే మానాన్నకూడా, మమ్మల్ని వదిలేసి ఎవతెనో ఒకతిని చేసుకుని ఆయన సుఖం చూసుకుని ఉంటే.. ఈ కువైటు దేశంలో మేము దిక్కులేని వాళ్ళమై వీధుల పాలయ్యేవాళ్ళం కదా! మా నాన్నకు ఇపుడు కనిపించి ఆయనకు కోపం తెప్పించకు. ఆయన నిన్ను చూడకముందే ఇక్కడినుండి వెళ్ళిపో. మాకు అమ్మలేదు. చచ్చిపోయింది అనే భావంతో నిన్ను మరిచిపోయి నిశ్చింతగా ఉన్నాం. మళ్ళీ మా జీవితాల్లోకి ప్రవేశించి మనశ్శాంతి లేకుండా చేయకు. వెంటనే ఇక్కడనుండి వెళ్ళిపో. మళ్ళీ ఇటువైపు రాకు" అని చెప్పి చేతులు జోడించింది హీనా.

ఇక మాట్లడటానికి ఏమీ లేకపోవడంతో, మాట్లాడినా తన బిడ్డ వినే పరిస్థితిలో లేదని, తనపై చాలా కోపంగా ఉందని తెలుసుకున్న అయేషా కళ్ళలోనుండి నీళ్ళు ధారలుగా చెంపలపై ప్రవహిస్తుంటే.. వాటిని తుడుచుకుంటూ వెనుదిరిగింది.

ఆ వెనకనే విసురుగా తలుపు మూసేసింది హీనా. కానీ మూసిన ఆ తలుపు వెనకాల చేరగిలబడి చెప్పలేని బాధతో చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది హీనా. పన్నెండేళ్ళుగా దూరమయిన అమ్మ ప్రేమ తాము అనుభవించిన బాధలు, ఒంటరితనం, అవమానాలు గుర్తుకు వచ్చి ఆ అమ్మాయి హృదయాన్ని కరిగించి కన్నీళ్ళుగా మార్చాయి.

ఇంక అక్కడ చేసేదేమీ లేక ఏడుస్తూ వెళ్ళిపోయింది అయేషా.

అష్టకష్టాలు పడి, కొత్త పాస్‌పోర్ట్ తయారు చేయించుకుని, వీసా తెప్పించుకుని పన్నెండేళ్ళ తరువాత కువైటుకు మళ్ళీ వచ్చింది. తను వదిలేసి వెళ్ళిపోయిన భర్త, తన పిల్లలు ఎలా ఉన్నారో చూడాలనే ఆశతో శ్రీలంక నుండి రెండురోజుల క్రితమే ఇక్కడికి వచ్చి ఒక స్నేహితురాలి రూములో తలదాచుకుంది ఆమె.

ఆమె జీవితంలో ఏం జరిగిందో, ఎందుకు ఆమె తిరిగి కువైటుకు రాలేకపోయిందో, పన్నెండేళ్ళు ఎంతగా బిడ్డల్ని తలచుకుని దుఃఖించిందో ఆమెకే తెలుసు. జరిగిన కథనంతా వక్రీకరించి చెప్పిన తనవాళ్ళు తన భర్తకు, బిడ్డలకు తనపై కోపం తెప్పించారు. అన్ని విధాలా నిస్సహాయురాలై, తనవాళ్ళచే నిర్భందించబడి శ్రీలంకలో పన్నెండేళ్ళు హృదయవేదనతో, ఆరని కంటి తడితో కాలం గడిపింది. తన బాధను, కథను భర్తకు, పిల్లలకు వివరించి చెప్పి వారిని ఒక్కసారి కళ్ళారా చూడాలనే ఆశతో వచ్చింది ఆమె.

విధి విచిత్రమయింది. ఎడారి దేశంలో ఎక్కడెక్కడివాళ్ళనో ఏరి తెచ్చి ఇక్కడ కలిపి, వాళ్ళ మధ్య ప్రేమలు, బంధాలు ఏర్పరచి వింత నాటకం ఆడుతుంది ఈ విధి.

దేశాలు, భాషలు, సాంప్రదాయాలు, పద్ధతులు ఆహారపు అలవాట్లు, వస్త్రధారణ లాంటివి వేరయినా మనుషులంతా ఒక్కటే. హృదయాలు కూడా ఒక్కటే. ప్రేమకు ఇవి ఏవీ అడ్డురావు కదా!

మరుసటిరోజు చిన్న కూతురు సల్మాను చూడాలనే తాపత్రయంతో సిటీబస్ ఎక్కి కువైటు సిటీకి చేరుకుంది అయేషా. పన్నెండేళ్ళ కాలంలో కువైట్ సిటీలో చాలా మార్పులు వచ్చాయి. ఈమధ్య కాలంలో జనాభా పెరిగారు. పెద్ద పెద్ద భవనాలు పైకి లేచాయి. పట్టణం ఎత్తైన టవర్స్‌తో ఠీవిగా అందంగా ఉంది. సిటీలోని అజాద్ ట్రావెల్స్‌లో సల్మా పనిచేస్తోంది అని తెలుసుకున్న అయేషా సిటీ బస్టాండులో

బస్సు దిగి ఆ ట్రావెల్స్ ఆఫీసువైపు నడిచింది. చుట్టూ అద్దాలు బిగించివున్న ఆ ట్రావెల్ ఏజన్సీ లోపల కౌంటర్స్ దగ్గర దాదాపు ఎనిమిది మంది ఏజంట్లు కూర్చుని ఉన్నారు. వాళ్ళలో అమ్మాయిలు ఐదుగురు, అబ్బాయిలు ముగ్గురు ఉన్నారు.

ఫ్లయిట్ టిక్కట్లకోసం వచ్చిపోయే కష్టమర్లతో మాట్లాడుతూ వాళ్ళు చాలా బిజీగా ఉన్నారు. వాళ్ళలో తన చిన్నకూతురు సల్మా ఎక్కడ ఉందా? అని పరిశీలించి చూస్తూ చిన్నగా లోపలికి ప్రవేశించింది అయేషా. అదిగో.. ఆ ఆఖరు కౌంటరులో కూర్చుని ఉంది సల్మా. తన ముద్దుల కూతురు, పన్నెండేళ్ళ క్రితం ఎనిమిదేళ్ళ వయసులో ఉండే సల్మా ఇపుడు ఇరవై ఏళ్ళ వయసును నింపుకుని చాలా అందంగా ఉంది. ఒకప్పుడు అయేషా ఎలా ఉండేదో అచ్చం అలాగే తల్లిని పోలి ఉంది సల్మా. కన్నబిడ్డను గుర్తుపట్టడం కష్టంకాలేదు ఆ తల్లికి. చాలా సంవత్సరాల తరువాత బిడ్డను చూసిన ఆ తల్లి హృదయం ఆక్షణంలో ఆనందభాష్పాలను రాల్చింది. ఎదిగిన తన బిడ్డను చూసి ఆ మాతృ హృదయం సంతోషంతో ఉప్పొంగింది.

సల్మా కూర్చున్న క్యాబిన్ ఎదురుగా నిలబడి కూతుర్ని కాసేపు కళ్ళారా చూసుకుంది. ఒత్తైన జుట్టు సల్మాది. నుదుటి మీద పడే ముంగురులు ఎడమ చేత్తో స్టయిల్‌గా పైకి తోసుకుంటూ చిరునవ్వుతో కష్టమర్లకు వారి ఫ్లయిట్ డిటెయిల్స్ వివరిస్తోంది సల్మా. ఆ చిరునవ్వును చూసిన అయేషా పెద్దకూతురు హీనాలాగా, సల్మా తనను త్రోసి వేయదు అనుకుంది. అక్కడే ఒక మూలన ఉన్న ఫిల్టరులోని నీళ్ళు గ్లాసులోకి పట్టుకుని త్రాగి కష్టమర్లందరూ వెళ్ళిపోయేంతవరకు సల్మానే చూస్తూ ఆప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంది అయేషా.

"ఎవరండీ మీరు? ఫ్లయిట్ టిక్కెట్లు కొనడానికి వచ్చారా? అయితే ఇక్కడికి వచ్చి కూర్చుని వివరాలు చెప్పండి" అనే సల్మా మాటలతో ఉలిక్కిపడింది ఆమె. వెంటనే అక్కడినుండి లేచి వచ్చి సల్మా దగ్గరే ఉన్న కుర్చీలో కూర్చుంది అయేషా.

సల్మా ఇంకా తన తల్లిని గుర్తుపట్టినట్టులేదు.

"మీరు వెళ్ళాల్సిన డెస్టినేషను, డేట్స్ చెప్పండి" అంటోంది.

ముద్దులొలికే సల్మా ముఖాన్ని చూస్తూ మాటలే మరిచిపోయింది ఆ తల్లి. ఆ క్షణంలో తను పడిన కష్టాలన్నీ మరచిపోయింది.

"హల్లో.. ఏమిటండీ, ఏమీ మాట్లాడకుండా ఏదో ఆలోచిస్తూ అలా వింతగా నావైపు చూస్తున్నారు?" లంచ్ టైమ్ అవుతోంది.

"కాస్త తొందరగా మీ ఫ్లయిట్ వివరాలు చెపితే మీ టిక్కెట్లు బుక్ చేసి వెళతాను" అంది.

సల్మా మాటల్లో కనిపించిన కాస్త విసుగును గమనించి చిన్నగా నవ్వింది అయేషా. "చిన్నీ నన్ను గుర్తుపట్టలేదా" అంది సల్మా ముఖంలోకి పట్టి చూస్తూ ఆప్యాయంగా. ఆ పిలుపుతో చేస్తున్న పని ఆపి, తలెత్తి చూసింది సల్మా.

"నువ్వు.. నువ్వు.. అమ్మవు కదూ?" అంది ఆశ్చర్యంతో కనురెప్పలు అల్లాడిస్తూ.

"అవును చిన్నీ.. హమ్మయ్య ఇప్పటికైనా గుర్తుపట్టావు నన్ను. నిన్ను విడిచిపెట్టి పన్నెండేళ్ళు అయిందికదా! నా తప్పేమీ లేదమ్మా. కొన్ని పరిస్థితుల ప్రభావం వలన అలా చేయాల్సొచ్చింది దయచేసి ఈ అమ్మను క్షమించు తల్లీ" అంది అయేషా కూతురు చేతులు పట్టుకుని.

తల్లిని చూసిన సల్మా సంతోషించింది. గుండెల్లోంచి దుఃఖం పైకి ఉప్పొంగగా తల్లి కౌగిలిలో ఒదిగిపోయింది.

కాసేపటికి తెప్పరిల్లి, అది తను పనిచేసే ఆఫీసు అని గుర్తుతెచ్చుకుని కంగారుగా అటూ, ఇటూ చూసింది సల్మా.

"అమ్మా నువ్వు సాయంత్రం ఆరుగంటలకు ఇక్కడికిరా! ఆఫీసు అయ్యాక మనం తీరిగ్గా కూర్చుని మాట్లాడుకుందాం" అంది సల్మా.

"అలాగే" అన్నట్లు తలూపి సల్మా నుదిటిపై ముద్దుపెట్టుకుని అక్కడినుండి వెళ్ళిపోయింది అయేషా.

చాలాకాలం తరువాత అమ్మను చూసిన సంతోషం ఓ వైపు, ఆమె తమను విడిచి వెళ్ళిపోయిందనే కోపం మరోవైపు. ఏం చెయ్యాలో అర్థంకాని అయోమయంలోకి సల్మాను నెట్టేసాయి.

చిన్నతనంలో అమ్మ తినిపించిన గోరుముద్దలు, ఆమె ప్రేమ, లాలన గుర్తొచ్చి కళ్ళు చెమర్చాయి.

***

అమ్మ వెళ్ళిపోయినపుడు హీనా పదేళ్ళ వయసుది. కానీ సల్మాకు అప్పటికి ఎనిమిదేళ్ళు మాత్రమే. అప్పటికి ఇంకా ఊహ తెలియని వయసు.

ఆరోజు శ్రీలంక నుండి ఫోను వచ్చింది. అమ్మమ్మ ఆఖరి క్షణాల్లో ఆసుపత్రిలో ఉందంటూ అమ్మకోసం ఫోను చేసారు. ఒకసారి అర్జంటుగా వచ్చి చూసి వెళ్ళాలని, అమ్మమ్మ, అమ్మనే కలవరిస్తోందని చెప్పారు. విధిలేక అమ్మ అప్పటికప్పుడు ప్రయాణమై వెళ్ళిపోయింది. తిరిగి వచ్చేంతవరకు పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోమని నాన్నకు చెప్పి ఏడుస్తూ ఫ్లయిట్ ఎక్కింది అమ్మ. ఆఖరుసారిగా అమ్మను చూసింది అప్పుడే

అమ్మా నాన్నా ప్రేమించి పెళ్ళిచేసుకోవడంతో, వాళ్ళ అమ్మా నాన్నాలు వీళ్ళ ప్రేమను ఒప్పుకోక కోపంగా ఉన్నారు. అందువలన అప్పటివరకు పదేళ్ళుగా వాళ్ళను చూడటానికి శ్రీలంక ఎప్పుడూ వెళ్ళలేదు.

అమ్మ వెళ్ళిపోయిన తరువాత, ప్రపంచం అంతా శూన్యమైపోయింది. నాన్నకూడా దిగులుగా ఏదో లోకంలో ఉన్నట్లు ఉండేవాడు. పదిరోజుల్లో తిరిగి వస్తాను అన్న అమ్మ నెలరోజులయినా రాలేదు. నాన్న అమ్మకోసం శ్రీలంకకు ప్రతిరోజూ ఫోను చేస్తున్నాడు. కానీ వాళ్ళు అమ్మ ఇక తిరిగిరాదని అక్కడ మరో పెళ్ళిచేసుకుందని, మమ్మల్ని మరచిపోయి సంతోషంగా ఉందని చెప్పారంట. నాన్నకు ఏం చెయ్యాలో అర్థంకాలేదు. వెళదామంటే - శ్రీలంక తన స్వదేశం కాదు. ఒకరోజు అమ్మ రాసిన ఉత్తరం కూడా వచ్చింది. అందులో తను అత్త కొడుకుని చేసుకుని సంతోషంగా ఉన్నానని తనని మరచిపోవాలని ఉందట.

దాంతో నాన్న మండిపడ్డాడు. అది ఆడదేనా? భర్తను పిల్లల్ని వదిలేసి, తన దేశం వెళ్ళి మరో పెళ్ళిచేసుకుంటుందా? అది కనిపిస్తే చంపి పారేస్తాను అంటూ కోపంతో ఎగిరాడు.

అమ్మ లేకపోవడంతో తమ పోషణ, సంరక్షణా భారం అంతా నాన్న మీద పడింది. తెలిసిన వారందరూ నాన్నను మరో పెళ్ళి చేసుకోమని సలహా ఇచ్చారు. (అంతవరకు శ్రీలంక అమ్మాయిని చేసుకున్నాడని కోపంగా ఉన్న) నాన్నమ్మ వాళ్ళు, ఇండియా వచ్చి పెళ్ళిచేసుకోమని నాన్నను బలవంత పెట్టారు. నాన్న ఎవరి మాటా వినలేదు. 'పిల్లల మీద కూడా ప్రేమ, దయలేని ఆ ఆడది వెళ్ళిపోయి తన సుఖం తాను చూసుకుంది. నేను పిల్లల్ని వదలలేను. ఎంత కష్టమైనా సరే నా పిల్లల్ని పెంచి పెద్ద చేస్తాను. నాకు మరో పెళ్ళి అవసరం లేదు' అన్నాడు నాన్న. నాన్న ఇండియన్, అమ్మ శ్రీలంకన్ కావడంతో చాలా సమస్యలు వచ్చాయి. అంతగా ప్రేమించే అమ్మ తమను విడిచి ఎందుకు తన దేశం వెళ్ళి మరో పెళ్ళి చేసుకుందో ఆ చిన్న వయసులో తనకి అర్థం కాలేదు.

అమ్మ గుర్తుకు వచ్చినప్పుడల్లా అమ్మ కావాలి అని ఏడిస్తే 'మీ అమ్మ చచ్చిపోయింది. ఇక తిరిగి రాదు. ఇంకోసారి అమ్మకావాలి అని ఏడిస్తే నేను కూడా మిమ్మల్ని వదిలేసి వెళ్ళిపోతాను. తరువాత ఈ కువైటులో మీకోసం ఎవరూ ఉండరు' అని నాన్న బెదిరించేవాడు. నాన్న కూడా తమను వదిలేసి వెళ్ళిపోతాడేమో అనే భయంతో మళ్ళీ అమ్మ ప్రసక్తి ఎత్తేవారు కారు. చెప్పలేనంత బాధ, దిగులు మనసులోనే దాచుకుని అక్క చెల్లెళ్ళు ఇద్దరూ ఒకరికి ఒకరై, ఆసరాగా నిలిచి ధైర్యం చెప్పుకుని తోడుగా నిలిచారు. హైస్కూలు చదువు పూర్తికాగానే హీనా చదువు మానేసి చిన్న ఉద్యోగంలో చేరి వాళ్ళ నాన్నకు ఆసరాగా నిలబడింది.

తను మాత్రం కాలేజి చదువు పూర్తి చేసి, ఈ ట్రావెల్స్‌లో ఏజంటుగా పనిలోకి చేరింది.

తెలిసిన వారందరూ మీ అమ్మ వెళ్ళిపోయి ఇంకో పెళ్ళి చేసుకుందటగా? అది ఎలాంటి ఆడది? అంత పని చేయగలిగింది? బిడ్డలకన్నా మరో భర్త ముఖ్యమయ్యాడా? అని మొహాన్నే మాట్లాడుకునేవారు. ప్రశ్నలతో వేధించేవారు. వారి మాటలు చెవిన బడినపుడు అమ్మ మీద చాల కోపం వచ్చేది. తమ తప్పు ఏమిటో? తల్లి ఎందుకు అలా వదిలేసి వెళ్ళిపోయిందో అర్థంకాక ఏడ్చేవారు.

కానీ ఆ పరాయి దేశంలో తండ్రి తప్ప ఎవరూ లేనిచోట ఎవరితో తమ బాధ పంచుకోవాలో అర్థంకాక వేదనంతా గుండెలోనే దిగమింగుకుని అక్కా చెల్లెళ్ళు ఒకరినొకరు ఓదార్చుకునేవారు. ఒకరి కన్నీళ్ళు మరొకరు తుడుచుకుని ధైర్యం చెప్పుకునేవారు.

ఇప్పుడిపుడే ఊహ తెలిసాక చదువులు పూర్తయి ఉద్యోగాలు చేయడం మొదలుపెట్టాక, తల్లి జ్ఞాపకాలను కాస్త విడిచిపెట్టిన వాళ్ళు చుట్టూ ఉన్న ప్రపంచంలో కలిసి పని చేసుకుంటున్నారు. లేకపోతే తాము ఏదో తప్పు చేసినట్లు, ఒంటరివారైనట్లు భావించి బాధపడేవారు.

నాన్న ఎపుడూ దిగులుగా తనలోకంలో తాను ఉండేవాడు. అపుడపుడూ శ్రీలంకదాన్ని చేసుకుని, నమ్మి తప్పుచేసాను. హృదయంలేని ఆడదానితో పిల్లల్ని కనడం ఇంకా తప్పు. మీ జీవితాన్ని నేనే నాశనం చేసాను. నా ప్రాణం పోతే మీ ఇద్దరూ ఎలా బ్రతుకుతారు? ఈ పరాయి దేశంలో మీకు ఎవరున్నారు అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకునేవాడు తండ్రి.

ఇప్పుడు ఇద్దరూ పెరిగి పెద్దవారయి ఉద్యోగాలు చేస్తూ తండ్రికి ఆసరాగా నిలవడంతో బిడ్డల పట్టుదల చూసి తండ్రి కూడా సంతోషంగా ఉన్నాడు. మంచి అబ్బాయిల్ని చూసి వారికి పెళ్ళిచేస్తే వారి జీవితాలు ఒక గట్టుకు చేరతాయి అని ఆయన భావించి, మంచి సంబంధాల కోసం అందరికీ చెపుతూ ఉన్నాడు.

అంతా సజావుగా సాగిపోతున్న సమయంలో.. పన్నెండేళ్ళ క్రితం వెళ్ళిపోయిన అమ్మ తిరిగి కువైటు రావడం ఏమిటో? ఎందుకు శ్రీలంక నుండి తిరిగి వచ్చిందో సల్మాకు అర్థం కాలేదు. నాన్నకు తెలిస్తే ఏమయినా ఉందా? అమ్మను చంపేస్తాడు. ఆ ఆలోచనకే భయంతో వణికిపోయింది సల్మా. ఏం చేయాలో అర్థంకాలేదు సల్మాకు. కానీ దూరమయిన తల్లి ప్రేమ కోసం ఆ అమ్మాయి హృదయం కరిగిపోయింది. తొందరగా పని పూర్తిచేసుకుని అమ్మను మరలా చూడాలి. మాట్లాడాలి అనే ఆశతో ఎదురు చూడసాగింది సల్మా.

సాయంత్రం ఆరుగంటల సమయంలో పనిముగించుకుని టేబులు సర్దుకుంటూ ఉండగానే అయేషా వచ్చి చిరునవ్వుతో ఎదురుగా నిలబడింది.

తల్లి ముఖం చూడగానే సల్మా హృదయం తెలియని ఆనందంతో గంతులు వేసింది. హీనా మాదిరిగా కఠినంగా ప్రవర్తించి, తల్లిని త్రోసి వేయలేక పోయింది. జరిగినదంతా మర్చిపోయి, తల్లి ప్రేమకై సల్మా తాపత్రయపడింది. అమ్మను చూడగానే తొందరగా బయటికి వచ్చి అమ్మ భుజాల చుట్టూ చేతులు వేసి చిన్నపిల్లలా హత్తుకుంది. ఎపుడో చిన్నపుడు అనుభవించిన అమ్మ స్పర్శ మళ్ళీ ఇంతకాలానికి దొరికింది. ఎన్నాళ్ళగానో ఎదురు చూసిన ఆ కలయిక అద్భుతంగా ఉంది. తనకంటే పొడవుగా పెరిగిన సల్మాను చూసి పొంగిపోయింది అయేషా. ఇద్దరి కన్నుల్లో కన్నీరు వరదై ప్రవహించింది.

ఆ సమయంలో సల్మాకు వాళ్ళ నాన్న గుర్తుకు రాలేదు.

ఆ రోజు మొదలు ప్రతిరోజూ సాయంత్రం తన ఆఫీసు అవగానే వాళ్ళమ్మతో కలిసి బయట గడపడం అలవాటు చేసుకుంది సల్మా.

సల్మా ప్రతిరోజూ ఇంటికి ఎందుకు ఆలస్యంగా వస్తోందో హీనాకు అర్ధం కావడం లేదు. అడిగినా సల్మా నిజం చెప్పడం లేదు. ఆఫీసు పని ఎక్కువయింది అందుకే ఆలస్యం అవుతోంది అంటోంది.

రోజు రోజుకూ సంతోషంగా ఉంటూ క్రొత్త హుషారును తనలో నింపుకుంటున్న సల్మాను చూసి కొంప దీసి ఈ అమ్మాయి ప్రేమలో పడలేదు కదా? అనే సందేహం కలిగింది హీనాకు.

సాయంత్రం పూట సల్మా ఎక్కడికి వెళుతోందో కనిపెట్టాలి అని హీనా గట్టిగా నిర్ణయించుకుంది. కానీ బయటికి వెళ్ళి సల్మాను ఫాలో అయే అవసరం హీనాకు రాలేదు.

ఒకరోజు అరేబియా సముద్రపు ఒడ్డున ఉన్న ఒక అరబిక్ రెస్టారెంటులో కూచుని వాళ్ళమ్మతో డిన్నర్ చేస్తున్న సల్మాను వాళ్ళ నాన్న ఇక్బాల్ చూసాడు.

పన్నెండేళ్ళ తరువాత తిరిగి కువైటు వచ్చిన భార్యను చూసి షాకయ్యాడు. ఆమె తనకు చేసిన ద్రోహం గుర్తుకు వచ్చింది. పదిమందిలో తనకు కలిగిన అవమానం చిన్నదికాదు కదా? భార్యమీద చాలా కోపం వచ్చింది. పన్నెండేళ్ళ కాలం తన సుఖం తాను చూసుకున్న ఆడది తిరిగి ఎందుకు వచ్చిందో అర్ధంకాక అక్కడనుండి కోపంగా ఇంటికి వచ్చాడు. ఏదో ఆలోచిస్తూ మౌనంగా కూచున్న తండ్రిని చూసి హీనా భయపడింది. తండ్రి ప్రవర్తన హీనాలో భయాన్ని కలిగించింది. సల్మా ప్రేమలో పడిందన్న విషయం తండ్రికి తెలిసిందో లేక అమ్మ అయేషా తిరిగి కువైటుకు వచ్చిందని తెలిసిందో అర్ధం కాలేదు. రకరకాల సందేహాలతో హీనా సల్మా కోసం ఎదురు చూస్తూ కూర్చుంది.

రాత్రి తొమిదిగంటల సమయంలో సల్మా సంతోషంగా ఇంటికి వచ్చింది. అమ్మ ప్రేమ తిరిగి లభించడంతో ఏదో పెన్నిధి దొరికినట్లు ఉంది సల్మాకు. ఇంట్లోకి అడుగుపెట్టిన సల్మాను చూసిన ఇక్బాల్ "సల్మా ఇంత రాత్రివరకూ ఎక్కడికి వెళ్ళావు?" అని కోపంగా ప్రశ్నించాడు.

"ఫ్రెండ్స్‌తో బీచ్‌కి వెళ్ళాను నాన్నా" భయంగా చెప్పింది సల్మా.

"అబద్ధం చెప్పడం ఎపుడు నేర్చుకున్నావు? నిజం చెప్పు. అంతా నేను చూసాను. నువు ఎవరితో డిన్నరు చేసావు? నాకు చెప్పకుండా నీ ఇష్టం వచ్చినట్లు దానితో మాట్లాడతావా? అసలు అది ఎందుకు ఇక్కడికి వచ్చింది? " ఆవేశంతో మండిపడ్డాడు ఇక్బాల్.

"అవును నాన్నా! అమ్మ మనకోసం శ్రీలంక నుండి తిరిగి వచ్చింది. ప్రతిరోజూ అమ్మను కలిసి ఇంటికి వస్తున్నా నాన్నా" అంది సల్మా ధైర్యంగా.

"దానికంటే సిగ్గులేదు. చేసిన పని చాలక తిరిగి వచ్చింది. నీకు బుద్ధిలేదా? దాంతో పాటు నువ్వు కూడా శ్రీలంక వెళ్ళిపోతావా? " అడిగాడు.

"లేదు నాన్నా, అమ్మ నాతో జరిగిందంతా చెప్పింది మనం అనుకున్నట్లు అందులో అమ్మ తప్పేమీలేదు. వాళ్ళ అమ్మ నాన్నలు నీ మీది కోపంతో అమ్మకు అబద్ధం చెప్పి వాళ్ళదేశం రప్పించుకున్నారు అమ్మకు బలవంతంగా మరో పెళ్ళిచేసారు. పాస్‌పోర్టు చించిపడేసి ఇంటిలో నిర్భందించారు. అమ్మకు ఏ మార్గమూ కనపడలేదు తిరిగి రావడానికి పాస్‌పోర్టు కూడా లేదు. ఎన్నోసార్లు ఫోను చేయాలనుకున్నా వాళ్ళు ఆ అవకాశం అమ్మకు ఇవ్వలేదు. పన్నెండేళ్ళుగా అమ్మ మళ్ళీ మనల్ని కలవాలనే ఉద్దేశ్యంతో చాలా పట్టుదలతో ప్రయాసపడింది. మళ్ళీ క్రొత్త పాస్ పోర్టు తయారు చేయించుకుని అతి కష్టం మీద వీసా తెప్పించుకుని మనకోసం మళ్ళీ కువైటు

వచ్చింది నాన్నా. అక్కడ అమ్మ సుఖాలు అనుభవించలేదు. ఎన్నో కష్టాలు భరించి కన్నీళ్ళు కార్చింది. తనవారి మొండితనంతో, మూర్ఖత్వంతో సమస్యల్లో చిక్కుకుని ఎంతో వేదన అనుభరించింది నాన్నా.

పన్నెండేళ్ళుగా అమ్మలేకుండా మేము, భార్యలేకుండా నువ్వు ఎంతో శిక్షను అనుభవించాము. ఇకనైనా నువ్వు కోపం మరచి అమ్మను చేర్చుకుని ఆదరిస్తే మనం అంతా కలిసి సంతోషంగా ఉండచ్చు ఆలోచించు నాన్నా'' మెల్లగా అయినా స్పష్టంగా చెప్పింది సల్మా.

సల్మా మాటలతో ఇక్బాల్ కోపం మంచులా కరిగిపోయింది. నిజం తెలిసిన హీనా నిర్ఘాంతపోయింది. వాకిట్లోకి వచ్చిన అమ్మను కనీసం మాట్లాడనీయకుండా బయటకి తోసినందుకు. తన కఠినమైన ప్రవర్తనకు హీనా తనను తానే అసహ్యంచుకుంది. తల్లిని మరలా ఎపుడు చూస్తానా అని హీనా ఆత్రుతపడింది. తల్లి ఒడిలో తలదాచుకుని తన తప్పును క్షమించమని అడగాలి అని నిశ్చయించుకుంది హీనా.

తనకంటే చిన్నదైనా, సల్మా నెమ్మదైన మనస్సుతో అమ్మతో మాట్లాడి ఆమెకు ఓదార్పునిచ్చింది కదా అనే భావంతో మంచిపని చేసావు అన్నట్లు సల్మావైపు అభినందన పూర్వకంగా చూసింది హీనా.

తండ్రి ఏమి చెపుతాడో ఏ నిర్ణయం తీసుకుంటాడో అని కంగారు పడుతోంది సల్మా. కళ్ళుమూసుకుని సోఫాలో చేరగిలబడి కూర్చుని ఆలోచిస్తున్న తండ్రి ముఖం వైపే ఆశగా చూస్తోంది సల్మా.

ఐదు నిమిషాల తరువాత ఏదో స్థిరనిశ్చయానికి వచ్చినట్లు పైకి లేచాడు ఇక్బాల్.

''సల్మా! పద, మీ అమ్మ దగ్గరికి వెళదాం. మీ అమ్మను మన ఇంటికి తీసుకుని వద్దాం. జరిగింది ఏదో జరిగిపోయింది. ఇకనైనా మనం అందరం కలిసి సంతోషంగా ఉందాం'' అన్నాడు.

తండ్రి మాటలతో వారి మొహాల్లోకి వెలుగు వచ్చింది. పన్నెండేళ్ళుగా అమ్మలేని లోటు, జీవితంలోని వెలితి ఈరోజుతో తీరబోతున్నాయనే సంతోషంతో ఇద్దరూ వచ్చి వాళ్ళ నాన్న భుజాలపై తల వాల్చారు. వెంటనే ముగ్గురూ వెళ్ళి సాల్మియాలో తన ఫ్రెండ్ ఇంటిలో ఉన్న అయేషాను ఇంటికి తీసుకుని వచ్చారు. చాలాకాలం తరువాత మళ్ళీ వాళ్ళింట్లో వెలుగులు, వారి మొహాల్లో వెన్నెలలు విరబూసాయి. ఇక. ఆ రోజు తిరిగి కలుసుకున్న ఆ భార్యాభర్తల హృదయాల్లోని సంబరం, సంచలనం, భావోద్వేగం మాటల్లో చెప్పనలవికాదు. అయేషా బుగ్గల్లోని మెరుపును, ఇక్బాల్ పెదవులపై తొణికిసలాడే చిరునవ్వును చూస్తే అర్థమవుతుంది, భార్యాభర్తల బంధం ఎంత గొప్పదో!

పరాయిదేశమైనా, ఎండలు కాసే ఎడారి దేశమైనా సరే ప్రేమ ఉన్న బంధాలు ఒక్కోసారి మోడైపోయినా తిరిగి జీవం నింపుకుని పచ్చటి చివురులు వేస్తాయి. దూరమైన మనుషుల్ని కూడా దగ్గరికి చేరుస్తాయి. పంతాలు, పట్టింపులు, అపార్థాలు, కోపాలు మనుషుల ప్రేమల్ని, బంధాల్ని విడదీసి దూరం చేస్తాయి. అందుకే మన హృదయాల్లో మనం ప్రేమను ఎప్పుడూ నింపుకోవాలి.

పన్నెండేళ్ళ తరువాత కలుసుకుని ఒక్కటైన ఆ కుటుంబం ఇపుడు సంతోషంగా కాలం గడుపుతోంది. ఈ మధ్య మంచి అబ్బాయిని చూసి హీనాకు పెళ్ళిచేసారు. ఇక్బాల్ నాతోపాటు పనిచేస్తూ ఉంటాడు కాబట్టి నన్ను కూడా ఆహ్వానించడంతో వెళ్ళి హీనా పెళ్ళిని చూసి వచ్చాను. అక్కడ అయేషాగారిని, సల్మాను కూడా కలవడం జరిగింది.

సల్మా ఒకబ్బాయిని ప్రేమించిందని త్వరలో వారికి కూడా వివాహం జరిపిస్తామని ఇక్బాల్ నాతో చెప్పారు. ఆ పెళ్ళికి వచ్చిన సల్మా బాయ్‌ఫ్రెండ్‌ను నాక్కూడా పరిచయం చేసారు. ఆ అబ్బాయి చాలా బాగున్నాడు. అందమైన సల్మాన్‌కు అతడు ఈడూ జోడుగా ఉంటాడు అనిపించింది.

ఎన్నో కష్టాలు పడి ఎంతో ఎడబాటును అనుభవించి ఆఖరికి ఒక్కటై, సంతోషంగా ఉన్న ఆ కుటుంబాన్ని చూసి నాకు చాలా సంతోషం కలిగింది.

కానీ మాతోపాటు పనిచేసే కొలీగ్స్ కొందరు ఆక్కడ గుసగుసలు చెప్పుకోవడం, హేళనగా మాట్లాడుకోవడం నాకు వినిపించింది. ఆపరేటర్‌గా పనిచేసే డోనా, నా దగ్గరికి పరిగెత్తుకుంటూ వచ్చి ప్రక్కన కూర్చుంది. "వీళ్ళని చూడు ఎంత సంతోషంగా, ఏమీ జరగనట్లు ఉన్నారో? సిగ్గులేకుండా అంతా దాచి పెట్టి ఆడపిల్లల పెళ్ళిళ్ళు కూడా చేసేస్తున్నారు. ఈ అయేషా మరో మగవాడ్ని పెళ్ళి చేసుకుని పన్నెండేళ్ళు శ్రీలంకలో కాపురం చేసింది. తరువాత వాడితో ఏమయిందో ఏమో ఏమీ జరగనట్లు కువైటుకు తిరిగి వచ్చి ఇక్కడ మళ్ళీ మొదటి మొగుడితో కాపురం చేస్తోంది. హవ్వ! ఎంత బరితెగించిన ఆడది ఇది" అంటూ తన ధోరణిలో తాను చెత్త వాగుడు వాగుతోంది. నాకు చాలా బాధ కలిగింది. ఈ మనుష్యులు ఎప్పటికీ మారరేమో? సంతోషంగా ఉన్న వారిని చూసి ఈర్ష్యపడటం, తమలోని పొరపాట్లు, లోపాలు మర్చిపోయి, ఎదుటివారి జీవితాల్లోకి తొంగిచూసి, వారిని హేళన చేయడం, నిందలు వేసి నవ్వుకోవడం లాంటివి మనుషుల్లోని పైశాచిక ప్రవృత్తికి చిహ్నాలేమో.

ఇలాంటివారిని మనుషుల్లోని ఒక హీనమైన తెగలోకి కేటాయించి, ప్రత్యేక పరచాలని అనిపిస్తుంది నాకు.

తను చెప్పే మాటలు నేను వినడం లేదని, ఆసక్తి కనపరచడం లేదని తెలుసుకున్న డోనా నా ప్రక్కనుండి లేచి ఆడవాళ్ళున్న ఇంకోవైపు వెళ్ళింది. అక్కడ మరలా యాధావిధిగా తన వాగుడు మొదలుపెట్టింది.

డోనాను చూసిన నాకు జాలి కలిగింది. ఇలాంటి వాళ్ళు మనిషిరూపంలో ఎలా, ఎందుకు జన్మనిస్తారో అని బాధపడ్డాను.

పదేళ్ళ క్రితం మా ఆఫీసులో పెద్ద హాట్ న్యూస్ ఏమిటి అంటే ఇక్బాల్ గురించి ఏదో ఒకటి ఉండేది. భార్య వెళ్ళిపోయిన తరువాత పిచ్చివాడిలా మారిపోయిన ఇక్బాల్‌ను చూసిన ప్రతి ఒక్కరూ మంచిగానో, చెడుగానో తప్పకుండా మాట్లాడుకునేవారు.

భర్తను, బిడ్డల్ని వదిలేసి తన దేశం వెళ్ళిపోయిన అయేషా గురించి అవహేళనగా వింతగా మాట్లాడుకునేవారు. మరో పెళ్ళిచేసుకోకుండా పిల్లల్ని బాధ్యతగా పెంచుతున్న ఇక్బాల్ పట్ల సానుభూతిని, జాలిని ప్రదర్శించేవారు.

ఇది నిజంగా జరిగిన కథ. కువైటులోను, గల్ఫ్ దేశాల్లోను ప్రస్తుతం కొందరి జీవితాల్లో జరిగుతున్న కథ.

ఇక్కడ ఇతర దేశాల వారిని ప్రేమించి, పెళ్ళిచేసుకుని పిల్లల్ని కనన్వారికి చాలా సమస్యలు ఎదురవుతాయి. వాటినన్నింటినీ అధిగమించడం ఎదుర్కోవడం అంత సులభం కాదు. ముఖ్యంగా వీరికి పుట్టిన పిల్లలు ఈ సమస్యల ఫలితాన్ని అనుభవించి కృంగిపోతున్నారు. అక్రమంగా అనుమతి లేకుండా ఇక్కడ నివశించే కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల్ని గాలికి వదిలేసి, దిక్కుతోచని స్థితిలో తమ దేశాలకి పారిపోయేవారుగా ఉన్నారు.

అటువంటి పిల్లల్ని కువైటు ప్రభుత్వం తమ అనాధాశ్రమంలో చేర్చుకుని వారిని పోషించి చదువులు చెప్పించి వారి బాధ్యతను తీసుకుంటోంది.

పరదేశంలో ఉద్యోగాలు చేసుకుని జీవించే వాళ్ళు ఇతరదేశాలవారిని ప్రేమించే ముందు, పెళ్ళి చేసుకునే ముందు బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. లేకపోతే ఇలాంటివాళ్ళు చాలా సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. పుట్టిన బిడ్డల భవిష్యత్తు అగమ్యగోచరం అవుతుంది.

# కళ్యాణి కథ

**కువైటు పట్టణానికి** 90 కి.మీ దూరంలో, సౌదీ అరేబియా సరిహద్దులకు 25 కి.మీ దగ్గరలో అరేబియా సముద్రపు ఒడ్డున ఖైరాన్ (Khairan) అనే ప్రదేశం ఉంది.

కువైటు దేశ రాజవంశీకులు, సంపన్న కుటుంబాలకు చెందిన షేకులు విలాసాలతో, వినోదాలతో తమ సమయాన్ని గడపడానికి అక్కడ గెస్ట్‌హౌస్‌లను నిర్మించుకున్నారు. వారాంతపు దినాల్ని, సెలవు రోజుల్ని తమకు నచ్చినట్లు సంతోషంగా గడపడానికే కాక, పార్టీలకు ఫంక్షన్లకు, రహస్య సమావేశాలకు తగిన విధంగా అన్ని సౌకర్యాలను అక్కడ సమకూర్చుకున్నారు.

కువైటు దేశంలో (గల్ఫ్‌దేశాల్లో) శుక్రవారం సెలవుదినం కాబట్టి గురువారం సాయంత్రం ఆటపాటలతోను, విందు వినోదాలతోను ఆ ప్రదేశం సందడిగా ఉంటుంది.

అలాగే ఆరోజు గురువారం కావడంతో ఆ సాయంత్రంపూట "షేక్ అహ్మద్" యొక్క విలాస భవనంలో, ఆహ్వానితులు, స్నేహితులు ఆడా, మగా అందరూ కలిసి వచ్చారు.



కువైటు రాజవంశానికి చెందిన సంపన్నుడు "షేక్ అహ్మద్". ఆయన ఏర్పాటు చేసిన విందు, వినోద కార్యక్రమాలు సాదాసీదాగా ఉండవు కదా! అక్కడ విందు ఒక్కటేకాదు ఖరీదైన మద్యం, అందమైన అరబిక్ మగువల పొందు కూడా లభిస్తాయని వారందరికీ బాగా తెలుసు. అందుకే ఆహ్వానించిన వారందరూ తయారయి ఆఘమేఘాల మీద పరిగెత్తుకుంటూ షేక్ అహ్మద్ గెస్ట్‌హౌస్‌కు వచ్చేసారు.

షేక్ అహ్మద్‌కు కువైటు పెట్రోలు సంస్థలలో అధిక భాగం వాటాలు, హక్కులు ఉండటంతో ఆయనకు సంపద వరదలా పొంగిపొరలుతోంది. దేనికీ కొదువలేక పోవడంతో ఆయన విలాసవంతమైన జీవితాన్ని గడపడానికి అలవాటు పడ్డాడు. ఆయనలో ఉన్న మంచి కోణం ఏమిటంటే తన దగ్గర పనిచేసే వారికి, పేదవారికి, ఆపదలో ఉన్న వారికి లెక్కపెట్టకుండా కరెన్సీ నోట్ల కట్టలు దానం చేస్తాడని ప్రతీతి. ఆయన దృష్టిలో పడి ఆయన దయకు ప్రాప్తులైనవారు అదృష్టవంతులేనట.

ఆయనలో ఉన్న బలహీనత స్త్రీలోలత. తనతో గడపడానికి వచ్చే స్త్రీలకు కూడా లెక్కలేనంత సంపదను, విలువైన బహుమతులను ఇచ్చి సంతోష పెడతాడని చెప్పుకుంటారు.

షేక్ అహ్మద్ విల్లా విశాలమైన ఆ తోటలో లోపలికి విసిరేసినట్లుగా ఓ మూలకి కట్టబడి ఉంది.

తోటంతా అందమైన పూలమొక్కలు, చెట్లు, తీవెలు పొందికగా, పద్ధతిగా నాటి, పెంచుతూ నిపుణులైన తోట పనివారి సంరక్షణలో ఉన్నాయి.



కొన్ని ఎకరాల స్థలంలో ఉన్న ఆ తోట కలియతిరగాలంటే కనీసం ఒక గంట సమయం పడుతుంది. వెనుకవైపుగా ఓ మూలకి కట్టబడిన విల్లా (గెస్ట్‌హౌస్) దానికి వెనుకగా అలలతో ఎగిసిపడే అరేబియా సముద్రం. అందమైన రంగుల పువ్వులతో, పలకరించే పిట్టల అరుపులతో అల్లుకున్న తీవెలతో స్వర్గధామంలా కనిపిస్తుంది ఆ గెస్ట్‌హౌస్. దాని సంరక్షణకు నలుగురు పనివారిని నియమించి వారికి ఒక్కొక్కరికి నెలకు ముప్పైవేల రూపాయల జీతం ఇస్తున్నాడు షేక్ అహ్మద్.

ఇస్లాం సాంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్న నలుగురు అందమైన భార్యలు షేక్ అహ్మదుకు ఉన్నారు. ఇస్లాం మత సిద్ధాంతాల ప్రకారం నలుగుర్ని మాత్రమే పెళ్ళి చేసుకోవాలి అనే పరిమితి ఉండటంతో అక్కడితో ఆగిపోయి, పార్టీలు, ఫంక్షన్లు ఏర్పాటు చేసి అందమైన అరబిక్ అమ్మాయిలను ఆహ్వానించి వారితో గడవడం అలవాటు చేసుకున్నాడు.

నలుగురు భార్యలకూ పట్టణంలో నాలుగు ప్యాలెస్‌లు కట్టించి అన్ని సౌకర్యాలను వారికి అమర్చాడు. ప్రతియేటా ఒక్కొక్క బిడ్డ చొప్పున పిల్లల్ని కని వారిని పెంచటానికి పనిమనుషులకు అప్పగించడమే వారి పని. నలుగురు భార్యలద్వారా ఇప్పటికే దాదాపు ఇరవై మంది పిల్లలు ఉన్నారు. ఇంకా వీలైనంత మంది బిడ్డల్ని కని కుటుంబాన్ని విస్తరింపచేయడమే ఆయన ధ్యేయం. మగసిరి గల ముస్లిం పురుషునికి అది గర్వకారణం అని, పురుష జన్మకి సార్థకత అని షేక్ అహ్మద్ విశ్వసిస్తాడు.

నలుగురు భార్యలు ఉన్నా కూడా ఆయనలోని స్త్రీలోలత్వం, శృంగార లాలస. శరీర వాంఛలు, స్త్రీపై కాంక్షలు తగ్గలేదు. గల్ఫ్ దేశాల్లోని అరబిక్ అందగత్తెలను పిలిపించుకుని మనసారా వారిని అనుభవించనిదే ఆయనకు నిద్రపట్టదు. కోట్లకొలది కాసులు కురిపిస్తే. కో అంటే కోటిమంది పరిగెత్తుకుంటూ వచ్చి క్యూలో నిలబడతారని, ప్రక్కలో వాలిపోతారని ఆయన నమ్మకం.

అలాగే.. ఆరోజు వరకు ఆయన ఆడింది ఆటగా, పాడింది పాటగా, మాటకు ఎదురు లేకుండా కాలం సాగిపోయింది. కానీ.. ఆయన ఊహించని సంఘటన ఆరోజు రాత్రి జరుగుతుందని, తన నమ్మకం వమ్ము అవుతుందని ఆయన కలలో కూడా ఎన్నడూ ఊహించలేదు.

విల్లాకు ముందు భాగంలో ఉన్న పార్కింగ్ ప్లేస్‌లో ఆడి, బి.యమ్.డబ్ల్యు, ఫెరారి, రేంజ్ రోవర్‌లాంటి విలువైన కార్లు వరుసగా వచ్చి ఆగాయి. ఆహ్వానించిన వారందరూ అనుకున్న సమయానికే వచ్చేసారు.

అక్కడ ఉన్న విశాలమైన ఆ హాలులో చుట్టూ అమర్చబడివున్న స్పీకర్లలో నుండి హై వాల్యూమ్‌లో అరబిక్ మ్యూజిక్ మారుమ్రోగుతోంది. అందమైన అరబిక్ అమ్మాయిలు ఆ సంగీతానికి తగినట్లుగా అడుగులు కదుపుతూ.. వాటికి అనుగుణంగా శరీరభాగాల్ని ఒక రిథమ్‌లో కదిలిస్తూ "బెల్లీడాన్స్" చేస్తున్నారు. వారు వేసుకున్న తళుకు బెళుకుల కురచదుస్తులు. వారి అందాలను దాచడానికి ప్రయాసపడి అలసిపోతున్నాయి. ఒకరినొకరు మించాలని, పోటీపడి నర్తించే ఆ భామల అడుగుల వేగానికి, కదలికలకు ఆ దుస్తులు తాళలేక, ఒక చోట నిలువలేక ప్రక్కలకు జారిపోతున్నాయి. అవి యధాశక్తి ఆ అమ్మాయిల అందాలను బహిర్గతం చేసి చూపరుల కళ్ళను కట్టి పడేస్తున్నాయి. దారితప్పి దివినుండి భువికి దిగివచ్చినట్లున్న ఆ అరబిక్ భామలు తగినన్ని ఒంపుసొంపుల్ని శరీరంలో నింపుకుని, పాలు, పసుపు గులాబి పూవులనన్నింటినీ కలగలిపి తమ చర్మంలో ఒంపుకున్నట్లున్న శరీర వర్ణంతో మెరిసిపోతున్నారు. శృంగారన్ని ప్రేరేపించే బెల్లీ డాన్స్ కదలికలతో వారి అందాలు ద్విగ్వుణీకృతమై అక్కడ చేరి ఉన్న పురుషుల హృదయాల్ని పారవశ్యంలోనికి నెడుతున్నాయి. కండిషనర్‌తో మెత్తగా పట్టుకుచ్చులా ఉన్న వారి పొడవాటి జుట్టు నడుమును దాటి వారి కదలికలతో పాటు నాట్యం చేస్తోంది.



"హబీబి.. యా... హబీబి, ఆన హెబ్బక్ ఇంతే" ("ప్రియా.. ఓ.. ప్రియా నువ్వంటే నాకిష్టం") అనే అరబిక్ పాటకు అమ్మాయిలందరూ కలిసి ఉత్సాహంగా డాన్స్ చేస్తున్నారు. ఆ హాలులో చుట్టూ వేసివున్న పట్టుపరుపుల దివాన్‌ల మీద మెత్తటి ముఖమల్ దిండ్లకు ఆనుకుని ఠీవిగా కూర్చుని ఉన్న సంపన్న షేకు కుటుంబాలకు చెందిన యువకులు కొందరు కళ్ళార్పకుండా బెల్లీ డాన్స్‌ను చూస్తూ ఆనందిస్తున్నారు వారందరూ... చప్పట్లు కొడుతూ అమ్మాయిలను ఉత్సాహపరుస్తూ డాన్స్‌తో మెలికలు తిరిగే వారి శరీర లావణ్యాన్ని కళ్ళతో జుర్రుకుంటూ సంగీతాన్ని ఆస్వాదిస్తున్నారు. కాలుమీద కాలువేసుకుని హుందాగా కూర్చుని ఉన్న వారి ప్రక్కలో హుక్కా శీషాలు అమర్చబడి ఉన్నాయి. చేతిలోని గ్లాసుల్లో నింపబడిన మధువును సేవిస్తూ పరవశంగా పైపుల్లోని హుక్కాను పీలుస్తున్నారు. పనివారు 'బొంగరాల్లా తిరుగుతూ కనుసైగలతోటే కదులుతూ.. భయంతో భక్తితో కావలసినవి శ్రద్ధగా వారికి అందిస్తున్నారు.

టీ, కాఫీ, అరబిక్ గహ్వా, తుర్కిష్ కాఫీ, పెప్సీ, కోలాల్లాంటివే కాక ఖరీదైన విదేశీమద్యం కూడా వారు సేవిస్తున్నారు.

కువైటు దేశంలో ఆల్కహాలు పూర్తిగా నిషేధింపబడినది. కానీ డబ్బున్న షేకులు తలచుకుంటే దేనికీ కొదువలేదుకదా? పొరుగు దేశాలైన బహరైన్, దుబాయ్, ఖతార్ నుండి కోరినంత మద్యాన్ని చాటుగా తెప్పించుకోవడం వారికి చాలా సులభమైన పని.

అక్కడికి వచ్చిన అరబిక్ భామలతోపాటు తోడుగా, పరిచర్యలు చేయడానికి వచ్చిన పనిమనుషులు కొందరు బయట వరండాలో కూర్చుని తోటి పనివారితో మెల్లగా కబుర్లు చెప్పుకుంటూ కష్టసుఖాలు కలబోసుకుంటున్నారు. కానీ వారి కళ్ళు మాత్రం లోపల హాల్లో జరుగుతున్న కార్యక్రమాల వైపు కదలాడుతున్నాయి. యజమానురాళ్ళ చర్యల్ని డాన్సులను గమనిస్తూ - వారు పిలిచిన వెంటనే లోపలికి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారు.

వారానికో, నెలకో అలా వారందరూ కలుసుకున్నప్పుడు ఆత్మీయుల్ని, బంధువుల్ని చూసినట్లు సంతోషంగా ఉంటుంది.

"నువ్వు పనిచేసే ఇల్లు మంచిదేనా?"

"ఎన్నేళ్ళనుండీ కువైటులో ఉంటున్నారు?

"మామా, బాబా మంచివాళ్ళేనా?"

"జీతం సరిగ్గా ఇస్తారా? ఎంత ఇస్తారు?

"తిండి కడుపునిండా పెడతారా?"

"శెలవు ఇచ్చి సిటీకి పంపిస్తారా?"

"ఇంటికి ఎపుడు వెళతావు?" లాంటి ప్రశ్నలతో బదులిచ్చే జవాబులతో వారి మాటలను, వేదనను, ఓదార్పును ఒకరికొకరు పంచుకుని ఊరట చెందుతున్నారు.

డబ్బున్న వారి విలాస జీవితాల్ని గురించీ, భర్తలకు, ఇంట్లో వారికి తెలియకుండా ఇలా పార్టీలకు వచ్చి బెల్లీ డాన్స్‌లు చేసే స్త్రీల విపరీత ప్రవర్తనను గురించి అక్కడ చేరిన పనిమనుషులు గుసగుసగా చెప్పుకుని నవ్వుకుంటున్నారు. కొందరు తమ పేదరికాన్ని, దీనస్థితిని, బానిసలాంటి జీవితాన్ని తలచుకుని, "దేవుడు ఎంత నిర్దయుడో కదా, కువైటు వారికి ఇంత సంపదను ఇచ్చి మనలను పేదరికంలో ఉంచాడు" అని వగచి నిట్టూర్పులు విడుస్తున్నారు.

ఇంతలో గోడ బయట పార్కు చేసి ఉన్న కార్ల దగ్గర కూర్చుని కునికిపాట్లు పడుతున్న డ్రైవర్లు పనిమనుషుల మాటలు చెవినబడి, వారితో మాటలు కలపాలనే ఉద్దేశంతో చెట్లను చాటు చేసుకుంటూ వచ్చి గోడవారగా నిలబడ్డారు. వారి యజమానులు చూస్తే తిడతారని వారికి భయం.

విలువలు మరచి పరాయి పురుషుల ముందు త్రాగి డాన్సు చేస్తున్నవారు, వారిని చూస్తూ ఆనందిస్తున్న వారు కూడా ఇక్కడ పనివారైన స్త్రీ పురుషులు మాట్లాడుకోవడం చూస్తే మండిపడతారు.

"మగవాడితో నీకు మాటలు ఏమిటే? మగవాడు కావాలా నీకు? నీ దేశం వదిలి ఇక్కడికి వచ్చింది నువు పనిచేసుకుని జీతం డబ్బులు సంపాదించుకోవడానికా? లేక మగవాళ్ళతో మాట్లాడటానికా? " అని కోపంతో తిడతారు. కోపిష్టులైన కొందరు మత ఛాందసవాదులు చెయ్యి చేసుకుని కొడతారు కూడా!

కాబట్టి ఇంట్లో పనిచేసే ఆడపనివారు, కారు డ్రైవర్లు తమ యజమానులు కంటపడకుండా చాటుగా మాటుగా నాలుగు మాటలు పంచుకోవాలని తాపత్రయపడతారు.

సంవత్సరాల తరబడి స్వేచ్ఛ లేకుండా, బానిసల్లాగా, బందీలవలె కువైటు వారి కట్టడిలో ఉంటూ ఇంట్లో పని చేసుకునే పనిమనుషులకి తమ మాతృ దేశం నుండి వచ్చిన తోటిపనివారు కనిపిస్తే చెప్పలేనంత సంబరం. ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకుని, కష్టసుఖాలు పంచుకుని హృదయంలోని భారాన్ని వేదనను దింపుకోవాలని వీళ్ళు ఆశపడతారు. మాటలు పంచుకోవాలని ఆరాట పడతారు - పరాయిదేశంలో ఎన్నో క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొని కష్టాలు, బాధలు అనుభవించే ఒంటరి పనివారి మధ్య ఆకర్షణ కలగడం, ప్రేమలు పెంచుకోవడం బంధాలు పటిష్టమై సంబంధాలు ఏర్పడటం ఇక్కడ సాధారణమైన విషయమే.

ఆ గురువారం సాయంత్రం అక్కడ బయట కూర్చుని ఉన్న పనివారిలో "కళ్యాణి" అనే అమ్మాయ్ కూడా ఉంది. అప్పటికి ఆ అమ్మాయి ఇండియానుండి కువైటు వచ్చి ఆరునెలలు మాత్రమే అయింది. ఇంకా అరబిక్ భాష కూడా సరిగ్గా రాలేదు. కువైటు వాళ్ళు చెప్పింది అర్థమవుతోంది కానీ తిరిగి మాట్లాడి జవాబు చెప్పడానికి తెలియడంలేదు.

ఇరవై ఏళ్ళ యవ్వన ప్రాయంలో ఉన్న కళ్యాణికి ఇంకా వివాహం కాలేదు. సన్నగా, నాజూకుగా, తెల్లగా జాజిపువ్వులా ఉంది ఆ అమ్మాయి. పదోతరగతిలోనే ప్రేమలో పడటంతో తల్లిదండ్రులు చదువు మాన్పించి ఇంట్లో కూర్చోబెట్టారు. కానీ ఆ అమ్మాయి హృదయంలో నుండి ప్రేమను మాత్రం తీసెయ్యలేకపోయారు. అబ్బాయి మరొక కులంవాడు కావడమే వారికి అభ్యంతరం అయింది. మరొక సంబంధం చూసి తొందరగా పెళ్ళి చెయ్యాలని ప్రయత్నించారు. కానీ కళ్యాణి ఒప్పుకోకపోవడంతో, వారి మాట వినడం లేదని కోపగించుకున్నారు.

ఆ పరిస్థితుల్లో కళ్యాణికి కువైటులో ఉండే మేనత్త గుర్తుకు వచ్చింది. తనను ఈ బాధనుండి తప్పించమని, వీసా పంపించి కువైటు తీసుకువెళ్ళమని ఫోను చేసి ప్రాధేయపడింది. మేనకోడలి ఏడుపు చూసిన ఆమె హృదయం కరిగిపోయి అన్నా వదినలకు తెలియకుండా వీసాపంపించింది. ఎలాగో కష్టపడి కువైటుకైతే వచ్చింది కానీ సున్నితమైన మనస్తత్వం కల కళ్యాణి ఎడారి దేశంలోని పరిస్థితులను ఎదుర్కొని అక్కడ ఇమిడిపోయి పనిచేయలేకపోతోంది. ప్రేమించి విడిచి వచ్చిన శేఖర్‌ను కూడా మరిచిపోలేక వేదన చెందుతోంది. మరోవైపు తల్లిదండ్రులు కోపంతో మాట్లాడటం కూడా మానేసారు. ఇక్కడ తిరుగుబోతు అయిన యజమానురాలు "అబీర్" ప్రతిరోజూ సాయంత్రం పార్టీలు ఫంక్షన్లు అంటూ కళ్యాణిని వెంటబెట్టుకుని తిరుగుతూ ఉంటుంది. వచ్చిన చిక్కంతా బాబాతోనే. ఆయన భార్యను గురించి అనుమానంతో గుచ్చి గుచ్చి అడిగే ప్రశ్నలకి అబద్ధాలతో కూడిన జవాబులు "అబీర్" (మామా)

చెప్పమన్నట్లు (మనసు చంపుకుని) చెప్పలేక కళ్యాణి భయంతో రోజులు లెక్కపెట్టుకుంటూ కాలం గడుపుతోంది. "కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం". మామా విచ్చలవిడి జీవితానికి కళ్యాణి ప్రత్యక్ష సాక్షి. పనిమనుషులు కువైటు వారికి యంత్రాలతో సమానం. పనిమనుషులకు కూడా హృదయం ఒకటి ఉందనీ భావోద్వేగాలు, స్పందనలు ఉంటాయనీ తలంచకుండా వారి ఎదుటనే సిగ్గులేకుండా తమ విశృంఖలత్వాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. ఇలాంటివన్నీ చూసిన కళ్యాణికి గుండెల్లో గుబులుగా, భయంగా ఉంది. తిరిగి ఇండియాకు వెళ్ళిపోవడం అంత సులభం కాదు. ఎలాగో ఇంకో సంవత్సరం పైగా గడిపి, రెండేళ్ళు పూర్తిచేసుకుంటే తరువాత ఏం చెయ్యాలో ఆలోచించవచ్చు. ఈలోగా వీలయితే ప్రేమించిన శేఖర్‌ను కూడా కువైటుకు పిలిస్తే ఇక్కడే పెళ్ళి చేసుకుని సంతోషంగా జీవితం గడపవచ్చు అనే ఆశతో కళ్యాణి భారంగా కాలం గడుపుతోంది.

ఇంతలో లోపల మ్యూజిక్ పెంచడంతో జోరుగా ఊపందుకుంది. ఇంక కొద్దిసేపటిలో డాన్స్ కార్యక్రమం ముగుస్తుంది అనేందుకు అది సంకేతం. బయట ఉన్న పనిమనుషులు అలర్ట్‌గా సర్దుకుని కూర్చున్నారు. తరువాత భోజన కార్యక్రమాలు మొదలవుతాయని వారికి తెలుసు.

ఖరీదైన ఫర్నీచర్‌తో కళాత్మకంగా అలంకరించబడిన ఆ హాలులో నలువైపులా నిప్పులు వేయబడిన కుంపట్లను ఉంచారు. వాటిలో సాంబ్రాణిలాంటి పుఖూర్ అనబడే అరబిక్ సుగంధ ద్రవాల్ని చేసారు. పొగ దట్టంగా పైకి లేచి పరిమళాలు వెదజల్లుతూ గాలిలో మంద్రంలో తేలియాడుతూ మనుషులకు ఏదో తెలియని మత్తును కలగచేస్తోంది. లైట్లు డిమ్‌గా వెలుగుతున్నాయి) అరబిక్ భామలందరూ ఉద్రేకంతో ఊగిపోతున్నారు. స్టెప్పులు జోరుగా వేస్తూ బెల్లీ డాన్స్ చూసేవారిలో హుషారును పెంచుతున్నారు.

ఐవ.. ఐవ (శభాష్.. శభాష్) అంటూ పురుషులందరూ చప్పట్లు కొడుతూ కేరింతలతో అమ్మాయిలను ప్రోత్సహిస్తున్నారు. అరబిక్ అందగత్తెల అద్భుతమైన అసమాన సౌందర్యాన్నీ, వంపుసొంపుల వయ్యారాన్నీ కళ్ళతోనే తాగుతూ.. ఆనందిస్తున్నారు.

అందరిలోనూ సంతోషం పొంగిపొరలుతోంది. ఉత్సాహం చిందులేస్తోంది. తరువాత జరిగే కార్యక్రమాల పట్ల ఎంతో ఆసక్తిగా ఉన్నారు వాళ్ళు. ఆ సమయం కోసం చాలా ఆదుర్దాగా, ఆశగా ఎదురు చూస్తున్నారు.

షేక్ అహ్మద్ తన ప్రక్కనే కూర్చుని ఉన్న షేక్ ఫైసల్‌తో నిరుత్సాహంగా ఇలా అంటున్నాడు. "ప్రతివారం పాత అమ్మాయిలేనా? ఈరోజు కొత్తపిల్ల కావాలనిపిస్తోంది. వీరందరితో గడిపి విసుగెత్తిపోయింది. "

"ఇప్పటికిప్పుడు అంటే ఎలా? ముందే చెప్పివుంటే నేను అందమైన కుర్రపిల్లను కానుకగా మీకు అందించే వాడిని" అన్నాడు షేక్ ఫైసల్ నవ్వుతూ.

అత్యంత ఖరీదైన విదేశీమద్యం వారి నరనరాల్లో వేడిగా ప్రవహిస్తూ చిందులు వేస్తోంది. మళ్ళీ ఒకసారి పరిశీలనగా డాన్స్ చేసే అందాల భామల వైపు చూసాడు షేక్ అహ్మద్.

లిప్‌గ్లాస్ వేసుకున్న అమ్మాయిల అధరాలు ఎర్రగా చెర్రీ పండ్లలా ఊరిస్తున్నాయి. మస్కారా దిద్దుకున్న కళ్ళు వింతగా ప్రకాశిస్తూ ఎన్నో హావభావాలు పలికిస్తున్నాయి. సన్నటి నడుము, సమున్నతమైన వారి వక్షసంపదను మోయలేక ఆ బరువుకు తాళలేక - మరింతగా చిక్కిపోయి బిక్కుమని చూస్తోంది.

యువకులందరూ వారిని చూస్తూ ఉద్రేకంతో ఊగిపోతున్నారు. అమ్మాయిల హొయలు, కవ్వింపులు, డాన్స్ భంగిమలు వారిని మరోలోకానికి తీసికెళుతున్నాయి. కానీ - షేక్ అహ్మద్ మాత్రం ఆ రోజు అసంతృప్తిగా ఉన్నాడు.

ఇంతలో అబ్బాయిలు కూడా లేచి వచ్చి ఆ అమ్మాయిలతోపాటు అడుగులు కలిపి హుషారుగా డాన్స్ చేయడం మొదలుపెట్టారు.

అరబ్బులకే ప్రత్యేకమైన బెల్లీ డాన్స్ విలక్షణమైనది. ఆ డాన్సు చెయ్యాలంటే తగినంత సాధన, అనుభవం, శరీర సౌష్టవం ఉండాలి. ప్రత్యేకంగా శ్రద్ధగా నేర్చుకున్నవారే ఆ డాన్సులు చెయ్యగలరు. సంగీతానికి అనుగుణంగా శరీరంలోని ఒక్కొక్క భాగం రిధమిక్‌గా కదులుతుంటే క్రొత్తగా చూసేవారికి ఆశ్చర్యంగా ఉంటుంది. యువకులందరూ వచ్చి కలిసి తమతో డాన్స్ చేస్తున్నా కూడా ఆ అరబిక్ అందగత్తెల చూపులన్నీ కూడా, అక్కడ మధ్యలో ఉన్న సోఫాలో ఠీవిగా కూర్చుని ఉన్న షేక్ అహ్మద్ మీదే కేంద్రీకృతమై ఉన్నాయి.

అధరాలపై చిరునవ్వులతో మధువులను చిందిస్తూ – వారి శరీర భారాల్ని శృంగారానికి ఆనవాళ్ళుగా చేసి చూపులతో కవ్విస్తూ ఆయన కొనచూపుపై చిరునవ్వుకై, పిలుపుకై తహ తహలాడిపోతున్నారు వాళ్ళు.

షేక్ అహ్మద్ సంపన్నుడే కాదు. రాజవంశానికి చెందినవాడు. మన్మధునిలా ఒక్క చూపుతో స్త్రీల హృదయాల్ని కొల్లగొట్టగల నేర్పరి షేక్‌అహ్మద్. అతడి కౌగిలిలో కరగని శరీరం వ్యర్ధమని ఎంచి అతడి పొందు కోసం సౌందర్యరాశులందరూ ఆరాటపడిపోతుంటారు. శృంగార పురుషుడైన షేక్ అహ్మద్‌తో ఈరాత్రి గడిపే అవకాశం ఎవరికి వస్తుందో అని వాళ్ళు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఆరడుగుల ఆజానుబాహువు అందగాడైన షేక్‌అహ్మద్‌ను చూస్తే సాటి యువకులకి అసూయ కలుగుతుంది. సృష్టికర్తకు ఇంత పక్షపాతమా అనిపిస్తుంది. అతడి రాసలీలలను గురించి ప్రజలు కథలుగా చెప్పుకుంటారు.

సంగీతం ఆగిపోయింది. ఆరోజుకు డాన్స్ కార్యక్రమం ముగిసింది. అంతవరకూ పోటీపడి నర్తించిన అమ్మాయిలు అలసటతో దివాన్‌ల మీదకి చేరి కూర్చున్నారు.

కళ్యాణి వాళ్ళ మేడమ్ అబీర్ "కళ్యాణీ ఎక్కడ ఉన్నావు? తొందరగా వచ్చి నా కాళ్ళు పట్టు నొప్పిగా ఉన్నాయి" అంటూ లోపలనుండి గట్టిగా అరిచింది. ఆ పిలుపుకోసమే ఎదురుచూస్తున్నట్లు దిగ్గున లేచి పరిగెత్తుకుంటూ లోపలికి వచ్చింది కళ్యాణి.

తాలె సురా (తొందరగా రా), గాదె తెహత్ (క్రిందకూర్చో) అంటూ.. అబీర్, షేక్ అహ్మద్ ప్రక్కలో విలాసంగా కూర్చుని కాళ్ళు పట్టమని కళ్యాణికి చెప్పింది.

అప్పటికే విషయం అర్ధమైన కళ్యాణి తనకు అలవాటే అన్నట్లుగా పొందికగా నేలపై కూర్చుని తన మేడమ్ (మామా) కాళ్ళను, పాదాలను మృదువుగా వత్తుతూ మర్దన చేయడం ప్రారంభించింది. తెల్లటి "అబీర్" పాదాలు మెత్తగా పూలరేకుల్లాఉన్నాయి. మద్యం నిండిన గ్లాసును షేక్ అహ్మద్‌కు అందిస్తూ.. ఆయనదృష్టి తనవైపు మళ్ళించుకుని ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తోంది అబీర్.

కానీ షేక్ అహ్మద్ చూపు అబీర్ పైన లేదు. ఒద్దికగా, బుద్ధిగా ఒదిగి కూర్చుని అబీర్ పాదాల్ని మసాజ్ చేస్తున్న కళ్యాణి పైన పడింది. ఇరవై ఏళ్ళ యవ్వన ప్రాయంలో ఉన్న కన్నెపిల్ల కళ్యాణి. అపుడే విరిసిన పువ్వులా లేతగా షేక్ అహ్మద్ కళ్ళను ఆకర్షిస్తోంది కళ్యాణి.

క్రొత్తశరీరాన్ని చూస్తున్న కొలదీ కోరిక, మోహం పెరగసాగాయి. ఆ అమ్మాయిని అనుభవించనిదే నిద్రపట్టేట్లు లేదు షేక్‌అహ్మద్‌కు.

ఆఫ్ట్రాల్ పనిమనిషి, పట్టుకుంటే ఏమీ చెయ్యలేదు. పచ్చగా లేత చిగురుటాకులా యవ్వనంతో మెరిసిపోతున్న కళ్యాణిని ఎంత డబ్బు వెదజల్లి అయినా సరే తన వశం చేసుకోవాలి అనే తలంపుతో కూర్చున్న చోటునుండి పైకి లేచాడు షేక్ అహ్మద్. ఒక్కడుగు ముందుకు వేసి, కాంక్ష నిండిన కళ్ళతో కల్యాణిని చూస్తూ, క్రింద కూర్చుని ఉన్న ఆ అమ్మాయి భుజం పట్టుకుని పైకి లేవనెత్తాడు.

హఠాత్తుగా జరిగిన ఆ సంఘటనతో కళ్యాణి బెదిరిపోయింది. అక్కడ ఉన్న వారందరూ మ్రాన్పడిపోయి షేక్‌అహ్మద్ వైపే ఆశ్చర్యంగా చూస్తున్నారు.

భయంతో వణికిపోతున్న కళ్యాణిని దగ్గరికి లాక్కుని.. "ఈ రాత్రికి నాకు ఈ పిల్ల కావాలి. ఈరోజు నేను హిందూదేశపు ఈ అందగత్తెను మనసారా నేను అనుభవించాలి. అరబిక్ భామలతో మొహం మొత్తింది నాకు. మీరందరూ ప్రక్కకు తప్పుకుని మీ పనులు చూసుకోండి" అంటూ గట్టిగా అరిచి చెప్పాడు షేక్‌అహ్మద్. ఎంతో ఆశతో అక్కడికి వచ్చి అందాలు ఆరబోసిన అరబిక్ అందగత్తెల ముఖాలు వాడిపోయాయి. కళ్యాణి పట్ల ఈర్ష్యతో వారి హృదయాలు భగ్గుమన్నాయి - తమకు షేక్ అహ్మద్‌ను పొందే అవకాశం, అదృష్టం లేకుండా చేసిన కళ్యాణివైపు వారందరూ కోపంగా చూడసాగారు. ఇంతమంది అందగత్తెలు ఉండగా పనిమనిషిని కోరుకుంటాడా అని వాళ్ళందరూ మూతిముడుచుకున్నారు.

అపుడు ముందుగా కళ్యాణి వాళ్ళ మేడమ్ "అబీర్" తేరుకుని ఈలోకంలోకి వచ్చింది. బలవంతంగా మొహాన చిరునవ్వును పులుముకుని "అలాగే షేక్.. అంతకన్నా అదృష్టమా? ఈ పిల్ల నా పనిమనిషి. నువ్వు అనుభవించి ఆనందించాలి అనుకుంటే నిరభ్యంతరంగా తీసుకెళ్ళు" అంటూ కళ్యాణిని ముందుకు తోసింది.

హఠాత్తుగా జరిగే సంఘటనలతో అంతవరకు చలనం మరచి బొమ్మలా నిలబడి ఉన్న కళ్యాణి ఈలోకంలోకి వచ్చి చప్పున షేక్ అహ్మద్ చేతిని విదిలించుకుంది. కానీ బలిష్టుడైన షేక్‌అహ్మద్ రెండు చేతుల్తో కళ్యాణిని పైకి ఎత్తుకుని భుజం మీద వేసుకుని బెడ్‌రూములోకి దారితీసాడు. సింహం నోట చిక్కిన లేడిపిల్లలా గింజుకుంది కళ్యాణి. ఆయన పట్టు తప్పించుకుని క్రిందకి జారిపోవాలని శక్తి కొద్దీ ప్రయత్నించింది. అంతవరకూ వెంటబడి కోరికతో కౌగిలిలోకి వచ్చే సుందరాంగిణులను మాత్రమే షేక్‌అహ్మద్ చూసాడు. వద్దు అని ప్రతిఘటించి, గింజుకుంటూ ఏడ్చే కళ్యాణిని మొదటిసారిగా ఇప్పుడే చూస్తున్నాడు.

"ఏంటే ఏమయింది నీకు? షేక్‌తో గడపడం ఎంత అదృష్టమో తెలుసా? ఎంతమంది అమ్మాయిలు ఇక్కడ నిలబడి ఆయన కోసం ఎదురు చూస్తున్నారో తెలుసా? ఆయన మాట వింటే నిన్ను డబ్బులో ముంచివేస్తాడు. విలువైన బహుమతులు నీకు అందిస్తాడు మహారాణిలా సుఖంగా గడిచిపోతుంది. నోరుమూసుకుని వెళ్ళి ఆయనకు సహకరించి ఎంజాయ్ చెయ్యి." గట్టిగా వెనుకనుండి అరిచి చెప్పింది అబీర్.

"నో .. నాకిష్టంలేదు. నావల్లకాదు. నన్ను వదలండి" అంటూ వచ్చీ రాని భాషలో అరవడం ప్రారంభించింది కళ్యాణి. ఆ అమ్మాయి తీరు కొత్తగా ఉంది షేక్‌అహ్మద్‌కు. మద్యం మత్తులో ఉన్నాడేమో, ఇంకా పట్టుదల పెరిగింది. మరింత గట్టిగా అదిమి పట్టుకుని బెడ్ రూములోకి వెళ్ళి తలుపు మూసాడు.

మరో స్వర్గంలా ఉంది షేక్‌అహ్మద్ బెడ్‌రూమ్ పట్టుపరుపులు పరిచిన ఆ మంచంపై ఒక్కసారి పడుకుంటే జన్మధన్యం అవుతుంది అనిపించేలా అద్భుతంగా అలంకరించబడి ఉంది ఆ మంచం. భుజంపై ఉన్న కళ్యాణిని మంచం పైకి విసిరేసాడు షేక్‌అహ్మద్.

ఆ విసురుకు దెబ్బ తగులుతుందేమో అని భయపడిన కళ్యాణికి.. అలాంటిది ఏమీ జరగలేదు. మెత్తగా దూదిలా ఉన్న ఆ పరుపులోపలికి, అయిదంగుళాలు కిందకి దిగిపోయింది. అందులోకి ఒదిగిపోయి ప్రక్కకు తిరిగి తొందరగా లేవలేకపోయింది. నిస్సహాయంగా ఉన్నచోటనే పడుకుని, కన్నీళ్ళతో చేతులు రెండూ జోడించింది కళ్యాణి.

"వద్దు బాబా! ప్లీజ్ నన్నేమీ చెయ్యకు. నీ బిడ్డలాంటిదాన్ని" అంటూ ప్రాధేయపడసాగింది.

"నువు బిడ్డలాంటిదానివా?! నేను నే తండ్రిలాంటివాడినా? ఇలాంటి వరసలు పోలికలు నాకస్సలు ఇష్టం ఉండదు. మర్యాదగా ఒప్పుకుని నవ్వుతూ నన్ను సుఖపెట్టు. ఏడ్చే వాళ్ళంటే నాకస్సలు ఇష్టం ఉండదు. నా దగ్గర ఏ ఆడదీ ఏడవకూడదు. కన్నీళ్ళు

కార్చకూడదు. నీకోసం ఏమయినా చేస్తా. నువ్వు కోరింది అందిస్తా. ఈరోజుతో నీ జీవితం మారిపోతుంది. పనిమనిషిగా పని చెయ్యాల్సిన ఖర్మ నీకు పట్టలేదు. నిన్ను మహారాణిని చేస్తా! ముందు ఆ ఏడుపు ఆపి మొహం కడుక్కునిరా! ఏడ్చే వాళ్ళంటే నాకు అసహ్యం'' అనునయంగా కాస్త చిరాకుగా చెప్పాడు షేక్అహ్మద్. ఆయనలో కూడా కొన్ని మంచి లక్షణాలు ఉన్నాయి. ఇష్టంలేని వాళ్ళని బలవంతం చెయ్యడం ఆయనకు అస్సలు అలవాటులేదు. కోరి కౌగిలిలో ఒదిగే మగువంటేనే మక్కువ ఆయనకి. అంతటి స్త్రీలోలుడుకూడా. ఆడది ఏడిస్తే - కరిగిపోయే హృదయం ఉన్నవాడు కాబట్టి కళ్యాణి ఆ రోజు బ్రతికిపోయింది.

''లేదు బాబా ఈ పనినేను చెయ్యలేను. అల్లా (దేవుడు) నన్ను క్షమించడు. నేను ప్రేమించిన శేఖర్‌ను తప్ప నేను ఎవరినీ తాకలేను. అతడికే నా హృదయం జీవితం అంకితం చేసాను. దయవుంచి నన్ను క్షమించి వదిలిపెట్టు'' అంటూ గట్టిగా రెండుకాళ్ళు పట్టుకుంది కళ్యాణి.

అప్పటికి త్రాగిన మద్యం నిషా కాస్త దిగి, మత్తు వదిలినట్లుంది. చేసేపని కూడా తప్పుగా అనిపించినట్లుంది. కళ్యాణి మాటలతో, ఒక్కసారిగా తెలివి వచ్చినట్లయి కోపంగా వెంటనే కళ్యాణి జుట్టు పట్టుకుని బయటకి లాక్కుని వచ్చాడు షేక్ అహ్మద్. బయట హాల్లో గుంపులుగా కూడిన జనాలందరూ గుసగుసగా మాట్లాడుకుంటున్నాడు. వారిలో చేరివున్న ''అబీర్'' తన పనిమనిషి లోపల సంతోషంగా గడుపుతోందని భావించి విందు భోజనం ఆరగిస్తోంది. కానీ.. కొద్ది నిముషాలైనా గడవకముందే ఆ గది తలుపులు తెరుచుకోవడం, కళ్యాణిని బయటికి ఈడ్చుకు రావడం గమనించి తినే ప్లేటును వదిలేసి వాళ్ళకి ఎదురుగా నడిచి వచ్చిద్కి. షేక్అహ్మద్ కోపం చూసి ''అబీర్‌కే'' కాక అక్కడ ఉన్న వారందరికీ కూడా భయం వేసింది.

అందరూ మాటలు ఆపి నిశ్శబ్దంగా నిలబడిపోయారు. షేక్ అహ్మద్ చేతిలో చిక్కిన కళ్యాణి వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తూనే ఉంది.

పనివారందరూ కూడా భయపడిపోయారు. మాటవినని కళ్యాణిని చంపేస్తాడేమో అని అందరూ వణికి పోతున్నారు.

వచ్చీరాగానే ''అబీర్'' చేతిలో నాలుగు నోట్ల కట్టలను ఉంచి ''ఈ డబ్బు దీనికి ఇచ్చి ఈ రోజే దీన్ని కువైటునుండి పంపించెయ్. ఇంకో నిముషం కూడా ఈ పిల్ల ఇక్కడ ఈ కువైటులో ఉండేందుకు వీల్లేదు. నన్ను కాదని మళ్ళీ ఇది నా కంట పడకూడదు. ఈ దేశంలో ఉండకూడదు. తొందరగా తీసుకెళ్ళు'' అంటూ కళ్యాణిని అబీర్ ముందుకు తోసి బెడ్‌రూములోకి వెళ్ళి తలుపుమూసుకున్నాడు.

మరుసటి రోజు తెల్లవారేటప్పటికి, ఇండియా వెళ్ళే ఫ్లయిట్‌లో ఉంది కళ్యాణి. ఆరునెలలకే కువైటుతో రుణం తీరిపోయింది కళ్యాణికి. షేక్అహ్మద్ ఆజ్ఞాపించిన ప్రకారం మరలా ఆయన కంటపడకూడదని మళ్ళీ కళ్యాణి ఈ కువైటుకు వచ్చే అవకాశం లేకుండా చేసారు. కళ్యాణి పాస్‌పోర్టులో కువైటు వీసాను బేన్ చేసిన స్టాంపును వేసి ఇండియా ఫ్లయిట్‌ను ఎక్కించారు.

షేక్అహ్మద్ ఇచ్చిన డబ్బు దాదాపు పదిలక్షల రూపాయలను కళ్యాణి వద్దు అంటున్నాకూడా ఆ అమ్మాయి బ్యాంకు అకౌంటులో అబీర్ జమ చేసింది.

''షేక్అహ్మద్ ఎంత మంచివాడో చూసావా? పది సంవత్సరాలు నువు పనిమనిషిగా చేసి సంపాదించే డబ్బు నీకు ఒక్క నిముషంలో ఇచ్చాడు. నువు షేక్అహ్మద్ మాట విని ఉంటే నిన్ను డబ్బులో ముంచి వేసేవాడు తెలుసా! '' అంది అబీర్ వెళ్ళిపోతున్న కళ్యాణితో.. ఏమీ మాట్లాడకుండా రెండు చేతులు ఎత్తి దణ్ణం పెట్టి ఫ్లయిట్ ఎక్కింది కళ్యాణి. జరిగిందంతా ఇంకా కలగానే అనిపిస్తోంది కళ్యాణికి. షేక్అహ్మద్ తనని ఏమీ చెయ్యకుండా వదిలిపెట్టడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

డబ్బు సంపాదించాలనే ఆశతో, తమ దేశం వీడి అరబ్ దేశాల్లో పనిచేయడానికి వచ్చే అమ్మాయిలు ఎందరో అరబ్ షేకుల అమానుషత్వానికి, కాముకత్వానికి బలయిపోతున్నారు. మాట వినని వారిని చంపి, శవాల్ని ఎడారిలో పడేస్తున్న కథలు ఎన్నో చెవిన వినబడుతున్నాయి. పత్రికల్లోని వార్తల్లో కూడా కథనాలు వస్తున్నాయి. ఇలాంటి కథలు ఇక్కడ ఎన్నో జరుగుతున్నాయి. అలాంటి వారితో పోల్చి చూస్తే కళ్యాణి ఎంతో అదృష్టవంతురాలు. తిరిగి తన స్వంత దేశంలో క్షేమంగా అడుగుపెట్టింది. నా కళ్ళెదుటే మరొక అమ్మాయికి జరిగిన ఘోరం కథగా ఇంకొకసారి పంచుకుంటాను.

## శారా ప్రేమ కథ

**సమయం రాత్రి** ఒంటిగంట అవుతోంది.

కువైటు పట్టణం నిశ్శబ్దాన్ని తనలో నింపుకుని నిద్రపోతోంది.

బెడ్‌లైటు వెలుతురు ఆ రూములో మంద్రంగా పరుచుకుని ఉంది.

ఖరీదైన ఫర్నీచర్‌తో కళాత్మకంగా, పొందికగా అలంకరించబడిన ఆ బెడ్‌రూము ఎంతో అందంగా కనిపిస్తోంది.

ఇంట్లో లైట్లు అన్నీ ఆరిపోయాయి. అందరూ నిద్రలోకి జారుకున్నట్లు ఉన్నారు. కానీ ఆ.. ఇద్దరు మాత్రం ఒకరినొకరు కలుసుకునే ఈ సమయం కోసం నిద్రపోకుండా వేచి ఉన్నారు.

టక్..టక్ మనే శబ్దంతో గడియారంలోని చిన్నముల్లు ఒకటి మీదకి వయ్యారంగా ఒదిగింది. ఒక రౌండు పూర్తిచేసి వచ్చిన అలసటతో పెద్దముల్లు పన్నెండును హత్తుకుంది.

అంతవరకు మెత్తటి పడకపై, గులాబిమొగ్గలా ముడుచుకుని పడుకుని, తన ప్రేమికుడైన అమీర్ గురించి ఆలోచిస్తున్న శారా మెల్లగా పైకి లేచింది. అడుగులో అడుగువేసుకుంటూ వెనుక వైపుగా ఉన్న కిటికీ దగ్గరకి చేరుకుంది. గోడకు వ్రేలాడుతున్న సిల్క్‌పూల పరదాను పక్కకు జరిపి క్రిందగా ఉన్న తోటలోకి దృష్టి సారించి చూసింది. మసక చీకటి క్రమ్ముకున్న ఆ రాత్రి వేళలో తోటలో ఉన్న సిమెంటు బెంచీపై కూర్చుని ఉన్న ఒక ఆకారం లీలగా కనిపించింది.

తనకంటే ముందుగా తోటలోకి చేరుకుని తనకోసం ఆత్రంగా ఎదురు చూస్తున్న అమీర్‌ను పోల్చుకున్న శారా పెదవులపై సన్నటి చిరునవ్వు మెరిసింది. అతన్ని చూసిన ఆమె హృదయం ఆనందంతో నిండిపోయింది. వెంటనే అమీర్ సమక్షంలో వాలిపోవాలని, అతని స్పర్శలో కరిగిపోవాలని ఆమె తనువు తహతహలాడింది.

ప్రేమకు కుల, మతాల భేదాలు, పేదా గొప్ప తారతమ్యాలు ఉండవు కదా! నిజమైన ప్రేమ ఎన్ని కష్టాలు ఎదురైనా లెక్కచేయదు. చావునైనా సరే అది ధైర్యంగా ఎదుర్కొని తనను తాను బ్రతికించుకుంటుంది.

అందంలో అప్సరసలను తలదన్నే ఆ అరబిక్ అమ్మాయి, ఇస్లాం మత సిద్ధాంతాలు తలనెత్తుకున్న కుటుంబంలో పుట్టి, కఠినమైన కట్టుబాట్లను పాటిస్తూ ఎల్లప్పుడూ నల్లటి బురఖాలో ఒదిగిపోయి ఉంటుంది. ఎట్టి పరిస్థితులలోను కళ్ళు తప్ప తన శరీరంలోని ఏ ఒక్క భాగం, కనీసం కాలిగోరు కూడా పరాయి పురుషునికి కనిపించకుండా జాగ్రత్తపడే ఆ అమ్మాయి, సంపదలో పుట్టి, సర్వసౌఖ్యాలు

అనుభవించే ఆ అరబిక్ సౌందర్యరాశి.. సామాన్యుడు, పేదవాడు తన ఇంటిపనివాడు అయిన అమీర్‌తో ప్రేమలో పడటం చాలా వింతగా అనిపిస్తుంది. విన్నవారికి ఆశ్చర్యం కలుగుతుంది.

కానీ కువైటు దేశ చరిత్రలో చెరగని ప్రేమకథగా ఇంతకు ముందు ఎన్నడూ జరగని ఒక కథగా శారా, అమీర్‌ల ప్రేమకథ రాయబడింది. తనప్రేమను బ్రతికించటం కోసం, తన ప్రేమికుని కోసం, ఎంతో ధైర్యంతో తెగువతో ఎవరూ చేయని సాహసం ఇందులోని కథానాయకి శారా చేసింది. అందుకే శారా ప్రేమకథ తమిళనాడు ముఖ్యమంత్రి 'జయలలిత'ను కూడా కదిలించింది.

ఏ.సి చల్లదనం నిండిన ఆ రూములో, వెచ్చగా మెత్తటి బ్లాంకెట్ కప్పుకుని కలలు కంటూ నిద్రపోవాల్సిన ఆ సమయంలో కింద తోటలో ఎదురుచూస్తున్న అమీర్‌ను కలవడానికి శారా బయలుదేరింది. అక్కడికి ఆ అమ్మాయి చేరుకోవాలంటే ముందుగా మొదటి అంతస్తులోని తన బెడ్‌రూము పక్కనే ఉన్న అమ్మా,నాన్నల రూమును దాటాలి. తరువాత క్రిందవున్న హాలులోపలికి అమర్చబడివున్న వంపు తిరిగిన చెక్కమెట్లను శబ్దం కాకుండా దిగాలి. అంతేకాదు, ఆ ఎడమవైపున మెట్ల కిందుగా ఉన్న చిన్న రూములోని పనిమనుషులు నిద్రపోయారో, లేదో నిర్ధారించుకుని మెల్లగా వెనుకవైపు ఉన్న వంటగదిలోకి ప్రవేశించాలి. తరువాత అక్కడి తలుపు గడియ తీసుకుని, తోటలోకి అడుగుపెట్టాలి.

అక్కడ తోటలో శారా వాళ్ళ నాన్న బాబా ఖలీల్ ప్రేమగా పెంచుకుంటున్న మూడు కుక్కలు రాత్రిపూట తిరుగుతూ ఉంటాయి. క్రొత్తవారు ఎవరైనా ఆ తోటలోకి, ఇంటి పరిసరాల్లోకి ప్రవేశిస్తే చాలు వెంటనే అవి వారిమీద పడి కండల్ని పట్టి చీల్చిపారేస్తాయి. కానీ ఇంట్లోవారికి, పనివారికి అవి మాలిమి కావడంతో వారిని ఏమీ అనవు.

వీటినన్నింటినీ దాటుకుని, ధైర్యం చేసి, రాత్రివేళలో తోటలోని అమీర్ దగ్గరికి శారా చేరుకోవాలి.

ఇలా తోటలోకి రావడం, అమీర్‌ని కలవడం ఆమెకు క్రొత్త ఏమీకాదు. దాదాపు ఎనిమిది నెలలుగా వారంలో రెండు మూడుసార్లు వీలయినప్పుడల్లా ఆ తోటలో వారిద్దరూ కలుసుకుంటూ, ప్రేమను పంచుకుంటూ ఉన్నారు. కానీ వారు కలుసుకునే ప్రతిరోజూ కూడా శారా వాళ్ళ నాన్న బాబా ఖలీల్ కంటపడితే వెంటనే ప్రాణం తీస్తాడు అనే భయం వారిలో కదలాడుతూనే ఉంటుంది.

కానీ.. వారానికి కనీసం మూడుసార్లయినా, ఆ తోటలో కలుసుకుని కబుర్లు చెప్పుకుని, ప్రేమను పంచుకోకపోతే జీవితం వ్యర్థమేమో అని బలంగా వారికి అనిపిస్తుంది కాబట్టి ఎంతో కష్టమైన పని అయినప్పటికీ రిస్క్ తీసుకుని అక్కడ కలుసుకోవడం వారికి అలవాటైపోయింది.

బాబా ఖలీల్ చాలా కఠినుడు. ఇస్లాం మత ఛాందస భావాల్ని తలనెత్తుకుని, వాటిని తూచా తప్పకుండా పాటించే ముస్లిం "ముల్లా" (మతవాది) ఆయన. స్త్రీయే సకల అనర్థాలకు మూలమని, స్త్రీ సౌందర్యమే పురుషుని పతనానికి మార్గమని, అందుకే స్త్రీ ఎల్లప్పుడూ కట్టుబాట్లతో బురఖాలో ఉండాల్సిందే అని ఆయన గట్టిగా నమ్ముతాడు. అందుకే తన భార్యను, వయసు వచ్చిన తన కుమార్తెలను పరాయి పురుషుని కంటపడకుండా వారిని బురఖాలోనే ఆయన బంధించాడు.

ఆయన అనుమతి లేకుండా, ఆ ఇంట్లోని ఆడవాళ్ళు బయటికి వెళ్ళడానికి అనుమతి లేదు. ఎపుడూ ఆంక్షలతో మ్రగ్గిపోయే ఆ స్త్రీల గతి ఆ ఇంట్లో పెంచుతున్న కుక్కలకన్నా హీనమైనది.

తన ఇంటి పనివాడైన అమీర్‌తో శారా ప్రేమ పెంచుకోవడం అన్నింటినీ విడిచి అతనితో భారతదేశానికి వెళ్ళిపోవడం అనేది బహుశా ఈ కట్టుబాట్లవల్లనే కావచ్చు.

కట్టుబాట్లను అతిక్రమించడం పాపమని, ఇస్లాం మత ధర్మాన్ని పాటించడమే స్వర్గానికి వెళ్ళేదారి అని, కఠినమైన మతసాంప్రదాయాలను సంతోషంగా అనుకరిస్తూ భర్త అదుపాజ్ఞలలో ఉండి నడుచుకోవడం స్త్రీ ధర్మమని భావించే స్త్రీలు వీరిలో చాలామందే ఉన్నారు.

అయితే వీరిలో అతికొద్ది మంది స్త్రీలు మాత్రమే స్వతంత్ర భావాలు కలిగి, ఇంట్లో వారిని, బయటవారిని ఎదిరించో, ఒప్పించో, మామూలు స్త్రీలవలే వస్త్రధారణ కలిగి బయట ప్రపంచాన్ని చూస్తూ నాగరికతను ఒంటపట్టించుకుని పురుషునితో సమానంగా విద్యను ఆర్జిస్తూ తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్నారు. కాలం మారే కొద్దీ ఇక్కడి స్త్రీలలో కూడా మంచి మార్పు వస్తోంది.

ఎప్పుడూ బురఖాలో మగ్గిపోయే శారా అమీర్‌ను కలిసే సమయంలో బురఖా తీసేసి అందమైన దుస్తులు ధరించి అప్సరసలా ఆ తోటలోకి నడిచివస్తుంది.

దేవకన్యలాంటి అందగత్తె శారా, ఏ అర్హతా లేని పనివాడైన అమీర్‌ని ప్రేమించడం నమ్మలేని విషయం. అందుకే అనుభవజ్ఞులు ప్రేమ గుడ్డిది అంటూ ఉంటారు. కానీ అమీర్ పేదవాడైనా హృదయం మాత్రం చాలా గొప్పది. విశాలభావాలు కలిగిన యువకుడు అతడు. అందుకే వారిమధ్య ప్రేమ సాధ్యం అయింది. దేశంకాని దేశం వచ్చి, ఒక డ్రైవరుగా పనిచేస్తూ తన యజమాని కూతురినే ప్రేమించడం అంటే సామాన్యమైన విషయమా? తలచుకుంటేనే నమ్మశక్యం కావటంలేదు అమీర్‌కి. ఏ రాత్రికి ఆ రాత్రి గడిచిన తరువాత తెల్లవారాక క్రిందటి రాత్రి శారాతో చెప్పిన కబుర్లు, ఆ అమ్మాయి లేత స్పర్శ అన్నీ ఒక కలగా అనిపిస్తాయి అతడికి. తన యజమానికి తెలిస్తే ఆ క్షణంలోనే ప్రాణం తీయడం ఖాయం అని అమీర్‌కి బాగా తెలుసు. ఇలాంటి విషయాల్లో ఆయన కోపం ఎంత క్రూరమైనదో, హృదయం ఎంత కఠినమైనదో వారిద్దరికీ బాగా తెలుసు. ఏరోజుకు ఆ రోజు వారి కలయిక కొత్తగా, మత్తుగా, వింతగా ఉండి ఆనందం, హాయిని కలిగిస్తున్నా కూడా బాబా ఖలీల్ గుర్తువచ్చినప్పుడు మాత్రం వారికి గుండె దడ పెరుగుతూ ఉంటుంది అయినా కూడా వారి ప్రేమకు ఏవీ అడ్డం రాలేదు.

కడపజిల్లాలోని ఒక మారుమూల గ్రామం నుండి, కుటుంబ పోషణ కోసం రెండేళ్ళ ముందు కువైటుకు వచ్చి ఆ ఇంట్లో డ్రైవరుగా పనిలో చేరిన అమీర్ శారా ముగ్ధమోహన సౌందర్యానికే కాదు, నిష్కళంకమైన ఆ ప్రేమకు కూడా దాసోహం అయిపోయాడు. శారా ప్రేమలో పడి తన స్థితిని, పరిస్థితిని మరచిపొయ్యాడు. పరాయి దేశంలో పనివాడిగా ఉన్న తన ప్రేమ బయటపడిన ఏదో ఒకరోజు తన ప్రాణం గాల్లో కలిసిపోతుందని, తన శరీరం ఎడారిలోని కాకులకు, గద్దలకు ఆహారం అవుతుందని అమీర్‌కి బాగా తెలుసు. తరువాత తన అమ్మానాన్నలు, తనవారు తనగురించి మరిచిపోవాలని కూడా తెలుసు. కానీ ప్రేమ ఎన్నో అద్భుతాలు చేస్తుంది. ప్రేమికులను ఇద్దరినీ ఒక్కటిగా కలపడానికి వారి హృదయాల్లో గూడు కట్టుకుని నివశించడానికి ప్రేమ ఎన్నో సాహసాలను కూడా చేయిస్తుంది.

నిలువుటద్దంలో ఒక్కసారి అందమైన తన రూపాన్ని పరిశీలించి చూసుకుని పక్కనే స్టాండుకు తగిలించి ఉన్న నియాన్ కలర్ సిల్కు స్కార్ఫ్‌ను తలకు పొందికగా చుట్టుకుంది శారా.

మెల్లగా తన రూములోనుండి బయటకి వచ్చి, మెట్ల దగ్గర కాసేపు ఆగి ఇంట్లో అందరూ నిద్రపోతున్నారని నిశ్చయించుకుని మెల్లగా తన కాళ్ళను ఎత్తిపట్టి అడుగులు వేస్తూ శబ్ధం కాకుండా క్రిందకి దిగసాగింది. అయిదవమెట్టుపై కాలు మోపగానే ఎనిమిది నెలల

క్రితం, అక్కడే ఆ మెట్టుమీదే తన కాలు స్లిప్ అయి ఆ మెట్ల మీదనుండి దొర్లుకుంటూ క్రిందపడిపోయిన సంగతి ఆమెకు జ్ఞాపకం వచ్చింది. అమీర్‌తో ప్రేమలో పడిన ఆ రోజు శారా జీవితంలో మరువలేనిది. ఆ మెట్లు దిగే ప్రతిసారీ ఆ జ్ఞాపకం శారా మదిలో కదలాడి అమీర్ మొదటి స్పర్శ గుర్తుకు వస్తూ ఉంటుంది. ఆ దృశ్యం కళ్ళముందు మొదలవగానే శారా పెదవులపై చిరునవ్వులు విరిసాయి. నునుపైన చెక్కిళ్ళు ఎర్రబడి సిగ్గులు మొగ్గలు వేసాయి.

అసలు ఆ రోజు ఏం జరిగిందో, వారి ప్రేమ ఎలా మొదలయ్యిందో తెలుసుకోవాలంటే ఎనిమిదినెలల క్రితం ఆ మెట్ల దగ్గర జరిగిన ఆ సంఘటనలోకి శారాతోపాటు మనం కూడా వెళ్ళాలి.

ఆ రోజు ఇంట్లో ఎవ్వరూ లేరు. బంధువుల పెళ్ళి జరుగుతుండగా అమ్మానాన్నలతో సహా ఇంట్లో అందరూ పెళ్ళికి వెళ్ళిపోయారు. మరుసటి రోజు పరీక్షలు ఉండటంతో చదువుకుంటూ, శారా తన రూములో ఉండిపోయింది.

మధ్యాహ్నం పూట వంటమనిషి శివమ్మ లంచ్ చేయడానికి కిందకి రమ్మని పిలవడంతో, చదువుతున్న పుస్తకాన్ని పక్కన పెట్టి పరాకుగా ఆ మెట్లు దిగసాగింది శారా. ఆ అయిదవమెట్టు పైకి రాగానే ఏమయిందో అర్థమయే లోపల కాలుజారి క్రిందపడిపోయింది. తలకు దెబ్బ తగిలి రక్తం కారసాగింది. ఆ రక్తాన్ని చూసిన శారాకు స్పృహ తప్పిపోయింది. అక్కడే ఉన్న శివమ్మ దొర్లి పడిన శారాను చేతుల్తో పట్టి పైకి లేపాలని ప్రయత్నించి విఫలమయింది. భయంతో శివమ్మకు కాళ్ళూ చేతులు ఆడలేదు. సమయానికి ఇంట్లో ఎవరూ లేరు. శివమ్మకు ఏం చేయాలో అర్థంకాక "అమీర్.. ఓ అమీర్ ఎక్కడున్నావు? " అని గట్టిగా కేకలు వేస్తూ వెనుక తోటలో ఓ ప్రక్కగా కట్టబడి ఉన్న డ్రైవరు రూము వద్దకు పరిగెత్తింది.

జరిగిన సంగతి విని కంగారు పడిన అమీర్ ఉన్నపళంగా షర్టు కూడా వేసుకోకుండా ఇంటిలోపలికి పరిగెత్తుకుని వచ్చాడు. కిందపడివున్న శారాను బలిష్టమైన తన చేతుల్లోకి అవలీలగా ఎత్తుకున్నాడు.

అయితే ఆ స్థితిలో కూడా ఆమెను తాకే ముందు ఒక్కక్షణం అతడికి కాస్త భయం కలిగింది. మామూలుగా ఉన్నప్పుడు ఆమె ఎదుట పడటానికి, ఆమె ముఖం చూడటానికే భయపడిపోయే తాను, నిరంతరం ఘోషాలో ఉండే వయసులో ఉన్న ఎండ కన్నెరుగని అమ్మాయిని తాకడమా? ఎంత ధైర్యం? యజమాని ఇలా చూస్తే ఏమైనా ఉందా? భయం కలిగింది. వెంటనే ఆమెను అక్కడ క్రింద పడేసి పారిపోవాలనిపించింది.

కానీ కర్తవ్యం గుర్తుకు రావడంతో అంతడిలోని భయాన్ని మానవత్వం జయించి ఆమెను అలాగే భుజంపై వేసుకున్నాడు.

స్పృహలో లేనట్లున్న శారాను కార్లోని వెనుక సీటులో పదిలంగా పడుకోబెట్టి శివమ్మను ప్రక్కన కూర్చోమన్నాడు.

అప్పటికి శారాకు కాస్త తెలివి వచ్చి జరిగేది అర్థం అవుతోంది కానీ మగతగా అలాగే కళ్ళు మూసుకుని ఉండిపోయింది.

మొట్టమొదటిసారిగా పరాయి పురుషుని (అమీర్) స్పర్శ ఎంతో కొత్తగా ఉంది. అమీర్ చేతుల్లో ఏదో తెలియని ఆత్మీయత, అతడి స్పర్శలోని వెచ్చదనం వింతగా అనిపించి ఆమెలో ఏదో తెలియని కలవరాన్ని కలిగించింది. ఆ క్షణంలో విడవకుండా, అతని మెడచుట్టూ చేతులు వేసి అతని భుజంపై ఒదిగిపోయి అలాగే ఉండిపోవాలనిపించింది ఆమెకు. రెండేళ్ళకు పైగా ఆ ఇంట్లో డ్రైవరుగా అమీర్ పనిచేస్తున్నా కూడా ఆమె అంతవరకు అతడి ఎదుట పడిన రోజే లేదు. అతడిని పనివాడిగా భావించి చులకన భావంతో చూసే శారా ఎన్నడూ పలకరించి మాట్లాడను కూడా లేదు. ఇంటి పనివాడైనా సరే పరాయి మగవాడితో మాట్లాడటం శారా వాళ్ళ నాన్న

ఖలీల్‌కు నచ్చదు. అందుకే రెండేళ్ళకు పైగా ఆ ఇంట్లో అమీర్ డ్రైవరుగా పనిచేస్తున్నా కూడా అతడిని పరిశీలనగా ఎన్నడూ చూసింది కూడా లేదు.

కానీ ఇపుడు అతడు ఆమె కళ్ళకి ఎంతో అందంగా, ప్రత్యేకమైనవాడిలా కనిపిస్తున్నాడు. అపుడే ఆ నిముషంలోనే శారా హృదయం అమీర్‌కు అంకితమైపోయింది.

మెట్లపైనుండి పడిపోయి శారాకు దెబ్బతగిలిందని బాబాఖలీల్‌కు తెలియజేసారు. కానీ అమీర్ ఆమెను ఎత్తుకుని వెళ్ళి కార్లో పడుకోబెట్టి హాస్పిటల్‌కి తీసికెళ్ళిన సంగతి ఆయనకు తెలియకుండా అందరూ దాచిపెట్టారు. మరి ఆ విషయం ఆయనకు తెలిస్తే అంతే సంగతులు.

హాస్పిటల్ నుండి తిరిగి వచ్చిన శారా, తన గదిలో నిలువలేకపోయింది. అమీర్‌తో మాట్లాడాలని ఆమె హృదయం వేగిరపడింది.

ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంటింట్లోకి వెళ్ళి అక్కడ పనిచేస్తున్న శివమ్మతో 'వెళ్ళి' అమీర్‌ని పిలవమని చెప్పింది.

ఎందుకో అని భయపడుతూ శివమ్మ వెళ్ళి అమీర్‌ని తీసుకొచ్చి వంటింటి గడప అవతల నిలబెట్టి అతడొచ్చినట్లు హాల్లో కూర్చున్న శారాకు తెలియజేసింది.

"బయటకాదు. అతడిని లోపలికి రమ్మని చెప్పు" అధికారికంగా చెప్పింది శారా.

ఆమె మాట ప్రకారం లోపలికి వచ్చి ఒక్క అడుగు హాలు లోపలికి వేసి తలవంచుకుని శారా ఎదుట నిలబడ్డాడు అమీర్.

నిన్నటి రోజు ఆమెను తన చేతుల్లోకి ఎత్తుకుని, కార్లో పడుకోబెట్టిన ఆ సంఘటన అమీర్ కళ్ళముందు మెదిలింది.

ఆ ఇంటిలోపలికి వచ్చి అలా ఆమె ముందు నిలబడటం ఏదో తెలియని ఇబ్బందిగా అనిపించింది. నిన్నటి విషయంలో ఎందుకు నన్ను తాకావు? అంటూ తిడుతుందేమో అని అతడికి భయం కలిగింది.

ఆమె తన యజమానురాలు. ఆమె ఏది చెప్పినా వినాల్సిందే తిట్టినా, కొట్టినా కూడా పడాల్సిందే గత్యంతరం లేదు. అందుకే ఆమె ఎదుట మౌనంగా నిలబడ్డాడు.

హఠాత్తుగా ఉన్నట్లుండి "అమీర్ ఆన హెబ్బక్ ఇంతె" అంది శారా. (అమీర్ నేను నిన్ను ప్రేమిస్తున్నాను")

ఆమె మాటలు చెవిన బడటంతోనే ఉలిక్కిపడ్డాడు అమీర్.

తల ఎత్తి ఆశ్చర్యంగా ఆమె వైపు చూసాడు.

"అవును అమీర్ నాకు తెలిసి ఊహ వచ్చాక, వయసు వచ్చాక నన్ను తాకిన పరాయిపురుషుడివి నువ్వే. నిన్నటినుండి నీ స్పర్శను నేను మరచిపోలేకపోతున్నాను. నీతోనే, నా ప్రేమను, జీవితాన్ని పంచుకోవాలని నిర్ణయించుకున్నాను."

"ఇప్పటినుండీ రెండు రోజులు టైము నీకు ఇస్తున్నాను. బాగా ఆలోచించుకుని నాకు నీ జవాబు చెప్పు" అని చెప్పి, మెట్లెక్కి పైన ఉన్న తన గదిలోకి వెళ్ళిపోయింది శారా.

ఆమె మాటలతో నిశ్చేష్టుడై నిలబడిపోయిన అమీర్, ఒక నిముషం తరువాత తేరుకుని అక్కడినుండి బయటపడి వడివడిగా నడుస్తూ తన రూము చేరుకున్నాడు.

శారా మాటలు అతడిని ఎంతో కలవరపరచాయి. ఆమె మాటలు నమ్మశక్యంగా లేవు. ఇది ఎలా సాధ్యం? ఆమెకూ తనకూ మధ్య భూమికీ ఆకాశానికీ ఉన్నంత దూరం ఉంది. కనీసం తలెత్తి ఆమెవైపు చూడటానికైనా తనకు అర్హతలేదు. ఆమె తన యజమానురాలి కూతురు. ఆమెతో ప్రేమ కలలో కూడా ఊహించలేనిది.

లేదు. ఇది సరికాదు. ఆమె ఏదో పొరపాటుగా ఈ నిర్ణయం తీసుకుంది. రెండురోజులు గడిస్తే ఆమె తన అభిప్రాయం తప్పని తెలుసుకుని మార్చుకుంటుంది. అంతే తప్ప తానుకూడా పిచ్చిగా ఆలోచిస్తే బాబాఖలీల్ తన ఎముకలు విరగ్గొట్టి ఎడారిలో పడేస్తాడు. తనతోపాటు శారాకూడా ప్రమాదంలో పడుతుంది. నిన్న ఆ సమయంలో ఏం చెయ్యాలో తోచక ఆమెను చేతుల్లోకి తీసుకుని హాస్పిటల్‌కు తీసుకుపోవాల్సి వచ్చింది.

అంతే తప్ప మరలా ఆమె వేపు కన్నెత్తి చూడటం కూడా తప్పే.

ఇండియాలో ఇంటిదగ్గర అమ్మానాన్నలు, తాను ఇంటికి వెళ్ళగానే పెళ్ళి చేయాలని తనకోసం తగిన అమ్మాయిని వెతుకుతున్నారు. తను వాళ్ళందరినీ సమస్యల్లోకి నెట్టలేడు. శారాతో ప్రేమ ప్రాణాలతో చెలగాటమే! వళ్ళు దగ్గరపెట్టుకుని తన స్థితిని గమనించుకుని ఆమెకు దూరంగా ఉండటం ఎంతో ఉత్తమమైన పని అని అమీర్ బాగా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాడు.

కానీ అది అంత సులభం కాదని శారాతో అనుబంధం పటిష్టమై ప్రేమ మరింత పదిలమై కువైటు చరిత్రలోనే నిలిచి పోతుందని ఆ సమయంలో అమీర్ ఊహించలేదు.

ఆ సాయంత్రం పూట లేచి తోటలోకి వెళ్ళి చెట్లకు, మొక్కలకు నీళ్ళు పడుతూ శారా గురించే ఆలోచిస్తూ పరధ్యానంగా ఉన్న అమీర్‌కు పైన మొదటి అంతస్తులోని కిటికీలోనుండి ఎవరో తననే చూస్తున్నట్లు అనిపించి తలెత్తి పైకి చూసాడు.

ఆ సాయంత్రపు నీరెండలో కిటికీ దగ్గర సిల్క్‌పరదాల చాటున నిలబడ్డ శారా తనవైపే తదేకంగా చూస్తూ కనిపించింది. అమీర్ తలెత్తి తనవైపు చూడగానే చిన్న చిరునవ్వుతో అతన్ని పలకరించింది.

పగలే వెన్నెల కురిసినట్లుంది ఆమె నవ్వు.

అద్భుత సౌందర్యరాశి అయిన శారాను, సమ్మోహనమైన ఆమె చిరునవ్వును చూసిన అమీర్ హృదయం శారావైపు పరుగులెత్తింది. చేస్తున్న పనిని కూడా మరిచిపోయాడు అతడు. పైన కిటికీ వద్ద నిలబడ్డ శారా రూపమే అతని కళ్ళలో నిలిచిపోయింది.

ఇలాగే రెండురోజులు గడిచిపోయాయి. అమీర్ అలా బయటికి వచ్చి ఏ పని చేస్తున్నా కూడా ఏదో ఒక సమయంలో శారా చూపులు అతడిని గుచ్చుకుని కలవర పరిచేవి. అమీర్‌ను చూస్తూ శారా తన ప్రేమను కళ్ళలో ఒలికించేది.

మూడవరోజు యధావిధిగా తోటలో పనిచేస్తున్న అమీర్, శారా కనిపిస్తుందేమో అని పైన ఉన్న ఆమె కిటికీవైపే ఆశగా చూస్తున్నాడు. ఎంత వద్దనుకున్నా అతని హృదయం శారావైపే పరుగెడుతోంది. ఇంతలో అమీర్ ఊహించని విధంగా ఆ సాయంకాలపు సమీరంలా తోటలోకి వచ్చి అతడి ఎదురుగా నిలబడింది శారా.

అద్భుతమైన ఆమె అందాన్ని చూస్తూ కళ్ళు మరల్చుకోలేక అవస్థపడ్డాడు అమీర్.

"అమీర్ నేను చెప్పిన రెండురోజులు గడిచిపోయాయి. నువు నీ నిర్ణయం ఇంకా నాకు చెప్పనే లేదు" అంది శారా చిన్నగా నవ్వుతూ.

"నేనేం చెప్పగలను? నేను ఈ ఇంటి పనివాడిని. చాలా పేదవాడిని మీతో ఏ విషయంలోనూ సరిపడనివాడిని" అన్నాడు అమీర్ కాస్త దిగులుగా, నిరాశ నిండిన స్వరంతో.

"అవునా? మరి మీ భారతదేశంలో ఎన్నో ప్రేమకథలను గొప్పగా చరిత్రలో రాసారు. ఆ కథలను ఎన్నింటినో సినిమాలుగా కూడా మలిచారు. భారతీయులు ప్రేమైక మూర్తులనీ, పురుషులు పౌరుషానికి, పురుషత్వానికి ప్రతీకలని, వారు వలచి వచ్చిన స్త్రీని ఎంత కష్టమైనా సరే అందరినీ ఎదిరించి తన సొంతం చేసుకుని ప్రేమను నిలబెడతారని కూడా తెలుసుకున్నాను. మీ భారతీయ సంస్కృతిని తెలియజేసే

పుస్తకాలెన్నో చదివాను సినిమాలు కూడా చూసాను. పేదవాడు ప్రేమించడానికి అర్హుడు కాదా అమీర్? పేదవాడికి, పనివాడికి హృదయం ఉండదా?'' సూటిగా ప్రశ్నించింది శారా.

ఆమె ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయాడు అమీర్.

అతని సమాధానానికి ఆమె ఎదురు చూడలేదు కూడా. ''ఈ రాత్రి ఒంటిగంటకి ఈ తోటలో, ఇక్కడ ఇదే ప్రదేశంలో మనం కలుసుకోబోతున్నాం అప్పుడు అన్ని విషయాలు మనం మాట్లాడుకుందాం'' అని చెప్పి వెనుతిరిగి ఇంట్లోకి వెళ్ళిపోయింది శారా.

నడిచివచ్చిన అదృష్టాన్ని అందుకోవాలో భయపడి వదులుకుని పారిపోవాలో అర్థంకాలేదు అమీర్‌కి. అంతులేని సంఘర్షణకు లోనయ్యాడు అతడు. కానీ శారా బలమైన ప్రేమకు, పట్టుదలకు అతడు లొంగిపోయి ఆ రాత్రి ఒంటిగంటకు ముందుగానే ఆ తోటలోకి చేరుకున్నాడు.

అలా వారి ప్రేమ ఎనిమిది నెలలుగా ఆ తోటలోని మొక్కలతో పాటు పెరుగుతూ తీవెల్లా అల్లుకుని, ఆకులతో పాటు చివురిస్తూ పువ్వులవలె పరిమళిస్తూ రోజు రోజుకూ వారి బంధం గట్టిపడింది.

అయితే ఈ రోజు ఒక ముఖ్యమైన విషయం శారాతో పంచుకోవాలని అమీర్ అక్కడ ఆతోటలో కూర్చుని ఆదుర్దాగా ఆమెకోసం నిరీక్షిస్తున్నాడు.

ఆ చెక్క మెట్లన్నీ దిగిన శారా హమ్మయ్య అందరూ నిద్రపోతున్నారు, ఎవరూ చూడలేదు అనుకుంటూ గట్టిగా ఓసారి ఊపిరి పీల్చుకుంది. వంటింటి తలుపు గడియ తీసుకుని చిరునవ్వుతో ఆ తోటలోకి ప్రవేశించింది. అక్కడ ఉన్న సిమెంటు బెంచీపై కూర్చుని ఆమెకోసం ఎదురుచూస్తున్న అమీర్, శారాను చూసిన వెంటనే పైకి లేచి ప్రేమగా ఆమె చేతిని అందుకుని తన ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. ఎపుడూ నవ్వుతూ ఉండే అతని ముఖం ఆరోజు ఎంతో నీరసంగా, ఆందోళనగా కనిపించింది.

''ఏమయింది అమీర్? నీ ఆరోగ్యం బాగుందా?'' అని కంగారుగా ప్రశ్నించింది శారా.

''ఆ.. నా ఆరోగ్యం బాగానే ఉంది. కానీ మా అమ్మానాన్నలు ఫోను చేసి నువు వెళ్ళి రెండేళ్ళు పూర్తి అయింది. ఎపుడు ఇండియాకు వస్తున్నావు? అని ప్రతిరోజూ అడుగుతున్నారు. ఇంటికి వెళితే మంచి అమ్మాయిని చూసి నా పెళ్ళికూడా చెయ్యాలని వాళ్ళు ఆశపడుతున్నారు. వారికి ఏ జవాబు చెప్పకుండా మాట దాటేస్తున్నాను. కానీ ఈరోజు బాబా కూడా నా సెలవుల గురించి అడిగాడు. 'అమీర్ నీ రెండేళ్ళు అయిపోయాయి. నీ కాంట్రాక్టును మరో రెండేళ్ళకు పొడిగిస్తున్నాను. సెలవులకు ఈ నెలలో ఇండియాకు వెళ్ళాలంటే చెప్పు. టిక్కెట్లు తీస్తాను. వెళ్ళి రెండు నెలల కాలం మీవాళ్ళతో గడిపి తిరిగిరా. ఇపుడు నువు వెళ్ళకపోతే మళ్ళీ ఇంకో సంవత్సరం వరకూ నిన్ను పంపించడానికి నాకు కుదరదు. కాబట్టి ఈ నెలలో నీ ప్రయాణం, తేదీలు నిర్ణయించుకుని విషయం తొందరగా నాకు చెప్పు' అన్నాడు. మరి నిన్ను చూడకుండా రెండు నెలల కాలం నేను ఇండియాలో ఎలా ఉండగలను? అది అసాధ్యం. అందుకే నాకు ఇండియా వెళ్ళాలని లేదు. నిన్ను చూడకుండా ఒక్కరోజు కూడా ఉండలేను శారా'' ఆమె కళ్ళలోకి చూస్తూ దిగులుగా చెప్పాడు అమీర్.

''ఇలా జరుగుతుందని నాకు ముందే తెలుసు అమీర్. నిజమే రెండేళ్ళుగా నువు నీ దేశాన్ని వదిలి నీ వారిని విడిచి ఇక్కడ మా దేశంలో మా ఇంట్లో ఉన్నావు. ఎంతో కష్టపడి పనిచేసావు. మరి ఇప్పుడు వెళ్ళి నీ దేశాన్ని, నీ వారిని చూసి సంతోషించి రెండు నెలలకాలం విశ్రాంతి తీసుకోవాలి కదా'' అన్నది శారా నవ్వుతూ.

''హు.. నీకు నవ్వుగా ఉందా? నిన్ను విడిచి వెళ్ళాలంటే నాకు చాలా బాధగా ఉంది. నేను వెళ్ళలేను'' చెప్పాడు అమీర్ ఆమె ముఖాన్ని చుస్తూ.

"నన్ను విడిచి ఎందుకు వెళతావు? నీతోపాటు నన్నుకూడా తీసుకుని వెళ్ళు. నాకు మీ ఇండియా చూడాలని ఎప్పటినుండో చాలా కోరికగా ఉంది అమీర్" ఆశగా అడిగింది శారా.

"ఏంటి శారా. జోక్ చేస్తున్నావా? ఈ సమయంలో, ఈ పరిస్థితిలో ఇపుడు నేను నవ్వలేను."అన్నాడు అమీర్ బాధగా.

"జోకులు కాదు. నిజమే చెపుతున్నాను. నేను కూడా నిన్ను విడిచి ఒక్కరోజు కూడా ఉండలేను. మీ భారతదేశం అంటే నాకు చాలా ఇష్టం. మీ దేశసాంప్రదాయాలు వస్త్రధారణ ఎంతో ప్రత్యేకమైనవి. ఎన్నో పుస్తకాల్లో రాసిన మీ భారతదేశం యొక్క గొప్పదనం, విశిష్టతలను గురించి నేను ఎపుడూ చదువుతూ ఉంటాను. మీ దేశంలో అడుగుపెట్టడం, ఆ గాలిని పీల్చడం, ఆ నేలపై జీవించడం అనేవి ఎంతో అదృష్టం ఉన్నవారికే సాధ్యం అవుతుంది. ఈ నెల ఆఖరు వారంలో నువు ఇండియా వెళ్ళే తేదీలు నిర్ణయించి 'బాబా'కు చెప్పి నీ ఫ్లయిట్ టిక్కెట్లు తీసుకో. నేను కూడా నీతోపాటు అదే ఫ్లయిట్‌లో ఇండియా వస్తాను. అక్కడ మనం పెళ్ళిచేసుకుని మన జీవితం అక్కడే సుఖంగా, సంతోషంగా గడుపుదాం" ఖచ్చితంగా తన నిర్ణయాన్ని తెలియజేసింది శారా.

తనదేశాన్ని, తనవారిని, సర్వసంపదలను, సౌఖ్యాలన్నింటినీ తనకోసం త్యజించి, తన చెయ్యి పట్టుకుని, భారతదేశానికి నడిచి రావడానికి, కడపజిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో తనతోపాటు సామాన్యమైన జీవితాన్ని గడపడానికి, ఆమె తీసుకున్న గట్టి నిర్ణయానికి కదిలిపోయాడు అమీర్. ఆమె ధైర్యానికి, ముఖ్యంగా ఆమెకు తనపై ఉన్న ప్రేమకు, నమ్మకానికి జోహార్లు అర్పించాడు అమీర్.

"శారా నా కోసం కోరి కష్టాల్ని కొనితెచ్చుకోవద్దు. నాలో ప్రాణం ఉన్నంతవరకు నిన్ను వదలకుండా పువ్వుల్లోపెట్టి చూసుకుంటాను. కానీ కువైటులో మీ ఇంట్లో నువు అనుభవించే ఇన్ని సౌఖ్యాలు ఇండియాలో నీకోసం అమర్చలేని పేదవాడిని నేను. నువ్వు నన్ను పెళ్ళిచేసుకుంటే నాతోపాటు అక్కడ పేద జీవితం గడపాల్సి వస్తుంది. ముఖ్యంగా నువ్వు నీదేశాన్ని, నీ వారిని విడిచిపెట్టాల్సివస్తుంది. జీవితంలో మరలా నీవాళ్ళు నీతో మాట్లాడకపోవచ్చు."

"నేను ఇండియా వెళ్ళేందుకు ఇంకా చాలా టైమ్ ఉంది కాబట్టి మరొక్కసారి నువు బాగా ఆలోచించుకుని నిర్ణయం తీసుకో" హృదయం భారం కాగా ఆర్తిగా ఆమెకు నచ్చచెప్పబోయాడు అమీర్.

"లేదు అమీర్. నీకోసం నేను అన్నీ విడిచి అందరినీ వదిలి రావడానికి సిద్ధమయ్యాను. నువులేని జీవితాన్ని నేను కలలో కూడా ఊహించలేను. నీకోసం, నీ ప్రేమకోసం, నీతో జీవితాన్ని గడపడం కోసం నా ప్రాణం అర్పించడానికయినా నేను రెడీగా ఉన్నాను. నీతోపాటు ఎంత దూరం అయినా నేను వస్తాను. ఎన్ని సుఖాలనైనా త్యజిస్తాను. మీ భారతదేశంలో సాధారణమైన పేద జీవితంకూడా ఎంతో విలువైనది. అర్ధవంతమైనది. నాకిష్టమైనది కూడా. నువు ఇంకేమీ ఆలోచించకు. జరిగేది అంతా నేను చూసుకుంటాను నువు నిశ్చింతగా నీ ప్రయాణానికి సిద్ధపడు" అంది శారా.

తెలతెలవారే ఆ సమయంలో ఆ తోటలోని పువ్వులన్నీ శారా ప్రేమను అభినందిస్తూ పరిమళాలు వెదజల్లాయి. కానీ అమీర్‌కి మాత్రం ఆమె మాటలపై నమ్మకం కలగలేదు. ఎందుకంటే శారా అతనితో పాటు ఇండియా రావడం అనేది అంత సులభమైన విషయం కాదని అతనికి తెలుసు.

అమీర్ ఇండియా వెళ్ళేరోజు దగ్గర పడింది. ఇంటికి ఫోను చేసి అమ్మానాన్నలకి, ఇంట్లోవారికి ఏమికావాలో అడిగి తెలుసుకున్నాడు. వారికి కావలసిన వస్తువులన్నీ కొని బ్యాగుల్లో సర్దుకున్నాడు. రెండేళ్ళ తరువాత ఇండియాకు వెళుతున్నా అనే సంతోషం ఒకవైపు ఇక్కడ ఇంట్లోవారికి తెలియకుండా, బాబా కళ్ళు కప్పి తప్పించుకుని తనతోపాటు శారా ఇండియాకు ఎలా వస్తుందో అనే

సంశయం మరోవైపు. ఏది ఏమైనా తనను నమ్మి, ప్రాణానికి తెగించి తన దేశాన్ని, తనవారినందరినీ విడిచి వచ్చే శారా చేయి విడవకుండా ఆమెను జాగ్రత్తగా పువ్వులాగా చూసుకోవాలని, ఆమె కోసం ప్రాణం పోయినా ఫరవాలేదని అమీర్ కూడా నిర్ణయించుకున్నాడు.

రేపే అమీర్ ఇండియా ప్రయాణం.

ఆ రాత్రి తోటలో ఆఖరిసారిగా అమీర్‌ని కలిసిన శారా తన ప్రణాళికను అమీర్‌కు విపులంగా వివరించింది.

అంతా విన్న అమీర్ ఆశ్చర్యపోయాడు.

"వల్ల"? (నిజమా?)" నువు చాలా రిస్క్ తీసుకుంటున్నావు శారా అన్నాడు.

"రిస్క్ తీసుకోకపోతే మన ప్రేమ నిలవదు. మనం ఒక్కటి కాలేముకదా?

"అల్లా" మనల్ని ఒక్కటి చేసి చల్లగా చూస్తాడు. నువు భయపడవద్దు అంది శారా.

ఆమె మాటలు విని ఆమెవైపు ఆరాధనగా చూస్తూ "హయాతి ఇంతె" (నీవు నా జీవితం) అన్నాడు చెమర్చిన కళ్ళతో అమీర్.

ఆ రోజు వాళ్ళు ఇండియా వెళ్ళే రోజు. సాయంత్రం ఫ్లయిట్.

భారతదేశపు సాంప్రదాయ దుస్తులైన "చుడీదార్‌ను" ప్రియంగా ధరించింది శారా. తలపైన దుపట్టాను నిండుగా కప్పుకుంది. ఏ అలంకరణ లేకుండా, అతి సాధారణంగా ఆమె తయారయింది. చిన్న బ్యాగులో తనకు అవసరమయిన కొన్ని బట్టలు, అత్యవసరమయిన వస్తువులు పొందికగా సర్దుకుంది. ఫ్లయిట్ అందుకోవడానికి ఇంకో మూడు గంటల సమయం ఉందనగా ఇంట్లోవాళ్ళ కళ్ళు గప్పి బయటపడింది శారా. గారేజ్‌లోని కారును బయటికి తీసి తానే స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ కువైటు ఎయిర్ పోర్టుకు చేరుకుంది. కౌంటర్‌లో "బ్యాగేజ్ చెకిన్" మామూలుగానే అయింది. బోర్డింగ్ పాస్ తీసుకుని ఇమ్మిగ్రేషను కౌంటరు దగ్గరికి వచ్చింది. ఏమవుతుందో? కనిపెడతారేమో అని శారా హృదయం ఆందోళనతో నిండిపోయింది కానీ తన ముందు ఉన్న పెద్ద 'క్యూ'తో బిజీగా ఉన్న ఆ ఇమ్మిగ్రేషను ఆఫీసరు శారాను పరిశీలించి చూడకనే పాస్‌పోర్టుపై స్టాంపును వేసి లోపలికి పంపించాడు.

తను అనుకున్న విధంగా అన్నీ జరిగిపోవడంతో తన మార్గం సుగమం కావడంతో సంతోషంతో ఒక్కసారి ఎగిరి గంతేయాలనిపించింది శారాకు. డ్యూటీ ఫ్రీ షాపుల దగరికి వచ్చి, అమీర్ కనిపిస్తాడేమో అని ఒకసారి పరికించి చూసింది శారా.

ఇరవై రెండో గేటుకు వెళ్ళేదారిలో ఉన్న కుర్చీలో కూర్చుని శారా కోసం ఎదురు చూస్తూ కనిపించాడు అతడు. పరిగెత్తుకుంటూ అమీర్ దగ్గరికి వెళ్ళి అతని చేతిని బిగించి పట్టుకుంటూ సంతోషంగా మెరిసే కళ్ళతో "నేను వచ్చేశా" అంది శారా.

"కలా నిజమా" అన్నట్లు ఇంకా నమ్మలేనట్లు ఆమె వైపు చూస్తున్నాడు అమీర్.

ఇష్టంగా వేసుకున్న ఇండియన్ డ్రస్‌లో అందంగా కనిపిస్తోంది శారా. చూసిన వారికందరికీ అచ్చం భారతీయ వనితలాగే అనిపిస్తోంది.

ఫ్లయిట్‌లో పక్కపక్కనే ఉన్న సీట్లలో కూర్చున్న వాళ్ళు అపుడు రిలాక్స్ అయి నిండుగా ఊపిరి పీల్చుకున్నారు.

అయితే ఇంతటితో ఈ కథ ముగియలేదు.

చెన్నై ఎయిర్‌పోర్టులో సంతోషంగా విమానం దిగి అక్కడి ఇమ్మిగ్రేషను దగ్గరికి వచ్చాకే అసలు కథ మొదలయింది.

వచ్చే ప్రయాణీకులనందరినీ ఒక్కొక్కరినీ పరిశీలనగా చూస్తూ వారి పాస్‌పోర్టులను జాగ్రత్తగా చెక్ చేస్తున్న అక్కడి అధికారులు శారా పాస్‌పోర్టు శివమ్మ అనే పనిమనిషి పాస్‌పోర్టుతో ఫోర్జరీ చేయబడి ఉన్నట్లు కనుగొన్నారు.

అంతవరకూ ఆనందంగా ఉన్న శారా, అమీర్‌ల ముఖాలు చెన్నైలో పట్టుబడటంతో రక్తం లేనట్లు పాలిపోయాయి. తమ ప్రేమను బ్రతికించుకోవడానికి కలిసి జీవించడానికి చేసిన ప్రయత్నాలు విఫలమై తాము పడిన కష్టమంతా వ్యర్థమయిందే అని బాధపడ్డారు.

పాస్‌పోర్టు ఫోర్జరీ చేసిన నేరం నిరూపణ కావడంతో చెన్నై ఎయిర్ పోర్టు పోలీసులు వారిద్దరినీ అప్పటికి అపుడే పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆ విషయం తెలుసుకున్న పత్రికలన్నీ ఆ వార్తను వాళ్ళ ప్రేమకథను ప్రత్యేకంగా పెద్ద అక్షరాలతో ముందు పేజీల్లో ప్రచురించాయి. "ఒక కువైటు యువతి, తన ఇంటి డ్రైవరును ప్రేమించి అతనితో కలిసి ఇండియాలో జీవించడానికి కువైటు నుండి పారిపోయి రావడం అనేది పెద్ద న్యూసే మరి"

విషయం తెలుసుకున్న అమీర్ అమ్మానాన్నలు బంధువులు ఆందోళన చెంది వాళ్ళందరూ చెన్నైకి వచ్చారు. అమీర్‌ను, శారాను విడిపించడానికి తమ ప్రయత్నాలు తాము చేసారు. కానీ పోలీసులు వారిద్దరినీ విచారణ కోసం ఆరురోజులు పోలీస్ స్టేషన్‌లోనే ఉంచారు. పత్రికల్లోని కథనాలు, అమీర్ శారాల ప్రేమకథ వారు చేసిన సాహసం అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితగారి హృదయాన్ని కదిలించాయి. ఆమె ఈ విషయంలో స్వయంగా కల్పించుకుని వారిద్దరినీ విడుదల చేయవలసిందిగా పోలీసులకు ఉత్తర్వులు పంపించారు. అమీర్, శారాలకు కావలిసిన సహాయ సహకారాలు అందించి వారిని జాగ్రత్తగా కడపజిల్లాలోని అమీర్ ఇంటికి పంపించాల్సిందిగా అక్కడి అధికారులను ఆమె ఆదేశించారు. వాళ్ళు శారా భద్రతకొరకు, అమీర్ వద్ద వాళ్ళ అమ్మానాన్నల వద్ద లిఖిత పూర్వక హామీ పత్రాలు రాయించుకుని సంతకాలు చేయించుకున్నారు. అధికారులు స్వయంగా ప్రభుత్వ వాహనం ఏర్పాటు చేసి వాళ్ళని కడప జిల్లాలోని అమీర్ గ్రామానికి తీసుకుని వచ్చి ఇల్లు చేర్చారు.

మరుసటి రోజు అక్కడి ప్రాంతీయ "ముల్లా" (మతపెద్ద) సమక్షంలో ఇస్లాం మత సాంప్రదాయం ప్రకారం శారా, అమీర్‌ల వివాహం ఘనంగా జరిగింది.

వారి ప్రేమ కథను విన్న ప్రజలు శారా, అమీర్‌ల గురించి వింతగా, విడ్డూరంగా చెప్పుకుంటూ వాళ్ళ వివాహ వేడుకను చూడటానికి చుట్టు ప్రక్కల పల్లెలనుండి తరలి వచ్చారు.

ఈ విధంగా కువైటు దేశపు అరబ్ వనిత శారా, ఇండియాలోని కడపజిల్లా నివాసి అమీర్‌ల ప్రేమ కథ సుఖాంతమైంది. వాళ్ళు చేసిన సాహసాన్ని జనాలు కథలుగా చెప్పుకున్నారు.

ఈ కథ నిజంగా 2002వ సంవత్సరంలో జరిగింది. కథా సౌలభ్యం కోసం ఇక్కడ మన కథానాయకి అయిన శారా, కథానాయకుడైన అమీర్‌ల పేర్లు మార్చడం జరిగింది.

## అల్‌రాజి హాస్పిటల్ కథ

**అది అల్‌రాజి అర్థోపెడిక్ హాస్పిటల్.**

కువైటు పట్టణంలోని షువైక్ అనే ఏరియాలోని కొన్ని వందల ఎకరాల స్థలంలో అన్ని రకాల ఆసుపత్రుల సముదాయం ఒకేచోట ఏర్పడి ఉంది.

అన్ని వసతులతోనూ అవసరమైన టెక్నాలజీతో కూడిన మెషీన్లతో అక్కడి ఆసుపత్రులు రోగులకు తగిన వైద్యాన్ని, ఎనలేని సేవలను ఫీజులు లేకుండా ఉచితంగా అందిస్తున్నాయి.

ఎన్ని టాబ్లెట్లు మింగినా కాలు నొప్పి తగ్గకపోవటంతో ఆరోజు కువైటులో నేను నివసించే ప్రాంతంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళాను. అక్కడి డాక్టరు నొప్పితో నన్ను బాధిస్తున్న నా ఎడమకాలిని బాగా పరీక్షించి తల అడ్డంగా ఊగించి "సమ్‌థింగ్ రాంగ్ మీరు అల్‌రాజి హాస్పిటల్‌కి వెళ్ళండి. అక్కడ జాయిన్ అయి అన్నిరకాల పరీక్షలు చేయించుకుంటేనే మీ కాలు నొప్పి ఎందుకు వచ్చిందో, ప్రాబ్లమ్ ఏమిటో ఖచ్చితంగా చెప్పగలము. " అంటూ లెటర్ పాడ్‌పై రిక్వెస్టెడ్ టెస్ట్‌లను, కేసు డిటైల్స్‌ను రాసి నా చేతికి అందించాడు.




అది 2000వ సంవత్సరం. జనవరి నెల. తేదీ సరిగ్గా గుర్తులేదు. ఎముకలు, కాళ్ళు, చేతులు విరిగిన వారు మాత్రమే వెళ్ళే అంత పెద్ద అల్‌రాజి హాస్పిటల్‌కి, ఆ డాక్టరు వెళ్ళమని చెప్పగానే నాకు చాలా భయం కలిగింది. ఆరోజు సాయంత్రమే బయలుదేరి వెళ్ళాను.

పార్కింగ్ ప్లేస్‌లో కారు దిగి ఆ ఆసుపత్రి రిసెప్షను డెస్క్ వరకు ఆ కొద్ది దూరం నడవడం నాకు అసాధ్యమైపోయింది. ప్రాణాన్ని బిగపట్టి వేసే ఒక్కో అడుక్కీ ఒక్కో కన్నీటి బొట్టును నేలపై రాలుస్తూ నొప్పిలేని కుడికాలుపైనే నా భారాన్నంతా మోపి నడవలేక నడుస్తూ మెల్లగా అల్‌రాజి హాస్పిటల్ ఎంట్రన్స్‌లో ఉన్న రిసెప్షన్ డెస్క్ దగ్గరికి నేను చేరుకున్నాను.

అక్కడ ఉన్న నర్సులు నేను తెచ్చిన రిపోర్టులు, రిక్వెస్ట్‌లు పరిశీలించి చూసి అప్పటికే కృంగిపోయి ఉన్న నన్ను, నా పరిస్థితిని గమనించి ఆయాను పిలిచి వెంటనే ఎనిమిదో నంబరు వార్డులోని రెండో నంబరు రూములో ఉన్న రెండో బెడ్‌పైకి నన్ను చేర్చమని చెప్పారు.

ఆయా వెళ్ళి మూలగా స్టోరు రూములో ఉన్న చక్రాల కుర్చీని నాకోసం తెచ్చి అందులో నన్ను కూర్చోమని చెప్పింది.

నడవలేని స్థితిలో ఉన్న నేను తప్పని పరిస్థితిలో, విధిలేక ఆ కుర్చీలో కూర్చున్నాను. జీవితంలో ఇలాంటి పరిస్థితి అంటూ ఒకటి వస్తుందని నేను ఎన్నడూ ఊహించలేదు. అందులో అపుడు 24 సంవత్సరాల యవ్వన ప్రాయంలో, మంచి హుషారుగా ఉండే నేను పరాయి దేశంలో అంతుపట్టని కాలునొప్పితో అల్లాడుతూ ఇంత పెద్ద ఆసుపత్రిలోని బెడ్‌లో చేరాల్సివస్తుందని కలలో కూడా ఊహించలేను.

వెనుక నిలబడిన ఆయా నేను కూర్చున్న ఆ చక్రాల కుర్చీని ముందుకు తోస్తుంటే ముళ్ళమీద కూర్చున్నట్లుగా అనిపించింది. నడవలేని నా అసహాయతకు ఎంతో అవమానంగా, అసహనంగా ఫీల్ అయ్యాను నేను.

ఆయా సహాయంతో అతి కష్టమ్మీద బెడ్ పైన అంచు మీదకు చేరి చిన్నగా కూర్చోగలిగాను. కాస్త కదిలితే చాలు. జివ్వుమంటూ నరాలన్నిటినీ పట్టి లాగేస్తూ భరించలేని బాధను కలిగించి కుదురుగా నన్ను ఉండనీయడం లేదు నా ఎడమకాలు.

కదలడానికి భయం వేసి అలాగే అక్కడే ఆలోచిస్తూ దిగులుగా మంచం అంచుమీదే కూర్చున్నాను.

అప్పటికి రాత్రి తొమ్మిదిగంటల సమయం అవడంతో పేషెంట్లు నిద్రపోవడానికి అనువుగా వార్డుల్లోని లైట్లు డిమ్‌గా వెలుగుతున్నాయి. ఇంతలో నా ప్రక్క బెడ్ మీద ఉన్న ఆకారం - "సులోనెచ్" (బాగున్నావా?) అంటూ అరబిక్‌లో ప్రశ్నించింది.

ఆమె ప్రశ్నతో నేను ఉలిక్కిపడి తల ఎత్తి అటువైపు చూసాను. అక్కడ బెడ్‌పై నెలలు నిండిన ఒక గర్భిణీ స్త్రీ వెల్లకిలా పడుకుని ఉంది. ఆమె కుడికాలు మొత్తం కట్లతో నిండిపోయి పైకి ఎత్తిపెట్టబడి ఉంది. ఒక స్టాండును ఆమె కాలిదగ్గర అమర్చి, ఆపరేషను చేసిన ఆమె కాలును పైకి ఎత్తిపట్టి షుమారు నాలుగు కేజీల బరువును ఆ స్టాండుద్వారా వ్రేలాడదీసి ఉన్నారు.

ఎపుడో ఎక్కడో ఒకసారి ఏదో సినిమాలో అలాంటి సీను చూసినట్లు నాకు గుర్తువచ్చింది. అలాంటి స్థితిలో ఉన్న ఆమెను చూసి భయపడ్డాను నేను.

"ఇండియన్? తెలుగు?" అంటూ మరోసారి పలకరించింది ఆమె.

అవును అంటూ తల ఊగించాను నేను.

"నిన్ను చూడగానే నువు మన తెలుగు అమ్మాయివే అని అనుకున్నాను. ఏం పేరు? ఏమయింది నాకాలికి?" నన్ను పరిశీలనగా చూస్తూ స్వచ్ఛమైన తెలుగులో పలకరించింది.

"నా పేరు లలిత. నేను కువైటుకు వచ్చి ఒకటిన్నర సంవత్సరం అయింది" చూపుడు వేలితో నా ఎడమకాలివైపు చూపిస్తూ "ఏమయిందో తెలియదు. పదిహేను రోజులుగా కాలునొప్పితో నడవలేకపోతున్నాను" బాధగా చెప్పాను నేను.

"అయ్యో అలాగా.. బాత్ రూములోగానీ మెట్లు దిగేటప్పుడు గానీ ఎక్కడైనా పడ్డావా? "

"లేదు ఎక్కడా పడలేదు. ఉన్నట్లుండి ఒక్కసారిగా కాలునొప్పి మొదలయింది. ఎన్ని మాత్రలు మింగినా తగ్గలేదు. రోజు రోజుకూ ఎక్కువైపోయింది. ఇక్కడ ఈ హాస్పిటల్‌లో ఎన్ని రోజులు నన్ను ఉంచుతారో? ఏమి చేస్తారో అర్థం కావడం లేదు" భయంగా చెప్పాను నేను.

"హు.. ఇక్కడికి పంపించారంటేనే ఏదో పెద్ద ప్రాబ్లమ్ ఉన్నట్లు అర్థం. ఇక్కడ డాక్టర్లకి ఆపరేషన్లు చేసి, స్టీలు రాడ్లు బిగించడమే పని" జాలిగా నావైపు చూస్తూ చెప్పింది ఆవిడ.

ఆమె మాటలతో నాకు శరీరంలో వణుకు పుట్టింది. అక్కడి డాక్టర్లు ఆపరేషన్లు చేస్తారు అన్నమాట వినగానే అంతవరకూ ఉన్న కాస్తంత ధైర్యం కూడా నీరు కారిపోయింది. నా శరీరాన్ని నిస్సత్తువ ఆవహించింది. ఎలాగో గొంతు పెగుల్చుకుని ఆమె సంగతి ఏమిటో తెలుసుకుందామనే ఉద్దేశంతో, "మీ పేరు ఏమిటండీ? మీకాలికి ఏమయ్యింది?" అని ఆసక్తిగా అడిగాను.

ఒకసారి భారంగా నిట్టూర్చిన ఆవిడ "నా పేరు లక్ష్మి అంతా నా ఖర్మ. నా రాత అస్సలు బాగాలేదు. దాదాపు నలభైరోజులుగా ఇక్కడే ఈ బెడ్‌పైన ఇలాగే పడివున్నాను. జీవితమంటేనే విరక్తి కలుగుతోంది. ఇంకా ఎన్ని రోజులు ఉంచుతారో? ఎన్ని ఆపరేషన్లు చేస్తారో అర్థంకావడంలేదు. నా కాలి లోపల బిగించిన స్టీలు రాడ్స్ అన్నీ సెట్ అయేంతవరకూ నా బ్రతుకు ఇక్కడే తెల్లారిపోతుంది. నాకు మూడేళ్ళ బాబు ఉన్నాడు. నా భర్త పదిసంవత్సరాలనుండీ ఈ కువైటులో పనిచేస్తున్నాడు. నేనంటే చెప్పలేనంత ప్రేమ ఆయనకు. అందుకే నా పెళ్ళయ్యాక నన్ను వెంటనే ఇండియానుండి ఇక్కడికి పిలిపించుకున్నాడు. మా బాబు కూడా ఇక్కడే ఆ ప్రక్కనే ఉన్న మెటర్నటీ హాస్పిటల్‌లో పుట్టాడు. వాడికి రెండేళ్ళు దాటాక మళ్ళీ నేను గర్భవతిని అయ్యాను. మా ఆయనేకాదు, ఇంటిదగ్గర ఉన్న మా

అమ్మానాన్నలు, అత్తమామలు చాలా సంతోషపడ్డారు. కానీ కాలం అన్ని రోజుల్లోనూ ఒక్కటిగా ఉండదుకదా? నలభై రోజుల క్రితం, బాత్‌రూములో బాబుకు స్నానం చేయిస్తూ పొరపాటున సబ్బుమీద కాలు వేసాను. అంతే నా కుడికాలు జారిపోయి వెళ్ళి టాయిలెట్ గుంటలోపలికి వెళ్ళి ఇరుక్కుపోయింది. దానితో కాలు మడమ దగ్గర ఎముక ఫటక్‌మని విరిగిపోయింది. నా పాదం మొత్తం ఆ గుంటలో చిక్కుకుని ఉండటంతో నా శరీరాన్ని నిలుపలేక పెద్ద శబ్దం చేస్తూ కుడివైపుకు పడిపోయాను. ముందే ఒట్టిమనిషిని కూడా కాదు ఒక్కసారిగా పడటంతో కాలి పైభాగంలోని సడుగు దగ్గర ఎముక కూడా విరిగిపోయింది. సమయానికి నా భర్తకూడా ఇంట్లో లేడు. పడినచోటే అలాగే కేకలు వేస్తూ పదినిముషాలు ఉండిపోయాను. స్నానం చేస్తున్న బాబుకు వంటినిండా పట్టించిన సబ్బు అలాగే ఉంది. నన్నుచూసి వాడు భయపడిపోయి ఒకటే ఏడుపు. వాడి ఏడుపు విని పొరుగువారు వచ్చి చూసి వెంటనే నన్ను ఈ హాస్పిటల్‌కు తీసుకుని వచ్చారు. కుడికాలులోని ఎముకలన్నీ దాదాపు విరిగిపోయాయి. కుడికాలు మొత్తం ఆపరేషన్లు చేసి స్టీలురాడ్లు బిగించారు. అవి లోపల బిగించుకునేంత వరకూ నేను ఇక్కడే ఉండాలి. అందులో ఇపుడు నాకు తొమ్మిదవ నెల వచ్చేసింది. డెలివరీ కూడా వీళ్ళ పర్యవేక్షణలోనే జరగాలి. ఇవన్నీ పూర్తి అయితేనే నన్ను ఇంటికి పంపిస్తారు. నాకు కాలుకదపలేని స్థితిలో డెలివరీ నార్మల్‌గా అవడం కష్టం, కాబట్టి ఆపరేషను చేసి డాక్టర్లు బిడ్డను బయటకి తీస్తాం అంటున్నారు. నేను కాదుకానీ నా భర్త నా పరిస్థితి చూసి చాలా కృంగిపోయి ఉన్నాడు. అతడు బాబును పగలు బేబీకేర్ సెంటర్‌లో ఉంచి డ్యూటీకి వెళ్ళి సాయంత్రం పూట ఇక్కడికి బాబుతోపాటు నన్ను చూడటానికి ప్రతిరోజూ వస్తాడు. నన్నుచూసి చాలా బాధపడతాడు. నా బాధను దిగమ్రింగుకుని నేనే ఆయనకు ధైర్యం చెపుతున్నాను. నా కొడుకు ఇక్కడికి వస్తే నన్ను విడిచి ఇంటికి తిరిగిపోనని మారాం చేసి ఏడుస్తాడు. పాపం వాడికేం తెలుసు నా పరిస్థితి? ఇక్కడ నాకు ఇంతపని జరిగిందని ఇండియాలో మావాళ్ళకు తెలిస్తే బాధపడతారని వాళ్ళకి ఇంకా ఈ విషయం చెప్పలేదు. చెప్పి ఏం లాభం? వాళ్ళని అనవసరంగా బాధపెట్టినట్లే కదా?

అందుకే నువు కూడా నీకాలు నొప్పి సంగతి మీవాళ్ళకి చెప్పకు. డాక్టర్లు అన్ని పరీక్షలూ చేసాక ఏం చెపుతారో చూసి అపుడు అవసరమైతే ఫోను చేసి చెప్పచ్చు"

"ఈ పరాయిదేశంలో ఒంటరి జీవితాల్లో ఎవరి బ్రతుకు వాళ్ళదే ఎవరిబాధ వారిది. ప్రక్కవారి బాధను పట్టించుకునే తీరిక ఇక్కడ ఎవరికీ ఉండదు. ఉండటానికి మా బంధువులు బోలెడుమంది ఈ కువైటులో ఉన్నారు కానీ ఒక్కరు కూడా ఆపదలో ఆదుకునేవాళ్ళు లేరు. నలభై రోజులనుండీ ఇక్కడి నర్సులూ ఆయాలే నా బంధువులుగా మారిపోయారు. ఈ మంచంపై కదలలేని స్థితిలో నేను ఉంటే విసుగులేకుండా అలసట లేకుండా అన్నీ నాకు అమర్చి వీళ్ళు ఇన్ని సేవలు చేస్తున్నారు. ఎప్పటిదో ఈ ఋణం? ఏమిచ్చినా వీళ్ళ ఋణం తీరదుకదా?"

"దేవుని దయవలన ఈ కువైటు దేశంలోని ఆసుపత్రుల్లో ట్రీట్‌మెంటు అంతా ఫ్రీ కాబట్టి బ్రతికిపోయాము. లేకపోతే ఇండియాలో ఆసుపత్రుల్లాగా అయితే ఈ ఆపరేషన్లకు ఫీజులకు, మందులకు ఉన్న ఆస్తులన్నీ అమ్ముకోవాల్సి వచ్చేది. ఈ కువైటు రాజు బాబు జాబర్ చల్లగా ఉండాలి. ఆయన దయాధర్మాల వల్ల ఒక్కపైసా లేకుండా నలభైరోజులుగా ఇక్కడ మూడుపూట్లా తింటూ బ్రతికి ఉన్నాను. ఇక్కడికి రకరకాల భాషల వాళ్ళు పేషెంట్లుగా వచ్చి వెళుతుంటారు. కదలలేని స్థితిలో ఉన్న నాకు ప్రక్క బెడ్‌లోని వాళ్ళతో మాట్లాడటమే కాలక్షేపం. ఈ పడక మీదే నలభైరోజులుగా పడుకుని నా వీపంతా పుళ్ళు పడ్డాయి. నువు తెలుగు అమ్మాయివి అనగానే నా కథంతా వివరంగా నీకు చెప్పేసాను. ఎంతైనా మనదేశం, మనభాష, మన మాట మనకు మధురమైనవి కదా! " అంది లక్ష్మి నవ్వుతూ.

"నిజమే" అన్నాను నేను.

కానీ ఆవిడ కథంతా విన్నాక నలబైరోజులుగా ఆమె అక్కడే ఉంది అని తెలిసాక నాలో భయం మొదలైంది. మనసులో ఏదో సంశయం. ఇంత పెద్ద హాస్పిటల్‌లో ఇలాంటి ఆపరేషన్లు చేసే చోట సీరియస్ కేసులుండే వార్డుల్లో నన్ను ఎందుకు ఉంచారు? మరి నా పరిస్థితి ఏమవుతుందో? నాకాలు కూడా మొత్తం కట్ చేసి పారేస్తారేమో? కాస్త కదిలితే కళ్ళల్లో నీళ్ళు తెప్పించే ఈ నొప్పి చూస్తుంటే అదే నిజమని అనిపిస్తోంది.

ఈ గండం నుండి నేను బయటపడగలనా? మళ్ళీ సంతోషంగా, నా రెండుకాళ్ళతో మామూలుగా నడవగలనా? పదిహేను రోజులకు ముందుగా ఎంత బాగా పరిగెత్తుతూ గంతులేస్తూ నడిచేదాన్ని. నచ్చినపాటలు వింటూ డాన్సు చేసేదాన్ని. మరి, మళ్ళీ తిరిగి అలా చేయగలనా? నా జీవితం ఇంతటితో ఈ కాలునొప్పితో ముగిసిపోబోతోందా? ఈ కువైటు దేశంలో ఒంటరిగా దిక్కులేకుండా అర్థాంతరంగా చచ్చిపోతానేమో? మళ్ళీ ఇండియాలో కాలుమోపి మా అమ్మను నా వాళ్ళని చూడగలనా? ఏదో పెద్ద సమస్య ఉండబట్టే ఈ హాస్పిటల్లో చేరమని చెప్పారు. ఇలా పరిపరివిధాలుగా నేను ఆలోచిస్తూ ఉండిపోయాను. నేను మౌనంగా ఉండటం చూసి ఆవిడ సరే ఇక పడుకో రేపు ఉదయాన్నే డాక్టర్లు వచ్చి నీకు అన్ని పరీక్షలు చేస్తారు. ఇక ప్రతిరోజూ ఇక్కడ, మూడు పూట్లా తిని కదలకుండా బెడ్‌పై పడుకుని మాట్లాడుకోవడమే మనపని అంది లక్ష్మి. అప్పటికి దాదాపు పదిహేనురోజులుగా ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ భరించలేని నొప్పితో బాధపడుతూ ఆహారం సరిగ్గా తీసుకోక దిగులుతో ఆలోచనతో, అప్పటికే బాగా అలసిపోయి ఉన్నా నేను ఇంక కూర్చునే శక్తిలేక పడుకుందామని మెల్లగా మంచం మధ్యలోకి జరిగాను. ఎడమకాలు కలుక్కుమంది. బాధ ఒళ్ళంతా ఒక్కసారిగా ప్రాకింది. భరించలేని బాధతో ఒక్కసారిగా ఎగిరిపడ్డాను.

కళ్ళల్లో నీళ్ళు కాలవలైపారాయి. గొంతు తడారిపోయింది. కాసేపు కదలకుండా భారమైపోయిన ఊపిరిని పీల్చుకుంటూ ఉన్నచోటే అలాగే ఉండిపోయాను. నా పరిస్థితి గమనిస్తున్న లక్ష్మి "అయ్యో పాపం బాగా నొప్పిగా ఉన్నట్లుంది. బెల్ నొక్కి ఆయాను పిలవనా? బెడ్‌పైన సరిగా నిన్ను పడుకోబెడుతుంది" అంది జాలిగా నన్నే చూస్తూ -

"వద్దు" అన్నాను నేను.

పంటి బిగువున బాధను భరిస్తూ - ఎడమకాలును కదపకుండా కుడివైపు శరీరాన్ని మాత్రమే కదిలిస్తూ మెల్లగా, జాగ్రత్తగా కొంచెం కొంచెం మంచం మధ్యలోకి జరుగుతూ రెండు నిమిషాలు తరువాత దిండు పైకి చేరగిలబడి నీరసంగా కళ్ళుమూసుకున్నాను. బాధతో భయంతో, చెప్పలేనంత దిగులుతో నా ఒంటరితనాన్ని, అసహాయతను తలచుకుని ప్రక్కన ఉన్నవారికి వినిపించకుండా శబ్దం కాకుండా రోదించసాగాను నేను. కన్నీళ్ళు చెంపలపైనుండి జారి దిండును తడిపేస్తున్నాయి. నరకానికి మరో రూపంలా ఉన్న ఆ ఆసుపత్రినుండి పరిగెత్తుకుంటూ దూరంగా పారిపోవాలనిపించింది. కానీ ఎలా? కాలు సహకరించకపోతే అసాధ్యం కదా? ప్రక్కన బెడ్‌లో ఉన్న లక్ష్మిలాగే నన్ను కూడా రెండు మూడు నెలలు ఇక్కడే ఉంచేస్తారేమో? ఒకవేళ కాలుమొత్తం కట్ చేసి పారేస్తే నా పరిస్థితి ఏమిటి? ఎలా ఇంటికి తిరిగి వెళ్ళాలి? కాలు లేకుండా ఎలా బ్రతకాలి? అసలు ఆ విధంగా బ్రతకగలనా? కాలులేకుండా అవిటిదానిలాగా ఒక కాలితో కుంటుతూ బ్రతుకంతా అయ్యో ఎలా? అలా బ్రతకడం కంటే, చనిపోవడం ఎంతో మేలు కదా!

జీవితంపై ఉన్న ఎన్నో ఆశలు, నా కలలు గుర్తొచ్చాయి. దేవుడు ఎందుకు ఇలాంటి పరీక్ష పెడుతున్నాడు? దేవుడ్ని గుర్తుచేసుకోగానే మా ఇలవేల్పు అయిన వెంకటేశ్వరస్వామి గుర్తొచ్చాడు. వెంటనే ఆయన్ను తలచుకుంటూ "వెంకటేశ్వరా! స్వామీ! నాకు ఈ చిన్న వయసులో భరించలేని కాలునొప్పిని ఇవ్వడం నీకు న్యాయమా? ఆపరేషను అంటే భయపడే నన్ను ఈ ఆసుపత్రిలో చేర్చి ఆపరేషను వరకు నా పరిస్థితిని తీసుకురావడం నీకు ధర్మమా? నేను ఏం తప్పుచేసాను? ఏం పొరపాటు చేసాను? ఎవరికి ద్రోహం చేసాను? చెప్పు? నాకు తెలిసి చీమకు కూడా నేను ఎన్నడూ హాని చేయలేదే? మరు ఎందుకు నాకు ఇంత శిక్ష?

సరే జరిగిందేదో జరిగిపోయింది. ఇపుడైనా నాకాలు నొప్పి తగ్గించేసి నాకాలు కట్ చేయకుండా డాక్టర్లు ఆపరేషను చేయకుండా చూసి, నన్ను కాపాడు. రేపు సంవత్సరం ఇండియాకు సెలవలకు వచ్చినపుడు నీ తిరుమల కొండను కాలినడకతో ఎక్కివచ్చి నీ హుండీలో 1016 రూపాయలు వేస్తాను. స్వామీ ఈ బాధ ఇక భరించడం నావల్లకాదు. నాపై దయచూపి నన్ను రక్షించు" అనుకుంటూ ఏడుస్తూ కళ్ళు మూసుకుని మనసులో ప్రార్థించుకుంటూ ఉన్నాను నేను.

ఆ పరిసరాల్లో నిండుకుని ఉన్న మందుల వాసన వెగటుగా ఉంది. ప్రక్కన ఉన్న వార్డులో నుండి ఎవరో పేషెంటు నొప్పిని భరించలేక మూలుగుతున్నారు. అక్కడికి వెళ్ళి ఆ రోగిని పలకరించి వేళకు సరిగా మందులు వేసుకుంటే నిద్రపడుతుంది అనే నర్సుల మాటలు వినిపిస్తున్నాయి.

ఆ ఆసుపత్రి వాతావరణం భయం కలిగిస్తోంది. నా ఏడుపు ఆగటం లేదు. ఎవరన్నా వచ్చి నన్ను దూరంగా తీసుకెళితే బాగుండు అనిపిస్తోంది. పరిగెత్తుకుంటూ ఇండియా వెళ్ళిపోయి మా అమ్మ ఒడిలో తలదాచుకోవాలి అనిపిస్తోంది.

ఇంతలో ఎవరో వచ్చి నా నుదిటిపై చేతిని వేసి మెల్లని స్వరంతో మృదువుగా, లలితా "ఆర్ యూ స్లీపింగ్?" అని అడుగుతుంటే కళ్ళు తెరిచి చూసాను.

తెల్లని దుస్తుల్లో నా ముందు నిలబడి చిరునవ్వుతో దయగా నన్నే చూస్తూ పలకరిస్తోంది. ఆ రాత్రి డ్యూటీలో ఉన్న ఒక కేరళ నర్సు.

ఆమెను చూసి 'నిద్రపోవడంలేదు' అన్నట్లు తల ఊపాను నేను. అపుడు నా కన్నీళ్ళను గమనించినట్లుంది ఆమె.

"అయ్యో ఏంటీ కన్నీళ్ళు? ఏడుస్తున్నావా? " అంది గాభరాగా.

"అవును" అన్నాను బేలగా.

"ఎందుకు నువ్వు ఏడవటం? నీకు ఏమీకాలేదు. డాక్టర్లు మందులు ఇచ్చి నిన్ను ఇంటికి పంపిస్తారు - అంతే. నీకు ఏమీకాదు. ఏడవకు" అంది ఆమె ఓదార్పుగా.

ఆమె మాటలతో పోయే ప్రాణం తిరిగి వచ్చినట్లయింది నాకు. ఆ సమయంలో ఆమెను ఆ దేవుడే నాకోసం పంపించాడు అనిపించింది. "నిజమా? అంతేనా? డాక్టర్లు నా కాలును కోసి ఆపరేషను చేయరా?" అని అడిగాను.

"అంతపని నీకు అవసరంలేదమ్మా. నాల్రోజులు రెస్ట్ తీసుకుని కొన్ని ఇంజక్షన్లు తీసుకుని మందులు మింగితే చాలు నీకాలు బాగయిపోతుంది."

నువ్వు భయపడకు అని నా చేతిపై తట్టి ధైర్యం చెప్పింది ఆవిడ. ఆపరేషను అవసరం లేదు అనగానే ఏడుపుమాని కాస్త ధైర్యం తెచ్చుకుని మనస్ఫూర్తిగా ఆమెకు నా కృతజ్ఞతలు తెలియచేసాను.

రెండు మాత్రలు నాకందించి "ఇవి నొప్పి తగ్గించి నిద్రపట్టేలా చేస్తాయి. ఇవి మింగి హాయిగా నిద్రపో. నీకు ఏ అవసరం వచ్చినా నీ ప్రక్కనే గోడకు ఉన్న ఆ బటన్ నొక్కు. వెంటనే మేము ఇక్కడికి వస్తాం ఓకేనా?" అంటూ నవ్వుతూ బయటికి వెళ్ళిపోయింది. ఇంతసేపు ఆవిడ ఇక్కడ ఉండి మాట్లాడినా కూడా ఆవిడ పేరుకూడా అడిగి తెలుసుకోలేదే అని బాధపడుతూ ఆ మాత్రలు మింగి నిద్రలోకి జారుకున్నాను నేను.

ప్రొద్దున్నే దాదాపు ఐదుగంటల సమయంలో కేటరింగ్ వాళ్ళు వచ్చి పాలు, బ్రెడ్ ఇచ్చి వెళ్ళారు. ఆయా వచ్చి రూము శుభ్రం చేసి చెత్త తీసుకెళ్ళి బయట పడేసింది.

తరువాత ముగ్గురు నర్సులు వచ్చి పడకపై ఉన్న బెడ్‌షీట్స్ పిల్లో కవర్స్ మార్చి వెళ్ళారు. వాళ్ళలో రాత్రి వచ్చి నన్ను పలకరించి నాకు ధైర్యం చెప్పిన సిస్టర్ ఉందేమో అని చూసాను. ఆవిడ కనిపించలేదు.

కువైటులోని హాస్పిటల్స్‌లో పనిచేసే నర్సులు డెబ్బైశాతం 'కేరళ'నుండి వచ్చిన వాళ్ళే ఉంటారు. కువైటు ప్రభుత్వం తమ హాస్పిటల్స్‌లో కేరళ రాష్ట్రం నుండి వచ్చిన సిస్టర్స్ సేవలను విరివిగా వినియోగించుకుంటోంది.

ఇంతలో బ్రేక్‌ఫాస్ట్ వచ్చేసింది. వెంటనే ఆయా వచ్చి బాత్‌రూముకు తీసుకెళ్ళింది. బ్రష్ చేసుకుని స్నానం చేయగానే మరలా కుర్చీలో కూర్చోపెట్టుకుని బెడ్‌పైన దింపింది. మసాలా కారంలేని హెల్దీ బ్రేక్‌ఫాస్ట్ కడుపునిండా తిని మరలా నిద్రపోయాను.

పదిగంటల సమయంలో డాక్టర్లు రౌండ్సుకు వచ్చారు. ఆ వార్డులోని ప్రతి పేషెంటును పలకరిస్తూ వారి పరిస్థితిని తెలుసుకుంటున్నారు. నర్సులు అందించే కేసు వివరాలు చదువుతూ ఇంకా చేయాల్సిన పరీక్షలను సూచిస్తూ ఏ ఏ మందులు వాడాలో నర్సులకు వివరిస్తూ వస్తున్నారు.

డాక్టర్లు మా రూములోకి రాగానే "లలితా నీ కాలు నొప్పి ఎలా ఉందో డాక్టరుగారికి చెప్పు" అంటూ ఆదమరిచి నిద్రపోతున్న నన్ను ఒక నర్సు తట్టిలేపింది. మత్తుగా కళ్ళు తెరిచి చూడగానే "గుడ్ మార్నింగ్ లలితా ఎలా ఉన్నావు?" అంటూ చిరునవ్వుతో ఆ ఇద్దరు డాక్టర్లు నన్ను పలకరించారు.

బలవంతంగా నిద్రమత్తు వదిలించుకుని "గుడ్‌మార్నింగ్ డాక్టర్" అంటూ తిరిగి విష్ చేసాను. "ఎలా ఉంది కాలునొప్పి? ఎక్కడైనా పడ్డావా? ఎక్కడో పడి మర్చిపోయావేమో గుర్తుచేసుకో" అంటూ రకరకాలుగా ప్రశ్నించారు.

ఎక్కడా, ఎప్పుడూ పడలేదు అని జవాబు చెప్పాను.

"సరే ఈరోజు ప్రక్కనే ఉన్న మరో బిల్డింగులో ఉన్న ఎక్సరే విభాగానికి వెళ్ళి ఎక్సరేలు తీసుకుని వస్తే ప్రాబ్లమ్ ఏమిటో చూసి చెప్తాం" అంటూ - రిక్వెస్టు లెటర్ రాసి నర్సులకు అందించారు.

తరువాత నా ప్రక్కనే బెడ్‌లో ఉన్న లక్ష్మిని, ఎదురుగా ఉన్న ఒక అరబిక్ అమ్మాయిని కూడా పలకరించి, రిపోర్టులు చూసి వెళ్ళిపోయారు.

ఎదురుగా ఉన్న బెడ్‌లో కొత్తగా పెళ్ళయిన అరబిక్ అమ్మాయి చెయ్యి ఫాక్చర్ అవడంతో అక్కడ చేరింది. భర్తతో హనీమూన్‌లో ఉండగా గుర్రపు బండిలో విహరిస్తూ అదుపు తప్పి క్రిందపడిపోయిందట. అంతే చెయ్యి విరిగి ఆపరేషను చేయించుకుని ఈ హాస్పిటల్‌లోని బెడ్‌లో రెస్ట్ తీసుకుంటోంది. పాపం క్రొత్తగా పెళ్ళయిన ఆమె భర్త ప్రతిరోజూ హాస్పిటల్‌కు వచ్చి పలకరించి వెళ్తున్నాడట.

ఈ విషయాలన్నీ ప్రక్కన ఉన్న బెడ్‌లోని లక్ష్మి నవ్వుతూ నాకు వివరించింది. డాక్టర్లు వచ్చి మాట్లాడి వెళ్ళాక నాకు కాస్త ధైర్యంగా అనిపించింది. నాకు మంచి ట్రీట్‌మెంటు ఇచ్చి నా కాలును బాగుచేస్తారనే నమ్మకం కలిగింది.

తరువాత ఆయా వచ్చి కుర్చీలో కూర్చోపెట్టుకుని నర్సు వెంటరాగా ఎక్స్‌రే విభాగానికి తీసుకెళ్ళారు. అక్కడ దాదాపు ఇరవై ఎక్సరేలు రెండు కాళ్ళనూ కలిపి అన్ని కోణాల్లోనూ పరిశీలించి తీసారు.

తిరిగి వచ్చి ఆ మధ్యాహ్నం భోజనం చేసి లక్ష్మి నేనూ మాట్లాడుకుంటూ నిద్రలోకి జారుకున్నాం. ఆ హాస్పిటల్‌లో ఉన్నన్ని రోజులూ వేళకు తిని బాగా నిద్రపోయాను. "కువైటులో రోగికి హాస్పిటల్స్‌లో రాజభోగమే"

ఇంతలో పెద్దగా మాటలు, ఏడుపులు వినిపించగా ఒక్కసారిగా కళ్ళు తెరిచి చూసాము. ఒక పేషెంటును స్ట్రెచర్‌పై తీసుకువచ్చి నా బెడ్ ఎదురుగా అటుగోడవైపు పడుకోబెట్టారు. ఆ పేషెంటు ముఖం చేతులు మొత్తం బాండేజెస్‌తో నిండిపోయి ఉన్నాయి.

ముఖమంతా ఉబ్బిపోయి వికృతంగా తయారయింది. ఏడ్చేందుకు కూడా శక్తిలేక గాయాల బాధతో భయంకరంగా మూలుగుతోంది ఆ ఇండోనేషియా అమ్మాయి. వెంట వచ్చిన ఆయాను "ఆ అమ్మాయికి ఏమయింది?" అంటూ ప్రశ్నించింది లక్ష్మి.

ఆయా పెద్దగా నిట్టూర్చి "పాపం చాలా ఘోరం జరిగింది లక్ష్మీ కువైటు పిల్లగాళ్ళకు బాగా తిని కొవ్వు పట్టింది. కళ్ళు కనిపించక ముగ్గురు అబ్బాయిలు ఒకేసారి ఈ అమ్మాయిని పట్టుకుని అఘాయిత్యం చేసారంట. ఆ పిల్ల వళ్ళంతా కొరికి, సిగరెట్లతో కాల్చి ఇష్టం వచ్చినట్లు పశువుల్లా ప్రవర్తించగా దిక్కుతోచని ఆ పిల్ల వారిని తప్పించుకునేందుకు ఏ మార్గమూ కనబడక నాలుగో అంతస్తు నుండి క్రిందకి దూకేసింది. ఆ పిల్లే దూకిందో, లేక వాళ్ళే తోసారో పోలీసులు ఇంకా తేల్చేపనిలో ఉన్నారు. నోట్లో పళ్ళన్నీ ఊడిపోయాయి. దవడ ఎముకలు, గడ్డం, మెడ ఎముక, చేతులు అన్నీ విరిగిపోయాయి. ఆ పిల్ల ఇంకా ప్రాణంతో మిగిలి ఉంది అంటే డాక్టర్లు ఆశ్చర్యపోతున్నారు. తలకు కూడా చాలా కుట్లు వేశారు. జీవితాంతం ఇలా బ్రతకాల్సిందే, కదా?

ఇండోనేషియానుండి ఎంతో ఆశతో డబ్బు సంపాదించుకుందామని వచ్చి కువైటు ఇంట్లో పని చేసుకుంటుంటే ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోని పెద్దకొడుకు తన స్నేహితులతో కలిసి ఈ పిల్లపైన పడ్డారంట. అన్యాయంగా ఈ పిల్ల బ్రతుకు నాశనం చేసారు వెధవలు. " కోపంతో మండిపడింది ఆయా.

వెంటనే లేచి ఆ ఇండోనేషియా అమ్మాయిని చూడాలనిపించింది నాకు. కుడివైపు మెల్లగా మంచం అంచుకు జరిగి కుడికాలి సహాయంతో మంచాన్ని, గోడను ఆసరాగా చేసుకుని, ఆ అమ్మాయి బెడ్‌వరకూ కష్టపడుతూ నడిచాను. తలపైగా చుట్టిన బాండేజ్‌తో నోట్లో పళ్ళన్నీ ఊడిపోయి, ముఖంలో ఎముకలన్నీ విరిగి వికృతంగా ఉన్న ఆ అమ్మాయి ముఖం చూడగానే నాకు భయం కలిగింది కళ్ళు తప్ప ముఖంలో అన్ని భాగాలు దెబ్బతిన్నాయి. భరించలేని బాధతో నిస్సహాయంగా మూలుగుతోంది. ఆ అమ్మాయికి బహుశా ఇరవై రెండు సంవత్సరాల వయసు ఉంటుందేమో, ఆ వయసులో అంత కష్టం వచ్చింది పాపం. నేను దగ్గరికి వెళ్ళగానే కదలలేని, మాట్లాడలేని స్థితిలో ఉన్న ఆ అమ్మాయి కళ్ళు కదిపి నావైపు చూసింది. ఒక్కసారిగా నా ఒళ్ళు జలదరించింది. ఆ ఘోరమైన దృశ్యం కళ్ళతో చూడలేక నేను వెంటనే తిరిగి వచ్చి నా బెడ్‌పై కూర్చున్నాను.

ఎంత వద్దనుకున్నా నా కళ్ళలో కూడా కన్నీళ్ళు ఉబికి వస్తున్నాయి. ఆ అమ్మాయి మూలుగుతోందో లేక పరాయి దేశంలో తన దుస్థితిని తలచుకుని ఇంటిదగ్గర తనకోసం ఎదురు చూసే అమ్మా నాన్నలను తలచుకుని కుమిలిపోయి ఏడుస్తోందో అర్థం కావడంలేదు. ప్రక్కన ఉన్న రూముల్లోని కొందరు పేషెంట్లు కూడా వచ్చి ఆ అమ్మాయిని చూసి రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. ఆ అమ్మాయిపై అఘాయిత్యం చేసిన వారిపై కువైటు పోలీసులు చర్యలు తీసుకుంటారా? లేక వాళ్ళకు ఉన్న పలుకుబడితో వారిని వదిలేస్తారా? పరాయి దేశం నుండి పనిచేసుకోవడానికి వచ్చిన ఆ పేద అమ్మాయి జీవితానికి విలువ ఇస్తారా? లేక ఎంతో కొంత డబ్బు ముట్టచెప్పి ఆ అమ్మాయికి ఆరోగ్యం కాస్త బాగయ్యాక ఇండోనేషియా పంపిస్తారా అనే సందేహాలు, సమాధానాలతో వాళ్ళలో వాళ్ళే మాట్లాడుకుంటున్నారు.

అంతవరకూ కువైటులో అలాంటి సమస్యలు కూడా ఉంటాయనీ ఇలాంటి పరిస్థితులు కూడా అమ్మాయిలకు ఎదురవుతాయని తెలియని నేను నిర్ఘాంతపోయి చూస్తున్నాను. వీరందరి సమస్యలు, గాయాలు బాధలు చూస్తుంటే వీళ్ళ సమస్య ముందు నా కాలినొప్పి చాలా చిన్నదిగా అనిపించింది. ఎక్కడలేని శక్తి, ధైర్యం నాలోనికి వచ్చాయి.

మరుసటి రోజు లాబ్ నుండి వచ్చిన నా ఎక్స్‌రేలు పరిశీలించి చూసిన డాక్టర్లకు అందులో ఏ ప్రాబ్లమ్ కనిపించలేదు. అంతా నార్మల్‌గానే ఉంది. బ్లడ్, యూరిన్‌లాంటి టెస్ట్‌లన్నీ అప్పటికే చేసేసారు. అనీ నార్మల్‌గా ఉన్నాయి. తరువాత కేన్సర్ హాస్పిటల్‌కు కూడా

పంపించి కేన్సర్ టెస్ట్ చేయించారు. అది కూడా నార్మల్‌గానే ఉంది. నాకాలు నొప్పి ఎందుకొచ్చిందో కారణం ఏమిటో డాక్టర్లకు అంతుపట్టడం లేదు. తరువాత బోన్‌స్కాన్ చేయించమని డాక్టర్లు రిక్వెస్ట్ లెటర్ రాసి నర్సులకు అందించారు.

మరుసటి రోజు మరలా నర్సు కేసు షీట్ పట్టుకుని వెనుక నడవగా ఆయా చక్రాల కుర్చీలో నన్ను కూర్చోపెట్టుకుని స్ట్రెచర్‌పై పడుకోబెట్టి అంబులెన్స్‌లో ఎక్కించారు. ఆ ప్రక్కనే ఉన్న మరో బిల్డింగ్‌లోని బోన్ స్కాన్ విభాగానికి నన్ను తీసుకుని వెళ్ళారు.

అక్కడ కాసేపు బయట కూర్చుని వెయిట్ చేసాక నా వంతు రాగానే లోపలికి వెళ్ళాం. అక్కడ స్కానర్‌లో ఉండే బోర్డుపైకి ఎక్కి నన్ను పడుకోమని చెప్పారు. కాలునొప్పి విపరీతంగా ఉండటంతో నేను కుర్చీలోనుండి పైకి లేవలేకపోతున్నాను. నర్సుకూడా వచ్చి నా చెయ్యి పట్టుకుని సహాయం అందించి నన్ను పైకి లేపాలని ప్రయత్నించింది కానీ రెండుసార్లు కాస్త పైకి లేచి కాలు నొప్పితో జివ్వుమంటూ నరాలన్నీ లాగడంతో నిస్సహాయంగా అలాగే ఆ కుర్చీలో కదలకుండా కూర్చుండిపోయాను. కళ్ళల్లో నీళ్ళు ధారలుగా ప్రవహిస్తున్నాయి. కదిలితే ఏమవుతుందో అని భయం వేసి నర్సును కాస్త ఆగమని సైగచేసి చెప్పి ఊపిరి పీల్చుకుంటున్నాను.

అక్కడ స్కాన్ చేసే టెక్నీషియన్ సుమారు ఆరడుగుల పొడవుతో, చామనఛాయ రంగులో హుందాగా అందంగా ఉన్నాడు. అతడు ఎప్పటినుండీ నన్ను గమనిస్తున్నాడో తెలియదుగానీ నా స్థితిని గమనించి నా దగ్గరకి వచ్చి నిలబడ్డాడు. అతడు నా ఎదురుగా నిలబడటంతో ఎందుకా అని ఆశ్చర్యంగా తల ఎత్తి చూసాను. ఒక్క క్షణం నాకళ్ళల్లోకి చూసాడు. అంతే కొంచెం కిందికి వంగి కుర్చీలో ఉన్న నా భుజాల క్రిందుగా వీపుమీదుగా ఒక చెయ్యి, మోకాళ్ళ క్రిందుగా ఒక చెయ్యి వేసి చిన్నపిల్లను పైకెత్తినట్లు చేతుల్లోకి ఎత్తుకుని నాకు నొప్పికలగకుండా, స్కాన్ చేసే ఆ బోర్డు పైన నన్ను పువ్వులాగా పడుకోబెట్టాడు. ఏం జరిగిందో అర్థమయ్యేలోపల ఆ బోర్డుపై పదిలంగా పడుకుని ఉన్నాను నేను. అతని చూపు, అతని స్పర్శ ఆ స్పర్శలోని ఆత్మీయత నన్ను కలవరపరుస్తుంటే ఆ బోర్డుతో పాటు నా శరీరం స్కానరు లోపలికి వెళ్ళిపోయింది.

దాదాపు పదిహేను నిమిషాలకు స్కాన్ చేయడం అవగానే అతను చకచకా నా దగ్గరికి నడుచుకుంటూ వచ్చాడు. ఈసారి కూడా నా మాటకోసం నా పర్మిషను కోసం అతను అసలు వెయిట్ చేయలేదు. ఎంతో ఇష్టంగా, పొందికగా, ఏదో అధికారం ఉన్నట్లు నన్ను తన చేతుల్లోకి తీసుకున్నాడు. తీవెలాగా నాశరీరం అతని చేతుల్లో ఒదిగిపోయి అతని ఎదకు హత్తుకుంది. ఒక్క నిముషం.. అంతే.. అతని స్పర్శను, కొత్తగా ఉన్న ఆ అనుభూతిని ఆస్వాదించేలోపే అతని చేతుల్లోంచి జారిపోయి చక్రాల కుర్చీలో ఉన్నాను నేను. నా ఇరవై నాలుగేళ్ళ ఆ వయసులో ఆ యువకుని దయగల చూపు, ఆత్మీయత కలిగిన ఆ స్పర్శ నా హృదయంలోనికి చొచ్చుకునిపోయి నన్ను కలవరపరుస్తుంటే అర్థంకాని అయోమయంలో ఉన్న నన్నూ.. నేను కూర్చున్న నా కుర్చీని తోసుకుంటూ ఆయా ఆ రూములోనుండి బయటకు తీసికెళుతోంది.

ఇంకొక సెకను కాలం దాటితే ఆ రూము తలుపులు మూసుకునేవే కానీ ఆఖరుసారిగా మరొకసారి అతన్ని చూడాలి అనిపించి నా తలను వెనక్కి తిప్పు అతని వైపు చూసాను. అతను అక్కడే ఎదురుగా నిలబడి నావైపే చూస్తున్నాడు. నా చూపు అతని చూపుతో కలవగానే చిన్న చిరునవ్వు అతని పెదవులపై విరిసింది. అందమైన అతని చిరునవ్వు నా హృదయంలో చేరి వాడని పువ్వులా ఇప్పటికీ పదిలంగా నిలిచిపోయింది.

అతనెవరో తెలియదు. ఎక్కడివాడో తెలియదు. కానీ అక్కడినుంచి వచ్చాక ప్రతిక్షణం అతనే గుర్తుకు వస్తున్నాడు. ఏం చెయ్యాలో, అతన్ని ఎలా మరిచిపోవాలో అర్థంకాక ఆరోజు కలిసి నాతోపాటు బోన్ స్కాన్‌కి వచ్చిన నర్సును కలిసి చిన్నగా "సిస్టర్ నిన్న బోన్ స్కాన్ బోర్డుపై నన్ను పడుకోబెట్టిన అతను ఎవరు?" అని అడిగాను.

"ఓ.. అతనా! అతని పేరు మార్టిన్. కేరళనుండి వచ్చాడు. చాలా మంచివాడు అని చెపుతూ... అవునూ అతని గురించి ఎందుకు ఆరాతీస్తున్నావు? అతనితో ప్రేమలో పడ్డావా ఏమిటి? నీ బాడ్‌లక్ అతనికి ఆల్రెడీ పెళ్ళయిపోయింది, జాగ్రత్త అంది నవ్వుతూ.." ఆ నర్సుమాటలకు జవాబు చెప్పకుండా చిన్నగా నవ్వి గాఢంగా నిట్టూర్చాను నేను.

అన్ని రకాల పరీక్షలు అయిపోయాయి. ఇక ఆఖరుగా మిగిలింది ఎమ్.ఆర్.ఐ స్కాన్ మాత్రమే. అది అరుదుగా లభించే అతి ఖరీదైన స్కాన్. అయినా కూడా నాకోసం డాక్టర్లు వెంటనే ఆ ఏర్పాట్లు చేసి ఆ స్కాన్ కూడా నాకు చేయించారు.

అప్పట్లో (2000) సంవత్సరంలో ఇన్ని పరీక్షలు, 'ట్రీట్‌మెంట్లు చేయడం అంటే చాలా గొప్ప విషయం. మన ఇండియాలో అయితే ఇవన్నీ చేయడం చాలా కష్టం.

ఆ ఎమ్.ఆర్.ఐ స్కాన్‌లో, నా ఎడమకాలి పై భాగంలో చింతగింజ అంత పరిమాణంలో గడ్డకట్టి ఉన్న రక్తాన్ని డాక్టర్లు కనుగొన్నారు. ఆఖరికి అన్ని పరీక్షలు అయ్యాక ప్రాబ్లమ్ ఏమిటో తెలిసింది.

ఎపుడో అనుకోకుండా ఏదో దెబ్బ తగిలి - అక్కడ రక్తం క్లాట్ అయినట్లు అది చెడుగా, గడ్డగా మారినట్లు తీర్మానించి ఆ దిశగా నాకు ట్రీట్‌మెంటు మొదలు పెట్టారు.

మొదట అక్కడ కొద్దిగా కట్ చేసి ఆ చెడు రక్తాన్ని బయటికి తీసేయాలి అని డాక్టర్లు అనుకున్నారు. కానీ - డాక్టర్లు ఇచ్చిన మందులకు, ఇంజక్షన్లకు అది స్పందించి లోపల కరిగిపోయి చిన్నదిగా మారిపోవడంతో ఇక ఆపరేషను చేయాల్సిన అవసరం లేదు అని డాక్టర్లు నాకు చెప్పారు. ఆ మాట వినగానే నాకు చాలా సంతోషం కలిగింది. వెంటనే తిరుమల వెంకటేశ్వరస్వామి గుర్తుకొచ్చాడు.

నా ట్రీట్‌మెంటు పూర్తయ్యేదాకా మరోవారం రోజులు అక్కడే బెడ్‌లో ఉన్నాను. ఆసుపత్రినుండి డిశ్చార్జి అయి ఇంటికి వచ్చాక నా నడక మాములుగా రావడానికి మరో ఇరవై రోజులు పట్టింది.

ఆ తరువాత లక్ష్మి గురించి, ఆ ఇండోనేషియా అమ్మాయి గురించిన వివరాలు నాకు తెలియనే లేదు.

అప్పట్లో ఇప్పటిలా మొబైల్ ఫోన్లు వాట్సప్‌లు, ఫేస్‌బుక్‌లు లేవు కాబట్టి వారందరితోటి పరిచయాలు ఆ ఆసుపత్రిలోనే ముగిసిపోయాయి. ఆ అల్‌రాజి హాస్పిటల్‌లో ఉన్న ఇరవై రోజులు నేను, నాకు తెలియని మరో ప్రపంచాన్ని చూసాను. ఎన్నో కన్నీటి కథలను విన్నాను.

కాళ్ళూ చేతులు విరిగిన మనుషుల బాధలను కనులారా నేను చూసాను. ఆ హాస్పిటల్ జీవితంలో మరిచిపోలేని జ్ఞాపకాలను, అనుభవాలను ఎన్నింటినో నాకు ఇచ్చింది.

కువైటు ప్రభుత్వానికి ఆ అల్‌రాజి హాస్పిటల్‌కు నేను ఎంతగానో ఋణపడి ఉన్నాను. ఎంతో ఖరీదైన పరీక్షలు వారు నాకోసం చేసి మంచి ట్రీట్‌మెంటును నాకు అందించారు.

నా చక్రాల కుర్చీని తోసిన బంగ్లాదేశ్ ఆయాలను, స్ట్రెచర్‌లను, మోసిన వార్డ్‌బోయ్‌లను, చిరునవ్వుతో పలకరించి వేళకు తాగిన మందులు అందించి అన్ని పరీక్షలు చేయించి ధైర్యం చెప్పిన కేరళ సిస్టర్సును, శ్రద్ధగా కేసును స్టడీ చేసి, అన్నిరకాల టెస్ట్‌లు చేయించి దేవుళ్ళవలె నన్ను కాపాడిన అక్కడి డాక్టర్లను నేను నా జీవితంలో మరిచిపోలేను. వారందరూ కూడా మనుషుల రూపంలో ఉండే దేవదూతలు.

వీరందరి ఋణం మాటల్లో కృతజ్ఞతలు తెలిపితే ఎన్నటికీ తీరనిది. వారి వృత్తి ధర్మాన్ని నెరవేర్చడమే కాదు విసుగులేకుండా అసహాయస్థితిలో ఉన్న మరో మనిషికి సహాయం చేసిన మంచిమనుషులు వీరు. వీరందరినీ కూడా ఆ వెంకటేశ్వరస్వామి చల్లగా చూడాలని ఎప్పుడూ నేను ప్రార్థిస్తుంటాను.

## పద్మావతి కథ

**ఇంట్లో పనంతా పూర్తి** చేసేటప్పటికి టైం రాత్రి పదకొండు గంటలు దాటింది. రోజంతా ఊపిరి సలపని పనితో అలిసిపోయిన పద్మావతి అప్పుడు తన రూమ్‌కి వచ్చి, వేడినీళ్ళతో స్నానం చేసి నీరసంగా పక్కపై వాలింది. ప్రక్కనే ఉన్న మంచంపై పడుకుని ఉన్న "రణనాయకి" జోరుగా గురక పెడుతూ ఒళ్ళు తెలియకుండా నిద్రపోతోంది. ఆమె గురక శబ్దం కర్ణకఠోరంగా ఉంది కానీ పగలంతా పనిచేసి అలసిపోయిన పద్మావతి శరీరం ఆ గురక శబ్దాన్ని లెక్కచేసే స్థితిలో లేదు. బాగా బడలికగా, ఒళ్ళంతా నొప్పులుగా ఉండటంతో పెనడాల్ (పారాసిటమాల్) టాబ్లెట్ ఒకటి మింగి నీళ్ళు తాగింది. మరలా తెల్లవారుఝామునే నాలుగు గంటలకి మసీదులోని "అల్లా హు అక్బర్" వినబడగానే నిద్రలేవాలి అనుకుంటూ భారంగా కళ్ళు మూసుకుంది పద్మావతి.

రణనాయకి అనే ఆవిడ శ్రీలంక దేశం నుండి వచ్చి ఆ కువైటు ఇంట్లో ఎనిమిది సంవత్సరాలనుండి వంటమనిషిగా పనిచేస్తోంది.

ఆవిడ పేరుకు తగినట్లే పెద్ద రాక్షసిలా ఉంటుంది. నల్లటి శరీరం, పెద్ద కడుపు, ఎత్తు పళ్ళతో ఆవిడ ఆకారం భయం కలిగిస్తూ ఉంటుంది. కానీ తను చాలా అందగత్తెను అని ఆవిడకు బాగా నమ్మకం.

ఇంటి యజమానులైన మామా, బాబా మంచివాళ్ళే కానీ ఈ రణనాయకి పెత్తనం, అజమాయిషీ ఆ ఇంట్లో ఎక్కువైపోయాయి.

ఎనిమిది సంవత్సరాలుగా ఆ ఇంట్లో స్థిరపడి, వంటలు రుచిగా చేసి పెడుతూ నమ్మకం సంపాదించుకోవడంతో మామా, బాబా ఆవిడకి కాస్త స్వేచ్ఛను ఇచ్చారు. దానితో ఆవిడకు పొగరు తలకెక్కి తోటి పనివారిని ప్రశాంతంగా పనిచేసుకోనీయకుండా సాధిస్తూ ఉంటుంది.

వంటిల్లు ఆవిడ ఆధీనంలోనే ఉంటుంది కాబట్టి కడుపు నిండా తిండి తినాలన్నా కూడా ఆవిడ దయాదాక్షిణ్యాల మీదే ఆధారపడి ఉండాలి. ప్రతిరోజూ ఏదో ఒక విధంగా పద్మావతిని సాధించి, హింసించనిదే ఆవిడకు నిద్రపట్టదు. అందుకే ఆ ఇంట్లో పనిమనుషులు ఈ రణనాయకి పెట్టే బాధలు భరించలేకే వచ్చినవారు వచ్చినట్లే వారం రోజులు తిరగకముందే పని చేయలేమని చెప్పి వెళ్ళిపోయేవారు. కానీ - పద్మావతిని ఆ ఇంట్లో చేర్చిన ఏజంటు కువైటు వదిలి తన దేశం వెళ్ళిపోవడంతో ఏమి చెయ్యాలో అర్థంకాక ఒక సంవత్సరం నుండీ అలాగే రణనాయకి పెట్టే బాధల్ని మౌనంగా భరిస్తూ వస్తోంది.

అప్పట్లో త్రేతాయుగంలోని శ్రీరాముని కాలంలో లంకలో రాక్షసులు నివసించేవారంట. బహుశా ఆ రాక్షస అంశతో అప్పటి శూర్పణఖ మరలా ఇప్పుడు ఇలా రణనాయకి అవతారంలో అచ్చంగా జన్మించినట్లుంది.

ఆరోజంతా రణనాయకి పెట్టిన బాధల్ని గుర్తుచేసుకుంటూ "దేవుడా నా ప్రాణానికి రాక్షసిలా దాపురించిన ఈ శూర్పణఖ బారినుండి నన్ను కాపాడు. దీనికి మంచి మనస్సు ఇచ్చి అందులో కాస్త మానవత్వాన్ని నింపు" అని ప్రార్థిస్తూ నిద్రలోకి జారుకుంది పద్మావతి.

ఎవరో కొద్దిమంది తప్ప ఇక్కడ కువైటు ఇళ్ళలో పనిచేసేవారు ప్రతిరోజూ దేవుడ్ని తలచుకోకుండా ఉండలేరు. గల్ఫ్‌లోని ఇళ్ళలో పనిచేసేవారు అనుభవించే కష్టాలు అలాంటివి.

మామా, బాబా (యజమానులు)లతోనే కాదు, సాటి చెడ్డ పనివారు పెట్టే బాధలు కూడా మాటల్లో చెప్పశక్యంగానివి, అక్షరాల్లో రాయడానికి వీలుకానివి. ఇలాంటి ఇబ్బందులన్నీ ఇళ్ళల్లో పనిచేసేవారు మౌనంగా సహించి భరించాల్సిందే ఎదురు తిరిగి పోట్లాడేవారు, బాధలు భరించలేక ఆ ఇల్లు విడిచి, పాస్‌పోర్టును వదిలి పారిపోయేవారు కొద్దిమంది ఉంటారు. కానీ పరాయిదేశంలో పాస్‌పోర్టు ఐడెంటిటీ లేకుండా, పోలీసుల కంటపడకుండా చాటుగా తిరిగి పనిచేసుకుని బ్రతకడం చాలా కష్టం - ఇలాంటి వారి జీవితం ఎంతో దుర్భరంగా, అధ్వానంగా మారిపోతుంది.

పాస్‌పోర్టులు, వీసాలు లేకుండా ఇల్లీగల్‌గా, దొంగచాటుగా జీవించే వారి సంఖ్య కువైటు దేశంలో చాలా ఎక్కువగానే ఉంది. పోలీసులు వారిని చెక్ చేసి వారి దగ్గర ఐడెంటిటీ, వీసా లేకపోవడంతో పట్టుకుని జైల్లో ఉంచుతున్నారు. దయతో వారి దేశాల ఎంబసీలు కల్పించుకుని ఇలాంటి వారిని విడిపించి, ప్రత్యేకంగా విమానంలో వీరిని తమ దేశానికి పంపిస్తున్నారు.

అందుకే తాము అంగీకరించిన రెండేళ్ళు కాంట్రాక్టును ఎన్ని బాధలైనా భరించి, యజమానులేకాక తోటి పనివారు, డ్రైవర్లు కలిగించే ఇబ్బందులన్నీ అధిగమించి, పూర్తిచేయడానికే పనివారు ఇష్టపడతారు. గడువు ముగిసేరోజు కోసం రోజులు లెక్కపెట్టుకుంటూ దేవుడ్ని తలచుకుంటూ కాలం గడుపుతారు. రెండేళ్ళ గడువు ముగిసాక, యజమానులు ఇచ్చే ఫ్లయిట్ టిక్కట్లు తీసుకుని ఇంటికి వెళ్ళిపోవడమో లేక మరో ఇంట్లో పనికి మారడమో చేస్తారు.

"అల్లా హు అక్బర్.. అల్ హమ్ దు లిల్లా హి రబ్బిల్ ఆలమీన్" (దేవుడు గొప్పవాడు. సర్వసృష్టికర్త అయిన ఆ దేవాది దేవునికి ప్రణామములు) సమయం ఉదయం నాలుగు గంటలా పదినిముషాలు.

ప్రక్కనే ఉన్న మసీదులోని మైకులో నుండి "అల్లా హు అక్బర్" అంటూ ముల్లాగారు తన మధురమైన గొంతులో రాగయుక్తంగా దేవుని స్తుతిస్తున్నారు.

ఆ వీధిలో ఉన్న వారినందరినీ "నిద్రలేచి దేవుని స్తుతించడానికి ఉదయకాలపు ప్రార్థనకు రండి" అనే పిలుపును అందిస్తున్నారు.

ముల్లాగారి స్వరం మైకులో వినబడగానే ప్రతిరోజూ క్రమం తప్పక ప్రార్థన చేసే వారందరూ నిద్రనుండి లేచి "ఉజూ" (శరీర శుభ్రత) కార్యక్రమాల కోసం బాత్‌రూములోనికి పరిగెత్తారు. అంత ప్రొద్దుటే నిద్రలేచి ప్రార్థన చేయడానికి బద్దకించే కొందరు మాత్రం పడకమీద ఒక్కసారి అటునుండి ఇటువైపు కదిలి బ్లాంకెట్‌ను నిండా కప్పుకుని మరింతగా ముడుచుకుని పడుకున్నారు.

ఆలశ్యంగా లేస్తే యజమానులు తిడతారేమో అనే భయంతో పనివారు అప్పటికే నిద్రలేచి హడావిడిగా తమ పనుల్లో పడిపోయారు.

ఐదుపూటలా నమాజు చేయడానికి అనువుగా ఈ కువైటు దేశంలో వీధికి రెండు మసీదులు అందంగా కట్టబడి ఉంటాయి. పాలరాయితో నగషీలు చెక్కబడిన గోడలు, ప్రఖ్యాతి గాంచిన ఇరానీ కార్పెట్ పరచబడిన నేల ఖరీదైన మెరుపులీనే షాండ్లియర్స్ వేలాడుతుండే పై కప్పులాంటివన్నీ. ఎంతో ప్రత్యేకంగా, అద్భుతంగా ఉంటాయి.

ధనిక దేశం కాబట్టి డబ్బును బాగా వెచ్చించి తమ ప్రార్థనా మందిరాలను కళాత్మకంగా వీళ్ళు నిర్మించుకుంటారు.

తమ ప్రవక్త అయిన "మహమ్మదు" ఆదేశించిన ప్రకారం, సర్వసృష్టికర్త, సర్వేశ్వరుడు, లోకరక్షకుడు అయిన ఆ దేవాది దేవునికి విధేయత చూపుతూ ఆయన కృపను, దయను కోరుతూ వినమ్రులై రోజుకు అయిదుసార్లు ప్రార్థన చేయడం ముస్లిములకు రివాజు.

మగవాళ్ళందరూ తమ శరీరాన్ని (నవరంధ్రాలను) నీళ్ళతో శుభ్రం చేసుకుని (ఉజూ) అరబిక్ అత్తరును కాస్త వంటిపై చల్లుకుని "ఖురాన్"ను పఠిస్తూ భక్తిగా బయట వీధిలో ఉన్న మసీదులోకి వెళ్ళి కార్పెట్ పైన వరుసలో నిలబడ్డారు. ఇక్కడ పేద, గొప్ప కుల, మత

భేదాలు, తారతమ్యాలు ఉండవు. కువైటును పాలించే రాజైనా సరే తమకు కేటాయించిన స్థలంలో అందరితో పాటు నిలబడి ప్రార్థన చేస్తారు.

అరబిక్ ఆడవాళ్ళు ఎప్పుడో సంవత్సరానికి ఒకసారి రమ్‌జాన్‌లోని నలభైరోజుల ఉపవాసపు ప్రార్థనల్లో తప్ప, బయటికి వెళ్ళి మసీదుల్లో ప్రార్థన చేయడం ఎక్కువగా జరగదు.

ఆడవాళ్ళు పరపురుషుల కంట పడకుండా, వారితో సంబంధం లేకుండా మసీదులో ఒకవైపుగా తెరలు కట్టబడిన ప్రత్యేక స్థలం వారికి కేటాయించబడి ఉంటుంది. స్త్రీలు లోపలికి ప్రవేశించడానికి కూడా వేరే మార్గాలు ఏర్పరచబడి ఉంటాయి. స్త్రీలు నిష్ఠగా ఉజూ కార్యక్రమాలు చేసుకుని, తమ శరీరం నిండుగా బురఖాను ధరించి తలపై వెంట్రుకలు కనబడకుండా 'హిజాబ్'ను తలనిండా చుట్టుకుని మసీదులోనికి ప్రవేశిస్తారు.

రమ్‌జాన్ రోజుల్లో కాకుండా, మాములు రోజుల్లో, స్త్రీలు ఇంట్లోనే ముఖమల్ బట్టను సౌదీ అరేబియాలోని "కాబా" దిశగా పరిచి ఆ దిశగా ముఖాన్ని మళ్ళించి నిలబడి తమ ప్రార్థనను చేసుకుంటారు.

కువైటు వచ్చిన సంవత్సర కాలంలో పద్మావతి అరబ్బుల సంప్రదాయాల్ని, వారి ఇస్లాం మతాన్ని గూర్చిన కొన్ని విషయాల్ని అర్థం చేసుకుంది. అలాగే మనుషుల్లోని మంచి, చెడుకు మతంతో సంబంధం లేదనే సంగతి బాగా తెలుసుకుంది.

బాగా అలసిపోయి నిద్రలోకి జారుకున్న పద్మావతికి, ఆ రాత్రిపూట బాగా జ్వరం వచ్చి తెల్లవారు ఝామున ఎప్పటిలాగే నాలుగు గంటలకు నిద్రలేవలేకపోయింది. మసీదులోని "అల్లా హు అక్బర్" అనే ప్రార్థన చెవులకు వినిపించినా జ్వరంతో మగతగా ఉండి అలాగే పడుకుండిపోయింది.

ఆ రోజుకూడా బాబా (యజమాని), తండి నిద్రలేచి ప్రార్థన కోసం బయట మసీదులోకి వెళ్ళాడు. మామా (యజమానురాలు, తల్లి) యధావిధిగా ఇంట్లోనే ప్రార్థనను ముగించుకుంది. కానీ ఎప్పటిలా నాలుగుగంటలకే నిద్రలేచి ఇంటిని శుభ్రం చేసే పద్మావతి ఆ రోజు మామా కంటికి కనిపించలేదు.

"రణనాయకీ... ఏ .. రణనాయకీ పద్మావతి ఎక్కడ? ఇంకా నిద్ర లేవలేదా? " అని రణనాయకిని ప్రశ్నించింది మామా.

"మామా అది ఇంకా నిద్రలేవలేదు. లేవమని చెప్పినా నా మాట వినిపించుకోకుండా అలాగే పడుకుంది" అని కోపంగా బదులు చెప్పింది రణనాయకి.

"అలా.. తెల్లవారేంత వరకు పడుకుని నిద్రపోతే ఇంట్లో పని ఎవరు చేస్తారు? టైముకు పనికాకపోతే నాకు మహా చిరాకు. వెంటనే వెళ్ళి దాన్ని నిద్రలేపి తీసుకునిరా" అని మామా పురమాయించింది.

అదే అదనుగా పరిగెత్తుకుంటూ, బయట ఓ ప్రక్కగా పనిమనుషులకు కేటాయించిన రూములోకి వెళ్ళిన రణనాయకి "పద్మావతీ ఒసే పద్మావతీ నిద్రలేచి పనిలోకిరా. మామా నీకోసం ఎదురు చూస్తోంది" అంటూ గావుకేకలు వేసింది.

జ్వరంతో స్పృహలో లేని స్థితిలో నిద్రపోతున్న పద్మావతి రణనాయకి కేకలకు కళ్ళు తెరిచి చూసింది. కానీ... జవాబు చెప్పే శక్తిలేక, పైకి లేవలేక అలాగే ఉండిపోయింది. "ఏంటే గుడ్లగూబలా కళ్ళప్పగించి అలా చూస్తావు? చెప్పేది వినిపించడంలేదా? తొందరగా లేచి పనిలోకిరా.." అని హుంకరిస్తూ.. మగ్‌లో నీళ్ళు తెచ్చి పద్మావతి మొహాన విసురుగా కొట్టింది. చల్లటి నీళ్ళు మొహంపై, వంటిపై పడటంతో జ్వరంతో ఉన్న పద్మావతి చలితో వణికిపోయింది.

పద్మావతి పరిస్థితిని గమనించే స్థితిలో లేదు రణనాయకి. బాధపడేవారిని ఇంకా హింసించి ఆనందించడం మంచి సరదా రణనాయకికి. ''నువు లేవలేకపోతే మామానే ఇక్కడికి పంపిస్తా'' అంటూ వంకరగా నవ్వుతూ వెళ్ళిపోయింది రణనాయకి.

సన్నగా వణుగు మొదలైంది శరీరంలో. అయినా కూడా బలవంతంగా పైకి లేచి మొహం మీది నీళ్ళను తుడుచుకుని, చెదిరిన జుట్టును సవరించుకుని నీరసంగా ఇంట్లోకి వచ్చింది పద్మావతి.

హాల్లో కూర్చుని ఉన్న మామా పద్మావతి కోసమే ఎదురుచూస్తోంది. వస్తూనే ''సలామా లేకుం మామా'' (నీకు శాంతి కలుగుగాక) అంది వినయంగా పద్మావతి.

పద్మావతి వాలకం గమనించిన మామా ''ఏమయింది నీకు? ఎందుకు అలా ఉన్నావు?'' అని ప్రశ్నించింది.

''మామా రాత్రినుండి జ్వరంగా ఉంది. అందుకే నిద్రలేవలేకపోయాను నన్ను క్షమించు మామా'' అంది పద్మావతి.

అప్పుడే ప్రార్థన చేసిన మామా హృదయం పద్మావతిపట్ల దయతో నిండిపోయింది. ''సరే మొహం కడుక్కుని ఏదైనా తిని టాబ్లెట్ వేసుకుని చిన్నగా ఇల్లు శుభ్రం చెయ్యి. తరువాత మధ్యాహ్నం నీ జ్వరం తగ్గకపోతే డ్రైవర్ అహ్మదును తోడుకుని హాస్పిటల్‌కి పోయి చూపించుకో'' అంది.

''షుక్రాన్ మామా'' (కృతజ్ఞతలు) అని చెప్పి లేని ఓపికను తెచ్చుకుని పనిలో పడింది పద్మావతి. మామా, బాబా మంచివాళ్ళే కానీ ఆ ఇంట్లో రాక్షసిలాంటి రణనాయకితోనే కష్టాలన్నీ. దేవుడు చెడ్డవారిని ఎపుడో ఒకరోజు శిక్షిస్తాడనే నమ్మకం పద్మావతిలో ఉంది. అందుకే ఓపికగా, ఎంతో సహనంతో కడుపుకు సరిగా తిండిలేకపోయినా ఆ ఇంట్లో పనిచేస్తోంది.

ప్రొద్దున నాలుగు గంటలకు నిద్రలేచి పని మొదలుపెడితే, రాత్రి పదకొండువరకూ చేసినంత పని ఉంటుంది. ఒకోసారి తిండి తినడానికి కూడా టైమ్ దొరకదు. ఒకవేళ ఆకలితో తెగించి ఏదైనా తిందామని వంట ఇంట్లోకి వెళ్ళినా కూడా వంట మనిషి రణనాయకి ఏమీలేవు అంటూ నిన్న మిగిలిన రొట్టెలు, అన్నం కాస్త ప్లేట్‌లో వేసి అందిస్తుంది. చేసేది ఏమీలేక ఆకలితో మండే కడుపుకు, అదే కాస్త తిని, కాసిన్ని నీళ్ళు తాగి మరలా పనిలో పడిపోతుంది పద్మావతి.

రాక్షసిలాంటి రణనాయకి ప్రవర్తన రోజురోజుకూ శృతిమించిపోవడంతో పద్మావతి హృదయంలో ఆవిడపట్ల కాస్తంత ద్వేషాన్ని నింపసాగింది. కానీ ఏమీ చెయ్యలేక ఎదురు తిరగలేక కడుపు మాడ్చుకుంటూ ఏడ్చుకుంటూ మరో సంవత్సర కాలాన్ని ఎలాగో పూర్తిచేసి ఇంటికి వెళ్ళిపోవడానికి నిశ్చయించుకుంది. ఎప్పటిలాగే ఆ రోజు కూడా హాలుతో సహా అన్ని గదులూ ఊడ్చి, నేలంతా తడి బట్టతో తుడిచి, కార్పెట్ ఉన్న స్థలంలో వాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేసింది. షెల్ఫ్‌లు, షోకేస్‌లు అన్నీ దుమ్ములేకుండా తుడిచి, సర్దిపెట్టింది. బాత్‌రూములన్నీ గోడలతో సహా సోప్, డెట్టాల్ వేసి కడిగి అద్దాలన్నిటినీ గ్లాస్ క్లీనర్‌తో తుడిచింది. మామా బాబా పడకగదిని, పిల్లల గదుల్లోని పడకలను మార్చి విడిచిన బట్టలన్నీ వాషింగ్ మెషిన్‌లో వేసింది. తరువాత మామా బాబా కోసం పిల్లలకోసం రణనాయకి సిద్ధం చేసిన బ్రేక్‌ఫాస్ట్‌ను తెచ్చి డైనింగ్ టేబుల్ పైన అమర్చింది.

కిటికీలు తలుపులతో సహా దుమ్ములేకుండా శుభ్రం చేసి పిల్లలకు మామాకు కావల్సిన బట్టలు ఇస్త్రీ చేసి అందించింది. ఇక పనిచేసే శక్తిలేక టైం పదిన్నర గంటలు కావడంతో కళ్ళు తిరుగుతుంటే టీనీళ్ళు తాగుదామని వంటింట్లోకి వచ్చింది పద్మావతి. అప్పటికే మామా బాబాలకు తయారు చేసే బ్రేక్‌ఫాస్ట్‌నే తనకు కూడా చేసుకుని కడుపునిండా తినేసింది రణనాయకి.

వంటగదిలోకి వచ్చిన పద్మావతిని చూడగానే నిన్నటి రాత్రి మిగిలిపోయిన ఇరానీ రొట్టెముక్కను, ప్లేట్‌లో పెట్టి, ''ఇది తిని టీ కలుపుకుని తాగు'' అంది రణనాయకి. ఆ ఎండిన రొట్టెలోకి కాస్త ఛీజ్, జామ్‌లాంటివి దొరుకుతాయేమో అని ఆశగా దిక్కులు చూడసాగింది పద్మావతి.

ఆవులిస్తే పేగులు లెక్కపెట్టగలదు రణనాయకి. పద్మావతి ఆలోచన కనిపెట్టి "ఏంటీ? రొట్టెలోకి ఏముందా అని చూస్తున్నావా? కువైటు ఇంట్లో పనిచేస్తూ అన్ని రుచులూ కావాలి, మంచి తిండి తినాలి అనుకుంటే ఎలా కుదురుతుంది? "మనం పనిమనుషులం. మిగిలింది ఏదో కాస్త తిని కడుపు నింపుకోవాలి తెలుసా? " అంది నీతులు చెపుతూ, తన సొత్తు ఏదో శ్రీలంక నుండి తెచ్చి పద్మావతికి పెడుతున్నట్లుగా.

రణనాయకి మాటలకి తాగుతున్న టీ కూడా చేదుగా అనిపించింది. కానీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ ఆ కాస్త టీనే శక్తినిచ్చే ఆధారం కాబట్టి చేసేదేమిలేక బదులు మాట్లాడకుండా తాగసాగింది పద్మావతి.

కువైటు ఇళ్ళల్లో అన్నీ సమృద్ధిగా ఉంటాయి. పనిమనుషులకు మంచి తిండి దొరుకుతుంది. కానీ ఈ ఇంట్లో రణనాయకి హింసాప్రవృత్తి వలన సరైన తిండి లేక, పని ఎక్కువై పద్మావతి రోజు రోజుకూ కృశించి పోతోంది. అనవసరంగా ప్రక్కవారిని హింసించి ఆనందించే రణనాయకిలాంటివాళ్ళు ప్రపంచంలో అక్కడక్కడా ఉన్నారు.

ఇలాంటివారు ఎదుటి మనిషి మంచితనాన్ని చేతకానితనంగా, వారి ఓర్పును బలహీనతగా, మౌనాన్ని తెలియనితనంగా భావించి నీతిని నిజాయితీగా జీవించేవారిని లౌక్యం తెలియని అమాయకులుగా ఎంచి చులకనగా చూస్తున్నారు.

తన దీనస్థితిని తలచుకుని బాధపడుతూ ఆ రొట్టెముక్కను తింటూ, గ్లాసులోని టీని తాగసాగింది పద్మావతి.

ఇంతలో ప్రక్కింట్లోని చిన్న రూములో ఉంటూ బయట చిన్నా చితకా పనులు చేసుకుని జీవించే 'చంద్రకాంత' అనే శ్రీలంక ఆవిడ, మెల్లగా వంటగది కిటికీ దగ్గరకి వచ్చి.. "అక్కే... ఓ రణనాయకి అక్కే" అంటూ పిలిచింది. ఆ పిలుపు వినగానే చెంగున లేచి కిటికీ దగ్గరికి వెళ్ళి అద్దాన్ని పక్కకి జరిపింది రణనాయకి. కిటికీ అవతల ఉన్న తన స్నేహితురాలైన చంద్రకాంతను పలకరించింది రణనాయకి. తమ దేశంవారిని, తమ భాష మాట్లాడేవారిని ఈ పరాయిదేశంలో చూస్తే ఎవరికైనా సంతోషమే కానీ ఇతర దేశాలవారిని చిన్న చూపు చూసి బాధపెట్టకూడదు కదా?

వంటింటి కిటికీ అవతల చంద్రకాంత (శ్రీలంక వాళ్ళకి కూడా మన ఇండియా పేర్లే ఉంటాయి) ఇవతల రణనాయకి ఉత్సాహంగా, ఉల్లాసంగా కబుర్లు చెప్పుకుంటున్నారు. సింహళ భాషలోని కొన్ని పదాలు మన సంస్కృత భాషనుండి అరువు తీసుకున్నారేమో అందుకే ఆ భాషలోని కొన్ని పదాలు పద్మావతికి బాగా అర్థం అవుతాయి.

"అక్కే నిన్న నువు ఇచ్చిన పచ్చి చేపల్ని ఈరోజు పులుసు పెట్టి వండి నీకోసం తీసుకొచ్చాను. వేడిగా అన్నంలో వేసుకుని తిను" అంటూ చంద్రకాంత నిండా చేపల పులుసు ఉన్న గిన్నెను కిటికీ అవతలనుండి ప్రేమగా రణనాయకికి అందించింది.

"నంగీ (చెల్లీ) నేనంటే ఎంత ప్రేమ నీకు? థాంక్స్" అంటూ సంతోషంగా ఆ గిన్నెను అందుకుంది రణనాయకి.

చంద్రకాంతకు ఇవ్వాలనే ఉద్దేశంతో అప్పటికే చికెన్, బియ్యం, పప్పు చక్కెర నూనెలాంటివి ఒక మూటలో కట్టి రెడీగా ఉంచింది రణనాయకి.

ఇండియాలో పేదవారికి బియ్యం, కార్డు, చక్కెర కార్డులు ఇచ్చి, తక్కువ ధరలకు మన ప్రభుత్వం వాటిని సరఫరా చేస్తున్నట్లుగా కువైటులో కూడా ఈ ప్రభుత్వం ఉచితంగా కువైటువారికి బియ్యం, కందిపప్పు, నూనె, చక్కెర, పాలపొడిలాంటివన్నీ ఇంట్లోని సభ్యులకందరికీ సరిపడా, ప్రతినెలా అందిస్తుంది. ప్రతినెలా ఫ్రీగా వచ్చిపడే ఈ సరుకులన్నింటినీ కువైటు వారు వాడుకోగా మిగిలిన వన్నీ పరదేశులైన పేదవారికి దయతో కువైటు వారు పంచి పెడతారు.


www.koumudi.net

కువైటు ఇంట్లో పనిచేసే పనిమనుషులు కూడా ఇవన్నీ పోగుచేసుకుని తమ దేశంలోని తమ ఇంటికి కార్గో ద్వారా పంపిస్తారు. బయట పనులు చేసుకుని బయట నివశించే తమవారికి కువైటు వాళ్ళకి తెలియకుండా చాటుగా కొన్ని సామానులు అందించి వీళ్ళు సహాయం చేస్తుంటారు.

అలాగే ఒక్కసారి అటూ ఇటూ చూసి మామా బాబా ఆ వైపు లేరని నిర్ధారించుకుని కట్టిపెట్టిన మూటను చంద్రకాంతకు అందిస్తూ "నంగీ ఇందులో చికెన్ ఉంది. కూరవండి నాకు కొంచెం పట్టుకునిరా" అంది రణనాయకి.

"అలాగే అక్కే" అంటూ ఆ మూటను అందుకుని, వెంటనే కిటికీ దగ్గరనుండి మాయమయిపోయింది చంద్రకాంత.

ఇంతలో బెంగాలీ డ్రైవరు అహ్మదు వెనుకదారి గుండా వంట ఇంట్లోకి వచ్చాడు. నిద్రలేచినప్పటినుండీ బయటకూర్చుని సిగిరెట్లు తాగడమే వాడిపని. బాబా, మామాను చూడగానే అలర్ట్ అయిపోయి పీల్చే సిగరెట్‌ను అవతల పారేసి తెచ్చిపెట్టుకున్న వినయవిధేయతలతో, మొహాన్ని దీనంగా మార్చి, ఏదో ఒకపని చేస్తున్నట్లుగా నటిస్తాడు వాడు.

"సలామా లేకుం బాబా" అంటూ వాళ్ళకి వంగి దండాలు పెడుతూ తోకాడిస్తూ వెనుక తిరిగే కుక్కలాగా వాళ్ళ కాళ్ళు చుట్టూ తిరుగుతాడు.

ఆ సమయంలో వాడి మొహంలోని నటన, దొంగ వినయం చూసి నవ్వు వస్తుంటుంది పద్మావతికి.

వాడు నేలమీదకి వంగి సలాములు చెప్పినప్పుడల్లా వాడి విధేయతకు పొంగిపోయిన బాబా వాడికి ఒక దినారును బహుమతిగా ఇచ్చి 'ఏదైనా కొనుక్కొని తిను అంటాడు. వాడు సంతోషంగా ఆ దినారును అందుకుని కళ్ళకు అద్దుకుని "షుక్రాన్ బాబా.. అల్లా కల్లిక్" (కృతజ్ఞతలు బాబా, అల్లా దీవించును గాక") అంటాడు.

బాబా నవ్వుకుంటూ సంతోషంగా బయటికి పోగానే వీడు జేబులోని సిగరెట్ వెలిగించి విలాసంగా పొగ వదులుతూ తన నటనకు ఒక దినారు దొరికిందని ఆనందంగా నవ్వుకుంటాడు.

వాడు తన నెలజీతం బంగ్లాదేశ్‌లోని ఢాకా నగరంలో ఉన్న తన భార్యాబిడ్డలకు పంపించి అపుడపుడూ బాబా, మామా దయతలచి ఇచ్చే దినార్లతో తన ఖర్చులు పెట్టుకుని సిగిరెట్లు కొని తాగుతుంటాడు.

అలాగే ఆ వీధిలో డ్రైవర్లు లేని కువైటు వారికి, వారి కార్లను తుడిచి శుభ్రం చేసి నెలకు పది, పాతికా దినార్లు అదనంగా సంపాదించుకుంటాడు. ఈ పరాయిదేశంలో ఏదో ఒక విధంగా బ్రతికే మార్గాలు, డబ్బు సంపాదించే మార్గాలు వీళ్ళు వెతుక్కుంటారు.

అయితే వీడి కళ్ళన్నీ ఎప్పుడూ వయసులో అందంగా ఉన్న పద్మావతి చుట్టూ తిరుగుతూ ఉంటాయి. పద్మావతి ఎక్కడ ఉన్నా ఏపని చేస్తూ ఉన్నా వాడు ఆశగా, కోరికను కళ్ళల్లో నింపుకుని దొంగ కార్చుకుంటూ కుక్కలాగా చూస్తూ ఉంటాడు. వాడి చూపులు ఇబ్బందిని కలిగిస్తూ శరీరాన్ని గుచ్చుకుంటూ ఎంతో కంపరాన్ని కలిగిస్తూ ఉంటాయి. తమ దేశంలో ఇంటిదగ్గర భార్యల్ని ఒంటరిగా వదిలేసి, బ్రతుకు తెరువు కోసం ఇలా పరాయిదేశం వచ్చి ఏళ్ళకు ఏళ్ళు వీళ్ళు ఇక్కడే గడిపేస్తారు.

ఇలాంటి సమయంలో ఇలాంటి వెధవలకు వేరేపని ఏమీ ఉండదు. కంటికి కనిపించిన ఆడదానికి గేలం వేసి ఏదో ఒకటి చేసి తమ శరీర వాంఛలు తీర్చుకోవాలనే దుర్బుద్దితో మృగాల్లా ప్రవర్తిస్తుంటారు. అసహ్యం కలిగించే వాడి చూపులు, ప్రవర్తన, వెకిలిమాటలు, భుజాల్ని రాసుకుంటూ వెళ్ళటం, ఏదైనా అందించేటపుడు చేతుల్ని తడమడం లాంటివి పద్మావతిలో ఎంతో అసహనాన్ని కలిగిస్తున్నాయి.

ఇలాంటి వెధవలు, నికృష్టులు కూడా బయట ప్రపంచంలో మృగాల్లా విచ్చలవిడిగా సంచరిస్తుంటారని అంతవరకూ వాడిని చూసేంత వరకూ పద్మావతికి తెలియదు. వాడి ప్రవర్తనను అసహ్యించుకుంటూ వాడిని తప్పించుకుని దూరంగా ఉండి తన పని

చేసుకుంటూ ఉంటుంది ఆమె. ఇటు రణనాయకి పోరు, అటు డ్రైవరు అహ్మదుగాడి మృగప్రవృత్తి పద్మావతికి ఆ ఇంట్లో ప్రశాంతతను, దూరం చేసాయి.

కానీ వాడికీ రణనాయకికీ స్నేహం బాగా కుదిరింది. వారిద్దరికీ జత బాగా కలిసింది. మామా, బాబా ఇంట్లోలేనపుడు వీళ్ళిద్దరూ ఒకచోట చేరి గుసగుసలాడుతూ ఓరచూపులు చూసుకుంటూ నవ్వుకుంటూ ఉంటారు. మధ్యాహ్నం పూట ఖాళీగా ఉన్న సమయాల్లో రణనాయకి అపుడపుడూ బయట ఉన్న వాడి రూములోకి వెళ్ళి వస్తూ పద్మావతి కంట్లో పడింది. ఆ విషయం మామాకి గానీ, బాబాకిగానీ తెలిస్తే వెంటనే వాళ్ళిద్దరినీ శిక్షించి, జైలుకు పంపించడమో వెంటనే టిక్కట్లు కొని, ఎర్రముద్ర పాస్‌పోర్టుపై వేసి (తిరిగిరాకుండా) వారి దేశానికి పంపించడమోచేస్తారు.

వాడు వంట ఇంట్లోకి రాగానే అన్ని రకాల వంటలు సిద్ధం చేసి వాడికి కొసరి కొసరి వడ్డిస్తుంది రణనాయకి. ''ఆడవాళ్ళకి తిండికాస్త తక్కువైనా ఫరవాలేదు. ఓర్చుకోగలం, ఒంట్లో కొవ్వు చేరకుండా నాజూకుగా ఉండి పని బాగా హుషారుగా చేసుకోగలం. కానీ మగవాళ్ళకి పాపం కడుపునిండా తిండిలేకపోతే చాలా కష్టం'' అంటూ ఫ్రిజ్‌లోని కేకులు, పళ్ళు వాడికి మూటగట్టి ఇచ్చి వాడి రూములో పెట్టుకుని ఆకలి వేసినపుడు తినమని ప్రేమగా చెపుతుంది.

''వాడికి ఇప్పటికి ఉన్న కొవ్వు చాలదా? ఇంకా ఎక్కువ కావాలా వెధవకి? వెకిలి నవ్వులు, వంకర చూపులూ, వీడి పాడు మొహానికి'' అని కోపంగా మనసులో తిట్టుకుంది పద్మావతి.

వాడు వంటింట్లో ఉన్నంతసేపూ రణనాయకితో కబుర్లు చెపుతూ ఆమె అందాన్ని పొగుడుతూ కడుపునిండా తింటాడు.

''మా బెంగాలి సినిమాల్లో ఒక హీరోయిన్ అచ్చం నీలాగే ఉందే రణనాయకీ! నీలాగే నవ్వుతుంది. నీలాగే నడుస్తుంది. ఆమె సినిమాలు చూస్తుంటే నువ్వే గుర్తొస్తావనుకో.. రేపు శుక్రవారం మాలియాకు (సిటీకి) వెళ్ళినప్పుడు సినిమా కాసెట్ తెస్తాలే. ఇద్దరం కలిసి టివీలో చూద్దాం'' అంటూ ఆవిడ్ని పొగుడుతూ సరసాలు సాగిస్తూ రెండు ప్లేట్ల నిండా అన్నం తినేస్తాడు.

ఆవిడ వాడి మాటలకి పొంగిపోయి, మురిసిపోయి, సిగ్గుతో మెలికలు తిరుగుతూ ''నీకు ముందుగా నలుగురు డ్రైవర్లు ఈ ఇంట్లో పనిచేసారు అహ్మద్. వారందరూ కూడా నేను సినిమాలో హీరోయిన్‌లా ఉంటానని చెప్పారు. ఏదో ఖర్మ బాగోలేక కువైటు వచ్చి ఇక్కడ వంటపని చేసుకుంటున్నాను కానీ.. లేకపోతే ఎంచక్కా సినిమాల్లో చేరిపోయి ఉండేదాన్ని'' అంటూ గాల్లో తేలిపోతుంది.

''అవునే రణనాయకీ... ఈ వీధిలో ఉన్న డ్రైవర్లందరూ నీ గురించే నీ అందంగురించే మాట్లాడుకుంటారు. నువు బకాలా (అంగడి)కి పోయేటప్పుడు, వచ్చేటపుడు నువు నడుస్తూ వీధిలో వస్తుంటే అందరూ కళ్ళప్పగించి నిన్నే చూస్తున్నారు తెలుసా?'' అన్నాడు ఇంకా ఆమెను పైకి గాల్లోకి ఎత్తేస్తూ.

వాడి మాటలకి సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయిపోయి వళ్ళంతా కదిలేలా పడి పడి నవ్వింది రణనాయకి.

ఇంతలో మామా తన బెడ్‌రూములో నుండి వంట ఇంట్లోకి వచ్చి రణనాయకీ ఈ రోజు వంటకి చికెన్ మసిబూసి (అరబిక్ బిరియాని) ఫిష్ ఫ్రై, సలాడ్స్ చెయ్యి అని చెప్పింది.

అంతవరకూ కబుర్లతో సరసాలు సాగిస్తున్న వారు మామా మాటలు వినపడగానే ఇద్దరూ ముఖాల్లోని భావాలను మార్చేసి, వాడు సీరియస్‌గా తింటున్నట్లు, ఈవిడ జాలిగా వాడికి వడ్డిస్తున్నట్లు నటించసాగారు.

''ఈ టైమ్‌లో ఏమి తింటున్నారు'' అని మామా అడిగింది.

''అయ్యో.. మామా ఈ అహ్మదు టైమ్ పదకొండు దాటినా బ్రేక్‌ఫాస్ట్ చెయ్యలేదు. అందుకే కాస్త అన్నం పెడుతున్నాను. పాపం ఎపుడూ పనిచేస్తూనే ఉంటాడు. తిండి గురించి అసలు పట్టించుకోడు. అందుకే పిలిచి పెడుతున్నాను'' అంది రణనాయకి చేతులు తిప్పి

యాక్షన్ చేస్తూ... జాలిగా అహ్మద్ కేసి చూసింది. "సరే వేళకు తినండి. ఇంట్లో తిండికి కొదువ ఉందా ఏమి? " అంటూ వెళ్ళిపోయింది మామా.

వాడు వెంటనే లేచి తిన్న ప్లేటును సింక్‌లో వేసి చేతులు కడుక్కుని "రణనాయకీ ఈ రోజు మధ్యాహ్నం భోంచేసాక ఖాళీ టైములో నా రూములోనికిరా. అక్కడ కూర్చుని మాట్లాడుకుందాం" అని వంకరగా నవ్వి వంటింట్లోంచి బయటికి వచ్చాడు.

"అలాగే వస్తాలే! నువు ఏం మాట్లాడతావో నాకు తెలుసులే అంటూ" ముసిముసిగా నవ్వింది రణనాయకి.

అప్పుడు పద్మావతి ప్రక్కరూములో నిలబడి ఆరిన బట్టలను మడిచిపెడుతూ ఇస్త్రీ చేస్తూ ఉంది. పద్మావతిని చూడగానే వాడికళ్ళు మెరిసాయి. వెంటనే దగ్గరకి వచ్చి "ఎందుకు అంత కష్టపడతావు? నాకు ఒక్కమాట నీకు చెపితే పనిలో సహాయం చేసిపెడతా కదా" అన్నాడు దగ్గరికి వచ్చి ఆమె చేతిలోని బట్టల్ని తీసుకుంటూ అదే అదనుగా పద్మావతి చేతుల్ని తాకుతున్నాడు. ఒక్కసారిగా విదిలించి కొట్టి చేతిలోని బట్టల్ని అక్కడ పడేసి అసహ్యంతో వాడివైపు చూసి "అహ్మద్ నా దగ్గరకి రావద్దు. నాకు నీ సహాయం అవసరం లేదు. నువు ఇక్కడనుండి వెళ్ళిపో. లేదంటే నేను మామాతో చెపుతాను" అంది పద్మావతి.

"హుు.. నువు ఎప్పటికీ మారవా? నువ్వు నా మాట వింటే నువు కోరుకున్నది తెచ్చిపెడతాను. నీ పని అంతా నేను చేసిపెట్టినా, నెలకు నీకు పది దినార్లు డబ్బుకూడా ఇస్తా. ఆలోచించుకో" అన్నాడు వాడు. వాడి మాటలకి కోపంతో మండిపడింది పద్మావతి. కళ్ళలో నిప్పులు కురిపించే పద్మావతిని చూసి వాడికి కాస్త భయం కలిగి వెంటనే వడివడిగా అక్కడినుండి బయటకు వెళ్ళిపోయాడు వాడు.

పద్మావతికి ఎంతో దిగులుగా అనిపించింది. ఇటు రణనాయకి పోరు అటు అహ్మద్‌గాడి వేధింపులు భరించలేక ఏం చెయ్యాలో అర్థంకాక కుమిలిపోతోంది. వాళ్ళ నుండి తప్పించుకునే మార్గం ఏమిటో తెలియడంలేదు. ఇంట్లోంచి పారిపోవడానికి మనసు అంగీకరించడంలేదు. తరువాత ఎదురయే కష్టాలు ఆమెకు బాగా తెలుసు. అందుకే అంత రిస్కు తీసుకోలేకపోయింది. మరి ఎంతకాలం ఇలా మౌనంగా భరించాలో కన్నీళ్ళను దిగమింగాలో, దీనికి పరిష్కారం ఏమిటో తెలియడంలేదు.

మామా బాబాకు ఏమని వివరించి చెప్పాలో, చెప్పినా వాళ్ళు ఏమంటారో, తన మాట వింటారో లేక వాళ్ళు ఎప్పటినుండో ఇక్కడ ఉండి పనిచేస్తున్నారు కాబట్టి, వారి మాటలనే నమ్ముతారో?

వారిద్దరి మీద చెడుగా చెప్పడం పెద్ద సాహసమే అవుతుంది. తరువాత బ్రతుకు ఇంకా దుర్భరం అవుతుంది. హింసాప్రవృత్తి గల వారిద్దరితో వైరం కొరివితో తల గోక్కోవడంలాంటిదే

ఇండియాలో ఇంటిదగ్గర పిల్లల్ని అన్నా వదినల దగ్గర వదిలి ఎంతో ఆశతో కొంచెం డబ్బు సంపాదించి పిల్లల్ని బాగా చదివించుకోవాలని కువైటు వచ్చింది. త్రాగుబోతు భర్తతో నాలుగేళ్ళు పడరాని బాధలు పడి, వాడిని ఎలాగో కష్టం మీద ఒదిలించుకుని, ఇద్దరు పిల్లల్ని వదిలి కువైటు వస్తే - ఇక్కడ కూడా జీవితం సంతోషంగా ఏమీలేదు, అన్నీ కష్టాలు, కన్నీళ్ళే. ఎక్కడా బాధలకు అంతం కనిపించడంలేదు.

ఒంటరిగా పరాయిదేశంలో ఏ దిక్కూలేని తన స్థితిని తలచుకుని, కుమిలిపోతూ తనలో తాను ఆలోచించుకుని ఏడుస్తూ గుట్టగా పడివున్న బట్టల్ని ఇస్త్రీ చేయసాగింది పద్మావతి.

ఈలోపల మామా బాబా మధ్యాహ్నం భోజనాలు ముగించుకుని రెస్ట్ తీసుకోవడానికి తమ రూముల్లోకి వెళ్ళిపోయారు.

రణనాయకి, అహ్మదు కలిసి వంటింట్లో భోంచేసారు. వారి మాటలు నవ్వులు పద్మావతికి వినిపిస్తునే ఉన్నాయి.

తన పని ముగించుకున్న పద్మావతి వంటింట్లోకి వెళ్ళేసరికి టైము మూడుగంటలు దాటింది. ఎండిపోయినట్లున్న కాస్త అన్నాన్ని ప్లేట్‌లో పెట్టి పద్మావతి కోసం ఎదురుచూస్తోంది రణనాయకి.

పద్మావతిని చూడగానే హడావిడిగా ఏదో పనున్నట్లు బయటకి వెళ్ళిపోతూ "ఆ అన్నం తిని గిన్నెలన్నీ కడుగు, నేను శ్రీలంకకు డబ్బు పంపించాలి. అహ్మదు ఈరోజు సిటీకి వెళతాడామో కనుక్కుని ఇపుడే వస్తాను" అంటూ వెళ్ళిపోయింది.

అప్పటికే ఆకలితో కడుపు మండుతూ ఉండటంతో ఆ ప్లేట్‌లోని అన్నాన్ని తినసాగింది పద్మావతి.

అంతలో మామా వంటింట్లోకి వచ్చి "పద్మావతీ రణనాయకి ఎక్కడ? సాయంత్రం నా ఫ్రెండ్స్ డిన్నర్‌కి ఇంటికి వస్తున్నారు. ఏ ఐటమ్స్ చేయాలో లిస్ట్ చెపుతాను" అంది.

"మామా, రణనాయకి అహ్మదుతో మాట్లాడాలని ఇపుడే బయటికి వెళ్ళింది" అని భయపడుతూ జవాబు చెప్పింది పద్మావతి.

"సరే నువు అన్నం తిను. నేను వెళ్ళి అది ఎక్కడ ఉందో చూస్తాను" అంటూ బయటికి వెళ్ళిపోయింది మామా.

అక్కడ ఏమి జరుగుతూ ఉంటుందో, అహ్మదు రూములో రణనాయకి ఏ పరిస్థితిలో ఉంటుందో పద్మావతికి తెలుసు. ఇపుడు మామా అక్కడికి వెళ్ళి చూస్తే ఏమవుతుందో అని కంగారుపడి తింటున్న అన్నాన్ని ప్లేట్‌లో అలాగే వదిలేసి మామా వెనుకే బయటికి పరిగెత్తింది పద్మావతి.

అనుకున్నంతా అయింది. అప్పటికే అహ్మదు రూము దగ్గరికి చేరిన మామా తలుపు త్రోసి లోపలికి చూసి అక్కడ చూడకూడని దృశ్యాన్ని చూసి నిర్ఘాంతపోయింది. ఒక్క నిముషం తరువాత తేరుకుని గట్టిగా కేకలు వేసి బాబాను పిలిచింది. మామా కేకలు విన్న బాబా ఏం జరిగిందో అని పరిగెత్తుకుంటూ అక్కడికి వచ్చాడు.

అస్తవ్యస్తంగా ఉన్న బట్టలతో పట్టుబడిపోయామన్న భయంతో గజగజా వణికిపోతూ తలవంచుకుని నిలబడ్డారు రణనాయకి, అహ్మదు.

వారిద్దరినీ అలాంటి స్థితిలో చూడగానే విషయం అర్థమయిన బాబా - ఆ ప్రక్కనే కుక్కల్ని అదిలించడానికి ఉంచిన పెద్దకర్రను తీసుకుని కోపంతో ఇద్దర్నీ కలిపి గొడ్డుల్ని బాదినట్లు బాదాడు. కోపం తగ్గేంతవరకు కొట్టి వారిని అదేరూములో ఉంచి పెద్ద తాళాన్ని వేసి తాళం చెవిని జేబులో వేసుకున్నాడు.

"నేను తిరిగి వచ్చేంత వరకూ ఎవరూ తలుపు తీయకండి" అని చెప్పి కారులో కూర్చుని బయటికి వెళ్ళిపోయాడు. జరిగిన విషయాన్ని నమ్మలేనట్లుగా .. ఇంకా షాక్‌లోనుండి తేరుకోలేని మామా అక్కడినుండి వచ్చి హాల్లో మౌనంగా కూర్చుంది.

దాదాపు గంట తరువాత ఒక పోలీసును వెంటపెట్టుకుని బాబా ఇంటికి తిరిగి వచ్చాడు. వెంటనే వారిద్దరికీ ఫ్లయిట్ టిక్కట్లు బుక్ చేసి వాళ్ళ పాస్‌పోర్టులు ఆ పోలీసు చేతికి ఇచ్చాడు. ఇద్దర్ని ఎయిర్ పోర్టుకు తీసుకెళ్ళి వాళ్ళు మళ్ళీ ఈ దేశానికి రాకుండా వాళ్ళ పాస్‌పోర్టులో ఎర్రముద్ర వేసి పంపించమని చెప్పి తన గదిలోకి వెళ్ళి తలుపు మూసుకున్నాడు.

తప్పు చేసిన వారిద్దరి వైపూ అసహ్యంగా చూస్తూ ఆ పోలీసు వారిద్దరినీ బయటికి కారు వద్దకు నెట్టుకుంటూ తీసికెళ్ళిపోయాడు.

జరిగిన సంఘటనలన్నీ సినిమాలో రీళ్ళవలె కళ్ళముందు కదలాడుతుంటే ఏం చెయ్యాలో పద్మావతికి తోచలేదు. మామాతో పాటు అక్కడే హాల్లోనే క్రింద ఉన్న కార్పెట్ పైన చతికిల బడి కూర్చుంది. ఇలా ఇన్ని రోజులూ తనని వేధించిన రణనాయకి, అహ్మదులకు

తగిన శాస్తి జరిగినందుకు సంతోషించాలో, లేక వారి భవిష్యత్తును వాళ్ళ చెడునడతతో అనవసరంగా పాడుచేసుకున్నందుకు సాటిమనిషిగా బాధపడాలో అర్థంకాలేదు పద్మావతికి.

ఏది ఏమైతేనం రేపటినుండీ రణనాయకికి భయపడకుండా కడుపునిండా తిండి తినొచ్చు. అసహ్యం కలిగించే అహ్మాదు చూపులకు ఇబ్బందిపడనవసరంలేదు. స్వేచ్ఛ లభించినట్లు గుండెలనిండా ఊపిరి పీల్చుకుంది పద్మావతి.

# ఎడారిలో ఎండిన పువ్వు

**డ్యూటీకి టైమయిపోతోందని** హడావిడిగా యూనిఫామ్ మార్చుకుంటున్నాను నేను.

ఇంతలో లంచ్ చేసి లాకర్ రూములోకి వచ్చిన డోనా, నన్ను చూడగానే ''హేయ్ లలీ నీకో విషయం తెలుసా?'' అంది నన్ను ఊరిస్తున్నట్లుగా.

డోనా టెలిఫోను ఆపరేటర్‌గా పనిచేస్తోంది. ఆమెను మా హోటల్లోని వారందరూ ''బి.బి.సి న్యూస్'' అనే నిక్‌నేమ్‌తో పిలుస్తుంటారు. ఆమె నోట్లో నువ్వు గింజ నానదు. ఏ విషయమూ ఆ నోట్లో ఒక్క క్షణంకూడా దాగదు. అస్తమానం ఏదో ఒకటి ఎవరో ఒకరి గురించి చెపుతూనే ఉంటుంది. అయితే ఒక్కోసారి ఆవిడ చెప్పే విషయాలు ఆసక్తికరంగా, ఉపయోగకరంగా ఉంటాయి. అందుకే అన్ని సమయాల్లో ఆమె మాటల్ని నెగ్లెక్ట్ చెయ్యలేము.

మొహానికి పౌడరు రాసుకుని పెన్సిల్‌తో కళ్ళకు కాటుక దిద్దుకుంటూ తయారవుతున్న నేను ''విషయమేమిటో తొందరగా చెప్పు డోనా! టైమ్ లేదు. ఐదు నిముషాల్లో డ్యూటీలో ఉండాలి నేను'' అన్నాను మాటలో విసుగు కనిపించకుండా జాగ్రత్త పడుతూ.

''చాలా బాధ కలిగించే విషయం సుమా. విన్న తరువాత నాకే చాలా ఏడుపు వచ్చింది'' అంది మేటర్ చెప్పకుండా.

మెడలోని స్కార్ఫ్‌ను ఒక రౌండు చుట్టుకుని దాన్ని ఎడమవైపు వచ్చేలాగా ఓ ప్రక్కకి లాగి పువ్వులాగా మడిచి ముడి వేసుకుంటూ ''అవునా? ఏవిటది?'' అన్నాను అనాసక్తిగా ఇక ఓపిక లేక.

''రోసీ తెలుసుకదా?'' అంది డోనా.

''అవును రోసీ నాకెందుకు తెలియదు? ఏమయింది రోసీకి?'' అడిగాను నేను. (ఆ.. ఏముంది? ఏదో ఒకటి ఊహించి రోసీ గురించి లేనిపోని గాసిప్స్ చెపుతుంది. అనవసరంగా డ్యూటీకి వెళ్ళే టైమ్‌లో వచ్చి నా టైమ్ వేస్ట్ చేస్తోంది అని మనసులో తిట్టుకున్నాను నేను.)

''అయ్యో అయితే నీకు ఇంకా విషయం తెలియదన్నమాట. నీకు తెలిసే వుంటుంది అనుకుంటున్నాను నేను'' అంది. ఇంకా నాలో ఉత్సుకత రేకెత్తించాలని ప్రయత్నిస్తూ.

''నేను నెలరోజుల సెలవులనుండి మొన్ననే ఇండియా నుండి తిరిగి వచ్చాను కదా? నాకు ఎలా తెలుస్తుంది? సరే టైమయిపోయింది. వెళ్ళి నా ఆఫీసు నుండి నీకు ఫోను చేస్తాలే.. తరువాత మాట్లాడదాం'' అన్నాను నచ్చచెప్పుతున్నట్లుగా. (కరెక్టు టైముకు వెళ్ళకపోతే మా సూపర్ వైజరు రాక్షసిలా గోడకున్న వాచ్ వైపూ నా వైపూ ఉరిమి చూస్తుంది మరి.)

నేను బయటికి వెళ్ళేదారికి అడ్డంగా నిలబడి ''లలీ, నేను చెప్పేది విని వెళ్ళు లేకపోతే తరువాత నువ్వే బాధపడతావు'' అంది.

అయ్యో అనవసరంగా ఈరోజు ఈవిడ చేతిలో చిక్కిపోయానురా దేవుడా, ఇక నన్ను వదలదు అనుకుంటూ "సరే తొందరగా చెప్పు డోనా" అన్నాను నా రిస్ట్ వాచ్‌లో టైము చూసుకుంటూ. రెండు కావడానికి ఇక ఒకే ఒక్క నిముషం మిగిలి ఉంది. ఈ ఒక్క నిముషంలో నేను లిఫ్ట్‌లో, పన్నెండో ఫ్లోర్‌లో వున్న నా సెక్షన్‌లోకి వెళ్ళాలని ప్రయత్నం చేస్తున్నాను. కానీ ఈ 'డోనా' నన్ను వదిలితేకదా!

"సరే చెప్పేస్తున్నా విను. మన లాండ్రీలో పనిచేసే "రోసీ"కి ఆపరేషను చేసి ఎడమకాలు మోకాలి వరకూ పూర్తిగా తీసేసారు తెలుసా?" అంది డోనా.

ఉలిక్కిపడ్డాను నేను. "నువ్వు చెప్పేది నిజమేనా?" అన్నాను నమ్మలేకపోతూ.

"అవును లలీ! 'రోసీకి' డయాబెటిస్ వుంది కదా? అయినా సరే కేర్ చెయ్యకుండా - స్వీట్స్, చాక్‌లెట్స్, కేకులు బాగా తినేది. ఒక్కసారిగా షుగరు కంట్రోల్ కాకుండా పోయి, మొదటగా బొటనవేలు, తరువాత పాదం, ఆ తరువాత మోకాల వరకూ కట్ చేసి తీసేసారు. పాపం ఇంకా హాస్పిటల్లోనే ఉంది. నేను కూడా వెళ్ళి చూసి వచ్చాను. రోసీని ఆ పరిస్థితిలో చూసి నాకు ఏడుపు ఆగలేదు. నీకు ఇంకో విషయం తెలుసా? ఆ యూసెఫ్ వదిలేసి వెళ్ళిపోయాకే రోసీ ఇలా తయారయ్యింది. తన ఆరోగ్యం గురించి శ్రద్ధ లేకుండా ఎపుడూ ఆ యూసెఫ్ గురించే ఆలోచిస్తూ ఏడుస్తూ ఎవరికోసం బ్రతకాలి? ఎందుకు బ్రతకాలి అంటూ ఉంటుంది. ఏంటో ఆ మూర్ఖత్వం. ఇపుడు తన కాలునే తీసేసారు ఎలా బ్రతుకుతుంది? ఆ యూసెఫ్ వచ్చి ఈవిడను చూసుకుంటాడా?" అంది.

వెళ్ళిపోయేదాన్ని ఆ విషయం వినగానే నిశ్చేష్టురాలినై తలుపు దగ్గరే నిలబడిపోయాను.

"అయ్యో ఎంతపని జరిగింది? ఇపుడు ఎలా ఉంది? 'రోసీ' ఎక్కడ ఉంది?" ప్రశ్నించాను బాధగా.

"అమిరి హాస్పిటల్లో ఉంది. నువు కూడా వెళ్ళి చూసిరా. ఇంతకీ ఇండియా నుండి నాకేం తెచ్చావు? "

అంది ఆశగా నావైపు చూస్తూ. "నీకోసం బాంగిల్స్ తెచ్చాను. తరువాత బ్రేక్ టైంలో ఇస్తాలే అన్నాను."

"సరేకానీ ఆ స్నేహకు అస్సలు ఏమీ ఇవ్వకు. లాస్ట్ ఇయర్ నువు ఇచ్చిన బాంగిల్స్ బాగోలేవని, నచ్చలేదని అక్కడే పడేసింది. మొదట నేను చూసి నాకు నచ్చిన కలర్ తీసుకుంటాను. ఓ.కే" అంది నవ్వుతూ.

"అలాగే తీసుకుందువులే" అంటూ అన్యమనస్కంగా రోసీ గురించే ఆలోచిస్తూ పరుగులాంటి నడకతో వెళ్ళిపోయాను నేను.

ఆ రాత్రి రోసీని గుర్తుచేసుకుంటుంటే నిద్రపట్టలేదు. ఎందుకిలా జరిగిందో పాపం. యూనిఫామ్స్ కోసం లాండ్రీ రూములోకి వెళ్ళినప్పుడల్లా ఆప్యాయంగా నన్ను పలకరించి, ఇస్త్రీ చేసి మడత పెట్టిన బట్టల్ని పొందికగా నా చేతికి అందించేది. నేను కనిపించినపుడల్లా ఎంతో ప్రత్యేకమైన అభిమానం నాపైన చూపించేది. ఎంత మంచిది రోసీ. ఎందుకిలా అయింది? ఇపుడు ఒక కాలితో ఎలా నడుస్తుంది? ఎలా పనిచేసి జీవిస్తుంది? మరుసటి రోజు ఉదయాన్నే అమిరి హాస్పిటల్‌లోకి వెళ్ళి రోసీని చూసి రావాలి అని మనసులో నిశ్చయించుకుని తెగని ఆలోచనలతో ఎప్పటికో, తెల్లవారుఝామున కాస్త కలత నిద్రపోయాను నేను.

హాస్పిటల్లోని తన వార్డు, రూము నంబరు వెతుక్కుని రోసీ ఉన్న బెడ్ దగ్గరికి వెళ్ళేసరికి టైమ్ పదిగంటలు అయింది. కాలు పోగొట్టుకుని దీనస్థితిలో ఉన్న రోసీని ఎలా ఓదార్చాలో అనుకుంటూ. భారంగా ఆ రూములోకి అడుగుపెట్టాను నేను.

నన్ను చూడగానే చిరునవ్వుతో పలకరించింది రోసీ. ఆమె చిరునవ్వును, ముఖంలోని ప్రశాంతతను చూసి ఆశ్చర్యపోయాను నేను. అస్సలు ఏమీ జరగనట్లు ఏదీ కోల్పోనట్లు మామూలుగా ఉంది రోసీ. కానీ.. కప్పుకున్న దుప్పటి క్రింద ఎడమకాలు లేని లోటు ఆ మంచంపై ఖాళీగా... వెలితిగా కనిపిస్తోంది.

ఇలాంటి స్థితిలోని మనుషుల్ని పలకరించడం, ఓదార్చడం నాకు కష్టమైన పని. ద్రవించే హృదయాన్ని కుదుటపరుచుకోవాలన్నా, స్రవించే కన్నీళ్ళకు ఆనకట్ట వేయాలన్నా నాకు కుదరని పని.

ఓ... భగవంతుడా - మనుషుల హృదయాల్ని ఎందుకు అంత సున్నితంగా మలిచావు? ఆ స్థితిలో ఉన్న రోసీని చూసి బిగుసుకుపోయిన నా నోటిని బలవంతంగా పెకిలించుకుని ''రోసీ.. ఎలా వున్నావు? ఎందుకు ఇలా జరిగింది? నీవు నీ ఆరోగ్యం పట్ల కాస్త జాగ్రత్తగా వుండాల్సింది'' అన్నాను.

నా మాటలకి భారంగా నిట్టూర్చింది రోసీ. ''నిలబడే వున్నావు కూర్చో లలీ'' అంది బెడ్‌కి ప్రక్కనే వున్న కుర్చిని చూపిస్తూ.

రోసీ మాట కాదనలేక బలవంతంగా ఆ కుర్చీలో కూర్చున్నాను నేను.

''ఎవరికోసం నా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి? ఎవరున్నారని నేను బ్రతకాలి?'' నువ్వే చెప్పు అంది.

ఒక్క నిముషం.. నాకేం చెప్పాలో అర్థం కాలేదు. తరువాత తేరుకుని ఏదో బదులు చెప్పాలి అన్నట్లుగా ''ఎవరికోసమో ఎందుకు? నీకోసమే నువు బ్రతకాలి. నీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి'' అన్నాను తెలివిగా.

''అవును నిజమే, చిన్న దానివైనా కరెక్టుగా చెప్పావు. నిజం చెప్పావు. ఈ నిజం తెలుసుకోవడానికి నాకు ఇన్నేళ్ళు పట్టింది'' అంటూ నవ్వింది.

''నువ్వు చెప్పినట్లు ఇకనుండీ నాకోసం నేనే జీవిస్తాను. తప్పదుకదా - అందుకే, జీవిస్తాను, ఈరోజు నీకు శెలవా?'' అని ప్రశ్నించింది.

''అవును రోసీ... అందుకే ఇలా వచ్చాను'' అన్నాను.

''అయితే సాయంత్రం వరకు నాతో పాటు ఇక్కడ ఉండవా ప్లీజ్. ఒక్కదానికే ఈ రూములో మంచంపై కదలకుండా పడుకోవడం చాలా బోర్‌గా ఉంది. కాలం అస్సలు గడవడం లేదు. అపుడపుడూ నన్ను చూడటానికి వచ్చే మన కొలీగ్స్, చెక్‌చెయ్యడానికి వచ్చే నర్సులు, డాక్టర్లు తప్ప మాట్లాడేందుకు ఎవరూ లేరు. ఎందుకో ఈరోజు నీతో మాట్లాడాలని ఉంది. నిన్ను చూసినప్పుడల్లా నా మూడో చెల్లి మేరీనే గుర్తు వస్తుంటుంది. తను అచ్చం నీలాగే ఉంటుంది తెలుసా అంది నా సమాధానం కొసం ఎదురుచూస్తూ'' రోసీ.

సాధారణంగా మొహమాటం ఎక్కువ నాకు. రోసీమాట కాదనలేక పోయాను. అలాగే ఉంటానులే అన్నాను. కానీ మనసులో మాత్రం అక్కడ అలాంటి వాతావరణంలో ఉండటానికి కాస్త ఇబ్బందిగానూ బాధగానూ ఉంది.

కానీ.. ఆ రోజు అక్కడ ఉన్న నాలుగు గంటల్లో అంతవరకూ తెలియని రోసీ కథను తెలుసుకునే అవకాశం నాకు కలిగింది.

నేను సాయంత్రం వరకూ ఉంటాను అనడంతో - సంతోషంగా చిరునవ్వు నవ్వి ''థాంక్యూ లలీ'' అంది రోసీ కృతజ్ఞతగా.

''నెక్ట్స్ టైమ్ వచ్చినప్పుడు కొన్ని ఇంగ్లీషు నవల్స్ తెచ్చి ఇస్తాలే. చదువుతూ ఉంటే కాలం గడిచిపోతుంది'' అన్నాను.

తన తలగడ క్రింద నుండి పదిలంగా బైబిల్‌ను బయటకు తీసి చేత్తో పట్టుకుని ''ఇదిగో చదవడానికి ఇది వుంది చాలు. ఇంతకన్నా వేరే అవసరం లేదు'' అంది.

''రోసీ.. నీకు ఇక్కడ బంధువులు, ఫ్రెండ్స్ ఎవరూ లేరా? ఇపుడు ఈ స్థితిలో ఎవరు నిన్ను చూసుకుంటారు?'' ప్రశ్నించాను నేను.

''ఎవరూ లేరు లలీ, మా దేశం నుండి ఆడవాళ్ళు ఎవరూ పనికోసం గల్ఫ్ దేశాలకురారు. నేనే ఎంతో ధైర్యం చేసి, నా కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో వచ్చేసాను. ఎవరైనా వున్నా కూడా ఇలాంటి సమయంలో ముఖం చాటేస్తారు'' అంది నవ్వుతూ.

"ఓ.. వెరీ ఇంటరెస్టింగ్. రోసీ నీ గురించి, మీదేశం గురించీ నువు కువైటుకి ఎలా వచ్చావో ఆ పరిస్థితుల గురించీ చెప్పవా? వింటాను. నీ కథ తెలుసుకోవాలని చాలా ఆసక్తిగా వుంది" అన్నాను.

ఎందుకంటే రోసీ, ముస్లిమ్ దేశమయిన పాకిస్తాన్‌లోని క్రిస్టియన్ మతస్తురాలు. పాకిస్తాన్‌లో స్త్రీల పరిస్థితే కాక, క్రిస్టియన్ల, హిందువుల పరిస్థితి కూడా చాలా ఘోరంగా, హీనంగా ఉంటుందని, ఎంతో వివక్షత చూపిస్తారని నేను విని ఉన్నాను. మనిషికో కథ, దాని వెనుక ఒక చరిత్ర ఉంటుంది అని నా నమ్మకం.

"నీకు వినే ఆసక్తి, సమయం వుండాలేకానీ తప్పకుండా నా కథ చెపుతాను విను" అంటూ తన కథను చెప్పడం మొదలు పెట్టింది రోసీ.

"నా కథ పూర్తిగా నీకు అర్థం కావాలంటే మూడు తరాలనుండి అంటే మా అమ్మమ్మ దగ్గరనుండి మొదలు పెట్టాలి. కానీ క్లుప్తంగా విషయాన్ని నీకు చెపుతాను. మాది పాకిస్తాన్‌లోని 'కరాచీ' పట్టణం. పాకిస్తాన్‌లో హిందువులు, క్రిస్టియన్లు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. నిజం చెప్పాలంటే అక్కడ వారి పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. ఇతర మతస్తులు తక్కువవారిగానూ అట్టడుగు వర్గం వారిగాను హీనజాతిగానూ అక్కడ పరిగణింపబడుతున్నారు.

ముఖ్యంగా క్రిస్టియన్లు రోడ్లపై చెత్త ఊడవటం, మురికి కాలువలు శుభ్రం చేయడం ముస్లిముల ఇళ్ళలో పనిమనుషులుగా పనిచేయడమే కాక వారి ఇళ్ళలో మరుగుదొడ్లు శుభ్రం చేసేపని (పాకీపని) కూడా క్రిస్టియన్లదే అక్కడ అల్ప సంఖ్యాకులైన క్రిస్టియన్లు మొహల్లాలలోని సంపన్న వర్గాల ముస్లిముల ఇళ్ళలో పనిచేసుకుని వారు పెట్టే తిండితో, వాళ్ళు ఇచ్చే జీతంతో ఎంతో కష్టంగా, కఠినంగా వారి జీవనం కొనసాగిస్తున్నారు.

ఒక ముస్లిమ్ కుటుంబానికి డ్రైవరుగా పనిచేసే మా నాన్న నా చిన్నతనంలోనే చనిపోవడంతో అయిదుమంది సంతానమైన మమ్మల్ని పోషించడానికి మా అమ్మ నలుగురి ఇళ్ళలో పనిచేసి వారు దయతలచి ఇచ్చే జీతం డబ్బుతోను, పాతబట్టలు, మిగిలిన అన్నంతోనూ మమ్మల్ని పోషించి బ్రతికించింది. మా ఇంట్లో నేనే పెద్దదాన్ని నాకు ముగ్గురు చెల్లెళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళు. నేను దగ్గరలో ఉన్న ఒక క్రిస్టియను స్కూలుకు వెళ్ళి చదువుకుంటూ, సాయంత్రం పూట, సెలవు దినాల్లో మా అమ్మకు పనిలో సహాయం చేసి చేదోడుగా ఉండేదానిని. కానీ వచ్చే చిన్న జీతం డబ్బులతో పిల్లల్ని పోషించి, స్కూలుకు పంపించడం ఆమెకు శక్తికి మించిన పని అయ్యేది. అందుకే నన్ను చదివింది చాలుగానీ స్కూలు మానేసి నాలుగు ఇళ్ళలో పనికి చేరు" అని చెప్పింది. నాకు చదువుకోవాలని చాలా ఇష్టంగా ఉండేది. స్కూలుకు వెళ్ళి చదువుకుంటాను అని బాగా ఏడ్చాను. మా అమ్మకు దిక్కు తోచలేదు. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. ముట్టుకుంటే మాసిపోతుందా అనేంత వంటి రంగుతో బ్లూ కలర్ కళ్ళతో పొడవుగా, సన్నటి తీగెలాంటి శరీరాకృతితో మా అమ్మ చాలా అందంగా ఉండేది. ఎందుకంటే మా అమ్మమ్మ అప్పట్లో స్వతంత్రం రాకముందు, ఒక బ్రిటిష్ దొర దగ్గర పనిచేసేది. ఆ బ్రిటిష్ దొరే మా అమ్మమ్మకు జీసస్ గురించి చెప్పి ఆమెను క్రిస్టియన్‌గా మార్చేసాడు. అప్పటి నుండి మా కుటుంబం క్రిస్టియన్లుగా మారిపోయింది. ఆ బ్రిటిష్ దొర తన శరీరావసరాలకు మా అమ్మమ్మను లోబరుచుకున్నాడు. దాని ఫలితంగా మా అమ్మ పుట్టింది. బ్రిటిష్ వాడికీ - పాకిస్తాన్ స్త్రీకి పుట్టినది కావడంతో మా అమ్మ చాలా ప్రత్యేకంగా ఉండేది. ఆమె, మొహల్లా లోని వీధిగుండా నడిచి పోతుంటే ముస్లిం మగవాళ్ళేకాదు, ఆడవాళ్ళు కూడా కళ్ళు ఆర్పకుండా మా అమ్మవైపే చూసేవారు. అలాంటి అద్భుత సౌందర్యరాశి అయిన మా అమ్మను లోబరుచుకోవాలని ముస్లిముల మగవారు వెంటపడి వేధించేవారు మగవాళ్ళ పోరు పడలేక మా అమ్మ తలనిండా, ఒంటినిండా ముసుగు కప్పుకుని పనికి వెళ్ళేది.

అలాంటి కష్ట సమయంలో ఒకరోజు మా అమ్మ పనిచేసే ఒక ఇంటి యజమాని మా ఇంటికి వచ్చి, ధైర్యంగా సూటిగా మా అమ్మతో ''నువ్వు ఊ.. అంటే నీ బాధ్యత, నీ పిల్లల చదువుల బాధ్యత అంతా నేను చూసుకుంటాను.'' నన్ను నమ్ము అని బ్రతిమలాడాడు. ఆ బలహీన సమయంలో గత్యంతరం లేక ఆమె సరే అంది. అప్పటి నుండి అతడు అపుడపుడూ చీకటి వేళల్లో మా ఇంటికి వచ్చిపోతూ ఉండేవాడు. అతడు బాగా డబ్బు ఉన్నవాడు కావడంతో, మా చదువులకు, తిండికి ఇంట్లోకి ఏలోటూ లేకుండా అన్నీ సమకూర్చి పెట్టేవాడు. ముఖ్యంగా మా అమ్మను బాగా చూసుకునేవాడు. మా అమ్మకు కష్టపడి పనిచేసే స్థితి తప్పింది. పిల్లలమైన మాకు విషయం అర్థమయినా పరిస్థితులు మమ్మల్ని అంతా మంచిదే అంటూ సముదాయించాయి. ఆ రోజుల్లో చాలాకాలం తరువాత మా అమ్మ ముఖంలో క్రొత్త మెరుపులు మేము చూసాము. అలా దాదాపు మూడేళ్ళు సుఖంగా, సంతోషంగా ఏ లోటూ లేకుండా జరిగిపోయింది. కానీ కాలం ఎపుడూ ఒకేలా ఉండదు కదా?

ఒకరోజు వయసుకు వచ్చి ఎదిగి ఇంట్లో ఉన్న నా పైన ఆయన కన్ను పడింది. అక్కడ ముస్లిమ్‌లకు వరసలు ఉండవు. తమ స్వంత తోబుట్టువులు, కూతుర్లను తప్ప అందరినీ కాముక దృష్టితోనే చూస్తారు.

అక్కడ స్త్రీ అంటే ఒక విలాస వస్తువుగా, శరీర వాంఛలు తీర్చే ఒక సాధనంగా, తమకోరికలు తీర్చే ఒక బొమ్మగా భావించే సమాజం మాది. వయసువచ్చిన అమ్మాయిల పరిస్థితి ఎంతో దుర్లభం. వారికి ఎన్నో ఆంక్షలు, కట్టుబాట్లు ఉన్నాయి. మేము నివశించే మొహల్లా (ఏరియా) అలాంటి స్థితిలోనే ఉండేది. అక్కడ అప్పట్లో మా క్రిస్టియన్ల పరిస్థితి చాలా దుర్భరంగా ఉండేది.

ఆయన వచ్చి ఇక ప్రతిరోజూ మా అమ్మ దగ్గర నాకోసం గొడవపడేవాడు. రాత్రిపూట వచ్చి, నన్ను పట్టుకోవాలని, అనుభవించాలని బలవంతం చేసేవాడు. కానీ మా అమ్మ ఒప్పుకోలేదు. వద్దు, అది నీ కూతురుతో సమానం అంటూ ఏడ్చి బ్రతిమలాడి ఆయన కాళ్ళు పట్టుకుని ఎలాగో నన్ను ఆయన బారినుండి రక్షించేది. అలా పట్టిన పట్టు వదలకుండా ప్రతిరోజూ వచ్చి మా అమ్మకు, నాకూ రాత్రిపూట నిద్రలేకుండా వేధించేవాడు. మగవాడి కన్ను స్త్రీపైన ఒక్కసారి పడిందంటే వాడికోరిక తీరేంతవరకు వాడు మనశ్శాంతిగా నిద్రపోడు. అది మగవాడి నైజం.

నేను ఒప్పుకోకుండా గట్టిగా ప్రతిఘటించడంతో, ఆయన నా ముందే మా అమ్మను పట్టుకుని బలవంతంగా ఆమెను అనుభవించాలని ప్రయత్నించేవాడు

ఆ నరకం భరించడం మా వలన కాలేదు. వేరే మార్గం కనబడక, గత్యంతరం లేక ఒకరోజు ''అమ్మా అంకుల్ మాట వింటానమ్మా. తమ్ముళ్ళు, చెల్లెళ్ళ భవిష్యత్తు బాగుండాలంటే తప్పదు'' అన్నాను తెగింపుగా.

అంతే నా చెంప ఛెళ్ళుమంది. నా మాటలకి మా అమ్మ కాళికాదేవిలా కోపంతో ఊగిపోయింది. ''మొదట నేను, తరువాత నువ్వు, ఆ తరువాత నీ చెల్లెళ్ళు వరుసగా జీవితాంతం ఇలా వాడి శరీర వాంఛలు తీరుస్తూ ఉందామా? సిగ్గులేదా నీకు? ఛీ'' అంది. ఆ రోజు రాత్రి, అప్పటికప్పుడు మేము కరాచీలోని ఆ ఇల్లును వదిలేసి మూటాముల్లె, ముఖ్యమైన వస్తువులు సర్దుకుని అక్కడికి దూరంగా పెషావర్ పట్టణానికి దగ్గరలో ఉన్న ఒక పల్లెటూరికి చేరుకున్నాం. అక్కడ అమ్మా, నేను పదిమంది ఇళ్ళల్లో పనులు చేసి వాళ్ళు ఇచ్చిన దానితో రోజులు గడిపే వాళ్ళం.

అక్కడికి వెళ్ళాక మా ఎదురింట్లో మేడమీద ఉండే హీరా అనే అమ్మాయితో నాకు స్నేహం కుదిరింది. ఆ అమ్మాయి నా ఈడుదే. ఆ అమ్మాయి నాన్న, అన్నయ్యలు కువైటులో ఉంటూ ఉద్యోగాలు చేసేవాళ్ళు.

మా పరిస్థితిని గమనించిన వాళ్ళు ''రోసీ నువ్వు కువైటుకు వెళ్ళావంటే అక్కడ పనిచేసి డబ్బు సంపాదించి మీ కుటుంబాన్ని నువ్వు ఆదుకోవచ్చు. అక్కడి వీసాకోసం మేము ప్రయత్నించి నీకు సహాయం చేస్తాము'' అన్నారు.

వెంటనే "అలాగే" అనేసాను. వాళ్ళు చాలా మంచివాళ్ళు. వాళ్ళు చేసిన సహాయాన్ని నేను జీవితాంతం మరిచిపోలేను. ప్రపంచంలో అక్కడక్కడా ఇలాంటి మంచివాళ్ళు ఇంకా ఉన్నారు.

అయితే కువైటు వెళ్ళడానికి మా అమ్మ అంత సులభంగా ఒప్పుకోలేదు. ఎలాగో మంచి మాటలు చెప్పి ఆమెను ఒప్పించి నేను ఈ కువైటుకు వచ్చాను.

పదిహేనేళ్ళుగా పనిచేస్తునే వున్నాను. కుటుంబానికి కావలిసిన విధంగా సహాయపడ్డాను. మా అమ్మను కష్టపడనివ్వకుండా, ఆమెకు అవసరమైన డబ్బు పంపిస్తూ విశ్రాంతి తీసుకోమని చెప్పాను. తమ్ముళ్ళు, చెల్లెళ్ళు బాగా చదువుకుని పెద్దవాళ్ళయి పెళ్ళిళ్ళు చేసుకుని జీవితాల్లో స్థిరపడ్డారు. వాళ్ళ కుటుంబాలతో వాళ్ళు బిజీ అయిపోయారు. ఎప్పుడైనా, ఏదైనా వారికి అవసరం వస్తే ఈ అక్క గుర్తుకు వస్తుంది.

ఆరేళ్ళ క్రితం మా అమ్మకూడా చనిపోయింది. ఆమె పోయాక నేను దాదాపు ఒంటరిదాన్నే అయ్యాను. తమ్ముళ్ళు, చెల్లెళ్ళు ఎంతసేపూ తమ స్వార్థంతో డబ్బు పంపించు, బంగారం పంపించు అని అడిగేవారే కానీ ఏనాడూ అక్కా ఎలా వున్నావు? నీ ఆరోగ్యం ఎలా వుంది అని పరామర్శించి పట్టించుకునేవారేకాదు. ఈ కాలం, మనుష్యుల మధ్య అనుబంధాలు, ప్రేమలు కరువైపోతున్నాయి. అమ్మపోయాక ఆ దిగులు ఎక్కువై ఒంటరితనం నన్ను కృంగదీసింది. డయాబెటిక్ పేషెంటును అయిపోయాను. ఇపుడు ఊహించని స్థితిలో నా కాలును కూడా పోగొట్టుకున్నాను. నా జీవితం ఇలా ఈ ఎడారిలో తెల్లవారిపోయింది. కష్టాలు భరించేవారికే తిరిగి వస్తుంటాయేమో? నా కష్టాలకు, కన్నీళ్ళకు అంతం లేదు. ఈ జీవితం ముగిసేంతవరకూ" అంటూ చెప్పడం ఆపి నిట్టూర్చింది రోసీ.

రోసీ కథ విని నా హృదయం బరువైపోయింది.

రోసీ ఒక్కటేకాదు. ఇలా, ఎంతోమంది అమ్మాయిలు తమ జీవితాన్ని, యవ్వనాన్ని, ఫణంగా పెట్టి, సంతోషాన్ని, సుఖాల్ని త్యజించి ఈ ఎడారిలో, గల్ఫ్‌దేశాల్లో ఏళ్ళ తరబడి కష్టపడి పనిచేసి తమ కుటుంబాల్ని ఆదుకుని చివరికి ఒంటరిగా మిగిలిపోయినవారు వున్నారు. తనవారి ఆనందం కోసం తన కుటుంబాన్ని ఆదుకోవడం కోసం తన కోరికల్ని చంపుకుని తన భవిష్యత్తును మరచి క్రొవ్వొత్తిలా కరిగి తనవారికి వెలుగును పంచిన వారు ఎందరో?

మరి ఇపుడున్న ఈ పరిస్థితిలో రోసీ ఒంటరిగా ఎలా జీవిస్తుంది? తనకు తోడుగా ఎవరుంటారు? అనే సందేహాలు నాలో కలిగాయి.

"రోసీ.. మరి నువ్వు ఈ కువైటు దేశానికి వచ్చిన పదిహేనేళ్ళ కాలంలో నువు ఎవర్నీ ఇష్టపడలేదా? మారేజ్ చేసుకోవాలని అనుకోలేదా? ఇక మిగిలిన కాలాన్ని నువు ఒంటరిగా ఎలా గడుపుతావు? పిల్లలన్నా వుంటే నిన్ను జాగ్రత్తగా చూసుకునేవాళ్ళు కదా?" అన్నాను.

"ఎందుకు అనుకోలేదు? నేను కూడా అందరి అమ్మాయిల్లాగే జీవితం గురించి ఎన్నో కలలు కన్నాను. కువైటుకు వచ్చిన ఆరేళ్ళ తరువాత యూసెఫ్ అనే ఈజిప్టు అబ్బాయిని నేను ప్రేమించాను. అతడు కూడా నన్ను ప్రేమించాడు. ఇక్కడే కువైటులోని కోర్టుకు వెళ్ళి ఇస్లాం సాంప్రదాయ పద్ధతిలో మేము పెళ్ళిచేసుకున్నాం. అతడు ముస్లిము కావడంతో నేను కూడా పెళ్ళికోసం ఆ మతాన్ని స్వీకరించక తప్పలేదు. వధూవరుల్లో ఒక్కరు ముస్లిమ్‌లు కాకపోయినా కువైటు కోర్టు ఆ వివాహాన్ని అంగీకరించదు. మతమేదైతేనేం మనిషి కావాలి అనుకున్నాను. ప్రేమే ముఖ్యం అనుకున్నాను నేను.

దాదాపు మూడేళ్ళు మేమిద్దరమూ సంతోషంగా అన్నీ మరచి స్వర్గంలో విహరించాము. అవే నా జీవితం మొత్తం మీద నేను ఆనందంగా గడిపిన రోజులు. కానీ ఇక్కడ ఎడారిలోని ప్రేమలు కలకాలం వెలుగుపంచేవి కావు. ఇక్కడి బంధాలు ప్రేమలు అశాశ్వతమైనవి,

తాత్కాలికమైనవి. ఆ విషయం అప్పట్లో నాకు అర్థంకాలేదు. యూసెఫ్‌తో పీకల్లోతు ప్రేమలో మునిగిపోయాను నేను. ఈ ప్రపంచాన్నే మరిచిపోయాను. నన్ను నేను మనస్ఫూర్తిగా అతనికి సమర్పించుకున్నాను.

అతను ఈజిప్టులోని కైరో పట్టణంలో మనకు ఇల్లు కట్టిస్తాను. మనం వెళ్ళి అక్కడ సెటిల్ అవుదాం అంటూంటే.. ఆ మూడేళ్ళకాలం నా జీతం డబ్బులన్నీ యూసెఫ్‌కే ఇచ్చేసాను. ఇక్కడ పెళ్ళి చేసుకుని నేను జీతం డబ్బు పంపించకపోవడంతో మా ఇంట్లో వాళ్ళు "నేను స్వార్థపరురాలినయ్యానని, నా జీవితం నేను చూసుకున్నానని అంటూ ఆడిపోసుకుని నన్ను ద్వేషించడం మొదలు పెట్టారు" కానీ నన్ను మనస్ఫూర్తిగా అభినందించింది మాత్రం మా అమ్మే. నా జీవితం కుదుట పడిందనీ - నాకు తోడుగా యూసెఫ్ వున్నాడని సంతోషించిన మా అమ్మ మరుసటి సంవత్సరమే కన్నుమూసింది. ఆ వార్త విని అమ్మను కడసారిగా చూడాలనే కోరికతో వెంటనే బయలుదేరి - అప్పటికపుడు పాకిస్తాన్‌కు వెళ్ళిపోయాను.

అక్కడ నావాళ్ళందరూ నన్ను "నువు ఆ ఈజిప్టువాడిని చేసుకున్నావని తెలిసి ఆ బాధతో, దుఃఖంతో అమ్మ చనిపోయింది. అంతా నీవల్లనే అంటూ నిందించారు.

అవసరం తీరిపోయిన తరువాత, అయినవారు కూడా పగవారవుతారేమో? కొండంత దుఃఖాన్ని దిగమ్రింగుకుని నిందలన్నీ మోసుకుంటూ తిరిగి కువైటుకు వచ్చిపడ్డాను నేను. తరువాత యూసెఫ్ తోడిదే లోకంగా, అతని ప్రేమతో అతని స్నేహంతో అన్ని బాధలూ మరిచిపోయి ఆనందంగా బ్రతుకుతున్న వేళ ఒకరోజు అతడు కూడా నన్ను విడిచి ఈజిప్టుకు వెళ్ళిపోయాడు. పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్టయింది నా పరిస్థితి.

తమ కొడుకు కువైటులో పాకిస్తాన్ అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడనే విషయం యూసెఫ్ తల్లిదండ్రులకు తెలియగానే "నాన్నకు ఆరోగ్యం బాలేదని, అర్జంటుగా రమ్మని చెప్పి" అతన్ని ఈజిప్టుకు పిలిపించుకున్నారు. అక్కడ అతన్ని బెదిరించి, బ్రతిమాలి, ఏదో విధంగా బలవంతంగా తమ బంధువుల అమ్మాయితో వివాహం జరిపించేసారు. తిరిగి అతడ్ని వాళ్ళు కువైటుకు రానివ్వలేదు. అతడు లేకుండా జీవించడం నాకు దుర్లభమైపోయింది. పదిరోజుల తరువాత అతడు వీలు చేసుకుని చాటుగా, తల్లిదండ్రులకు తెలియకుండా నాకు ఫోను చేసి జరిగిన విషయం చెప్పి బాధపడ్డాడు. విన్న ఆ క్షణమే నేను జీవశ్చవాన్నైపోయాను. నా జీవితంలో ఇది అతి పెద్ద షాకు. నా కలలన్నీ కల్లలై పోయాయి. తట్టుకోలేకపోయాను. నా ఆరోగ్యం బాగా పాడయిపోయింది. నేను పట్టించుకోకుండా కేర్ తీసుకోకుండా తొందరగా చనిపోవాలనే కోరికతో స్వీట్స్ బాగా తినేసేదాన్ని. దాని ఫలితమే ఈ దుస్థితి. చనిపోవాలి అను కోరుకున్నాను కానీ కాలును కోల్పోతానని అనుకోలేదు. యూసెఫ్ లేని నా జీవితం వ్యర్థం లలీ. నాకు బ్రతకాలని లేదు. కానీ ఏదో ఒక రోజు అతడు తిరిగి నాకోసం వస్తాడు అనే ఆశ నన్ను బ్రతికిస్తోంది. లేకపోతే ఎపుడో చనిపోయేదాన్ని. నా జీవితం, నా కష్టాలు, ఒంటరితనం ఎవరికీ వద్దు" అంటూ వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది రోసీ.

రోసీని ఎలా ఓదార్చాలో నాకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఏం చెపితే ఆమె దుఃఖం తగ్గుతుంది? ఆమె రోదన చూసిన నా కళ్ళు కూడా నీళ్ళను నిండా నింపుకున్నాయి.

"రోసీ ధైర్యం తెచ్చుకో! ఏడవకు" అన్నాను.

భరించలేని బాధ నా హృదయాన్ని పట్టుకుని కుదిపేసింది. నాకే గనుక శక్తి వుంటే రోసీ వేదనని, కష్టాన్ని ఒక్క మాటతో అలా తుడిచేయగలిగితే ఎంత బాగుంటుంది అనిపించింది.

"నీకు ఇంకో విషయం కూడా చెప్పాలి లలీ! మా అమ్మమ్మ కూడా నాలాగే మా తాతయ్య కోసం ఎదురుచూసి కృంగిపోయి తొందరగా చనిపోయింది. భారతదేశానికి స్వతంత్రం రాగానే బ్రిటిష్ దొర అయిన మా తాత మా అమ్మమ్మకు మాట మాత్రం

చెప్పకుండా బ్యాగు సర్దుకుని లండన్‌కు వెళ్ళిపోయాడు. ఆయనమీద దిగులుతో, ఆయనను మరలా ఒక్కసారి చూడాలనే కోరికతో మళ్ళీ ఏదో ఒకరోజు తిరిగి వస్తాడేమో అనే ఆశతో ఎదురు చూస్తూనే కాలం గడిపింది. అంతులేని ఆవేదనతో ఆ స్త్రీ హృదయం ఆయన కోసం పరితపిస్తూ అదిగో నా దొర వస్తున్నాడు అని కలవరిస్తూ ఆమె ప్రాణం ఆయన కోసం ఊగిసలాడుతుండగా మా చిన్నతనంలో పాకిస్తాన్‌లోనే ఆమె కన్నుమూసింది.''

స్త్రీ హృదయం ఎంత గొప్పది? స్త్రీ ప్రేమ ఎంత ఉన్నతమైనది కదా! పురుషుడు తన వాంఛలను తీర్చుకున్నాక తేలికగా మరిచిపోయి తనదారిన తాను వెళ్ళిపోతాడు. కానీ స్త్రీ తన ప్రేమను, హృదయాన్ని, ప్రాణాన్ని, సమస్తాన్ని అతనిలో నిలుపుకుని అతన్ని మరిచిపోలేక, బ్రతకలేక, చనిపోలేక ఎంత నరకయాతన అనుభవిస్తుందో కదా?

ఏదైతేనేం యూసెఫ్ మళ్ళీ వస్తాడు, ఈ కళ్ళతో అతన్ని ఒక్కసారి చూస్తాను అనే ఆశ నాలో క్రొత్తజీవం పోసి ముందుకు నన్ను నడిపిస్తుంది తెలుసా? అందుకే నేను జీవిస్తాను. ఇంకా కొన్ని సంవత్సరాలు ఈ కువైటులో అతని కోసం ఎదురు చూస్తూ కాలం గడుపుతాను'' ఎంతో ధీమాగా, ధైర్యంగా, మెరిసే కళ్ళతో ఈ మాటలు చెప్పింది రోసీ. యూసెఫ్ పట్ల ఆమెకున్న ప్రేమకు, అతన్ని చూడాలనే ఆమె పట్టుదలకు నాకు సంతోషం కలిగింది.

ఇంతలో డ్యూటీలో ఉన్న నర్సులు రోసీకి బి.పి, షుగర్ చెక్ చేయడానికి గదిలోకి రావడంతో మాటలు చాలించి మేమున్న స్థితినుండి బాధనుండి తేరుకుని కుదుటపడ్డాము.

ఆ రోజుకి విజిటింగ్ అవర్స్ అయిపోవడంతో నేను లేచి నిలబడి ''రోసీ నీ కథ వినిపించినందుకు చాలా కృతజ్ఞతలు. నీవు చాలా గొప్పదానివి తెలుసా? నీలాంటి వాళ్ళు ఈ ప్రపంచంలో చాలా అరుదుగా వుంటారు నీ ఆరోగ్యం జాగ్రత్త. మళ్ళీ తొందరలో కలుద్దాం, కబుర్లు చెప్పుకుందాం. సరేనా! '' అంటూ.. నేను సెలవు తీసుకున్నాను.

ఈ సంఘటన జరిగి దాదాపు ఐదేళ్ళు గడిచాయి. ఒక కాలులో సగం భాగం లేకపోయినా ధైర్యం కోల్పోకుండా ఇంకా మా సెంట్రల్ లాండ్రీలో రోసీ పనిచేస్తూనే ఉంది. మా జనరల్ మేనేజరు మంచివాడు కావడంతో రోసీ దయనీయమైన స్థితిని చూసి జాలిపడి తన ఉద్యోగాన్ని అలాగే కంటిన్యూ చేయమని చెప్పాడు. రోసీకి అనువుగా వుండి, సులభంగా కూర్చుని చేసే పనులన్నింటినీ చేసుకోమని ధైర్యం చెప్పాడు. కువైటులో వుండి పనిచేసుకునే అవకాశం కలిగివున్నందుకు రోసీ చాలా సంతోషించింది. చక్రాల కుర్చీలో కూర్చుని లాండ్రీ అంతా కలియతిరుగుతూ తన పని హుషారుగా చేసుకుంటూ ఉంటుంది. కుర్చీలో కూర్చునే బట్టలు ఇస్త్రీ చేయడం, మడిచి బాక్సుల్లో పెట్టడం, హేంగర్‌లకు తగిలించి స్టాండుకు అమర్చడం బిల్లులు రాయడం, ఫోను కాల్స్ రిసీవ్ చేసుకోవడం లాంటి పనులన్నీ చాలా సులభంగా చేసుకుంటుంది. అక్కడ పని చేసేవారికి, తనకు వున్న సీనియారిటీతో తగిన సలహాలు ఇస్తూ వారికి తగిన సహాయం అందిస్తూ రోసీ మంచి పేరు తెచ్చుకుంది.

తమ బట్టల కోసం లాండ్రీ లోపలికి వెళ్ళిన ప్రతిఒక్కరూ రోసీని పలకరించి మాట్లాడనిదే బయటకి రాలేరు.

కనిపించిన ప్రతివారినీ ప్రేమగా, ఆప్యాయంగా పలకరిస్తుంది రోసీ. సాటిమనిషిగా ఇతరులకు మనం ఏం ఇవ్వగలం? సులభంగా, కష్టటం లేకుండా, ఖర్చులేకుండా ఇవ్వగలిగేది, పంచుకోగలిగేది, ఒక చిరునవ్వు, ఒక మంచి పలకరింపే కదా? అంటుంది.

ఒక కాలు లేకపోయినా ఆ లోటును ఆమె ఎన్నడూ పట్టించుకోలేదు. తన పనులన్నింటినీ తానే చక్కగా చేసుకుంటూ సంతృప్తిగా, సంతోషంగా జీవిస్తోంది రోసీ. అప్పుడప్పుడూ యూనిఫామ్ కోసం లాండ్రీలోకి వెళ్ళినపుడు రోసీని పలకరించి ''నువ్వు గ్రేట్ నిన్ను చూసి నేను చాలా నేర్చుకోవాలి'' అంటే తను అస్సలు ఒప్పుకోదు. ''లలీ నీకంటే నేనేమి గ్రేట్ కాదు'' అంటుంది.

"రోసీ ఇంకా స్వీట్స్, కేక్స్ తింటున్నావా? " అని అడిగితే బదులుగా "నో.. ఓన్లీ సలాడ్స్" అంటుంది నవ్వుతూ.

ఇప్పటికీ ఇంకా ఏఓ ఆశతో, ఏదో ఒకరోజు యూసెఫ్ తిరిగి వస్తాడని, అతన్ని ఒక్కసారైనా చూడాలనే కోరికతో రోసీ కువైటులో కాలం గడుపుతోంది. యూసెఫ్‌ను మరిచిపోవడం రోసీకి అసాధ్యమైన పని.

ప్రేమ ఎంత గొప్పది? అది ఎన్నో అద్భుతాలను చేస్తుంది.

ప్రేమ ప్రాణాల్ని కూడా నిలబెడుతుంది. జీవితకాలాన్ని కూడా పొడిగిస్తుంది.

ప్రేమ అనిర్వచనీయమైన జ్ఞాపకాలను, అందమైన అనుభూతుల్ని మూటగట్టి హృదయానికి అందిస్తుంది. ఆ ఆనందంతో జీవితాన్ని గడపమంటుంది.

'రోసీ'లోని ప్రేమే, ఆమెకు ఎంతో శక్తిని ఇచ్చి యూసెఫ్ కోసం ఎదురుచూసేట్లు చేస్తోంది. ఆమెను ముందుకు నడిపిస్తోంది.

భార్యాపిల్లలతో ఈజిప్టులోని కైరో పట్టణంలో సుఖంగా, సంతోషంగా జీవిస్తున్న యూసెఫ్ రోసీ కోసం కువైటుకు తిరిగి వస్తాడు అనుకోవడం ఒట్టి భ్రమ మాత్రమే. ఈ విషయం నాకేకాదు. అందరికీ తెలుసు. కానీ రోసీ మాత్రం అతడు తిరిగివస్తాడనే నమ్మకంతోనే జీవిస్తోంది - మరి, రోసీ కోరిక ఎపుడు నెరవేరుతుందో, ఆ అందమైన రోజు ఎపుడు ఆమె ముందుకు తరలి వస్తుందో? వెనుతిరిగి చూడకుండా ఎక్కడా ఆగకుండా ముందుకు కదిలిపోయే ఆ కాలమే నిర్ణయించాలి.

## *రెండవ గల్ఫ్ యుద్ధంలో నా అనుభవాలు*

**అది 2003 ఫిబ్రవరి నెల.**

2001 సెప్టెంబర్ 11 న అమెరికాలో కూలిపోయిన "ట్విన్ టవర్స్" దాడిలో సద్దాం హుస్సేన్ హస్తం వుందని భావించిన అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్, ఇరాక్‌పై యుద్ధాన్ని ప్రకటించాడు.

ఇరాక్ సైనాధ్యక్షుడైన సద్దాం హుస్సేన్ ఆగడాలను, దుశ్చర్యలను ఇక ఉపేక్షించేది లేదని, సద్దాంను ప్రాణాలతో పట్టుకోవడం, ఇరాక్ ప్రజలకు, నియంత అయిన సద్దాం పాలన నుండి విముక్తి కలిగించడం ఈ యుద్ధం యొక్క లక్ష్యమని జార్జిబుష్ ప్రకటించాడు.

ఉగ్రవాదాన్ని తుడిచి వెయ్యడానికి, దానికి కారకులైన వారిని నిర్మూలించడానికి మద్దతునివ్వవలసిందిగా జార్జిబుష్‌గారు ప్రపంచ దేశాలకు పిలుపును ఇచ్చారు.

బ్రిటిష్ ప్రైమ్ మినిష్టరు "టోనీ బ్లెయిర్" తన బలగాలను కూడా పంపించి అమెరికాకు మద్ధతుగా నిలిచారు.

2003 ఫిబ్రవరి 18వ తేదీన బ్రిటిష్ సైన్యాన్ని తనతో కలుపుకున్న అమెరికా "కువైటును" కేంద్రంగా చేసుకుని ఇరాక్‌పై దాడి చేయడానికి సరిహద్దుల్లో సైన్యాన్ని మోహరించింది. బ్రిటిష్, ఆస్ట్రేలియా, పోలండ్‌లతో కలుపుకుని మొత్తం 36 దేశాల మద్దతు అమెరికాకు లభించింది.

2003 జనవరిలో ఒక సర్వే నిర్వహించగా 64 పర్సెంట్ అమెరికన్ పౌరులు ఇరాక్ అధ్యక్షుడైన "సద్దాం" పై చర్య తీసుకోవడానికి తమ మద్ధతు తెలుపుతూ ఓటు వేసారు.

అయితే మరొకవైపు ఇటలీకి ముఖ్యపట్టణమైన రోమ్‌లో ఇరాక్ యుద్ధానికి వ్యతిరేకతను తెలుపుతూ మూడు మిలియన్ల ప్రజలు ర్యాలీని నిర్వహించారు. యుద్ధాన్ని వ్యతిరేకించిన అతి పెద్ద ర్యాలీగా అది "గిన్నిస్ బుక్" రికార్డులోకి ఎక్కింది. అయినా కూడా తన

పట్టుదల వీడని అమెరికా, దాని మద్దతు దేశాలు సద్దాంను నిర్మూలించడమే తమ ధ్యేయంగా భావించి యుద్ధానికి ముందుకు సాగాయి. కువైటు, ఇరాక్ సరిహద్దుల్లో నిలిచిన అమెరికా సైన్యం మొదట "బాగ్దాదు" చేరింది. మరుసటి రోజున కాస్త ముందుకు చొచ్చుకెళ్ళిన అమెరికా సైన్యం కువైటుకు ఉత్తరంగా, సరిహద్దులకు సమీపంగా వున్న ఇరాక్‌లోని "బాస్రా" అనే పట్టణాన్ని లోబరుచుకుని అక్కడ తిష్టవేసింది.

అక్కడ నుండి ఇరాక్ లోపలికి చొచ్చుకుని వెళ్ళడానికి, ఇరాక్ ముఖ్యపట్టణమైన "బాగ్దాదును" వశం చేసుకోవడానికి తరువాత "సద్దాం"ను ప్రాణాలతో పట్టుకోవడానికి వారు ప్రణాళికను వేసుకున్నారు.

ఇరాక్‌పై యుద్ధం చేసేది అమెరికా, అయినా కూడా ముఖ్యంగా ముంచుకొచ్చే ముప్పు "కువైటు దేశానికే" అని కువైటు ప్రజలకు బాగా తెలుసు. అతి చిన్న దేశమైన కువైటుకు సైన్యంకానీ.. అణ్వాయుధాలు కానీ లేవు. ఇరాక్ గట్టిగా ప్రతిఘటిస్తే మొదట సమూలంగా నాశనమైపోయేది కువైటు దేశమే. కాబట్టి యుద్ధం అనేమాట వినగానే కువైటు ప్రజలూ, ఆ ప్రజల కంటే ఎక్కువగా వున్న, పరదేశాల నుండి వచ్చిన పనివారందరు కూడా భయంతో వణికిపోయారు.

అప్పటికే 1990లో జరిగిన యుద్ధంలో "సదాం హుస్సేన్" సృష్టించిన మారణహోమానికి, దేశం సమూలంగా తుడిచిపెట్టుకుని పోయింది. తిరిగి అమెరికా సాయంతో సద్దాంను పారద్రోలిన కువైటు ఇప్పుడిప్పుడే పట్టణాన్ని పునర్నించుకుంటోంది.

1990లో ఇరాక్ యుద్ధం చేసిన గాయాల్ని ఇంకా మరువక ముందే మరొక యుద్ధం అనగానే భయంతో దేశం విడిచిపోవడానికీ, ఇతర దేశాల్లో కొద్దిరోజులు తలదాచుకోవడానికి తమ బ్యాగులు సర్దుకున్నారు కువైటు ప్రజలు.

కానీ.. ప్రపంచంలోనే బలమైన అమెరికా దేశం, ఇతర దేశాల మద్దతుతో ఇరాక్‌ను సులభంగా జయిస్తుందని, కువైటుకు వచ్చిన ప్రమాదం ఏమీలేదని కొందరు అన్నారు.

మరికొందరు "అబ్బే 'సద్దాంను' నమ్మలేము. ఆయన వెనుక ఎంత శక్తి వుందో? ఎన్ని అణుబాంబులు వున్నాయో? ఎవరికి తెలుసు? 'సద్దాం' తెలివి ముందు ఎంతటివారైనా తల వంచాల్సిందే జరిగే యుద్ధం చాలా పెద్దదే, కాబట్టి కువైటు దేశాన్ని వదిలి వెళ్ళిపోవడం సరియైన పని" అని తలచారు.

కువైటు ప్రభుత్వం, దేశంలోని కంపెనీలు అన్నీకూడా. యుద్ధం అనివార్యమని, యుద్ధానికి భయపడి వణికిపోయేవారందరూ కువైటును వదిలి తమ దేశాలకు వెళ్ళిపోవచ్చని పనివారికి ప్రకటించాయి

ఒక్కసారి యుద్ధం మొదలైతే తరువాత ఫ్లయిట్లు అన్నీ కాన్సిల్ అయిపోతాయి బయటికి వెళ్ళడానికి కువైటుకు రావడానికి ఏ మార్గమూ వుండదు. కాబట్టి యుద్ధం మొదలవక ముందే వెళ్ళిపోవచ్చని. పరిస్థితులు చక్కబడ్డాక తిరిగి యధావిధిగా డ్యూటీల్లో జాయిన్ కావచ్చని వారు తెలియజేసారు.

యుద్ధం అంటే భయపడిన పనివారందరూ వెంటనే తమ ఫ్లయిట్ టిక్కెట్లు బుక్ చేసుకుని బ్యాగ్స్ సర్దుకుని, యుద్ధం మొదలవకముందే తమ దేశాలకు వెళ్ళిపోయారు.

యుద్ధాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలి, అమెరికాదే విజయం, కువైటుకు ఏమీ ప్రమాదం లేదు అనుకున్న వారు, క్రొత్తగా వచ్చి పనుల్లో చేరినవారు, ఫ్లయిట్ టిక్కెట్లు కొనుక్కోవడానికి డబ్బులేనివారు, యుద్ధంలో కూడా పనిచేసి డబ్బు సంపాదించాలి అని నిశ్చయించుకున్నవారు, మొండిగా ధైర్యంగా కువైటులో వుండిపోయి యుద్ధంలో కూడా తమ విధులను నిర్వర్తించారు. మూణ్ణెల్ల

ముందుగా నేను కూడా క్రొత్తగా అంటే, 2002 నవంబర్‌లో మా "మారియట్" హోటల్‌లో జాయిన్ అయి వుండటం వలన ఏదో తెలియని ధైర్యంతో, నాకు ఏమీకాదు అనే నమ్మకంతో కువైటులోనే వుండిపోయాను.

మా హోటల్ యాజమాన్యం కూడా ఇలాగే భయపడేవారిని వెళ్ళిపొమ్మని యుద్ధం ముగిసి అంతా సక్రమంగా వుంటే తిరిగి రావచ్చని నోటిఫికేషను జారీ చేసింది. సగం మందికి పైగా వర్కర్స్ "బ్రతుకు జీవుడా" అనుకుంటూ ఎమర్జెన్సీ సెలవలకు వెళ్ళినట్లుగా ఫారాలు ఫిల్ చేసి, ఫ్లయిట్ ఎక్కి తమ దేశాలకు వెళ్ళిపోయారు. ఇక మిగిలిన వర్కర్స్ కొద్దిమంది మాత్రమే. కానీ.. ఆ యుద్ధ సమయంలో మా హోటల్ మాత్రం ఒక్క రూము కూడా ఖాళీ లేకుండా ఫుల్‌గా గెస్ట్‌లతో నిండిపోయింది.

జర్నలిస్టులు, న్యూస్ రిపోర్టర్లు, ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్, న్యూస్ రీడర్స్, అమెరికా సైనికులు లాంటి వారేకాక అమెరికా ఆర్మీ ఆఫీసర్స్ లాంటి వారితో మా హోటల్ చోటు లేకుండా క్రిక్కిరిసిపోయింది.

యుద్ధం మొదలవక ముందే మా యాజమాన్యం, యుద్ధం గురించిన అవగాహన కలగడానికి, క్లిష్ట పరిస్థితుల్లో, అత్యవసరంగా ఎలా తప్పించుకోవాలో సాటి వారికి ఎలా సహాయపడాలో వివరిస్తూ ట్రైనింగ్ సెషన్స్ మాకందరికీ వంతులవారీగా నిర్వహించారు.

ఎమర్జెన్సీ సమయంలో వెళ్ళాల్సిన మీటింగ్ ప్లేసులు ఏర్పాటు చేసి ఎలా వెళ్ళాలో ఏదారి ఉపయోగించాలో తెలియజేసి ప్రాక్టీస్ చేయించారు.

అంతేకాదు బేస్‌మెంట్లలో ఒక నెలకు సరిపడా ఆహార పదార్థాలు, త్రాగునీరు రెండు వందల మందికి సరిపోయేట్లుగా అంచనా వేసి, అక్కడ నిలవ వుంచారు. స్టాఫ్ కోసమే కాకుండా గెస్ట్‌ల కోసం కూడా తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేసి ఆహారం, నీరు ఒక నెలకు సరిపడా అక్కడ నిలవ చేసారు.

ఇరాక్ కనుక అణ్వాయుధాలు, మిస్సైళ్ళు ఉపయోగించి హోటల్ పై భాగాన్ని నాశనం చేస్తే మేమంతా తలదాచుకోవాల్సిన అనువైన చోటు ఈ బేస్‌మెంటే! బిల్డింగ్ మొత్తం పడిపోయినా బేస్‌మెంట్లు మాత్రం మనుషులకు రక్షణనిస్తాయని. యుద్ధం జరిగే ఎమర్జెన్సీ సమయంలో కొద్దిరోజులు అక్కడ వుండి ప్రాణాల్ని కొంతవరకు కాపాడుకోవచ్చని మేం భావించాం.

ఇరాక్ నుండి కువైటు వైపు ఆకాశంలో దూసుకుని వచ్చే మిస్సైల్స్ దాడిని తప్పించుకుని పరిగెత్తి ప్రాణాలు దక్కించుకోవడానికి మా స్థావరాన్ని మేము కట్టుదిట్టంగా, అన్ని భద్రతలతో జాగ్రత్తగా ఏర్పరచుకున్నాము.

1980లో ఇరాన్‌తో జరిగిన యుద్ధంలో సద్దాం హుస్సేన్ న్యూక్లియర్ వెపన్స్ ఉపయోగించాడు. ఇప్పుడు కూడా సద్దాం న్యూక్లియర్ వెపన్స్‌తో దాడి చేస్తాడేమోనని భయపడి మా హోటల్ యాజమాన్యం మాకు గాస్ మాస్క్‌లు కొనిచ్చి మమ్మల్ని సేఫ్‌గా ఉండమని హెచ్చరించింది.

మొదటి రోజు కువైటు సరిహద్దుల్లో అమెరికా సైన్యం మోహరించింది. యుద్ధం మొదలైంది. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాక్ ప్రయోగించే మిస్సైల్స్ కువైటు పట్టణం వైపు గాల్లో దూసుకుని వస్తున్నాయి. అమెరికా రాడార్లు అవి వచ్చే దిశను కనుగొని వెంటనే ఎదుర్కొని గాల్లోనే మధ్యలో వాటిని నిర్వీర్యం చేస్తున్నాయి.

మిస్సైల్స్ వచ్చే సమయంలో పట్టణంలోనూ వీధుల్లోనూ కంపెనీలలోనూ సైరన్లు అన్నీ అలర్ట్ అయిపోయి వెంటనే 'బొయ్'మనే శబ్దంతో ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నాయి. వెంటనే పరిగెత్తి వెళ్ళి సురక్షిత ప్రాంతంలో తలదాచుకోండి. బయట వుండకండి అనే

సంకేతాలు అవి అందిస్తున్నాయి. అలాగే వీధుల్లో పోలీస్ పెట్రోలింగ్ జీపులు మైకుల్లో బిగ్గరగా ప్రజల్ని జాగ్రత్తపడమని అరుస్తూ హెచ్చరిస్తున్నాయి. ఆ సమయంలో మాములుగా మా పనికి కేటాయించిన సమయాల్లో మా విధులను మేము యధావిధిగా నిర్వర్తిస్తూ అప్రమత్తంగా వున్నాం.

ఒక్కసారిగా చెవులు బ్రద్దలయ్యేటట్లు పెద్ద శబ్దంతో సైరన్లు అన్నీ మ్రోగడంతో అందరం ఉలిక్కిపడ్డాము. ఒక్క క్షణం ఏం చెయ్యాలో అర్ధంకాక నిశ్చేష్టులమై ఉన్నచోటే అలాగే నిలబడిపోయాం.

వెంటనే మైకులో రెస్క్యూ టీమ్ మెంబరు "చేస్తున్న పని ఆపి మెట్లదారిగుండా పరిగెత్తి క్రింద బేస్‌మెంట్లోకి వెళ్ళండి తొందరగా వెళ్ళండి" అంటూ హెచ్చరికలు చెపుతున్నారు. ఆ మాటలు చెవిన పడగానే తేరుకుని ఆ శబ్దాలతో చలనం మరిచిన నా శరీరాన్ని, వణికే కాళ్ళను, భయపడి స్పీడుగా కొట్టుకునే గుండెను స్వాధీనంలోకి తెచ్చుకుని ఒక్కసారిగా మెట్లదారిగుండా క్రిందకు పరిగెత్తాను. అపుడు నేను ఆరో ఫ్లోర్‌లో పనిచేస్తున్నాను. ఎవరు ఎక్కడ వున్నారో, ఏమయ్యారో, వస్తున్నారో, రాలేదో పడిపోయారో తెలియని పరిస్థితి ఏదీ అర్ధంకాని అయోమయం. పరిగెత్తి ప్రాణాలు కాపాడుకోవాలి. ముంచుకొచ్చే ముప్పునుండి తప్పించుకోవాలి అనే తాపత్రయం మాత్రమే మాలో వుంది.

అడుగులు తడబడుతున్నాయి. శరీరం వణుకుతోంది. మస్తిష్కం మొద్దుబారిపోయింది. గుండె వేగం పెరిగిపోయింది. చెమటలు వళ్ళంతా పట్టి బిందువులుగా నేలరాలుతున్నాయి. వెంటనే కదిలి దగ్గరలో వున్న "ఎగ్జిట్" డోర్ వద్దకు వెళ్ళి ఆ మెట్లదారిలో నుండి కిందికి బేస్‌మెంటుకు చేరాలని పరిగెత్తాను.

ఆ దారంతా, పరిగెత్తి కిందకి వచ్చేవారితోనూ, వారి ఏడుపులతో భయంతో కూడిన అరుపులతో నిండిపోయి వుంది. వారి ఏడుపులు అరుపులు నా గుండె దడను ఇంకా రెట్టింపు చేసాయి.

కాళ్ళు వణికిపోతున్నాయి. శరీరం తూలిపోతోంది. ఆ మెట్లు దిగడం కష్టమైపోతోంది. శక్తి అంతా నిర్వీర్యమై పోయి శరీరం గాలిలో తేలుతున్నట్లు వుంది. సైరన్లు ఇంకా చెవులు చిల్లులు పడేటట్లు నిర్విరామంగా మ్రోగుతూనే వున్నాయి. ప్రమాదం మిస్సైల్ రూపంలో తరుముకుని వస్తోంది. ఏ క్షణంలో ఆ మిస్సైల్ వచ్చి మా హోటల్‌లోని ఢీ కొడుతుందో, మమ్మల్ని అందరినీ బూడిద కుప్పలా మారుస్తుందో తెలియదు. ఆలోచన చేయడమే కష్టంగా వుంది.

ఏ ఫ్లోర్ వరకు దిగానో అర్ధం కావడం లేదు. ఇంకా ఎన్ని అంతస్తులు దాటాలో, ఎన్నిమెట్లు క్రిందకి దిగాలో తెలియడంలేదు. కళ్ళు కూడా మసకగా మారిపోతున్నాయి, కాళ్ళు తేలిపోతున్నాయి. ఇక అడుగు తీసి అడుగు క్రిందకి వెయ్యలేను అనిపిస్తోంది. అక్కడే కూలబడి పోయి ఊపిరి పీల్చుకోవాలనిపిస్తోంది.

ఎవరైనా వచ్చి అలా చేతుల్తో పట్టుకుని క్షణంలో కళ్ళు తెరిచి చూసేలోగా క్రింద్ బేస్‌మెంట్లో దింపితే బాగుండు అనిపిస్తోంది. మెట్లదారిలో అరుపులు, ఏడుపులు తగ్గిపోయాయి. అందరూ నాకంటే ముందుగా వెళ్ళిపోయినట్లున్నారు. మరి నేను ఒక్కదాన్నే ఇంకా ఇక్కడ మిగిలిపోయానేమో? మిస్సైల్ వచ్చేస్తే అన్యాయంగా నా ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. ఎలాగో కాళ్ళను శరీరాన్ని కదిలించి, వణికే గుండెను స్వాధీనం లోకి తెచ్చుకుని ఇంకొన్ని మెట్లు దిగితే సేఫ్ ప్లేస్‌లోకి వెళ్ళిపోతాను. కానీ ఎలా? కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. అడుగులు తడబడుతున్నాయి. ఉహూ.. ఇక నావల్ల కాదు. కన్నీళ్ళు చెంపలపై ధారలుగా కారిపోతూ స్వేదంతో కలిసి కిందకి జారుతున్నాయి. శరీరం పట్టు తప్పిపోయింది. అదిగో మిస్సైల్ దగ్గరికి వచ్చేసినట్లుంది. ఎలా? అంతా అయిపోయిందా? ఒక్క క్షణం సమస్తం స్థంభించిపోయినట్లు అనిపించింది. అపుడే ఎవరో వచ్చి చేతుల్తో పట్టుకున్నారు. కళ్ళు తెరిచి చూసేటప్పటికి బేస్‌మెంట్‌లోని కుర్చీలో కూర్చుని వున్నాను.

ఎవరో నా మొహాన కాసిని నీళ్ళు చిలకరించి బాటిల్‌లోని నీళ్ళను నా నోట్లోకి వంపుతూ "త్రాగు... కాసిన్ని నీళ్ళు త్రాగు. తేరుకుంటావు" అంటూ నా భుజంపై కొట్టి నన్ను నిద్రలేపుతున్నారు. బలవంతంగా నిద్రలోంచి మెలుకువలోనికి వచ్చినట్లుంది నా పరిస్థితి. ఓహ్.. ఇంకా బ్రతికే వున్నానా? నిజమా? కళ్ళు విప్పి తేరిపారచూసాను.

అక్కడ బేస్‌మెంట్లో పనుల్లోంచి పరుగెత్తి వచ్చి కూడుకున్న వారి అరుపులతో, ఏడుపులతో, మాటలతో గోలగోలగా వుంది పరిస్థితి. కొంతమంది భయంతో వెక్కివెక్కి ఏడుస్తున్నారు. మరికొందరు చలనం మరచి నిశ్చేష్టులై బిత్తరచూపులు చూస్తున్నారు.

వారినందరినీ చూసాక నేను బేస్‌మెంటులోని మా షెల్టరులో క్షేమంగా వున్నానని నాకు అర్థమైంది.

ఫైనాన్స్ డిపార్టుమెంటు సూపర్ వైజరు అయిన 'కమల్' నా ఎదురుగా నిలబడి నీళ్ళు త్రాగమని చెపుతూ నా వైపే ఆదుర్దాగా చూస్తున్నాడు. అతడే నన్ను రక్షించాడని, అక్కడికి చేర్చాడని నాకు తరువాత తెలిసింది.

"ఆర్యూ ఓకె నౌ? " అని అడుగుతున్నాడు కమల్ నన్ను.

ఓ.కె అన్నట్లు తలవూపాను నేను. నీళ్ళ బాటిల్ నాచేతికి అందించి "టేక్కేర్" అంటూ ఇంకా క్రిందకి చేరని వారికోసం వారిని కాపాడటం కోసం పరిగెత్తుకుంటూ మెట్లదారిగుండా పైన ఫ్లోర్‌లోకి వెళ్ళిపోయాడు.

రెస్క్యూ టీమ్‌గా ఏర్పడిన కొంతమంది మెంబర్స్ బేస్‌మెంటులో కూడా అక్కడికి వచ్చిన వారి పేర్లను లిస్ట్‌లో రాసుకుంటూ భయపడేవారికి ధైర్యం చెపుతూ ఇంకా అక్కడికి రానివారికోసం వెతుకుతూ బిజీగా వున్నారు.

ఇంతలో "జేన్" అనే ఒక ఫిలిప్పిన్ అమ్మాయిని భుజాన వేసుకుని రొప్పుతు మెట్లదారిగుండా క్రిందకి వచ్చాడు కమల్. "ఏమయింది జేన్‌కి? " అంటూ అందరు గుమికూడి ఆదుర్దాగా ప్రశ్నించారు. ఆ అమ్మాయి తలకు దెబ్బతగిలినట్లుంది. ధారలుగా రక్తం కారుతోంది.

"రెండో అంతస్తులోని మెట్ల దగ్గర పడిపోయివుంది. తలకు దెబ్బతగిలి స్పృహ కోల్పోయినట్లుంది. సమయానికి వెళ్ళి చూసి, క్రింది మోసుకుని వచ్చాను" చెపుతున్నాడు కమల్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కోసం ప్రక్కనే వున్న టేబుల్ అరలో వెతుకుతూ.

అందరూ అతన్ని అభినందిస్తున్నట్లుగా భుజంపై తట్టి మంచిపని చేసావు అని మెచ్చుకున్నారు.

ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తెచ్చిన టీమ్ ఆ అమ్మాయి తలకు మందురాసి కట్టుకట్టారు.

ఎవరో వచ్చి జ్యూస్‌ను తాగించారు. కాసేపటికి 'జేన్'తేరుకుంది. కృతజ్ఞత నింపుకున్న కళ్ళతో కమల్ వైపు చూసి "థాంక్యూ కమల్" అంది బదులుగా. అతడు ఒక నవ్వు నవ్వి నడుచుకుంటూ నా దగ్గరికి వచ్చాడు.

"హౌ ఆర్యూ?" అని అడిగాడు.

బాగున్నాను అన్నాను.

"అయితే ఇంకా ఇక్కడే కూర్చుని వున్నావే? లేచి పనిలోకి వెళ్ళచ్చుకదా? " అన్నాడు టీజింగ్‌గా. నాకు కాస్త కోపం వచ్చి లేచి నా పనిలోకి వెళ్ళిపోయాను. ఈలోపల టీవీలో న్యూస్ వచ్చింది. యుద్ధ విశేషాలను తెలియజేసింది. "ఇరాక్ ప్రయోగించిన మిస్సైల్స్‌ను అన్నింటినీ అమెరికా తెలివిగా తిప్పి కొట్టి నిర్వీర్యం చేసిందని. ప్రస్తుతం కువైటు పట్టణానికి వచ్చిన ప్రమాదం ఏమీలేద"ని ఆ వార్తలు తెలియచేసాయి.

అందరూ హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు. "శక్తికల దేశమైన అమెరికా మనకు అండగా వుండగా మనకు వచ్చిన ప్రమాదం ఏమీలేదు. భయపడకండి" అంటూ రెస్క్యూ టీమ్ మెంబర్స్ అందరికీ ధైర్యం చెప్పారు.

కాస్త ధైర్యం తెచ్చుకున్న వారందరూ అక్కడినుండి లేచి కొందరు లంచ్ చేయడానికి కెఫెటేరియాకు, మరికొందరు పనిచేయడానికి పైన అంతస్తులలోనికి వెళ్ళిపోయారు.

దాదాపు ఒంటిగంట కావస్తుండగా నేనుకూడా చేస్తున్న పనిని ఆపి లంచ్ కోసం కెఫిటేరియాకు వెళ్ళాను. జరిగిన సంఘటనలతో మనసు భయాందోళనలకు గురికాగా ఆకలి లేకపోయినా అన్యమనస్కంగా ఆలోచిస్తూ ఏదో కాస్త తింటున్నాను.

ఇంతలో ట్రేలోని అన్నంతోపాటు వచ్చి నా ఎదురుగా ఖాళీగా వున్న కుర్చీలో కూర్చున్నాడు కమల్. అతను రావడం చొరవగా వచ్చి నా దగ్గర కూర్చోవడం నాకెందుకో అనీజీగా అనిపించింది.

"మధ్యాహ్నం నువు బాగా భయపడ్డావా?" అన్నాడు నవ్వుతూ.

"లేదు" అన్నాను తడబడుతూ (నిజం చెప్పడానికి సిగ్గేసింది)

ఒక్కసారిగా నవ్వుతూ "అబద్ధం చెబితే అతికినట్లుండాలి. ఓకే"

"ఒకటో అంతస్తులోని మెట్లమీద కూర్చుని కళ్ళుమూసుకుని వణికిపోతుంటే నిన్ను క్రిందకి తీసుకొచ్చాను తెలుసా?" అన్నాడు.

"థాంక్యూ సోమచ్" అన్నాను మనస్ఫూర్తిగా.

"నువు వెజిటేరియన్‌వా? నీ ప్లేట్‌లో దాల్, సలాడ్ తప్ప, చికెన్, మటన్ కనిపించడంలేదే?" అన్నాడు.

"అవును వెజిటేరియన్‌నే" అన్నాను. అతని ప్లేట్‌లోని మటన్‌ని ఓరకంటితో గమనిస్తూ.

"మీ ఇండియాలోని హిందూస్ చాలామంది నాన్ వెజ్ తినరు. అదేంటో? నాన్‌వెజ్ చాలా రుచిగా వుంటుంది తెలుసా?" అన్నాడు ఆనందంగా ప్లేట్‌లోని మటన్ ను తింటూ.

"అయితే మీరు ఇండియన్ కాదా? ఎక్కడివారు? " అని ప్రశ్నించాను నేను.

"ఐ యామ్ ఫ్రమ్ పాకిస్తాన్" అన్నాడు గొప్పగా ఎంతో గర్వంగా.

అతను చెప్పిన జవాబు వినగానే నాకెందుకో అసహనంగా అనిపించి వెంటనే అక్కడినుండి వెళ్ళిపోవాలి అనిపించింది. కానీ సభ్యత కాదని బలవంతంగా అక్కడే కూర్చున్నాను. "మన ఇరుదేశాలమధ్య శత్రుత్వం వున్నా కూడా. ఇకనుండి మనం ఫ్రెండ్స్. ఓ.కె" అంటూ నవ్వుతూ షేక్ హాండ్ కోసం తన కుడిచేతిని అందించాడు. చేతిలోని స్పూనును ప్లేట్‌లో వదిలేసి ఇష్టం లేకపోయినా(మనసులో మాత్రం ఇతనితో ఇక మాట్లాడకూడదు అనుకుంటూ) బలవంతంగా చేతిని అతనికి అందించాను.

తినడం పూర్తికాగానే ట్రే చేతిలో పట్టుకుని "ఎక్స్‌క్యూజ్‌మీ ఇక నేను వెళ్తాను" అంటూ కుర్చీలోనుండి పైకి లేచాను.

"సరే కానీ.. ఈసారి సైరన్లు మ్రోగితే జాగ్రత్తగా ధైర్యంగా మెట్లు దిగిక్రిందికి రా, వణికిపోతూ అక్కడే కూర్చున్నావనుకో. నిన్ను వెదకడానికి క్రిందికి తీసుకురావడానికి ప్రతిసారీ కుదరదు" అన్నాడు కాస్త హేళనగా. అతడి మాటల్లోని హేళనకు నాకు కాస్త కోపం వచ్చింది. జవాబు చెప్పకుండా అక్కడినుండి వెళ్ళిపోయాను. మరలా ఎపుడూ అతనితో మాట్లాడకూడదని నిశ్చయించుకున్నాను నేను. ఎందుకో అతడి మాటలు, ప్రవర్తన, చాలా ఇబ్బంది కరంగా వున్నాయి.

దాదాపు నాలుగు గంటల సమయంలో మరలా మిన్ను విరిగి మీదపడినట్లు "బొయ్" మంటూ మా హోటల్లోని, వీధుల్లోని సైరన్లు అన్నీ ఆన్ అయి అపాయాన్ని సూచిస్తూ ప్రమాద ఘంటికల్లా బిగ్గరగా మ్రోగాయి. ఆ శబ్దాలతో చెవులే కాదు. దిక్కులన్నీ పిక్కటిల్లి పోతున్నాయి. హార్ట్ పేషెంట్లయితే క్షణంలో గుండె ఆగి చనిపోతారేమో?

ఆ సైరన్ల మ్రోతలు చెవినబడగానే మళ్ళీ అదే పరిస్థితి. గుండెవేగం పెరిగిపోయింది. ప్రాణాలు అరచేతుల్లో పట్టుకుని ఆరో ఫ్లోర్ నుండి మెట్లదారిగుండా క్రిందకి పరుగే పరుగు. (ఎమర్జన్సీ సమయాల్లో లిఫ్టును ఉపయోగించకూడదు)

ముప్పు ముంచుకొస్తోంది. ప్రమాదం తరుముకుని వస్తోంది. క్షణాలో? నిముషాలో తెలియదు. కనురెప్ప మూసి తెరిచేటంతలో సమస్తాన్ని సమూలంగా తుడిచి పెట్టేస్తుంది. శవమైనా దొరుకుతుందో లేదో చెప్పడం కష్టం.

పరుగే .. పరుగు. ఒకటే పరుగు. ఆ మెట్లమీద అడుగు తడబడిందా? పొరపాటుగా ప్రక్కన పడిందా? అంతే సంగతులు. కాళ్ళూ చేతులే కాక నడుముకూడా విరిగిపోవడం, అక్కడినుండి దొర్లుకుంటూ బేస్‌మెంట్‌లోకి చేరుకోవడం ఖాయం.

కానీ కమల్ మాటలు, నవ్వు, హేళన గుర్తొచ్చి, భయాన్ని, ఆందోళనను కాస్త అణచుకుని ఎలాగో పరిగెత్తుకుంటూ ఆయాసంతో వగరుస్తూ చెమటలు కార్చుకుంటూ సెల్లార్ లోకి వచ్చిపడ్డాను. అక్కడే ఖాళీగా వున్న ఒక కుర్చీలో కూర్చుని చుట్టూ పరికించి చూసాను. వదు అనుకుంటూనే నా కనులు కమల్ కోసం చుట్టూ వెతుకుతున్నాయి. నా భయం చూసి మళ్ళీ నవ్వుతాడేమో అని కంగారు పడుతున్నాను. అయినా ఇలాంటి విపత్కర పరిస్థితిలో యుద్ధ సైరన్లు మ్రోగుతుంటే మనుషులు భయపడక, ఎలా ధైర్యంగా వుండగలరు ఇదేమైనా చిన్న విషయమా?

ఇంకా పైన అంతస్తుల్లోని కొందరు పరిగెత్తుకుంటూ క్రిందకి వచ్చి చేరుతున్నారు. వాలంటీర్లు అందరూ వారి పేర్లను లిస్ట్‌లో వెతుకుతూ రాసుకుంటున్నారు. ఏడ్చేవారిని భయంతో ఒణికిపోయేవారినందరినీ ధైర్యం తెచ్చుకోమని కామ్‌గా కూర్చోమని, నీళ్ళు త్రాగమని చెపుతూ వాలంటీర్లు అందరినీ ఓపికగా సముదాయిస్తున్నారు. రానివారికోసం టీమ్ మెంబర్సు వెతుకుతున్నారు.

ఇంతలో అరవై ఏళ్ళ పెద్దాయన పెద్దగా అరుస్తూ గుడ్లు మిటకరిస్తూ ఫిట్స్ వచ్చినట్లుగా విలవిల్లాడిపోతున్నాడు. రెస్క్యూ టీమ్ అంతా ఆయన చుట్టూ గుమికూడారు. మా హోటల్ నర్సు ఆయనకు ప్రథమ చికిత్స చేయడానికి పూనుకుంది. ఆగకుండా మ్రోగే సైరన్ల శబ్దాలకు, అక్కడి వాతావరణానికి, ఆయన పరిస్థితికి భయపడి, బెంబేలు పడిన కొందరు ఒక్కసారిగా ఏడ్వటం ప్రారంభించారు. అమ్మాయిలైతే అధైర్యంతో ఆపకుండా వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తున్నారు.

ఓరిదేవుడా! ఏంటీ విషమ పరిస్థితి? బ్రతికుంటే మనదేశంలో బలుసాకు తిని బ్రతకచ్చు. ఈ భయంకరమైన పరిస్థితి వద్దురా బాబూ! అదిరిపోయే గుండెలు ఏ క్షణాన ఆగిపోతాయో తెలియడం లేదు. ఈ కువైటు వద్దు. ఈ డబ్బు వద్దు. వెంటనే ఇండియా వెళ్ళిపోతే బాగుండు. పరిస్థితి ఇంత ఘోరంగా వుంటుందని ముందే తెలిసి వుంటే టిక్కెట్టు బుక్ చేసుకుని ఫ్లయిట్ ఎక్కి ఎంచక్కా ఇంటికి వెళ్ళిపోయేదాన్ని. యుద్ధమంటే ఇంత భయాన్ని, దుఃఖాన్ని కలిగిస్తుందని ముందే తెలియలేదు కదా? మరి ఇపుడు ఎలా? ఇండియా ఎలా వెళ్ళాలి? ఫ్లయిట్స్ అన్నీ రద్దు చేసారుకదా? దేశం దాటి బయటికి వెళ్ళేమార్గం, లోనికి వచ్చే మార్గం అన్నీ మూసుకుని పోయాయి. చావైనా, బ్రతుకైనా ఇక్కడే ఇలాగే తేల్చుకోవాలి. యుద్ధం ముగిసిందాకా బ్రతికి వుంటే ప్రాణాలతో మిగిలి వుంటే అపుడు ఇండియా గురించి ఆలోచించాలి. అంతవరకూ ఇంతే. అందరూ ఏడుస్తుంటే నాక్కూడా ఏడుపు తన్నుకొస్తోంది. గుండెను దడదడలాడించి, శరీరాన్ని వణికించే ఆ సైరన్ల మ్రోత ఇంకా ఆగలేదు. మృత్యువు పొంచి వుందనే సంకేతాన్ని అతి పెద్ద శబ్దంతో అది వెలువరిస్తూనే వుంది.

బాగా ఏడ్చి గుండెల్లోని భారాన్ని దింపుకోవాలి అనిపిస్తోంది. నాకు తెలియకుండానే కన్నీళ్ళు చెంపలపై కాలిపోతున్నాయి. చుట్టూవున్న వాతావరణం అలా వుంది. ఎంత ధైర్యంగా వుందామన్నా శరీరం, హృదయం మాట వినడంలేదు. ఎందుకో. ఆ సమయంలో నా చుట్టూ అందరూ వున్నా కూడా ఒంటరిగా వున్నాను అనిపించింది. దుఃఖం ముంచుకొచ్చింది.

ఇంతలో టీవీలో వార్తలు వచ్చేసాయి. సంతోషకరమైన విషయాన్ని వెల్లడించాయి. యధావిధిగా ఇరాక్ నుండి వచ్చిన మిస్సైల్‌ను అమెరికా సైన్యం గాల్లోనే గమ్యం చేరకుండానే నిర్మూలించింది. సైరన్ల మోతలు ఆగిపోయాయి. కొంతసేపటికి తేరుకున్న వారందరూ అక్కడ నుండి లేచి తమ పనుల్లోకి వెళ్ళసాగారు. కన్నీళ్ళు తుడుచుకుంటూ నేను కూడా వాళ్ళతోపాటు బయటికి వచ్చి లిఫ్ట్ కోసం ఎడమవైపు తిరిగాను. లిఫ్టుకు ఎదురుగా వున్న స్థలంలోని టేబుల్ ముందు కూర్చుని సీరియస్‌గా అసోసియేట్ లిస్ట్ తయారు చేస్తున్న కమల్ తలెత్తి చూసి "అయ్యో - చిన్నపిల్లలా ఏడుస్తున్నావా?" అన్నాడు.

వెళ్ళేముందు ఇతని కంటబడ్డాను. ఏడుస్తూ ఇతనికి చిక్కిపోయాను అనుకుంటూ "ఏంటి? ఈ యుద్ధాన్ని సైరన్ల మోతలను, అందరి ఏడుపులను చూస్తుంటే మీకు భయం కలగడం లేదా? " అని ప్రశ్నించాను.

"ఎందుకు భయం? చచ్చిపోవడం మన చేతుల్లో వుందా? అంతా 'అల్లా' దయ" అన్నాడు.'హ

ఆరో ఫ్లోర్‌లోనికి వెళ్ళడానికి లిఫ్ట్ రావడంతో అతనితో మాటలు చాలించి నేను వెళ్ళిపోయాను.

అక్కడ ఆరోఫ్లోర్‌లో కనిపించిన దృశ్యం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. జర్నలిస్టులు, వీడియోగ్రాఫర్లు, న్యూస్ రిపోర్టర్స్ బాల్కనీలో, ఆరుబయట నిలబడి, టెర్రెస్ పైకి చేరి న్యూస్‌ను షూట్ చేస్తున్నారు. హడావిడిగా కెమేరాలు చేతబట్టుకుని తిరుగుతూ వున్నారు - "సైరన్లు మ్రోగినపుడు మీరు బేస్‌మెంటులోకి వెళ్ళలేదా? మీకు భయంలేదా? ప్రమాదం పరిగెత్తి వస్తుంటే మీ ప్రాణాల్ని రక్షించుకోవాలని లేదా? " అని ప్రశ్నించాను ఆదుర్దాగా.

వరుసగా అడిగిన నా ప్రశ్నలకు జవాబుగా వాళ్ళు ఒక నవ్వు నవ్వి "మాకు ఇదంతా మామూలే, న్యూస్ కవర్ చేసి వెంటనే మా ఛానెల్‌కి పంపించకపోతే మేము ఇక్కడికి వచ్చిన పని వ్యర్థం కదా? మా ఉద్యోగాలు అలాంటివి. ఎప్పటికప్పుడు జరిగే సంఘటనలను తాజాగా ముందుగా కవర్ చేసి పంపిస్తే మేము అంత ఫేమస్ అవుతాం. మా ప్రాణాలకు తెగించే మేము ఈ ఉద్యోగాల్లో చేరాం. రిస్క్ తీసుకోకపోతే న్యూస్ అందించలేం కదా" అన్నారు.

"మరి సైరన్లు మ్రోగుతుంటే మిస్సైళ్ళు గాలిలో దూసుకుని వస్తుంటే మీకు భయంకలగదా?" అని అడిగాను.

"మా ప్రొఫెషన్ అలాంటిది. మేము భయం గురించి మరిచిపోయాం. ప్రపంచం నలుమూలల్లో ఎక్కడ ఏమి జరిగినా వెంటనే మేం అక్కడికి చేరుకుంటాం. అక్కడ జరిగే విషయాల్ని, వార్తల్ని సేకరించి వెంటనే షూట్ చేసి, మాటల ద్వారా వీడియోల ద్వారా, మా ఛానెల్‌కి చేరవేయడమే మా పని. అందుకే మేము ఈ పనికి కమిట్ అయ్యాం. నువు పని చేసే ఆరోఫ్లోర్‌లోని ఇరవై రెండో నంబరు రూములో వుండేది ఎవరనుకున్నావు? ప్రఖ్యాతిగాంచిన బి.బి.సి న్యూస్ రిపోర్టరు ఆయన. తెలుసా? " అంటూ వారి పనిగురించి వివరించి చెప్పారు.

అపుడు అర్ధమయింది నాకు. వారందరూ ఎందుకు అక్కడ వున్నారో? ఎందుకు అక్కడికి (కువైటుకు) వచ్చారో? మా హోటల్లోని రూములన్నీ ఖాళీలేకుండా ఎందుకు నిండిపోయామో?

వారిని చూసి పని పట్ల వారికున్న అంకితభావాన్ని, వారి ధైర్యాన్ని తెగువను గమనించిన నేను కూడా కాస్త ధైర్యం తెచ్చుకున్నాను. ప్రాణం కోసం అంతగా భయపడనవసరం లేదనిపించింది.

తరువాత ఆ రోజు సాయంత్రం రెండు సార్లు, ఆ రాత్రిపూట రెండుసార్లు సైరన్లు మ్రోగాయి. మేం అందరం ఆ సమయంలో క్రింద సెల్లార్‌లోనికి సురక్షిత ప్రాంతంలోనికి పరుగెడుతుంటే, జర్నలిస్టులు, రిపోర్టర్లు, వారి కెమేరాలు చేతబట్టుకుని పరిస్థితుల్ని

సమీక్షించడానికి వార్తను సేకరించడానికి, ఫోటోలు, వీడియోలు తీయడానికి పదహారో ఫ్లోర్‌లోని హోటల్ పైభాగానికి పరిగెడుతున్నారు. వారికీ మాకూ ఎంత తేడా వుంది అనిపించింది.

మరుసటిరోజు డ్యూటీలో వుండగా అమెరికా సైనికులు (ఆర్మీ) కొందరు తమ బ్యాగ్స్ సర్దుకుని తమ రూములు విడిచి బయటకి వెళ్ళిపోతున్నారు. ఈ యుద్ధ సమయంలో హోటల్‌ను విడిచి ఎక్కడికి వెళుతున్నారో అని కంగారు పడిన నేను "సర్.. ఈ ప్రమాదకర పరిస్థితిలో మీరు ఎక్కడికి వెళుతున్నారు?" అని ప్రశ్నించాను.

"మేము అమెరికా సైనికులం. యుద్ధం చేయడానికి మేము ఇక్కడికి వచ్చాం. తిని హోటల్ రూములో కూర్చోడానికి కాదు. అక్కడ కువైటు ఇరాక్ బార్డర్‌లోకి మొన్న వెళ్ళిన మా ఆర్మీ యుద్ధం చేస్తోంది. మేం వెళ్ళి వారిని విశ్రాంతి కొరకు ఇక్కడికి పంపించి ఆ యుద్ధాన్ని మేము కంటిన్యూ చేస్తాం. అలా బ్యాచ్‌లుగా ఏర్పడి యుద్ధాన్ని మేము కొనసాగిస్తాం. ప్రాణంతో బ్రతికి వుంటే రెండురోజుల తరువాత విశ్రాంతి కొరకు మరలా ఇక్కడికే వస్తాం. అపుడు మళ్ళీ కలుద్దాం. నువు జాగ్రత్త. బై" అంటూ బ్యాగులు భుజాన వేసుకుని గన్‌లు చేతబట్టుకుని ఠీవిగా నడుచుకుంటూ యుద్ధానికి వెళ్ళిపోయారు.

నాకు తెలియని క్రొత్త విషయాలు ఎనో వింటూ ఎంతగానో వారి సాహసాన్ని అభినందించి సేఫ్‌గా త్వరలో తిరిగి రమ్మని, చెపుతూ భారమైన హృదయంతో వారికి వీడ్కోలు పలికాను.

అలా మూడురోజులు గడిచేటప్పటికి సైరన్ల మోతలు, ఆ పరిస్థితులు, పరుగులు మాకు అలవాటు అయ్యాయి. భయం పోయింది.

అప్పటికే అమెరికా సైన్యం బలంతో ఇరాక్‌లోనికి చొచ్చుకునిపోయి బ్రాసా పట్టణాన్ని లోబరుచుకుని, అక్కడనుండి ఇంకా ముందుకు వెళ్ళి "టిక్రిట్" అనే పట్టణాన్ని కూడా ముట్టడి వేసింది. ఇక బాగ్దాదును జయించి అక్కడ తమ జండాను ఎగురవేయడం చాలాదగ్గరలో వుందని అమెరికా తెలియజేసింది.

ఇరాక్ వద్ద ఊహించని రీతిలో అణ్వస్త్రాలు, మిస్సైల్స్ లేవని. ఇంక ఎక్కువగా అది ప్రతిఘటించే స్థాయిలో లేదనీ కొద్దిరోజుల్లో సద్దాంను పట్టుకోవడం ఖాయం అనే వార్తలు వచ్చాయి.

కువైటు దేశానికి, అందులో నివశించే వారికీ ఏ ప్రమాదము లేదని తెలిసి పోయాక అందరూ సంతోషంగా ఊపిరి పీల్చుకున్నారు.

కానీ.. నాలుగోరోజున ఉదయం మూడుగంటల ప్రాంతంలో ఇరాక్ ప్రయోగించిన ఒక చిన్న మిస్సైల్ దారితప్పి, అమెరికా రాడార్లను సైతం తప్పించుకుని తక్కువ ఎత్తులో పయనించి వచ్చింది. "షరఖ్" ప్రాంతంలోని సముద్రతీరంలో పెద్ద శబ్దంతో పడి అక్కడ వున్న ఒక పురాతన మసీదును నాశనం చేసింది. ఆ పరిసర ప్రాంతంలో వున్న ఒక వ్యక్తికి చిన్నపాటి గాయాలు అయ్యాయని తెలిసింది.

ఆ ఉదయం మూడుగంటల సమయంలో అందరం గాఢనిద్రలో వున్నాం. మిస్సైల్ పడిన ఆ పెద్ద శబ్దానికి నాకు మెలుకువ వచ్చింది. ఉలిక్కిపడి నిద్రలేచాను. పెద్దశబ్దంతో దగ్గర ప్రాంతంలో ఏదో పడిందని నాకు బాగా అర్థమయింది. మరి దానివల్ల ఏం జరిగిందో? ఎవరికన్నా ప్రమాదం సంభవించిందో, ఎన్ని బిల్డింగులు కూలిపోయాయో అర్ధంకాలేదు. వెంటనే టి.వి ఆన్ చేసి అప్ టు డేట్ చేసే ఎమర్జన్సీ వార్తలను చూసాను.. వార్తల్లో ఆ విషయం గురించి, శబ్దం గురించి ఏమీ చెప్పలేదు. ప్రక్కబెడ్ మీద నిద్రపోతున్న నా కొలీగ్‌ను కూడా నిద్రలేపేసి కంగారుపడుతూ. "పెద్ద శబ్దంతో ప్రక్క ప్రాంతంలో ఏదో పడినట్లు వుంద"ని చెప్పాను.

ఆ అమ్మాయి "అంతా నీ భ్రమ నిద్రలో కలగని వుంటావు" అలా ఏదైనా జరిగివుంటే టీవీలో వార్తలు ప్రకటిస్తాయి కదా - కంగారు పడకుండా పడుకో" అని అటు తిరిగి పడుకుని నిద్రపోయింది.

నేను కూడా ఆ విషయం గురించే ఆలోచిస్తూ మరలా నిద్రలోకి జారుకున్నాను.

తెల్లవారి డ్యూటీలోకి వచ్చాక మా హోటల్లోని జర్నలిస్టులు, న్యూస్ రిపోర్టర్సు నాకు ఆ విషయం చెప్పి అది నా కల కాదని, నిజమే అని నిర్ధారించారు.

ఆ మూడుగంటల ప్రాంతంలో వాళ్ళందరూ ఆ మిస్సైల్ పడిన ప్రాంతానికి వెళ్ళి, ఫోటోలు, వీడియోలు తీసుకున్నారట. ఆల్రెడీ న్యూస్‌ను కూర్చి వారి ఛానెల్స్‌కు పంపించేసారట. ఎవరికి కూడా ఏ ప్రమాదం కలగలేదని వినగానే నేను సంతోషించాను. అమెరికా అతి తక్కువ ఎత్తులో పయనించి వచ్చిన ఆ మిస్సైల్‌ను కనుగొనలేక పోయిందట. ఆ తరువాతి రోజుల్లో అపుడపుడూ అడపాదడపా మ్రోగే సైరన్లకు మేము బాగా అలవాటు పడిపోయాము.

2003 మార్చి 19 నుండి ఏప్రిల్ 9 వరకూ. దాదాపు 20 రోజుల పాటు జరిగిన ఆ యుద్ధంలో చివరికి అమెరికా చరిత్రలోనే ప్రఖ్యాతి గాంచిన "బాగ్దాదు" పట్టణాన్ని ఆక్రమించుకుని అక్కడ తమ విజయబావుటాను ఎగురవేసింది.

యుద్ధం ముగియగానే తమ స్వదేశాలకు వెళ్ళిపోయిన వారందరూ ఒక్కొక్కరు తిరిగి వచ్చి తమ విధుల్లో జాయిన్ అయ్యారు.

యుద్ధానికి భయపడకుండా కువైటులోనే వుండి, తమ విధులను నిర్వర్తించిన మాకందరికీ ప్రశంసా పత్రంతోపాటు సగం నెల జీతాన్ని బోనస్‌గా మా యాజమాన్యం ఇచ్చి మమ్మల్ని అభినందించారు.

కమల్ అపుడపుడూ కెఫిటేరియాలో కనిపించినపుడు ఆ యుద్ధ సమయంలో సైరన్లు మ్రోగినపుడు నేను వణికిపోయి భయపడిన స్థితిని గుర్తుచేస్తూ నన్ను టీజ్ చేస్తూ నవ్వుతూ వుంటాడు.

అయితే ఇరవైరోజుల్లో ఇరాక్ అమెరికా వశమయినప్పటికీ ఆ తరువాత సద్దాం హుస్సేన్‌ను పట్టుకోవడానికి అమెరికా సైన్యాలకు తొమ్మిదినెలల కాలం పట్టింది. 2003 డిసెంబరు 13 వ తేదీన తాను పుట్టిన తన స్వంత పట్టణమైన "టిక్రిట్"లోని ఒక ఇంటిలోని గోతిలో (నేలమాళిగ) తలదాచుకుని దీనంగా కాలం గడుపుతున్న "సద్దాం"ను చివరికి అమెరికా కనుక్కొని పట్టుకుంది. ఆయనను విచారించి నేరాలన్నింటినీ పరిశోధించి 2006 డిసెంబరు 30 వ తేదీన "సద్దాం"ను ఉరి తీసారు. కొన్ని ఏళ్ళుగా కువైటు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన ఒక నియంత జీవితం అలా ముగిసిపోయింది. `సద్దాంను` ఉరి తీసాక కువైటు ప్రజలు నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నారు

## *ఒక అమ్మ కథ*

**కళ్ళ వెంబడి** కారే కన్నీళ్ళతో తడిచిన లేత బుగ్గలతో, వచ్చీరాని మాటలతో అమ్మా.. అమ్మా అని పలవరిస్తూ ఒకటే ఏడుపు. ఆపకుండా ఏడుస్తూ వదలకుండా వెంటబడుతూ విడవకుండా వెంబడిస్తూ "అమ్మా! నువు వెళ్ళద్దు. అమ్మా! నన్ను విడిచి వెళ్ళొద్దు" అని దీనంగా బ్రతిమలాడుతూ ఆగకుండా వెనకే పరిగెడుతున్నాడు.

తీరని దుఃఖం గుండెల నిండా పొంగి పొరలి పైకి ఎగిసిపడుతుండగా ఊపిరి పీల్చుకోడానికోసం మధ్యలో వెక్కిళ్ళు పెడుతూ పరిగెడుతూ రెండు చేతులూ సాచి అమ్మను అందుకోవాలనీ, ఆఖరికి ఆమె పమిట కొంగునైనా తన చేతిలో చిక్కించుకోవాలనీ తాపత్రయ పడుతున్నాడు.

ఎలాగైనా సరే వెళ్ళిపోయే అమ్మను పట్టి ఆపాలని ప్రయత్నిస్తూ పరిగెడుతూ ఆయాసంతో ఒగరుస్తూ, దూరంగా గాలిలో తేలుతూ మబ్బులతో పాటు పయనిస్తూ ఎక్కడో వున్న ఎడారి దేశానికి ఎగిరి వెళ్ళిపోయే అమ్మను అందుకోలేక, అడ్డుగా వున్న రాళ్ళను, ముళ్ళను అధిగమించలేక అదుపు తప్పి బోర్లాపడిపోయాడు.

దెబ్బ బాగా తగిలినట్లుంది. రెండు మోకాళ్ళూ అక్కడ వున్న రాళ్ళపై పడి గాయాలతో రక్తసిక్తమై పోవడంతో నొప్పికి తాళలేక "అమ్మా" అంటూ ఆఖరిసారిగా గొంతు చించుకుని బిగ్గరగా కేకవేసాడు చిన్నా.

మోకాళ్ళకు తగిలిన గాయాలకన్నా, తన అమ్మ తనను విడిచి ఎక్కడికో దూరంగా వెళ్ళిపోతోందనే గుండెలోని బాధ మరింత ఎక్కువై ఆ పసివాడి హృదయాన్ని విలవిలలాడించింది. హోరుగాలిలో తుఫానులో చిక్కుకుపోయిన చిగురుటాకులా తల్లడిల్లిపోయాడు చిన్నా.

పడిన చోటునుండి లేవలేక, పైకి లేచి అమ్మ వెనుక పరిగెత్తే శక్తి లేక వెళ్ళిపోయే అమ్మను ఆపలేక ఏ మార్గమూ కనపడక అలాగే నేలపై నిస్సహాయంగా పడుకుని రోదిస్తున్నాడు ఆ పసివాడు.

ఆ క్షణంలో ఆ పసివాడి అంతరంగంలో చెలరేగే కల్లోలం మాటల్లో చెప్పలేనిది. తానేం తప్పు చేసాడో? ఎందుకు అమ్మ తనని విడిచి దూరంగా వెళ్ళిపోతోందో అర్ధం కాని వయసు. ఎవరిమీదో తెలియని కోపంతో నిస్సహాయతతో, నిస్సత్తువతో రోషంతో గుండెలు అదిరి పడుతున్నాయి. అమ్మలేని ప్రపంచం శూన్యమై పోయినట్లు, కళ్ళముందున్న వెలుగుమాయమై, చీకటి కమ్ముకున్నట్లు అనిపించింది. కొండంత బాధ ఆకాశమంతటి ఆవేదన, సంద్రమంతటి దుఃఖం పొంగిపొరలాయి ఆ పసివానిలో.

కన్నబిడ్డ కిందపడిపోవడంతో, కడుపులోని కన్నపేగు కదిలినట్లయిన ఆ తల్లి ఒక్క క్షణం అక్కడే ఆగిపోయి కంగారుగా వెనుదిరిగి చూసింది. "వద్దు. చూడకు.. వెనుతిరగకుండా ముందుకు వచ్చెయి" అని కొన్ని గొంతులు ఆమెను పట్టి ఆపాయి. ముందుకే వెళ్ళిపొమ్మని కఠినంగా ఆజ్ఞాపించాయి. కానీ ఎంతైనా కన్నతల్లి బిడ్డ దుఃఖం కాళ్ళకు బంధాలు వేసింది. ముందుకు సాగే అడుగుల్ని బలవంతంగా వెనక్కి తిప్పి పరిగెత్తుకుంటూ ఒక్కంగలో తన బాబును చేరుకుని "అయ్యో, నా చిన్ని నాన్నా! పడిపోయావా? " అంటూ రెండు చేతుల్తో బిడ్డను పట్టి పైకి లేవనెత్తి ఆర్తిగా తన హృదయానికి హత్తుకుంది.

చలనం లేదు. కదలడం లేదు. కనీసం కనులు విప్పి చూడటం లేదు. కన్నీటి వరదలా మారింది ఆ తల్లి.

అయ్యో! ఏమయింది నా బాబుకు? ఇంతవరకూ ఏడుస్తూ అరుస్తూ అమ్మా అని పిలుస్తూ వెనుకే పరిగెత్తిన బిడ్డకి ఇంతలో ఏమయింది? "బాబూ నా బాబూ కళ్ళు తెరువు నాన్నా. నాతో మాట్లాడు కన్నా.. ఇదిగో నీ అమ్మను నేను. నీకోసం వెనక్కి వచ్చేసాను. నోరు తెరిచి ఒక్క మాట మాట్లాడరా. అమ్మా అని ఒక్కసారి పిలవరా నాన్నా. " చేతుల్తో పట్టి కుదుపుతోంది బాబును. ఏడుస్తూ బ్రతిమాలుతూ "బాబూ ఏమయింది నీకు? ఒక్కసారి కళ్ళు తెరిచి అమ్మను చూడు" అంటూ గట్టిగా అరుస్తోంది ఆమె. అలా అరుస్తూనే వుంది.

ఒక్కసారిగా మెలుకువ వచ్చి కళ్ళు తెరిచి చూసేటప్పటికి డిమ్‌గా వెలుగుతున్న బెడ్‌లైట్ కాంతిలో పైన వున్న తెల్లటి సీలింగ్ కనిపించింది. తాను ఎక్కడ వుందో అర్ధంకాలేదు. భయంతో వణికిపోతోంది శరీరం. కదలాలంటే శక్తి సరిపోవడంలేదు. దాహంతో నాలుక పిడుచకట్టుకుపోతోంది. సెంట్రల్ ఏసి. చిన్న చప్పుడుతో పనిచేస్తూ చల్లదనాన్ని ఆ గదిలో నింపుతోంది. అయినా కూడా ఆమె వళ్ళంతా చెమటలతో నిండిపోయింది. ఒక్కక్షణం. బలవంతంగా ప్రక్కకి వత్తిగిలి ఇటు వైపు చూసిందామె.

విశాలమైన ఆ గదిలోనే అటువైపు గోడకు వున్న మంచంపై వరసకు అత్త అయే మంగమ్మ అనే ఆవిడ పడుకుని గాఢనిద్ర పోతోంది. ఆ వైపు ఎదురుగా వున్న అలమరా తలుపులపై అంటించి వున్న ఏసుక్రీస్తు బొమ్మ చిన్న చిరునవ్వుతో, ప్రశాంతమైన ముఖంతో జాలిగా తనవైపే చూస్తున్నట్లుగా వుంది.

అంతవరకూ కలత నిదురతో పీడకలతో భయపడి ఉలిక్కిపడి లేచిన సుజాతకు తాను కువైటు దేశంలో వున్నానని ఒక్కగానొక్క బిడ్డ అయిన "చిన్నా" గురించిన పీడకలతో కలవరం చెందానని అపుడు అర్థం అయింది. ఇండియాలో తన సవతి తల్లి దగ్గర వదిలి పెట్టి వచ్చిన తన ముద్దుల కొడుకు చిన్నా గుర్తుకు వచ్చి దుఃఖం పొంగుకు వచ్చి ఆ తల్లి హృదయాన్ని పట్టి కుదిపేసింది. ఆ క్షణంలో రెక్కలు కట్టుకుని ఒక్క ఉదుటున ఆకాశంలోనికి ఎగిరి ఇండియాకు వెళ్ళిపోయి తన బిడ్డను ఒక్కసారిగా హృదయానికి హత్తుకోవాలనీ అడ్డుగా వున్న అరేబియా సముద్రాన్ని ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు చేరిపోవాలనీ ఆమె ఆరాటపడింది.

తన పరిస్థితి ఇక్కడ ఇలావుంటే అక్కడ ఇండియాలో సంవత్సరం దాటిన వయసుగల పసిపిల్లవాడు, ఇపుడిపుడే నడకలు నేర్చుకుంటున్న చిన్నవాడు, మాటలైనా సరిగా రాని ముద్దుల బాలుడు, తల్లి రొమ్ముపట్టి పాలు త్రాగే పసివాడు, అమ్మా అని ఏడుస్తూ కనిపించని అమ్మపై దిగులుతో ఎంతగా తల్లడిల్లిపోతున్నాడో కదా? ఆకలి తీర్చే పాలకోసం, తల్లిరొమ్ము దొరకక దిగులుపడి ఏడుస్తున్నాడేమో? తన పక్కలో లేని తల్లికోసం చేతులతో పక్కంతా తడుముతున్నాడేమో? ఏమయిందో తన బాబుకు? ఎలా వున్నాడో పసిబిడ్డ? ఎందుకు వచ్చిందో ఈ పీడకల? అక్కడ ఇండియాలోని బాబు ఇప్పుడు ఎలా వున్నాడో తెలుసుకోడం ఎలా? ఇన్ని వేల మైళ్ళ దూరంలో పరాయి దేశంలో పనిమనిషిగా వచ్చిన సుజాతకు బిడ్డ క్షేమం గురించి ఆందోళన కలిగి ఆ అర్ధరాత్రి సమయంలో కంటిమీదికి కునుకురాలేదు. కన్నీళ్ళు చెంపల మీదుగా ప్రవహించి తలదిండును తడిపేసాయి.

ఆ సమయంలో నిద్రపోతున్న మంగమ్మను లేపి ఆమె సెల్ ఫోనులో వెంటనే ఇండియాకు ఫోను చేసి అక్కడ బాబు ఎలా వున్నాడో అడిగి తెలుసుకోవాలని అనిపించింది. కానీ మంగమ్మకు వున్న నోటి దురుసుతనానికి జడిసి ఆగిపోయింది సుజాత. అప్పటికే ఆ రోజు ఉదయం సుజాత ఫ్లయిట్ దిగి కువైటులో అడుగుపెట్టగానే మంగమ్మ ఎన్నో జాగ్రత్తలు చెప్పింది. "ఇదిగో అమ్మాయ్ ఏదో నీ రాత బాలేదని దిక్కులేని దానివనీ దయతలచి వీసా తీసి ఇక్కడికి పిలిపించాను. నువు ఇంటి గురించీ పిల్లవాడి గురించీ దిగులు పెట్టుకుంటే ఇక్కడ ఈ కువైటు ఇంటిలో పని చెయ్యడం అసాధ్యం. డబ్బు బాగా సంపాదించాలంటే నీ గుండెను బండగా చేసుకుని బిడ్డమీది జ్ఞాపకాల్ని డబ్బుమీదకి మళ్ళించుకుని శ్రద్ధగా పనిచేసుకోవాలి. బాగా డబ్బు సంపాదిస్తే రేపు పిల్లవాడి భవిష్యత్తు బాగుపడుతుంది. వాడ్ని బాగా చదివించి పెద్దవాడిని చెయ్యచ్చు. నన్ను చూడు పదేళ్ళుగా ఈ కువైటు ఇంటిలో గట్టిగా నిలబడి డబ్బు సంపాదించి ఇండియాలో రెండతస్తుల ఇల్లు కట్టించాను. బిడ్డలనందరినీ బాగా చదివించాను. ఒక కేజీ బంగారం కొనుక్కున్నాను. నువు కూడా నాలాగే గట్టిగా నిలబడి నిబ్బరంగా పనిచేసి డబ్బు సంపాదించాలి. ఇక్కడ కువైటు సేఠ్‌ల దగ్గర మంచి పేరు తెచ్చుకోవాలి" అంటూ ఎన్నో బోధలు చేసింది. తాను కువైటులో దిగగానే తన సెల్‌ఫోనుతో ఇండియాలో వున్న సవతి తల్లికి ఫోను చేసి సుజాత క్షేమంగా కువైటుకు చేరుకున్నట్లు సమాచారం తెలియజేసింది. మంగమ్మ. సుజాతతో కూడా రెండు నిమిషాలు మాట్లాడించింది.

ఇక ఇపుడు ఆమెను నిద్రలేపి ఇంటికి ఫోను చేయాలనీ బిడ్డను గురించి దిగులుగా వుందనీ చెపితే ఎన్ని తిట్లు తిడుతుందో తలచుకుని సుజాతకు భయం కలిగి అప్పటికి ఆ ప్రయత్నాన్ని మానుకుంది. తెల్లవారగానే ఎలాగో ఆమెను బతిమాలుకుని ఒక్క నిముషం ఇంటికి ఫోన్ చేసి ఒక్కసారి చిన్నాగాడి ముద్దు మాటలు వింటే తన ప్రాణం కుదుటపడుతుంది అని నిశ్చయించుకుంది ఆ తల్లి.

తన నిస్సహాయతను, బిడ్డను వదిలి ఈ కువైటు దేశానికి రావల్సిన తన దుస్థితిని అందుకు ప్రేరేపించిన పరిస్థితులనూ సవితి తల్లి మాటకు లొంగిన తన అసహాయతను తలచుకుని కుమిలిపోయిందామె. "దేవుడా! నాకు ఈ దేశం వద్దు. ఈ డబ్బు వద్దు. ఈ బాధ

గుండెల్ని మెలిపెట్టే ఈ ఆవేదన నేను భరించలేను. నావల్లకాదు. నన్ను తిరిగి తీసికెళ్ళి నా బిడ్డ దగ్గర చేర్చు. అంతే నాకు చాలు" అనుకుంటూ మనసులో దేవుని తలుచుకుంటూ రోదిస్తుంటే మరలా ఎదురుగా వున్న ఏసుక్రీస్తు తన కరుణాదృక్కులతో, జాలిగా తనవంకే చూస్తున్నట్లనిపించింది. బిడ్డకోసం తల్లడిల్లిపోయే ఆ తల్లి రోదన చూసి ఆయన దిగులు చెందినట్లుగా కనిపించింది. అంతలో తన అత్త అయిన మంగమ్మ ఏసుప్రభువు గురించి చెప్పిన మాటలు కూడా గుర్తువచ్చాయి సుజాతకు.

కువైటులో తాము పనిచేసే యజమానులకు గానీ కువైటువారికి గానీ తాము హిందువులమని, విగ్రహారాధికులమనీ ఎన్నో దేవతలను పూజిస్తామనీ ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదని గట్టిగా సుజాకు చెప్పింది. ఇండియాలో తాము క్రిష్టియన్స్ మనీ ఏసుక్రీస్తును ఆరాధిస్తామనే వారికి చెప్పాలని అలా చెప్పకపోతే తాము హిందువులమని తెలిసిన వెంటనే పనిలోనుండి తీసేసి ఇండియాకు పంపించి వేస్తారని చెప్పింది. అందుకే కువైటులో ఇళ్ళల్లో పనిచేసే హిందువులు తాము క్రిష్టియన్స్ అని అబద్దం చెప్పుకుంటూ పనిచేసుకుంటూ వుంటారని తెలియచేసింది. అందుకే ఆమె, చూసే కువైటువారికి కనిపించేటట్లుగా ఏసుక్రీస్తు బొమ్మను ఒకదానిని సంపాదించి అక్కడ తన అలమరాకు పైన అతికించింది. ఆయనను ఆరాధిస్తున్నట్లుగా ప్రార్థన చేస్తున్నట్లుగా నటిస్తూ వుంటుంది. హిందువులంటే కువైటువారికి అంతగా ఇష్టం వుండదట. ఆ సమయంలో కన్నబిడ్డకోసం తపించి కన్నీరు విడిచే సుజాతకు ఆ ఏసుప్రభువే ఏదో ఒక మార్గం చూపించి తన బాధను, ఆవేదనను తీసివేస్తాడని అనిపించింది.

కంటికి నిద్రకరువైన ఆ రాత్రివేళ తన జీవితంలో జరిగిన సంఘటనలు ఈ కువైటుకు తాను రావడానికి కలిగిన పరిస్థితులు ఒక్కొక్కటిగా గుర్తురాగా వాటినన్నింటినీ, విషాదమైన తన గతాన్నీ తలచుకుంటూ భారంగా కళ్ళుమూసుకుంది సుజాత.

సుజాత పుట్టి పదిరోజులైనా గడవకముందే పురిట్లోనే, బాలింత జబ్బుతో సుజాత తల్లి మరణించింది. భార్య చనిపోయిన ఆరునెలలకే సుజాత వాళ్ళ నాన్న సంతోషంగా మరో పెళ్ళి చేసుకున్నాడు. అప్పట్నించీ సుజాతకు కష్టాలన్నీ చుట్టూ కమ్ముకున్నాయి. ఆ సవతి తల్లి పెంపకంలో అష్టకష్టాలు పడింది సుజాత. "పురిట్లోనే తల్లిని మింగింది ఈ మహాతల్లి. దీని మొహం చూస్తే దరిద్రం చుట్టుకుంది" అంటూ అనరాని మాటలతో ఈసడిస్తూ ఆ పిల్ల హృదయాన్ని ఆవిడ ఎంతగానో కష్టపెట్టేది. ప్రతిరోజూ తిట్లు, శాపనార్థాలు, దెబ్బలతోనే సుజాతకు తెల్లవారేది. సుజాతకు కడుపునిండా అన్నం కూడా పెట్టేదికాదు ఆవిడ.

తనని భూమ్మీద పడేసి పుట్టిన పదిరోజులకే తనని వదిలేసి వెళ్ళిపోయిన కన్నతల్లినీ తన కష్టాల్ని తలచుకుని కుమిలి కుమిలి ఏడ్చేది సుజాత. తనను ఎంతగానో వేధించి, సాధించే సవతి తల్లి మాటలకు తాళం వేసే తండ్రిని చూసి ఆయనంటే అసహ్యం కలిగేది.

బాగా చదువుకోవాలనీ, ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకుని తన కాళ్ళపై తాను నిలబడాలని కలలు కనేది సుజాత. అందుకే పదవతరగతి పాసవగానే పై చదువులు చదువుతానని తండ్రినీ, సవతి తల్లినీ ఎంతగానో ప్రాధేయపడింది. కానీ ఆ సవతి తల్లి, ఆడపిల్లలకు ఇక చదువులెందుకు? ఎంత చదివినా ఏదో ఒకరోజు పెళ్ళి చేయాల్సిందే కదా? అదేదో ఇపుడే చేస్తే ఆ చదువుకు పెట్టే డబ్బు మిగులుతుంది అని కఠినంగా చెప్పేసింది ఆవిడ.

తన బంధువుల్లోనే తనకు తమ్ముడి వరసయే ఒక త్రాగుబోతువాడికి సుజాతను ఇచ్చి బలవంతంగా పెళ్ళిచేసింది ఆవిడ. ఆ త్రాగుబోతు వాడితో రెండేళ్ళు నరకమే చవిచూసింది సుజాత. త్రాగిన వాసనకు వాంతి వచ్చేట్లు వుండి, వాడు దగ్గరకి వస్తుంటేనే వళ్ళు కంపరం ఎత్తేది. అతడి బారినుండి తప్పించుకోవాలని, దూరంగా భయంతో వెళ్ళిపోయేది. కానీ అతడు సుజాత మనఃస్థితిని అర్థం చేసుకోకుండా పశువులా వచ్చి మీద పడేవాడు. సహకరించకపోతే "ఏమే నిన్ను పెళ్ళిచేసుకున్నది ఎందుకు? మొగుడ్ని నేను. నా పక్కలోకి రావడానికి నీకు ఎందుకు ఇష్టంలేదు? ఎవడైనా వున్నాడా?" అంటూ బూతుమాటలతో తిట్టేవాడు.

పుట్టినప్పటినుండీ సవతి తల్లి పెట్టిన బాధలతో అలసిపోయిన సుజాతకు ఇపుడు పెళ్ళి అయిన తరువాత బ్రతుకు మీదే విరక్తి కలిగింది. ఒక సంవత్సరం గడిచాక ఆమె గర్భవతి అయింది. తనకు పుట్టే బిడ్డను గురించి కలలు కంటూ ఆ బిడ్డపై ప్రేమను పెంచుకోసాగింది సుజాత.

దేవుడు ఆమె మొరను ఆలపించాడో లేక శృతిమించిన అతగాడి దుర్మార్గాన్ని చూడలేకపోయాడో తెలియదుగానీ సుజాతకు ఆ నరకయాతన నుండి విముక్తి కలిగించడానికే అన్నట్లుగా త్రాగిన మత్తులో బైక్ డ్రైవ్ చేస్తూ యాక్సిడెంటు జరిగి అతడు చనిపోయాడు. అపుడు సుజాత ఎనిమిది నెలల గర్భవతి ఆ పరిస్థితుల్ని ఎలా అన్వయించుకోవాలో, ఎలా అర్థం చేసుకోవాలో ఆమెకు తెలియలేదు. ఆ అయోమయంలోనే తన బిడ్డకు జన్మనిచ్చింది సుజాత.

సుజాతేకాక చిన్నాగాడి బాధ్యత కూడా తమమీద పడటంతో సవితి తల్లి గాభరా పడిపోయింది. "నువు పుడుతూనే నీ తల్లిని మింగేసావు. వీడు పుట్టకమునుపే తండ్రిని మింగేసాడు. నష్టజాతకులైన మీ ఇద్దర్నీ ఇంట్లో వుంచుకుని జీవితాంతం ఎలా పోషించేది? నాకు కూడా ఇద్దరు పిల్లలు వున్నారు. వారి భవిష్యత్తు కూడా చూడాలి కదా" అంటూ సాధించడం మొదలు పెట్టింది. సుజాతకు ఏ మార్గమూ కనరాలేదు. అటు భర్తవైపునుండి కూడా ఏ ఆస్తులూ ఆమెకు రాలేదు. భవిష్యత్తు అగమ్యగోచరం అయిపోయింది.

అయితే ఆ సవితి తల్లి తెలివి అమోఘమైనది. ఆవిడ బాగా ఆలోచించి సుజాతను కువైటుకు పంపించాలని ప్లాన్ చేసింది. అక్కడ కువైటులో సుజాత బాగా డబ్బు సంపాదించి తన చేతుల్లో పోస్తుందని భావించింది. తన ఆలోచనకు మురిసిపోయి కువైటులో వుండి పనిచేసే వరసకు వదినయే మంగమ్మను ఫోనులో సంప్రదించి సుజాతకు వీసా పంపించమని అడిగింది. పాలు తాగే పసివాడ్ని వదిలి, కువైటుకు వెళ్ళనంటే వెళ్ళనని చెప్పి బాగా ఏడ్చింది సుజాత. పిల్లవాడ్ని బాగా చూసుకుంటాననీ, వాడి భవిష్యత్తు కోసమైనా కువైటు వెళ్ళి బాగా డబ్బు సంపాదించాలని నయంగా, భయంగా సుజాతకు నచ్చచెప్పింది ఆవిడ. అంతేకాదు సుజాత కువైటుకు వెళ్ళకపోతే తిండి పెట్టి పోషించడం కష్టమని, అలా అయితే ఇంట్లోంచి బయటికి వెళ్ళి ఎక్కడైనా తన బ్రతుకు తాను బ్రతకమని చెప్పి కఠినంగా హెచ్చరించింది. ఇక ఏ మార్గమూ కనపడలేదు సుజాతకు.

గత్యంతరం లేక ఆఖరికి ఒప్పుకోక తప్పలేదు. సుజాత "సరే" అనడంతో వెంటనే పాస్‌పోర్టు తయారు చేయించి కాపీలు కువైటులో వున్న మంగమ్మకు పంపించింది. అక్కడ కువైటు ఇంటిలో పనిచేస్తున్న మంగమ్మ తన సేఠ్‌లతో మాట్లాడి, తాను పనిచేసే ఇంట్లోనే పిల్లల్ని చూసుకోడానికి సుజాతకు వీసా పంపించింది.

వీసా చేతికి అందగానే మెడికల్ చెకప్ చేయించి, ఫ్లయిట్ టిక్కెట్లు బుక్ చేసారు.

కువైటుకు వెళ్ళేరోజు ఎంతో దిగులుగా, గుండెలో గుబులుగా సుజాతకు అనిపించింది. బాబును విడిచి వెళ్ళే బదులు ఈ ప్రపంచాన్ని మొత్తం ఎదిరించాలని అనిపించింది. బాబును తీసుకుని గుండెకు హత్తుకుని దూరంగా పారిపోవాలనిపించింది. కానీ చెప్పలేని నిస్సహాయత, సవితి తల్లి మాట ఎదిరించలేని అధైర్యం ఆమెను ఆవరించాయి. మరలా పిల్లవాడి భవిష్యత్తు కళ్ళముందు నిలిచి కలవరపెట్టింది. బాబును బాగా చదివించాలంటే డబ్బు సంపాదించి తన కాళ్ళమీద తాను నిలబడక తప్పదు. ఆలోచిస్తూ అన్యమస్కంగా బ్యాగును సర్దుకుంటున్న సుజాతను చూసి, అమ్మ ఎక్కడికో వెళుతోందని పసిగట్టి కాళ్ళకు అడ్డం పడే ఆ పసివాడిని మరిపించడానికి, వాళ్ళమ్మను కనిపించకుండా చేయడానికి వాడిని చంకలో వేసుకుని పక్కింట్లోకి తీసుకెళ్ళింది సవతి తల్లి. తన హృదయాన్ని, ఆత్మను బాబుతోపాటు వదిలిపెట్టిన ఆ తల్లి తన శరీరాన్ని మాత్రం భారంగా మోసుకుంటూ కదలని కాళ్ళను ఈడ్చుకుంటూ కన్నీళ్ళతో కువైటు వెళ్ళే ఫ్లయిట్‌ను ఎక్కింది.

సమయం ఉదయం ఐదుగంటలు అయింది. రాత్రంతా బిడ్డ గురించిన ఆలోచనలతో నిద్రపోని సుజాతకు తెల్లవారు ఝామున కాస్త కళ్ళు మూతలుపడ్డాయి. ఐదుగంటలకు అలారం మోగటంతో నిద్రలేచిన మంగమ్మ సుజాతను కూడా తట్టి నిద్రలేపి, "లేచి తొందరగా మొహం కడుక్కో. ఈ కువైటు ఇంటిలో నువు పిల్లలకు చేయాల్సిన పనులను వివరిస్తాను. ఇక్కడి పద్ధతులను కూడా నేర్పిస్తాను నీకు" అంది.

పదినిముషాల్లో మొహం కడుక్కుని వచ్చింది సుజాత. ఇండియాకు ఫోను చేసి చిన్నాగాడి గొంతు ఒకసారి వినాలని ఆమె హృదయం తహ తహలాడిపోతోంది. బలవంతంగా నోరు పెగల్చుకుని "మంగమ్మత్తా! ఒకసారి ఇంటికి ఫోను చేయవా? చిన్నాగాడు రాత్రి కలలోకి వచ్చి ఏడుస్తున్నాడు. రాత్రంతా నిద్రపట్టలేదు" అంది దీనంగా. వెంటనే మంగమ్మ ముఖంలో కోపం చోటు చేసుకుంది. "నిన్ననేకదా నువు వచ్చిన వెంటనే ఫోను చేయించి మాట్లాడించాను. ప్రతిరోజూ ఫోన్ చెయ్యాలంటే కుదరదు. ఇంటిమీదా పిల్లల మీదా దిగులుపడితే మేము కువైటులో ఏళ్ళ తరబడి నిలబడి వుండగలమా? డబ్బు సంపాదించగలమా? నీ బిడ్డను మీ పిన్ని బాగాచూసుకుంటానని నాతో చెప్పింది. నువు నీ బిడ్డ మీద కలవరం మానుకుని ఇక్కడ పని తొందరగా నేర్చుకో. లేకపోతే కువైటువాళ్ళు ఒప్పుకోరు. ఇంతకష్టపడి నీకు వీసా పంపించినందుకు నాకు చెడ్డపేరు రాకూడదు. నీకు నేను ఈ వీసా ఊరికే ఫ్రీగా పంపించలేదు. వీసాకోసం నాకు నీ రెండు నెలల జీతం ఇవ్వాలని మీ పిన్నితో ఒప్పందం కుదిరాకే వీసా నీకు పంపించాను. ఇంటి దగ్గర మీ పిన్ని నీ మెడికల్, ఫ్లయిట్ టిక్కెట్ల కోసం నలభైవేలు ఖర్చు చేసింది. అవన్నీ ఎలా తీర్చాలో ఆలోచించి నీ నిర్ణయం తీసుకో" అంది మంగమ్మ విసురుగా.

ఆవిడ నోటికి ఎదురుగా నిలబడి మాట్లాడటం కష్టం అని ముందే తెలిసిన సుజాత మారుమాట్లాడకుండా మనసును గట్టి చేసుకుని ఆవిడ వెంట పనిలోకి నడిచింది.

తన పుట్టుక, సవతి తల్లి పెట్టిన బాధలు, తండ్రి చేతకానితనం పెళ్ళి, భర్త వాడి తాగుడు, వాడు పెట్టిన హింసలు అన్నీ ఒక్కొక్కటిగా కళ్ళముందు మెదిలాయి. తన జీవితం ఎందుకు ఇలా అయిందో? దేవుడు తనమీద ఎందుకు ఇంత నిర్దయను కలిగి వున్నాడో అర్థం కాలేదు. ఆ సమయంలో సుజాతకు ఎంతో పట్టుదల, ప్రపంచం మీదా, మనుషుల మీదా ఏదో తెలియని కసి, కోపం కలిగాయి.

ఎలాగైనా సరే ఇక్కడ నాలుగేళ్ళు పనిచేసి బాగా డబ్బు సంపాదించి తిరిగి ఇండియా వెళ్ళిపోవాలనీ అక్కడ ఉండటానికి ఒక ఇల్లు కొనుక్కుని మిగిలిన డబ్బుతో చిన్నాగాడికి చదువు చెప్పించి వాడిని బాగా పెంచి పెద్ద చెయ్యాలని ఆమె మనసులో స్థిర నిశ్చయం చేసుకుంది. పిల్లవాడి జీవితం తనలాగా కష్టాల పాలు కాకూడదంటే నాలుగేళ్ళు కువైటులో తను కష్టపడాలి అని సుజాత భావించింది.

అక్కడ ఆ కువైటు ఇంటిలో మామా (సేతాని) బాబా (సేఠ్) వున్నారు. వారికి ముగ్గురు పిల్లలు. అందరూ కూడా ఆరేళ్ళలోపు వయసువున్న పిల్లలే. మంగమ్మత్త ఆ ఇంట్లో వంటమనిషి. ప్రతిరోజూ ఇల్లు శుభ్రం చేయడానికి ఒక ఫిలిప్పీన్ అమ్మాయి వుంది. తెలుగువాడే ఒకడు డ్రైవరుగా వున్నాడు. వాడే తోటపని, కార్లు తుడవడంలాంటి పనులన్నీ చేస్తాడు. ఆ ముగ్గురు చిన్నపిల్లల్ని చూసుకోవడమే సుజాతపని. ఆఖరిపిల్లవాడికి ఆర్నెల్ల వయసు. వాడిపేరు అబ్దుల్లా. రింగుల జుట్టుతో, తెల్లగా, బొద్దుగా వున్నాడు వాడు. సహజంగానే అరబిక్ పిల్లలు ముట్టుకుంటే మాసిపోయేంత వంటి రంగుతో ఎర్రగా అందంగా వుంటారు. వాడిని చూడగానే తన బాధను, దిగులును సగం వరకు మరిచిపోయింది సుజాత. వాడిని ఎత్తుకోవడం, ఆడించడం, మాటలు నేర్పించడంలాంటి పనులతో ఆమె సంతోషించేది. వాడి బోసినవ్వుల్లో చిన్నాగాడే కనిపించేవాడు. వాడు చేసే అల్లరి చేష్టలతో కాలం తొందరగా గడిచిపోయేది. సుజాతకు

వాడితో బాగా అనుబంధం ఏర్పడింది. సుజాతనే వాడు అమ్మగా భావించి అమ్మా అని పిలుస్తూ వదలకుండా వెనుకే తిరిగేవాడు. పిల్లవాడి అమ్మగారు అలా అనవద్దని తానే వాడి అమ్మనని తెలియజెప్పాలని ప్రయత్నించేది. కానీ ఆ పసిమనసుకు అర్ధం అయేదికాదు. (కువైటులో అరబ్బులు పిల్లల్ని కని పనిమనుషులకు అప్పగిస్తారు. పిల్లల ఆలనా, పాలనా ఆ పనిమనుషులదే అందువల్ల ఆ పిల్లలు తమ తల్లిదండ్రులకంటే కూడా, తమని పెంచే ఆయాలతోనే అనుబంధం ఏర్పరచుకుంటారు. ఊహ తెలిసిన తరువాత మాత్రమే వారు తమ స్వంత తల్లిదండ్రుల్ని గుర్తించి దగ్గరికి వెళతారు.)

ఒక సంవత్సరం గడిచేటప్పటికి "అబ్దుల్లా" సుజాతను వదిలిపెట్టి ఒకక్షణం కూడా వుండేవాడు కాదు. సుజాత పిల్లల్ని జాగ్రత్తగా, శ్రద్ధగా, ప్రేమగా చూసుకోవడం ఆ కువైటు వారికి సంతోషాన్ని, సంతృప్తిని కలిగించింది. ప్రతి సంవత్సరం జీతాన్ని పెంచుతూ సుజాతను తమతోనే వుండిపొమ్మని అడిగేవారు. నాలుగేళ్ళ కాలం సుజాత అలాగే స్థిరంగా వుండి పనిచేసింది. ఈకాలంలో మొదటి రెండు నెలల జీతం మెడికల్‌కు, ఫ్లయిట్ టిక్కెట్లకు ఖర్చుపెట్టిన పిన్నికి నలభైవేలు పంపించింది. తరువాత ప్రతినెలా ఐదువేలు చిన్నాగాడి ఖర్చుల నిమిత్తం పంపించి, మిగతా డబ్బును జాగ్రత్తగా తన బ్యాంకుకు పంపించి పొదుపు చేసుకుంది. తను అనుకున్న విధంగా ఆ నాలుగేళ్ళలో అన్ని ఖర్చులూ పోనూ పదిహేను లక్షల రూపాయలు కూడబెట్టగలిగింది సుజాత. ఇకచాలు అనుకుని ఇండియాకు తిరిగివెళ్ళిపోయి చిన్నాగాడిని పెంచుకుంటూ, చదివించుకుంటూ కాలం గడపాలి అని ఆమె నిశ్చయించుకుని మెల్లగా తన యజమానులకు ఆ విషయం చెప్పింది. వాళ్ళు ఒక పట్టాన సుజాత వెళ్ళిపోవడానికి ఒప్పుకోలేదు. తమ పిల్లలు ఆమెకు బాగా దగ్గర అయ్యారనీ - చిన్నపిల్లవాడైన అబ్దుల్లా ఆమెను విడిచి అసలు వుండలేడు కాబట్టి సుజాతను శాశ్వతంగా తమ ఇంట్లోనే పనిచేస్తూ పిల్లల్ని చూసుకుంటూ వుండిపొమ్మని వాళ్ళు ప్రాధేయపడ్డారు.

కానీ సుజాత అక్కడ తన బిడ్డకూడా సవతి తల్లి దగ్గరవున్నాడని ఏం బాధలు పడుతున్నాడో తెలియదు కనుక, తప్పకుండా తాను వెళ్ళి ఇకనైనా బిడ్డను దగ్గరుండి చూసుకోవాలని క్షమించమని అర్ధించింది. కానీ సుజాత మనసులో "అబ్దుల్లాను" విడిచి వెళ్ళాలంటే చాలా బాధగా, దిగులుగానే వుంది. కానీ తప్పదని, ఏదో ఒకరోజు వెళ్ళాల్సిందే కదా అని గట్టిగా నిర్ణయం తీసుకుంది. అతికష్టం మీద కువైటువారిని ఒప్పించి, వారిచ్చిన బహుమతులు తీసుకుని బ్యాగుల్లో సర్దుకుని అబ్దుల్లాను మరిపించి, వాడికంట పడకుండా బయలుదేరి ఇండియా ఫ్లయిట్ ఎక్కింది సుజాత. ఫ్లయిట్‌లో కూర్చుని వుందేకానీ సంతోషం ఏమాత్రం ఆమెలో లేదు. అటు చిన్నాగాడు, ఇటు అబ్దుల్లా మనసులో మెదులుతూ తల్లిప్రేమనూ, పెంచిన ప్రేమనూ పరిహసిస్తున్నారు. ఆమె మనసంతా దిగులుతో నిండిపోయింది. ఇక జీవితంలో మరలా అబ్దుల్లాను చూడలేను అనుకుంటేనే ఆమె కళ్ళు కన్నీళ్ళతో నిండిపోతున్నాయి. చిన్నాగాడిని అబ్దుల్లాను ఒకచోట వుంచి పెంచడం సాధ్యం అవుతుందా? అది కలలోనైనా అసాధ్యమైన విషయం కదా? ఆ తల్లి హృదయం ఆ ఫ్లయిట్‌లో కూర్చుని అమితంగా రోదించింది.

ఫ్లయిట్ దిగి ఎంతో వేదనగా "అబ్దుల్లా" గురించిన జ్ఞాపకాల్ని వెనక్కి నెడుతూ ఇంట్లోకి అడుగుపెట్టింది. అదిగో చిన్నాగాడు ఐదేళ్ళ పిల్లవాడు బాగా పొడవు పెరిగాడు. వాడిని చూడగానే ఎంతో సంతోషంతో రెండు చేతులు సాచి 'చిన్నా రారా ఇదిగో నీ అమ్మను. వచ్చేసానురా!. నీ కోసమే తిరిగి వచ్చేసాను. రా' అంటూ ఆర్తిగా పిలిచింది.

దుఃఖంతో ఆమె కంఠం జీరబోయింది. కన్నకొడుకును నాలుగేళ్ళ తరువాత చూసిన సంతోషం ఆమె కళ్ళవెంట ఆనందభాష్పాలను ఒలికిస్తోంది. కానీ ఆమె ఊహించినట్లుగా ఆశించినట్లుగా చిన్నాగాడు పరుగున వచ్చి ఆమె చేతుల్లో వాలలేదు. కనీసం సుజాత తన తల్లి అని వాడు గుర్తుపట్టినట్లుగా కూడా అనిపించడంలేదు. ఆమె మాటలకి, పిలుపులకి బెదిరిపోయినట్లుగా వెనక్కి పరిగెత్తి వెళ్ళి సవతి తల్లి చీర కుచ్చెళ్ళ చాటున దాక్కుని భయంగా తొంగి చూసాడు. సుజాత హృదయం కరిగి నీరయ్యింది.

తాను పడిన కష్టం, సంపాదించిన డబ్బు అంతా వృధా అయ్యాయనిపించింది. ఎవరికోసం, ఎందుకోసం కువైటు వెళ్ళిందో, తిరిగి ఎవరికోసం ఇండియా వచ్చిందో వాడే తల్లిని చూసి దూరంగా పారిపోయాడు. అవును నిజమే. పసివాడు, వాడిని వదిలి వెళ్ళిపోతే తిరిగి ఎలా గుర్తుపట్టగలడు? వాడికి చాక్లెట్లు ఇచ్చి, బొమ్మలిచ్చి ఆడించి తానేవాడి అమ్మనని తెలియచెప్పడానికి ఎంతగానో ప్రయత్నించింది. కానీ వాడు సుజాత దగ్గరకి రావడానికి ఇష్టపడలేదు. ఆమె సవతి తల్లి దగ్గరే బాగా అలవాటు అయి ఆమెనే అమ్మా అని పిలుస్తున్నాడు. నెలరోజులు గడిచిపోయాయి కానీ లాభంలేకుండా పోయింది. సుజాత బాగా కృంగిపోయింది. అటు "అబ్దుల్లా" ఆమెకు బాగా గుర్తువచ్చి కలవరం రేపెడుతున్నాడు. అక్కడ ఎలా వున్నాడో వాడు అనుకుంటేనే ఆమెకు దుఃఖం ముంచుకు వస్తోంది. రెండువైపులా వేదనతో సుజాత బాగా నలిగిపోయింది. ఈ లోపల ఆమె సవితి తల్లి. "మళ్ళీ కువైటు ఎప్పుడు వెళుతున్నావు? " అని అడగడం మొదలు పెట్టింది. సుజాత తిరిగి వెళితే ఇంకా డబ్బు బాగా సంపాదిస్తుంది అని ఆమె ఆశ. ఇంతలో కువైటువారు సుజాతకు ఫోను చేసి "అబ్దుల్లాకు జ్వరం వచ్చిందనీ ఆమెనే కలవరిస్తున్నాడనీ వెంటనే బయలుదేరి వస్తే వాడి ప్రాణాలు నిలబడతాయ"నీ ప్రాధేయపడ్డారు. అబ్దుల్లా ప్రాణం కాపాడటం తన విధిగా భావించిన సుజాత మరలా కువైటుకి వెళ్ళే ఫ్లయిట్ ఎక్కింది. ఈసారి చిన్నాగాడు ఆమె వెంటపడి ఏడవలేదు. నిలబడి చూస్తూ సుజాత వెళుతుంటే సంతోషంగా టాటా చెప్పాడు వాడు.

## ఎడారి జీవితం

"**నీవల్లే నా బతుకిలా అయింది.** నీ మాట విని చేసే మంచి పనిని వదిలేసి కువైటు ఇంట్లోంచి పారిపోయి నీతో వచ్చినందుకు నాకు తగిన శిక్ష పడింది. ఇపుడు ఇలా ఏ పనీ చేసుకోలేక, సంపాయించలేక, ఇంటిదగ్గర పిల్లాళ్ళ చదువులకు డబ్బు పంపించలేక బాధపడుతున్నాను.

వాళ్ళేమో నేను ఇక్కడ ఇంకా కువైటు ఇంట్లో పని మట్టంగా, కుదురుగా చేసుకుంటున్నా అని అనుకుంటున్నారు. నాకు ఖర్మ పట్టి నీ మాట విని నీతో రావడం నా తప్పు. అందుకు నా చెప్పుతో నన్ను నేనే కొట్టుకోవాలి. నిన్ను అని ఏం లాభం? అన్నీ టైముకి అమర్చి, నీకు సేవలు చేసి, నీ కోరికలు తీరిస్తే ఈ ఆడది నన్ను నమ్మి అన్నీ వదిలి నాతో పాటు వచ్చింది కదా అనే విశ్వాసం కూడా నీకు లేదు.

ఇటు ఇండియాకు పోదామంటే పాస్‌పోర్టు లేదు. కువైటు ఇంటిలోనే వదిలేసి వచ్చాను. ఇక్కడే వుండి ఏదన్నా పనిచేసుకుందాం అనుకుంటే బుతాక (ఐడి) కూడా లేదు. ఏదీ లేకుండా ఈ ఎడారిలో నా బతుకు అధ్వానం అయిపోయింది.

ఎర్రగా బుర్రగా, సినిమాలో శ్రీదేవిలా అందంగా వున్నావు అంటూ నా వెనుకే కుక్కలా తిరిగావు. ఏమీ తక్కువ లేకుండా, ఏదీ కొదవలేకుండా అన్ని నీకు అమర్చి పెడతా, నిన్ను పువ్వుల్లో పెట్టి దేవతలా పూజిస్తా, నువు చెప్పినట్టే వింటా అని నాకు మాయమాటలు చెప్పావు. బాగా పనిచేసుకుని బతికే నన్ను కువైటు ఇంట్లోంచి బయటికి తీసుకొచ్చి ఇప్పుడు రెండేళ్ళు గడిచాక నీ మోజంతా తీరాక, నన్ను ఇక్కడ ఒంటరిగా వదిలేసి నీ పాటికి నువ్వు మూడు నెలలు శెలవుల మీద ఇండియాకు పోతా నా పెళ్ళాం బిడ్డల్ని చూసి వస్తా అంటే ఇక్కడ నా పరిస్థితి ఏం కావాలి? నేను ఏమయి పోవాలి? ఇక్కడ రూము బాడుగ ఎవరు కడతారు? నా కడుపుకు తిండి ఎవరు పెడతారు? ఇంటికి పిల్లలకు ఖర్చులకు పంపటానికి నెలనెలా డబ్బులు ఎవరు ఇస్తారు చెప్పు?

నీ భార్యా పిల్లలను చూడాలని, వాళ్ళకు కావల్సిన సకలమూ కొనుక్కొని బ్యాగుల్లో వేసుకుని ఫ్లయిట్ ఎక్కి పరిగెత్తుకుని పోతున్నావే ఇక్కడ నా పరిస్థితి ఎలా వుంటుందో అని ఒక్కసారైనా ఆలోచించావా?

అప్పుడేమో నీ పిల్లలను, నా పిల్లలగా చూసుకుంటాను, నిన్ను నా భార్య కంటే ఎక్కువగా గౌరవంగా చూసుకుంటా, ప్రాణం పోయినా కూడా నిన్ను వదలను అని నా తలపైన చెయ్యిపెట్టి ఒట్టు వేసావు. నీతీ నిజాయితీగల మొగోడివని నిన్ను నమ్మి నీ మోజులో పడి, చేసే పని వదిలేసి పాస్‌పోర్టు బుతాక (ఐడి) కువైటు ఇంట్లోనే వదిలేసి మా సేటుకు, సేటానికి తెలియకుండా కట్టుబట్టలతో పారిపోయి వచ్చాను. ఇలా ఇరక్కుపోయాను. ఇల్లుదాటి బయటికి పోతే కనపడితే పోలీసులు పట్టుకుంటారు. తీసుకెళ్ళి జైల్లో పెడతారు. ఎన్ని రోజులని ఇలా ఇంట్లోనే దాక్కుని బ్రతికేది? పని చెయ్యకుండా, సంపాదించకుండా ఈ కువైటులో ఎలా వుండేది? డబ్బు సంపాదించకపోతే అసలు విలువేముంటుంది? కువైటుకు వచ్చిందే అందుకుకదా! పోలీసులకు భయపడి బయటికి వెళ్ళకుండా ఇంట్లోనే వుంటే జైల్లో వున్నట్లుగా వుంది. ఇంతకంటే నరకం ఇంకో ఆడదానికి వేరే వుంటుందా చెప్పు.

ఇంత మోసగాడివని, ఇంత అన్యాయం చేస్తావని, నన్ను ఒంటరిగా వదిలేసి భార్యాపిల్లలు అంటూ, సూట్‌కేసులు సర్దుకుంటావని ముందే తెలిసి వుంటే నీ మొహం కూడా చూసేదాన్ని కాదు. పొరపాటు పని చేసి ఇపుడు తల కొట్టుకుని ఏడుస్తున్నాను. ఈ పరాయి దేశంలో, ఇక్కడ నన్ను ఆదుకునే వాళ్ళు ఎవరైనా ఉన్నారా? ఇక్కడ కష్టం సుఖం పట్టించుకునేవాళ్ళు కరువేకదా!

కనీసం ఆ కువైటు ఇంటిలో అయినా పనిచేస్తావుంటే అయినవాళ్ళు, ఊళ్ళోవాళ్ళు అపుడపుడూ ఫోను చేసి గౌరవంగా పలకరించేవాళ్ళు, కష్టసుఖాలు విచారించేవాళ్ళు. ఏ కష్టం వచ్చినా ఎవరో ఒకరు ఆదుకుంటారులే సమయానికి పలుకుతారులే అనే ధైర్యం వుండేది. ఇదిగో నిన్ను చూసి నీ మాటవిని నీ వెంబడి వచ్చేసిన తరువాత అందరికీ తెలిసిపోయి చులకన అయిపోయాను. ఎక్కడా తలెత్తుకోని తిరగలేకపోతిని ఎవరితోనూ ధైర్యంగా మాట్లాడలేక పోయాను.

"ఛీ..ఛీ. ఏమి బ్రతుకు నీది? ఎదవ బతుకు. కువైటు ఇంట్లో పనిచేసుకుని మట్టంగా బతికి డబ్బు సంపాదించి పిల్లలను సాక్కునేదానికి నువ్వు కువైటుకు వచ్చావా? లేక వళ్ళు కొవ్వెక్కి చేసే పని వదిలిపెట్టి రమ్మని చెప్పిన మగాడి పక్కలో చేరి కష్టపడకుండా కూచుని తిందామనుకున్నావా? కువైటు ఇంటిలో ఎన్ని కష్టాలు పెట్టినా, కొట్టినా, తిట్టినా, ఆడదానికి అక్కడ పనిచేయడం గౌరవంగా వుంటుంది. ఇంట్లో పనిచేసే ఆడదానికి ఒక అదుపు, కాపలా వుంటాయి. ఆ ఆడదానికి గౌరవం వుంటుంది. ఇలా దేశం కాని దేశంలో పరాయి మగవాడ్ని నమ్మి బయటపడితే ఎంత సిగ్గుచేటు? వాడు వదిలేస్తే ఈ పరాయి దేశంలో పాస్‌పోర్టు లేకుండా ఎలా బ్రతుకుతావు? బయట ఎలా తిరుగుతావు? నీకు కొంచెమన్నా తెలివి వుందా?" అని మా పెద్దమ్మ కూతురు రాజేశ్వరి ఫోను చేసి ఒక గంటసేపు ఆపకుండా తిట్టింది. గమ్మున నోరు ఎత్తకుండా ఆయమ్మి దగ్గర తిట్టించుకున్నా. నా రాత బాగోలేదు, తిట్టనీలే అనుకుని ఫోను పెట్టేసిన తరువాత బాగా ఏడ్చాను. ఈ గుండెల్లో బాధ ఎవరికి చెపితే తీరుతుంది? ఈ బాధ పగవారికి కూడా వద్దు సామీ! దాని నోరు అసలే మంచిదికాదు. ఈ విషయం ఊళ్ళో అందరికీ చెప్పేసి ఇప్పటికే దండోరా వేసి వుంటుంది. మా అన్నకు కూడా అదే చెప్పిందో ఏమో? అదే రోజు మా పెద్దన్న ఫోను చేసి కోపంతో మండిపడ్డాడు.

"నువు వెంటనే బయలుదేరి ఇంటికి వస్తావా? లేకపోతే అక్కడే ఆ సముద్రంలో దూకి ఛస్తావా? ఏదో ఒకటి చెయ్యి. చచ్చావు అని తలకు నీళ్ళుపోసుకుని గమ్మున వుంటాము. తోడబుట్టింది ఒకటి కువైటులో చచ్చిందిలే అని అందరికీ చెప్పుకుంటాము. ఏదో కువైటుకు వెళ్ళి అక్కడ గౌరవంగా పనిచేసుకుని పదిరూపాయలు సంపాదించుకుంటావు, పిల్లలను కూటికీ, గుడ్డకు కొరతలేకుండా సాక్కుంటావు అనే ఉద్దేశంతో మేము అష్టకష్టాలు పడి అరవైవేలు అప్పులు చేసి, వీసా తీసి నిన్ను కువైటు పంపాము. అక్కడికి వెళ్ళి రెండేళ్ళు దాటంగానే మన దేశం, మన కుటుంబం, మన పరువు, పిల్లల గురించి అన్నీ మరిచిపోతావా? ఎవరో దారిన పాయేవాడు నాలుగు మాటలు చెప్పగానే కళ్ళు మూసుకుపోతాయా నీకు? ఊళ్ళో నీ గురించి చెప్పుకొని అందరూ నవ్వుకుంటూ వుంటే తలదించుకుని తిరుగుతున్నాం. ప్రాణంతోనే మా పరువుతీసి మమ్మల్ని చంపేసావు గద. నీలాంటివాళ్ళు చచ్చినా ఒకటే బతికినా ఒకటే. నువు మాకు

ఇంక చచ్చిన దానితో సమానమే. ఏదో పిల్లల మొకం చూసి తల్లి లేకపోతే బిడ్డలు ఏమవుతారో అని ఆలోచించి ఈ ఫోను చేసి నీకు మర్యాదగా చెపుతున్నా. లేకపోతే నాకు వచ్చే కోపానికి నిన్ను కత్తికి ఒక కండగా నరికి పారేసి వుందును. మర్యాదగా విమానమెక్కి పోయిన దారినే తిరిగి ఇంటికి రా" అని ఈటెల్లాంటి మాటలతో కుళ్ళబొడిచి కోపంగా ఫోను పెట్టేసాడు.

మా పెద్దన్న అంటే మాకు అంత భయం, భక్తీ, ఆయన్ను చూస్తూనే భయంతో వణికిపోయేవాళ్ళం. అట్లాంటి ఆయన దగ్గర ఇన్ని మాటలు పడి ఇంకా నేను ఈ భూమ్మీద బతికి వుండి ఏం లాభం చెప్పు?

నీ పెళ్ళాం ఫోను చేసి నన్ను అనరాని మాటలు అన్నప్పుడే నేను సగం చచ్చిపోయాను. తనకి ఎవరు చెప్పారో నీ దగ్గర నేను కువైటులో కాపురం చేస్తున్నానని? "నా మొగుడే కావల్సి వచ్చాడా నీకు? ఇంకెవరూ దొరకలేదా?" అంటూ గబ్బు మాటలన్నీ తిట్టింది. "కనపడితే ఇండియాకు వస్తే వీధిలోకి ఈడ్చికొడతాను ధైర్యం వుంటే రావే" అని నోటికి వచ్చినట్లు మాట్లాడితే నోరు మూసుకుని వున్నాను. దాని బాధ దానిది. తిట్టనీలే. దానికి హక్కువుంది, తిడతుంది. పడాలి కదా అనుకుంటిని. ఇలా నీ పెళ్ళాం దగ్గర తిట్లు తిన్నాను. అలా మా వాళ్ళ దగ్గర తిట్లు తిన్నాను. అయిన వాళ్ళ దగ్గర అవమానాలు పొందాను. అన్నీ పోగొట్టుకున్నాను. చావలేక, బ్రతకలేక ఎటూ పోలేక అల్లాడిపోయాను. చేసేదానికి పనిలేక పోయింది. చేతిలో డబ్బు లేకపోయింది. పిల్లలు ఇండియానుండి ఫోను చేసి డబ్బు పంపించమని అడిగితే ఏ జవాబు చెప్పలేకపోయాను. నీ పెళ్ళాం నన్ను అన్నిమాటలు కడుగుతావుంటే దాన్ని నోరెత్తి ఒక్కమాట అన్నావా? నా తప్పు ఏమీ లేదనీ నువ్వే నా వెనకబడి నన్ను తోడుకుని వచ్చావని ఒక్కమాట దానితో చెప్పావా? పెళ్ళాం దగ్గర నోరు తెరవలేకపోయావే, ఛీ నువ్వేం మగాడివి? పెళ్ళాం దగ్గర పిల్లిలాగా వుంటావు? నా దగ్గర పులిలాగా తయారయినావు. ఈరోజు పెళ్ళాం బెల్లమయింది. నేనేమో నీకు అల్లం అయ్యాను.

ఎవరితో చెప్పుకోను కడుపులోని బాధ? ఇపుడు ఎవరితో చెప్పినా హేళన చేసి నవ్వుతారు. పదిమందిలో నవ్వులపాలయిపోతుంది నా బతుకు. "ఏమే నీకు అంత కొవ్వు పట్టిందా? కువైటుకు పోతే కళ్ళు కనపడవా? అంతగా చెడిపోతారా? పిల్లలకు తెలిస్తే తలకాయ ఎక్కడ పెట్టుకుంటావే? వాళ్ళ జీవితాలు ఏం కావాలి అనుకున్నావు? ఊళ్ళో నీ సంగతి తెలిస్తే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు అవుతాయా? ఎవరన్నా వచ్చి పెళ్ళి చేసుకుంటారా? కష్టపడి పనిచేసి సంపాదించుకో, ఇప్పటికైనా తెలివి తెచ్చుకో. కువైటుకు పోవద్దు అంటే వెళ్ళావు. వెళ్ళాక అందర్నీ మరిచిపోయి ఇలాంటి పరువు తక్కువ పని చేసావు. మేమంతా చచ్చాము అనుకున్నావా" అని మా వదిన కూడా ఏడుస్తూ నాకు బుద్ధి చెప్పింది.

చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం లాభం?

ఈ రోజు నీకు పెళ్ళాం బిడ్డలు గుర్తుకు వచ్చారా? నీకే ఉన్నారా? నాకు పిల్లలు లేరా? నేనుకూడా వచ్చి నాలుగేళ్ళు దాటింది కదా! నాకు ఇంటికి పోయి అందర్నీ చూడాలని వుండదా? నాకు పాస్‌పోర్టు కూడా లేకుండా చేసి ఎక్కడికీ పోలేని స్థితిలో నన్ను వుంచి నువ్వు అన్నీ సర్దుకుని ఇండియాకు వెళతావా? అక్కడికి వెళ్ళి పెళ్ళాం పక్కలో పడుకుంటావా? నువ్వు అసలు మనిషివేనా? మనసుందా నీకు? మనిషి జన్మ ఎత్తి ఎలా పుట్టావురా నువ్వు?

నన్ను ఇక్కడ దిక్కులేని స్థితిలో ఒంటరిగా వదిలేసి నీపాటికి నువ్వు సంతోషంగా సూట్‌కేసులో సర్దుకుని వెళతానంటావా? నిన్ను నమ్మి అన్ని విధాలా నాశనం అయిపోయాను కదరా. నా బతుకే పాడయిపోయింది కదరా. ఉన్నట్టుండి దుఃఖం ముంచుకొచ్చింది లక్ష్మికి. ఆవేశం కమ్ముకొచ్చింది. ఒక మూల కూర్చుని తన గోడునంతా వెళ్ళబోసుకుంటూ రాజేష్‌ను తిడుతున్నదల్లా లేచి మంచం దగ్గరికి వచ్చింది. మంచంపై పడుకుని నిద్రపోతున్నట్లు నటిస్తున్న రాజేష్ ముఖంపై కప్పుకుని వున్న దుప్పటిని కోపంగా లాగి పడేసింది లక్ష్మి. మూగెద్దులాగా అన్నీ వింటూ పలక్కుండా పడుకున్నావు కదరా. నా గోడు నా బాధ వినిపిస్తోందా నీకు? నన్నేం చెయ్యమంటావో చెప్పు?

ఏదన్నా తిని చచ్చిపొమ్మంటావా? నీ దారిన నువు నీ పెళ్ళాం దగ్గరికిపోతే నాకు ఇక్కడ దిక్కెవరో చెప్పు'' అంటూ గట్టిగా రాజేష్ షర్టు కాలర్ పట్టుకుని వూపింది.

అంతే అప్పటివరకు నిశ్శబ్ధంగా వుండి లక్ష్మి మాట్లాడే మాటలన్నీ వింటున్నవాడల్లా ఒక్కసారిగా కోపంగా లేచి సాచి లక్ష్మి డొక్కలో ఒక్క తన్ను తన్నాడు.

అలా తంతాడని ఊహించలేదేమో ఆ ఊపులో వెళ్ళి అంత దూరంలో వున్న టేబుల్ పై పడి గుద్దుకుని దొర్లుతూ కింద పడిపోయింది లక్ష్మి.

జరిగింది ఏమిటో అర్ధంకాక రాజేష్ వైపే చూస్తూ పడినచోటే కదలకుండా వుండిపోయింది లక్ష్మి. పైకి లేచేందుకు ఆమెకు శక్తి చాలలేదు.

''ఏంటే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నావు? మీ వదిన అన్నట్లుగా నీ వంటికి బాగా కొవ్వుపట్టి అన్నీ వదిలి నా వెనుక పరిగెత్తుకుంటా వచ్చావు. మగవాడు అన్నాక వంద మాటలు చెపుతాడు. వందమందితో తిరుగుతాడు. నీ బుద్ధి ఏమయిందే సిగ్గులేనిదానా? ఇంటి దగ్గర పిల్లలు వున్నారు. ఒంట్లో భయం పెట్టుకుని పని చేసుకోవాలి. పిల్లలను సాక్కోవాలి అనే బుద్ధి అపుడు ఏమయింది? ఏదో మోజుపడి నాల్రోజులు వాడుకుందామని శ్రీదేవిలా వున్నావు, జయప్రదలా వున్నావు అని నాల్గుమాటలు నైసుగా చెప్పగానే వెనకబడి పరిగెత్తుకుని రావడమేనా? మగవాడి కంటే సిగ్గువుండదు. ఆడదానికి నీకు ఏమయింది? నీకే కాదే నాకు కూడా శనిపట్టి, దరిద్రం నెత్తిన కూర్చుని నిన్ను తోడుకుని వచ్చానే రెండేళ్ళనుండీ నిన్ను కూర్చోపెట్టి, ఇంటికి బాడుగ కట్టి, నీకు తిండిపెట్టి సాకుతున్నానే. నెలనెలా నా భార్యకు, పిల్లలకు డబ్బు పంపించకపోయినా నీ పోరుపడలేక నీ పిల్లలకు డబ్బు చెక్కు రాసి ఇండియాకు పంపిస్తున్నాను. నీకు మొబైలు ఫోను కొనిపెట్టాను. మెళ్ళోకి హారం కావాలని ఏడిస్తే. ఏదో అప్పట్లో క్రొత్తల్లో నీ మోజులో వున్నప్పుడు కాదనకుండా కొనిపెట్టాను.

పెద్దపిల్ల ఆరోగ్యం బాగోలేదు ఆసుపత్రిలో చేర్చారు అంటే అప్పటికప్పుడు ఆఫీసులో తెలిసిన వాళ్ళ దగ్గర అప్పుచేసి రెండు వందల దినార్లు మీ ఇంటికి చెక్కు రాసి పంపాను.

నిన్ను తగులుకున్న పాపానికి నా పెళ్ళాం బిడ్డల్ని ఇంటికాడ పస్తులు పెట్టాను.

రెండేళ్ళ నుండీ సంపాదించిన డబ్బంతా నీ ముఖాన పోసాను. నీ గురించి అప్పుల పాలయిపోయాను.

ఇక్కడ నిన్ను పువ్వుల్లో పెట్టి సాకుతూ అక్కడ నా పెళ్ళాం బిడ్డల్ని మరిచిపొమ్మంటావా?

నా పెళ్ళాంతో నీకు పోలికేంటే బజారుదానా! అది రత్నమే. దానికాళ్ళు కడిగి ఆ నీళ్ళు నీ నెత్తిన జల్లుకున్నా నీ పాపం పోదే పదిమందిలో తాళికట్టి పెళ్ళి చేసుకున్న నా పెళ్ళామే అది. నీలాగా నాలుగు మాటలు చెప్పిన మగవాడితో అది పోలేదే రెండేళ్ళు నీకు తిండిపెట్టి పోషించాను అన్న విశ్వాసం లేకుండా నన్ను పట్టుకుని మగాడివా? మనిషివా? మనసుందా అని ప్రశ్నిస్తావా?

నా భార్యాబిడ్డల్ని నీకోసం మరిచిపొమ్మంటావా? ఈరోజు నేను ఇండియాకు ప్రయాణం అవుతుంటే నీకు అంత కడుపులో మంట కలిగిందే? ఎల్లకాలం నిన్ను పోషిస్తాననుకుంటున్నావా?

ఇప్పటికైనా తెలుసుకో. నీ దారి నువు చూసుకో - చస్తావో ఇండియా ఎంబసీకి వెళ్ళి పాస్‌పోర్టు లేదని చెప్పి ఇండియాకు పంపించమని అడుగుతావో నీ యిష్టం. దారినపోయే నీకోసం నా పెళ్ళాన్ని బిడ్డల్ని వదులుకుంటానా?

ఇక నీకు నాకు ఏ సంబంధమూలేదు. ఇక నిన్ను భరించే ఓపికా నాకు లేదు వస్తా'' అంటూ అప్పటికే సర్దిపెట్టుకున్న సూట్‌కేసులు తీసుకుని తిరిగి చూడకుండా బయటికి వెళ్ళిపోయాడు రాజేష్.

అర్థంకాని అయోమయంలో శరీరము, మెదడు కూడా మొద్దుబారిపోయినట్లు కదలకుండా కొద్దిసేపు అలాగే వుండి పోయింది లక్ష్మి. ఎంతైనా స్త్రీ హృదయం. మగవాడిలా బంధాల్ని తెంచుకుని బయటపడటం అంత సులభం కాదు. పురుషుని పై పెంచుకున్న ప్రేమను మరిచిపోవడమూ సాధ్యము కాదు.

రాజేష్ తనను వదిలేసి వెళ్ళిపోయాడు అన్న విషయం జీర్ణం చేసుకోవడానికి ఆమెకు దాదాపు రెండు రోజులు పట్టింది. ఆవేశంలో, కోపంలో ఏదేదో మాట్లాడింది కానీ రెండేళ్ళపాటు కలిసి సాగించిన సహవాసం, సంసారం పంచుకున్న ప్రేమ గుర్తుకువచ్చి లక్ష్మి హృదయాన్ని పట్టి కుదిపేసాయి. రెండు రోజులు ఏడుస్తూనే గడిపింది. రాజేష్ ఫోను చేస్తాడని ఎంతగానో ఎదురు చూసింది. ఆశను చంపుకోవడం ఆమెకు అసాధ్యం అయింది.

ఆ పరాయి దేశంలో అయినవాడు అనుకున్న వాడు ఒంటరిగా విడిచిపెట్టి వెళ్ళిపోతే అసహాయ స్థితిలో ఏమీలేని పరిస్థితిలో నిలబడిన లక్ష్మికి జీవితమే శూన్యంగా అనిపించింది. ఒక్క నిమిషం ఈ జీవితం ఎందుకు? చనిపోదామా అని ఆలోచించింది. కానీ ఇంటివద్ద ఆశగా తనకోసం ఎదురుచూసే పిల్లలు గుర్తుకు వచ్చి ఆ ఆలోచన విరమించుకుని తనకు వున్న ముఖ్యమైన వస్తువులన్నీ బ్యాగులో సర్దుకుని వుంటున్న ఆ యిల్లు వదిలి పెట్టింది. పొంగిపొరలే దుఃఖాన్ని అణచుకుని, కన్నీళ్ళను తుడుచుకుని ఒక్కసారిగా గుండెల నిండా గట్టిగా ఊపిరి పీల్చుకుంది. గడిచిన రోజులను రాజేష్ తోటి పంచుకున్న జ్ఞాపకాలను అక్కడే సమాధిచేసి టాక్సీ ఎక్కి ఇండియన్ ఎంబసీకి వెళ్ళిపోయింది.

ఎడారిలో ఎండమావులు తప్ప ఒయాసిస్సులు ఉంటాయా? ఉంటాయి అని భ్రమపడి పరిగెత్తుకుంటూ వెళతాం. కానీ తీరా అక్కడికి వెళ్ళాక అవి ఎండమావులు అని తెలిసి బాధపడి దుఃఖిస్తాం. గల్ఫ్ దేశాల్లో ఇక్కడ లక్ష్మిలాంటి ఎడారి జీవితాలు ఎన్నో. వీటికి అంతం అంటూ లేదు. ఏ ముగింపూ వీటికి కనరాదు.

## *గల్ఫ్ యుద్ధంలో కువైటు స్త్రీల కన్నీటి కథలు*

**అది 1990 వ సంవత్సరం. ఆగష్టు మాసం.**

ఇరాక్ సైన్యాధ్యక్షుడు, ఆ దేశ ప్రెసిడెంటు అయిన 'సద్దాం హుస్సేన్' దురాక్రమణతో దిక్కుతోచని కువైటు పట్టణం విలపిస్తోంది. ఇరాక్ సైనికుల ఆగడాలతో, అకృత్యాలతో కువైటు ప్రజలు ఆర్తనాదాలు చేస్తున్నారు. ఇరాక్ సైనికులు కువైటు దేశంలోని సంపదనంతా దోచుకుని, లారీలలో నింపి తమ దేశానికి తరలిస్తున్నారు. ఒక్క సంపదనేకాదు, కువైటు స్త్రీల మానప్రాణాల్నికూడా వారు దోపిడీ చేసి తమ శరీర వాంఛల్ని తీర్చుకుంటున్నారు. దయ, జాలి, కరుణ అనేవి మరిచిన మృగాల్లా వారు ప్రవర్తించి కువైటు స్త్రీల శరీరాలతో ఇష్టమొచ్చినట్లు ఆటలాడుకుని వినోదిస్తున్నారు. ఆ యుద్ధసమయంలో శారీరకంగానూ మానసికంగాను చిత్రహింసలకు లోనయిన ఆ కువైటు స్త్రీల కన్నీరు చెప్పిన వ్యధాభరితమైన కథలు ఎన్నో. "యుద్ధం ఒక



మారణహోమం. అది చరిత్ర పుటల్లో చెరగని రక్తాక్షరం."

"తబిమాయ్.. అల్లా కల్లి.. అతిని సోయ మాయ్"

(దాహం - అల్లా మిమ్మల్ని దయచూస్తాడు. దయచేసి కొన్ని నీళ్ళు ఇవ్వండి). ఒక పెద్ద విల్లాలోని ఆ గదిలో నగ్నంగా శరీరాన్ని ముడుచుకుని పడుకుని వున్న ఒక కువైటు అమ్మాయి హృదయవిదారకంగా మూలుగుతూ దాహం తీర్చుకోడానికి నీళ్ళిమ్మని అర్థిస్తోంది.

అందమైన ఆ అమ్మాయి దేహమంతా పంటిగాట్లతోనూ సిగరెట్ పీకల వాతలతోనూ నిండి కమిలిపోయి వుంది. కడుపుకి తిండి తిని ఎన్నిరోజులయిందో? నీళ్ళు తాగి ఎన్ని గంటలయిందో? పెదాలు ఎండిపోయి, ప్రాణం కళ్ళలో నిలిచి వున్నట్లుగా వుంది ఆ అమ్మాయి.

ఆ అమ్మాయేకాదు. అక్కడ ఆ విల్లాలో బంధింపబడి వున్న స్త్రీలందరి పరిస్థితి అంతకంటే తక్కువగా ఏమీలేదు. వారి వంటి పైన బట్టలు కూడా సరిగ్గా లేవు. వున్నా కూడా అవి చిరిగి పీలికలై వేలాడుతూ వారి దేహాల్ని బహిర్గతం చేస్తున్నాయి. బందీలుగా ఇరాక్ సైనికుల చేతిలో చిక్కిన ఆ స్త్రీల పరిస్థితి చాలా ఘోరంగా వుంది. ఇష్టమొచ్చినపుడు వచ్చి పశువుల్లా మీదపడే ఆ ఇరాక్ సైనికుల కామానికి, క్రూరత్వానికి ఆ స్త్రీల సున్నితమైన శరీరాలు గాయపడి బాగా కృశించిపోయి వున్నాయి.

దొరికిన వారిని దొరికినట్లుగా పట్టి బంధించి తెచ్చి, ఆహారం నీళ్ళు కూడా వారికి సరిగ్గా అందించకుండా ఆ విల్లాలోని గదుల్లో పడేస్తున్నారు ఆ సైనికులు. వారు తినగా మిగిలిన రొట్టెముక్కలను తీసుకొచ్చి ఆ గదుల్లో నేలపై విసిరికొడుతున్నారు. ఆకలితో అలమటించే ఆ అభాగినులు ఆ నేలపై పడివున్న రొట్టెముక్కలను ఆశగా ఏరుకుని, ఆత్రంగా నమిలి తిని, తమ ప్రాణాలను నిలబెట్టుకుంటున్నారు.

చెమట చుక్క చిందకుండా, కాలు క్రింద నేలపై పెట్టకుండా ఏసి గదుల్లో నివసిస్తూ కార్లలో తిరుగుతూ కోరిన తిండి తింటూ పనిమనుషుల చేత పరిచర్యలు చేయించుకుంటూ ఐశ్వర్యంలో మునిగితేలే ఆ కువైటు స్త్రీల పరిస్థితి అక్కడ చాలా దయనీయంగా వుంది. బహుశా కలలో కూడా వారు ఎన్నడూ ఇలాంటి ఘోరమైన స్థితిని ఊహించి వుండరేమో. విధి బలీయమైనది. ఎవరి జీవితాలతో అది ఎపుడు ఎలా ఆడుకుంటుందో మనం ఊహించలేము.

ముట్టుకుంటే మాసిపోయే పచ్చటి శరీర వర్ణంతో దేవకన్యల్లాంటి ఆ అరబిక్ అందగత్తెల నగ్నదేహాలతో ఇరాక్ సైనికులు క్రూరంగా ఆడుకుంటూ వినోదిస్తున్నారు. వారి ఆగడాలకు తాళలేని ఆ స్త్రీలు శరీరంలోని శక్తిని కోల్పోయి నడవడానికి కూడా ఓపిక లేక చెల్లాచెదురుగా ఆ గదుల్లో పడి వున్నారు. కాట్లకుక్కల్లా ఎప్పుడు వచ్చి మీదపడతారో, తమని హింసిస్తారో అని ఆ స్త్రీల గుండెలు భయంతో వణికిపోతున్నాయి. అక్కడ వున్న ఆ స్త్రీలు, స్త్రీ సహజమైన సిగ్గును మరిచిపోయి దాదాపు రెండు నెలలయింది. వంటిపై బట్టలు లేకుండా తిరగడం వారికి అలవాటైపోయింది. అంతెందుకు ఇరాక్ సైనికులు అందరిముందే వచ్చి మీదపడి వారిని అనుభవిస్తుంటే సిగ్గుతో ఎప్పుడో వారు చచ్చిపోయారు.



'యా అల్లా!.. యా రబ్! వైనక్ ఇంతె? తాల్ మిన్ని" (ఓ.. అల్లా!

ఓ ప్రభువా! ఎక్కడ వున్నావు? ఇక్కడికిరా) మమ్మల్ని కాపాడు అంటూ.. అల్లాకు మొరపెట్టుకుంటూ వాళ్ళు రోదిస్తున్నారు. వారి వేదన రోదనలతో ఆ విల్లా ప్రతిధ్వనిస్తోంది. అక్కడ వారి మొర వినేవారు ఎవరూ లేకపోయారు. బిగ్గరగా ఏడ్చే స్త్రీలను ఇరాక్ సైనికులు అదిలిస్తూ కాళ్ళతో తన్నుతూ, తిరగేసిన తుపాకి బట్‌లతో కొడుతూ బూతు మాటలతో వారిని తిడుతున్నారు. ఏడ్చేందుకు కూడా భయపడిన వారు గాయాల బాధలను అణుచుకుంటూ నిశ్శబ్దంగా ఏడుపుని ఆపుకుంటూ నిస్సహాయంగా, మెల్లగా మూలుగుతున్నారు.

పాపం దాహం అంటూ అల్లాడిపోయే ఆ అమ్మాయి పరిస్థితి చాలా ఘోరంగా వుంది. ముందే ఆ అమ్మాయి చాలా బలహీనంగా, సన్నగా వుంది. ఇరాకీ సైనికులు కొట్టిన దెబ్బలకి, వారు చూపించిన నరకానికి ఆ శరీరం తట్టుకోలేకపోయింది. కాసిని నీళ్ళు తాగి గొంతు తడుపుకోక పోతే ఇంకొద్ది సేపటిలో ప్రాణం వదిలేట్లు వుంది ఆ అమ్మాయి పరిస్థితి.

అక్కడ ఆ విల్లాలో బంధింపబడిన స్త్రీలందరూ దాదాపు అలాంటి పరిస్థితిలోనే వున్నారు కాబట్టి ప్రక్కవారిని, వారి బాధలను పట్టించుకునే స్థితిలో లేరు. ఎవరో వస్తారు రక్షిస్తారు అనే ఆశ కూడా వారిలో కొరవడింది. జీవచ్ఛవాలై, చావలేక, చచ్చిపోయే మార్గం కూడా కనరాక అక్కడ వాళ్ళు పడివున్నారు. ఆ అమ్మాయి అరుపులు మూలుగులు ఎక్కువ కావడంతో అవి బయటవున్న ఇరాక్ సైనికులకు వినబడ్డాయి. అంతే బయట కూర్చుని సిగరెట్ తాగుతూ కాపలా కాస్తున్న నరరూప రాక్షసుడిలాంటి ఒకడు కోపంగా లోపలికి వచ్చాడు. వాడిని, వాడి మొహంలో కనిపిస్తున్న క్రౌర్యాన్ని చూసి వాడు ఏం చేస్తాడో అని కదలకుండా అందరూ నిశ్చలంగా వుండిపోయారు. భయంతో బిగుసుకుపోయారు.

వాడు వచ్చీ రావడంతోనే ఆ అమ్మాయి దగ్గరికి వడిగా నడిచి వచ్చి కాలిబూటుతో ఆ అమ్మాయి గడ్డాన్ని పట్టి పైకి లేపాడు. వంకరగా నవ్వుతూ "తబి మాయ్? (నీళ్ళు కావాలా?) తబి సురబి? (తాగుతావా?)" అని అడిగాడు.

"అవును" అన్నట్లుగా కళ్ళతోనే దీనంగా సమాధానం చెప్పింది ఆ అమ్మాయి. వాడు వెంటనే హ్హా..హ్హా అని నవ్వుతూ "ఇప్పుడే నేను హమామ్‌కు (బాత్‌రూమ్) పోదామని అనుకుంటున్నా. నువు తబిమాయ్ (నీళ్ళు కావాలి) అంటుంటే విని లోపలికి వచ్చా! నా హబీబ్తి...(ప్రియా) ఇదిగో తాగు. కావలిసినన్ని నీళ్ళు కడుపు నిండా తాగు" అంటూ పాంటు జిప్ తెరిచాడు.

అలాంటి సంఘటనలు జరగడం అక్కడ మాములైపోయింది. అయినా కూడా అందరూ చలనం మరిచి కళ్ళప్పగించి వాడివైపే చూడసాగారు. తరువాత వంతు ఎవరిదో. ఎవరిని పట్టుకుని కొట్టి, బాధించి, హింసిస్తాడో అని వాళ్ళకి భయం గుండెల్లో నిండుకుంది.

"హేయ్.. కెల్బి(కుక్కా) నోరు తెరువు. తాగమంటే నోరుమూసుకుంటావే" అంటూ కాలితో ఆ అమ్మాయి మూతిపై పొడిచాడు. బాధను భరించలేక ఆ అమ్మాయి వికృతంగా ఒక్క కేక పెట్టింది. ఎండిపోయిన కళ్ళలో నీళ్ళు ఇంకా నిలువ వున్నట్లున్నాయి, కన్నీరు జలజలా ఒక్కసారిగా బుగ్గలపైకి రాలాయి. ఇక నోరు తెరవకపోతే ఏం చేస్తాడో అనే భయంతో బిగుసుకుపోయిన నోటిని బలవంతంగా తెరిచింది.

"హలువ - (మంచిది - వెరీగుడ్) చెప్పిన మాట ఇలా వినాలి" అంటూ వాడు తన మూత్రాన్ని ఆ అమ్మాయి నోట్లో పడేట్లుగా పోసేసాడు. ఆ సమయంలో అక్కడ మానవత్వం మంట గలిసింది. మృగత్వం విజృంభించి వికటాట్టహాసం చేసింది. పైశాచికంగా ప్రవర్తించాడు ఆ సైనికుడు. ఆ అమ్మాయి జుట్టు పట్టి పైకి లేపాడు. "యా.. అల్లా ఎక్కడ వున్నావు నువ్వు? ఇలాంటి ఘోర కృత్యాల్ని కళ్ళతో చూస్తూ మౌనంగా వుంటావా? వచ్చి మమ్మల్ని కాపాడలేవా? ఈ వెధవలబారినుండి మమ్మల్ని రక్షించలేవా?" అంటూ అల్లాను మనసులో ప్రార్థిస్తూ ఆక్రోశించింది ఆ అమ్మాయి. కళ్ళలోని కన్నీళ్ళు, వాడు ముఖం పై పోసిన మూత్రంతో కలిసి కాలువలా ప్రవహించాయి.

ఎండి పగిలిపోయిన పెదాలు హృదయంతో పాటు మండిపోయాయి. కానీ ఏమీ చెయ్యలేని నిస్సహాయత ఆ అమ్మాయిని ఆవరించింది. వాడి చేతిలో చిక్కిన ఆ అమ్మాయి సింహం నోట చిక్కిన జింకపిల్లలా విలవిల లాడుతోంది. ప్రాణం కళ్ళలోకి వచ్చేసింది.

"ఓ యుద్ధమా! ఎందుకు ఇంతటి విధ్వంసాన్ని సృష్టిస్తావు? మారణహోమాన్ని ఎందుకిలా రగిలిస్తావు? అమాయకులపై అబలలపై నిస్సహాయులపైనా, నీకు ఇంతటి కక్ష? అసలు ఏమిటి నీ ఉద్దేశం? ప్రాణాల్ని కావాలంటే ఒక్కసారిగా తీసుకుపో. సంతోషంగా నీకు సమర్పిస్తాం. కానీ ఇలా ప్రాణంతోవుండగానే మా శరీరాలను హింసించి ఆటలాడటం ఎందుకు ఇది న్యాయమా?"

"నియంత అయిన ఓ సద్దాం 'మనిషి రూపంలో వున్న ఓ పిశాచమా' క్రూరుడా! రక్తాన్ని త్రాగే రాక్షసుడా! నీకు కువైటు ప్రజలపై ఇంత ద్వేషం ఎందుకు? అమాయకుల ప్రాణాలతో చెలగాటమెందుకు? మా కన్నీటి శాపం తగిలి నువు సర్వనాశనం అయిపోతావురా! మా గోడు విని ఆ అల్లా నీ ప్రాణం తీయక వదలడురా" జరిగేదంతా కళ్ళప్పగించి చూస్తూ రగిలే కోపాన్ని అణచుకుంటూ మనసులోనే గొణుక్కుంటోంది మరోమూల కూర్చుని వున్నా ఒక నడివయస్కురాలు. ఆమె పేరు హయాత్. ఇరాక్ సైనికుల మృగ వాంఛా క్రీడలతో అలసిపోయి వుందామె. వారి అమానుషమైన శారీరక కలయికల వల్ల గర్భవతినేమో అనే అనుమానం ఆమె హృదయాన్ని తొలుస్తోంది. నెలదాటి ఇరవై రోజులయిపోయింది. ఇంకా రాలేదే? ఎలా? అది నిజమే. అని ఖచ్చితంగా తెలుసుకోవడం ఎలా?

ఛీ.. ఛీ దుర్మార్గులైన ఈ ఇరాకీ రక్తాన్ని కడుపులో మోయడమా? ఎంత నరకం? కత్తి తీసుకుని తన కడుపును కసిదీరా పొడిచి గడ్డ కట్టిన ఆ శత్రువు యొక్క రక్తాన్ని బయటికి తీసిపారేయాలన్నంత కోపంగా వుంది ఆమెకు. పదునైన ఆయుధం ఏదీ చేతికి దొరకడం లేదు. దొరికితే అనుకున్నంత పనీ చేసేటట్లుగా వుందామెలో గూడుకట్టుకున్న క్రోధం. ఏమీ చేయలేని అసహాయతతో పళ్ళు కొరుక్కుంది ఆమె.

తాము ఇక్కడినుండి ఎలా తప్పించుకోవాలి? ప్రాణాలతో ఎలా బయటపడాలి? ఏదైనా దారికనిపిస్తుందా అని ఆలోచిస్తూ కళ్ళు మూసుకుని గోడకు చేరగిలబడింది హయాత్.

స్త్రీల పరిస్థితే ఇలా వుంటే బందీలుగా దొరికిన పురుషుల పరిస్థితి మరీ ఘోరంగా వుంది. చిత్రహింసలు పెట్టి ప్రాణం వుండగానే వారికి నరకాన్ని చూపిస్తున్నారు ఇరాకీ సైనికులు. ఎదురు తిరిగిన వారిని నిర్దాక్షిణ్యంగా తుపాకీలతో కాల్చి చంపిపారేస్తున్నారు. స్థంభాలకు వేలాడగట్టి, వారి చేతిగోళ్ళని పీకి సిగరెట్‌లతో కాల్చి వాతలు పెట్టి వినోదిస్తున్నారు. వారి ముఖాలపై ఎంగిలి వూసి హేళనగా నవ్వుతూ "హాయ్ కువైటీ.. మగవాడివైతే పౌరుషం వుంటే రారా.. మాతో పోరాడు. కువైటీ కుక్కలారా! డబ్బు తెచ్చి పెట్టిన విలాసాలతో సున్నితంగా సుకుమారంగా ఆడవాళ్ళవలె తయారయ్యారు కదరా? ఆడవాళ్ళలాగా బురఖా వేసుకుని తిరగండిరా" అంటూ నోటికి వచ్చినట్లు తిడుతున్నారు. ఇష్టమొచ్చినట్లు కొడుతున్నారు. కోపం వస్తే చంపి శవాల్ని ఈడ్చుకెళ్ళి చెత్తలో పడేస్తున్నారు. యువకుల్ని, ధృడంగా వున్నవారిని బాధించి లారీల్లో నింపి ఇరాక్‌కు తరలిస్తున్నారు. అక్కడ మనిషి ప్రాణం విలువలేనిదయింది. యుద్ధం పేరుతో మనిషిలోని మానవత్వం మంట గలిసిపోయింది.

"ఇక ఈ బాధ భరించడం నావల్లకాదు. నా వళ్ళంతా పచ్చిపుండులా వుంది. నేను చచ్చిపోయేందుకు ఏదైనా మార్గం వుంటే చెప్పి పుణ్యం కట్టుకోండి ప్లీజ్. బ్రతికివుండి సాధించేది ఏమీలేదు. వాళ్ళ చేతుల్లో ప్రాణం పోయేకంటే ముందే నా ప్రాణం నా

ఇష్టప్రకారం పోవడం బాగుంటుంది" అంది ఆ అమ్మాయి వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తూ. అక్కడ వున్నవాళ్ళు బదులు పలకలేదు. జాలిగా ఒక్క చూపు ఆమెవైపు చూసారు అంతే. పువ్వులా బాగా పెరిగిన జీవితం. పట్టు పరుపుల మీద పవళించిన శరీరం కమిలిపోయి, కందిపోయి వున్నాయి. స్నానం చేసి చాలా రోజులయిందేమో. అత్తరు, పన్నీరులతో జలకాలాడే ఆ అరబిక్ అమ్మాయి శరీరం నుండి చెడువాసన వస్తోంది.

ఆరోజు ఆ అమ్మాయికి దుఃఖం ఆగలేదు. ఆ రోజంతా ఆపకుండా ఏడుస్తూనే వుంది. అప్పటికే ఆ విల్లాలో, రెండు నెలలుగా బంధింపబడివున్న ఆ స్త్రీలలో చాలామంది ఇరాక్ సైనికుల కామానికి గర్భవతులైనారు.

మరుసటిరోజు ఇరాక్ సైనికులు ఇంకో పదిమంది స్త్రీలను పట్టి బంధించి తెచ్చారు. వారిలో అమ్మా, కూతుర్లు కూడా వున్నారు. క్రొత్త స్త్రీలను చూడగానే ఆ సైనికుల ముఖాల్లో ఆనందం పరవళ్ళు తొక్కింది. ఎపుడెపుడు వారిని అనుభవిద్దామా అని ఆత్రపడుతున్నారు వారు.

ఒకడు ఆబగా మీదకి వచ్చి ఒక స్త్రీ నిండా కప్పుకున్న ముసుగును పట్టిలాగి తనవైపు లాక్కున్నాడు. ఆమె భయంతో కెవ్వున కేకవేసింది. ఆమె కేకతో బయట గదిలో వున్న కమాండర్ లోపలికి వచ్చాడు.

"ఏం జరిగింది? ఏం చేస్తున్నావు?" అని అరిచాడు కోపంగా.

"అబ్బే ఏం లేదు. జస్ట్ ముసుగు తీసాను" నసుగుతూ చెప్పాడు వాడు.

"సరే.. రేపు వెయ్యిమంది బందీలను ఇరాక్‌కు తరలిస్తున్నాం. ఇక్కడున్న ఆడవారిలో సగం మందిని సిద్ధంగా వుంచితే వాళ్ళతో కలిపి ఇరాక్ కు తీసుకెళతాము. అక్కడ ఇరాక్‌లో వున్న మన కమాండర్లకి ఈ అందమైన స్త్రీలను కానుకగా అందిస్తాను" నవ్వుతూ చెప్పాడు కమాండరు. వాడి మాటలు విని భయంతో ఏడుపు మొదలెట్టారు కొందరు స్త్రీలు. ఇంత వరకూ ఎలాగో తప్పించుకొని పారిపోవాలి అనే ఉద్దేశంతో ధైర్యంగా వున్న వాళ్ళకి బంధించి ఇరాక్ తీసుకెళ్తారు అని తెలియగానే ప్రాణభయం మొదలైంది.

"హేయ్ ఏడుపు మానండి. మా అందరితో సంతోషంగా ఎంజాయ్ చెయ్యండి. ఇరాకీ పురుషుల మగతనం ఎలా వుంటుందో ఒకసారి రుచి చూసి చెప్పండి. చేతగాని పిరికిదద్దమ్మలు మీ కువైటు మగవాళ్ళు. మాతో ఎదురు నిలిచి యుద్ధం చేసే ధైర్యం, దమ్ములేక అందరూ పారిపోయి దాక్కున్నారు. ఆడంగి వాళ్ళలా పారిపోయిన వాళ్ళను వదిలేసి మాతో ఇరాక్‌కు రండి. మిమ్మల్ని ఉంచుకుని నిజమైన సుఖం ఏమిటో రుచి చూపిస్తాం" అంటూ ఆ కమాండరు గదమాయించాడు.

అందరూ వెంటనే నోటిని అదుముకుని శబ్దం బయటకు రాకుండా వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తున్నారు. ఇంతలో బందీలుగా పట్టుకొచ్చిన తల్లీకూతుర్లను చూసిన కమాండరు కళ్ళు అమాయకంగా, లేతమొగ్గలా అందంగా కనిపిస్తున్న ఆ అమ్మాయిపై నిలిచాయి. వాడి పెదవులపై వంకర నవ్వు విచ్చుకుంది. హఠాత్తుగా ఎవరూ ఊహించని విధంగా ఒక్కంగలో ఆ అమ్మాయిని సమీపించి రెక్కపట్టుకుని దగ్గరికి లాగి ఈడ్చుకుంటూ ప్రక్కన వున్న గదిలోకి తీసికెళ్ళిపోయాడు. ఇదంతా ఒకే ఒక్క నిముషంలోపే జరిగిపోయింది. ఏం జరిగిందో అర్థం అయిన ఆ తల్లి బిడ్డ వెనకాలే పరిగెత్తబోయింది. అక్కడే వున్న సైనికుడు వికృతంగా నవ్వుతూ తన చేతిలో వున్న తుపాకిని కాళ్ళకు అడ్డుపెట్టాడు. దబ్బుమనే శబ్దంతో ఆమె ఆ గది వాకిట్లో పడిపోయింది.

"ఎక్కడికే పరిగెత్తుతున్నావు? వెనకే వెళ్ళావంటే నీకు కూడా తన మగతనం రుచి చూపిస్తాడు మా కమాండరు. కావాలంటే వెళ్ళు. కానీ కాసేపు ఆగు. అందమైన కన్నెపిల్లతో కాసేపు ఆడుకోనీ.. తరువాత నీవంతు ఎలాగూ వస్తుంది. నీ సంగతి చూడటానికి మేమందరమూ వున్నాము" అంటూ.. ఆవిడను గదిలోపలికి తోసి తలుపు గొళ్ళెం పెట్టాడు.

ఆ గదిలో స్త్రీలందరూ. నిస్తేజంగా నిలబడిపోయారు. అంతవరకూ మౌనంగా ఓ మూలగా గోడకు ఆనుకుని కూర్చుని వున్న "హయాత్"అనే నడివయస్కురాలు నోరు విప్పి "మనం ఇక్కడినుండి తొందరగా తప్పించుకుని పారిపోవాలి" అంది. అందరూ ఆమెవైపు పిచ్చిదానివా? అన్నట్లుగా చూసారు.

"వీళ్ళ చేతుల్లో ప్రాణాలు పోవడం కన్నా తప్పించుకుని పారిపోతూ ప్రాణాలు కోల్పోవడం మేలు. బయటపడగలిగితే ఈ హింసలు, నరకయాతన తప్పుతాయి. లేదా పట్టుబడి ప్రాణాలు కోల్పోతే అల్లా దగ్గరికి తొందరగా చేరుకుంటాం" అంది ఆమె ఏదో నిశ్చయానికి వచ్చినట్లుగా, కొంతమంది స్త్రీలు ఆమె వైపు ఆసక్తిగా ఆశగా చూసారు.

దాహం అని కలవరించిన అమ్మాయికి అప్పటికే స్పృహ తప్పినట్లుంది. కదలకుండా ఒక మూల పడివుంది. ప్రాణం వుందో పోయిందో కూడా తెలియడం లేదు.

దాదాపు రెండుగంటల తరువాత ఆ గది తలుపు తెరుచుకుంది. లేత మొగ్గలా వున్న అమ్మాయి, దాదాపు వివస్త్రగా, చెదిరిపోయిన జుట్టుతో వంటినిండా పంటి గాట్లతో వికృతంగా, వడిలిపోయిన పువ్వులా మారి ఆ గదిలోకి నెట్టబడింది. ఎంతగా ఏడ్చిందో, ఎంతగా మొత్తుకుని మొఱపెట్టిందో తెలియదుకానీ ఆ అమ్మాయి గొంతు అలసిపోయి బొంగురుగా మారి శబ్దం కీచుమంటూ వస్తోంది. ఏడ్చేందుకు ఓపిక, శక్తిలేనట్లుగా సొమ్మసిల్లి ఆ గదిలోని నేలపై పడిపోయి అలాగే కదలకుండా వుండిపోయింది. ఆ.. అమ్మాయికి ఈ అమ్మాయి తోడయినట్లుంది. ఇద్దరి పరిస్థితి ఘోరంగా వుంది. చూసేవారికి హృదయాలు ద్రవించాయో, మొద్దుబారి, కఠినత్వాన్ని నింపుకున్నాయో చెప్పడం కష్టం. కానీ అక్కడున్న అందరిలోకి ఆ నడివయస్కురాలైన "హయాత్" కళ్ళు కోపంతో మండిపడ్డాయి. పిడికిళ్ళు గట్టిగా బిగించి పళ్ళుకొరుకుతూ చుట్టూ పరికించి చూసింది.

అప్పటికే బాగా చీకటి పడింది. ఆ గదిలోనేకాక... ఆ విల్లా చుట్టూ కూడా వెలుతురు కృంగిపోయి చీకటి అలుముకుంది.

యుద్ధం వలన కలిగిన విధ్వంసంలో కువైటు దేశం అప్పటికే నాశనం అయిపోయి, ఎలక్ట్రిసిటీ, టెలిఫోను, ట్రాన్సుపోర్టుల్లాంటి సౌకర్యాలను కోల్పోయింది. దేశమంతా చీకటిలో మగ్గుతోంది.

బయట ఇరాకి సైనికులు తమ డిన్నరును భుజించడానికి తయారవుతున్నారు. గ్లాసులు, పాత్రలు, ప్లేట్లు కదులుతున్న చప్పుడు వినిపిస్తోంది.

ఉన్నట్లుండి విసురుగా పైకి లేచింది హయాత్. "మీలో శక్తి వున్నవారందరూ లేచి ఇటురండి" అని పిలిచింది. అందరూ కాస్త సందేహంగా ఎందుకా అని ఆమెవైపు చూసారు. "మిమ్మల్నే లేచి తొందరగా ఇక్కడికి రండి" అంది కఠినంగా ఆజ్ఞాపిస్తున్నట్లుగా. ఆమె మాటకు లోబడిన కొందరు వెంటనే లేచి ఆమె వద్దకు వచ్చారు.


"మనం తప్పించుకోవాలంటే ఇదే సరైన సమయం. తిన్న తరువాత వాళ్ళు వచ్చి మన మీద పడక ముందే మనం ఇక్కడనుండి తప్పించుకోవాలి. అందరూ కలిసి ఈ కిటికీ రెక్కల్ని లాగండి అవి ఊడిపోతాయి. మనం ఇక్కడ ఈ కిటికీలోనుండి బయటికి దూకి పరిగెత్తి పారిపోవచ్చు" చెప్పిందామె. పైకి లేచి అక్కడికి వచ్చిన వారిలో కొందరు నీరసంగా, నమ్మకం లేనట్లుగా ఆమె వైపు చూసారు. ఇరాక్ సైనికులు చూస్తే చంపేస్తారు అనే భావం, భయం వారి కళ్ళలో కదలాడింది. కొందరు పట్టుదలగా అడుగుముందుకువేసి కిటికీ దగ్గరికి వచ్చారు. ఆ కిటికీకి వున్న నాలుగు రెక్కల్లో ఒకదాన్ని పట్టుకుని నలుగురు స్త్రీలు బలంగా లాగారు. ఆ విల్లా కాస్త పురాతనమైనది కావడంతో కాస్త తొందరగానే అది ఊడి వారి చేతుల్లోకి వచ్చింది. ఇనుమడించిన ఉత్సాహంతో పదినిముషాలు ప్రయత్నించి మిగతా మూడింటిని కూడా లాగి పారేశారు. "ఊ.. కదలండి.. తొందరగా కిటికీలోనించి దూకి బయట పడండి" చెప్పింది హయాత్. వారందరూ పరుగున వచ్చి ఒక్కొక్కరుగా బయటికి దూకి తమకు తోచిన దిక్కుకు పరుగుపెట్టారు. ఆఖరుగా ఆ ఇద్దరు అమ్మాయిలను

మోసుకొచ్చి బయట పడేయాలని చూసారు. కానీ ఇంతలో ఆ గది తలుపు తెరుచుకుంది. దురదృష్టం వారిని వెక్కిరించింది. ఇంకొక్క నిముషం అలాగే వుంటే ఆ గదిలో వున్న స్త్రీలంతా బయటపడి తప్పించుకుని వెళ్ళి ప్రాణాలు దక్కించుకునే వారే కాని అదృష్టం ఈ నలుగురి పక్షాన లేదు. ఆఖరికి అందరికీ దారి చూపించిన హయాత్, సొమ్మసిల్లి స్పృహ తప్పిపోయిన ఇద్దరు అమ్మాయిలు, వారిలోని ఒక అమ్మాయికి తల్లి అయిన ఆవిడ అక్కడ ఆ గదిలో మిగిలిపోయారు.

ఆ క్షణం ఎంతో భయంకరమైనది. ప్రాణం మీద ఆశను వదిలేసుకున్నారు వాళ్ళు.

ఎంతో ఆశగా వారి శరీరాలతో ఆడుకుందామని ఆ గదిలోకి అడుగు పెట్టిన ఇరాక్ సైనికులకు ఒక క్షణం పట్టింది అక్కడి పరిస్థితి అర్ధంకావడానికి ఏం జరిగిందో తెలియగానే ఆవేశం పట్టలేక ఒకడు. తుపాకిని పైకి ఎత్తి వరుసగా నలుగుర్నీ కాల్చి పారేసాడు. ప్రాణం పోయిన దేహాలు నేలపైకి జారిపోయాయి. ఆ గదిలో రక్తం వెల్లువై ప్రవహించింది. అంతటా నిశ్శబ్దం కమ్ముకుంది. అంతే!

1990 గల్ఫ్‌యుద్ధం.



దాదాపు 5000 మంది స్త్రీలు రేప్ చేయబడ్డారు.

7000 మంది స్త్రీపురుషులు బందీలుగా ఇరాక్‌కు కొనిపోబడ్డారు. కొన్నివేలమంది ప్రాణాలు కోల్పోయారు. కొందరి జాడ అసలు తెలియనేలేదు. గల్ఫ్ యుద్ధం చేసిన గాయాలు, నష్టాలు మాటల్లో వివరింపలేనన్ని. యుద్ధంలో పారిపోయిన కువైటీస్, స్త్రీలు, పిల్లలు సౌది అరేబియాలోని శరణార్ధుల శిబిరాల్లో తలదాచుకున్నారు. అమెరికా జోక్యం చేసుకుని కువైటుకు మద్దతుగా నిలిచి సద్దాంను తరిమి కొట్టేంతవరకు కువైటీస్ దేశాన్ని వదిలిపెట్టి పరాయి దేశాల్లో శరణార్ధులై, కాలం గడిపారు. ఆరునెలల తరువాత ఫిబ్రవరి 28వ తేదీన వారికి సద్దాం నుండి స్వతంత్రం లభించింది. "జేన్ సాసన్" అనే అమెరికన్ రచయిత్రి సౌదీ అరేబియాలోని శరణార్ధుల శిబిరానికి వెళ్ళి వారిని పరామర్శించి ముఖ్యంగా స్త్రీలను కదిలించి వారి కన్నీటి గాథలను "ద రేప్ ఆఫ్ ద కువైట్" అనే పుస్తకంగా మలిచింది. యుద్ధాన్ని, అది చేసే మారణహోమాన్ని, అది మిగిల్చే గాయాల్ని కన్నీళ్ళను గురించి ఎంత రాసినా తక్కువేకదా!

ఇప్పటికీ కువైటు వాళ్ళు గల్ఫ్‌యుద్ధం మిగిల్చిన గాయాల్ని తడుముకుంటూ కన్నీళ్ళను కారుస్తూ దాని గురించి కథలుగా చెప్పుకుంటూ వుంటారు.

## శ్రీదేవి కథ.

**ఎదురుగా వున్న అద్దంలో** ఒకసారి తన రూపాన్ని పరిశీలించి చూసుకుంది శ్రీదేవి. ఎంతో వికృతంగా కనిపించే ఆ రూపం తనదే అని నమ్మలేకపోతోంది ఆమె. నాలుగునెలల ముందు తన అందమైన రూపాన్ని అలా అద్దంలో చూసుకున్నప్పుడు, సినిమా హీరోయిన్ శ్రీదేవిని మించిన అందంతో నిండిన ఆ అద్దం ఎంతగానో మురిసిపోయేది. పచ్చటి పసిమిఛాయతో మెరిసిపోయే వంటి రంగు, గులాబి పువ్వుల్లాంటి చెక్కిళ్ళు, ముత్యాల్లాంటి తెల్లటి పలువరుస, తీర్చిదిద్దినట్లున్న నల్లటి కనుబొమలు, పెద్దకళ్ళు, ఎర్రటి పెదవులు ముఖంలో అమర్చినట్లు అందంగా వుండేవి.

మరి ఇపుడు? అద్దంలో కనిపించే ఈ రూపం తనను వెక్కిరిస్తోంది. వూడిపోయిన పళ్ళు, బోసినోరు, విరిగిన దవడ ఎముకతో ఆకృతి చెదిరిన ముఖం, పగిలిన పెదవులు, ఎన్నో ఆపరేషన్లు చేసి, కుట్లు వేసిన ముఖం భయాన్ని కలిగిస్తోంది.

"ఒకప్పుడు ఎంతో అందంగా వున్నాను అని మురిసిపోయేదానివి కదా? మరి ఇపుడు ఎంత వికారంగా వున్నావో బాగా చూసుకో" అంటూ అద్దం అవహేళన చేస్తున్నట్లనిపించి అణుచుకోలేని ఆవేదనతో కళ్ళలోనుండి నీళ్ళు జలజలా రాలాయి శ్రీదేవికి. ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని, ఇంత కష్టం వస్తుందని ముందే వూహించి వుంటే తను ఈ కువైటు దేశానికి వచ్చి వుండేదేకాదు. కలలో కూడా ఈ ఎడారి దేశానికి రావాలని ఆశపడేదేకాదు. తన స్థితిని, పరిస్థితిని ఈ పరాయి దేశంలో మరిచిపోయి క్షణికమైన ఉద్రేకానికి, తాత్కాలికమైన సుఖానికి లొంగిపోయినందుకు తనకు తగిన శాస్తి జరిగింది. జీవితమే నాశనం అయిపోయింది. ఎంతో అందమైన తన రూపం అందవిహీనంగా మారిపోయింది. కాలు, చేయి విరిగి చక్రాల కుర్చీకి జీవితం అంకితం అయింది. ఏ ముఖం పెట్టుకుని ఇప్పుడు ఇంటికి తిరిగివెళ్ళాలి? అసలు తిరిగి ఇండియాకు ఇలా వెళ్ళగలదా? వెళ్ళి తన ముఖం ఇలా అక్కడ అందరికీ చూపించగలదా? ఇక్కడే చనిపోవడం మేలేకానీ ఇలా వెళ్ళి ఇంటి దగ్గర పదిమందికీ ఈ ముఖాన్ని చూపించడం మాత్రం నరకమే.

తాను చేసిన తప్పుకు దేవుడు ఇంత ఘోరమైన శిక్షను వేస్తాడని, ఈ పరాయి దేశంలో కువైటులోని అల్‌రాజి హాస్పిటల్లో కాలు, చేయి విరిగి జీవశ్చవంలా కొన్ని నెలలు బెడ్‌పైనే పడివుండాల్సి వస్తుందని, డాక్టర్లు చేసిన ఆపరేషన్లతో, ఒళ్ళంతా కుట్లతో అంతులేని బాధను అనుభవించాల్సి వస్తుందనీ కలలో కూడా వూహించలేదు.

నాలుగు నెలల క్రితం అందానికి నిర్వచనంలా, అందరికీ అసూయ కలిగించేలా వుండి, ఎంతో హుషారుగా తిరుగుతూ పనిచేసుకుంటూ వుండే శ్రీదేవికి తన జీవితంలో జరిగిన ఆ విషాద సంఘటన, జీవితాన్ని అగమ్యగోచరం చేసిన ఆ దుర్ఘటన గుర్తొచ్చి దుఃఖం పెల్లుబికింది.

"శ్రీదేవీ.. తాలె.. (ఇలా..రా)" బిగ్గరగా అరిచింది మామా (సేతాని). బాత్‌రూము క్లీన్ చేస్తున్న శ్రీదేవి మామా అరుపులకు భయపడి చేతిలో వున్న బ్రష్‌ను అక్కడే వదిలేసి కంగారుగా హాల్లోకి పరిగెత్తుకుని వచ్చింది.

మామా శ్రీదేవి వైపు వురిమి చూసి కోపంతో ఆమె జడపట్టుకుని లాగి "ఏమిటిది"? అంటూ అరిచింది.

మామా కోపాన్ని చూసి బిత్తరపోయిన శ్రీదేవి ఏం జరిగిందో అర్థంకాక "ఏమయింది మామా?" అని అడిగింది.

"నువు మా యింట్లో పనిలో చేరిన మొదటి రోజే నీకు నేను ఏం చెప్పాను? నీ జుట్టు కత్తిరించి గుండు చేయించుకో, లేదా నీ జుట్టు మడిచి పైకి కట్టుకుని తలలోని వెంట్రుకలు కనిపించకుండా తల నిండా "హిజాబ్" (గుడ్డ) చుట్టుకో. తలకు హిజాబ్ లేకుండా.. నీ రూములోనుండి బయటకు రావద్దు. బాబా ఇంట్లో వున్నప్పుడు ఆయన ఎదురుగా అసలు రావద్దు అని చెప్పానా? లేదా? మరి ఇపుడు నీ హిజాబ్ ఏమయింది? " ప్రశ్నించింది మామా కోపంతో మండిపడుతూ.

ఏదో పెద్ద తప్పు జరగరానిది జరిగినట్లు కోపంతో అరుస్తున్న మామాను చూసి "అదికాదు మామా. నాకు వున్న రెండు గుడ్డల్ని పొద్దుటే వుతికి ఆరేసాను. ఇంకో గంటలో అవి ఆరిపోతాయి. అపుడు దాన్ని తలకు చుట్టుకుంటాను" అని చెప్పింది శ్రీదేవి.

"అదంతా కుదరదు. నిద్రపోయేటప్పుడు తప్ప నువ్వు నీ తలకు హిజాబ్ లేకుండా ఎవరికీ కనిపించకూడదు. ముఖ్యంగా మీ బాబాకు నువ్వు అసలు కనిపించకూడదు. మరొక్కసారి నువు ఇలా కనిపించావంటే నిన్ను తీసికెళ్ళి ఆ ఏజంటుకే అప్పగిస్తాను. అతడు నిన్ను వేరే ఇంట్లో పనికి పెడతాడు. నా యింట్లో మాత్రం ఆడది తలకు హిజాబ్ లేకుండా పని చేయడం నాకు నచ్చదు. ఇస్లాం మత సిద్ధాంతం ప్రకారం ఆడది తలనిండా గుడ్డకట్టుకోవాలి, లేకపోతే మహాపాపం" అంది మామా.

ఇంతలో మామా అరుపులు విని బెడ్‌రూములో వున్న బాబా హాల్లోకి వచ్చాడు. వస్తూనే తలకు గుడ్డలేకుండా బారాటి పొడవు జడతో వున్న శ్రీదేవిని ఆమె అందాన్ని కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాడు. ఆయన కళ్ళలో కోరికతో కూడిన ఏదో భావం కదలాడింది. బాబా చూపులను గమనించిన మామా ''ఏమే ఇంకా ఇక్కడే నిలబడి వున్నావా? పో. వెంటనే పోయి తలకు గుడ్డ చుట్టుకుని పని చూసుకో పో'' అని శ్రీదేవిని హాల్లోంచి బయటికి తోసింది.

వెంటనే బ్రతుకు జీవుడా అనుకుని తన రూములోనికి పరుగు తీసింది శ్రీదేవి.

హాల్లో నిలబడి ఇంకా శ్రీదేవి వెళ్ళిన వైపే గుడ్లప్పగించి చూస్తున్న భర్తను చూసి ''ఖలీల్ ఏంటాచూపు? ఆడది కనిపిస్తే చాలు అన్నీ మర్చిపోతావు. అది ఎంత అందంగా వున్నా కూడా. ఆఫ్టాల్ మన పనిమనిషి. దాన్ని నువ్వు చూడటం ఏమిటి? నీ ప్రవర్తన నాకు నచ్చటం లేదు. ఈ మధ్య నేను నిన్ను గమనిస్తున్నాను. అది కనిపిస్తే చాలు నీ వళ్ళు స్వాధీనం తప్పుతోంది. కాస్త జాగ్రత్త'' అంటూ - భర్తమీదకి పోట్లాటకు దిగింది మామా.

''అబ్బ! నోరుముయ్యవే. ఏదో నీ అరుపులు విని బయటికి వచ్చాను. లేకపోతే నాకెందుకు? నువు ఇంత అందంగా వుండగా వేరే వాళ్ళతో నాకు పని ఏమిటి? అయినా పనిమనిషిని నేనెందుకు చూస్తాను? చాల్లే. ఆపు నీ మాటలు'' అంటూ విసురుగా వచ్చిన దారినే బెడ్ రూములోనికి వెళ్ళిపోయాడు బాబా ఖలీల్.

''ఇంత అందంగా వున్న పనిమనిషిని ఇంట్లో పనికి పెట్టుకోవడం నాదే తప్పు. వీడి బుద్ధి అసలే మంచిదికాదు'' అనుకుంటూ మనసులో దిగులు పడింది మామా.

ఆ కథ అంతటితో ముగిసేదికాదని, ఆ సమయంలో మామాకు తెలిసివుంటే వెంటనే శ్రీదేవిని, ఏజంటు ఆఫీసుకు త్రిప్పి పంపించి వేసి వుండేది. కానీ జరగాల్సింది జరగకుండా వుండదు కదా!

తన గదిలోకి వెళ్ళిన శ్రీదేవి సగం ఆరిన తల గుడ్డను తీసుకుని అద్దం దగ్గరికి వెళ్ళింది. అద్దంలో కనిపించే అందమైన తన రూపం చూసి మురిసిపోయింది. మామా మనసులోని భయం, అసూయ, బాబా కళ్ళలోని కోరిక గుర్తొచ్చి కాస్త గర్వంగా అనిపించి నవ్వుకుంది. అసాధారణ సౌందర్యవతి శ్రీదేవి. అరబిక్ ఆడవాళ్ళనే తలదన్నే సౌందర్యం ఆమెది. ఆమె అందమేకాదు. వంట్లోని వంపుసొంపులు ఎక్కడివక్కడ అమర్చినట్లుగా వుండి మగవాళ్ళనే కాదు సాటి ఆడవాళ్ళను సైతం కళ్ళు తిప్పుకోనివ్వదు. వయసు వచ్చినప్పటి నుండీ ఆమెకు ఇవన్నీ అలవాటు అయ్యాయి. చదువుకునేటప్పుడు కూడా తోటి స్నేహితురాళ్ళు ఆమె అందాన్ని చూసి అసూయ పడేవాళ్ళు. అది ఎంతో సంతోషాన్ని గర్వాన్ని శ్రీదేవికి కలిగించేది. ఇదిగో ఇపుడు కూడా. మామా అసూయ పడుతూంటే బాబా ముందుకు రావద్దు అంటుంటే కాస్త అతిశయంగా, సంతోషంగా అనిపించింది శ్రీదేవికి. అదే ఆమె పాలిట శాపంగా మారింది. ఆమె జీవితాన్ని మార్చివేసి ఆమెను శాపగ్రస్తురాలిగా చేసింది.

మరొక్కసారి తన అందాన్ని అద్దంలో పరిశీలించి చూసుకుని, తలచుట్టూ గుడ్డను పొందికగా చుట్టుకుని, వెంట్రుకలు బయటికి కనపడకుండా జాగ్రత్తపడుతూ చుట్టూ పిన్నులు బిగించుకుంది. ఇంకోసారి తలకు హిజాబ్ లేకుండా మామా కంట్లో పడకూడదు. అలా జరిగితే అంతే సంగతులు, వెంటనే మామా తనని తీసికెళ్ళి ఏజంటుకు అప్పగించేస్తుంది. ఇంకోసారి ఇలా జరగకుండా వళ్ళు దగ్గరపెట్టుకుని జాగ్రత్తగా పనిచేయాలి అని నిర్ణయించుకుంది శ్రీదేవి.

అలా రెండు నెలలు గడిచిపోయాయి. అపుడపుడూ బాబా ఎదురుపడినపుడు మాట్లాడేటప్పుడు, అదోలా నవ్వుతూ కళ్ళెగరేసి చూసేవాడు. టీ, కాఫీలు అందించేటప్పుడు, చేతులు తగిలించి మరీ అందుకునేవాడు. గదులు శుభ్రం చేస్తూ అటూ ఇటూ తిరుగుతున్నప్పుడు ఆమె ప్రక్కనుండి తాకుతూ వెళ్ళేవాడు. ఇవన్నీ కూడా మామా ఇంట్లో లేనపుడు, ఆమె చూడనపుడు మాత్రమే చేసేవాడు. మామ ఇంట్లోవున్నపుడు బుద్ధిమంతుడిలా, బెడ్‌రూములోనే గడిపేవాడు బాబా.

ఒకరోజు హాల్లోని షోకేసును శుభ్రం చేస్తూ అందులోని వస్తువుల దుమ్ము దులిపి సర్దిపెడుతూ పరధ్యానంగా వున్న శ్రీదేవి వెనుక చేరి, ఆమె భుజాలపై చేతులు వేశాడు బాబా. ఉలిక్కిపడి తిరిగి చూసింది శ్రీదేవి. ఎటూ కదలలేని స్థితిలో అలాగే నిలబడిపోయింది ఆమె. అదే అదనుగా. ఆమె నడుం గట్టిగా పట్టుకుని దగ్గరికి లాక్కున్నాడు బాబా. ఎంతో కలవరానికి గురయింది శ్రీదేవి. కోరికతో నిండివున్న బాబా కళ్ళను చూసి భయపడింది శ్రీదేవి. ఆయన వెచ్చటి స్పర్శ. శరీరంలో అలజడిని రేపెడుతుంటే ఏం చెయ్యాలో అర్థంకాక ఓక్షణం అలాగే వుండిపోయింది. అది ఆమె అంగీకారంగా భావించి ఆమెను అలవోకగా చేతుల్లోకి ఎత్తుకుని బెడ్‌రూములోకి తీసుకెళ్ళబోయాడు. గట్టిగా పట్టుకుని దగ్గరికి లాక్కున్నాడు బాబా. ఎంతో కలవరానికి గురయింది శ్రీదేవి. కోరికతో నిండివున్న బాబా కళ్ళను చూసి భయపడింది శ్రీదేవి. ఆయన వెచ్చటి స్పర్శ. శరీరంలో అలజడిని రేపెడుతుంటే ఏం చెయ్యాలో అర్థంకాక ఓ క్షణం అలాగే వుండిపోయింది. వెంటనే తేరుకుని గట్టిగా గింజుకుంది శ్రీదేవి. "మామా చూస్తే చంపేస్తుంది బాబా. నన్ను వదులు" అంటూ ఆయన పట్టునుండి విడిపించుకుంది. మామా అన్న మాట వినగానే భయపడిన బాబా, శ్రీదేవిని వదిలేసి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

చాలా ఏళ్ళ తర్వాత పరపురుషుని స్పర్శ ఎన్నో ఆలోచనలను ఆమెలో కలగచేయగా, ఆ రాత్రంతా కలత నిదురతో గడిపింది శ్రీదేవి.

ఆ రోజు సాయంత్రం మామా అమ్మగారికి గుండెపోటు వచ్చిందనే ఫోనుకాల్ రావడంతో మామా కంగారుపడి హడావిడిగా కారెక్కి హాస్పిటల్‌కు వెళ్ళిపోయింది. ఆ రాత్రి మామా ఫోను చేసి "అమ్మగారికి ఆపరేషను అవసరం అంటున్నారు కాబట్టి నాలుగురోజులు హాస్పిటల్‌లోనే వుండాల్సి వస్తుందనీ, ఇల్లు జాగ్రత్త" అని చెప్పింది.

"సరే మామా అలాగే" అంది శ్రీదేవి.

ఆ రాత్రి తొందరగా పనిముగించుకుని, తన రూముకెళ్ళి పడుకోవాలి అనే ఆలోచనలో వుంది శ్రీదేవి. ఇంతలో బాబా వంటింట్లోకి వచ్చి "శ్రీదేవీ నాకు తలనొప్పిగా వుంది కాస్త టీ చేసి తీసుకునిరా" అంటూ బెడ్‌రూములోకి వెళ్ళిపోయాడు. కాస్త భయంగానే బాబా బెడ్‌రూములోకి అడుగుపెట్టింది శ్రీదేవి. టీ కప్ అందిస్తుండగా "శ్రీదేవీ కాసేపు కూచో" అన్నాడు బాబా.

"లేదు బాబా నేను వెళ్ళి పనిముగించుకుని పడుకుంటాను" అంది శ్రీదేవి.

"కూచోమని చెప్తున్నాకదా.. కూచో" అన్నాడు బాబా కోపంగా.

బాబా మాట కాదనలేక అక్కడే వున్న కుర్చీలో కూర్చోబోయింది శ్రీదేవి.

"అక్కడ కాదు. ఇక్కడ, నా ప్రక్కన ఈ మంచంపై కూచో" చెప్పాడు బాబా.

బిత్తరపోయింది శ్రీదేవి. మామా కూడా ఇంట్లో లేదు. ఏం జరుగుతుందో ఏమో? "ఎందుకంతగా ఆలోచిస్తావ్? వచ్చి కూర్చో. నీ అందం నా మతి పోగొడుతోంది తెలుసా? ఇన్ని రోజులూ ఓపికగా వున్నాను. ఇక ఈరోజు నిన్ను వదిలిపెట్టడం నావల్లకాదు. నువు వప్పుకుంటే నువు కోరినవి అన్నీ తెచ్చి పెడతాను. నీకు కావలసినంత డబ్బు ఇస్తాను. నువు వప్పుకోకపోతే ఈరోజు నిన్ను బలవంతంగా అయినా అనుభవించి తీరతాను. నువు నా పనిమనిషివి గుర్తుంచుకో" అన్నాడు బాబా. ఏం చేయాలో అర్థంకాలేదు శ్రీదేవికి. ఈలోపల

ఆమె దగ్గరికి జరిగిన బాబా. ఆమెను మంచం పైకి లాగేసాడు. మెత్తటి పరుపు, బ్లాంకెట్ క్రొత్తగా వుండి ఏదో తెలియని మత్తును కలిగిస్తున్నాయి.

అదేకాదు, బాబా స్పర్శకూడా. ఎక్కడో మనసులో తన అందం మీద నమ్మకం, గర్వం ఆమెను తనపరిస్థితిని మరచి బాబాకు సహకరించేట్లు ప్రోత్సహించాయి.

''మీ మామాకు తెలియకుండా మనం అపుడపుడూ కలుసుకుందాం. నీకు కావలసినంత డబ్బు నేను ఇస్తాను. నీ అందాన్ని మనస్ఫూర్తిగా నన్ను అనుభవించనివ్వు. నువు కూడా ఆనందించు. ఉప్పూ, కారం తినే శరీరం, నీలో కూడా కోరికలు వుంటాయి కదా'' అన్నాడు బాబా నవ్వుతూ సంతృప్తిగా, సంతోషంగా పైకి లేస్తూ.

అంగీకరించినట్లుగా తలవూపింది శ్రీదేవి. అప్పటికే ఆమె శరీరం బాబా స్పర్శకు, ఆయనిచ్చిన సుఖానికి బానిస అయిపోయింది. మామాకు తెలిస్తే ఏమవుతుందో అనే ఊహ కూడా ఆ సమయంలో ఆమెకు రాలేదు. ఏదో తెలియని ఉద్వేగానికి, ఉత్సాహానికి లోనయింది శ్రీదేవి హృదయం. ''మన మనసును కంట్రోల్ చేసుకోలేకపోతే జరిగే అనర్థాలు ఎన్నో, తరువాత జరిగే పరిణామాలను చూసి జీవితాంతం చింతించాల్సి వస్తుంది'' శ్రీదేవి జీవితంలో అదే జరిగింది.

నాలుగురోజుల తరువాత మామా హాస్పిటల్ నుండి నీరసంగా తిరిగి వచ్చింది. వాళ్ళమ్మగారికి గుండె ఆపరేషను జరగడంతో ఆమె బాగా దిగులు పడింది. మామా మనసంతా వాళ్ళమ్మగారి ఆరోగ్యం పైనే వుండి ఇంట్లో ఏం జరిగిందో ఏం జరుగుతోందో గమనించే స్థితిలో ఆమె లేదు. ఆ నెలలో తరువాతి రోజులన్నీ కూడా మామా వాళ్ళమ్మగారి కోసం ఆసుపత్రిలోనూ అమ్మగారింట్లోనూ గడపాల్సి వచ్చింది.

ఇక్కడ బాబా ఒక్కరోజు కూడా విడవకుండా ప్రతిరాత్రి మరువకుండా శ్రీదేవిని తన బెడ్‌రూములోనికే పిలిపించుకుని మరీ తన కోరికలు తీర్చుకుంటున్నాడు.

ఇండియాలో తన తాగుబోతు భర్తతో ఎన్నో బాధలు అనుభవించి ఏ సుఖానికీ నోచుకోని శ్రీదేవికి ఇప్పుడు బాబాతో పొందే ఈ అనుభవం ఎంతో కొత్తగా, వింతగా వుండి ఎంతో వుత్తేజాన్ని ఆమెలో కలిగిస్తోంది.

తన దేశాన్ని, కుటుంబాన్ని, తన వారినందరినీ విడిచి, ఒక పనిమనిషిగా తాను కువైటు దేశానికి వచ్చి వున్నానని, తన యజమానితో ఏర్పడిన ఈ సంబంధం ఎలాంటి ముప్పును తెస్తుందో అని ఒక్క నిమిషం ఆమె ఆలోచించి జాగ్రత్తపడివుంటే శ్రీదేవి జీవితం., భవిష్యత్తు ఇలా కాకుండా బాగుండి వుండేవి.

ఆ నెలరోజులు నేలను విడిచి రెక్కలు కట్టుకుని గాలిలో తేలుతూ ఆనందంగా ఆకాశంలో విహరించింది శ్రీదేవి. తనకు అందించిన సుఖానికి, సంతోషానికి బదులుగా బాబా కూడా నెలజీతమేకాక, అదనంగా లెక్కలేనంత డబ్బును శ్రీదేవికి అందించాడు. వెంటనే ఆ డబ్బును పిల్లల ఖర్చులకు కొంత, తన బ్యాంకు అక్కౌంటుకు కొంత పంపించేసింది శ్రీదేవి. అయితే అన్నిరోజులు మనవి కావు. అన్నివేళలూ అనుకున్నట్లుగా అనుకూలించవు. అలాంటిదే ఆ రాత్రికూడా. శ్రీదేవి అందాన్ని హరించివేసి కాలు, చేయి, ముఖంలోని ఎముకలన్నింటినీ విరగగొట్టి జీవితాంతం చక్రాల కుర్చీలో జీవశ్చవంలా పడివుండమని నిర్దేశించిన రాత్రి అది.

ఆ రాత్రి.

సమయం పదిగంటలు దాటింది. ఆ సాయంత్రమే మామా ఫోను చేసి ఈ రాత్రికి కూడా తాను రావడం లేదని చెప్పింది. ఆమె రాకపోవడం, బాబాకు, శ్రీదేవికి చాలా సంతోషాన్ని కలిగించింది. మంచంపై తెల్లటి దుప్పటి పరిచి, దానిపై ఎర్రటి గులాబీపూల రేకులను చల్లింది శ్రీదేవి. సెంటెడ్ కాండిల్స్‌ను వెలిగించి బెడ్‌రూములో నాలుగువైపులా వాటిని అమర్చింది. స్నానం చేసి తెల్లటి సిల్కుగౌను వేసుకుని బాబా తెచ్చి ఇచ్చిన "గివెంచీ" పెర్‌ఫ్యూమ్‌ను వంటిపై చల్లుకుని బెడ్‌రూములోకి ప్రవేశించింది. అప్పటికే బాబా బెడ్ పైన కూర్చుని ఆత్రంగా ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు. కాండిల్స్ వెదజల్లే పరిమళం ఆ రూమంతా నిండి పరవశాన్ని కలిగిస్తోంది. లైట్లు ఆఫ్ చేయడంతో, కాండిల్స్ వెలుతురులో ఆ గదిలోకి నడిచివచ్చే శ్రీదేవి దివినుండి నేలకు దిగివచ్చిన అపర రతీదేవిలా కనిపించింది.

"అబ్బ.. ఇంత అందగత్తెను అనుభవించడం నా అదృష్టం" అనుకుంటున్నాడు. బాబా ☐

"అందివచ్చిన సుఖాన్ని, డబ్బును పొందడమే ఆనందం" అనుకుంటోంది శ్రీదేవి.

ఆ రాత్రి మెత్తటి ఆ పడకపై వారిద్దరూ చేరి, ప్రపంచాన్నే మరిచి తను మోహాన్ని, శరీరాల దాహాన్ని తీర్చుకునే పనిలో, పడిపోయి పరిసరాల్ని గమనించలేదు. ఆ సమయంలో ఒక్కసారిగా బెడ్ రూమ్ తలుపు తెరుచుకుంది. ఆ శబ్దానికి ఉలిక్కిపడి పైకి లేచారు బాబా, శ్రీదేవి. తెప్పరిల్లి తేరుకునేసరికి ఒక్క నిముషం పట్టింది వారికి. ఎదురుగా అగ్నిపర్వతంలా కోపంతో మండిపోయే మామాను చూసేసరికి శ్రీదేవికి, భయం వెన్నులోనుండి మొదలై గజగజా వణికిపోయింది.

బాబా మాత్రం వెంటనే పైకి లేచి ప్రక్కనే పడివున్న 'జిద్దాషాను' (చొక్కా) అందుకుని దాన్ని తొడుక్కుంటూ మామాను తప్పించుకుని గది బయటికి పారిపోయాడు.

కానీ మెత్తటి పరుపుపైన, బ్లాంకెట్ కప్పుకుని నగ్నంగా పడుకుని వున్న శ్రీదేవి మాత్రం వెంటనే పైకి లేవలేకపోయింది.

ఊహించని విధంగా మామాను చూసిన షాక్‌లో చలనం మరచిన బొమ్మలా వుండిపోయింది శ్రీదేవి. నోట్లో తడి ఆరిపోయింది. మాట పెగలడంలేదు. నల్లగా నిగనిగలాడే వత్తైన పెద్ద జుట్టు శ్రీదేవిది. దగ్గరికి వచ్చిన మామా శ్రీదేవి జుట్టుపట్టుకుని ఒక్కసారిగా బెడ్‌పైనుండి క్రిందకి లాగింది. కోపంతో ఇష్టమొచ్చినట్లు శ్రీదేవిని కొట్టింది. అయినా ఆమెలో ఆవేశం చల్లారలేదు. అక్కడే వున్న బాబా బెల్టును తీసుకుని గొడ్డును బాదినట్లు బాదింది. తప్పుచేసిన భావంతో ఆమె దెబ్బలన్నింటినీ శ్రీదేవి ఓర్చుకుని సహిస్తోంది. కానీ అక్కడినుండి బయట పడే మార్గం మామా బారినుండి తప్పించుకునే అవకాశం శ్రీదేవికి కలగలేదు.

తన భర్తతో తన బెడ్‌పై పడుకుని వున్న పనిమనిషిని చూసిన మామా కోపాన్ని ఆపుకోలేకపోతూ శ్రీదేవి మెడపట్టుకుని నొక్కుతూ "నీకు ఎంత ధైర్యం? నా భర్తతో నా గదిలో ఇలాంటి పాడుపని చేస్తావా? నన్నే మోసం చేస్తావా? నిన్ను బ్రతకనివ్వను. నువు చేసిన పనికి నీకు తగిన శిక్ష విధిస్తాను" అంటూ ఆవేశంగా కిటికీ దగ్గరికి శ్రీదేవిని తోసుకుంటూ వెళ్ళి అమాంతంగా క్రిందికి నెట్టేసింది మామా.

ముందే షాక్‌లో వున్న శ్రీదేవికి ఏం జరుగుతోందో అర్థమయ్యేలోపు. అయిదు అంతస్తుల ఆ బిల్డింగు కిటికీ గుండా గాల్లో తేలుతూ వచ్చిన ఆమె నగ్నదేహం క్రింద నేలపై పడిపోయింది. ఆమె చుట్టూ రక్తం మడుగు కట్టింది. శరీరంలోని ఎముకలన్నీ ఎక్కడివక్కడ విరిగిపోయాయి. వెంటనే శ్రీదేవికి స్పృహ తప్పిపోయింది.

ఆ బిల్డింగ్ క్రిందవున్న పార్కింగ్ ప్లేస్‌లో శ్రీదేవి పడటంతో అక్కడ కార్లు పార్కు చేసేవాళ్ళు ఆమెను గమనించి పోలీసులకు అంబులెన్స్‌కు ఫోను చేసారు. అంబులెన్స్ వచ్చి చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న శ్రీదేవి శరీరాన్ని హాస్పిటల్‌కు తీసికెళ్ళారు.

అల్‌రాజి హాస్పిటల్.

అక్కడ ఎముకలు విరిగినవారు, వాటికి ఆపరేషను చేయించుకున్నవారు మాత్రమే వుంటారు. పురుషులకు ప్రత్యేకంగా మరోవైపు కొన్ని వార్డులు వున్నాయి.

స్త్రీలకు కేటాయించబడిన ఎనిమిదో నంబరు వార్డులోని రెండోనంబరు రూములో శ్రీదేవికి బెడ్‌ను అమర్చారు. ఆమెను పరీక్షించిన డాక్టర్లు ఆమె కుడికాలు, కుడిచేయి, ముఖంలోని కుడిదవడ ఎముక విరిగిపోయినట్లుగా నిర్ధారించారు. నోట్లోని పళ్ళన్నీ పడినప్పుడే రాలిపోయాయి. ఆమె బ్రతకడం ఒక అద్భుతం అన్నారు డాక్టర్లు.

వారందరూ ఎన్నో ఆపరేషన్లు చేసి ఎముకలకు బదులుగా ఇనుప రాడ్లు బిగించి కాలు, చెయ్యిని సరిచేసారు. ముఖానికి చేసిన ఆపరేషన్లతో పడిన కుట్లతో అందమైన శ్రీదేవి ముఖం వికృతంగా మారింది.

మూడు నెలల కాలం ఆమె మంచంపైనుండి కదలలేకపోయింది.

కనీసం ఆరునెలలైనా ఆ హాస్పిటల్‌లో డాక్టర్ల పర్యవేక్షణలో వుండాలని అక్కడి డాక్టర్లు తీర్మానించారు. తరువాత కూడా ఆమెకు చక్రాల కుర్చీయే గతి అని తేల్చేసారు. శ్రీదేవి గురించి, జరిగిన సంఘటన గురించి పోలీసులు ఇండియా ఎంబసీకి తెలియజేయగా, ఇండియా ఎంబసీనుండి ఏజంట్లు వచ్చి హాస్పిటల్లో వున్న ఆమెను పరామర్శించారు. హాస్పిటల్ నుండి డిశ్చార్జి అయిన వెంటనే తెలియజేస్తే వచ్చి, ఇండియా ఎంబసీకి తీసుకెళతామని ఆమెను ఫ్లయిట్‌లో ఇండియాకు క్షేమంగా పంపించే బాధ్యత తమది అని వారు మాట ఇచ్చారు.

దాదాపు మూడు నెలల తరువాత కట్లు విప్పిన తన ముఖాన్ని అద్దంలో చూసుకుని ఏదో వికృత రూపాన్ని చూసినట్లు కెవ్వున కేక పెట్టింది శ్రీదేవి. పళ్ళులేని నోరు, విరిగిన దవడ, వంకరగా వున్న ముక్కు ఆమె ముఖ స్వరూపాన్నే మార్చివేసాయి.

అందరినీ ఆకర్షించి అలరించే శ్రీదేవి అందం ఇప్పుడు చూసేవారికి భయాన్ని కలిగిస్తోంది. ఎంతలో ఎంత మార్పు? మనిషి జీవితం ఎంత అల్పమైనదో కదా? కాలం కన్నెర చేస్తే సమస్తం తల్లక్రిందులైపోక తప్పదు. అది తెలుసుకోని మనుషులు అందాన్ని చూసి, తమ డబ్బును చూసి గర్వపడతారు. అంతా అశాశ్వతమని, వ్యర్థమని, వృధాప్రయాస అనీ తెలుసుకునేసరికి ఆలశ్యం అయిపోయి అనర్థాలు జరిగిపోతాయి. జీవితాన్ని నాశనం చేసేస్తాయి.

ఒకరోజు సాయంత్రం వేళలో శ్రీదేవిని వెతుక్కుంటూ ఆ అల్ రాజి హాస్పిటల్‌కు మామా వచ్చింది.

ఆమెను చూసిన శ్రీదేవి భయపడింది. తప్పుచేసినందుకు సిగ్గుతో తలక్రిందికి దించుకుంది. తనను నమ్మి పనిమనిషిగా ఇంట్లో చేర్చుకున్న మామాకు నమ్మకద్రోహం చేసినందుకు కుమిలిపోతూ కన్నీళ్ళను నింపుకుంది శ్రీదేవి.

మామా కూడా. చాలా దిగులుపడుతూ శ్రీదేవి చేయి పట్టుకుని "నేను అలా చేయకుండా వుండాల్సింది. నా కోపాన్ని కంట్రోల్ చేసుకోవాల్సింది. ఇంత పని జరుగుతుందని అనుకోలేదు. నన్ను క్షమించు శ్రీదేవీ" అని బాధపడింది.

`" ఇండియాలో నీ అడ్రస్ నాకు ఇవ్వు. ప్రతినెలా కొంత డబ్బు నీకు అందేలా నేను ఏర్పాటు చేస్తాను. ఇలా కాలు, చేయి లేకుండా, కుర్చీలో తిరుగుతూ నీ పిల్లల్ని పోషించుకోలేవు కదా" అంది మామా దయగా శ్రీదేవి పరిస్థితిని చూసి జాలిపడుతూ.

మామా మంచి హృదయానికి, తన పట్ల ఆమెకు కలిగిన దయకు మనసులో సంతోషిస్తూ కృతజ్ఞతగా ఆమెకు నమస్కరించింది శ్రీదేవి. కువైటు పోలీసులు శ్రీదేవి కేసును నమోదు చేసుకుని ఇన్వెష్టిగేషను చేసారు. కానీ ఇందులో శ్రీదేవి తప్పుకూడా వుండటంతో తమ కువైటు వారిపై కేసును నమోదు చేయకుండా ఫైల్‌ను క్లోజ్ చేసేసారు. శ్రీదేవి తప్పువుంది కాబట్టి ఇండియా ఎంబసీ కూడా తగిన చర్యలు తీసుకునే సాహసం చేయలేకపోయింది.

అలా ఆరునెలలు అల్‌రాజి హాస్పిటల్లో పడివున్న శ్రీదేవి, ఒకరోజు ఇండియా ఎంబసీకి చేరుకుని వారి సహాయంతో ఇండియాలోని తన స్వస్థలానికి (ముంబయ్‌కి) చేరుకుంది.

## మాధవి కథ

**పెరట్లోని కట్టెలపొయ్యి** బాగా అంటుకుని భగభగ మండుతోంది. పొయ్యిపైన పెట్టివున్న ఇత్తడి బిందెలోని నీళ్ళు సలసలా కాగుతున్నాయి. ఆ పొయ్యిముందు కూర్చుని వున్న మాధవి మనస్సుకూడా. ఆ పొయ్యిలాగే భగభగా మండుతోంది. కళ్ళు పొయ్యిలోని నిప్పుల్లాగా ఎరుపెక్కిపోయి, కన్నీళ్ళు ఆగకుండా బుగ్గలపైకి జారిపోతున్నాయి. ఎంత అణచిపెట్టినా గుండె నిండిన దుఃఖం ఆగదే?

ఇంత జరిగాక, కళ్ళముందు జరిగేవన్ని ఇన్ని చూసాక, మనసును మెలితిప్పే ఇంత బాధను భరించడం సాధ్యమా?

డబ్బును చూసిన ఈ మనుషులు బంధాలను కూడా మరిచిపోతారా? నీతి, న్యాయం, ధర్మం అంటూ ఏవీ వీళ్ళకి వుండవా? ఆ వికవికలు, పకపకలు, విలాసాలు సందడి సంతోషమూ. వారి మాటలూ, నాటకాలు చూస్తుంటే వళ్ళంతా కంపరంగా వుంది. ఛీ..ఛీ ఎంత బరితెగించిన మనుషులు వీళ్ళు? ఇంత స్వార్థమా?

ఇన్నాళ్ళూ ఎంతో ఆశతో ఎదురుచూస్తూ తెలిసినా తెలియనట్లుగా, అంత కాదులే నేనే ఎక్కువగా ఊహించుకుని అపోహపడుతున్నా. ఎంతో కొంత ప్రేమ ఆ మనిషిలో నా పట్ల మిగిలే వుంటుంది, ఇష్టపడి చేసుకున్నందుకు ఆ మాత్రం జ్ఞాపకం వుండనా? అనుకుంది.

ఎటూ తొందరలోనే వస్తున్నాడు కదా! రాగానే ముఖం చూడగానే మాధవీ అంటు అక్కున చేర్చుకుని అశాశ్వతమైన అక్కడి ఎడారి జీవితాన్ని మర్చిపోడా? నాలుగేళ్ళ తరువాత ఆయనను చూసిన ఆనందంతో తాను ఏడిస్తే ప్రేమగా కన్నీటిని తుడిచి ఓదార్చడా అనుకుంటూ ఆలోచిస్తూ కాలం గడిపింది. ఇన్నాళ్ళూ అనుభవించిన ఆవేదన అంతా దూరమయిపోతుందని ఆశపడింది. ఎన్ని నిదురలేని రాత్రిళ్ళు ఆయనను తలచుకుంటూ ఇక్కడ ఒంటరిగా ఏడుస్తూ గడిపిందో? మనసులోని బాధను ఎవరికీ చెప్పుకోలేక తనలోనే దాచుకుని ఎంత వేదన అనుభవించిందో? అయినవారికి చెపితే నవ్వుతారేమో, కానివారికి తెలిస్తే లేనిపోనివి ఊహించుకుని కథలుగా కల్పించుకుని చెప్పుకుంటారేమో అనే సంశయంతో ఎవరితోనూ చెప్పుకోలేక, మనసులో దాచుకోలేక ఎంతో అవస్థపడింది.

ఈ సమయంలో ఆయనక్కడ ఏం చేస్తున్నాడో? వేళకు తిన్నాడో, లేదో? ఈ రోజు పగటివేళ పనిలోపడి మరిచిపోయినా రాత్రిపూట పడక మీద చేరాక నన్ను గుర్తుచేసుకున్నాడో లేదో అనుకుంటూ ప్రతి క్షణం, ప్రతిరోజూ - భారంగా, బాధగా గడిపింది.

ఇక్కడ, ఇంట్లో చీటికి మాటికీ చీదరించుకునే అత్తమామలకి ఓపికగా సేవలు చేస్తూ ఇంట్లో పనులన్నీ పద్ధతిగా చేసుకుంటూ రోజులు లెక్కపెడుతూ కళ్ళు కాయలు కాచేలా భర్తకోసం ఎదురు చూసింది.

భర్త ఇంటికి వస్తే తన పరిస్థితి మారిపోతుందని భావించింది, కానీ అతను తిరిగి వచ్చాక, తన పరిస్థితి ఇంత ఘోరంగా పెనంలో నుండి జారి పొయ్యిలో పడ్డట్లుగా ఇలా తయారవుతుందని అసలు ఊహించలేదు.

నట్టింట్లోని నవారు మంచాన్ని బెడ్ రూములోకి చేర్చి దానిపై మెత్తటి పరుపువేసి చుట్టూ దోమ తెరలు కట్టి, పక్కంతా మల్లెపూలు జల్లి, రాత్రిళ్ళు భర్తతో కలిసి సంతోషంగా కాలం గడపాలని కలలు కంది మాధవి. ఇన్నేళ్ళకు ఇంటికి తిరిగివచ్చే భర్తకోసం, తన కల నిజమయే రోజుకోసం ఎంతగానో ఎదురుచూసింది. అనుకున్నట్లుగానే అతడు వచ్చాడు, కానీ... వస్తూ.. వస్తూ.. కువైటులో

తనతోపాటు తనతో వుంచుకున్న ఆ ఉంపుడు గత్తెను కూడా తోడుగా ఇంటికే తీసుకు వచ్చాడు. భర్తరాకతో తన కష్టాలన్నీ అంతమవుతాయి అనుకుంటే అతను వచ్చాకే అవి మరీ ఎక్కువైపోయాయి. బ్రతికుండగానే ప్రాణాల్ని తోడేస్తున్నాయి.

ఈ మనోవేదన భరించడం ఎలా? ఏదీ మార్గం? మరి దీనికి ముగింపు ఏమిటి? ఈ పాడు బ్రతుకు ఎందుకు బ్రతకడం? భర్తకు కానిదానిగా, అత్తమామలకు పనిమనిషిలా, ఈ ఇంట్లో పడివుండటం కంటే చావడం మేలు కదా? బ్రతుకు ఇంత అధ్వానంగా మారుతుందనుకోలేదు మాధవి. కళ్ళు, చెవులు మనస్సులేని యంత్రంలా అన్నీ సహించడం అసాధ్యమైపోతోంది. ఓపిక నడించిపోతోంది. జరిగేదంతా కలలాగా అనిపిస్తోంది. తన అమ్మా నాన్నల్ని ఎదిరించి, మాధవిని ఎంతగానో ఇష్టపడి పెళ్ళిచేసుకున్న భర్త సుధాకర్‌లో ఇంత మార్పు వస్తుందని పరదేశంలో పరాయి స్త్రీ వ్యామోహంలో పడి కట్టుకున్న భార్యను ఇలా నిర్లక్ష్యం చేస్తాడనే నమ్మకం కలగడంలేదు మాధవికి. కువైటుకు వెళ్ళక ముందు, భర్త ప్రేమ గుర్తొచ్చి, మరొకసారి వరదలాగా కన్నీళ్ళు పొంగుకొచ్చాయి మాధవికి.

పెళ్ళయిన నాలుగోరోజే సుధాకర్ కువైటు వీసా పోస్ట్‌లో ఇంటికి వచ్చింది. రెండేళ్ళనుండీ వీసాకోసం ప్రయత్నిస్తూ లక్షరూపాయలు ఏజంటుకు కట్టి ఎంతగానో ఎదురుచూస్తుంటే, తీరా పెళ్ళి అయి సంతోషంగా గడుపుతుంటే ఈ కువైటు వీసా ఇపుడే రావాలా? అంటూ దిగులుపడ్డాడు సుధాకర్. ఇంటి ముందర పెళ్ళిపందిరి ఇంకా తీయలేదు. మెళ్ళోని పసుపుతాడు ఇంకా మార్చుకోలేదు. కాళ్ళపారాణి కూడా ఆరలేదు. ఇద్దరి ముద్దూ, ముచ్చటలు ఇంకా తీరనే లేదు. మూడ్నెళ్ళయినా గడిస్తే, కడుపులో ఒక నలుసు పడితే, అపుడు కువైటు వెళ్ళినా బాగుండేది. తన దురదృష్టం కాకపోతే భర్తతో సంతోషంగా గడిపే ఈ సమయంలో ఆ వీసా ఇపుడే రావాలా అనుకుంటూ క్రుంగిపోయింది మాధవి.

సుధాకర్ మాధవిని ఎంతగానో ఇష్టపడి కానీ కట్నం లేకుండా, ఏమీ ఆశించకుండా పెళ్ళి చేసుకున్నాడు. మాధవిని చేసుకోవడం సుధాకర్ అమ్మా నాన్నలకు అస్సలు ఇష్టంలేదు. వేరే ఎక్కడైనా చేసుకుంటే రెండు లక్షలకు తక్కువ కాకుండా కట్నం, పది తులాల బంగారం ఇచ్చి పిల్లను ఇస్తారని వాళ్ళు ఆశపడ్డారు.

కానీ సుధాకర్ వారి కోరికను తోసి పుచ్చి ఒక రకంగా వారిని ఎదిరించి మాధవిని పెళ్ళి చేసుకున్నాడు. తనపట్ల సుధాకర్‌కు గల ప్రేమకు ఎంతగానో సంతోషించింది మాధవి. కట్నం తీసుకురాని కోడలు వచ్చిందని, అత్తమామలు ముఖం చిట్లించుకుని, మూతి బిగించుకుని, కఠినమైన మాటలతో బాధపెట్టినా కూడా భర్తను చూసి ఆమె సర్దుకుపోయింది. కానీ పెళ్ళయిన పదిరోజులకే తనను విడిచి కువైటుకు భర్త వెళ్ళిపోతాడు అని తెలియగానే ఆమెకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఏం చేసి భర్త ప్రయాణాన్ని ఆపాలో అర్థంకాలేదు.

"వీసా టైము ఒక నెల మాత్రమే వుంది. ఈలోపల మెడికల్ చేయించుకోవాలి. ఫ్లయిట్ టిక్కెట్టు కొనుక్కోవాలి. గడువులోపల వెళ్ళకపోతే వీసా వేస్ట్ అవుతుంది. దానికోసం ఖర్చుపెట్టిన లక్షరూపాయలు కూడా వేస్ట్ అవుతాయి" అంటూ ఏజంటు తొందరపెట్టడంతో సుధాకర్‌కు దిక్కుతోచలేదు. మరోవైపు సుధాకర్ అమ్మానాన్నలు "ఇంత కష్టపడి లక్షరూపాయలు ఖర్చుపెట్టి, తీరా వీసా ఇంటికి వచ్చాక కువైటు వెళ్ళకపోతే ఎలా? డబ్బు సంపాదించి వీసా ఖర్చులకు, పెళ్ళి ఖర్చులకు చేసిన అప్పులన్నీ ఎవరు తీరుస్తారు? ఎలా ఆ అప్పులు తీర్చాలి? నీ భార్య ఇక్కడే ఇంటిదగ్గరే వుంటుంది. మేము జాగ్రత్తగా చూసుకుంటాము. మళ్ళీ ఈ అవకాశం రాదు" అంటూ సుధాకర్‌పై ఒత్తిడి తెచ్చారు. ఇక విధిలేక వారిమాటలకు తలవంచాడు.

ఎలాగైతేనేం కువైటుకు వెళ్ళిన ఆర్నెల్లలోపు, మాధవికి కూడా వీసా పంపించి తన దగ్గరికి పిలిపించుకుంటాను అని ఆమెకు నచ్చచెప్పి, కన్నీళ్ళు తుడిచి బాధగా ఫ్లయిట్ ఎక్కి కువైటు వెళ్ళిపోయాడు సుధాకర్.

ప్రతిరోజూ ఫోనులో భర్తతో మాట్లాడుతూ కాలం గడుపుతుంటే ఆర్నెల్లు తొందరగానే గడిచిపోయాయి. సుధాకర్ కువైటులో కుదుటపడటానికి, ఇంటిదగ్గర చేసిన అప్పులు తీర్చడానికి ఆర్నెల్లు పట్టింది.

మాధవికి వీసా, ఫ్లయిట్ టిక్కట్లు కొనడానికి ఇపుడు అంత డబ్బులేదని, వాటికోసం ఇంకో ఆర్నెల్లు, పనిచేసిన జీతం డబ్బు ప్రక్కన వుంచాలి కాబట్టి, ఇంకో ఆర్నెల్లు ఓపిక పట్టమని మాధవికి నచ్చజెప్పాడు సుధాకర్. ప్రేమతో చెపితే ఏదైనా బాగానే వుంటుంది. బాధైనా సరే భరించడంలో తీయదనం వుంటుంది.

అలా భర్త ఫోనుకాల్స్‌తో, అతడి మాటలతో పంచే ప్రేమతో సంతోషంగానే ఒక సంవత్సరం కాలాన్ని గడిపేసింది మాధవి.

అపుడే ఆ సమయంలోనే సుధాకర్ మనస్థత్వంలో పెద్ద మార్పు వచ్చింది. ఇంటికి ఫోను చేయడం బాగా తగ్గించాడు ఎపుడో వారానికి ఒకసారి ఫోను చేసినా కూడా అతడి అమ్మా నాన్నలతో మాట్లాడి ఫోను పెట్టేసేవాడు. ఎప్పుడో ఒకసారి మాధవే ఫోను తీసి మాట్లాడినపుడు తన వీసా గురించి అడిగితే "అది ఎంతో ఖర్చుతో కూడిన పని అని, ఇప్పట్లో అది కుదిరే పనికాదని, వీసా దొరకడం కష్టం అవుతోందని" రకరకాల కారణాలు చెప్పి ఫోను పెట్టేసేవాడు. ఆమెకు మరోమాట మాట్లాడటానికి అవకాశం ఇచ్చేవాడుకాదు. ముందులాగా ప్రేమగా మాట్లాడటానికి ఆసక్తిని చూపించేవాడుకాదు - ఒక రోజు "ఏంటీ ఈ మధ్య సరిగా ఫోను చేయడంలేదు, నాతో సరిగ్గా మాట్లాడటం లేదు. నాకెంతో దిగులుగా వుంది" అంది మాధవి.

"అక్కడ ఇంట్లో కూర్చుని, మూడుపూటలా కడుపునిండా తిని నీకు దిక్కు తెలియడం లేదు. ఇక్కడ రోజంతా కష్టపడి పనిచేసి డబ్బు సంపాదించాలి. చీటికి మాటికీ నీకు ఫోను చేసి మాట్లాడుతూ కూర్చోవడానికి నాకు పనిలేదనుకున్నావా? అంత టైము నాకు లేదు. నీ దిగులు మానుకో" అన్నాడతడు కోపంగా. భర్త మాటలకు, కోపానికి నిర్ఘాంతపోయింది మాధవి. ఇక చేసేది ఏమీలేక మనసును కుదుటపరచుకోవడానికి ప్రయత్నించింది.

అలా రెండేళ్ళు గడిచిపోయాయి. మాధవి పరిస్థితి ఘోరంగా తయారయింది. భర్త ఆదరణ, ప్రేమ, ఓదార్పు కరువయిపోవడంతో అత్తమామల పోరు ఎక్కువయింది. అపుడపుడూ ఇంటికి వచ్చి సాధించే ఆడిబిడ్డల వేధింపులు వాటికి తోడయ్యాయి. నోరు తెరిచి ఎవరికీ చెప్పుకోలేక మనసులోపలే భాధను దాచుకుని ఎంతో కుమిలిపోయింది.

అప్పట్లో దిగువ వీధిలోని వెంకటమ్మ అనే ఆవిడ కువైటు నుండి సెలవులకి ఇంటికి వచ్చింది. సుధాకర్ ఆవిడ దగ్గర తన తల్లికి రెండు బంగారం గాజులు, రెండు చీరలు పంపించాడు. కానీ భార్యకోసం ఏమీ పంపించలేదు. భర్త వైఖరి మాధవికి ఎంతో ఆశ్చర్యాన్ని, ఆదుర్దాను కలిగించింది. అక్కడ కువైటులో భర్త గురించిన విషయాల్ని తెలుసుకోవాలనే కోరికతో ఒక రోజు అత్తమామలకు తెలిస్తే తిడతారని, వారికి తెలియకుండా వెళ్ళి వెంకటమ్మను కలిసింది మాధవి. భర్త గురించి, ఆయన క్షేమ సమాచారం గురించి కంగారుగా అడిగింది.

మాధవి అడిగిన ప్రశ్నలకు వెంకటమ్మ మాధవి వైపు జాలిగా చూసి, "పిచ్చిదానా నీ మొగుడికేం అక్కడ దున్నపోతులా బాగా తిని బలిసి వున్నాడు. వాడి గురించి నీకు దిగులు ఎందుకు? అక్కడ జరిగే విషయాలు నీకు తెలియక నువు వాడి గురించి ఆలోచిస్తున్నావు. రాజంపేటనుండి వచ్చిన రాజేశ్వరితో జతకూడి, అక్కడ కువైటులో వాళ్ళిద్దరూ కాపురం కూడా పెట్టారు. నాతోపాటు మీ అత్తకు పంపించిన బంగారం గాజులు, చీరలు నీ భర్తకాదు, ఆ రాజేశ్వరే ప్రేమగా మీ అత్తకు పంపించింది. ప్రతినెలా రాజేశ్వరి జీతం డబ్బుకూడా మీ అత్తమామల బ్యాంకులోకి వచ్చి పడుతుంటే వీళ్ళు ఇక్కడ సంతోషంగా వున్నారు. అక్కడ నీ భర్త నిన్ను మరిచిపోయి దానితో తిరుగుతున్నాడు. అంతా డబ్బు మహిమ. నువు ఇలాగే అమాయకంగా ఆలోచిస్తూ.. దిగులు పడుతూ వుంటే దిక్కులేని దానివే

అవుతావు ఇక్కడ వీళ్ళకి పనిమనిషిగా మాత్రమే మిగులుతావు. కాబట్టి నా మాటవిని కాస్త తెలివిగా ప్రవర్తించు. వీళ్ళంతా డబ్బుమనుషులు. రాజేశ్వరిని, డబ్బును చూసి నీ భర్తకూడా మారిపోయాడు. నువు వీళ్ళని వదిలించుకుని నీ బ్రతుకు చూసుకో. నువు వస్తానంటే నీకు నేను కువైటు వీసా పంపిస్తాను. అక్కడికి వచ్చి వాళ్ళ కంటే ఎక్కువగా నువు డబ్బు సంపాదించుకో. వీళ్ళంతా ఆ రాజేశ్వరిని వదిలి నీ కాళ్ళదగ్గరకి కుక్కల్లాగా వచ్చి చేరతారు'' అంటూ వెంకటమ్మ హితబోధ చేసింది. ఆమె మాటలు విన్న మాధవి మిన్ను విరిగి మీద పడినట్లుగా షాక్‌కు గురయింది. అంతగా ఇష్టపడి చేసుకున్న భర్త కువైటుకు వెళ్ళి ఇంతగా మారిపోయాడని తనని మరిచిపోయి అక్కడ వేరే ఆవిడతో కాపురం పెట్టాడని తెలియగానే ప్రపంచం అంతా శూన్యంగా అనిపించింది. అప్పటినుండీ ఆమెలో సంతోషం మాయమైపోయింది. యాంత్రికంగా తన జీవితాన్ని, కాలాన్ని గడపసాగింది.

మరో సంవత్సరం అలాగడిచాక తన భర్త సెలవులకై కువైటు నుండి ఇంటికి తిరిగి వస్తున్నాడనే సంగతి తెలిసింది. ఇంటికి వస్తే తన ముఖం చూస్తే భర్తలో మార్పు వస్తుందని ప్రేమ కలుగుతుందని మాధవి ఆశపడింది. అలాగే భర్త ఇంటిదగ్గర వుండే రెండు నెలల కాలంలో భర్తతో కలిగిన సాన్నిహిత్యంలో తాను గర్భం దాల్చి ఒక బిడ్డకు జన్మను ఇస్తే భర్తలోనూ, అత్తమామలలోనూ మార్పుకలిగి తనపై ప్రేమకలుగుతుందని ఆమె భావించింది. కానీ ఆమె అనుకున్నది వేరు. ఇప్పుడు ఇక్కడ భర్త ఇంటికి వచ్చాక ఎదురయిన పరిస్థితి వేరుగా వుంది. సినిమాలో సన్నివేశాల్ని, టి.వి సీరియల్‌లోని నాటకాల్ని తలిపిస్తోంది ఇంట్లోని వాతావరణం. ఒక స్త్రీకి ఇంతకన్నా వేరే శిక్ష ఏమైనా వుంటుందా? ఒక భార్యకు, ఇంతకన్నా వేరే అవమానం ఇంకోటి వుంటుందా?

ఆ రోజు సుధాకర్ చెన్నైలో ఫ్లైయిట్ దిగుతున్నాడు అని వినగానే, అత్తమామలు ఇద్దరూ కారు బాడుగకు తీసుకుని చెన్నై ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్ళారు. వారు వెళ్ళి భర్తను ఇంటికి తీసుకుని వచ్చేంత వరకూ మాధవి తనలోని సంతోషాన్ని పట్టలేకపోయింది. నాలుగేళ్ళ తరువాత భర్త కువైటు నుండి తిరిగి వస్తుంటే ఏ భార్య హృదయం ఆనందించకుండా వుండగలదు? ముందు రోజు రాత్రి అస్సలు నిద్రపట్టలేదు. ఇల్లంతా అందంగా సర్దిపెట్టింది. భర్తకు ఇష్టమైన వంటలన్నీ వండటానికి ప్రిపేర్ అయింది. ప్రొద్దున్నే నిద్రలేచి తలారా స్నానం చేసి భర్తకు ఇష్టమైన ఆకుపచ్చ రంగు చీర కట్టుకుంది. అద్దంలో పదిసార్లు తనను తాను పరిశీలించి చూసుకుని సంతోషంగా నవ్వుకుంది.

ఎంతైనా ఆయన తాళి కట్టిన తన భర్త ఎన్ని తప్పులు చేసినా, ఎంతమందితో తిరిగినా ఆయన మగవాడు. ఇవన్నీ సహజమే అనుకుంటూ తనకి తానే సమాధానం చెప్పుకుంటూ బాధపడిన మనసును మభ్యపెడుతూ సమయాన్ని గడిపింది మాధవి.

ఎంతగా బాధపెట్టినా, హింసించి వేధించినా ఆ మూడుముళ్ళు మెళ్ళో వేసిన పాపానికి కట్టుకున్న భర్తపై ప్రేమ మాత్రం చావదు. ఎంత మోసపోయినా, ఎంత దగాపడినా భారతీయ స్త్రీలో భవిష్యత్తుపై, భర్తపై ఆశమాత్రం వీడదు.

ప్రొద్దున్నే ఏడుగంటలకు చెన్నైలో ఫ్లైయిట్ దిగినవాళ్ళు, ఇల్లు చేరేటప్పటికి మధ్యాహ్నం ఒంటిగంటయింది. ఎంతో ఆశగా, సంతోషంగా వాకిట్లోకి పరిగెత్తిన మాధవి అక్కడి సన్నివేశం చూసి నిర్ఘాంతపోయింది.

ముందుగా కార్లోంచి దిగిన భర్త అవతలి డోర్ తెరిచిపట్టుకుని, అతిగా మేకప్ వేసుకున్న ఒక ఆడదాని చేయిపట్టుకుని కిందికి దింపుతున్నాడు. ఆమె హొయలు ఆ వాలకం, ఆ చనువు, వారిద్దరూ చేతులు కలిపి పట్టున్న ఆ వైనం కలవరపరిచాయి. మాధవి కాళ్ళక్రింద భూమి కదులుతున్నట్లనిపించింది. ఆమె చేయి పట్టుకుని కదిలి ఇంట్లోకి వచ్చిన భర్త, వారి వెనుకే నవ్వుకుంటూ బ్యాగులు

మోసుకుంటూ వచ్చిన అత్త మామలు మాధవిని ఆమె పరిస్థితిని అసలు పట్టించుకోలేదు. సంతోషంగా మాట్లాడుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయారు. భర్త ఆవిడతోపాటు పట్టెమంచంపై కూర్చుని అన్నీ మరిచి ఆమెనే చూస్తూ మాట్లాడుతున్నాడు. లోపలికి వెళ్ళిన అత్తగారు "మాధవీ.. మాధవీ అక్కడే బయటే నిలబడి పోయావు ఏమయింది నీకు? ఇంటికి చుట్టాలు వచ్చారు అనే జ్ఞానం కూడా నీకు లేదా? తాగటానికి నీళ్ళు, జ్యూస్ కలిపి ఇవ్వు. ఇంటికి వచ్చిన మనుషులకి మర్యాదలు చెయ్యడం తెలుసుకో. అలాగే ఇంటి వెనుక కట్టెలపొయ్యి వెలిగించి తొందరగా నీళ్ళు కాగపెట్టు. ముందుగా రాజేశ్వరి స్నానం చేస్తే తరువాత అందరం కలిసి భోంచేయవచ్చు. ప్రయాణం చేసి నేను బాగా అలసిపోయాను. స్నానం భోజనం ఏర్పాట్లు అన్నీ నువ్వే చూడు" అంటూ ఆర్డర్లు వేసింది అత్తగారు. భర్త తనవైపు కన్నెత్తి కూడా చూడలేదు. నోరు తెరిచి మాధవీ బావున్నావా అని ఒక్కమాట పలకరించను కూడా లేదు. మాధవికి భూమి బ్రద్దలై తాను పాతాళానికి కూరుకుపోతున్నట్లు అనిపిస్తోంది. ఇంకా ఈ భూమ్మీద ఎందుకు బ్రతికి వున్నానా అనుకుంటోంది.

ఇంటి వెనుకకు నడిచి తన ప్రమేయం లేకుండానే అలవాటుగా కట్టెలపొయ్యి వెలిగించింది. ఇత్తడి బిందెలో నీళ్ళు పెట్టి కాచింది. పొయ్యిలోని కట్టెలు అంటుకుని భగభగా మండుతున్నాయి. నిప్పులు ఎర్రగా కాలిమండిపోతూ జ్వలిస్తున్నాయి. మాధవి హృదయంకూడా ఆ పొయ్యిలాగే మండిపోతూ జ్వలిస్తోంది.

ఆ రాజేశ్వరి ఎక్కిన మంచం దిగకుండా కదలకుండా కాలిమీద కాలువేసుకుని కూర్చుని అన్నీ అక్కడికే తెప్పించుకుంది. డబ్బు బాగా వుందన్న అతిశయం ఆమెలో అణువణువునా కనిపిస్తోంది. సుధాకర్ కూడా ఆమెను అంటిపెట్టుకుని, వదలకుండా అక్కడే కూర్చుని, కబుర్లు చెపుతున్నాడు. మాధవి అనే ఒక మనిషి అక్కడ ఆ యింట్లో వుందనీ, ఆమెకూ ఒక మనస్సు వుందనీ ఎవరూ పట్టించుకోవడంలేదు.

అత్తగారు వంటింట్లోకి వచ్చి మాధవికి ఆర్డర్లు ఇస్తూ కావలిసిన వంటలు తయారు చేయించి ప్లేట్లతో మోసుకెళ్ళి రాజేశ్వరికి సుధాకర్‌కు హాల్లోనే వడ్డించింది.

ఆ పూట మాధవికి మనసుతో పాటు ఆకలికూడా చచ్చిపోయి ఏమీ తినలేకపోయింది. ఏదో చేయాలి అనివుందికానీ ఏమీ చేయలేని అశక్తత. ఆవేశాన్ని అణచుకోలేక గట్టిగా అరవాలని వుంది. కానీ మౌనంగా తలవంచుకుని, తనపని చేసుకుంటూ వుండిపోయింది.

పెద్ద కర్ర తీసుకుని భర్తను, రాజేశ్వరిని కలిపి వళ్ళంతా వాచిపోయేట్లు కసిదీరా కొట్టాలని వుంది. కానీ ఏదో భయం, అసహాయిత, భరించే భార్యతత్వం ఆమెను అన్నీ దిగమ్రింగేటట్లు చేసాయి. రాజేశ్వరి సంపాదించే డబ్బుకోసం ఆమె అడుగులకు మడుగులు వత్తుతూ ఆమె చుట్టూ తిరిగి పరిచర్యలు చేస్తూ ఆమెను ఒక దేవతలా చూసుకుంటున్నారు అత్తమామలు. పరదేశం వెళ్ళిన భర్తకూడా చాలా మారిపోయాడు. ఎవరికి చెప్పుకోవాలి మనసులోని బాధ?

ఆ రాత్రి బెడ్ రూములో ప్రత్యేకంగా పడక ఏర్పాటు చేసి, దోమ తెరలు కట్టి, పడకపై మల్లెపూలు చల్లారు. మాధవి కళ్ళముందే భర్త సుధాకర్ ఆ రాజేశ్వరి చేతులు పట్టుకుని నవ్వుకుంటూ బెడ్‌రూములోకి వెళ్ళిపోయి తలుపు గడియపెట్టుకున్నారు. నిస్సహాయంగా రోదిస్తూ ఎప్పటిలాగే హాల్లో వేసివున్న పడకపై వాలిపోయింది మాధవి.

రోజంతా పనిచేసిన శరీరం అలసిపోయినా సరే ఆ రాత్రి మాధవి కంటిపైకి కునుకురాలేదు. ఆ రాత్రి ఎలా గడిచిందో ఆమెకే తెలుసు. కన్నీళ్ళతో తడిసిపోయిన ఆమె తలగడకే తెలుసు. తనలో తాను మాట్లాడుకున్న మాటలన్నింటినీ ఆమె పడుకున్న ఆ మంచం ఆ రాత్రంతా ఓపికగా విని నిట్టూర్చింది.

లోపల గదిలోని వాళ్ళు, బయట హాల్లో పడుకున్న మాధవి ఆ రాత్రంతా నిద్రపోలేదు.

తెల్లవారింది. యధావిధిగా రోజువారీ పనులు, సేవలు, పరిచర్యలు మామూలుగా మొదలయ్యాయి. ఆ యింట్లో మాధవి స్థానం ఒక పనిమనిషిగా స్థిరపడిపోయింది. అలా నెలరోజులు గడిచిపోయాయి. ఈ నెలరోజుల్లో ఆమె భర్త కనీసం ఒక్కసారికూడా పలకరించలేదు. మాధవిని ఒక మనిషిగా కూడా గుర్తించలేదు. మనుషులు ఇంతగా మారిపోతారంటే నమ్మబుద్ధి కావడంలేదు మాధవికి. సెలవులు ముగిసాయి. మళ్ళీ వాళ్ళు ఇద్దరూ కలిసి కువైటుకు వెళ్ళే రోజు దగ్గర పడింది. ఏదో చెయ్యాలి అనే ఆరాటం, ఆవేశం మాధవిని నిద్రపోనివ్వడంలేదు. తెలియని కోపం, కసి ఆమె శరీరంలోని నరనరాల్లో పేరుకుని పోయింది. బాగా ఆలోచించింది. నిర్ణయం తీసుకుంది ఆమె. తగిన అవకాశం కోసం ఎదురుచూడసాగింది.

ఒకరోజు మధ్యాహ్నం అందరూ చికెన్ బిరియానీ తిని ఎక్కడివారక్కడ హాల్లోనే పడుకుని కునుకు తీస్తున్నారు. మాధవి మెల్లగా బెడ్ రూములోకి వెళ్ళి, వణికే చేతులతో రాజేశ్వరి సూట్ కేసును తెరిచింది. పైనే ఒక ప్రక్కగా వున్న పర్స్‌లో ఆమెకు కావలిసినవి కనిపించాయి. తొందరగా వాటిని చేతుల్లోకి తీసుకుని పమిట కొంగు చాటున వాటిని దాచుకుని తడబడే అడుగులతో గది బయటికి వచ్చేసింది. ఒక్కసారి అటు ఇటు పరిశీలించి చూసి అందరూ నిద్రపోతున్నారని నిశ్చయించుకుని వడివడిగా ఇంటి వెనుకకు నడిచింది.

అక్కడ మధ్యాహ్నం చేసిన వంటలు, కాచిన నీళ్ళతో పొయ్యిలోని నిప్పులు కాస్త బూడిద కమ్మి ఎర్రగానే వున్నాయి. పొయ్యి క్రిందకి దిగజారిన కట్టెలు ఇంకా మండుతూ ఆమె కోసమే ఎదురుచూస్తున్నాయి.

క్రిందికి జారిన కట్టెల్ని పొయ్యిలోకి ఎగదోసి మంట పెద్దది చేసింది. చిటపటలాడుతూ కట్టెలు మండసాగాయి. అంతవరకూ తన పమిట చాటున దాచివుంచుకున్న రాజేశ్వరి పాస్‌పోర్టును, కువైటు తిరిగి వెళ్ళే టిక్కెట్టును బయటికి తీసి వాటివైపు కోపంగా చూసి పొయ్యిలో వాటిని పడేసి, మండే కట్టెల్ని పైకి ఎగదోసింది. నిముషంలో అవి అంటుకుని మాధవి కళ్ళముందే కాలి బూడిద అయిపోయాయి. కాలి కుప్పలా మారిన ఆ బూడిదను చూసిన ఆమె మనస్సు అప్పుడు కొద్దిగా చల్లబడినట్లయింది. చాలా రోజుల తరువాత సంతోషంగా గుండెనిండా ఒక్కసారి గట్టిగా, ఊపిరి పీల్చుకుని వదిలింది మాధవి.

ఆ సమయంలో ఆమె పెదవులపై చిన్న నవ్వు విరిసింది.

తరువాత తన గదిలోకి నడిచి, తొందరగా చిన్న బ్యాగులో తన బట్టలు కొన్ని సర్దుకుని, వెంకటమ్మ ఆ రోజు చెప్పిన మాటలు, చేస్తానన్న సహాయాన్ని గుర్తుచేసుకుంటూ తన అమ్మగారింటికి బయలుదేరిపోయింది మాధవి.

## *వనజ కథ*

**కువైటు సిటీ.** ఖలఫ్ అల్ అహ్మర్ రోడ్

ఆ రోడ్డులోనే వుంది వుమన్స్ సెంట్రల్ జైలు. ఆ జైలులోని గదులన్నీ వరుసగా ఓ వైపుకు కట్టబడి వున్నాయి. అక్కడి పోలీసులు ఇద్దరేసి ఆడఖైదీలను ఒక్కోగదిలో వుంచి కట్టుదిట్టంగా కాపలా కాస్తున్నారు.

అక్కడ, నాలుగో నంబరు గదిలోకి ఓసారి తొంగి చూసినట్లయితే ఆ కటకటాలకు ఆనుకుని, మోకాళ్ళపై తలవంచి కూర్చుని ఏడుస్తూ కనిపిస్తుంది వనజ.

ఇండియాలోని కడప జిల్లా మారుమూల ప్రాంతంనుండి, డబ్బు సంపాదించాలనే ఆశతో కువైటు వచ్చిన వనజ జీవితం అనుకోని విధంగా తల్లక్రిందులైపోయి, ఈనాడు ఇలా జైలు వూచల్ని లెక్కబెట్టాల్సి వచ్చింది. మనిషి జీవితం తన పయనంలో ఎన్ని మలుపులు తిరుగుతుందో, ఎక్కడ ఆగుతుందో ఎవరికి తెలుసు? తను చేసిన చిన్న పొరపాటుకు, పెద్ద మూల్యాన్నే ఆమె చెల్లిస్తోంది. మరణపుటంచుల వరకు వెళ్ళిన ఆమె ఆరోగ్య పరిస్థితి కుదుట పడేంతవరకు కువైటు ప్రభుత్వ ఆసుపత్రిలో వుంచి ఆ రోజే డిశ్చార్జి చేసి తెచ్చి ఆ ఉమన్స్ సెంట్రల్ జైలులో వుంచారు.

మనుషుల హృదయాల్లాగే ఎంతో కఠినమైనవి ఆ ఇనుప తలుపులు. గడువు ముగిసిపోయేంతవరకు ఎంత ఏడ్చినా, మొత్తుకున్నా అవి తెరుచుకోవు. మరి వాటినుండి ఆమెకు విముక్తి ఎప్పుడో?

బయట ప్రపంచం మీద, తన బ్రతుకు మీద ఆశను చంపుకుని ఏళ్ళ తరబడి ఆ జైల్లో పడి మ్రగ్గిపోతూ కాలం గడిపేవాళ్ళు ఎందరో అక్కడ వున్నారు.

దొంగలు, వ్యభిచారులు, డ్రగ్స్, సారాయిలాంటి మత్తుపదార్థాలు అమ్మే వాళ్ళు ఎందరో పోలీసులకు పట్టుబడి ఆ జైల్లో కాలం గడుపుతున్నారు. బయటికి వచ్చే మార్గం కనబడక ఏళ్ళ తరబడి అందులో పడి మ్రగ్గిపోతున్నారు. అక్కడ హత్యలు, రేప్‌లు చేసిన నేరస్తులకు ప్రత్యేకంగా కొన్ని గదులు కేటాయించబడి వున్నాయి.

బయట ప్రపంచంతో సంబంధం తెగిపోయి, స్వేచ్ఛను కోల్పోయి, నాలుగుగోడల మధ్య బంధింపబడి శిక్షను అనుభవించే వారి మానసిక స్థితి వేరుగా వుంటుంది. అందుకే ఆ రోజు ఆ జైల్లోకి అడుగుపెట్టగానే తన పరిస్థితి అర్థమయిన వనజకు దుఃఖం ఆగడంలేదు. ఇస్లాం మత ధర్మాలు పాటించి, ఆ ధర్మాల ఆధారంగా ప్రజల్ని పాలించే దేశాల్లో నేరాలకు శిక్షలు చాలా కఠినంగా వుంటాయి. తనకళ్ళలోని కన్నీరంతా ఇంకిపోయేట్లు ఏడుస్తూనే వుంది ఆమె. మనసు తుఫాను తాకిడికి గురయిన సంద్రం వలె ఘోషిస్తోంది. దేశం కాని దేశంలో పరాయిదేశంలో దిక్కులేనిదై జైలు శిక్ష అనుభవించడానికి అక్కడికి చేరుకుంటానని ఆమె కలలో కూడా వూహించలేదు.

కువైటు జీవితం పూలు పరచిన దారి వంటిదని, ముళ్ళు వుండవనీ, ఆ దారిలో సంతోషంగా నడుస్తూ డబ్బు బాగా సంపాదించవచ్చని ఆమె ఆశపడి ఆ ఎడారి దేశానికి పరిగెత్తి వచ్చింది.

తాను అనుకున్నది వేరు, ఇక్కడ జరిగింది వేరు.

విధి ఆడే వింత నాటకంలో పాత్రలై తమ ప్రమేయం లేకున్నా, ఏ నేరమూ చేయకపోయినా కూడా ఏదో ఒక సమస్యలో చిక్కుకుని జైలు శిక్షను అనుభవించే అమాయకులు కూడా అక్కడ వున్నారు.

పొట్టచేతపట్టుకుని పరాయిదేశానికి పనికోసం వెళ్ళినప్పుడు, ఆ దేశ సాంప్రదాయాల్ని, అలవాట్లను, అభిరుచుల్ని, కట్టుబాట్లను, చట్టాలను మనం గౌరవించాలి. విధిగా వాటిని పాటించాలి. అలా చేయకపోతే ఎన్నో సమస్యల్ని ఎదుర్కోవలసి వస్తుంది. ముఖ్యంగా గల్ఫ్‌దేశాల్లో చట్టాలు కఠినంగా వుంటాయి.

ఏది ఏమైనా మనదేశం, మన వూరు, మన నేల ఇచ్చినంత స్వేచ్ఛ, సౌకర్యం, ప్రేమను పరాయిదేశం మనకిస్తుంది అనుకోవడం మన భ్రమ. డబ్బును చూసి పైపైన మెరుగులు చూసి ఆశపడి దూరదేశాలకు పరిగెత్తడం ఆత్మకు మాత్రం సంతృప్తిని కలిగించదు. పరాయి నేలపై అనుభవించే విలాస జీవితం వ్యర్థమే. మన దేశంలో మన ఇంట్లో పచ్చడి మెతుకులు తిన్నా అది అమృతంతో సమానమే.

ఆ మధ్యాహ్నం భోజనం కూడా తిరస్కరించి, భయంతో బాధతో ఏడుస్తూ కూర్చుంది వనజ. అదే గదిలో వున్న చంద్రిక నిర్లిప్తంగా ఇదంతా తనకు అలవాటే అన్నట్లుగా వనజను చూస్తూ కూర్చుంది. చంద్రిక శ్రీలంక నుండి వచ్చింది. కన్నీళ్ళన్నీ ఇంకిపోయాక, దుఃఖపు ఉధృతి తగ్గాక లేచి వనజ దగ్గరికి వచ్చి తలమీద చేయి వేసి పలకరించింది.

ఆప్యాయంగా ఆమె పలకరించిన తీరు, తన దేశాన్ని తనవారిని గుర్తుచేయడంతో మరోసారి వెక్కివెక్కి ఏడ్చింది వనజ.

అప్పుడు నోరు విప్పింది చంద్రిక.

"నువు ఇంతగా ఏడవాల్సిన పనిలేదు. నాతో పోల్చుకుంటే నువు చేసిన నేరం చిన్నదే బహుశా రెండేళ్ళు నిన్ను ఈ జైల్లో వుంచి పాస్‌పోర్టుపై ఎర్రముద్ర వేసి నిన్ను ఇండియా పంపించేస్తారు. అంతే. నీకు పుట్టే బిడ్డను వీళ్ళు తీసుకుని కువైటు అనాధ శరణాలయానికి పంపించేస్తారు. తల్లిదండ్రులు విడిచిన పిల్లలు, తల్లీ,తండ్రీ ఎవరో తెలియని పిల్లలు, క్షణికావేశంలో నీలాగా శరీర వాంఛలకు లోనయి, గర్భం దాల్చి భూమిపైకి వచ్చిన వారందరు కూడా ఇక్కడ అనాధశరణాలయంలో కువైటు ప్రభుత్వ సంరక్షణలో పెరుగుతున్నారు. రేపు నీ కడుపులోనుండి బయటికి వచ్చే బిడ్డ గతి కూడా అంతే. నీ బిడ్డను వాళ్ళు తీసుకుని నీ శిక్షాకాలం పూర్తి అయ్యాక నిన్ను నీదేశానికి పంపించేస్తారు. ఇంత చిన్న విషయానికి, ఇంత చిన్న శిక్షకు, నువ్వు భయపడి ఏడవాల్సిన అవసరంలేదు. సరేనా?

ఇక్కడ ఏళ్ళ తరబడి ఈ జైల్లో మ్రగ్గిపోయేవాళ్ళు ఎందరో వున్నారు. ఇందులో నుండి విడుదల కలిగి, మరలా తమ దేశానికి వెళ్ళి తమ వారిని చూస్తామన్న ఆశలేనివారి పరిస్థితి చాలా ఘోరంగా వుంటుంది. మరీ ముఖ్యంగా నాలాగా మరణ శిక్ష విధించబడిన వారి పరిస్థితి మాటల్లో చెప్పనలవికానిది" అంటూ గాఢంగా నిట్టూర్చింది చంద్రిక.

చంద్రికకు మరణశిక్ష విధించబడిందన్నమాట చెవిన బడగానే తన ఏడుపుమాని తల ఎత్తి నమ్మలేనట్లుగా చంద్రిక వైపు చూసింది వనజ.

"అవునమ్మా నిజమే నేను చెప్పేది నిజం. రోజుల్ని లెక్కపెడుతున్నాను నేను. చావు మనిషికి ఎపుడో ఒకప్పుడు తప్పదు అన్న సత్యాన్ని జీర్ణించుకుని కాలం గడుపుతున్నాను. ఏదో ఒకరోజు పిలుస్తారు, ఉరికంబాన్ని ఎక్కిస్తారు. అదే నా జీవితంలో ఆఖరిరోజు అవుతుంది" అంది చంద్రిక.

"అంత ఘోరమైన నేరం నువ్వు ఏం చేసావు?" ప్రశ్నించింది వనజ జాలిగా చంద్రిక వైపు చూస్తూ.

"నేరం నేను చేయలేదు. కానీ నేరంలో నన్ను ఇరికించారు. గత సంవత్సరం నేను నా శెలవులు సంతోషంగా గడిపి కువైటు తిరిగి రావడానికి ఫ్లైయిట్ ఎక్కుతుండగా స్వయానా మా పిన్నికొడుకు చిన్న పార్శిల్ నా చేతిలో వుంచి కువైటులో తన స్నేహితునికి అందజేయమని చెప్పాడు. నేను పిన్నికొడుకు కదా అని నమ్మి, ఆ పాకెట్‌లో ఏముందో చూసుకోలేదు. కువైటు ఎయిర్‌పోర్టులోని స్కానింగ్‌లో, అందులో డ్రగ్స్ వున్నట్లుగా బయట పడింది. ఎంత చెప్పినా ఎంతగా ఏడ్చి మొత్తుకున్నా కూడా నా గోడు వినిపించుకునే నాధుడు ఇక్కడ కనిపించలేదు. డ్రగ్స్ విషయంలోని నేరస్తులకు కువైటు దేశం కఠినమైన శిక్షలు విధిస్తుంది. అందులో ఏమాత్రం కనికరం చూపించదు. మరణ శిక్షకంటే కఠినమైన శిక్ష మరోటి ఏముంటుంది? అందుకే నాకు మరణ శిక్షను విధించారు. ఎవరో చేసిన తప్పుకు నేను బలి అయ్యాను" అంటూ భారమైన హృదయంతో తన కథను చెప్పింది చంద్రిక.

"అయ్యో ఎంతపని జరిగింది? నువు నిర్దోషివని నిరూపించే ఆధారం ఏమీ లభించలేదా? " ప్రశ్నించింది వనజ బాధగా.

"లేదు. చెప్పినా ఎవరూ నమ్మరు. నా సంగతి సరేకానీ, నీకు ఈ జైలుకు వచ్చే పరిస్థితి ఎందుకు కలిగిందో, నీ కడుపులో వున్న బిడ్డకు తండ్రి ఎవరో ఎలా మోసపోయావో చెప్పు. వింటాను." మోచేయి తలక్రింద పెట్టుకుని, ఆ నేలపై ఒత్తిగిలి పడుకుంటూ అడిగింది చంద్రిక.

ఆమెకు తన కథను వివరించడానికి సిద్ధపడిన వనజ. ఒకసారి నిట్టూర్చి జరిగిన విషయాల్ని చెప్పడం మొదలు పెట్టింది.

"నెలమీద ఇరవై రోజులు జరిగిపోయింది. ఇంతవరకు నాకు నెలసరి రాలేదు. నాకేదో అనుమానంగానూ, భయంగానూ వుంది గిరీ. నన్ను ఏం చెయ్యమంటావో చెప్పు" కంగారుగా అడిగింది వనజ.

శరీరం నిండా కోరికను నింపుకుని ఆమె రాకకోసం అంతవరకూ ఆత్రంగా, ఆనందంగా ఎదురు చూసిన గిరికి వనజ మాటలు చేదుగా అనిపించాయి. అతడి ఆనందం అంతా క్షణంలో ఆవిరైపోయింది.

దాదాపు వారం రోజులుగా ప్రయత్నిస్తున్నా కూడా. పనుల ఒత్తిడితో కలవడానికి వారికి సమయం కుదరలేదు. ఈరోజు మామా, బాబా పనిమీద బయటికి వెళ్ళారు. అందుకే ఈరోజు తన గదికి వనజ వస్తుంది తనలోని కోరికను, ఆవేశాన్ని, వేడిని తీర్చుకోవచ్చు అని ఆరాటపడిన గిరికి ఆమె మాటలు నచ్చలేదు.

వెంటనే "అంతా నీ భ్రమ, అనుమానం. రెండేళ్ళుగా కలిసి గడుపుతూ ఆనందిస్తున్నాం. ఒక్క నెలకూడా నిలవకుండా నీ పీరియడ్ ఖచ్చితంగా సరైన టైముకే వస్తోంది. అలాగే నా జాగ్రత్తలో నేనూ వుంటున్నాను. నీకు ఇది రావడానికి, ఇలా కావడానికి ఛాన్సు చాలా తక్కువ. నీ పిచ్చి అనుమానాలు, మాటలు చాలించి దగ్గరికిరా! మామ, బాబా ఇంటికి తిరిగి వచ్చేలోపు సుఖాన్ని అనుభవిద్దాం" అన్నాడు గిరి ఇక ఆగలేనట్లుగా ముందుకు వచ్చి ఆమెను తన కౌగిలిలోనికి లాక్కోవడానికి ప్రయత్నిస్తూ.

"ఉహూ. అదికాదు. చెప్పేది విను. ఇది నిజంగా అదే ఆరోజు పొరపాటు జరిగిపోయింది. నువు జాగ్రత్తలు తీసుకోవడం మరిచిపోయావు. దాని ఫలితమే ఇది. వారం రోజులనుండి కడుపులో వికారంగా వుంది. నిన్నా మొన్నా వాంతులు కూడా అయ్యాయి. ఏది తిన్నా అరగడంలేదు. తిండి కూడా సహించడం లేదు. నాలుగురోజుల నుండీ కాస్త రొట్టెముక్క తిని, కాసిన్ని టీ నీళ్ళు తాగి కాలం గడుపుతున్నాను. ఒకటే వాంతులు, రోజంతా తేపులు స్థిమితంగా ఒకచోట నిలబడలేకపోతున్నాను. కాస్త రొట్టెముక్క తిని రోజంతా పనిచెయ్యాలంటే నా శక్తి సరిపోవడంలేదు. నీరసం వచ్చి కళ్ళు తిరుగుతున్నాయి. పనిమానేసి ప్రశాంతంగా కదలకుండా ఒక చోట పడుకుని నిద్రపోవాలనిపిస్తోంది. కానీ ప్రాణం బాగోలేకపోయినా ప్రాణం పోతున్నా కూడా ఈ కువైటు ఇంటిలో చాకిరీ చెయ్యక తప్పదు కదా! ఇక ఈ బాధ భరించడం నావల్లకాదు. నా ఓపిక నశించిపోయింది. ఇక నువ్వే ఏదో ఒక మార్గం చూసి ఈ సమస్యనుండి నన్ను గట్టెక్కించాలి. తొందరగా ఏదో ఒకటి చెయ్యి" అంది ఏడుస్తూ వనజ. ఆమె మాటల్లో గిరిపట్ల నమ్మకం, ప్రేమ కనిపిస్తున్నాయి. ఏదో ఒకటి చేసి, ఎలాగైనా తనను ఆదుకుంటాడు అనే భరోసాతో ఆమె వుంది.

"అదేంకాదు నీకు అన్నింటికీ తొందరే ఇంకో పదిరోజులు ఆగి చూడు అదే వస్తుంది. రెండు పెన్‌డాల్ మాత్రలు వేసుకో ఈ వాంతులు, వికారం అన్నీ తగ్గిపోతాయి. అనవసరంగా నువ్వు భయపడి నన్ను కంగారు పెట్టొద్దు. చిన్న విషయాన్ని పెద్దది చేసి నీ మూర్ఖత్వంతో నాకు తలనొప్పి తెప్పించకు" అన్నాడు విసురుగా గిరి. తప్పించుకోవాలి అనే తత్వం అతడి మాటల్లో వినిపిస్తోంది.

ముందే నీరసంగా వున్న వనజకి అతడి మాటలు నిరాశను కలిగించాయి. అర్థం చేసుకుంటాడు అనుకుంటే అసలు మాటే వినిపించుకోవడం లేదు. ఏదో ఒకదారి చూపించి ఈ సమస్యనుండి గట్టెక్కిస్తాడు అని భావిస్తే విసుక్కుంటున్నాడు. మరి ఎవరికి చెప్పుకోవాలి ఈ బాధను? ఈ ఎడారి దేశంలో అతడు తప్ప రక్షించే వారు ఎవరూ లేరు. వేరే ఎవరికి తెలిసినా, ప్రాణం మీద ఆశ వదులుకోవడం మేలు. ఈ సమస్యకు కారణం గిరే కాబట్టి అతడ్నే బ్రతిమాలుకుని ఈ బాధనుండి బయటపడాలి అని నిశ్చయించుకుని ఇంకా అతడికి నచ్చచెప్పాలన్నట్లుగా "గిరీ, ఇంకో పదిరోజులు గడిస్తే ఇలాగే వాంతులు అవుతూ ఆరోగ్యం చెడిపోతే ఇంట్లోని మామా, బాబాకు విషయం తెలిసిపోతుంది. నీకు తెలుసుకదా, మామా, బాబా ఇలాంటి విషయాల్లో ఎంత కఠినంగా వుంటారో? పరాయి

మగవాడిని కన్నెత్తి చూస్తేనే వారికి నచ్చదు. ఇక నేను ఇలాంటి పనిచేసి కడుపు తెచ్చుకున్నానని వారికి తెలిస్తే నన్ను ఒక్క క్షణం కూడా ప్రాణంతో వుంచరు. చంపి నా శవాన్ని ఎడారిలో పాతిపెడతారు. నీకు పుణ్యం వుంటుంది. తొందరగా ఏదో ఒక మార్గం చూడు. నువ్వేకదా వద్దు అని చెప్పినా వినకుండా నామీదకి వచ్చావు. మామా, బాబా ఇంట్లో లేనప్పుడు నన్ను పట్టుకుని బలవంతం చేసావు. ఇన్నాళ్ళు నీ యిష్టప్రకారం నన్ను అనుభవించి ఈరోజు నాకు సమస్య వస్తే నువ్వేకదా కాపాడాలి" అంది వనజ దీనంగా బతిమిలాడుతూ.

మామా, బాబాకు తెలిస్తే అన్న వూహకే ఒక్క క్షణం కంగారుపడ్డాడు గిరి. నిజమే కువైటు ఇంట్లో పనిచేసే పనిమనిషి, ఆ యింటి డ్రైవరు కలిసి తప్పు చేస్తే ఆ తప్పు ఇలా ఈ రూపంలో బయటపడితే ఇక ఏమైనా వుందా? మామా, బాబాకు తెలిస్తే ఇద్దర్నీ ప్రాణాలతో వుంచరు. గొడ్డును బాదినట్లు కొట్టి, కాళ్ళూ చేతులు విరగ్గొట్టి పోలీసులకు అప్పచెపుతారు లేదా రాళ్ళతో కొట్టి చంపేస్తారు. వాళ్ళిష్టం ఏమైనా చేస్తారు. ఇస్లామిక్ సిద్ధాంతాలతో నిండి వున్న కువైటు దేశంలో సనాతన సాంప్రదాయాల్ని పాటించే ఇల్లు అది. ఈ విషయం వారికి తెలియకముందే ఎక్కడైనా మాత్రలు దొరుకుతాయేమో చూడాలి - తన ఆలోచనలను కంగారును కప్పిపెట్టుకుంటూ బయటికి మాత్రం "నువ్వు మాత్రం తక్కువా? ఇందులో నీ తప్పేమీలేదా? రెండు చేతులూ కలిస్తేనే కదా చప్పట్లు కొట్టగలం. నువ్వు కూడా బాగా ఎంజాయ్ చేసావు కదా" అన్నాడు తప్పంతా ఆమె మీదికి నెట్టడానికి ప్రయత్నిస్తూ.

అతడి మాటలకు ఆమె మనస్సు బాధపడింది. అయినా కూడా గత్యంతరం లేని పరిస్థితిలో "సరే జరిగిందేదో జరిగిపోయింది. ముందు ఈ గండం నుండి గట్టెక్కే మార్గం చూడు గిరీ. అపుడెపుడో ఎవరికో ఇలాగే అయితే ఏదో మాత్రలు మింగారని, మాలియా సిటీలో ఎక్కడో దొరుకుతాయని నువ్వే చెప్పినట్లు గుర్తు. నువు వెళ్ళి అర్జెంటుగా ఆ మాత్రలు తీసుకునిరా. నేను వెంటనే మింగి ఈ బాధనుండి బయటపడాలి" అంది వనజ అర్థిస్తూ.

"ఓ.. అదా! ఆ మాట, అపుడెపుడో చెప్పాను. ఎవరో, ఏమో? ఎక్కడ దొరుకుతాయో ఇపుడు నాకు ఎలా తెలుసు? ఇపుడు వెళ్ళమంటే నాకు ఎలా కుదురుతుంది? నీకు అంత బాధగా వుంటే ఒక పనిచెయ్యి. ఇండియాలో ఇంటికాడ ఎవరో ఒకరు చచ్చిపోయారని అబద్ధం చెప్పి అర్జంటుగా టిక్కెట్టు చేయించుకుని ఇంటికి పో. అక్కడ ఆసుపత్రికి పోయి ఆ దరిద్రాన్ని గుట్టుచప్పుడు కాకుండా తీయించేసుకుని మరలా తిరిగిరా. నాకు తెలిసి అది చాలా మంచి పని" అన్నాడు భారం అంతా ఆమె మీదికే నెట్టేస్తూ.

అవును మరి తరతరాలుగా ఇద్దరు చేసిన తప్పుకు స్త్రీ ఒక్కటే శిక్షను పర్యవసానాన్ని అనుభవిస్తోంది. ఏదైనా చెప్పడం చాలా సులభం కానీ ఆచరణ మాత్రం కష్టం అవుతుంది. మామా బాబాకు అబద్ధం చెప్పి అప్పటికప్పుడు బ్యాగు సర్దుకుని టిక్కెట్టు కొనుక్కుని ఇండియాకు వెళ్ళడం అంత సులభంగా జరిగేపనికాదు. అందుకే ఒక నిమిషం ఆలోచించిన వనజ "అదెలా కుదురుతుంది? మొన్న జనవరి నెలలోనే కదా సంక్రాంతికి ఇంటికి వెళ్ళి తిరిగి వచ్చాను. వచ్చి ఇంకా నాలుగు నెలలు కూడా కాలేదు. ఇంతలోపల బాబా, మామా మళ్ళీ ఇంటికి పంపించరు. ఒకవేళ పంపించినా టిక్కెట్టు మాత్రం కొనివ్వరు. మరి నా దగ్గర కూడా అంత డబ్బు లేదే? ఇది కుదిరేపనికాదు. ఇక్కడే నీకు తెలిసిన వాళ్ళని అడిగి మాత్రలు ఏవైనా దొరుకుతాయేమో" చూడు అంది వనజ చిన్నగా ఏడుస్తూ.

"సర్లే నువు ఇప్పుడు ఏడ్చి సాధించేది ఏమీలేదు. ఇంతవరకూ తెచ్చుకుని ఇపుడు ఏడిస్తే ఏం లాభం? నాతోపాటు ఈ వీధిలో పనిచేసే డ్రయివర్లను అడిగి మాత్రలు దొరుకుతాయేమో అడిగి కనుక్కుంటాను. ఈలోపల నువు మామాకు, బాబాకు ఈ విషయం తెలియకుండా జాగ్రత్తపడు" అన్నాడు గిరి అక్కడినుండి బయటికి వెళ్ళిపోతూ. ఆమెను తప్పించుకుని తొందరగా వెళ్ళిపోవాలనే వుద్దేశం అతనిలో కనిపిస్తోంది. కానీ ఆమెకు మాత్రం ఆ సమయంలో ఇంకాసేపు మాట్లాడి అతడి ఓదార్పును పొందాలి అనిపించింది. అన్నీ బాగున్నప్పుడు శరీరాన్ని అనుభవించడానికి ఈ మగవాళ్ళు ఎన్నో మాయమాటలు చెప్పి, వెనుకే తిరిగి వెధవ వేషాలు ఎన్నో వేస్తారు. చివరికి సమస్య వచ్చేటప్పటికి, తప్పించుకుని దూరంగా పోవాలని చూస్తారు. తన ఆరోగ్యం బాగున్నపుడు, ఒక్క క్షణం వదలకుండా

చేతుల్లో బంధించి కౌగిలిలో కరిగించే అతను - ఇపుడు అంటీ ముట్టనట్లు ఎవరో తెలియనట్లు కాస్త దూరంగా నిలబడి మాట్లాడటం వనజకు కాస్త బాధను కలిగించింది. ఆ సమయంలో ఒంటరిగా తాను నిలిచినట్లనిపించి నీరసం ఆవహించింది. ఈ పరిస్థితిని ఎలా అధిగమించాలో, ఈ సమస్యనుండి ఎలా బయటపడి గట్టెక్కాలో ఆమెకు అర్థం కాలేదు.

ఎంతవరకు గిరిని నమ్మాలో? అతడు ఎంత వరకు నిలబడతాడో, ఎంతవరకు సహాయం చేస్తాడో ఆమెకు అర్థం కావడంలేదు. అసలే నీరసంగా వుంది. అంతా తలక్రిందులైనట్లు తికమకగా అనిపిస్తోంది. ఈ పరిస్థితి పగవారికి కూడా రాకూడదు అనుకుంటూ అటూ ఇటూ చూసి ఎవరూ తనని గమనించలేదని గిరితో మాట్లాడడం చూడలేదని నిర్ధారించుకుని ఇంట్లోకి వచ్చి పనిలో మునిగిపోయింది.

రెండోరోజు ఆమె వంట చేసుకుంటూ కిచెన్‌లో వున్న సమయంలో కిటికీ దగ్గరికి వచ్చి బయటికి రమ్మని సైగ చేసాడు గిరి.

మాత్రలు తీసుకుని వచ్చాడనే ఆశతో చేస్తున్న పనిని వదిలేసి స్టవ్‌ని ఆఫ్ చేసి చేతులు తుడుచుకుంటూ బయటకి వచ్చింది వనజ.

"మాత్రలయితే వున్నాయి. అవి దొరికే చోటును అతి కష్టమ్మీద నేను తెలుసుకున్నాను. కానీ వాటిని కొనడానికి యాభై దినార్లు (దాదాపు పదివేల రూపాయలు) డబ్బు కావాలి. నువు తొందరగా డబ్బు యిస్తే వెళ్ళి సాయంత్రంలోపు వాటిని తీసుకొస్తాను. ఈ రాత్రికే నువు వాటిని మింగచ్చు" ఎవరైనా వింటారేమో అని తన స్వరాన్ని తగ్గించి చిన్నగా చెప్పాడు గిరి.

యాభై దినార్లు కావాలి అన్నమాట వినగానే ఆమె మొహం కళ తప్పింది. ఆమె దగ్గర చిల్లరంతా చేర్చి జమచేసినా పది దినార్లకంటే ఎక్కువలేదు.

ఆమె మొహంలోని భావాలను చదివినట్లుగా వెంటనే అతడు - "నాకు తెలుసు ఇపుడు నీ దగ్గర అంత డబ్బు లేదని. ప్రస్తుతం నా దగ్గర కూడా లేదు. నా జేబులన్నీ వెతికి చూసినా కూడా ఐదు దినార్లకు (వెయ్యి రూపాయలు) మించి లేవు. ఈనెల జీతం వచ్చేంత వరకు ఈ ఐదు దినార్లతోనే కాలం గడపాలి, ఈ నెలాఖరు వరకు సిగరెట్లు కొనుక్కోవడానికైనా ఈ చిల్లర డబ్బులు కావాలి కదా" అన్నాడు గిరి.

"అయ్యో ఇప్పుడెలా? ఎవరైనా నలభై దినార్లు అప్పుగా ఇస్తారేమో అడిగి చూడు గిరీ. ఈ నెల జీతం రాగానే వడ్డీతో సహా వారి అప్పు తీర్చేద్దాం" అంది వనజ.

ఆ సమయంలో ఆర్నెల్ల క్రితం గిరి తన దగ్గర వంద దినార్లు అప్పుగా తీసుకున్న విషయం గుర్తుకు వచ్చింది. తమ మధ్య వున్న సంబంధం మొహమాట పెట్టి ఆమెను ఆ విషయాన్ని అడగకుండా ఆపేసింది. ఇక అతడు ఆ డబ్బు తిరిగి ఇస్తాడు అనే ఆశకూడా ఆమెలో లేదు.

"ఉహూ అస్సలు కుదరదు. అందరినీ అప్పులు అడగడం నాకు నచ్చదు. ఇప్పటికే తెలిసిన వాళ్ళందరి దగ్గరా అప్పులు చేసి వున్నాను. ఇక అడగడానికి ఎవరూ లేరు. అయినా.. ఇదిగో... నీ మెళ్ళో బంగారు గొలుసు వుందిగా, అది ఇవ్వు. దాన్ని కుదువపెట్టి డబ్బు తీసుకొస్తా" అన్నాడు గిరి. ఆమె మెడవైపు గొలుసువైపు ఆశగా చూస్తూ.

"అమ్మో గొలుసా?" అంది వనజ అప్రయత్నంగా మెళ్ళోని గొలుసుని బిగించి చేత్తో పట్టుకుని.

"ఏంటీ? నీ ఆరోగ్యం కంటే ఆ గొలుసు నీకు ముఖ్యమా? తొందరగా తీసి ఇవ్వు" అన్నాడు గిరి కఠినంగా.

అతడి దృష్టి ఈ గొలుసుపైన పడింది కాబట్టి ఇక అతడు వదలడు. అయినా అంతకంటే వేరే మార్గం ఏదీ కనిపించడంలేదు. అతని సంగతి, అతని మనస్తత్వం అప్పటికే ఆమెకు అవగతమైంది. అతని మాయమాటలు నమ్మి అతనితో స్నేహాన్ని పెంచుకున్నందుకు తనని తాను నిందించుకుంది.

నిస్సహాయంగా నిట్టూర్చుతూ మెళ్ళోని గొలుసు తీసి అతడి చేతుల్లో పెట్టి తొందరగా ఆ మాత్రలు తీసుకునిరా గిరీ. ఈ బాధను భరించలేకున్నాను" అంది.

"అలాగే" అంటూ ఆత్రంగా, ఆశగా ఆ గొలుసు అందుకుని జేబులో వేసుకుని సంతోషంగా అక్కడినుండి వెళ్ళిపోయాడు.

పరాయిదేశంలో నా అనేవారు లేని చోట, పనిమనిషిలా స్వేచ్ఛలేకుండా బానిసలా జీవించే చోట ఇలాంటి పరిస్థితి పగవారికి కూడా రాకూడదు అనుకుంటూ దిగులుగా ఇంట్లోకి వెళ్ళిపోయింది వనజ. ఆ సమయంలో ఆమెకు తన అమ్మా నాన్నలు, తోబుట్టువులు, పుట్టిన వూరు, తన దేశం గుర్తొచ్చి బాగా ఏడుపు వచ్చింది. ఏడుస్తూ కూచుంటే ఇంట్లో పని జరగదని తెలుసు. అందుకే తన దుఃఖాన్ని దిగమ్రింగి మిగిలిపోయిన తన పనిని పూర్తి చేయడానికి ముందుకు కదిలింది వనజ.

సాయంత్రానికి తిరిగి వచ్చిన గిరి మెల్లగా వంటింట్లోకి వచ్చి పేపర్లో చుట్టిన మాత్రల పొట్లాన్ని ఆమె చేతికి అందించి "తొందరగా మ్రింగు" అని చెప్పి వచ్చినంత తొందరగా అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

ఏదన్నా మాట్లాడతాడేమో, మాత్రలు ఎలా, ఎప్పుడు, ఎన్ని వేసుకోవాలో వివరంగా చెపుతాడేమో, గొలుసు అమ్మేసాడా? కుదువ పెట్టాడా? ఎంత డబ్బు వచ్చింది? అందులో ఎంత మిగిలింది అనే విషయాలు తెలియజేస్తాడేమో అని ఆమె ఎదురు చూసింది. అంతకన్నా మిన్నగా ఆమెకు ఆ సమయంలో కాసిన్ని ఓదార్పు మాటలు వినాలని, తన బాధను పంచుకోడానికి ఒకరు కావాలని అనిపించింది. కానీ అతడు ఆ అవకాశం ఆమెకు ఇవ్వకుండా నీ ఖర్మ నువు అనుభవించు నాకేం పట్టింది అనే రీతిలో తప్పించుకుని వెళ్ళిపోతున్నాడు.

ఏది ఏమయినా మాత్రలు తెచ్చి ఇచ్చాడు అది చాలు అనుకుంటూ చేతిలోని మాత్రలు పొట్లాన్ని చూసింది. అందులో పది మాత్రలు వున్నాయి. వాటిని చూడగానే వనజకు చాలా సంతోషం కలిగింది. తన సమస్యనుండి రక్షించే దేవతల్లా కనిపించాయి. కానీ ఆ క్షణంలో ఆమెకు తెలియదు అవే తన సమస్యను జటిలం చేయబోతున్నాయని.

ఇన్ని రోజులూ అనుభవించిన బాధ, గుండెలోని వేదన ఈనాటితో, ఈ మాత్రలతో తీరిపోతాయి అని భావించిన వనజ గ్లాసుతో నీళ్ళు అందుకుని చింతపిక్కల్లా వున్న ఆ పది మాత్రలనూ వున్నపళంగా ఒకేసారి మ్రింగేసింది.

దాదాపు పదినిమిషాల తరువాత మొదలయింది భరించలేని బాధ. ఆ రోజు ప్రొద్దుటినుండీ ఆమె ఆహారం ఏమీ తినలేదు. ప్రొద్దున్న కాసిన్ని టీ నీళ్ళు మాత్రం తాగింది. నాటు పద్ధతిలో తయారు చేయబడిన ఆ మాత్రల్ని అరిగించుకోవడానికి ఆమె శక్తి సరిపోలేదు. ఆ సమయంలో వనజ అనుభవించిన బాధ పగవారికి కూడా రాకూడదు. కడుపును మెలితిప్పే బాధతో విలవిలలాడిపోయింది.

ఆ సమయంలో గిరితో గడిపిన కాలం, ఆనందం, చేసిన శృంగారం, తీర్చుకున్న శరీర వాంఛలు అన్నీకూడా ఎంతో పనికిమాలినవిగా, వ్యర్థమైనవిగా తన జీవితాన్ని కబళించివేసే మృత్యుద్వారుల్లా అనిపించాయి. క్షణికావేశానికి లోనయి, అతడి వలలో పడి పరాయిదేశంలో నా అనే దిక్కులేని చోట ఎందుకు ఇలాంటి పాడు పనులు చేసానా? ప్రాణం మీదికి తెచ్చుకున్నానా? అని వనజ వగచింది. చేసిన తప్పుకు తగిన శిక్ష ఏదో ఒకరూపంలో అనుభవించాల్సిందే కదా అనుకుంటూ కుమిలిపోయింది వనజ. అంతా జరిగిపోయాక ఇపుడు ఏమి అనుకుని ఏమి లాభం? అయినా కూడా తెలిసిన దేవుళ్ళందరికీ మొక్కుకుంటోంది. చేతులెత్తి దణ్ణం పెడుతూ దయ చూపించమని, రక్షించమని వేడుకుంటోంది. అయినా ఏ దేవుడూ ఆమె మొరను ఆలకించలేదు. బాధను భరించలేక

అరిచి గట్టిగా కేకలు పెట్టాలనిపిస్తోంది. కానీ కువైటు వారికి, మామా, బాబాకు తెలిస్తే ఏమయినా వుందా? చంపి పారేస్తారు. కనికరం ఏమీలేదు. భయంతో బాధను పంటి బిగువున ఓర్చుకుంటోంది వనజ. కానీ, ముఖమంతా చెమటలు పడుతున్నాయి. కంటికి ఏమీ కనిపించడం లేదు. ఒంట్లోని శక్తి నిర్వీర్యం అయి కాళ్ళు బలహీనంగా మారాయి. ఇక సహించే ఓపిక లేక వెంటనే వెర్రికేక పెట్టి క్రింద కూలబడిపోయింది. స్పృహ తప్పిపోయింది ఆమెకు.

వంటింట్లో వనజ పడిపోయిన శబ్దం విన్న మామా అక్కడికి రానే వచ్చింది. పరిస్థితిని గమనించి వనజకు ఏమయిందో అని కంగారు పడి వెంటనే ఆమెను కార్లోకి చేర్చి హాస్పిటల్‌కు తీసుకెళ్ళింది మామా.

అక్కడ డాక్టర్లు వనజను పరీక్షించి, పరిశీలించి, చూసి, వనజ గర్భవతి అని, నాటు పద్ధతిలో తయారు చేయబడిన మాత్రలు గర్భవిచ్ఛిత్తి కొరకై ఆమె వాడినందువల్ల ఆ మాత్రలు వికటించి ఆమెకు ఆ పరిస్థితి ఎదురయిందని తేల్చి చెప్పారు. డాక్టర్ల మాటలు విన్న మామా షాక్‌కు గురయినట్లు మ్రాన్పడిపోయింది. కాసేపటికి తేరుకుని వనజతో ఏ సంబంధమూ లేనట్లుగా వారికి చెప్పి, ఇంటికి వెళ్ళిపోయింది. ఇంత జరిగినా కడుపులో బిడ్డ మాత్రం క్షేమంగా వుందని, అబార్షన్ కాలేదని డాక్టర్లు తెలియజేసారు. వనజకు నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు.

పోలీసులు వచ్చారు. వనజను ప్రశ్నించారు. కేసు డిటైల్సు రాసుకున్నారు. గిరిని కూడా పట్టుకుని బంధించి కారాగారానికి తరలించారు. ఇల్లీగల్ రిలేషను కలిగి అబార్షన్ చేయడానికి పాల్పడినందున వనజపై, గిరిపై కేసు పెట్టబోతున్నట్లు, వారి నేరానికి తగిన శిక్షను విధించబోతున్నట్లు పోలీసులు తెలియజేసారు.

ఇస్లాం మత సిద్ధాంతాలను పాటించే కువైటు దేశంలో ఇలాంటి నేరాలను సహించరు. ఇక్కడ అబార్షన్ అనేది చాలా ఘోరమైన నేరం. ఈ నేరానికి క్షమాపణ అనేది లేదు. అలాగే అక్రమ సంబంధాలను వీరు వ్యతిరేకిస్తారు. ఇక్కడ చట్టాలు కఠినంగా వుంటాయి. అందుకే వనజ ఆరోగ్యస్థితి మెరుగుపడేంత వరకు హాస్పిటల్‌లో వుంచి, తరువాత ఆమెను తీసుకుని వచ్చి ఉమెన్స్ సెంట్రల్ జైలులో వేసారు. చంద్రికకు తన కథంతా చెప్పి చిన్నగా నిట్టూర్చింది వనజ.

ఒక నెల రోజులు గడిచిన తరువాత ఒకరోజు ఉదయాన్నే నిద్రలేచి చూసేసరికి చంద్రిక ఆ గదిలో కనిపించలేదు. ఆమె ఏమయిందో, ఎక్కడికి తీసుకు వెళ్ళారో వనజకు అర్థం కాలేదు. చంద్రికకు ఉరిశిక్ష అమలు చేసారేమో అనుకుంటేనే వనజకు కన్నీళ్ళు ఆగడం లేదు. దాదాపు నెలరోజులు చంద్రికతో ఆ జైలు గదిలోని సహవాసం, గడిపిన కాలం గుర్తొచ్చి వనజ గుండె బరువెక్కింది. జైలు అధికారులను కూడా చంద్రిక వివరాలు అడిగింది. కానీ ఎవరూ కూడా వనజకు జవాబు చెప్పలేదు. చంద్రిక బ్రతికే వుండాలని ఏదో ఒకనాడు క్షేమంగా శ్రీలంకకు తిరిగి వెళ్ళాలని దేవుని ప్రార్థించింది వనజ.

మిగిలిన నెలలన్నీ కూడా నిస్తేజంగా ఆ జైలు గదిలో గడిపింది వనజ. ఆమెకు నెలలు నిండగానే హాస్పిటల్‌లో చేర్చారు. ఆమెకు కానుపు అవగానే పుట్టిన బిడ్డను వేరు చేసి తీసుకుని వెళ్ళిపోయారు. కనీసం కళ్ళతో తన బిడ్డను ఒక్కసారి కూడా చూడనివ్వలేదు. చూపించమని అక్కడ పనిచేసే నర్సులనందరినీ ఆమె ప్రాధేయపడి అడిగింది.

"వాళ్ళు నీ బిడ్డ ఎక్కడ వుందో మాకు తెలియదు. బహుశా కువైటు అనాధశరణాలయానికి తీసికెళ్ళి వుంటారు అని చెప్పారు."

వనజ హృదయం ఎడారిలా ఎండిపోయింది.

నాలుగురోజులు హాస్పిటల్‌లో వుంచిన తరువాత, తిరిగి మరలా ఆ జైలు గదిలోకే ఆమె తీసుకురాబడింది. ఆమె చేసిన నేరానికి రెండేళ్ళ జైలు శిక్ష విధించబడింది. ఆ తరువాత ఆమె పాస్‌పోర్టులో ఎర్రముద్ర వేసి ఇంకోసారి మరలా కువైటుకు కాని ఏ యితర గల్ఫ్‌దేశానికి కానీ రాకుండా నిషేధించడం జరిగింది.

గిరి విషయం ఏమయిందో అతడు ఏమయ్యాడో? ఆమెకు తెలియలేదు. తెలిసే అవకాశం కూడా లేదు. అతడి గురించి తెలుసుకోవాలని కూడా ఆమెకు లేదు. అతడి గురించి తలచుకోవడం, అతడిని గుర్తుచేసుకోవడం కూడా ఆమెకు అస్సలు ఇష్టంలేదు. ఆమె జీవితంలో అది ఒక చేదు జ్ఞాపకం.

ప్రస్తుతం కువైటు అనాథ శరణాలయంం యిలాంటి దిక్కులేని పిల్లలతో నిండిపోయివుంది.

తల్లిదండ్రులచే విడిచిపెట్టబడినవారు, నేరం చేసి జైలు శిక్షను అనుభవించే తల్లికి పుట్టినవారు, ఇల్లీగల్ రిలేషన్స్‌తో పుట్టి అక్కడ చేర్చబడిన పిల్లలు అందరూ కూడా కువైటు ప్రభుత్వ పరిరక్షణలో సంరక్షణలో పెరుగుతూ విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. ఇలాంటి కథలకు ముగింపు లేదు. తల్లిదండ్రుల తొందరపాటుకు, వాళ్ళు చేసిన తప్పిదానికి ఫలితం అనాథలుగా మారిన ఈ చిన్నారుల జీవితాలు.

## వేలరీ ప్రేమకథ

**కువైటు సిటీ.**

మారియట్ హోటల్ అకామిడేషన్.

రూమ్ నెంబరు 305 A

రేపు మార్నింగ్ డ్యూటీ. ఐదుగంటలకే నిద్రలేవాలి, అనుకుంటూ అలారం సెట్ చేసుకుని పడుకున్నాను. గాఢనిద్రలో వున్నాను. ఏవో మంచి కలల్లో తేలిపోతూ సంతోషంగా వున్నట్లున్నాను. అయినా కూడా ఎందుకో మెలుకువ వచ్చింది. అటు ప్రక్కకి తిరిగి పడుకుంటూ ఇంతకీ కలలో కనిపించిన వ్యక్తి ఎవరబ్బా? అల్లరి మాటలతో ఆనందం పంచిన ఆ అందమైన అబ్బాయి రూపం అస్పష్టంగా వుందే? నా ఫేవరెట్ హీరో మహేష్‌బాబు కాదు కదా? ఇంత రాత్రివేళ నమ్రతాను వదిలి ఇండియా నుండి కువైటుకు మహేష్‌బాబు నాకోసం రాలేడు కదా అనుకుంటూ కలలో అస్పష్టంగా కనిపించిన నన్ను మురిపించిన ఆ అందమైన అల్లరి అబ్బాయి రూపాన్ని గుర్తుతెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ బ్లాంకెట్‌ను పైకి లాక్కున్నాను. ఒంటరిగా ఈ ఎడారి దేశంలో పదహారు సంవత్సరాలుగా వుంటూ, యంత్రంలా పనిచేస్తూ కుటుంబాన్ని ఆదుకున్న నాకు కలలే మిగిలాయి. నా ఒంటరితనంలో పుస్తకాలు, నా రాతలు, నిద్ర, కలలు నా నేస్తాలుగా నిలిచాయి. టైమ్ ఎంతయిందో అనుకుంటూ వాల్‌క్లాక్ వైపు చూసాను. తెల్లవారు ఝామున రెండు నలభై అయినట్లుగా అది సమయాన్ని చూపిస్తోంది.

లేచి కూర్చుని వాటర్ బాటిల్ అందుకుని నీళ్ళుత్రాగి మళ్ళీ పడుకోబోయాను. అపుడు వినిపించింది, ఎవరో సన్నగా వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తున్న శబ్దం. ఒక్కసారిగా కాస్త భయం వేసింది. ఈ టైములో ఎవరు ఎందుకు ఏడుస్తున్నారో? కొంపదీసి దయ్యం కాదుకదా? చూడకూడదు అనుకుంటూనే అనవసరంగా ఈ మధ్య యూ ట్యూబ్‌లో ఏదో దయ్యం మూవీ చూసాను. అప్పట్నించీ ఏ శబ్దం అయినా వులిక్కిపడటం జరుగుతోంది. ఎందుకు చూసానా ఆ మూవీ అనుకుంటూ మనసులో నన్ను నేను తిట్టుకుంటూ ఆ ఏడుపు ఎక్కడినుండి వినిపిస్తోందో తెలుసుకోవడానికి చెవులు రిక్కించి శ్రద్ధగా వినసాగాను. బయట నా రూముకి ఆనుకుని వున్న మా హాల్లో

నుండే ఆ ఏడుపు శబ్దం వినిపిస్తోంది. ఇక కుదరదని ధైర్యం తెచ్చుకుని బెడ్ పైనుండి లేచి చెప్పులు వేసుకున్నాను. మెల్లగా అస్సలు శబ్దం కాకుండా అడుగులో అడుగువేసుకుంటూ నడిచి నా రూము తలుపు దగ్గరకు చేరుకున్నాను. ఒక్క క్షణం అక్కడ ఆగి ఒక్కసారి గుండెలనిండా గట్టిగా గాలి పీల్చుకుని 'కమాన్ చిన్నపిల్లలా భయపడతావేంటి అని నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను.' ఇక ఏదయితే అది అవుతుంది అనుకుంటూ లాక్ తీసి, తలుపు వారగా కొంచెం తెరిచి, తల ఒక్కటే బయటపెట్టి హాల్లోకి తొంగి చూసాను.

అక్కడ గోడవారగా వున్న డైనింగ్ టేబుల్‌పై తలవాల్చి వెక్కి వెక్కి ఏడుస్తోంది వేలరీ. అసలే ఆ అమ్మాయిది బాగా కర్లీ హెయిర్. జుట్టంతా విరబోసుకుని వుంది. ఆ జుట్టు తప్ప మొహం కనపడకుండా తల టేబులపై వాల్చి రెండు చేతుల మధ్య దాచుకుని ఏడుస్తోంది.

నిజంగా అక్కడ వున్నది వేలరీయేనా? లేక వేలరీ రూపంలో వున్న దయ్యమా? ఒకవేళ వేలరీనే అయితే ఈ టైములో నిద్రపోకుండా హాల్లో కూర్చుని ఎందుకు ఏడుస్తోంది? అసలు వేలరీ ఎపుడూ జోవియల్‌గా, యాక్టివ్‌గా, హాపీగా ఏదో ఒకటి మాట్లాడుతూ నవ్విస్తూ వుంటుంది కదా! మరి అంతగా వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తోంది అంటే నమ్మలేకపోతున్నాను.

నా రూమ్‌కి ప్రక్కన వున్న రూములో వేలరీ వుంటుంది. వేలరీ గోవా నుండి వచ్చింది. అటువైపు కిచెన్‌కి ప్రక్కగా వున్న బెడ్‌రూములో జేనీ అనే కేరళ అమ్మాయి వుంటుంది. మా ముగ్గురికీ కలిపి ఒకే కంబైన్డ్ హాలు, కిచెన్ వున్నాయి. జేనీ మా హోటల్లోనే హౌస్ కీపింగ్ డిపార్టుమెంటులో పనిచేస్తుంది. వేలరీ, మా ఫ్రంట్ ఆఫీసులోనే గెస్ట్ రిలేషన్ ఆఫీసర్‌గా సంవత్సరం ముందు జాయిన్ అయింది. ఆకట్టుకునే అందమైన రూపం వేలరీది. రూపమేకాదు మాట తీరు కూడా. ఎప్పుడు చూసినా నవ్వుతూ వుంటుంది. జోక్స్ వేస్తూ అందరినీ ఇమిటేట్ చేస్తూ వారి బాడీ లాంగ్వేజ్‌ని యాక్షన్ చేసి చూపిస్తూ నవ్విస్తూ వుంటుంది. ఎప్పుడో అరుదుగా అపుడపుడూ నవ్వే నేను వేలరీ వచ్చిన తరువాత ఆ అమ్మాయి మాటలకి, జోక్స్‌కి మనసారా కడుపుబ్బా నవ్వేస్తున్నాను.

ఎంతో యాక్టివ్‌గా వుండి, నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ వుండే వేలరీ అంటే కొలీగ్స్‌కే కాదు మా గెస్టులకు కూడా చాలా ఇష్టం. ఈ సంవత్సరకాలంలోనే మా హోటల్లో చాలా మంచి పేరు తెచ్చుకుంది.

పోయిన వారంలో ఒకరోజు యిదే హాల్లో నిలబడి మా జి.యమ్ జార్జిగారు ఎలా వంగి నడుస్తారో, ఎలా ఫన్నీగా మాట్లాడతాడో కళ్ళద్దాలు ముక్కుపైకి లాక్కుని కళ్ళు మాత్రం పైకెత్తి చూసి మనుషుల్ని ఎలా పలకరిస్తాడో యాక్షన్ చేసి చూపిస్తుంటే పొట్ట చేత్తో పట్టుకుని, దవడలు నొప్పి పుట్టేలా పకపకా అర్ధగంట ఆపకుండా నవ్వుకున్నం మేమిద్దరమూ.

అలాగే సెక్యూరిటీ ఆఫీసరు 'అన్వరు' ఫోటో కాపీలు, కలర్ ప్రింట్స్ అవసరమయి వచ్చి అడిగేటపుడు ఎంత దీనంగా, బిచ్చగాడిలా, చేతులు జోడించి, వినయంగా అడుగుతాడో నాకు వివరించి, వర్ణించి వేలరీ చెపుతుంటే సోఫాలో పడి దొర్లి మరీ నవ్వాను నేను. అప్పుడే తెలిసింది నాకు నవ్వడంలోని ఆనందం.

అప్పట్నుంచీ మా ఇద్దరికీ వీలయినప్పుడల్లా డ్యూటీలేకుండా ఇంట్లో వున్న సమయంలో కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ వుంటున్నాము. స్తబ్దంగా, నిశ్శబ్దంగా వున్న నా జీవితం వేలరీ రాకతో నవ్వుల జల్లుగా మారింది. నేనంటే వేలరీకి చాలా ఇష్టం. వచ్చిన మొదటి రోజే నాతో బాగా కలిసిపోయి కబుర్లు చెప్పింది. రెండో రోజే మనం ఫ్రెండ్స్ అంటూ చేతులు కలుపుకున్నాం. మూడో రోజునుండీ జోక్స్, పాటలు, ఆటలు, డాన్స్ మొదలు పెట్టాం. వేలరీ గిటారు బాగా వాయిస్తుంది. తను గిటార్ ప్లే చేస్తుంటే నేను పాటలు పాడేదాన్ని. తను ఎక్కడ వుంటే అక్కడ సందడి వుంటుంది.

కానీ అవతలి రూములోని జేనీ అంటే నాకే కాదు, వేలరీకి కూడా అసలు నచ్చదు. జేనీకి కువైట్ రేడియో అని మా హోటల్లోవాళ్ళు పేరు పెట్టి పిలుస్తుంటారు. అదేదో పెద్ద బిరుదులా, నేషనల్ అవార్డులా భావించి నవ్వుకుంటూ మురిసిపోతుంది జేనీ.

ఇక్కడి వార్తలు అక్కడికి అక్కడి వార్తలు ఇక్కడికి చేరవేయడమే తన పని. ఏ విషయమైనా సరే జేనికి చెప్పామంటే చాలు ఐదు నిముషాల్లో ఆ వార్త మొత్తం హోటల్లోని స్టాఫ్‌కి తెలిసిపోతుంది. అంత టాలెంట్ వున్న రేడియో ఈ జేనీ.

వేలరీ, జేనీలు ఇద్దరూ ఈ మధ్య అపుడపుడూ బాత్ రూము దగ్గరా, కిచెన్లో సామాన్లు సర్దుకోవడం దగ్గరా చిన్న గొడవలు పడుతున్నారు. వేలరీ ఫ్రిజ్‌లో పెట్టిన జ్యూస్‌లు, వెజిటబుల్స్ మాయం అయిపోతుండటంతో వేలరీ జేనీని నిలదీసి అడగటంతో గొడవ కాస్త ముదిరింది. దాదాపు జేనీ అక్కడికి వచ్చిన రెండేళ్ళలో ఫ్రిజ్‌లోని నా ఫుడ్ ఐటమ్స్ కూడా మాయమవుతున్నాకూడా కడుపుకు తినే తిండికదా! ఎవరు తింటే ఏముంది? ఆకలిగా వుండి తిని వుంటుంది, పోనీలే తిననీ అనుకుంటూ నేను చూసీ చూడనట్లుగా ఇన్నాళ్ళూ వుండిపోయాను. కానీ వేలరీ ముక్కుసూటి మనిషి కావడంతో ఒకటి రెండుసార్లు బాగా చూసి, కనిపెట్టి ఆధారాలతో సహా పట్టుకుని గట్టిగా నిలదీసి జేనీని అడిగింది.

మరి అందుకే ఇపుడు ఈరోజు జానీతో ఏదైనా గొడవ జరిగి వేలరీ ఏడుస్తోందా? లేక మా పాములాంటి సూపర్ వైజరు అల్మా ఏదైనా కుట్రలతో కుతంత్రం చేసి ఏడిపించిందా? అల్మా ఫిలిప్పీన్ అమ్మాయి. స్నేక్‌లాంటి స్వభావం కావడంతో పనిలో కూడా మాకు చాలా హార్డ్ టైమ్ ఇస్తూ వుండటంతో, మేము స్నేక్ అని పేరు పెట్టి పిలుచుకుంటూ కోపాన్ని అలా క్రక్కలేకా మ్రింగలేక దిగమ్రింగుతున్నాం.

నేనేకాదు నాతోపాటు వేలరీకూడా అల్మా క్రూర స్వభావానికి బాధపడి, తిట్టుకోవడం మామూలైపోయింది. మరి ఏమయ్యిందో ఎందుకు వేలరీ ఏడుస్తోందో నాకు క్లూ దొరకడం లేదు. అయినా చిన్న విషయాలకు వేలరీది ఏడ్చే స్వభావం కాదు మరి.

మెల్లగా వేలరీ దగ్గరకి చేరుకుని తలపై చెయ్యివేసాను. ఉలిక్కిపడి తల పైకెత్తింది వేలరీ. ఎపుడూ నవ్వుతూ వుండే వేలరీ కళ్ళనిండా నీళ్ళు. అప్పటికి ఎంతోసేపటినుండి ఏడుస్తోందో తెలియదుగానీ కళ్ళు ఎర్రగా వాచి వుబ్బి వున్నాయి.

"ఏంటి, ఏమయింది? ఎందుకు ఇంతగా ఏడుస్తున్నావు?" అని అడిగాను ఆదుర్దాగా.

"ఏం లేదు, ఏం లేదు నువు వెళ్ళి పడుకో" అంది కంగారుగా కళ్ళు తుడుచుకుంటూ.

ఇంతగా వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తూ ఏం లేదు అంటావే "ఏం జరిగిందో నిజం చెప్పు నువ్వు. స్నేక్ ఏమైనా అందా? జేనీతో పోట్లాడావా? మీ అమ్మ గుర్తొచ్చిందా? నీ బాయ్ ఫ్రెండ్ షాహిద్‌తో ఏదైనా గొడవ జరిగిందా?" ఏంటో చెప్పు అన్నాను అనునయంగా మాట్లాడుతూ.

"విని అనవసరంగా నువు బాధపడతావు. అది నాకిష్టం లేదు. నువు వెళ్ళి పడుకో" అంది మొండిగా వేలరీ.

ఇక కుదరదని టేబుల్ ముందున్న కుర్చీ లాక్కుని కూర్చున్నాను. "నువు జరిగింది చెప్పేంత వరకూ నేను ఇక్కడినుండి కదలను. తరువాత నీ యిష్టం" అన్నాను నేను అంతకంటే మొండిగా.

ఒకసారి నావైపు చూసి "సంతోషాన్ని తప్ప బాధను ఫ్రెండ్స్‌తో పంచుకోవడం నాకు ఇష్టం వుండదు. నన్ను బలవంతం చేయకు" అంది వేలరీ.

"ఓ.కే అలాగే ఏడువు. బాగా ఏడువు. నేను చూస్తూవుంటాను" అన్నాను.

హుమ్... అని నిట్టూర్చింది వేలరీ.

"ఇక చాలు మొండితనం. చెప్పు తొందరగా" అన్నాను.

బదులుగా ఏడ్వటం మొదలు పెట్టింది వేలరి.

"అందరికీ ఏడవొద్దు, నవ్వండి అని చెప్పే నువ్వు ఏడుస్తూ కూర్చోవడం అసలు బాలేదు. సమస్య ఏంటో చెప్పు. పరిష్కారం కనుగొందాం" అన్నాను నేను లేని కోపం కాస్త ముఖంలోకి తెచ్చిపెట్టుకుంటూ.

"ఇంకో గంటలో షాహిద్‌కి పెళ్ళి జరగబోతోంది" చెప్పింది వేలరీ.

"వ్వాట్!!" అరిచాను నేను. ఒక్క క్షణం వేలరీ ఏం చెపుతోందో నాకు అర్థం కాలేదు.

ఆర్నెల్లనుండి వేలరీ షాహిద్‌ల మధ్య గాఢమైన ప్రేమ కొనసాగుతోంది. ఇద్దరూ ఒకర్ని విడిచి మరొకరు క్షణం వుండలేనంతగా ఫోన్ కాల్స్, చాట్‌లు, కలిసి రెస్టారెంట్‌కు వెళ్ళడాలు చేస్తున్నారు.

షాహిద్ ఎన్నోసార్లు నాతో కూడా వేలరీని తప్ప మరొక అమ్మాయిని పెళ్ళి చేసుకునే ప్రసక్తే లేదనీ తమ తల్లిదండ్రుల్ని ఒప్పించి, ఎదిరించి అయినా సరే వేలరీనే చేసుకుంటానని గట్టిగా చెప్పాడు. మరి అంతటి ప్రేమ పట్టుదలగల షాహిద్ ఈ రోజు పెళ్ళి చేసుకోబోతున్నాడా? ఎలా సాధ్యం? అందుకే వేలరీ ఈ రాత్రిపూట ఇంతగా ఏడుస్తోంది. అయ్యో మనసుకు ఎంత బాధ? ఇలాంటి బాధ భరించడం కష్టమే. ఎలా తట్టుకుని నిలబడి షాహిద్‌ను మరిచి జీవిస్తుందో ఈ వేలరీ. నా గతం, అందులోని కొన్ని చేదు జ్ఞాపకాలు గుర్తొచ్చి నా మనస్సు భారమైపోయింది. ఛీ... మగవాళ్ళంతా ఇంతేనేమో. ప్రేమించామని చెప్పి కలిసి తిరిగి, ఆఖరికి ఇలా ఇంకో పెళ్ళి ఎలా చేసుకుంటారో అనుకుంటూ "అసలు ఏం జరిగింది? షాహిద్ ఎప్పుడు పాకిస్తాన్ వెళ్ళాడు? నీతో చెప్పి వెళ్ళాడా?" ప్రశ్నించాను.

"హా.. అవును నాలుగురోజుల క్రితం, వాళ్ళ అమ్మగారికి ఆరోగ్యం బాలేదని చెప్పి అర్జంటుగా వెళ్ళాలని అప్పటికప్పుడు టిక్కట్టు బుక్ చేసుకుని వెళ్ళిపోయాడు. నిన్ననే ఫోను చేసి 'అమ్మా నాన్నలు అత్త కూతుర్ని చేసుకోమని బలవంతం చేస్తున్నారని చెప్పి ఒకటే ఏడుపు. ఆ అమ్మాయి చేసుకోకపోతే అమ్మా నాన్నలు చనిపోతాం అంటున్నారు. ఒప్పుకోక తప్పడంలేదు. జస్ట్ పెళ్ళి చేసుకుని కువైటుకు వచ్చేస్తా. అక్కడ మనిద్దరం మునుపటిలా హ్యాపీగా వుండచ్చు సరేనా? ' అన్నాడు. నాకు ఏం చెప్పాలో అర్థం కాలేదు. అప్పట్నించీ నా మనస్సు బాలేదు. చచ్చిపోదాం అనేంత బాధగా వుంది. అసలు షాహిద్‌ను మరో అమ్మాయి పక్కన వూహించుకోలేకపోతున్నాను. నన్ను కాకుండా ఇంకో అమ్మాయిని చేసుకుంటాడని కలలో కూడా వూహించలేదు" వెక్కి వెక్కి ఏడ్చింది వేలరీ.

"సరే వూరుకో. ఇంతగా షాహిద్‌ను నమ్మడం తప్పేమో. అసలు పాకిస్తాన్ వాళ్ళని నమ్మకూడదు. వాళ్ళకి శరీరం తప్ప మనసు వుండదు. వాళ్ళ దేశం, మతం వాళ్ళకి ముఖ్యం. పరాయి దేశమైన ఇండియానుండి వచ్చిన నిన్ను చేసుకుంటాడంటే నేను నమ్మలేకపోయాను. కానీ మీ ఇద్దరి ఇష్టం కదా నా అభిప్రాయం చెప్పి మిమ్మల్ని బాధపెట్టడం ఎందుకు అని నేను బయటికి చెప్పలేదు" అన్నాను నేను.

"దేశం, మతం, భాష వేరే అని నేను ఎపుడూ అనుకోలేదు. మనిషి మంచివాడని నమ్మకం వుంచాను. నన్ను విడిచిపెట్టడని భావించాను. ఆఖరికి ఇలా జరుగుతుందని అనుకోలేదు. నా హృదయాన్ని రంపంతో కోసినంత బాధగా వుంది. నా ఆశలన్నీ ఆవిరైపోయాయి" అంటూ ఏడ్చింది వేలరీ.

ఓ దేవుడా? ఎందుకు మనుషుల మధ్య ప్రేమలు, బంధాలు, మమతలు ఏర్పరిచి ఇలా విడగొట్టి వినోదం చూస్తావు. ఇంత బాధ భరించడం మనిషికి మనసుకు సాధ్యమా? ఎలా సాధ్యమో నువ్వే చెప్పు ఆక్రోశించింది నా హృదయం.

ఇంతలో అవతలి రూమ్ తలుపు తెరుచుకుని జేనీ కళ్ళు నులుముకుంటూ బయటికి వచ్చింది. వచ్చీ రావడంతోనే "ఏంటి మీ ఇద్దరూ ఈ టైమ్‌లో కబుర్లు చెప్పుకోవడం? నాకు నిద్ర డిస్టర్బ్ అవుతోంది. మీరు మీ రూముల్లోకి వెళ్ళి కబుర్లు చెప్పుకుని నవ్వుకోండి" అంటూ విసురుగా బాత్‌రూములోకి వెళ్ళిపోయింది.

ప్రతిరోజు మేము చెప్పుకునే కబుర్లు, జోక్స్, నవ్వులు చూసి జేనీకి బాగా జెలసీ. అందుకే ఇప్పుడూ కూడా మేము కబుర్లు చెప్పుకుని నవ్వుకుంటున్నాం అనుకుంటోంది. ఇంకా నయం అసలు విషయం తెలిసిపోలేదు. కొంచెం తెలిసినా రేపు తెల్లారేటప్పటికి మొత్తం హోటల్లో ఈ న్యూస్ పాకిపోతుంది అనుకుంటూ "వేలరీ ఇక్కడినుండి లే నా రూములోకి వెళదాం పద" అన్నాను.



జేనికి ఈ విషయం తెలియకూడదని భావించినట్లుంది అందుకే వెంటనే లేచి నా వెంట నడిచి నా రూములోకి వచ్చింది వేలరీ.

నా రూమ్‌లో అటువైపు వున్న విండో తెరిచాను. అవతల షరక్ డౌన్ సిటీ, ఎత్తైన టవర్స్‌తో పెద్ద భవనాలతో రాత్రిపూట వెలిగే లైట్లతో మెరిసిపోతోంది. నల్లటి ఆకాశంలో చందమామ, నక్షత్రాలు వింతకాంతులను వెదజల్లుతున్నాయి.

నవంబరు మాసపు చల్లగాలి మమ్మల్ని చల్లగా ఆప్యాయంగా పలకరించింది. నా విండో తెరిచి అక్కడ కాసేపు నిలబడితే ఎంతటివారికైనా మనసు ఆహ్లాదంగా మారక తప్పదు. ఎలాంటి బాడ్ మూడ్‌లో వున్నా సరే కాసేపటికి మదిలో సంతోషం నిండిపోతుంది. అక్కడ నిలబడి రాత్రిపూట చీకటిలో సిటీ వ్యూ చూస్తూ ఆకాశాన్ని తాకే టవర్స్‌ని తల పైకెత్తి అంచుల్ని చూస్తూంటే కాలం తొందరగా గడిచిపోతుంది. ఎన్నో నిద్రరాని రాత్రులు నేను ఆ కిటికీ ముందే గడిపాను. ఎన్నో సూర్యోదయాల్ని, సూర్యుని లేలేత కిరణాల వెచ్చటి స్పర్శను ఆస్వాదించాను.

అందుకే వేలరీని నా రూములోకి తీసికెళ్ళాను.

అంతకు ముందురోజుల్లో "వేలరీ నీకు మ్యారేజ్ అయితే మీరు నా రూములో ఫస్ట్‌నైట్ చేసుకోండి. నా రూము అచ్చం ఫైవ్ స్టార్ హోటల్లోని రూములా అందంగా, పొందికగా వుంటుంది కదా. అలాగే విండో తెరిస్తే అవతలి సీన్, వ్యూ స్విట్జర్‌లాండ్‌ని గుర్తుకు తెస్తుంది. సో ఇక మీరు స్విట్జర్లాండు వెళ్ళి అక్కడ ఫస్ట్‌నైట్ చేసుకోనక్కరలేదు. ఇక్కడే అది అరేంజ్ చేసుకోండి. ఆ రూమ్ రెంటు ఏదో కాస్త నాకే ఇచ్చేయండి" అని నవ్వుతూ చెపుతూండేదాన్ని. అక్కడ నిలబడగానే ఆ విషయాలన్నీ వెంటనే గుర్తొచ్చాయి. మరి వేలరీకి ఏమనిపించిందో నాకు తెలియదు కానీ వేలరీకి ఎన్నో విధాలుగా ధైర్యం చెప్పాను నేను. షాహిద్‌ను మరిచిపోయి సంతోషంగా వుండమని, జీవితాన్ని సరిదిద్దుకుని మంచివాడిని చూసుకుని పెళ్ళి చేసుకోమని.



ప్రతి ఒక్కరి జీవితంలో ఇవన్నీ మామూలుగా జరిగే విషయాలనీ ప్రాణం తీసుకోవడం, జీవితమే ఒద్దు అనుకోవడం మంచి ఆలోచన కాదని అనునయించాను.

ఇంతలో ఐదుగంటలు అయినట్లుగా అలారం మ్రోగింది. ఇక తప్పదుకదా. స్నానం చేసి తయారయి డ్యూటీకి వెళ్ళడానికి నేను బాత్‌రూములోకి వెళ్ళిపోయాను. వేలరీ తన రూములోకి వెళ్ళిపోయింది.

www.koumudi.net

ఆరోజు నుండీ వేలరీ ముఖంలో చిరునవ్వు మాయమయిపోయింది. నిరాశతో, నిస్పృహతో కనిపిస్తోంది. అపుడపుడు ఏడ్చినట్లుగా ఎర్రబారిన ఆ కళ్ళు తెలియజేస్తున్నాయి. అంత తొందరగా ఆ బాధను దిగమింగడం అంత సులభం కాదని నాకు తెలుసు. కాలమే మాన్పాలి ఆమెకు కలిగిన గాయాల్ని. శరీరానికి కలిగిన గాయాలయినా తొందరగా మానిపోతాయి నొప్పి తగ్గిపోతుంది కానీ హృదయానికి కలిగిన గాయం మాత్రం మానడానికి కొద్దికాలం పడుతుంది.

వేలరీ రోల్ నేను పోషించడం మొదలు పెట్టాను. తనలాగే జోక్స్ వెయ్యడం నవ్వించడం చేయాలని ప్రయత్నించాను. కానీ వేలరీ అంత టాలెంటెడ్ కాదు నేను. నెలరోజులు అలా గడిచాయి. షాహిద్ పాకిస్తాన్ నుండి తిరిగి వచ్చాడు. మనిషి పచ్చగా నున్నగా తయారయి పెళ్ళి కళతో మెరిసిపోతున్నాడు.

షాహిద్‌ను చూసిన వెంటనే తన కోపాన్ని మరిచిపోయింది వేలరీ. అతడి మాటలు విని, మళ్ళీ యధావిధిగా తన ప్రేమను కొనసాగించింది. పోనీలే ఏడుపు మానిందికదా మరలా సంతోషంగా వుంది చాలు అనుకున్నాను నేను.

అలా తొమ్మిదినెలలు గడిచాయి. ఒకరోజు తనకు కొడుకు పుట్టినట్లుగా అందరికీ సంతోషంగా చెప్పుకున్నాడు షాహిద్. ఆ వార్త వినగానే వేలరీ ముఖం చిన్నబోయింది. వారం రోజులుపాటు ముభావంగా వుండిపోయింది. ఏదో బాధను దిగమింగుతున్నట్లుగా అనిపించింది.

కొడుకుపుట్టిన వెంటనే శెలవు తీసుకుని పిల్లవాడికి కావలసిన బట్టలు, వస్తువులన్నీ కొనుక్కొని, సంతోషంగా కొడుకుని చూడటానికి వెళ్ళిపోయాడు షాహిద్. మళ్ళీ ఒంటరిగా మిగిలిపోయింది వేలరీ. యాక్టివ్‌గా గలగలా మాట్లాడుతూ, నవ్వుతూ వుండే వేలరీ ఒకోసారి స్తబ్దంగా, నిశ్శబ్దంగా వుండిపోవడం, అపుడపుడూ ఏడవడం నేను గమనించాను. మానసిక క్షోభతో, తెలియని దిగులుతో వేలరీ కుమిలిపోసాగింది.

ఇంతలో షాహిద్ పాకిస్తాన్ నుండి తిరిగి వచ్చాడు. వస్తూ వస్తూ వేలరీకి రెండు పాకిస్తాని చుడీదార్లు, కాశ్మీర్ షాల్స్ పట్టుకొచ్చాడు. మౌనంగా, ముభావంగా వున్న వేలరీని చూసి "నువు దిగులు పడాల్సిన అవసరం అస్సలు లేదు. నేను నీవాడినే. నిన్నే ప్రేమిస్తున్నాను. సంవత్సరంలో పదకొండు నెలలు నీతోనే కదా వుంటున్నాను" అంటూ సర్దిచెప్పి వేలరీని మరలా దారిలోకి తెచ్చుకున్నాడు. మరొక సంవత్సరంన్నరకి మళ్ళీ కొడుకు పుట్టాడని వెళ్ళాడు. ఈ మధ్యలో ఒకటి రెండుసార్లు పాకిస్తాన్ వెళ్ళి వచ్చాడు. షాహిద్.

అపుడు నోరు విప్పింది వేలరీ. "నేను దుబాయ్‌కి వెళ్ళిపోతున్నాను. అక్కడ మారియట్ హోటల్లో నాకు జాబ్ వచ్చింది" చెప్పింది కాస్త దిగులుగా.

"నిజమా?" నమ్మలేనట్లుగా ప్రశ్నించాను.

అవును. "నేను అనుభవించే బాధ ఎవరికీ అర్ధంకాదు. షాహిద్ ఎంత స్వార్ధపరుడో నాకు అర్ధం అయింది. కువైటు వదిలి, షాహిద్‌ను మరిచి దుబాయ్ వెళ్ళిపోవాలనే కోరికతోనే నేను అక్కడ జాబ్‌కు అప్లై చేసుకున్నాను. కానీ మంచి స్నేహితురాలైన నిన్ను విడిచి వెళ్ళడం నాకు చాలా బాధగా వుంది. వారం రోజుల్లో షాహిద్ కువైటుకు తిరిగి రాకముందే నేను దుబాయ్ వెళ్ళిపోతున్నాను. మనం మళ్ళీ కలుసుకుందాం. టచ్‌లో వుందాం. ఎనీవే మనం ఒకే దేశానికి చెందిన వాళ్ళం. కాబట్టి ఇండియాలోనైనా సరే ఏదో ఒకరోజు మళ్ళీ తప్పక కలుస్తాం" అంది వేలరీ.

బాధతో నోటమాట రాలేదు నాకు. నా పదేళ్ళ సర్వీస్‌లో ఎంతోమంది క్రొత్తవారు వచ్చారు - పోయారు. కానీ వేలరీ వెళ్ళిపోతుంటే నాకెందుకో చెప్పుకోలేని బాధగా అనిపించింది. కళ్ళల్లో నీరు కదలాడింది. వేలరీ తీసుకున్న నిర్ణయం సమంజసమే

అనిపించింది. అందుకే "నువు మళ్ళీ మునుపటి వేలరీవి కావాలి. ఆల్ ద బెస్ట్. మంచి జీవితం కోసం ప్రయత్నించు." అని భారమైన హృదయంతో చెప్పాను నేను.

తనుకూడా ఆగని కన్నీటిని తుడుచుకుంటూ అలాగే అంటూ చిరునవ్వు నవ్వింది.

# ఎడారి స్వప్నాలు

**"స్వప్నా..** ఏయ్ స్వప్నా ఏం చేస్తున్నావు? నీకోసం ఎవరో వచ్చారు చూడు. నువు బిజీగా వున్నావు అని చెప్పాను. కానీ వినకుండా పాపం పదినిమిషాల నుండీ ఎండలో బయట డోర్ దగ్గరే నిలబడి వున్నాడు. తొందరగా వెళ్ళు. నువు వెళ్ళకపోతే ఈ ఎడారి ఎండకు మాడిపోయేలా వున్నాడు. ఇప్పటికే చెమటలు కారిపోతున్నాయి. తెల్లగా వున్న అతని బుగ్గలు కూడా ఎర్రగా కందిపోయి వున్నాయి. ఏంటీ సంగతి? లవ్వా? అబ్బాయి అందంగా వున్నాడు. మంచివాడే దొరికాడు" కొంటెగా నవ్వుతూ చెప్పింది జుల్కా.

ఇరవైయేళ్ళ జుల్కా అక్కడ వున్న వారందరిలో చిన్నది కావడంతో ఆ పిల్ల చేసే అల్లరికి హద్దు అంటూ వుండదు. తన మాటలతో, అల్లరితో అందరినీ ఆటపట్టిస్తూ వుంటుది.

వయసులో పెద్దవాళ్ళయినా కూడా అక్కడ తనతో కూడా పనిచేసే స్వప్న, రాజీ, క్రిస్టీలతో ఫ్రెండ్లీగా వుంటూ ఖాళీ సమయంతో కబుర్లు చెపుతూ సందడి చేస్తూ వుంటుంది. ఆ బ్యూటీ పార్లర్ (హనాన్ లేడీస్ సెలూన్)లో జుల్కా పనిలో చేరాక అక్కడ వున్న వీళ్ళందరికీ మంచి కాలక్షేపంగా వుంది. ఆ సెలూన్‌కు వచ్చే అరబిక్ కస్టమర్లు కూడా వచ్చీరాని అరబిక్‌లో ఆ పిల్ల చెప్పే కబుర్లు వింటూ హాయిగా నవ్వేస్తుంటారు.

ఇప్పుడు జుల్కా చెప్పే అందమైన అబ్బాయి ఎవరో స్వప్నకు అర్థం అయినట్లుంది. పెదవులపై విరిసిన నవ్వు బుగ్గల్లోకి పాకగా సిగ్గుతో కాస్త తడబడుతూ "ఎవరో అతను నాకేం తెలుసు? ఎందుకు వచ్చాడో ఏమో? నువ్వే కనుక్కో" అంది స్వప్న పని ముగించి చేతులు కడుక్కుంటూ.

"ఓహో అవునా? నిజంగా తెలియదా? అయితే సరే నేనే బయటికి వెళ్ళి అతనితో మాట్లాడతాను. నువు ఇక్కడే కూచో" అంది అల్లరిగా జుల్కా.

ఆ పిల్ల అన్నంత పనీ చేస్తుందనే భయంతో చేతుల తడిని టవల్‌కు తుడుచుకుని కాస్త లోషను చేతులకు రాసుకుంటూ బయటికి పరిగెత్తింది స్వప్న. అప్పటికి అక్కడికి వచ్చి ఎంతసేపయిందో ఏమో? అక్కడే బయట గోడకు ఆనుకుని నిలబడి వున్నాడు హసన్. జుల్కా చెప్పినట్లుగా ఎండ వేడికి అతని బుగ్గలు ఎర్రగా కందిపోయి వున్నాయి.

స్వప్నను చూడగానే, అతని కళ్ళలోకి వెలుగు, పెదవులపైకి చిరునవ్వు తరలి వచ్చాయి. పట్టరాని సంతోషంతో తన చేతిలోని పాకెట్‌ను ప్రేమగా ఆమె అందించి "హేపీ బర్తడే టూ యూ" అన్నాడు.

ఆమె ఆ పాకెట్ తీసుకోవడానికి ఒక క్షణం సందేహించింది.

"ఈ రోజు నా బర్తడే అని నీకు ఎలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగింది స్వప్న అతన్ని చూస్తూ.

"ఇష్టమైన వాళ్ళ పుట్టినరోజు తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. మనసుంటే మార్గం వుంటుంది." అన్నాడు హసన్ ప్రేమగా ఆమె కళ్ళలోకి చూస్తూ. "అబ్బో అలాగా ఎందుకో అంత ఇష్టం?" ప్రశ్నించింది ఆమె నవ్వుతూ.

"ఎందుకేమిటి? పెళ్ళి చేసుకుని నిన్ను నాదానిగా చేసుకోవాలని. అంతే" అన్నాడు సింపుల్‌గా తేల్చేస్తూ.

అతడు చెప్పిన జవాబు విన్న ఆమె 'ఆ.. నిజమా!?' అంటూ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి కాస్త భయంగా అతనివైపు చూసింది స్వప్న. ఎన్నో సందేహాలు, సందిగ్ధాలు ఆమె కళ్ళలో కనిపిస్తున్నాయి.

ఎందుకంటే కువైటు దేశంలోని ఈ ఎడారి ప్రేమలు చాలామట్టుకు కాలక్షేపానికి, పెళ్ళిళ్ళు శారీరక అవసరాలకు మనుషులు ఉపయోగించుకుంటున్నారు. తమ యవ్వనాన్ని, కాలాన్ని ఈ ఎడారిలో గడిపేసి, కొన్ని సంవత్సరాల తరువాత తిరిగి ఎవరి దారిన వారు తమ స్వదేశాలకు వెళ్ళిపోతున్నారు.

తనవారికి దూరమైన ఒంటరితనాన్ని మరిచిపోవడానికి కువైటు దేశంలో వున్న ప్రతికూల పరిస్థితులతో పోరాడటానికి, పని ఒత్తిడి నుండి రిలాక్స్ కావడానికి ఇక్కడ తాత్కాలికమైన స్నేహాలు బంధాలు, ప్రేమలను మనుషులు ఏర్పరచుకుంటున్నారు. ఎక్కడెక్కడివారో వారి దేశాల్ని విడిచి పరదేశులై కాసుల వేటకై ఈ ఎడారి సీమకు తరలి వస్తారు. ఇక్కడ ఒంటరిగా వుండి ఎన్నో సమస్యలను ఎదుర్కొని నిలబడాలంటే మనిషికి శక్తి సరిపోక సాటిమనిషి తోడు, ఓదార్పు, సహాయం అవసరం అవుతున్నాయి. అలా ఎన్నో కారణాలతో ఏర్పడే ఆడ మగ స్నేహాలు బంధాలుగా గట్టిపడి ఏళ్ళ తరబడి ఇక్కడ కొనసాగి కలిసి జీవించేట్లు చేస్తున్నాయి. వీటిలో అన్ని స్నేహాలు, బంధాలు మంచివే, కలకాలం నిలిచేవే అనుకోడానికి ఆస్కారం లేదు. ఎంతో మోసం, అవసరం, శారీరక కోరికలు స్వార్థం వీటిల్లో నిండి మనుషుల జీవితాలపై మనుసులపై ఇవి ప్రభావాన్ని చూపుతున్నాయి. వారి బిడ్డలపై, కుటుంబాలపై ఈ బంధంవల్ల ఏర్పడే దుష్పరిణామాలు ఎన్నో వున్నాయి. మగవాడి కామానికి, మోసానికి జీవితాల్ని కోల్పోయిన స్త్రీలు ఎందరో? మరి ఇపుడు హసన్‌తో ఏర్పడే స్నేహం ఎటువైపు దారితీస్తుందో? ఏ విధంగా మలుపు తిరుగుతుందో? చేతిలోని పాకెట్ వైపు చూస్తూ ఆలోచనలో పడింది స్వప్న.

ఆరోజు సెలూన్‌కు వచ్చిన కస్టమర్లు ఎక్కువగా వుండటంతో చేయాల్సిన పనులు మిగిలి వున్నాయని అతనికి చెప్పి తొందరగా లోపలికి వచ్చింది స్వప్న. కస్టమర్లకు ఐబ్రోస్, హెయిర్ కట్, ఫేషియల్ లాంటివి చేస్తూ పనిలో మునిగివున్నా కూడా ఆమె మనస్సు హసన్ చుట్టూనే తిరుగుతోంది. అతను చెప్పిన మాటలే మస్తిష్కంలో మెదిలి అలజడిని కలిగిస్తున్నాయి. మరోవైపు ఇండియాలో ఇంటివద్ద వున్న ఇద్దరు బిడ్డలు గుర్తొచ్చి కలవరాన్ని కలుగజేస్తున్నారు.

తాగుబోతు అయిన భర్త అర్ధాంతరంగా యాక్సిడెంటులో చనిపోతే ఆ మారుమూల పల్లెటూర్లో ఒంటరిగా నిలబడి పోరాటం చెయ్యడం ఆమెకు అసాధ్యం అయింది. విధిలేక బిడ్డల పోషణ భారాన్ని అన్నా వదినలకు అప్పగించి, సంపాదనకై ఆమె కువైటు దేశానికి వచ్చింది. అందుకు ఆమె అన్నావదినలు ప్రోద్బలం, ప్రోత్సాహం డబ్బుమీది ఆశ కూడా తోడ్పడ్డాయి. ముఖ్యంగా స్వప్నను, ఆమె బిడ్డలను పోషించడం వారి భారం మోయడం వారికి ఇష్టంలేదు. అందుకే కువైటుకు వెళ్ళమనే ఐడియా ఇచ్చి, ఆమె బిడ్డల్ని బాగా చూసుకుంటామనే భరోసా ఇచ్చి, ఒక విధంగా చెప్పాలంటే బలవంతంగా ఆమెను వారు కువైటుకు పంపించారు. ఇరవై రెండేళ్ళు దాటకముందే భర్తను కోల్పోయి, మంచి వయసులో వున్న ఒక స్త్రీ ఒంటరిగా వుంటే సమాజం బ్రతకనివ్వదని, మగవాళ్ళు వెంటబడి వేధిస్తారని, ప్రజలు ఏదో ఒక నింద నెత్తిన వేసి అవహేళన చేస్తారనే కారణాలు అనేకం ఆమెకు వారు చెప్పి కువైట్ ఫ్లయిట్‌ను ఎక్కించారు. పసిబిడ్డల్ని వదిలి దూరంగా వెళ్ళడానికి స్వప్న మనసు ఒప్పుకోలేదు. కానీ.. తప్పలేదు.

ఇపుడు ఇక్కడికి వచ్చాక ఎంతోమంది మగవాళ్ళు వెంటబడుతున్నా కూడా ఆమె మనసు చలించలేదు. ఎన్నడూ వెనుతిరిగి చూడలేదు. కానీ ఇపుడు హసన్ అంటే ఎందుకో చెప్పలేని ఇష్టం కలుగుతోంది. మరోవైపు భయంగా కూడా వుంది. దాదాపు ఆర్నెల్లుగా

ఆమె వెనుకే తిరిగి మాట్లాడాలని, ఆకట్టుకోవాలని అతడు ప్రయత్నిస్తున్నాడు కానీ ఆమె అతని పట్ల వుదాశీనత ప్రదర్శిస్తోంది. అతన్ని నిర్లక్ష్యం చేస్తున్నట్లుగా నటిస్తోంది కానీ మనసులో మాత్రం రోజు రోజుకీ అతని పట్ల ఇష్టం పెరిగిపోతోంది.

ఒక్కసారి స్త్రీహృదయం తొణికిందా, తన హృదయంలో పురుషునికి చోటు ఇచ్చిందా ఇక ఆ ప్రేమకు హద్దులు వుండవు. అది స్త్రీ సహజ లక్షణం.

ఎడతెగని ఆలోచనలతో అన్యమనస్కంగా పనిచేస్తున్న స్వప్నను చూసిన జుల్కా పరిస్థితిని అర్థం చేసుకుంది. స్వప్న దగ్గరికి వచ్చి ''ఏంటీ అతను అంతగా గుర్తొస్తున్నాడా? పనిచేయాలనిపించడం లేదా నీకు?'' అంటూ అల్లరి మాటలతో నవ్వించడానికి ప్రయత్నిస్తోంది కానీ.. స్వప్న మనసులో చెలరేగే భావోద్వేగాల్ని ఆమె గుర్తించలేకపోయింది. స్నేహం, బంధం మనుషుల మధ్య ఏర్పడటం అంత సులభం కాదు. దాని వెనుక ఎన్నో కారణాలు కథలు, ఇష్టాలు, కష్టాలు వుంటాయి. హృదయంలోనూ - జీవితంలోనూ ఎంతో సంఘర్షణ కూడా దాగి వుంటుంది.

స్వప్న యవ్వనం, వంటరితనం హసన్ వైపు ఆమెను మళ్ళేట్లు చేస్తున్నాయి. ఎంతకాలం తోడంటూ లేకుండా జీవితాన్ని, యవ్వనాన్ని ఆమె అడవిగాచిన వెన్నెల చేయగలదు?

హసన్ సిరియా దేశానికి చెందినవాడు. బాగా కలిగిన కుటుంబమే వారిది. కానీ హసన్ సరిగా చదువుకోకపోవడంతో, కువైటుకు వచ్చి స్వప్న పనిచేసే సెలూన్‌కు ఎదురుగా వున్న ఒక రెస్టారెంటులో పనిచేస్తున్నాడు. సిరియన్లు చాలా అందంగా వుంటారు. వారి రంగు, ఎత్తు కాక వారి మనస్సు కూడా మంచిదే రూపం కన్నా కూడా వారు ఎంతో మర్యాదస్తులు, మృదుస్వభావులు. ఎదుటివారిని ఎంతో గౌరవిస్తారు. అతని రూపం ఎంతో ఆకర్షణీయమైనది. రూపం కంటే మిన్నగా వున్న అతని వ్యక్తిత్వం, మంచి మనస్సు, స్నేహం, మర్యాదతో కూడిన మాటలు స్వప్నను ఎంతో ఆకట్టుకున్నాయి. రోజు రోజుకూ అతనికి దగ్గర చేస్తున్నాయి. అతను మంచివాడు తనని ఎంతో ఇష్టపడుతున్నాడు. మరి అతనితో స్నేహం చేస్తే తప్పేముంది? ఎడారి దేశంలో తన ఒంటరితనాన్ని మరచిపోయి సంతోషంగా కాలం గడపవచ్చు. ఇక్కడ మనిషికి కాస్త ఆనందం, తోడు, సాటిమనిషి స్నేహం, కాస్తంత రిలాక్సేషను లేకపోతే జీవితం ఈ ఎడారిలా నిస్సారంగా మారిపోతుంది కాబట్టి హసన్‌తో కలిసి అడుగు ముందుకు వేయడం సబబే అనుకుంది స్వప్న.

హసన్‌తో గాఢమైన ప్రేమలో పడిన స్వప్న తనను తాను మరిచిపోయింది. ముందు తాగుబోతు భర్తతో అనుభవించిన కష్టాలన్నీ మరచి అతనితో సంతోషంగా కొద్దికాలం గడిపింది. ఇద్దరూ పెళ్ళి చేసుకోవాలని, కలిసి ఒకేచోట, నివశించాలని నిశ్చయించుకున్నారు. ఈ కువైటు దేశంలో ఆడ, మగ పెళ్ళికాకుండా కలిసి జీవించడం తప్పు. పోలీసులు ప్లాట్లపై, ఇళ్ళపై రెయిడ్ చేసి పట్టుకుంటే చాలా ప్రమాదం. శిక్ష చాలా కఠినంగా వుంటుంది.

హసన్ ముస్లిం కాబట్టి, కువైటు ఇస్లాం మతాన్ని ఆ సంప్రదాయాల్ని పాటించే దేశం కాబట్టి వాళ్ళు పెళ్ళి కోసం కువైటు కోర్టును ఆశ్రయించారు. అక్కడ ముందుగా స్వప్నను ''ముస్లిం మతంలోకి మారడానికి నీకు సమ్మతమేనా?'' అని ముల్లా (ముస్లిం మతపెద్ద) అడిగారు. అప్పటికే హసన్‌తో జీవితాన్ని గడపాలని నిశ్చయించుకున్నందువల్ల మతం మార్చుకోవడం పెద్దగా అభ్యంతరంగా అనిపించలేదు స్వప్నకి. అందువల్ల స్వప్న తన అంగీకారాన్ని మనఃస్ఫూర్తిగా వారికి తెలియజేసింది.

''అర్షదుల్లాహి ఇల్లల్లా...మహమ్మదు రసూలల్లా''

("అల్లా ఒక్కడే దేవుడు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు") ప్రవక్త మహమ్మదు అల్లా వారధిగా ఈ భూమిపైకి వచ్చాడు. ఆయన ప్రకటించిన ఇస్లాం మత సిద్ధాంతాల్ని పాటించాలని నిశ్చయించుకుని మనస్ఫూర్తిగా ఇస్లాం మతాన్ని స్వీకరిస్తున్నాను. అని ఆమె ప్రమాణం చేసి ముస్లింగా మారిపోయింది. ఆమె పేరు శారాగా అక్కడ వారు మార్చారు. ఆ తరువాత వారు హసన్‌కు ఆమెకు వివాహ అగ్రిమెంటు పేపర్లు సిద్ధం చేసారు. ఆ పత్రాలపై వారిరిరువురూ సంతకాలు చేసేముందు, అక్కడి ముల్లా స్వప్నను వుద్దేశించి "నీ కోరిక ఏమిటి? భవిష్యత్తులో ఒకవేళ నువు నీ భర్తతో విడిపోవాల్సివస్తే నీ భర్తనుండి నువు ఆశించే భరణం ఏమైనా వుందా? " అని అడిగారు. ముల్లా మాటలకు బదులుగా స్వప్న "ఏమీ వద్దు హసన్ నన్ను జీవితాంతం విడువకుండా ప్రేమగా చూసుకుంటే చాలు" అని ముల్లాతో ఆమె చెప్పింది. ఆమె అంగీకారంతో పెళ్ళి జరిగిపోయింది.

స్వప్నతోపాటు ప్రక్కనే కూర్చుని వున్న మరో పెళ్ళికూతురు. రెండువేల కువైటీ దినార్లను భరణంగా పెళ్ళి పత్రంలో అడిగి మరీ రాయించుకుంది. స్వప్న వైపు ఆమె నువు పిచ్చిదానివా అన్నట్లు చూసి "అలా భరణం క్రింద కొంత మొత్తం రాయించుకోకపోతే రేపు అతడు నిన్ను వదిలేసి ముఖ్యంగా విడాకులు సులభంగా ఇచ్చేసి వేరేదాన్ని పెళ్ళి చేసుకుంటే ఏం చేస్తావు? లేదా నీ మోజు తీరాక భరణం చెల్లించాల్సిన అవసరం లేదు కాబట్టి ఎపుడైనా వదిలించుకోగలడు. అలాకాకుండా నువు రెండు వేల దినార్లు వివాహపత్రంలో రాయించుకుంటే అతను విడాకులు ఇవ్వకుండా చచ్చినట్లు నీతో జీవితాంతం కాపురం చేస్తాడు. భయంగా నీతో కలిసి వుంటారు" అంది సలహా ఇస్తున్నట్లు.

ఆమె మాటలకు స్వప్న బదులు చెప్పకుండా చిరునవ్వు నవ్వింది.

పెళ్ళికి, బంధాలకు ప్రేమ ముఖ్యం కానీ డబ్బు కాదని, ఆమె మనసులో అనుకుంది. అదే ఆమె నమ్ముతుంది కూడా.

అరబ్బు దేశాల్లోని అబ్బాయిలు పెళ్ళి చేసుకోబోయే అమ్మాయిలకు విలువ, గౌరవం ఇవ్వాలి. అబ్బాయిలు అమ్మాయిలకు కన్యాశుల్కం చెల్లించి, భరణం క్రింద కొంత మొత్తం రాసిచ్చి, నగలూ నట్రా చేయించాలి. ఇంకా పెళ్ళికి ముందే ఇల్లు, కారులాంటి ఆస్తులు కొన్ని అయినా సంపాదించి సమకూర్చుకుని వుండాలి. పెళ్ళి కూతురుకి కావల్సిన సకల సదుపాయాలు అమర్చి, ఆమెకు పెళ్ళి బహుమతులు ఇచ్చి పెళ్ళిచేసుకోవడం అబ్బాయికి తప్పనిసరి. బాగా డబ్బు వున్న షేకులు అయితే ఇస్లాం మత సిద్ధాంతం ప్రకారం నలుగురు భార్యల్ని కూడా కలిగి వుంటారు. కానీ వారందరికీ అన్నీ సమకూర్చి పెట్టి, అందరినీ సమానంగా చూసుకోవాలి అనే కండిషను వారికి వుంటుంది. దానిని వారు పాటించాలి.

ఒక సంవత్సరం రోజులు అలా గడిచాక సిరియాలో వున్న తన అమ్మా నాన్నలకు ఈ విషయాన్ని మెల్లగా చెప్పాడు హసన్. ఇండియా అమ్మాయిని అందులో ఇద్దరు పిల్లల తల్లిని చేసుకున్నందుకు వారు అభ్యంతరం తెలిపారు. తమ మాట విని కువైటు నుండి తిరిగి సిరియా వచ్చేసి పిన్ని కూతుర్ని పెళ్ళి చేసుకుని సంతోషంగా జీవితం గడపాలని కన్నీళ్ళు పెట్టుకుని మరీ అర్థించారు. స్వప్నను హసన్ చేసుకోవడం వారికి ఎంతమాత్రమూ ఇష్టం లేకుండా పోయింది. అలా తల్లిదండ్రుల మనసును కష్టపెట్టినందుకు హసన్ కుమిలిపోయాడు. ఇంట్లో ఆఖరివాడిగా పుట్టినందుకు ఎంత అల్లారు ముద్దుగా పెంచారో గుర్తుచేసుకుని చాలా బాధపడ్డాడు.

ఇక్కడ స్వప్న కువైటులో మరో పెళ్ళిచేసుకున్న విషయం ఆనోటా, ఈనోటా పడి ఇండియాలోని అన్నా వదినలకు కూడా చేరిపోయింది. ఒకరోజు వాళ్ళు ఇండియానుండి ఫోను చేసి "ఇద్దరు పిల్లల్ని ఇంటిదగ్గర వుంచి కువైటు వెళ్ళి అక్కడ పని శ్రద్ధగా చేసుకుని డబ్బు సంపాదించుకోకుండా అక్కడ మరో పెళ్ళి చేసుకుంటావా? నీకు బుద్ధిలేదా? అక్కడ మగవాడు లేకుండా ఒక్కదానివే

వుండలేవా? సిరియా వాడిని చేసుకుని ఏం చేయాలి అనుకుంటున్నావు. ఇక్కడ బిడ్డల పరిస్థితి ఏమిటి?'' అని వారి ధోరణిలో వారు చడామడా తిట్టేసారు.

పెళ్ళి చేసుకుని అక్కడే స్థిరపడిపోయి తమకు, పిల్లల ఖర్చులకు డబ్బు పంపించకుండా మానేస్తుందేమో అని వారి బాధ. చిన్నగా పిల్లలకు కూడా వారికి అర్థమయే విధంగా ఈ విషయాన్ని చెప్పి ఫోను చేసి పిల్లలతో కూడా స్వప్నను అడిగించారు. పెద్దవాడు ఫోను అందుకుని "అమ్మా నువు అక్కడ సిరియోళ్ణి పెళ్ళి చేసుకున్నావా? ఇక మా కోసం ఇంటికి రావా? నువు అక్కడే వుండిపోతే ఇక మాకు అమ్మ ఎలాగ?'' అంటూ ఏడ్చేసాడు. వాడి ఏడుపుతో మాటలతో స్వప్న తల్లి హృదయం తల్లడిల్లిపోయింది. ఏం చేయాలో ఆమెకు అర్థం కాలేదు. పనిచేసుకుంటూ హాయిగా వుండకుండా ఎందుకు హసను పెళ్ళి చేసుకున్నానా? ఇలా అందరినీ కష్టపెట్టాను కదా అనుకుంటూ ఆమె కృంగిపోయింది. ఇన్ని ఇబ్బందులు అందరి ద్వారా ఇలా ఎదురవుతాయని అపుడు ఇద్దరూ కూడా అసలు వూహించలేదు. ఒకరంటే మరొకరికి ఇష్టం కలిగింది, పెళ్ళి చేసుకుని ఒకటిగా కలిసి జీవించడం ముఖ్యం అనుకున్నారు కానీ అన్ని వైపుల నుండీ ఇంత వత్తిడి ఎదురయి బాధను కలిగిస్తుంది అనుకోలేదు వాళ్ళు.

అలాగని ఇప్పుడు ఒకర్ని విడిచి మరొకరు దూరంగా వుండలేకపోతున్నారు. ఈ సంవత్సరకాలంలో బంధం పటిష్టమై విడదీయలేనంత గట్టిగా పెనవేసుకుపోయింది. అడకత్తెరలో చిక్కిన పోక చెక్కల్లా ఇద్దరూ సమస్యలతో సతమతమవుతూ వుండగానే స్వప్న గర్భవతి అయింది. ఆ వార్త విన్న హసన్ మాత్రం సంతోషించాడు. తనకు కూడా ఇద్దరు పిల్లలు పుడితే వారి ముఖాలు చూస్తే తన అమ్మా నాన్నల హృదయాలు కరుగుతాయని మనుమణ్ణి అక్కున నేర్చుకుని అన్నీ మరచిపోతారని అతడు భావించాడు. కానీ స్వప్నకు మాత్రం బిడ్డకు జన్మనివ్వడానికి ధైర్యం సరిపోవడం లేదు. బిడ్డను కని చంకలో పెట్టుకుని ఇండియాకు తిరిగి వెళ్ళగలదా? అక్కడ అన్నా వదినలకు తనకోసం ఆత్రుతగా ఎదురు చూసే కన్నబిడ్డలకు ముఖం చూపించగలదా? ఇంట్లో వాళ్ళకి ఏదో ఒక విధంగా సర్దిచెప్పవచ్చు. కానీ ఇరుగూ పొరుగు వారికి, వూళ్ళోని జనాలకి ఏం చెప్పాలి? వారందరూ ఎంతగా ఆడిపోసుకుంటారో? ఈ సంగతి తెలిసిన వాళ్ళందరూ ఎంతగా నవ్వుకుని హేళన చేస్తారో! వూర్లో కొంచెమైనా పరువు మిగులుతుందా?

ఎపుడు ఇంటికి వస్తున్నావు అని అడిగే పిల్లలకి ఏమి జవాబు చెప్పాలో అర్థం కావడం లేదు ఆమెకి.

వళ్ళంతా కళ్ళు చేసుకుని ఈ అమ్మకోసం ఎదురు చూసే పిల్లలని ఎంతకాలం అబద్ధంతో మభ్యపెట్టగలదు? దేవుడా ఏదీ మార్గం? ఎందుకిలా చిక్కుకు పోయాను? అనుకుంటూ తనలో తాను మధనపడసాగింది స్వప్న.

ఎవరో ఒకరి ద్వారా విషయం తెలుసుకున్న లోకులు అప్పటికే కాకులై స్వప్నను ఆడిపోసుకోవడం ప్రారంభించారు. కువైటులో ఆమెకు తెలిసిన వారు వూరివారు, బంధువులు చాలామంది వున్నారు. వారికి విషయం తెలుసుకోవడం పెద్దపనికాదు. స్వప్న కువైటులో కన్నూ మిన్నూ కానకుండా ఎవరో సిరియా వాడ్ని చేసుకుని తిరుగుతోందని వాడితో సుఖంగా సంతోషంగా కాలం గడుపుతూ ఇంటి దగ్గర కడుపున పుట్టిన బిడ్డల్ని మరిచిపోయిందనీ అక్కడ వాడితో కడుపు తెచ్చుకుని తిరుగుతోందనీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుకుని ఆనందించసాగారు. కానీ వారికేం తెలుసు? బంధాల్లో చిక్కుకున్న మనుషులు సాలెగూడులో చిక్కుకున్న ఈగల్లా సమస్యల్లో ఎలా ఇరుక్కుపోతారో ఎంతగా బాధలు పడతారో. లోకులు కాకులు అన్నమాట నిజమే మరి. ఎదుటివారి తప్పుల్ని ఎంచడానికి వాళ్ళ నోళ్ళు చాలా పెద్దవి అవుతాయి.

పుండు మీద కారం చల్లినట్లుగా అందరూ అనుకునే ఇలాంటి మాటలు స్వప్న చెవినబడ్డాయి. అవి విన్న ఆమె చాలా క్రుంగిపోయింది. స్త్రీ మనస్సు, జీవితం చాలా సున్నితమైనవి. ఏ చిన్నపొరపాటు జరిగినా, మగవాడికన్నా ఎక్కువగా స్త్రీ జీవితం పైనే అది

ప్రభావం చూపుతుంది. సమాజం కూడా ఎదుటివారి సమస్యలను అర్థం చేసుకోకుండా సూటిపోటి మాటలతో ఆమెను హింసించి ఆనందిస్తుంది.

నెలలు నిండేసరికి భారమైన శరీరంతో ఆ సెలూన్‌లో పనిచేయలేకపోయింది స్వప్న. 8వ నెలవరకూ పనిచేసి 9వ నెలరాగానే అక్కడ పని మానేసింది. అక్కడి ఫ్రెండ్స్ జుల్కా, రాజీ, క్రిష్టీ స్వప్న పని మానేస్తున్నందుకు చాలా బాధపడ్డారు. ఇపుడు స్వప్నకు స్వంత సంపాదన లేకుండా పోయింది. ఇపుడు అన్నింటికీ హసన్ పైనే ఆమె ఆధారపడాల్సి వచ్చింది. ఇంటిదగ్గర పిల్లలకి, స్కూలు ఫీజులకి, తిండి ఖర్చులకు నెలనెలా తప్పని సరిగా డబ్బు పంపించాల్సిన పరిస్థితి. ఒకనెల పంపించకపోయినా అన్నా వదినల మాటల పోరు ఆమె భరించలేదు. ఆ సంగతి ఆమెకు తెలుసు. ఇన్ని ఆలోచనలతోను, సమస్యలతోను సతమతమయిన ఆమె ఆరోగ్యం బాగా దిగజారింది. మానసిక వేదనతో ఆమె బాగా కృశించిపోయింది. హసన్‌పైకి చెప్పడం లేదుగానీ అతడికి కూడా మనసులో అంతర్మధనం మొదలయ్యింది. పుట్టేబిడ్డ భవిష్యత్తు ఏమవుతుందో అన్న భయం వారికి కలిగింది. స్వప్న ఆరోగ్య పరిస్థితి దిగజారి కానుపు కష్టమయి, ఆపరేషను చేసి పిల్లవాడిని బయటికి తీసారు ఆసుపత్రిలోని డాక్టర్లు. తోడుగా వుండి, సహాయం చేసేందుకు ఎవరూ లేకపోవడంతో, సెలూన్ నుండి, జుల్కా, క్రిష్టీ, రాజీ తలా ఒకరోజు వీలుచూసుకుని వచ్చి స్వప్నకు తోడుగా వుండి ధైర్యం చెప్పారు. పరాయి దేశంలో దేశం, భాష, కులం, మతం అంటూ వుండవు. ఎవరు ఆదుకుంటే వారే మనవారు. వారే కావలసిన వారు. ఇండియన్ అమ్మకు, సిరియన్ నాన్నకు పుట్టిన ఆ పిల్లవాడు చందమామలా అందంగా వున్నాడు. పిల్లవాడిని చూసి, వాడి ముద్దుమోము చూసినపుడు వాళ్ళిద్దరూ తాత్కాలికంగా కొద్దిరోజులు తమ సమస్యలను మర్చిపోయారు.

హసన్ జీతంతోనే ఇక్కడి ఖర్చులు, ఇండియాలోని పిల్లలకి డబ్బులు పంపాల్సి రావడంతో ఇల్లు గడవడం కష్టమయిపోయింది. అందువల్ల కనీసం మూడునెలలు కూడా రెస్ట్ తీసుకోకుండానే స్వప్న మరలా సెలూన్‌లో పనికి చేరిపోయింది. ఇపుడు పిల్లవాడిని ఆమె బేబీ కేర్ సెంటర్‌కు అప్పగించాల్సి వచ్చింది.

అలాగే స్వప్నకూడా కువైటు వచ్చి దాదాపు నాలుగేళ్ళ కాలం గడిచిపోయింది. ఇద్దరి పిల్లల ముఖాలు కళ్ళముందు మెదులుతున్నాయి. ఎపుడెపుడు ఇంటికి వెళ్ళి పిల్లలని చూద్దామా అని ఆ తల్లి హృదయం తల్లడిల్లుతోంది. కానీ అనుకూలించని పరిస్థితులతో ఆమె ఎంతో కలవరపడుతోంది. ఈ పిల్లవాడిని హసన్ దగ్గర వదిలిపెట్టి కనీసం పదిరోజులు ఇండియా వెళ్ళి వద్దాం అనుకున్నా కూడా అది సాధ్యం అయేపనికాదు. తల్లిని వదిలి ఒక్కరోజు కూడా వుండలేని చంటిపిల్లవాడు. అలాగే ఇండియా వెళ్ళిరావడానికి కావలసిన డబ్బు కూడా వారివద్దలేదు. మరి ఇంకెంత కాలమో ఇలా? ఎప్పటికో? ఏమవుతుందో భవిష్యత్తు? అర్థంకాని అయోమయంలో పడి కొట్టుకులాడింది స్వప్న.

ఇన్ని సమస్యలు ఎదురువుతాయి అని వూహించి వుంటే వారు కువైటులో పెళ్ళి చేసుకోవడానికి, పిల్లల్ని కనడానికి సాహసించి వుండేవారు కాదేమో.

ఆ సమయంలోనే పులిమీద పుట్రలా సిరియాలో అంతర్యుద్ధం మొదలయ్యింది. హసన్ ఈ మధ్యకాలంలో దాదాపు మూడేళ్ళుగా ఇంటికి వెళ్ళి అతడి అమ్మానాన్నలను చూడలేదు.

ఇప్పుడు సిరియాలో చెలరేగిన కల్లోలం, మారణహోమం అక్కడి పరిస్థితుల్ని మార్చేసింది. హసన్ అమ్మానాన్నలు కూడా, ఇల్లు, భూములు ఆస్తులు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఏదో కాంప్‌లో తలదాచుకుంటున్నారనీ ప్రాణాలు చేతిలో పట్టుకుని కాలం గడుపుతున్నారనీ తెలిసింది.

అక్కడ తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్టలు, కనీస అవసరాలు తీరే అవకాశంలేక ప్రజలంతా అన్నీ విడిచి పరాయిదేశాలకు పయనమయ్యారు. అయినవారిని కోల్పోయిన వారు దుఃఖంతో ఎలుగెత్తి రోదించారు.

తుపాకి మోతలతో, బాంబుల దాడులతో సిరియా దేశం అల్లకల్లోలమైంది. స్త్రీలని లేదు, చిన్నపిల్లలని లేదు. అమాయకులని చూడలేదు. కరకు తుపాకులకు, కఠినమైన బాంబులకు కళ్ళు, హృదయం వుండవు కదా? వాటికి మానవాళిని నాశనం చేయాలనే ద్వేషం తప్ప మనుషులపై ప్రేమంటూ వుండదు కదా! అయ్యో అక్కడ ముక్కుపచ్చలారని పసిబిడ్డలు గాయాలపాలై భయంతో రోదిస్తుంటే చూసే ప్రతివారి హృదయం కరిగి నీరవుతోంది. మానవత్వం నశించిన ఆ చోట రక్తం, కన్నీరు ఏరులైపారుతోంది.

మానవత్వమా నీ జాడ ఏదీ? మృగం కంటే కూడా నీచస్థితికి నీ మానసిక స్థితి దిగజారిపోయింది కదా. వార్తలన్నీ విని టీవీలో చూసిన హసన్ ఎంతో టెన్షన్‌కు, భయానికి గురయ్యాడు. వెంటనే తల్లి తండ్రులకు ఫోను చేసాడు. కానీ అప్పటికే ఫోన్లు పనిచేయడం లేదు. అక్కడ వారి పరిస్థితి దయనీయంగా వుందని దిక్కుతోచని స్థితిలో చిక్కుకుని తల్లిదండ్రులు విలవిలలాడుతున్నారని హసన్‌కు అర్థంకాగానే ఒక్క క్షణం కూడా స్థిమితంగా వుండలేకపోయాడు. అంతవరకూ బాగా సర్వసౌకర్యాలతో హాయిగా వున్న కుటుంబం ఒక్కసారిగా సర్వస్వం కోల్పోవడంతో వారి పరిస్థితి అక్కడ ఎలా వుంటుందో అతడు వూహించగలిగాడు.

బాబును జాగ్రత్తగా చుసుకోమని స్వప్నకు చెప్పి, హడావిడిగా రెండు జతల బట్టలు బ్యాగులో సర్దుకుని వున్న డబ్బులు చేతపట్టుకుని తల్లిదండ్రులను చూసి పదిరోజుల్లో తిరిగి వస్తానని అతడు బయలుదేరాడు. అక్కడి పరిస్థితిని చక్కబరిచి తల్లిదండ్రులకు ఓదార్పు నిచ్చి ఈ సమయంలో పదిరోజులు దగ్గర వుండటం తన బాధ్యతగా హసన్ భావించాడు.

అదే అతడు చేసిన పొరపాటు. అప్పటికి సిరియాకు వెళ్ళి వచ్చే విమానాల రాకపోకలు ఆగిపోయి వున్నాయి. వెళ్ళే మార్గం ఎలగా అని అందరినీ కనుక్కొని ఏదో షిప్పు వెళుతుంటే అందులో సిరియా బయలుదేరాడు హసన్.

స్వప్నకు మనసులో తెలియని భయం, దిగులు కమ్ముకున్నాయి. ఇక్కడ పరాయిదేశంలో చంటి బిడ్డతో ఒంటరిగా హసన్ లేకుండా పదిరోజులు గడపడం కూడా అసాధ్యం అని ఆమెకు అనిపించింది కానీ అతడు వెళ్ళడం తప్పనిసరి అని తెలుసు. జీవితాన్ని ఒక్కసారి పోరాటానికి అప్పగించాక ఇక వెనుతిరిగే అవకాశమే లేదు. వెనుకడుగు వేసే ఆస్కారం ఎక్కడా లేదు. అన్ని మార్గాలు మూసుకుని పోయాయి. మనసులో భయపడుతూనే హసన్‌కు వీడ్కోలు పలికింది స్వప్న. కానీ అదే ఆఖరి చూపు అవుతుందని ఆమెకు తెలియలేదు. అలాంటిది ఏదైనా ఆమె వూహించి వుంటే హసన్‌ను వెళ్ళనివ్వకుండా అడ్డుకునేది. కానీ అతడి తల్లిదండ్రులు అక్కడ అసహాయ స్థితిలో, దిక్కుతోచక అల్లాడుతుంటే కొడుకుగా అతడు వెళ్ళివారిని చూడటం అతడి బాధ్యతగా ఆమె భావించింది.

వారం రోజులు గడిచాయి. ఎక్కడో అతికష్టం మీద దొరికిన ఫోనులైనుతో హసన్ ఫోను చేసాడు. ఒకే ఒక్క నిముషం మాట్లాడాడు. అక్కడి పరిస్థితి చాలా భీభత్సంగా వుందని తాము వున్న ప్రదేశం కూడా బాంబులతో దద్దరిల్లుతోందని ఇప్పట్లో ఇక్కడినుండి తిరిగి వచ్చే మార్గం కూడా ఏదీ కనబడటం లేదు కాబట్టి కొద్దిరోజులు తల్లిదండ్రులకు రక్షణగా వుండాలనుకుంటున్నాననీ ఆమెను జాగ్రత్తగా వుండమని చెప్పి ఫోను పెట్టేసాడు. ఆమెకు అవతలనుండి అతడు చెప్పింది వినడమే తప్ప ఒక్కమాట కూడా మాట్లాడే అవకాశం లేకుండా పోయింది.

అతడు లేకుండా ఇంకెన్ని రోజులు గడపాలో ఎలా గడపాలో అర్థంకాక ఆమె నీరసించిపోయింది. జీవితం ఇన్ని ఆటుపోట్లకు గురవుతుందనుకోలేదు. అప్పటికీ పిల్లవాడికి కూడా కాస్త ఊహ రావడంతో బాబా.. బాబా అని పిలుస్తూ తండ్రి కోసం ఇల్లంతా వెతుకుతున్నాడు వాడు. వాడిని చూస్తుంటే స్వప్నకు దుఃఖం ఆగడంలేదు.

అక్కడ జరిగే మారణహోమం, మనుషుల ఆక్రందనలు ఆమె టి.విలో చూస్తూనే వుంది. అందరినీ అడిగి తెలుసుకుంటూ వుంది. రోజులు అలా గడిచిపోతున్నాయి. రోజులే కాదు ఆరునెలలు అలాగే నిర్దయగా ముందుకు సాగిపోయాయి. ఆ తరువాత హసన్ నుండి ఆమెకు ఫోన్ కాల్ కానీ ఏ సమాచారం కానీ రాలేదు. హృదయం విలవిలలాడుతోంది.

సెలూన్‌లో పనిచేయడం, పిల్లవాడిని చూసుకోవడం, ఇంటిఖర్చులు, బాడుగ అన్నీ తానొక్కతే భరించడం అసాధ్యమైపోతోంది ఆమెకి. కడుపు నిండా తిండి తినాలన్నా భయంగా వుంది. రోజు రోజుకూ పరిస్థితి దిగజారుతోంది. హసన్ నుండి ఏ వార్తా అందలేదు. ఇంతకీ క్షేమంగా వున్నాడా? ఆ ఆలోచనకే ఆమె ప్రాణం తల్లడిల్లిపోయింది. పిల్లవాడి కోసం ప్రాణాల్ని నిలుపుకోవడం కర్తవ్యంగా ఆమె భావించింది. ఒక జీవచ్ఛవంలా మారిపోయి హసన్ రాక కోసం ఎదురుచూస్తూ, పిల్లవాడిని చూసుకుంటూ కువైట్‌లో కాలం గడపసాగింది. ఇంకో ఆరునెలలు చూసి హసన్ తిరిగి రాకపోతే పిల్లవాడిని తీసుకుని ఇండియాకు వెళ్ళిపోవాలని స్వప్న నిర్ణయించుకుంది. అక్కడ పరిస్థితులతో ఏ విధంగా పోరాడాలో ఎలా జీవించాలో మరి కాలమే నిర్ణయించాలి. కొన్ని జీవితాల్ని కాలానికే అప్పగించాలి తప్పదు మరి.

## రత్నమ్మ కథ

**1991 ఫిబ్రవరి నెల.** ఇరాక్ దురాక్రమణ. కువైటు దేశమంతా యుద్ధం చేసిన భీభత్సంతో, ప్రాణభయంతో, గాయాలతో, బాధతో విలపిస్తోంది. తుపాకి మోతలతో, బాంబుల దాడులతో భయంకరమైన శబ్దాలతో దద్దరిల్లిపోతోంది.

కువైటు ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీసారు. కరెంటు సప్లై నిలిచిపోవడంతో దేశమంతా గాఢాంధకారం అలముకుంది. కువైటు కరెన్సీ నోట్లు విలువ పడిపోవడంతో అవి చిత్తుకాగితాల్లా మారిపోయాయి. ఆహారం దొరకడం కష్టమయిపోయింది. నీటి వసతి కరువైపోయింది. కనీస అవసరాలు తీరక జనం కలవరపడ్డారు. ఇరాక్ సైనికులు పెట్రోల్ బావుల్ని తగలబెట్టడంతో ఆకాశమంతా దట్టమైన పొగ ఆవరించుకుంది. ప్రాణాలు కోల్పోయిన ఆప్తులకోసం, కనిపించని కుటుంబాల కోసం, ఇరాకీయులకు పట్టుబడిన తనవారి కోసం, ప్రాణాలతో మిగిలిన వారు గుండెలు బాదుకుని రోదిస్తున్నారు. కొంతమంది కర్కోటకుడైన సద్దాంను తిడుతూ శాపనార్థాలు పెడుతున్నారు.

భయం, బాధ, ఆవేదన ప్రతి హృదయంలో గూడుకట్టుకున్నాయి.

ఇంట్లో వున్న పది రొట్టెల్ని పేపర్‌లో మడిచి ఒక పొట్లంగా కట్టి కాసిన్ని కీరా, టమాటా ముక్కలు తరిగి ఒక ప్లాస్టిక్ డబ్బాలో సర్దిపెట్టింది ఫాతిమా. వీటితోపాటు ఒక జామ్ బాటిల్, కాస్తంత ఛీజ్‌ను కూడా ఓ ప్రక్కన చేతిసంచిలో చేర్చి పెట్టి గట్టిగా ఊపిరి పీల్చుకుని బాధగా నిట్టూర్చింది ఆమె.

ఇంట్లో చివరికి మిగిలినవి ఇవి మాత్రమే.

రెండు రోజుల్నుండి మంచినీళ్ళు తాగి జీవిస్తోంది మామా ఫాతిమా. తన ఇద్దరు బిడ్డలకు ఒక్కో రొట్టెముక్కను పెట్టి వారం రోజులుగా వారిలో ప్రాణాల్ని నిలబెడుతోంది.

రాత్రింబవళ్ళు కన్నీటితో ప్రార్ధన చేసి ఆమె అలసిపోయింది. శరీరంలో శక్తి కరువైపోయింది. జీవితంపై ఆసక్తి చచ్చిపోయింది. ఇద్దరు పిల్లల కోసం ఆమె తన ప్రాణాల్ని నిలుపుకుంటూ జీవిస్తోంది. ఏదో ఆశ. కాలం కరుణించి మరలా మంచి రోజుల్ని ముంగిట నిలిపితే మునుపటి వైభవం కళ్ళతో చూడాలి అనేది ఆమె కోరిక. కానీ ఆమె ఆశలు గాలిలో పెట్టిన దీపంలా రెపరెపలాడుతున్నాయి. గత నాలుగునెలలుగా వారు ఒక భవంతిలోని సెల్లార్‌లో ఒక మూలగా వున్న స్టోర్ రూమ్‌లో తలదాచుకుంటున్నారు. అది కిటికీలు కూడా లేని అతి చిన్నగది. గాలి కూడా బయటనుండి చొరబడటానికి ఆస్కారం లేదు. చలికాలం కాబట్టి సరిపోయింది. లేదంటే ఎడారి వేడికి వారు పెనంలో వేయించే రొట్టెల్లా మాడి మసి అయి ప్రాణాలు వదిలేసేవాళ్ళు.

కరెంటు లేదు. తిండిలేదు. నీళ్ళు లేవు. కట్టుకోవడానికి బట్టలు కూడా లేవు. వున్న ఒక జత బట్టలతోనే నాలుగు నెలలనుండీ కాలం గడుపుతున్నారు. ఆ యింటి పనిమనిషి రత్నమ్మ ఒక చింకి చాపను ఎక్కడో వెతికి సంపాదించగా ఆ చాపపై బిడ్డలు ఇద్దర్నీ పడుకోబెట్టి కటిక నేలపై మామా ఫాతిమా, ఆ పనిమనిషి రత్నమ్మ పడుకుని కాసేపు కునుకు తీస్తున్నారు.

ఆ స్థితిలో దుర్భరమైన పరిస్థితిలో వారికి కంటికి కునుకు వస్తుందా? కడుపుకు తిండి సహిస్తుందా? అసాధ్యమే!! రొట్టెల్ని అమర్చిపెట్టిన సంచిని ప్రక్కన వుంచి ఆవేదన హృదయాన్ని ఆవరించగా కన్నీరు విడుస్తూ మోకాళ్ళపై కూలబడి "బిస్మిల్లా రహమాన్ రహీమ్" అంటూ ప్రార్ధన చేసింది మామా ఫాతిమా.

ప్రార్ధన ముగించి తలెత్తిన ఆమె ముఖం స్వేదంతో తడిసిపోయి వుంది. కళ్ళు పట్టరాని కోపాన్ని నింపుకుని ఎర్రజీరలతో నిండి అగ్నిజ్వాలలను కురిపిస్తున్నాయి. ఎవరిమీదో తెలియని కోపం, కసి. హృదయం నిండా ఆవేదన ఆక్రోశం కలగలిసి మనిషి తూలిపోతోంది. నిలువెల్లా వణికిపోతోంది.

"యా. అల్లా నువు ఎంత నిర్ధయుడివి. ఎందుకు మాకెంత కష్టం తెచ్చి పెట్టావు? మాకు కష్టం వచ్చినా మేము భరించగలము. కానీ ఏ పాపం ఎరుగని పసిబిడ్డల్ని ఎందుకు ఇలా శిక్షిస్తున్నావు? కడుపునిండా తిండిలేక అలమటించి పోతున్నారే? కటికనేల మీద నిద్రపట్టక విలపిస్తున్నారే? జ్వరంతో, జబ్బుతో శరీరం నీరసించి పోయి, శక్తిలేక, అల్లాడిపోతున్నారే?

చిన్నరూములో కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆస్కారం లేక, దుర్గంధ భరితమైపోయి వెలుతురులేక, గాలిలేక ముక్కులు మూసుకోవాలనిపిస్తోందే? ఎలా? ఇలా ఎన్నిరోజులు జీవించాలి? ఎపుడు దీనికి అంతం? ఈ దౌర్భాగ్యుల జీవితాలకు ముగింపు లేదా? నువు దేవాది దేవుడవు, సృష్టికర్తవు. మా జీవితాలను ఏ విధంగా నిర్ణయించావు? ఎందుకిలా పరీక్షిస్తున్నావు?

ఎన్ని రోజులు, ఎన్ని నెలలు ఇలా గడపగలం? కాలాన్ని బలవంతంగా వెనక్కి నెట్టగలం?" ప్రార్ధిస్తూ ఆలోచిస్తూ మోకాళ్ళపై నున్న ఫాతిమా అలాగే ప్రక్కకి తిరిగి జ్వరంతో మూలుగుతున్న కొడుకు అబ్దుల్లా నుదిటిపై తన చేతిని వేసి జ్వరతీవ్రతను గమనించడానికి ప్రయత్నించింది. సెగలు పొగలుగా కాలిపోతున్న చిన్ని అబ్దుల్లా శరీరం ఆ తల్లి హృదయాన్ని కలత పరిచింది. ఏం చేయాలో తోచనట్లు, అలాగే తన తలను నేలకు ఆనించి కళ్ళు మూసుకుంది మామా ఫాతిమా. ఆమెను, ఆమెలో కలిగే భావోద్వేగాల్ని, బాధను చూస్తున్న రత్నమ్మ భయపడింది. మూలన కూర్చుని వున్నదల్లా పైకి లేచి వచ్చి మామా ఫాతిమాను కంగారుగా కుదిపింది. స్పృహ తప్పిందేమో అనే అనుమానం కలిగింది రత్నకు.

ఫాతిమాలో కాసేపు చలనం లేకపోయేసరికి రత్నమ్మ భయపడిపోయింది. ఆమె ప్రాణం గాలిలో కలిసిపోయిందేమో అని ఆమె తల్లడిల్లిపోయింది. కానీ ఆశ్చర్యంగా పైకి లేచి కూర్చుంది మామా ఫాతిమా.

"రత్నా.. నువు కంగారు పడకు. ఇంకా నాలో ఊపిరి వుంది. ఇద్దరు బిడ్డల్ని ఇలాంటి పరిస్థితిలో విడిచి నా ప్రాణం పోదుగాక పోదు. నా భర్త. ఆ ఇరాకీ సైనికులను చంపుతుంటే ఈ కళ్ళతో చూడాలి. నా కోపం చల్లారాలి. ఒక్కో ఇరాకీ శరీరం ముక్కలు

ముక్కలుగా నరికి ఎడారిలో కాకులకు గద్దలకు ఆహారంగా పడవేయాలి. అపుడే నా హృదయానికి శాంతి" అంటూ పిడికిళ్ళు బిగించి నిప్పులు కక్కింది మామా ఫాతిమా.

మామా ఫాతిమాలో ఇంకా మిగిలివున్న శక్తిని, పట్టుదలను చూసి సంతోషించింది రత్నమ్మ.

1990 ఆగస్టు నెలలో కువైటు దేశాన్ని సద్దాం ఆక్రమించగా దాదాపు ఐదునెలలుగా వీళ్ళు గాలి చొరబడని ఆ చిన్నగదిలో లోపల గడియవేసుకుని ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని భయంగా కాలం గడుపుతున్నారు.

పట్టుపరుపులపై పవళించాల్సిన బిడ్డలు కటిక నేలపై జ్వరంతో దొర్లుతున్నారు. తిండి దొరకడం గగనం అయింది. కనీస అవసరాలు తీరని దుర్భర పరిస్థితి. మామా ఫాతిమా భర్త అలీ స్వతంత్రపోరాట యోధునిగా మారిపోయాడు. తనతోపాటు ఇంకా పదిమందిని కలుపుకున్నాడు. కత్తులు, కొన్ని తుపాకులు సంపాదించి ఒక పాడుబడిన ఇంట్లో తలదాచుకుంటూ కనిపించిన ఇరాకీ సైనికులపై దాడిచేసి వారి ప్రాణాలు తీయడమే తమ లక్ష్యంగా పెట్టుకున్నారు.

సిరిసంపదలతో తులతూగుతూ సంతోషంగా జీవించే కువైటు దేశం ఇపుడు తుచ్ఛులైన ఇరాకీయ కబంధ హస్తాలతో చిక్కుకుని విలవిలలాడుతుండగా అలీ హృదయం భగ్గున మండింది. ఇరాకీయుల దౌష్ట్యానికి, దుర్మార్గానికి అతడి రక్తం మరిగింది. సద్దాం ఎంత కఠిన హృదయుడో, ఇరాకీ సైనికులు ఎంత క్రూరులో అతనికి బాగా తెలుసు. అయినా కూడా ప్రాణానికి తెగించి, తనతోపాటు కొందరిని చేర్చుకుని ఖురైన్ అనే ఏరియాలో ఒక పాడుబడిన ఇంటిని స్థావరంగా మలుచుకుని ఇరాకీ సైనికులపై తిరుగుబాటు మొదలుపెట్టారు. ప్రాణాలకు తెగించి నిద్రాహారాలు మాని, కర్తవ్య దీక్షలో మునిగి వున్న భర్త అలీ గురించిన చింత ఎక్కువైంది మామా ఫాతిమాకు.

ఏ క్షణంలోనైనా సరే ఎలాంటి దుర్వార్త వినాల్సి వస్తుందో అని ఆమె భయపడుతోంది. ఇటు బిడ్డల ఆరోగ్యం క్షీణిస్తుంటే గుక్కెడు పాలైనా కాచి వారికి తాగించలేని దుస్థితికి ఆమె తల్లి హృదయం తల్లడిల్లుతోంది.

నాలుగునెలల క్రితమే ఇండియానుండి వచ్చిన పనివారందరూ సరిహద్దులను దాటి జోర్డాన్ చేరి అక్కడ భారత ప్రభుత్వం తమకోసం పంపించిన విమానాల్లో ఎక్కి చాలామంది తమ దేశానికి తిరిగి వెళ్ళిపోయారు. అలాగే కువైటులో వున్న పరదేశులందరూ కూడా తమకు తెలిసిన దారులగుండా ప్రాణాలు చేతపట్టుకుని పరుగెత్తి వెళ్ళిపోయారు.

ఆ సమయంలో మామా ఫాతిమా తన పనిమనిషి రత్నను పిలిచి "రత్నా మీ భారతదేశానికి జోర్డాను నుండీ విమానాలు సిద్ధం చేసారు. నువు ఏదో ఒక విధంగా జోర్డాను చేరుకుని అక్కడినుండి మీ దేశానికి వెళ్ళిపో. ఎందుకంటే ఇక్కడ మాతోపాటు వుంటే నీ ప్రాణానికి ముప్పు కలుగవచ్చు. నీకోసం నీవాళ్ళు, పిల్లలు ఎంతగానో ఎదురుచూస్తూ వుంటారు. నువు వెళ్ళకపోతే వాళ్ళు భయపడి దిగులు పడతారు. వారికి నీ క్షేమ సమాచారం తెలియజేయడానికి కనీసం ఫోను సౌకర్యం కూడా లేకుండా పోయింది. మాకు ఈ కష్టాలు తప్పవు. చావో, రేవో మేము తేల్చుకుంటాం. మాతోపాటు నువు ఇక్కడ తిండి, నీళ్ళు లేకుండా ఎన్నిరోజులు వుండగలవు? నువు తొందరగా బయలుదేరి ఎవరినో ఒకరిని తోడు కలుపుకుని ఈ దేశ సరిహద్దులు దాటి జోర్డాను చేరుకో" అని ప్రేమగా చెప్పింది.

రత్న తన మాటలు విని వెంటనే వెళ్ళిపోతుందని మామా ఫాతిమా భావించింది. కానీ రత్న అక్కడినుండి కదల్లేదు.

"(ఆన మాయి రూ) నేను వెళ్ళను మామా. మిమ్మల్ని ఈ పరిస్థితిలో వదిలిపెట్టి నేను ఎలా నా దేశం వెళ్ళగలను? వెళ్ళి అక్కడ సంతోషంగా ఎలా వుండగలను? ముఖ్యంగా చిన్న పిల్లవాడు అబ్దుల్లాను విడచి నేను ఎలా వుండగలను? పెంచిన ప్రేమతో నా హృదయం తల్లడిల్లిపోదా? నేను మిమ్మల్ని విడిచి వెళ్ళడం జరిగేపనికాదు. అది అసాధ్యం. దయచేసి నన్ను వెళ్ళమని చెప్పకండి. చావైనా, బ్రతుకైనా

మీతో పాటే. మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు వేసి మిమ్మల్ని కాపాడతాను. ముఖ్యంగా చిన్న అబ్దుల్లాను విడిచి నేను వుండలేను వీడిని కాపాడవల్సిన బాధ్యత నాకు వుంది" స్థిరంగా, నిశ్చయంగా చెప్పింది రత్న.

రత్నలోని ప్రేమకు, స్థిరనిశ్చయానికి, పట్టుదలకు, మామా ఫాతిమా ఆశ్చర్యపోయింది. ఎంతో గర్వపడింది. మిగతా కువైటు ఇళ్ళల్లో పనిచేసేవారు ఇంట్లోని విలువైన వస్తువులు, బంగారం లాంటివి దోచుకుని పరిగెత్తి తమ దేశాలకు పారిపోయినట్లుగా మామా ఫాతిమా విని వుంది. కానీ వారందరికంటే భిన్నంగా రత్న, తమకోసం తన ప్రాణాన్ని అడ్డుగా వేస్తా అనడంతో ఆనందంతో ఆమెకు నోటిమాట రాలేదు. సజల నయనాలతో కృతజ్ఞతగా రెండు చేతులు జోడించి రత్నకు నమస్కారం చేసింది ఆమె.

మనుషుల్లో ఇంకా మానవత్వం, మంచితనం, మిగిలే వున్నాయని రత్న రుజువు చేసింది.

తిరుగుబాటుదారులు కొందరు ఖురైన్ ప్రాంతంలో వున్నారని తెలియగానే ఇరాకీ సైనికులు, జల్లెడ వేసి, ప్రతి ఇంటినీ గాలిస్తున్నారు. మారణాయుధాలు కలిగిన ఆ ముష్కరుల ముందు కత్తులతో, నాటు తుపాకులతో ఎదురు నిలిచి వీరు ఏ మాత్రం పోరాడగలరు? అది అసంభవం. ప్రాణాలు కోల్పోవడం తథ్యం. ఇది తెలిసిన నిజం. అందుకే మామా ఫాతిమా చిన్న శబ్దం వినపడినా కూడా ఉలిక్కి పడుతోంది.

ఇపుడు భర్త అలీ కోసమే మిగిలిన పది రొట్టెల్ని సంచిలో సర్దిపెట్టింది ఫాతిమా. అయితే ఆ సంచిని ఎలా రెండు వీధుల అవతల వున్న ఆ యింటికి తీసికెళ్ళి అందించాలా అని ఆమె ఆలోచిస్తోంది. దారిలో ఏ ఒక్క ఇరాకీ సైనికుడి కంటపడినా ప్రాణం మీదేకాదు. తన శరీరం మీద కూడా ఆశ వదులుకోవాల్సిందే శరీరాన్ని వేధించి, ఆడుకుని హింసించే కామాంధులు వాళ్ళు. ఆ స్థితి ఎంతో దుర్భరం, ఊహించలేనిది. వారి కంటపడటం అంటే ప్రాణంతో చెలగాటం ఆడటమే. మరి ఎలా? ఆకలితో అలమటించే భర్తకు, తోటివారికి ఈ కొద్ది ఆహారాన్ని ఎలా అందించాలి? ఆమెకు ఏ మార్గమూ కనబడటంలేదు. ఆ యింటి గేటుదాటి రోడ్డుపైకి వెళ్ళిన మరుక్షణమే ఆమె వునికిని కనిపెట్టగలరు ఇరాకీ సైనికులు. ప్రతివీధికీ వారు కాపలా కాస్తున్నారు. కనిపించిన ప్రతిమనిషినీ నిలబెట్టి, అన్ని వివరాలు అడిగి, వారి దగ్గర వున్న ధనం, ఆహారం దోచుకుని పంపిస్తున్నారు. అలా కనిపించిన వారు కువైటీలు అయితే అంతే సంగతులు. ఇక ప్రాణం మీద ఆశ వదులుకోవాల్సిందే వారు పెట్టే చిత్రహింసలు భరించడానికి సిద్ధం కావాల్సిందే

మరి ఇపుడు ఎలా అక్కడికి వెళ్ళి ఈ రొట్టెల్ని అందించడం? ఆలోచనలో పడింది మామా ఫాతిమా. మెల్లగా రత్న పైకి లేచింది. ఆ సంచిని తన చేతిలోనికి తీసుకుంది. ప్రశ్నార్థకంగా రత్నవైపు చూసింది మామా ఫాతిమా. "మామా.. నేను వెళ్ళి ఈ ఆహారాన్ని బాబా అలీకి ఇచ్చి వస్తాను" చెప్పింది స్థిరంగా.

"వద్దు... వద్దు నిన్ను ఇబ్బందుల్లోకి నెట్టడం నాకిష్టంలేదు. ఇప్పటికే నీ దేశానికి వెళ్ళకుండా నువు మాతోపాటు వుండి అన్ని కష్టాలనూ అనుభవిస్తున్నావు. జీతం ఇవ్వలేకపోయినా కడుపుకు సరైన తిండికూడా నీకు పెట్టలేకపోతున్నాను. బాబా దేశాన్ని రక్షించుటకై తన కర్తవ్యంలో మునిగి మమ్మల్ని మరిచిపోయారు. ఈ కష్టసమయంలో మాకు తోడుగా నువు నిలిచి మాకెంతో సహాయం చేస్తున్నావు. నీ ఋణం ఏమిచ్చినా తీరదు. నువు లేకపోతే పిల్లలు నేనూ ఏమయిపోయి వుండేవాళ్ళమో? తలచుకుంటేనే భయంగా వుంది.

నిన్ను ఇంకా కష్టాల్లోకి నెట్టడం భావ్యం కాదు. నువు ఇక్కడే పిల్లలకు తోడుగా వుండు. ఏదో ఒక విధంగా నేనే అక్కడికి వెళ్ళి ఈ రొట్టెల్ని వారికి అందించి వస్తాను. వాళ్ళు ఆహారం లేక కృశించిపోయి వుంటారు. ఈ కొన్ని రొట్టెలు వారి ప్రాణాల్ని నిలబెట్టి కాస్త శక్తిని అందిస్తాయి" అంది మామా ఫాతిమా.

చిన్నగా నవ్వింది రత్న. " మామా మీ బాధ నేను అర్థం చేసుకోగలను. నేను భారతీయ స్త్రీని. నేను కనిపించినా ఇరాకీ సైనికులు ప్రాణహాని చేయరు. అదే మీరు కనుక కనిపిస్తే మిమ్మల్ని ఎంతో వేధించి ప్రాణం తీస్తారు. నేను ఏదో ఒకటి చెప్పి తప్పించుకుని తిరిగి రాగలను ఆ అవకాశం నాకు వుంది. కాబట్టి మీరు వెళ్ళాలి అన్నా తలంపు మానివేసి ఆ చేతి సంచిని ఇలా ఇవ్వండి" అంది రత్న.

ఇక మాట్లాడటానికి ఏమీలేక మౌనంగా సంచిని రత్న చేతికి అందించింది మామా ఫాతిమా.

సంధ్య చీకట్లు కువైటు పట్టణాన్ని ముసురుకుంటున్నాయి. రోజంతా వెలుగును పంచిన సూర్యుడు అలసిపోయినట్లు, తనకు కూడా విశ్రాంతి అవసరమే అంటూ పడమటి కొండల్లోకి జారుకుంటున్నాడు. ఆకాశమంతా అరుణిమను పులుముకుని ఏదో ప్రమాదాన్ని సూచిస్తోంది. మామాను తలుపు గడియ వేసుకోమని చెప్పి, సంచిని చేతిలో పదిలంగా పట్టుకుని ఆ గది తలుపు తెరుచుకుని మెల్లగా అడుగు బయటపెట్టింది రత్న. రోడ్డుపైకి వచ్చి అటూ ఇటూ చూసింది. ఆ రోడ్డు చివర ఇరాకీ సైనికులు కొందరు నిలబడి సిగరెట్లు తాగుతూ మాట్లాడుకుంటూ నవ్వుకుంటూ నిశితంగా పరిసరాల్ని గమనిస్తున్నారు. ఆడది కనిపిస్తే వారి కళ్ళలో తెలియని ఆనందం కనిపిస్తోంది. పరదేశులను ఏమీ అనడంలేదు కానీ కువైటు స్త్రీలు కనిపిస్తే, దొరికితే మాత్రం వారికి విందు భోజనం లభించినంత ఆనందం కలుగుతోంది.

ధాన్యమైతేనేమి, ధనమైతేనేమి, అది స్త్రీ దేహమైతేనేమి దోచుకోవడమే వారి కర్తవ్యంగా మారింది.

రత్నకు ఆ భయాలేమీలేవు. రత్నకు అరబిక్ భాష బాగానే వచ్చు. ఇరాకీ సైనికుల కంట పడితే ఏదో ఒక జవాబు చెప్పి తప్పించుకోగలను అనే ధీమా ఆమెలో వుంది. అందుకే రొట్టెల సంచిని రెండు చేతుల్తో జాగ్రత్తగా పట్టుకుని ఆ వీధిలో వడివడిగా ముందుకు నడుస్తోంది. వారి కంట పడకుండా ప్రక్క సందులోకి తప్పుకుని చాటుగా ఎవరికంటా పడకుండా వెళ్ళి బాబా అలీ వుంటున్న పాత ఇంటిని చేరుకోవడమే ఆమె లక్ష్యం. ఎడమవైపు మలుపు తిరిగి సందులోకి మరలిపోవడానికి ప్రక్కకి అడుగులేసింది. అంతలో చూడనే చూసాడు ఆ సైనికుల్లో ఒకడు.

"హేయ్ విను ఇంతె, హోగఫ్ (ఆగు) అక్కడే ఆగిపో" అంటూ గట్టిగా కేకలేసి పెద్ద అంగలు వేసుకుంటూ నడిచి దగ్గరకి వచ్చాడు. రత్న ఏమాత్రం భయపడలేదు. భయపడితే వాడికి ఇంకా అనుమానం పెరుగుతుందని ఆమెకు తెలుసు. అందుకే ఆగిపో అనగానే, అక్కడే ఆగి ఉన్నచోటే ధీమాగా నిలబడింది.

ఆమెను సమీపించిన ఆ సైనికుడు "వైనరూ ఇంతె సును హోదె (ఏయ్ ఎక్కడికి వెళుతున్నావు?) చేతిలో ఆ మూట ఏమిటి? " అని అడిగాడు క్రిందినుండి పైకి పరీక్షగా చూస్తూ.

ఆమె తొట్రిల్ల లేదు. కాస్త దీనంగా మొహం పెట్టి "అజ్జీ (అయ్యా) నా భర్త ఆ ప్రక్క వీధిలోని ఒక ఇంటిలో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. అతడికి ఆకలి వేస్తుంటుందని కొన్ని రొట్టెలు సంచిలో వుంచి తీసుకెళ్తున్నాను. ఇవి అందించి పదినిముషాల్లో మరలా ఇదే దారిన తిరిగి వస్తాను" చెప్పింది రత్న ధైర్యంగా.

"ఏదీ ఆ సంచిని చూపించు. నిజంగా అందులో రొట్టెలే వున్నాయా?" అడిగాడు అతడు ఒక్కడుగు ముందుకు వేసి ఆ సంచిలోకి తొంగి చూస్తూ.

"అవును అజ్జీ, చూడు. నేను నిజమే చెపుతున్నాను. ఇందులో రొట్టెలు కాస్త జామ్, ఛీజ్ వున్నాయి అంతే" అంది నమ్మకంగా రత్న.

సంచిని తెరిచి చూచి అందులో ఆమె చెప్పినట్లుగా రొట్టెలే వున్నాయని నిశ్చయించుకుని "సరే వెళ్ళు" అంటూ దారి వదిలాడు ఆ ఇరాకీ సైనికుడు.

బ్రతుకు జీవుడా అనుకుంటూ ప్రక్క సందులోకి తిరిగి వారిని ఏమార్చడానికి అక్కడనుండి మరో సందులోకి కూడా తిరిగి అక్కడనుండి తాను వెళ్ళాల్సిన ఇంటివైపు తన అడుగుల్ని వేసింది రత్న.

ఆ ఇల్లు సమీపించే కొలదీ ఆమె గుండె రెట్టింపు వేగంతో కొట్టుకుంది. అడుగులు తడబడుతున్నాయి. ఏదో భయం, వణుకు ఆమెను ఆవరించింది. ఎక్కడైనా, చుట్టుపక్కల ఇరాకీ సైనికులు వున్నారా? తనని చాటుగా వెంబడిస్తున్నారా అని చుట్టూ ఓసారి నిశితంగా పరిసరాల్ని పరిశీలించింది. ఎక్కడా ఏ అలికిడీ వినిపించలేదు. మనుషుల ఉనికి ఎక్కడా కనపడలేదు. తడబడే అడుగులతో ఆ పాత ఇంటిని సమీపించి మెడ ఎత్తులో వున్న ప్రహరీగోడను కష్టం మీద ఎక్కి అవతలకి దూకింది.

ఆ యిల్లు బాబా అలీకి స్నేహితుడైన యూసెఫ్‌ది. ముందు ఒకటి రెండుసార్లు మామా ఫాతిమాతో కలిసి రత్న అక్కడికి వచ్చి వుండటంతో ఆ యింటి స్వరూపం కాస్త అవగాహనకు వుంది. అంతకు ముందు, వైభవంతో, సంపదతో, కళకళలాడుతుండే ఆ యిల్లు ఇపుడు పాడుబడినట్లుగా కళావిహీనంగా వుంది. పరిసరాలన్నీ నిశ్శబ్దంగా వున్నాయి.

మెల్లగా వెనుక దారిగుండా వంట గదిలోకి ప్రవేశించి అక్కడి నుండి హాల్లోకి వచ్చింది రత్న.

అంతే.. అక్కడ దృశ్యం ఆమెను భయభ్రాంతురాలినిగా చేసింది. నోరు తెరిచి భయంతో గట్టిగా కేక వేయాలన్న తలంపును బలవంతంగా అణచుకుంది రత్న. హాలంతా పగిలిన వస్తువులతో చిందరవందరగా వుంది. ఆ వస్తువుల మధ్యలో చెల్లాచెదురుగా పడివున్న



ప్రాణంలేని దేహాలు వాటినుండి కాలువలుగా ప్రవహించిన రక్తం గడ్డకట్టి వుంది. నిర్ఘాంతపోయింది రత్న. కాసేపు చేష్టలుడిగి చలనం మరచి అలాగే నిలబడిపోయింది. వెంటనే ఆమెకు ఇంటివద్ద ఆశగా భర్తయైన అలీ క్షేమసమాచారం కోసం, తన కోసం ఎదురు చూసే మామా ఫాతిమా గుర్తొచ్చింది. కలవరపడిపోయింది. తిరిగి ఇంటికి వెళ్ళి మామా ఫాతిమాకు ఏమి జవాబు చెప్పాలి? ఏ విధంగా ఇక్కడి నుండి తిరిగి ఇల్లు చేరాలి? ఆలోచనలతో, ఆవేదనతో తల గిర్రున తిరుగుతున్నట్లయి, తూలిపడపోయింది. కళ్ళలో నీళ్ళు జలజలా రాలాయి. "అబ్బూ" (నాన్నా) అని కలవరించే ఇద్దరు చిన్నపిల్లలు కళ్ళముందు మెదిలారు. దుర్మార్గులైన ఇరాకీ సైనికులకు ఎదురు తిరిగి ప్రాణంతో భూమిపై జీవించడం కల్ల. ఆ విషయం ముందే బాబా అలీకి మామా ఫాతిమాకు కూడా తెలుసు. ఇలా జరుగుతుందని ముందే ఊహించి అనుక్షణం కలవరానికి, కలతకి లోనయ్యేది మామా ఫాతిమా. ఒకసారి తల విదిలించి ఆలోచనలను వదిలించుకుని చుట్టూ చూసింది రత్న. తుపాకి గుళ్ళకు గురయిన దేహాలన్నీ ఛిద్రమైపోయాయి. రక్తంతో తడిసి గుర్తుపట్టడం అసాధ్యంగా వుంది. కానీ వారిలో బాబా అలీ బాగా తెలుసు కాబట్టి గుర్తుపట్టడం సులభమే. ఇంకా అతడు ప్రాణంతో మిగిలి వుంటే సంతోషమే. ధైర్యం చేసి ముందుకు కదిలి, ప్రతి దేహాన్నీ పరిశీలించసాగింది రత్న. ఏ ఒక్కరిలోనూ చలనం కనిపించలేదు. శ్వాస ఆడటమూ లేదు. ప్రాణం పోయి చాలాసేపయినట్లుగా వుంది. ఒక చెక్క బీరువా క్రింద కనబడింది బాబా అలీ మృతదేహం.

చేతిలో నాటు తుపాకీ ఇంకా అలాగే వుంది. కళ్ళు పట్టుదలగా పైకి చూస్తున్నాయి. కానీ వాటిలో జీవం లేదు. ఒక్కసారి ముక్కువద్ద చెయ్యిపెట్టి శ్వాస ఆడుతుందో లేదో అని పరిశీలించింది రత్న.


ఊహూ.. శరీరంలో చలనం, వేడి వుందేమో అని చెయ్యి పట్టుకుని నాడి చూసింది. అక్కడ కూడా చలనం లేదు. అప్పటికే శరీరంలో వేడి చల్లారి, చల్లబడిపోయి వుంది బాబా అలీ దేహం. తనని పనిమనిషిలా కాకుండా స్వంత చెల్లెలిలా గౌరవంగా చూసుకున్న బాబా అలీ ఇకలేడు అన్న విషయం జీర్ణించుకోవడం ఆమెకు సాధ్యం కాలేదు. కన్నీరు ఆగలేదు.

మామా ఫాతిమాకు ఈ విషయం తెలిస్తే తట్టుకోగలదా? ఈ వార్త విన్న క్షణమే ఆమె గుండె ఆగిపోతుందేమో? ఎలా? చెప్పడమా? చెప్పకుండా దాచి పెట్టడమా? తేల్చుకోలేని సందిగ్ధంలో భారమైన హృదయంతో అక్కడనుండి బయలుదేరింది రత్న. ప్రహరీ గోడను దూకి వచ్చిన దారివెంటే అడుగులు వేసి ఇంటిదారి పట్టింది రత్న. ఆత్రుతగా తీసికెళ్ళిన రొట్టెల సంచి ఆమె చేతిలో అలాగే పదిలంగా వుంది. దాన్ని పొదవి పట్టుకుని ఇల్లు చేరింది. చీకట్లు ముసురుకున్నాయి. దారిలో ఏ సైనికులూ ఆమెకు ఎదురుపడలేదు.

ఎంతో ఆరాటంగా, రత్న కోసం ఎదురుచూస్తూ కాలుగాలిన పిల్లిలా ఆ చిన్నగదిలో అటూ ఇటూ తిరుగుతున్న మామా ఫాతిమా బయట తలుపు కొట్టిన శబ్దంతో పాటు, రత్న పిలుపు వినబడగానే తొందరగా తలుపు తీసింది.

విషాద వదనంతో, దుఃఖంతో వున్న రత్నను చూసి "ఏం జరిగింది? అక్కడ బాబా అలీ ఎలా వున్నాడు? అంతా క్షేమమే కదా? బాబా అలీ నా గురించి, పిల్లల గురించి ఏం మాట్లాడారు? ఏం చెప్పారు? రొట్టెలు తిన్నారా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది మామా ఫాతిమా.

మాటలు కరువయ్యాయి, కన్నీళ్ళు మిగిలాయి. ఆ సమయంలో. రత్న పరిస్థితి వివరింప శక్యం కానిది. మామా అడిగిన ప్రశ్నలకు బదులు చెప్పకుండా ఏ జవాబు చెప్పేశక్తిలేనట్లు చేతిలోని రొట్టెల సంచిని మామా ఫాతిమాకు అందించి రోదిస్తూ క్రింద కూలబడిపోయింది రత్న.




1991 ఫిబ్రవరిలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సంస్మరణార్ధం కువైటు గవర్నమెంటు... ఆ యింటిని అలాగే వుంచి "స్వతంత్ర పోరాట యోధుల స్మారక గృహంగా" మార్చింది. ఇప్పటికీ సందర్శకులు వచ్చి చూసి అలనాడు అశువులు బాసిన ఆ పోరాట యోధులను స్మరించి నమస్కరించి వారి త్యాగాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

## హసీనా కథ

**మునక్కాయలు, మామిడికాయలు,** గోంగూరలాంటి కూరగాయలు, చింతపండు, పల్లీలులాంటి సరుకులు కావాలంటే మేము మాలియా సిటీలో వున్న ఆంధ్రా బకాలా (అంగడి)కి వెళ్ళి కొనుక్కోవల్సిందే సూపర్ మార్కెట్‌లలోనూ అరబిక్ జమియాలలోనూ(అంగడి) ఇలాంటి మన సరుకులు దొరకవు.

నేను మాలియాకు వెళ్ళిన ప్రతిసారీ ఆంధ్రా బకాలా(అంగడి)కు వెళ్ళి కావలసిన కూరగాయలు కొనుక్కుని, అక్కడే అదే వీధిలో ఒక మూలగా వున్న శారీస్ షాపుకు కూడా వెళ్ళి నచ్చిన చీరలు, మ్యాచింగ్ శారీ ఫాల్స్‌లాంటివి కూడా ఒకేసారి తెచ్చుకుంటూ వుంటాను.

ఆ శారీస్ షాపులో పరిచయమయింది హసీనా అక్క.

వెళ్ళిన ప్రతిసారీ సంతోషంగా, ఆప్యాయంగా పలకరించి కబుర్లు చెపుతుంది. ఈ మధ్య కాలంలో మాలియా సిటీలో జరిగిన విషయాలు, వింత సంఘటనలను కథలుగా మలచి మాటల్లో వివరించి చెపుతూ వుంటుంది.

తన షాపులోని చీరలన్నింటినీ చూపించి, వాటి ప్రాముఖ్యతను అందంగా వివరించి, చెప్పి కనీసం అయిదారు చీరలన్నా నాతో కొనిపించేది. నీకు కాబట్టి పది దినార్లు డిస్కౌంటు ఇచ్చాను. మరొకరికైతే ఇంకా ఎక్కువ రేటుకే అమ్మేస్తాను అనేది నవ్వుతూ - 'నిజమే' అనుకునేదాన్ని నేను. కష్టమర్లతో ఎంత బిజీగా వున్నా సరే నేను వెళితే చాలు తన పనిని ప్రక్కన పెట్టి, మరో సేల్స్‌గర్ల్‌కి అప్పగించేసి నాతో మనస్ఫూర్తిగా మాట్లాడేది. మంచి కళకలిగిన మొహం హసీనాది. నవ్వినప్పుడు సొట్టలు పడే బుగ్గలు అందంగా వుండి కళ్ళను ఆకర్షించేవి.

కష్టమర్లతో తగిన విధంగా నవ్వుతూ కలుపుగోలుగా మాట్లాడటం వలన తన షాపుకు మరలా వాళ్ళు తిరిగి వచ్చే విధంగా ఆకట్టుకునేది ఆమె మాట తీరు. ఎంతో చాకచక్యంగా, మెళుకువగా, వ్యవహారాలను చక్కదిద్దుకునే ఆమె ఓర్పును, నేర్పును చూస్తుంటే నాకు ఆశ్చర్యం కలిగేది.

తాను కువైటుకు వచ్చిన మొదటి నాలుగు సంవత్సరాలూ అదే షాపులో సేల్స్ గర్ల్‌గా పనిచేసే దాన్నని, తరువాత ఆ షాపు ఓనరు షాపును అమ్మేసి ఇండియాకు తిరిగి వెళ్ళిపోవాలి అనుకుంటుంటే తన దగ్గర వున్న డబ్బంతా వెచ్చించి ఇంకో రెండువేల దినార్లు వడ్డీకి అప్పుతెచ్చి ఆ షాపును కొని స్వంతంగా నడిపిస్తున్నానని గర్వంగా చెపుతుంది. దేవుని దయవలన చేసిన అప్పులన్నీ తీర్చేసి ఇపుడిపుడే కాస్త డబ్బు మిగల బెడుతున్నానని చెపుతూ వుంటుంది.

జపాన్ చీరలు, సింగపూర్ చీరలు, ఇండియా చీరలు లాంటి క్రొత్తరకం చీరలన్నీ ముందుగానే ఆర్డరు ఇచ్చి దుబాయ్ నుండి దిగుమతి చేసుకుంటుంది. అందుకే వెరైటీ డిజైన్లు, క్రొత్తరకం చీరలు అన్నీ ఆమె షాపులో దొరుకుతాయి. చీరలేకాదు, వాచీలు, మేకప్ కిట్స్, గాజులులాంటివి కూడా అన్నీ అక్కడే వుంటాయి. అందుకే హసీనా అక్క శారీస్ షాపు ఎప్పుడూ కష్టమర్లతో కళకళలాడుతూ వుంటుంది.

మధ్యాహ్నం భోంచేయడానికి మాత్రమే ఒక అరగంట టైము తీసుకునేది అంతే తప్ప ఏ రోజూ ఆరోగ్యం బాలేకపోయినా ఆ షాపు ఆమె మూయడం మాత్రం జరగలేదు. ఎంతో ఇష్టంగా, సంతోషంగా, సులభంగా తన పనిని చేసుకుంటూ వుండేది. ఉదయం పదిగంటలకి తెరిచిన ఆ షాపు మరలా రాత్రి పదిగంటలకు మూసేవరకు కష్టమర్లతో బిజీగానే నడుస్తూ వుంటుంది.

హసీనా అక్కది నెల్లూరు అంట. పది సంవత్సరాల క్రితం కువైటుకు వచ్చిందంట. వచ్చినప్పుడు కొత్తలో చాలా కష్టపడిందట. తరువాత ఈ శారీ షాపులో సేల్స్‌గర్ల్‌గా ఉద్యోగం దొరకడమే తన అదృష్టం అంటూవుంటుంది. అపుడు పడిన కష్టానికి ఫలితమే ఈ రోజు ఈ షాపుకు ఓనరు కావడానికి కారణమట. జీవితంలో పడిన కష్టం ఎప్పుడు వృధాకాదని ఎపుడూ చెపుతూ వుంటుంది.

తన మాటల చాకచక్యంతో "చెల్లీ ఈ శారీస్ నిన్ననే సింగపూర్ నుండి వచ్చాయి. డిజైను బావుంది. ఈ జపాను శారి పువ్వుల ప్రింటుతో అందంగా వుంది. నీకయితే చాలా బావుంటుంది. ఈ రంగు నీకు బాగా నప్పుతుంది, ఇది తీసుకో, నీకోసమే ప్రక్కన వుంచాను. మెత్తటి ఈ సిల్కు చీర అలా వంటిమీద వేసుకుని చూడు. అబ్బ ఎంత బాగుందో? సూపర్. చీరకే అందం వచ్చింది అంటూ" నన్ను మెప్పించి, ఒప్పించి ధరలను తగ్గించి చెప్పి మెల్లగా నాలుగయిదు చీరలను ప్యాక్ చేసేస్తుంది.

ఆమె తెలివికి, ఒప్పింపచేసే విధానానికి ఆశ్చర్యపోతూ మరోవైపు సంతోషంతో నవ్వుకుంటూ మరలా తొందరలో సిటీకి వచ్చినప్పుడు తప్పక వస్తానని మాట ఇచ్చి నా రూమ్‌కి తిరిగి వస్తుంటాను. ఒక్కోసారి రెండు నెలలు ఆ వైపు వెళ్ళకపోతే "ఏంటి చెల్లీ ఈ పేద అక్క ఈమధ్య గుర్తు రాలేదా" అనేది.

"అదేం లేదక్కా. పనులతో బిజీగా వుండి ఇటువైపు రావడం కుదరలేదు" అనేదాన్ని.

తనకు ఇంటిదగ్గర ఇద్దరు పిల్లలు ఉన్నారనీ వారి చదువుల కోసం తాను ఇక్కడ కష్టపడుతున్నానని చెపుతుంది. "మరి భర్త ఏం చేస్తారని అడిగితే"

"అతడు ఇక్కడే ఉన్నాడు పెద్ద కంపెనీలో ఉద్యోగం నన్ను చాలా బాగా చూసుకుంటాడు. 'ఎందుకు రోజంతా నీకీ కష్టం? ఈ షాపు మూసేసి ఇంట్లో కూర్చో వేళకు నాకు ఇంత వండిపెట్టు చాలు. ఆర్డర్లతో, అమ్మకాలతో, కష్టమర్లతో నీకు ఈ టెన్షను ఎందుకు' అంటాడట. కానీ పూర్తిగా అతనిపైన ఆధారపడటం తనకు ఇష్టంలేదనీ అన్ని బాధ్యతలూ అతనికి అప్పగించడం బాగుండదనీ, అయినా తనకి ఖాళీగా ఇంట్లో కూచుని తినడానికి మనసు ఒప్పుకోదనీ ఈ పని అలవాటయిపోయిందనీ చెపుతుంది."

అతడు చాలా మంచివాడనీ పిల్లల చదువులకు, ఫీజులకు సరిపడా డబ్బు అతనే పంపిస్తాడనీ తనకి కూడా ప్రతి పుట్టినరోజుకూ 500 దినార్లు ఇచ్చి నెక్లెసో, గాజులో బంగారం కొనుక్కోమంటాడని సంతోషంగా చెపుతుంది. నెల్లూరులో ఒక స్థలం కూడా కొని తన పేరుతో పెట్టాడట. ఇల్లు కట్టడానికి ప్లాన్ చేస్తున్నారట. ఏ చెడు అలవాట్లు లేవనీ కనీసం సిగరెట్టు కూడా తాగడని మెరిసే కళ్ళతో చెపుతుంటే నాక్కూడా సంతోషంగా వుండేది.

అపుడపుడూ మధ్యలో నా గురించి అడిగేది. "పెళ్ళెప్పుడు చేసుకుంటావు? ఎప్పుడోచెప్పు నీకు మంచి పట్టు చీర గిఫ్ట్‌గా ఇస్తాను" అనేది.

"నాకు నలుగురు చెల్లెళ్ళు వున్నారు కదా! వారి చదువులు, పెళ్ళిళ్ళు, బాధ్యతలు బరువులతోనే కాలం గడిచిపోతోంది. వాళ్ళ పనులన్నీ చక్కపెట్టడంతోనే నాకు సరిపోతోంది. ఇక నా గురించి ఆలోచించే సమయం ఎక్కడ? అయినా పెళ్ళి చేసుకున్న వాళ్ళందరూ సుఖంగా, సంతోషంగా వున్నారంటావా?" అని ఎదురు ప్రశ్న వేసేదాన్ని నవ్వుతూ.

"అయ్యో, భలేదానివే ఇంట్లో అందరి గురించి చూసుకుంటూ, నీ గురించి మరిచిపోతే ఎలా? రేపు నిన్ను ఎవరు చూస్తారు? నీకోసం, నీకంటూ భర్త, పిల్లలు కుటుంబం వుండాలికదా. ఇప్పటికే ఆలస్యం చేసావు ఇంకా టైం వేస్ట్ చెయ్యకు. తొందరగా మంచివాడిని ఒకడ్ని చూసుకుని పెళ్ళిచేసుకుని జీవితమలో స్థిరపడు" అని సలహా ఇచ్చింది. ఇలాంటి సలహాలు వినడం నాకు అలవాటే.

"అలాగే నచ్చిన వాడు, మంచివాడు దొరకాలికదా. దేవుడు నిర్ణయించి వుంటే తప్పదు కదా! చూద్దాం" అనేదాన్ని నవ్వుతూ.

"మన ప్రయత్నం కూడా మనం చేయాలి కదా! అన్నింటికీ దేవుని మీద భారం వేస్తే ఎలా? నీ కోసం నేను ప్రార్థన చేస్తాలే. మంచి వాడు దొరుకుతాడు" అనేది.

"అలాగే ఇక నేను వస్తాను. మళ్ళీ తొందరలో కలుద్దాం" అంటూ అక్కడినుండి నేను బయటపడేదాన్ని.

చీరల కవరు చేత పట్టుకుని బస్టాండు వైపు నడుస్తూ హసీనా అక్క చెప్పిన మాటల్నే గుర్తుచేసుకుంటూ ఆలోచిస్తున్నాను. పెళ్ళి, భర్త, పిల్లలు జీవితంలో తప్పని సరా? మరి పెళ్ళి చేసుకున్న వారిలో డెబ్బైశాతం మంది పైగా ఎందుకు సమస్యలతో సతమతం అవుతున్నారు? ఎందుకు సమాజం కోసమో, పిల్లల కోసమో రాజీపడి జీవిస్తున్నారు?

బ్రతకడానికి ఏ ఆధారమూ లేకపోవడం వల్లనో, భవిష్యత్తుపై భయం చేతనో అలవాటు కావడం వల్లనో మరి చాలామంది పెళ్ళయిన వాళ్ళ మనసులను చంపుకుని సంసారాల్ని కొనసాగిస్తున్నారు. మనసు చంపుకుని బ్రతికేస్తున్నారు.

"ఈ కువైటులో మగవాళ్ళకు శరీరం తప్ప మనస్సనేది వుండదు" అనే నా ఫ్రెండ్ వేలరీ మాటలు గుర్తొచ్చాయి నాకు.

"ఈ ఎడారిలోకి వచ్చిన తరువాత అరబ్బుల జీవితాన్ని గమనించిన వీరు తమ సంప్రదాయాల్ని, అనుబంధాల్ని మరచిపోతున్నారు. శరీరావసరాలకు ప్రాముఖ్యతను ఇచ్చి విలువైన ప్రేమకు, బంధాలకు ద్రోహం చేస్తున్నారు. శరీరానికి, డబ్బుకు, పదవులకు, వ్యామోహాలకు విలువనిస్తూ మానవ బంధాలన్నీ స్వార్థపూరితమైపోతున్నాయి" అంటూ ఆవేశంతో ఆవేదన చెందే నా ఫ్రెండ్ వేలరీ మాటలు నిజమే అనిపిస్తుంది. జరిగే సంఘటనలను గమనిస్తుంటే జీవితాల్ని పరికిస్తుంటే చాలా భయం కలుగుతోంది. బయట వాతావరణమే కాదు మానవ సంబంధాలు కూడా కలుషితం అయిపోయాయి. మరి మార్చడం ఎలా? మానవ హృదయాల్లో ప్రేమను నింపడం ఎలా? పరధ్యానంగా ఆలోచిస్తూ బస్టాండు వైపు కాకుండా మరోవైపుగా అక్కడే వున్న చర్చ్ వైపు అడుగులు వేసాను. నేను.

అక్కడ చర్చి హాలు నిశ్శబ్ధంగా, ప్రశాంతంగా వుంది. మనుషుల వద్ద దొరకని సంతోషం దేవుని దగ్గర మాత్రమే దొరుకుతుంది అనిపించింది. ఎందుకో బాధగా అనిపించింది. మోకరిల్లి నాకోసం, నా వారికోసం, స్నేహితులకోసం, దేశం కోసం కొద్దిసేపు ప్రార్థన చేసాను. అప్రయత్నంగా నాకు తెలియకుండానే ప్రేమామయుడైన ఆ ప్రభువు సన్నిధిలో హృదయం కరిగి కన్నీరు కాలువలుగా ప్రవహించింది. హృదయంలోని బాధంతా కన్నీటి రూపంలో బయటికి వచ్చాక కల్లోలం అయిన మనసు నిశ్చల సరోవరంలా ప్రశాంతంగా మారింది. హృదయభారమంతా తీరిపోయి తేలికగా వున్నట్లనిపించింది.

మరొకసారి సిటీకి వెళ్ళినప్పుడు షాపులో హసీనా అక్క లేదు. ఎవరో ఒకతను ఆ షాపులోని కౌంటరు డెస్క్ ముందు కూర్చుని వున్నాడు. "హసీనా అక్క ఎక్కడికి వెళ్ళిందండీ?" అని అడిగాను నేను.

"భోంచేయడానికి ఇపుడే ఇంటికి వెళ్ళింది, పదినిముషాల్లో వస్తుంది, ఈలోపల మీకు కావలిసిన శారీస్ చూస్తూ వుండండి మా సేల్స్ గర్ల్ చూపిస్తుంది అన్నాడతను నవ్వుతూ. క్రొత్తగా తెచ్చిన చీరలను చూస్తూ వుండగానే హసీనా అక్క వచ్చేసింది. రావటంతోటే. ఓ నువ్వా! మీ బావగారు ఫోను చేసి 'ఎవరో బ్యూటీఫుల్ గర్ల్ వచ్చింది హసినీ అక్క ఎక్కడ అని నిన్నే అడుగుతోంది' అనగానే నువ్వే అని అనుకున్నాను అంది ముసి ముసిగా నవ్వుతూ."

"ఓహో ఇతనేనా! హసీనా అక్క భర్త. మరి అక్క కంటే చాలా యంగ్‌గా కనిపిస్తున్నాడే" అని మనసులో అనుకున్నాను నేను. చీరలు కొన్ని కొనుక్కుని కాసేపు అక్కతో మాట్లాడి ఇంటికి వచ్చేసాను.

ఆ తరువాత దాదాపు నాలుగు నెలల కాలం అటువైపు వెళ్ళలేక పోయాను నేను. ఒకరోజు శెలవు రోజున అలా సిటీవైపు షాపింగ్‌కి వెళ్ళాను. పనులన్నీ చూసుకుని హసీనా అక్క ఎలా వుందో చూసి పలకరించి వెళ్ళిపోదాం అనుకుని ఆ షాపులోకి వెళ్ళాను. హసీనా అక్క అక్కడే కూర్చుని వుంది. కానీ, ఆమె ముఖంలో కళలేదు, నవ్వు లేదు. ఏదో జబ్బు పడినదానిలా నీరశించి కృంగిపోయి వుంది. కళ్ళక్రింద నల్ల చారలు క్రమ్ముకుని వున్నాయి. ఇన్నేళ్ళ పరిచయంలో అంత దిగాలుగా ఎపుడూ ఆమెను నేను చూడలేదు. ఎపుడూ నవ్వుతూ హుషారుగా మాట్లాడుతూ వుండే హసీనా అక్క అలా స్థబ్ధంగా సర్వం కోల్పోయినట్లుగా కూర్చుని వుంటే తను తానేనా అనే సందేహం నాకు కలిగింది.

"ఏమయిందక్కా? అలా నీరసంగా వున్నావు. అంతా ఓకేనా? ఆరోగ్యం ఎలా వుంది?" అని ఆదుర్దాగా అడిగాను.

"ఆహా. ఆరోగ్యానికేం బ్రహ్మాండంగా వుంది. మనసే బాలేదు. దానికి మంచి దెబ్బ తగిలింది. దీనికి ఇక మందు లేదు అంది. ఏదో సినిమాలోని డైలాగులు ఎక్కడో బట్టీ పట్టి చెబుతున్నట్లుగా."

ఎపుడూ నవ్వుతూ, ఆప్యాయంగా పలకరించి, కబుర్లు చెప్పే హసీనా అక్క ఇంత భారంగా, బాధగా మాట్లాడటం, ఇబ్బందిగా క్రొత్తగా అనిపించింది. అక్కడే గుమ్మం దగ్గరే ఆగిపోయిన నన్ను చూసి "లోపలికిరా.. వచ్చి ఆ కుర్చీలో కూర్చో రెండు నెలల నుండీ నీకోసమే చూస్తున్నా. నీతో మాట్లాడాల్సింది చాలా వుంది అంది నిట్టూర్చుతూ."

ఏదో జరిగింది, లేకపోతే ఎప్పుడూ తుళ్ళుతూ నవ్వుతూ వుండే హసీనా అక్క ఇంత దిగాలుగా, ఏదో పోగొట్టుకున్నట్లుగా కనిపించడం ఇదే మొదటిసారి. నేను కూడా నీరసంగానే అక్కడ వున్న కుర్చీలో కూర్చున్నాను.

"నీళ్ళు త్రాగుతావా" అడిగింది.

"వద్దక్కా ఇపుడే బాటిల్ కొని త్రాగాను. ఇంకా సగం నా బ్యాగులో వుంది అని చెప్పాను."

"నీకు ఫోను చేయాలి అనుకున్నాను - కానీ ఎలా నిన్ను కాంటాక్ట్ చేయాలో అర్థం కాలేదు. నీ రూము కూడా నేను ఎపుడూ చూడలేదు. అందుకే నిన్ను ఎలా కలవాలో, ఏ విధంగా మాట్లాడాలో అర్థం కాలేదు. ఈ షాపులోని సరుకంతా అమ్మేసి, షాపు మూసేసి నేను ఇండియా వెళ్ళిపోతున్నాను. మరి ఈ శారీస్ నువు ఏమైనా కొనాలంటే చెప్పు. తక్కువ ధరకే ఇచ్చేస్తాను. నీ ఫ్రెండ్స్‌కు కూడా చెప్పి కొనిపించు. ఈ నెల ఆఖరున ఈ షాపు క్లోజ్ చేసి వెళ్ళిపోదాం అనుకుంటున్నా. మళ్ళీ రేపు నెలవరకూ ఇక్కడే వుంటే ఈ షాపుకు రెంట్ కట్టడం నాకు అసాధ్యమైపోతుంది. ఇప్పటికే ఆలశ్యం అయింది. ఇంక ఈ కువైటులో నేను ఉండాలి అనుకోవడంలేదని చెప్పింది హసీనా అక్క."

"అయ్యో ఎందుకు షాపు మూసేస్తున్నావు అక్కా! బాగానే జరుగుతోంది కదా! సడన్‌గా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నావు? మరి బావ కూడా నీతోపాటు ఇండియా వెళ్ళిపోతున్నాడా?" అడిగాను బాధగా.

బావ అనే మాట వినబడగానే చివుక్కున తలపైకెత్తి నా వైపు చూసి కోపంతో పళ్ళు కొరికింది. కళ్ళు ఎరుపెక్కాయి. భారంగా ఒకసారి శ్వాస తీసుకుని వదిలి నావైపు చూసింది. "వాడు బావకాదు, దుర్మార్గుడు. నమ్మినందుకు నన్ను నట్టేట్లో ముంచాడు. తన దారి తాను చూసుకున్నాడు. ఆరేళ్ళు కలిసి వుంటూ తీయగా మాటలు చెప్పి జీవితాంతం విడువనని, తోడుగా వుంటానని చెప్పి ఇంటికి వెళ్ళి అక్కడ పెళ్ళి చేసుకుని పెళ్ళాన్ని ఏకంగా ఇక్కడికి వెంటబెట్టుకుని తీసుకొచ్చాడు. దూరంగా వేరే ఇల్లు తీసుకుని దానితో కాపురం కూడా పెట్టేడు. కొత్త పెళ్ళాన్ని చూసుకుని మురిసిపోతూ నన్ను క్షణాల్లో మరిచి పోయాడు. ఆరేళ్ళ బంధాన్ని కలిసి పంచుకున్న జ్ఞాపకాల్ని త్రుంచేసి నన్ను గాలికి వదిలేసాడు. వాడు కనిపిస్తే గొంతు పిసికి చంపాలి అని వుంది" అంది కోపంతో ఊగిపోతూ హసీనా అక్క.

"ఏంటీ ఆరేళ్ళైనా మీ బంధం? మరి పిల్లలూ?" అన్నాను నేను.

"పిల్లల తండ్రిని ఇండియాలో ఎపుడో వదిలేను. వాడొక పచ్చి తాగుబోతు. వాడు సరిగ్గా వుంటే నాకు కువైటుకు రావాల్సిన ఖర్మ పట్టేదే కాదు. ఇక్కడికి వచ్చాక ఇతడు కనబడి, వెంటబడి, ప్రేమించానని పువ్వుల్లో పెట్టి చూసుకుంటానని చెపితే ఒప్పుకున్నాను. ఇక్కడ మగతోడు లేకుండా ఒంటరిగా జీవించడం కష్టమే కదా! ఏదన్నా సహాయం అవసరం అయితే ఎవరు వచ్చి చేస్తారు? ఎందుకు చూస్తారు?

ఆరేళ్ళు నన్ను చాలా బాగా చూసుకున్నాడు. వదలకుండా కలిసిమెలిసి వున్నాము. మరి వాళ్ళ తల్లిదండ్రులు ఏం చెప్పి మనసు మార్చి పెళ్ళికి ఒప్పించారో? ఏం పాడు బుద్ది పుట్టిందో? ఏం పోయేకాలం దాపురించిందో? తెలియదు గానీ ఇంటికి శెలవలకు వెళ్తున్నానని చెప్పాడు. అక్కడ పెళ్ళి చేసుకుని చక్కా పెళ్ళాంతో కలిసి బయట కాపురం పెట్టేసాడు.

ఆ సంగతి నాకు తెలియనే లేదు. ఇంకా వస్తాడు, వస్తాడు అని ఇక్కడ నేను ఎదురు చూస్తూనే వున్నాను. ఎవరో ఒకావిడ నీలాగే షాపుకు వచ్చి నిజం చెపితే నమ్మలేకపోయాను. కళ్ళతో చూసి అయినా నిజం తేల్చుకుందాం అని అడ్రసు పట్టుకుని వాడు వుండే ఫ్లాటుకు వెళ్ళి కాపు కాసి పట్టుకున్నాను. చొక్కా పట్టుకుని నిలదీస్తే వాడు కొంచెం అయినా భయపడకుండా పెళ్ళానికి నన్ను చూపించి 'ఇది ముందు నాకు పనిమనిషిగా వుండేది. కాస్త తిక్క మనిషి. నేనంటే ఇష్టం అని వెంట పడేది. దీని మాటలు నువు నమ్మకు' అని పెళ్ళానికి చెప్పి నన్ను బలవంతంగా బయటకి తోసి తలుపు వేసాడు.

అలాగే పనిమనిషిగా అయినా పడివుండనిమ్మని నిన్ను మరిచిపోలేనని చెప్పి కాళ్ళుపట్టుకున్నాను. నన్ను విడిచిపెట్టవద్దని ప్రాధేయపడ్డాను. అయినా వాడి హృదయం కరగలేదు. ఆ తలుపు దగ్గరే కూలబడి భోరున ఏడ్చాను. ఆరేళ్ళు కలిసి జీవించిన కాలం, అనుభవించిన శారీరక సుఖాలు, పంచుకున్న జ్ఞాపకాలు గుర్తొచ్చి క్షణంలో మరిచిపోయిన వీడికంటే కుక్క నయం అనిపించింది. ఏడుస్తూ అక్కడినుండి లేచి వచ్చేసాను. కిటికీలోనుండీ నన్ను చూస్తూ వాడు ఏదో చెపుతుంటే వాడి పెళ్ళాం పకపకా నవ్వడం నాకు వినిపిస్తోంది. నా హృదయం మండింది. ఇంతలో ఎంత మార్పు? రెండునెలల క్రితం వరకు నా ప్రక్కను వుండి నన్ను విడవకుండా వుండేవాడు ఈ రోజు పెళ్ళి చేసుకుని పెళ్ళాంతో కబుర్లు చెపుతూ నవ్వుకుంటూ సంతోషంగా వున్నాడు. నా హృదయాన్ని సముదాయించడం నాకు అసాధ్యమైపోయింది. పడుకుంటే కంటిపైకి నిద్రరాదు. తినాలంటే ఏదీ సహించదు. చనిపోవాలి అన్నంత విరక్తి కలిగింది. వాడే నా చావుకు కారణం అని కాగితంపై రాసి పెట్టి చనిపోదాం అనుకున్నాను.

కానీ.. కాస్త ఆగి ఆలోచిస్తే వాడు చేసిన పని రైటే అనిపిచింది. వాడు నాకంటే వయసులో చిన్నవాడు. నాకు ఇంటిదగ్గర భర్త, పిల్లలు వున్నారు. మరి వాడు కూడా వాడి జీవితాన్ని భవిష్యత్తును చూసుకోవాలి కదా? భార్యా పిల్లలతో కుటుంబాన్ని కట్టుకుని సంతోషంగా జీవించాలి కదా? ఎంతకాలం నాతో ఈ కువైటులో కాలం గడుపుతాడు? ఈ రోజు కాకపోయినా ఏదో ఒకరోజు ఎప్పటికైనా నన్ను విడిచి పెట్టాల్సిందే

కాబట్టి పోనీలే పెళ్ళి చేసుకుని సుఖంగా కాపురం చేసుకోనీ అనుకున్నాను. కానీ మనసు అతడి జ్ఞాపకాల్ని మోస్తూ ఇక్కడ వుండటానికి ఒప్పుకోవడంలేదు. అందుకే షాపు కూడా క్లోజ్ చేసి ఇంటికి వెళ్ళిపోవాలనే నిర్ణయం తీసుకున్నాను. అక్కడ ఏదో ఓ పని చేసుకుని పిల్లల్ని పోషించుకుంటాను'' అంది హసీనా అక్క కన్నీళ్ళతో.

''అవునా? అయితే ఇంటి దగ్గర నీకు భర్త వున్నాడా? మరి ఇక్కడ ఇతనితో కాపురం పెట్టడం తప్పుకాదా అన్నాను'' ఏమిటో అర్థంకాని అయోమయంలో ఆలోచిస్తూ అందని లింకును అందుకోవడానికి ప్రయత్నిస్తూ ఎందుకు మనుషులు ఇలా చేస్తారో? ఇంటి దగ్గర కట్టుకున్న మగవాడు మంచివాడైతే వాడు త్రాగుడుకు బానిసకాకుండా కట్టుకున్న పెళ్ళాన్ని చక్కగా పోషించగలిగితే పిల్లల్ని చదివించి వారి ఆలనాపాలనా సరిగ్గా చూడగలిగితే ఆడవాళ్ళకి ఇలాంటి పరిస్థితి రాదుకదా? భర్తను, పిల్లల్ని, తనవారిని దేశాన్ని విడిచిపెట్టి ఇలా ఒంటరిగా పరాయి దేశం వచ్చి పరాయి పురుషుని వ్యామోహంలో పడి జీవితాన్ని నాశనం చేసుకోరు కదా. ఇలా ఆలోచిస్తుంటే హసీనా ఇంకా ఇలా చెపుతోంది.

''చేసుకున్న వాడు మర్యాదస్తుడు అయితే ఈ దరిద్రం నాకెందుకు? వాడు ప్రొద్దున్న లేచిన దగ్గర్నించీ తాగి, తందనాలాడి అయినవారందరి దగ్గరా అప్పులు చేసి వారిని ఇంటిమీదకి తెస్తాడు. ఇంట్లో విలువైన వస్తువు ఏదీ వుండకుండా నీళ్ళు త్రాగే గ్లాసుతో సహా తినే గిన్నెతో కూడా తీసుకెళ్ళి ఎంతకో కొంతకు అమ్మేసి సారాయి త్రాగేస్తాడు. అంతటితో ఆగితే సరే. నన్ను వెళ్ళి అందర్నీ అప్పు అడిగి డబ్బులు తెమ్మని త్రాగడానికి డబ్బు ఇమ్మనీ ప్రతిరోజూ చికెన్, మటన్ వండిపెట్టమని సతాయిస్తాడు. వాడి మాట వినకపోతే పట్టుకుని చావగొడతాడు. అందుకే ఆ బాధ భరించలేక పిల్లల్ని మా అమ్మ దగ్గర వదిలి ఈ కువైటుకు వచ్చేసాను.

ఈ కువైటులో అరబ్ దేశంలో ఒంటిరి జీవితాలు, పనులు .. కష్టాలు, పోరాటాలు ఒంటరిగా వుండే ఆడదాన్ని చూస్తే పదిమంది వెంటపడతారు, వేధిస్తారు ఏదో ఒక విధంగా చెడగొట్టాలని ప్రయత్నిస్తారు. అందుకే ఎవరో ఒక్కడితో వుంటే కనీసం భద్రత, తోడు, నీడ వుంటుంది. అన్ని అవసరాలు తీరతాయి. మనిషి సహాయం దొరుకుతుంది. వేరే మగవాడు కన్నెత్తి చూడటానికి, భయపడతాడు. కాదంటావా?'' అంటూ తన భాధ, భయం అభిప్రాయం మాటల్లో తెలియజేస్తోంది.

ఏం జవాబు చెప్పాలో అర్ధంకాక అలాగే వింటూ వున్నాను నేను. అన్నీ అనుభవించాక అంతా గడిచిపోయాక సమస్తం విడిచిపెట్టి వెళ్ళిపోయాక ఒంటరిగా మిగలాల్సిందే అంతా శూన్యమైపోయి, భవిష్యత్తు అగమ్యగోచరమైపోయి దిక్కుతోచని స్థితిలో అల్లాడాల్సిందే ఆడదాని జీవితం అంతే. మార్పేమీ లేదు. ఎన్నటికీ ఆ కథ మారదు. ఎప్పటికీ మారదు.

''సరే నీ యిష్టం. నీకు ఏది మంచిదో, ఏది అనుకూలమో అలా చెయ్యి. ఇంటికి వెళ్ళి పిల్లలతో సంతోషంగా గడుపు అని'' నాకు తోచింది నేను చెప్పి బాధగా అక్కడనుండి వచ్చేసాను నేను.

కానీ నాకు తెలుసు. ఈ ఎడారి దేశాన్ని వదిలి వెళ్ళడం అంత సులభం కాదని, ఇక్కడ సౌఖ్యాలకు అలవాటు అయ్యాక ఇండియాలో స్థిరపడటం, జీవించడం కాస్త కష్టమే అనిపిస్తుంది. అలా చాలామంది వెళ్ళినవాళ్ళు మరలా తిరిగి రావడం నాకు తెలుసు.

తర్వాత దాదాపుగా రెండేళ్ళు అలా గడిచిపోయాయి. ఈ మధ్య కాలంలో నేను అపుడపుడూ మాలియా సిటీకి వెళ్ళినా కూడా ఓ మూలగా ఒక ప్రక్కన వున్న ఆ షాపువైపు వెళ్ళేదాన్నికాను. ఎందుకంటే అక్కడ హసీనా అక్కలేదు కదా అనుకునేదాన్ని. మూడేళ్ళ తరువాత మా ఫ్రెండ్ ఒకమ్మాయి గోంగూర కొనాలని అంటే అటువైపు ఆ మూలగా వున్న ఆంధ్రా బకాలాకు వెళ్ళాం. అటువైపు వెళ్తుంటే.. ఆశ్చర్యంగా అక్కడ హసీనా అక్క కనిపించింది. ఆనందంగా దగ్గరికి వెళ్ళి పలకరించాను. ఆప్యాయంగా నన్ను హత్తుకుని ''నేను మరలా కువైటు వచ్చి దాదాపు ఆర్నెల్లు దాటింది. నువు ఇటువైపు వస్తావనీ.. నువ్వు ఏమయిపోయావో అనీ, ఎలా కలవాలో అనీ ఆలోచించి దిగులు పడ్డాను. నువ్వు రాకపోయేసరికి, కనిపించక పోయేసరికి ఇండియాకు వెళ్ళిపోయావేమో అనుకున్నాను. దేవుని దయవలన మరలా నేను ఇదే శారీస్ షాపు ఓపెన్ చేసి నడిపిస్తున్నాను. లోపలికిరా వచ్చి చూడు అంది ఆనందంతో. హసీనా అక్క ఇప్పుడు మునుపటి కంటే కాస్త వళ్ళు చేసినట్లు కనిపిస్తోంది. ఇండియా శాశ్వతంగా వెళ్ళిపోయింది అనుకున్న ఆమెను తిరిగి మరలా కువైటులో చూడటం చాలా సంతోషంగా అనిపించింది. మాట్లాడుతూనే యధావిధిగా క్రొత్తరకం శారీస్ అన్నీ బయటికి తీసి ఒక్కొక్కటీ చూపిస్తూ కలర్ నీకు బాగుంటుంది. ఇదిగో ఇది చూడు ఈ క్లాత్ క్లాస్‌గా వుంటుంది అంటూ ఆకట్టుకునేలా వివరించి చెపుతోంది.

ఇంతలో అతను వచ్చాడు. అతడు.. అతడే. సందేహం లేదు. వస్తూ వస్తూ చేతిలో ఒక క్యారేజ్‌తో హసీనా అక్కకు భోజనాన్ని కూడా తీసుకుని వచ్చాడు. ఆమెకు దాన్ని అందించి ''సల్మా ఈరోజు మటన్ కర్రీ బాగా చేసింది. వేడిగా వున్నపుడే తిని చూడు. రుచిగా వుంటుంది అని నవ్వుతూ అక్కతో చెపుతున్నాడు.''

అతడి మాటల్లో ఆమె పట్ల చాలా ప్రేమ కనిపిస్తోంది. అతడు.. అతడే. మీ బావ అని ఎపుడూ మాటల్లో చెపుతూ వుంటుంది. అందులో అతన్ని ఒకసారి చూసాను కూడా. ఆ ముఖం ఇంకా గుర్తే నాకు.

హసీనా అక్క కూడా అతని చేతిలోని కారేజ్‌ను అందుకుని ''మరి నువు తిన్నావా? '' అని ఆప్యాయంగా అతన్ని అడుగుతోంది. ''ఆ..ఆ. ఇపుడే నేను కడుపు నిండా తిన్నాను. పిల్లోడు నడిచేవాడు అయ్యాడు కదా. అన్నం తిననివ్వకుండా గిన్నెలాగుతుంటే అలాగే ఒక చేత్తో వాడ్ని పట్టుకుని మరో చేత్తో తినేసాను. సల్మా ఇటివ్వండి వాడిని నేను ఎత్తుకుంటాను మీరు తినండి అంది కానీ.. వాడు వాళ్ళమ్మ

దగ్గరికి వెళ్ళకుండా నా దగ్గరే వుండాలని గొడవ. నాకు బాగా అలవాటు అయిపోయాడు. ఇంట్లో వున్నంత సేపూ నన్నూ వదలడం లేదు'' కొడుకు గురించి గర్వంగా మెరిసే కళ్ళతో చెపుతున్నాడు అతడు.

హసీనా అక్క నవ్వుతూ అతడి మాటలు వింటోంది. అతడు అటు వెళ్ళగానే ''అక్కా అతడే కదా ఇతడు?'' అని అడిగాను.

''అవును అతడే పెళ్ళి చేసుకుని పెళ్ళాం మోజులో ఒక సంవత్సరంపాటు నన్ను మరిచిపోయి ప్రక్కకి తోసి వేసినా ఆ తరువాత ఇండియాలో వున్న నాకు ఒకటే ఫోన్లు చేసాడు. క్షమించమని ప్రాధేయపడ్డాడు. నువు లేకపోతే బ్రతకలేను. నా జీవితంలో నీకే మొదటి స్థానం. సల్మాకు కూడా నీ గురించి నిజం చెప్పేసాను. నిన్ను మరలా కువైటుకు పిలిపిస్తాను అంటే తను కూడా సంతోషంగా ఒప్పుకుంది. నేను వీసా, టిక్కెట్లు తొందరగా పంపిస్తాను. నువు వెంటనే వచ్చెయ్యి. నీకు మరలా అదే వీధిలో శారీస్ షాపు నేను పెట్టిస్తాను. నిన్ను బాగా చూసుకుంటాను. నువు మాతో పాటు కలిసి వుండవచ్చు అని చెప్పాడు. ఆ పిల్ల సల్మా కూడా ఫోను చేసి నాతో మాట్లాడింది. తనకు అభ్యంతరం ఏమీలేదనీ కువైటుకు రావాలనీ చెప్పింది. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. అందులో ఇతన్ని మరిచిపోవడం నాకు కూడా అసాధ్యమే అయింది. ఇండియా వెళ్ళాక ఇతడిని మరిచిపోలేక ప్రతిరోజూ ఏడుస్తూ వుండేదాన్ని. మళ్ళీ ఒకసారి కళ్ళతో అయినా ఇతడ్ని చూడాలని అనిపించి వెంటనే బయలుదేరి వచ్చేసాను.

అందరం ఒకేచోట సంతోషంగా వున్నాం. అతడికి ఇపుడు ఒక బాబు కూడా పుట్టాడు'' అని కథంతా వివరించి చెప్పింది హసీనా అక్క.

ఆమె చెప్పిన కథంతా ఆశ్చర్యంగా వింటూ.. ఓ ఇలా కూడా జరుగుతుందా? ''జీవితం అంటే ఒక నాటకం'' అన్నాడు ఎవరో కవి. నిజమేనేమో. ఏదైతేనేం అందరూ సంతోషంగా వున్నారు అంతే చాలు అని నవ్వుకుంటూ ఇంటిదారి పట్టాను నేను.

## నాగమణి కథ

''**కడప జిల్లాలోని** వాళ్ళందరూ ఈ కువైటులోనే చేరిపోయారు. ఇంటికి ఒక్కరన్నా వచ్చి ఉన్నారు. ఎవర్ని అడిగినా సరే మాది కడపజిల్లా అనే చెపుతారు. ఇక్కడ కువైటులో పెట్రోలు వచ్చి డబ్బు పెరిగాక మొట్టమొదట కడప నుండే వీళ్ళు పనిమనుషుల్ని, డ్రైవర్లని రప్పించుకున్నారంట. అందువల్ల కడప అనే పేరు కువైటు వాళ్ళకి కూడా నోటెడ్ అయిపోయింది.

ఆ తరువాత ఆంధ్రాలోని మిగతా జిల్లాల వాళ్ళు వచ్చారు. అలాగే కేరళనుండి నర్సులు, గోవా, బొంబాయి నుండి కంపెనీ పనుల కోసం చదువుకున్నవారు వచ్చారు. కానీ వీళ్ళందరి కంటే షేకుల ఇళ్ళలో పనిచేసేవాళ్ళ పని మేలుగా ఉంది. అదృష్టం అంటే వాళ్ళదే. మనం పదేళ్ళు కష్టపడినా సంపాదించలేని డబ్బు వాళ్ళు ఒక్కసంవత్సరంలో సంపాదించగలరు. షేకుల దగ్గర పదేళ్ళు పనిచేస్తే చాలు జీవితానికి సరిపడా డబ్బు సంపాదించవచ్చు. ఒక ఇల్లు కట్టించుకుని, కొంచెం డబ్బు బాంకులో వేసుకుని చక్కగా ఇండియాకు పోవచ్చు. ఇలాంటి ఇంట్లో ఎన్నేళ్ళు చేసినా ఏం లాభం? వీళ్ళిచ్చే జీతాలు దేనికి సరిపోతాయి? నెలనెలా ఇంటి ఖర్చులకే సరిపోవు.

మా పిన్ని కోడలు నాగమణినే చూడు. అది నక్కను తొక్కి వచ్చింది. అదృష్టం అంటే దానిదే. వచ్చి నాలుగేళ్ళు కాలేదు, ఇంతలోపల ఊర్లో పెద్ద ఇల్లు కట్టేసింది. అరకేజీ బంగారం పెట్టి పెద్ద పిల్లకు పెళ్ళిచేసింది. ఊర్లో రెండు మూడు స్థలాలు కొని పెట్టుకుంది. ఎంత డబ్బు? ఏం కథ? షేకుల ఇంట్లో పనిచేసే అదృష్టం పట్టింది దానికి. నెలకు రెండు లక్షల జీతం అంట. ఇంకా పైన ఆదాయం ఉంటుందంట. ఎపుడు పడితే అపుడు సెలవులు, బయటికి వెళ్ళాలంటే అభ్యంతరం ఏమీలేదు. ఎపుడు అనుకుంటే అపుడు

నా దగ్గరికి కూడా వచ్చి చూసి వెళుతుంది. మనలాగా కష్టపడేవాళ్ళకు అలాంటి మంచి పనులు దొరకవు ఎందుకో? దేనికైనా రాతబావుండాలి" అంతా చెప్పి నిట్టూర్చింది కుమారి.

"అవునా? నెలకు రెండు లక్షల జీతమా? నిజమా? అదెలా? పెద్ద పెద్ద కంపెనీల్లో పనిచేసే వాళ్ళకే అంతంత జీతాలు ఇవ్వడం లేదు. ఈ నాగమణి ఓనమాలు కూడా నేర్చుకోలేదు. పొట్టకోస్తే అక్షరం ముక్క కూడా రాదు. ఇదిగో ఈ కువైటుకు వచ్చిన తరువాతే డబ్బు సంపాదన పెరిగాక షోకులు చేయడం, మేకప్ వేసుకోవడం, నైసుగా మాట్లాడటం నేర్చుకున్నట్లుంది. ఆ మేకప్ లేకపోతే ఆ ముఖం అస్సలు చూడలేము. ముక్కూ మూతి వంకర. గుంటకళ్ళు వేసుకుని గుడ్లు మిటకరించి చూస్తూ ఉంటుంది. అచ్చం చెట్టుమీది కోతిలాగా వుంటుంది. దానికీ నీకు పోలిక ఎక్కడ? అది చెప్పిందల్లా నువ్వు నమ్ముతావా కుమారీ? నువు ఒక పిచ్చిదానివి. అది ఏం పని చేసి అంత డబ్బు సంపాదిస్తోందో? ఎవరికి తెలుసు? అది కథలు బాగా చెప్పి జనాల్ని నమ్మిస్తోంది. దాని మాటల్లో ఒక్కటి కూడా నిజం కనపడటంలేదు. కాకమ్మ కథలు చెప్పి మన చెవుల్లో పెట్టాలని చూస్తోంది అది. ఏదో ఒక అడ్డమైన పనులు చేస్తేనే అంత డబ్బు వచ్చి పడుతుంది. లేకపోతే ఈ కువైటులో కంపెనీలో మేనేజరు పని చేసేవాడికి కూడా రెండు లక్షల జీతం ఇవ్వడం లేదు. అయినా ఎప్పుడు పడితే అపుడు సెలవు ఇవ్వడానికి అదేమన్నా గవర్నమెంటు ఉద్యోగమా! లేకపోతే ఆ షేకు దీనికి మేనమామా? ఎవరూ అట్లా పంపించరు. అన్ని సెలవులు ఇవ్వరు. ఏదో వుంది. తెలివిగా గుట్ట బయటపడకుండా పనులు చేసుకుంటూ డబ్బు, బంగారం బాగా సంపాదిస్తోంది ఆ నాగమణి. నీకేం తెలుసు దాని సంగతి.? మనిషిని చూస్తుంటే తెలియడం లేదా?" ఆవేశంగా బదులు మాట్లాడింది చంద్రమ్మ.

నాగమణి మాటలు, ప్రవర్తన అస్సలు నచ్చవు చంద్రమ్మకు. అందుకే సూటిగా, కోపంగా మాట్లాడుతుంది ఆమె. ఆ సమయంలో ఇద్దరూ కలిసి కువైటు ఇంట్లోని కిచెన్‌లో చికెన్ మసిబూసి తయారు చేస్తున్నారు. "మసిబూసి" అంటే మన బిరియానీలాగా వుంటుంది కానీ వండే పద్ధతి వేరు.

"సరే, చిన్నగా మాట్లాడు. అది వచ్చే టైము అయింది. ఈ రోజు ప్రొద్దున్నే ఫోను చేసి మధ్యాహ్నం అన్నం టైముకు వస్తాను అని చెప్పింది. అసలే దాని నోరు మంచిదికాదు. మన మాటలు విన్నదంటే ఇల్లు పీకి పందిరి వేస్తుంది. ఏదో స్వంత పిన్నికి కోడలు కదా, కువైటులో ఉంటున్నాం అయినవాళ్ళం, కలిసి కష్టం సుఖం పంచుకుంటాం అని చెప్పి దానితో మాట్లాడుతున్నాను. ఈ కాలం డబ్బు సంపాదిస్తే చాలు, ఎలా సంపాదించారు అనేది ముఖ్యం కాదు. డబ్బున్న వాళ్ళకే మర్యాదలు, గౌరవం. నిజాయితీగా కష్టపడి పనిచేసుకుని సంపాదించే మనబోటి పేదవాళ్ళంటే అందరికీ చులకనే కదా! నువు అన్నట్లు నిజమే అయి వుంటుంది. లేకపోతే రెండేళ్ళు తిరగక ముందే అంత డబ్బు, బంగారం, స్థలాలు ఎలా కొంటుంది? ఇదంతా ఎలా సాధ్యం అవుతుంది? నేను కువైటుకు వచ్చి పదేళ్ళయింది. నెలకు కనీసం నాలుగువేలు మిగిలించి దాచిపెట్టుకుందాం అనుకున్నా గానీ కుదరడం లేదు. ఎప్పటికప్పుడు ఏదో ఒక ఖర్చు వస్తూనే వుంది. అప్పులు చెయ్యకుండా. నా చిన్న జీతంతోనే అలా నెట్టుకొస్తున్నాను. ఎన్ని ఏళ్ళు ఈ కువైటు ఇంట్లో పడి చచ్చిపోవాలో? అప్పు చేసి ఆస్తి కొనాలంటే భయం వేసి ఏమీ కొనలేదు. ఎవర్ని అయినా నోరు తెరిచి అప్పు అడగాలంటే ప్రాణం పోతుంది. అది ఆ నాగమణి పదిలక్షలు అప్పు చేసి ఇల్లుకట్టేసి సంవత్సరం తిరక్కముందే ఆ అప్పు తీర్చేసింది. చూసిన వాళ్ళు విన్న వాళ్ళు అంత డబ్బు ఒక్క సంవత్సరంలో ఎలా సంపాదించింది? ఎలా అంత అప్పు తీర్చింది అని ఆశ్చర్యపోయారు. కువైటులో డబ్బులు కాసే చెట్టుగానీ వుందా? అనుకుంటున్నారు. మొన్న సమర్తాడిన చిన్న కూతురికి రెండు చేతులకు వంకీలు, నడుముకు వడ్డాణంతో సహా కొని పెళ్ళికి రెడీగా పెట్టింది. దానికి ఈ కువైటులో అంత అదృష్టం ఎలా కలిగిందో మరి? ఆ దేవుడికి కూడా మనలాగా క ష్టడేవారిని చూస్తే కనికరం లేదు. ఉన్నవాళ్ళకే ఇంకా ఇస్తూ ఉంటాడు.

ఇదిగో రెండేళ్ళనుండీ పెద్ద దానికి మెళ్ళోకి పదిగ్రాముల బంగారం గొలుసు కొందామనుకుంటూనే కాలం అలా జరిగిపోయింది. అస్సలు డబ్బు మిగలడం లేదు. కుదరడం లేదు. చూస్తుంటే బంగారం రేటు రోజు రోజుకూ పెరుగుతోందే గానీ అస్సలు తగ్గడంలేదు. బంగారం కొనే పరిస్థితా మనది? అందుకే మా పెద్దపిల్ల ఫోను చేసినపుడల్లా గొలుసు కొనాలి అని ఏడుస్తుంటే రోల్డ్‌గోల్డ్ చైను ఒకటి కొని ఎవరో ఇంటికి పోతావుంటే పంపించాను. బంగారందే, జాగ్రత్తగా వాడుకో అని అబద్ధం చెప్పాను. మా పెద్దది ఎట్లయినా అమాయకురాలే నా మాటలు నమ్మేసింది. ఆ చైను తీసుకెళ్ళి అందరికీ చూపించి "మా అమ్మ కువైటు నుండి నాకు గొలుసు పంపించింది చూడండి" అని చెప్పిందంట.

కొంతమంది ఇదేంటి "ఇది రోల్డుగోల్డుచైను మాదిరిగా వుండాదే" అన్నారంట.

"అదెందుకవుతాది? మా అమ్మ కువైటులో ఉంది. ఇరవైరెండు కారెట్ల బంగారపు గొలుసు ఇది" అని జవాబు చెప్పిందంట ఈ పిచ్చిపిల్ల.

ఏం చెయ్యమంటావు చెప్పు? ఇక్కడ సంపాదించిన నెల జీతం ఖర్చులకు ఇంటికి పంపించడానికే సరిపోతుంది. ఇంక బంగారం కొనడానికి ఎక్కడ మిగులుతుంది? పోన్లే, కూటికి గుడ్డకు తక్కువ లేకుండా పిల్లల్ని సాకుతున్నారు. ఆ మాత్రం ఆ దేవుడు ఇస్తున్నాడు కదా! అంతే చాలు, ఎక్కువ ఆశ ఎందుకు? అంది కుమారి. ఆమె మాటల్లో ఎంతో బాధ కనిపిస్తోంది. దాదాపు పదేళ్ళుగా ఆమె ఆ కువైటు ఇంట్లో యంత్రంలా పనిచేసి - అలసి పోయింది. ఇండియాకు వెళ్ళిపోతే అక్కడ ఏమి తిని బ్రతకాలి? ఏమి పనులు చేసి డబ్బు సంపాదించాలి? " అలా ఆలోచిస్తే భయం కలుగుతోంది ఆమెకు.

"నా బ్రతుకుకు సుఖం, సంతోషం లేకపోయినా - నా పిల్లలయినా సుఖంగా బ్రతికి, సంతోషంగా వుంటే అంతేచాలు" అంది కుమారి కొంచెం స్థిమితంగా.

ఇంతలో ఎవరో బయట డోర్‌బెల్ మోగించారు. "అదిగో అదే ఆ నాగమణి వచ్చి వుంటుంది. పోయి చూడు. తలుపు తీసి లోపలికి తోడుకునిరా" చెప్పింది కుమారి చికెన్‌ను నూనెలో ఎర్రగా వేయిస్తూ.

"వచ్చినట్లుంది టక్కులాడి" అని నవ్వుతూ తలుపు దగ్గరికి పోయింది చంద్రమ్మ.

హైహీల్స్ వేసుకుని టకటకా నడుస్తూ వంటికి అతుక్కుపోయిన టైట్ జీన్స్ పాంట్ లోనెక్ టీ షర్టుతో చూడడానికి సర్కస్‌లోని బఫూన్‌లా వుండి నవ్వు తెప్పిస్తోంది నాగమణి వస్త్రధారణ.

వచ్చీ రావడంతోనే అరబిక్ వాళ్ళ సంప్రదాయంలో "సలామాలేకుం" అంటూ కుమారిని కౌగిలించుకుని బుగ్గలపై ముద్దులు పెట్టేసి లేని ఆప్యాయత, ప్రేమ ఒలకబోసింది. వదలకుండా చేయిపట్టుకుని తాను ఆ వారం రోజుల్లో ఏమేం కొనిందో, ఏయే పనులు చేసిందో, గొప్పగా తన గురించి చెప్పుకోవడం మొదలు పెట్టింది.

ఆమె మాటలు తెలిసినవే. అలవాటయినవే కాబట్టి కుమారి చంద్రమ్మ ఇద్దరూ బలవంతంగా నవ్వుతూ ఆసక్తిగా నాగమణి మాటలు వినసాగారు. ఆమె అపుడే స్వర్గలోకం నుండి భూలోకానికి దిగివచ్చిన అప్సరసలా ఫీలయిపోతూ "బంగారం రేటు తగ్గుతోంది తెలుసా? నిన్ననే వంద గ్రాముల్లో నెక్లెస్ కొన్నాను చూడండి" అంటూ మెళ్ళోని నెక్లెస్ తీసి అతిశయంగా తిప్పి తిప్పి చూపించింది. చాలా బాగుంది అంటూ అటూ ఇటూ తిప్పి తిప్పి చూసారు కుమారి, చంద్రమ్మ.

లోపల మనసులో పదేళ్ళయింది కువైటుకు వచ్చి కనీసం ఉంగరం అయినా కొనుక్కోలేక పోతిమే అని బాధపడుతున్నారు వాళ్ళిద్దరూ.

పోన్లే ఎవరి అదృష్టం వాళ్ళది అనుకుంటూ సమాధానపడింది కుమారి. కానీ చంద్రమ్మ మాత్రం ఊరికే ఉండలేదు. తమాషాగా అడుగుతున్నట్లు "నాగమణీ నువు నిజంగా షేకుల ఇంట్లో పని చేస్తున్నావా? వాళ్ళు అంత జీతం అన్ని శెలవులు నీకు ఇస్తున్నారా? మాకు కూడా మీ షేకుతో చెప్పి పని ఇప్పించకూడదా? మేము కూడా డబ్బు నీలాగే బాగా సంపాదిస్తాము" అని నవ్వుతూ ప్రేమగా అడగసాగింది.

"సరే అలాగే మీరు మీ బాబా, మామాలతో చెప్పి, మీ కాంట్రాక్టులు కాన్సిల్ చేయించుకుని బయటికి వచ్చెయ్యండి. నేను డబ్బు సంపాదించే మార్గాలు బోలెడు చెపుతాను. నేను చెప్పినట్లుగా చేస్తే మీరు కావలసినంత డబ్బు, బంగారం సంపాదించుకోవచ్చు, నాలుగేళ్ళలో ఇల్లు కట్టుకుని కావల్సినంత సంపాదించుకుని ఇంటికి పోవచ్చు" అంది నాగమణి కుమారివైపు చంద్రమ్మ వైపు పరిశీలనగా చూస్తూ.

మనసులో ఏదో ప్లాన్ చేస్తున్నట్లుగా అనిపించింది నాగమణి ధోరణి. నిజంగా నాగమణి తమకు సహాయం చేస్తుందని అనుకున్నారు వీళ్ళిద్దరూ. డబ్బు మీద ఆశ అలాంటిది మరి.

"అలాగే. బాబాను, మామాను అడిగి మూడ్నెల్లలో రిలీజ్ తీసుకుని నీతో పాటు వచ్చేస్తాము. డబ్బు బాగా సంపాదిస్తే చాలు." ఎన్నేళ్ళు ఇలా కష్టపడతాం అంది కుమారి.

వయసు అయిపోక ముందే, శరీరంలో శక్తి, అందం ఉన్నపుడే డబ్బు సంపాదించుకోవాలి. తరువాత బాధపడి లాభంలేదు అంది నాగమణి నీతిబోధ చేస్తూ.

"అంతేలే నువు చెప్పినట్లే చేద్దాం" అంది కృతజ్ఞతగా కుమారి.

చంద్రమ్మ మాత్రం కాస్త ఆలోచిస్తున్నట్లుగా అనిపించింది. కానీ ప్రస్తుతం చేస్తున్న కష్టం, చాలని జీతం తలచుకుని నాగమణి మాటలు విని ప్రయత్నిస్తే మంచిదే కదా అని బయటకి వెళ్ళడానికే నిశ్చయించుకుంది.

నాలుగురోజుల క్రితం ఇంటికి ఫోను చేసినపుడు తన అమ్మ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి కుమారికి.

"ఆ నాగమణి కువైటుకు పోయి నాలుగేళ్ళే అయింది. లక్షలకు లక్షలు డబ్బు పంపిస్తోంది. ఊర్లో స్థలాలు కొంది ఇల్లు కట్టించింది. నువు అక్కడ పదేళ్ళ నుండీ వున్నావు. ఏం లాభం చెప్పు? సంపాదించిన డబ్బు ఏం చేస్తున్నావు? ఎవరికన్నా ఇస్తున్నావా? ఆ నాగమణిని చూసి అయినా బుద్ధి తెచ్చుకో. సంపాదించే మార్గం చూసుకో. నువు పంపించే నెలజీతం ఇంటి ఖర్చులకు, పిల్లల చదువులకు సరిపోవడం లేదు అని కోపంగా మాట్లాడింది."

ఆమె మాటలు విన్న కుమారికి చాలా బాధ కలిగింది. అక్కడ ఇండియాలో ఇంట్లో కూచుని మూడుపూటలా తిని, వేళకు నిద్రపోయే వాళ్ళకి ఏం తెలుస్తుంది బాధ? ఇక్కడ కువైటు ఇంట్లో బానిసలా ఇరవై నాలుగ్గంటలూ చాకిరీ చేస్తూ స్వేచ్ఛ లేకుండా జైల్లో వున్నట్లు, వాళ్ళు చెప్పిన పనిచేస్తూ ఏ సుఖం సంతోషము లేకుండా ఏళ్ళకి ఏళ్ళు గడుపుతుంటే అర్థం చేసుకునే వాళ్ళు లేరుకదా అని దుఃఖం వచ్చింది కుమారికి.

ఈ ఎడారి దేశంలో కత్తిమీద సాములాంటిది జీవితమనీ పనిమనుషుల బ్రతుకులు ఎంతో నికృష్టమైనవనీ వాళ్ళకి ఏం తెలుస్తుంది?

గట్టున నిలబడినవారు ఎన్ని మాటలైనా చెపుతారు. నీటిలో మునిగిన వారికే కదా కష్టం తెలిసేది.

ఈ నాగమణి ఇక్కడ ఏం చేసి ఎలా అంత డబ్బు సంపాదిస్తుందో ఏమో? ఇంటిదగ్గర అందరూ ఆ నాగమణిని చూసి తెలివి తెచ్చుకో. పదేళ్ళు నువు అక్కడ ఏం చేస్తున్నావు అని నిష్టూరంగా మాట్లాడుతున్నారు. వీళ్ళందరికీ ఏం జవాబులు చెప్పాలో అర్థం కాక చచ్చిపోతున్నా అనుకుంది కుమారి.

"ఏదో ఒకటి చేసి మనం కూడా డబ్బు సంపాదించాలి కుమారీ. లేకపోతే ఇలా కష్టం చేసి ఎన్నేళ్ళు బ్రతకగలం? మా ఊరి నుంచి కూడా రాజ్యలక్ష్మి అనే ఆవిడ కువైటుకు వచ్చి మొదట రెండేళ్ళు కువైటు ఇంట్లో పనిచేసింది. తరువాత వాళ్ళ దగ్గర రిలీజ్ తీసుకుని బయటపడింది. అప్పటినుండీ బయట ఫ్లాట్లు రెంట్‌కు ఇవ్వడం. చీటీలు వేయడం, పాస్‌పోర్టులు, బంగారం కుదువకు పెట్టుకుని వడ్డీకి డబ్బులు ఇవ్వడంలాంటి పనులు చేసి కోట్లరూపాయలు డబ్బు సంపాదించింది. నెలకు వందకు పది దినార్ల చొప్పున వడ్డీ వసూలు చేస్తుంది. అలా అన్ని మార్గాల్లోనూ డబ్బు సంపాదించి తెలివిగా రెండు మిద్దెలు కట్టేసింది. మొత్తం పాలరాయితో కువైటు వాళ్ళ ఇళ్ళు ఎలా వుంటాయో అదే స్టైల్లో, పెద్ద పెద్ద బాత్‌రూములు, బెడ్‌రూములు పెట్టి లగ్జరీగా కట్టిందట. అందరూ చూసి గొప్పగా చెప్పుకోవడమే. మనం ఇలానే వుంటే లాభం లేదు. త్వరపడి బాబా మామాను అడిగి రిలీజ్ తీసుకుని నాగమణి దగ్గరికి పోదాం. నాలుగేళ్ళు కష్టపడితే చాలు" అంది చంద్రమ్మ.

అప్పటివరకూ నాగమణి గురించి హేళనగా మాట్లాడుతూ ఈర్ష్యపడే చంద్రమ్మ ఒక్కసారిగా నాగమణి దగ్గరికే పోదాం, డబ్బు సంపాదిద్దాం అనడంతో డబ్బు మహిమ అలాంటిది. ఎలాంటివారి హృదయాల్ని అయినా మార్చేస్తుంది అని కుమారి మనసులో అనుకుని నవ్వుకుంది. అనుకున్నట్లుగానే ఆ సాయంత్రంపూట బాబా, మామా తీరికగా హాల్లో కూర్చుని టి.వి చూస్తున్న సమయంలో ఇద్దరూ కలిసి మెల్లగా రిలీజ్ ఇచ్చి సహాయం చెయ్యాలని అడిగారు. మొదట మామా బాబా ఇద్దరూ వాళ్ళను వదులుకోవడానికి ఇష్టపడలేదు. "కావాలంటే ఇంకొంచెం జీతం పెంచుతాం. మీరు వెళ్ళిపోతే మళ్ళీ మీలాంటి మంచి, నమ్మకమైన పనిమనుషులు దొరకడం మాకు కష్టం. వద్దు" అన్నారు. అయినా కుమారి, చంద్రమ్మ పట్టిన పట్టు విడువలేదు. పిల్లలకోసం ఇంకా ఎక్కువ సంపాదించుకోవాలనీ బయట నాలుగు పనులు చేసుకుని ఎక్కువగా సంపాదించుకుంటామనీ ప్రాధేయపడ్డారు.

ఇక చెప్పినా వాళ్ళు వినే పరిస్థితితో లేదని భావించిన మామా బాబా ఆఖరికి ఒప్పుకున్నారు. ఇంకో మూడునెలల గడువు వుంది కాబట్టి, ఈ లోపల క్రొత్తపని వారిని తీసుకొచ్చి వారికి పని బాగా నేర్పించి తరువాత వెళ్ళాలని సూచించారు.

అలాగే అని ఆనందంగా ఒప్పుకున్నారు కుమారి, చంద్రమ్మ.

నాగమణికి ఫోను చేసి విషయం చెప్పగానే చాలా సంతోషించింది ఆమె. "మూడ్నెల్లలో బయటికి రాగానే వారికి మంచి పనులు చూపించి బాగా డబ్బు సంపాదించే మార్గం చూపెడతానని" మాట ఇచ్చి వారిలో నమ్మకం పెంచింది నాగమణి.

నాగమణి అండతో, సహాయంతో స్థిరపడగలం అనే నమ్మకంతో సంతోషంగా కాలం గడుపుతూ అక్కడినుండి బయటపడే రోజు కోసం ఎదురుచూస్తున్నారు ఇద్దరూ.

అలా రెండునెలలు గడిచిపోయాయి. ఎప్పటిలా ఆ రోజు కూడా ఇద్దరూ పనిముగించుకుని తీరికగా నాగమణికి ఫోను చేసారు. ప్రతిరోజూ అలా ఫోను చేసి కాసేపు మాట్లాడటం వీళ్ళిద్దరికీ అలవాటే. నాగమణి ఫోను స్విచ్‌ఆఫ్ చేయబడి ఉంది. సరే.. ఛార్జింగ్ అయిపోయిందేమో లేక ఏదో కారణంగా ఆఫ్ అయిందేమో అనుకుని ఆ సాయంత్రం మరో మూడుసార్లు ప్రయత్నించారు. కానీ ఫోను ఆఫ్‌లోనే ఉంది.

ఏమయిందో ఏమో కనీసం ఆ నాగమణి పనిచేసే షేకుల ఇల్లు తెలిసినా ఒకసారి వెళ్ళి చూసి వచ్చేవాళ్ళం కదా! ఇప్పుడు ఎలా? అనుకుంటూ దిగులుపడ్డారు కుమారి, చంద్రమ్మ.

కువైటులోనే వుండే కుమారి చిన్నాన్న కొడుకు ఆ రోజు ఫోన్ చేసాడు.

"అక్కా నీకీ విషయం తెలుసా? నాగమణిని పోలీసులు పట్టుకున్నారు" అన్నాడు.

"ఏంట్రా నాగమణిని పోలీసులు పట్టుకోవడం ఏమిటి? ఎందుకు?" అని అడిగింది కుమారి ఆదుర్దాగా.

"ఛీఛీ.. అది ఇక్కడ కువైటులో చేసే పనులు తెలిస్తే దాన్ని నిలువునా చంపేస్తారక్కా. అది ఇక్కడ చేయరాని పాడుపనులు చేసి డబ్బు సంపాదిస్తోంది. ఎన్నేళ్ళు తప్పించుకుని తిరుగుతుంది? ఏదో ఒకరోజు పోలీసులకు తెలియకుండా వుండదు కదా! దాని పాపం ఇప్పుడు పండింది. దాని గుట్టు పోలీసులకు తెలిసిపోయి పట్టుకుని జైల్లో పెట్టారు. ఇది చేసిన పనులకు ఇక దాన్ని ఎవరూ విడిపించలేరు" అన్నాడు వాడు ఆవేశంగా.

"అది ఏం చేసిందిరా? కాస్త అర్ధం అయేటట్లు చెప్పు" అంది కుమారి.

"ఏం చేసింది అని చిన్నగా అడుగుతావా అక్కా! అది బయట ఏం చేస్తోందో అంతంత డబ్బు ఎలా సంపాదిస్తుందో తెలియకుండానే నువ్వూ, చంద్రమ్మా కువైటు ఇంట్లో పనిమానేసి దాని దగ్గరికి వెళ్ళాలి అని ఎలా అనుకున్నారు? అది చేసే పాడుపనుల్లోకి మిమ్మల్ని లాగాలని చూసింది. మీరు కూడా వెళ్ళి దానితో చేరి, దాని మాట విని డబ్బు సంపాదించాలి అనుకున్నారు కదా!" అన్నాడు వాడు కోపంగా.

"అయ్యో నాయనా, నా తమ్ముడా! అది ఏం చేస్తోందో మాకేం తెలుసు? షేకుల ఇంట్లో పనికి పెడతాను బాగా డబ్బు సంపాదించవచ్చు అంటే ఆశపడ్డాం అంతే. అది ఏం చేస్తోంది? ఎందుకు పోలీసులు పట్టుకున్నారో తొందరగా చెప్పు" అంది కుమారి.

"అయితే మీకు తెలియదన్నమాట. అంతా తెలిసే ఆ రొంపిలోకి వెళుతున్నారేమో అని తెలిసినవాళ్ళు మీ గురించి కూడా చెడ్డగా అనుకుంటున్నారు. ఏది ఏమయినా మీ అదృష్టం బాగుంది. అది పట్టుబడడంతో మీరు తప్పించుకున్నారు. లేకపోతే మీకు కూడా ఇదే గతిపట్టేది. దానితోపాటు జైల్లో చిప్పకూడు తినాల్సి వచ్చేది. కష్టపడి కువైటు ఇంట్లో పనిచేసుకుని వచ్చిన పదివేల జీతంతో పౌరుషంగా బ్రతకవచ్చు. దానిలాగా చెడిన బ్రతుకు ఎందుకు?

అది సారాయి కాచి సీసాల్లో పోసి అమ్ముతుందంట. అయిదారుమంది అక్కమా లేని (ఐడి) అమ్మాయిలను, కువైటు ఇంట్లో పనిచేయలేక పారిపోయి వచ్చిన అమ్మాయిలను చేరదీసి వారి చేత వ్యభిచారం చేయించి డబ్బు సంపాదిస్తోంది ఆ నాగమణి. ఇంకా డ్రగ్స్ కూడా అమ్ముతోంది అనే అంటున్నారు. అన్ని అక్రమ మార్గాల్లోనూ దిగి, ఈ పరాయి దేశంలో భయం లేకుండా విచ్చలవిడిగా తిరిగితే ఆఖరికి బ్రతుకు ఇలా జైలుపాలవక తప్పదు. ఇప్పుడు అది జైలు బయటికి రావడం జన్మలో జరగదు తిరిగి మన దేశం వెళ్ళడం ప్రాణం వుండగా కుదరదు. ఇక దాని సంగతి అందరూ మరిచిపోవాల్సిందే ఒకవేళ అది ఏదో ఒకటి చేసి బయటపడినా దాని ముఖం చూసేది ఎవరు? మీ టైము బాగుండబట్టి బ్రతికి పోయారు లేకపోతే ఈపాటికి దానితో పాటు కువైటు జైల్లో కటకటాలు లెక్కపెట్టాల్సి వచ్చేది. పొట్టకూటి కోసం పరాయి దేశం వచ్చినప్పుడు మర్యాదగా పనిచేసుకుని బ్రతకాలి కానీ ఇలాంటి పాడు పనులు చేస్తే జైలుపాలవక తప్పదు. అలాగే కువైటులో రూల్స్ ఎంత కఠినంగా ఉంటాయో అందరికీ తెలుసు ఈ చట్టం నుంచీ, ఈ రూల్స్ నుంచీ తప్పించుకోవడం ఎవ్వరికీ కుదరదు" అన్నాడు హేళనగా.

వాడు చెప్పిన విషయాలు వినగానే కుమారి వళ్ళంతా చెమటలు పట్టాయి. వణికిపోయింది. తాము తొందరపడి డబ్బుకు ఆశపడి ఎంత తప్పు నిర్ణయం తీసుకున్నారో అర్థమయింది.

వణికిపోతున్న కుమారిని చూసి ఆ మాటలన్నీ వింటున్న చంద్రమ్మకు పరిస్థితి అర్థమయింది.

"ముందే చెప్పాను కదా! అది ఏదో పాడుపనులు చేసి అంత డబ్బు సంపాదిస్తోంది అని. అమ్మో ఎంత గండం గడిచింది. దానితోపాటు ఉండి వుంటే జైలుపాలయ్యేవాళ్ళం. మన అదృష్టం బాగుంది. మామా, బాబా దగ్గరికి వెళ్ళి మనం బయటికి వెళ్ళమనీ ఇక్కడే, ఈ ఇంట్లోనే వుండి శ్రద్ధగా పనులు చేసుకుని బ్రతుకుతామని చెపుదాం" అంది.

"అవును ఎక్కడికీ వెళ్ళొద్దు. బయట ప్రపంచం కంటే ఇక్కడే ఇంట్లో వుండి కష్టపడి నాలుగువేలు సంపాదించడం ఎంతో మేలు. దేవుడే మనల్ని కాపాడాడు లేకపోతే మనజీవితాలు ఏమయ్యుండేవో యేమో అనుకుంటూ" కుమారి గట్టిగా ఊపిరి పీల్చి వదిలింది.